


హోవార్డ్ జిన్

# అమెరికా ప్రజల చరిత్ర

ప్రజాశక్తి బుక్‌హౌస్

# అమెరికా ప్రజల చరిత్ర

హొవార్డ్‌జిన్

ప్రజాశక్తి బుక్‌హౌస్

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

Abridged Telugu Version of
**'A People's History of United States'**
by Howard Zinn.
Extracts from companion edition,
**'Voices of  A people's  History of Unites States'**
by Howard Zinn,  Anthony Arnov

64375

అనువాదం
**కె. సత్యరంజన్**
**బి. భాస్కర్**

ప్రచురణ సంఖ్య : 1215

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2011

వెల : ₹. 150

ప్రతులకు
**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక


ప్రచురణ కర్తల మాట ........................................................ 5

పీఠిక ....................................................................... 7

1. కొలంబస్, ఇండియన్లు, మానవ ప్రగతి ............................ 13

2. సామ్రాజ్యమూ... ప్రజలు... ............................................... 21

3. యుద్ధమా - దేశ ఆర్థిక ఆరోగ్యమా ! ................................. 37

4. కష్టకాలం - పేదల స్వయం సహాయం ........................... 49

5. ప్రజా యుద్ధం ? ............................................................ 63

6. అజలేని విజయం - వియత్నాం ....................................... 83

7. డెబ్భయ్యవ దశకం - అంతా అదుపులో ఉంది ................. 107

8. కార్టర్ - రీగన్ - బుష్
ఇరుపార్టీల ఏకాభిప్రాయం .......................... 117

9. ఆగామి తిరుగుబాటు .................................................. 147

10. ప్రజల మీద యుద్ధం .................................................... 153

11. క్లింటన్ హయాం - ప్రజాస్వామిక సంక్షోభం ................. 177

**అనుబంధం** ........................................................................ **195**

I. కొలంబస్ - లాస్‌కాసాస్ ............................................ 196

II. బానిసత్వం - ధిక్కారం ................................................ 215

III. మొదటి ప్రపంచ యుద్ధానికి నిరసన ............................ 231

IV. మొదటి ప్రపంచ యుద్ధం - మెకార్థీయిజం .................... 253

V. 70వ దశకం - చెయ్యి జారిపోయిన శకం .................. 267

VI. జూనియర్ బుష్ - ఉగ్రవాదంపై యుద్ధం ....................... 285

# ప్రచురణకర్తల మాట

అధికారిక చరిత్రకారులు పాలకుల చరిత్రను, పాలకవర్గాల చరిత్రను మాత్రమే నమోదుచేస్తారు. ప్రజల దృష్టితో ఆలోచించే చరిత్రకారులు ప్రజల ప్రయోజనాల, మెజారిటీగా శ్రామికవర్గ ప్రయోజనాల ప్రాతిపదికన చరిత్రను విశ్లేషిస్తారు. మనకు తెలిసిన అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర అంతా అక్కడి పాలక వర్గాల చరిత్రే. దానికి పూర్తి భిన్నంగా అమెరికా చరిత్రను రాజకీయ, ఆర్థిక అధికార వ్యవస్థల వెలుపల ఉండే వారు ఎలా భావించారో, అనుభవించారో హొవార్డ్ జిన్ 'పీపుల్స్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్' (అమెరికా ప్రజల చరిత్ర) అనే ఈ గ్రంథంలో వివరించారు. మూలవాసులు, బానిసలు, స్త్రీలు, నల్లజాతివారు, శ్రామికులు– ఇలా విస్తృత ప్రజానీకం కోణం నుండి అమెరికా చరిత్రను వీక్షించి అపూర్వమైన గ్రంథాన్ని ఆయన అందించారు.

1922 డిసెంబరులో ఓ కార్మికవర్గ కుటుంబంలో జన్మించిన హొవార్డ్ జిన్ ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో పాల్గొన్నారు. ఆనాడు యుద్ధ భీభత్సాన్ని స్వయంగా చూసిన వాడు కావడంతోనే ఆయన ఆ తర్వాత యుద్ధ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గాపాల్గొన్నారు. 1956లో అట్లాంటాలోని స్పెల్‌మన్ కాలేజీలో పోలిటిక్స్ ప్రొఫెసర్‌గా చేరిన జిన్ నల్లజాతి పౌరహక్కుల ఉద్యమంతో సహా పలు నిరసనోద్యమాల్లో పాల్గొంటుండే వాడు. ఫలితంగా ఆయనను 1963లో ఉద్యోగం నుండి తొలగించారు. తర్వాత బోస్టన్ యూనివర్సిటీలో చేరి వియత్నాం యుద్ధ వ్యతిరేకోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. విశ్వవిద్యాలయంలో సైతం అక్కడి కార్మికుల తరఫున నిలబడి పోరాడారు. ఇరాక్‌లో అమెరికా జోక్యందారీ యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. 1988లో పదవీవిరమణ చేసిన తర్వాత కూడ పూర్తి క్రియాశీలకంగా ఉన్నారు. పలు గ్రంథాలు, లెక్కలేనన్ని వ్యాసాలు రచించారు. 2010 జనవరిలో కాలిఫోర్నియాలోని శాంటామోనికాకు ఒక ఉపన్యాసం ఇచ్చేందుకు వెళ్లి స్విమ్మింగ్ చేస్తూ గుండెపోటుతో మరణించారు.

1988లో ప్రథమ ముద్రణ పొందిన 'అమెరికా ప్రజల చరిత్ర' 2003 నాటికే పదిలక్షల కాపీలు అమ్ముడుపోయి, ఆ తర్వాత సైతం ఏడాదికి లక్షకాపీల చొప్పున అమ్ముడుపోతూ వచ్చిందంటేనే దానికి ఉన్న ప్రాధాన్యత ఎంతో అర్థం చేసుకోవచ్చు. 2002లో ఆంథొనీ ఆర్నోవ్‌తో కలిసి 'వాయిసెస్ ఆఫ్ ఎ పీపుల్స్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' (అమెరికా ప్రజాగళాలు) అనే సహగ్రంథాన్ని కూడ వెలువరించారు. దీనిలో అప్పటి ప్రజల మనోభావాలను వెల్లడించే వ్యాసాలను, పాటలను, పద్యాలను, ప్రసంగాలను పొందుపరిచారు.

ఇంతటి గుర్తింపు పొందిన (అమెరికా ప్రజల చరిత్ర) గ్రంథాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ సంక్షిప్తంగానే అయినా మొట్టమొదటి సారి తెలుగులో అందిస్తున్నందుకు గర్విస్తున్నది. 'అమెరికా ప్రజాగళాలు' గ్రంథంలో భాగాలను కూడ అనుబంధంగా అందిస్తున్నాము. ఈ రెండు గ్రంథాల సంక్షిప్తీకరణను 'థర్డ్‌వర్ల్డ్ ట్రావెలర్' వెబ్‌సైట్‌నుండి స్వీకరించాము. వారికి మా కృతజ్ఞతలు. పుస్తకానికి పీఠిక కూడ వారు అందించినదే. ఈ పుస్తకం మొదటి ఐదు అధ్యాయాలు బి. భాస్కర్ అనువదించారు. మిగతా పుస్తకాన్ని అనుబంధం, పీఠికతో సహా సత్యరంజన్ అనువదించారు.

**ప్రజాశక్తి బుక్‌హౌస్,**

**అక్టోబర్ 2011**

# పీఠిక

**హా**వార్డ్‌జిన్ రాసిన ఈ పుస్తకం పేరు 'అమెరికా ప్రజల చరిత్ర' అనేదానికన్నా 'అమెరికా శ్రామికవర్గ చరిత్ర' అని ఉంటే ఇంకా సబబుగా ఉండేదేమో. మొదటి మూడు అధ్యాయాల్లో హోవార్డ్‌జిన్ కేవలం విజేతల, పాలకుల, నాయకుల చరిత్రలు మాత్రమే నమోదు చెయ్యడానికి పరిమితం కాలేదు. బానిసల, అణగారిన ప్రజల, ఓటమి పాలయిన వారి చరిత్రను కూడా మన ముందు ఉంచాడు. 1492 నుండి 1760వ దశకం వరకూ అమెరికా చరిత్రగతిని ఈ కోణంలో ఆవిష్కరించిన పుస్తకం ఇప్పటిదాకా మరొకటి లేదు. ఈ చరిత్ర పుస్తకం మనకు అమెరికా ఖండాన్ని కనుగొన్న తీరు, యూరప్ రాజ్యాలు వలసగా మార్చుకుని పరిపాలించిన తీరు, వలస దేశాల్లో సామ్రాజ్యవాద పాలకులపై చెలరేగిన నిరసనలను వివరిస్తుంది. అయితే జిన్ ప్రత్యేకత ఏమిటంటే ఇప్పటిదాకా చరిత్రకారులు విస్మరించిన అనేక సామాజిక సమూహాలు, వారి ఆలోచనలను తొలిగా మనకు విశదపరిచాడు. ఐరోపా దురాక్రమణ మూలంగా సంఖ్యాపరంగా 90శాతం తగ్గిపోయిన అమెరికా మూలవాసుల దుస్థితి, ఐరోపాలో మూలవాసులకు ఏమాత్రం తీసిపోని ఈ జాతి జనుల రీతి, అమెరికా ఖండానికి బానిసల దిగుమతి, ఈ క్రమంలో రవాణాలో గాని ఇక్కడగానీ వాళ్ళ పట్ల ప్రదర్శించిన అమానవీయ ధోరణి, వలస ప్రజానీకం అసంతృప్తులు, బూర్జువా పాలకుల నిర్లక్ష్య ధోరణి, అన్నింటికన్నా ముఖ్యంగా అమెరికాలో తలెత్తిన వర్ణ, వర్గ పోరాటాల చరిత్రను మనకు అందించడం ద్వారా ప్రత్యేకతను నిలుపుకున్నాడు. ఒకవిధంగా చెప్పాలంటే ఇవాళ అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలకు మూలాలను మనకు విశదపరిచాడు అని చెప్పుకోవాలి. ఇప్పటివరకు నడిచిన చరిత్రలో ప్రతి ప్రజా సమూహానికి సముచిత స్థానం కల్పించిన మూలంగా ఈ పుస్తకం నవనవోన్మేషంగా ఉంటుంది. కొలంబస్ మొదటిసారిగా హైతీ దీవుల మీద కాలూనే సమయానికి అతని ఓడలో ఉన్నది 39 మంది, కానీ ఆ దీవుల్లో నివసిస్తున్న మూలవాసుల జనాభా, రెండున్నర లక్షలు. అంటే శ్వేత జాతీయులు 1/200 శాతం కూడా లేరు. కాని మన చరిత్ర పుస్తకాల్లో శ్వేతజాతీయుల గురించి పుంఖానుపుంఖాల సమాచారం దొరుకుతుంది. అదే మూలవాసుల విషయానికి వచ్చేసరికి రెండు మూడు వాక్యాలకు మించి ప్రస్తావన ఉండదు. జిన్ కేవలం జనాభా లెక్కలు చెప్పడమే కాదు, ఇప్పటిదాకా నోరులేని వాళ్ళకు గొంతుకనిచ్చాడు. తనదైన శైలిలో చరిత్ర పరిణామక్రమాన్ని విశ్లేషించాడు, వ్యాఖ్యానించాడు. తద్వారా ఉత్తర

అమెరికా ఖండంలో గడిచిన తొలి రెండున్నర శతాబ్దాల చరిత్ర నికార్సుగా, తేటతెల్లంగా ప్రజల ముందు ఉంచాడు.

చరిత్ర పుస్తకంలో ప్రధాన విషయం చరిత్రయే. ఈ పుస్తకం మొదటి మూడు అధ్యాయాల్లో – 1492 అక్టోబరు 12న క్రిస్టోఫర్, కొలంబస్, నైనా, పింటా శాంతామారియాలు బహమాస్ దీవులలో కాలుమోపిన క్షణం నుండి మొదలయిన 250 సంవత్సరాల అమెరికా చరిత్రలో ప్రధాన ఘట్టాలను వివరించాడు.

అమెరికన్ మూలవాసులకు ఐరోపావాసులకు మధ్య సంబంధాలు ఏర్పడడానికి అది నాంది. ఆర్వాక్ తెగకు చెందిన మూలవాసులు శ్వేతజాతీయులకు సాదరంగా స్వాగతం పలికారు. కాని శ్వేతజాతీయుల దృష్టంతా బంగారం మీదే ఉంది. బహమాస్ నుండి కొలంబస్ క్యూబాకు అక్కడ నుండి నేటి హైతీగా పిలవబడుతున్న నాటి హిస్పానోలాకు అక్కడ నుండి డొమనికాకు ప్రయాణం కట్టాడు. 115 సంవత్సరాల తరువాత ఉత్తరాదికి 1500 మైళ్ళ దూరంలో జాన్‌స్మిత్ నేతృత్వంలో కొంతమంది ఇంగ్లీష్ ప్రవాసీయులు జేమ్స్‌టౌన్ అనే కాలనీ స్థాపించుకున్నారు. ఆ తరువాత కొద్ది కాలానికే 'ప్యూరిటాన్స్' అనే గ్రూపు మాస్సాచ్యూసెట్స్ గల సంధి దగ్గర ఇంకో కాలనీ స్థాపించారు. అయితే దాపునే ఉన్న పెక్వట్ తెగ ఇండియన్లతో సరయిన సంబంధాలు లేకపోవడం, పేచీలు మొదలవడంతో కాలనీవాసులకు వాళ్ళకు మధ్యన యుద్ధం జరిగింది. దీన్నే పెక్వట్ యుద్ధంగా పిలుస్తారు. ఈ యుద్ధంలో కాలనీవాసులే గెలిచారని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కాలనీవాసుల వైపు ప్రాణ నష్టం కొన్ని డజన్లమందికే పరిమితం అయితే పెక్వట్ తెగ ఇండియన్లు వేలాదిగా హతమైపోయారు. ఈ యుద్ధంలో ఇండియన్ తెగ మూల వాసులతో నెలకొన్న ఘర్షణ వైఖరి, కరువులు, ఆకలిచావులు, రోగాలు – ఇవన్నీ ఇబ్బందులే అయినా ఇంగ్లీష్ వాళ్ళు అమెరికా రావడం మానలేదు. 1619 నాటికి వాళ్ళు ఎంతలా స్థిరపడ్డారంటే ఆఫ్రికన్ బానిసలను వందలాదిగా తోలుకురావడం మొదలు పెట్టారు. ఆఫ్రికన్ల కన్నా ముందర ఇండియన్ తెగమూలవాసులను బానిసలుగా చేసుకుందామని ప్రయత్నించారు, ఆ ప్రయత్నాలు బెడిసి కొట్టాయి.

"కొలంబస్ చేసినట్లుగా ఇంగ్లీషు వాళ్ళు ఇండియన్ తెగ ప్రజానీకాన్ని తమ కోసం పనిచేసేలా నిర్బంధం చెయ్యలేకపోయారు. వాళ్ళు సంఖ్యలో చాలా ఎక్కువ మంది ఉండడంతో ఒక పట్టాన వశం అయ్యేవారు కాదు. మందుగుండు, తుపాకుల ఆధిపత్యంతో మహా అయితే వాళ్ళని ఊచకోత కొయ్యడం సాధ్యమయ్యేది గాని బానిసలుగా చేసుకోలేకపోయారు ఇంగ్లీషువాళ్ళు. అట్లాంటి ఊచకోతలకు ప్రతిగా ప్రతీకారదాడుల్లో ఇంగ్లీషువాళ్ళు పెద్ద సంఖ్యలో హతమైపోయేవాళ్ళు. మూలవాసులు బలశాలులు, అడవుల్లో బతకడం వాళ్ళకు కొట్టిన పిండి. ఇంగ్లీషువాళ్ళలా ఎక్కడనుండో వచ్చి తిష్టవేసిన వాళ్లు కాదు. అడవుల్లో పుట్టి అడవుల్లో పెరిగిన ఈ అడవిబిడ్డల ధిక్కారం ఇంతా అంతా కాదు.

తెల్లజాతి సేవకులు చాలినంతమంది లేకపోతిరి. ఇక్కడకు వచ్చి స్థిరపడిన వాళ్ళలో ఎక్కువమంది చేతివృత్తి నిపుణులు. లేదూ ఇంగ్లాండ్‌లో పనిపాటా లేక ఆరాంగా గడిపేవాళ్ళు ఆ పనేదో ఇక్కడ చెయ్యడానికి వచ్చిన వాళ్ళు అంతే తప్ప జాన్‌స్మిత్ జమానాలో వళ్ళొంచి పని చెయ్యాలనే ధ్యాస లేదు వాళ్ళకి. దాంతో జాన్‌స్మిత్ ఒకరకంగా ఇప్పటి మన 'మార్షల్‌లా' (సైనిక పాలన) లాంటిది విధించాడు. జనాన్ని గుంపులు గుంపులుగా విభజించి తలా ఒక పని బెత్తాయించి బలవంతానా చేయించాడు.

ఇంతకన్నా ఇలాంటి గొడ్డుచాకిరి చెయ్యడానికి నల్లబానిసలు ఒక్కటే సరైన పరిష్కారంగా భావించారు. దిగుమతి చేసుకున్న ప్రతి నల్లజాతీయుడిని బానిసకింద జమకట్టారు. నిజానికి ఆనాటికి బానిసత్వాన్ని చట్టబద్ధంగా చేసిన దాఖలాలు లేవు. కాని యజమానులు చట్టాలతో పని లేకుండా బానిసత్వాన్ని ఒక విధానంగా మలిచేసి, దాన్ని సంస్థాగతం చేసి అనేక చట్టాలు చేశారు. అమెరికా ఖండంలోని దక్షిణాది ప్రాంతాలు, మధ్య అమెరికాలోని కాలనీలు ఆర్థికంగా బలపడటానికి నల్లబానిసత్వాన్ని పునాదిగా మలుచుకున్నాయి. అయితే ఈ బానిసత్వానికి వ్యతిరేకత నల్లజాతీయుల నుండి కాక ఓం ప్రథమంగా శ్రామికవర్గం నుండి అదీ సరిహద్దులలోని శ్వేతజాతి శ్రామిక వర్గం నుండి ఎదురయింది.

ఇండియన్లతో వర్జీనియా గవర్నరు విలియం బర్కిలీ అనుసరిస్తున్న చర్చల ప్రక్రియకు వ్యతిరేకంగా నథానియేల్ బేకన్ తిరుగుబాటు లేవదీశాడు. దక్షిణాది సరిహద్దున నివసించే జనంమీద  ఇండియన్ తెగ మూలవాసులు చేసే దాడుల నుండి ప్రభుత్వం మరింత రక్షణ కల్పించాల్సింది పోయి వాళ్ళతో చర్చలు ఏమిటనేది బెకన్ తదితరుల గుర్రు. అయితే బర్కిలీ గానీ అతని అధికార యంత్రాంగం గానీ ఈ తిరుగుబాటును లెక్క చెయ్యలేదు. ఆర్థిక రాజకీయ ప్రయోజనాల రీత్యా తాము ఎంచుకున్న మార్గాన్నే అనుసరించారు. చివరకు బేకన్ అంతుపట్టని అంటువ్యాధి సోకి మరణించాడు. అతని సహచరులను ఉరి తీయించి చంపించింది ప్రభుత్వం. బహుశా ప్రభుత్వం అట్టడుగు ప్రజానీకం కష్టాలు వినడానికి ప్రయత్నించిన మొదటి సందర్భం ఇది. అయితే వర్గ తారతమ్యాలు అప్పటికే పెచ్చరిల్లసాగాయి. పేదల సంఖ్య నానాటికీ పెరిగిపోతా వుంది.  చేసిన అప్పులు వసూలు చేసుకోవడానికి ప్రజలను పని బందిఖానాల్లో నిర్బంధించి పొద్దుగూకులూ పని చేయించడం మొదలయింది. అడపా దడపా సంపన్నుల మీద పడి లూటీ చేయడం, దోచుకోవడం సాధారణ విషయంగా మారిపోయింది. నిజానికి వర్గ ద్వేషంతో మొదలయిన ఈ దాడులు క్రమేపీ జాతుల మధ్య దాడులుగా మారాయి.

బ్రిటిష్ వాళ్ళు ఎట్లాంటి విధానాలు అవలంబించారంటే వలసల్లో నివసించే ప్రజానీకం బూర్జువాలను వ్యతిరేకించడానికి బదులు తమ మాతృభూమినే వ్యతిరేకించే వైపుకు మొగ్గారు. ఉద్రిక్తతలు పెరిగిపెరిగి అమెరికన్లు బ్రిటిష్‌వాళ్ళకు వ్యతిరేకంగా కార్మికులు ధనస్వాములకు వ్యతిరేకంగా మోహరించి సామాజిక విప్లవానికి పరిస్థితులు పరిపక్వం అయిన దశవరకూ అమెరికా చరిత్రను మూడవ అధ్యాయంలో మనకు వివరిస్తాడు.

ఇప్పటిదాకా చరిత్రకారులు యూరోపియన్ల ఆధిపత్యాన్ని దృష్టిలో పెట్టుకుని అమెరికా చరిత్రను రచించారు. అయితే జిన్ మాత్రం సాధారణ ప్రజానీకాన్ని కష్టజీవులను – మార్క్స్

ఎంగెల్స్‌ల పరిభాషలో చెప్పాలంటే కార్మికవర్గాన్ని – దృష్టిలో పెట్టుకుని గడిచిన వాస్తవ చరిత్రను మన ముందు ఉంచాడు. అందుకే ఈ పుస్తకానికి అమెరికా కార్మికవర్గ చరిత్ర అని పేరు పెట్టి ఉంటే సబబుగా ఉండేదని మొదట్లో ప్రస్తావించింది.

కొలంబస్ గానీ అతన్ని మార్గదర్శకంగా తీసుకుని తదనంతరకాలంలో వచ్చిన వారసులు కానీ శూన్యంలోకి అడుగుపెట్టలేదు. యూరప్‌లో ఎంత జనాభా సాంద్రత ఉన్నదో అంత జనాభా ఉన్న ప్రపంచంలోకే అడుగు పెట్టారు. ఇక్కడి జనాభా సంస్కృతి సంక్లిష్టమైనది. ఆనాటి యూరప్ సమాజం కన్నా మెరుగైన మానవ సంబంధాలతో సమసమాజ భావనతో మెలిగిన సమాజం ఇది.

ఇక్కడి జనాభాది లిపిలేని భాష – అయినా అప్పటి చట్టాలు, కవిత్వం, తమ స్వంత చరిత్ర – వీటన్నిటి జ్ఞాపకంగా పొదవుకుని ఒక తరం నుండి ఇంకో తరానికి అందించుకుంటూ వచ్చారు. అదీ ముఖతః చరిత్రగా, ప్రకృతితో, తన చుట్టూ వున్న సమాజంతో ఆపేక్షగా మెలుగుతూ, వాటి సామర్థ్యాన్ని ఆస్వాదిస్తూ – స్వేచ్ఛగా, స్వచ్ఛంగా క్రమానుగతంగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకుంటూ వచ్చిన జాతి ఇది.

అమెరికాలో ఇవాళ పిల్లలు చదువుతున్న చరిత్ర పుస్తకాల్లో కొలంబస్ గురించిన ధీరోదాత్త వర్ణన ఒకటే కనబడుతుంది. కొలంబస్ సాహసోపేత సముద్రయానం గురించి అమెరికాను కనుగొన్న తీరు గురించి లబ్జుగా వివరించారు కానీ ఈ క్రమంలో ఏరులై పారిన రక్తపాతం గురించి ఒక్క వాక్యం మనకు కనబడదు. పై పెచ్చు అమెరికా అవతరణ దినోత్సవంలా కొలంబస్ దినోత్సవం జరుపుకుంటాం మేం ప్రతి ఏటా అతను అమెరికాను కనుగొన్న దానికి గుర్తుగా. కాని బార్టిలోమె లాస్ కాసాస్ నమోదు చేసిన ఆనాటి చరిత్రను జిన్ వెలికి తేవడం మూలంగా అప్పట్లో జరిగిన రక్తపాతం, దురాక్రమణ, బానిసత్వం – ఇవన్నీ ఇప్పటికైనా మన దృష్టికి వచ్చాయి.

కొలంబస్ సాగించిన నరహంతక హింసోన్మాదం, రక్తపాతం, మూలవాసుల జాతి యావత్తును తుడిచిపెట్టే స్థాయిలో సాగిన మానవ మారణహోమం గురించి శామ్యూల్ ఇలియట్ మారిసన్ లాంటి చరిత్రకారులు కూడా కనీస మాత్రపు ప్రస్తావనకే పరిమితం కావడాన్ని జిన్ తీవ్రంగా విమర్శించాడు. ఇంతకన్నా హీనమైన పాపం ఇంకొకటి ఉండదు అని ఘాటుగానే చెప్పాడు. "నిలువునా అబద్ధాలు రాయడం, ప్రయత్నపూర్వకంగా వాస్తవాలను విస్మరించడం – చరిత్రకారుడు చెయ్యాల్సిన సత్యాన్వేషణకు ద్రోహం చెయ్యడంతో సమానం. ఇలాంటప్పుడే పాఠకులు రచయితలను ఈసడించుకుంటారు." అంటాడు జిన్. 'సత్యాన్ని తెలియచేస్తూనే అది ఇతరత్రా సమాచారంలో కప్పబడిపోయేలా చెయ్యటమంటే (ఎలాగంటే, నిజమే సామూహిక మారణకాండ జరిగింది. కానీ అది పరిగణనలోకి తీసుకోవాల్సినంత విషయం కాదు. ఇవాళ ప్రపంచంలో మనం చేస్తున్న దానితో పోలిస్తే ఇది లెక్కలోనిది కాదు అనే ధోరణి ప్రదర్శించడం) – అదికూడా చరిత్రకు ద్రోహం చెయ్యడమే. "ఎంపిక, సంక్షిప్తీకరణ, స్పష్టత, నొక్కి వక్కాణించడం – ఇవన్నీ ప్రతి చరిత్రకారుడూ అనుసరించాల్సిన అంశాలే కానీ శామ్యూల్ ఇలియట్ మారిసన్

తన రచనల్లో ఈ ధోరణులను భిన్నమైన పద్ధతుల్లో పాటించాడు. అందుకే నేను అమెరికాను ఆర్వాక్ తెగ ప్రజానీకం దృష్టితో మీకు పరిచయం చేస్తున్నా. అమెరికన్ రాజ్యాంగాన్ని బానిసల దృష్టి నుండి పరిచయం చేస్తాను, పౌర అంతర్యుద్ధాన్ని న్యూయార్క్ వాసులయిన ఐరిష్ ప్రజానీకం దృష్టితోను, మొదటి ప్రపంచయుద్ధాన్ని సోషలిస్టుల దృక్కోణం నుండి, రెండో ప్రపంచయుద్ధాన్ని "న్యూడీల్'ను హార్లెమ్ మురికివాడలలో నివసించే నల్లజాతీయుల దృష్టితోను, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలపు అమెరికన్ సామ్రాజ్యాన్ని లాటిన్ అమెరికా సేవకుల దృష్టితోను మీకు పరిచయం చేస్తాను. ఇలా మనం ఇతరుల దృక్కోణం నుండి మన చరిత్రను తెలుసుకుందాం" అంటాడు జిన్.

శ్వేత జాతీయులు నల్లజాతీయుల మధ్య సంబంధాలను గురించి చర్చించేటపుడు జిన్ అణిచివేతకు లోనవుతున్న వారితో మమేకం అయ్యాడు. శ్వేతజాతీయులు – నల్లజాతీయులు మధ్యన ఒకరంటే ఒకరికి ద్వేషభావం స్వాభావికంగా ఉందని మనల్ని నమ్మించడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ అది వాస్తవం కాదు, ఇదంతా పాలకుల కుట్ర అని వివరిస్తూనే నిజంగానే సమాజ హితం కోరేవారయితే ఈ రెండు జాతుల ప్రజానీకం సోదర భావం – సమాదర భావంతో సహజీవనం చేసేందుకు తగిన చట్టాలను రూపొందించమనండి ఈ పాలకులను అని సవాలు చేస్తాడు. కార్మికులు, సేవకులు, కష్టజీవులు – వాళ్లందరిలో వర్గభావాలదే పై చెయ్యిగా ఉంటుంది. అనేక వర్ణ భావాల ప్రభావం ఉంటుంది అంటాడు.

బానిసత్వ విధానాలకు సంబంధించి పాలకవర్గాల తీరును తూర్పారబట్టాడు. 'నైతికంగా పతనమై కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమై, రేపటి భవిష్యత్తు మీద ఆశావహ దృక్పథానికి అవకాశం లేకుండా పోయి ఈ దేశం జీవితకాలం ఇలానే బతికేస్తుందా' అని ప్రశ్నిస్తాడు. ఆఫ్రికన్ తెగ ప్రజానీకంలో బానిసత్వం వింత ఏమీ కాదు. అది వాళ్ళ సంస్కృతిలోనే ఉందని ఇప్పటికీ కొందరు వాదిస్తుంటారు. కాని జిన్ ఈ వాదనను తిరస్కరించాడు. 'యూరప్‌లో అర్ధ బానిసల మాదిరే ఆఫ్రికాలో బానిసలను తయారు చేశారు పాలకులు అంటాడు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం గడిచిన 80 ఏళ్ళలో కార్మికులకు కష్టజీవులకు అట్టడుగు తరగతుల ప్రజానీకానికి ఎంత అన్యాయం జరిగిందో మనకు తేలికగా అర్ధమయ్యేలా – వర్తమాన చరిత్రను వివరించాడు. 'పేద – గొప్ప వాళ్ళ మధ్య అంతరాలు ఇంగ్లాండ్‌కు వలసరాజ్యంగా ఉన్న కాలంలోనే పెరిగిపోయాయి. ఆనాటికే సమాజంలో వర్గవిభజన బలపడింది' అంటాడు జిన్.

ఇప్పటిదాకా ప్రాతినిధ్యం లేకుండా పోయిన ప్రజానీకం పక్షాన నిలబడి చరిత్రను నమోదు చేసిన జిన్ శ్రామికవర్గానికి గొప్పసేవ చేశాడు. మూలవాసుల మీద కొలంబస్ సాగించిన ఆకృత్యాలు, అమానవీయ హత్యాకాండను విస్మరించి చరిత్రపుస్తకాలు అతన్ని ఒక హీరోను చేసి ప్రజల ముందు నిలబెట్టాయి. ఎంతమంది జీవితాలను నాశనం చేస్తే ఎంతమందిని చంపితే, నాగరికతను ధ్వంసం చేస్తే ఆ మనిషికి అంత విలువ కట్టే లెక్కయితే కొలంబస్‌కు హిట్లర్‌కు తేడా ఏముంది. ఈ పోలిక చాలా అతిగా అనిపించవచ్చు కొందరికి. అయితే

వేలాదిమంది అమాయక పౌరులను ఊచకోత కోసి మిగిలిన వారిలో భయోత్పాతం సృష్టించి అణిచిపెట్టి ఉంచడానికి బాధ్యులయిన వారిని సరిపోల్చడానికి మానవ చరిత్రలో హిట్లర్‌ను మించిన ఉదాహరణ ఇంకొకరు ఉండరు. కొలంబస్ చేసిన పని కూడా అదే. తేడా ఏంటంటే హిట్లర్ ఆర్యజాతి సిద్ధాంతాన్ని ఆసరా చేసుకుంటే కొలంబస్ మానవ ప్రగతి కోసం సాగించిన అన్వేషణను ఆలంబనగా చేసుకున్నాడు అంతే తేడా. అందుకే హోవర్డ్‌జిన్ ఈ పుస్తకంలో మానవజాతి ప్రగతి సాధనలో సమిధలయిన వందల వేల అమాయక ప్రజానీకానికి సముచిత గౌరవం కల్పించాడు.

వలస పాలనా సంబంధాలను విశ్లేషించడంలోగాని, బూర్జువా పాలకులు స్వీయ లబ్ధికోసం నల్లజాతి బానిసలను, శ్వేతజాతి కార్మికవర్గాన్ని ఒకే రీతిగా తమ రాజకీయ చదరంగంలో ఎలా పావులు చేసుకున్నదీ వివరించడంలోగానీ, జాతుల మధ్య ఘర్షణలు తీవ్రతరమై సామాజిక విప్లవానికి దారి తీసిన నేపథ్యంలో బూర్జువా శక్తులకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజాగ్రహాన్ని ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా మళ్ళించడం, ఇందుకుగాను అమెరికాలోని కులీన శక్తులు ప్రజానీకాన్ని తమ వైపు తిప్పుకోవడానికి ప్రకటించిన రాయితీలు, ఇవ్వచూపిన తాయిలాలు, దేశభక్తి పేరిట తమతోపాటు నడిపించిన తీరును విశదపరచడంలోగానీ జిన్ అద్భుతమైన వాస్తవ చిత్రణకు పట్టంకట్టాడు. కష్టజీవులు ఎదుర్కొంటున్న దోపిడికి గాని, భరాయిస్తున్న బానిసత్వానికిగాని ఎలాంటి పరిష్కారం చూపేది కాకపోయినా స్వేచ్ఛ, సమానత్వం అనే నినాదాల మాటున యావత్ కార్మికవర్గాన్ని ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరులో దింపింది బూర్జువా వర్గం. ఆ రకంగా గుడ్డి విధేయత ప్రకటించి కార్మికవర్గం మోసపోయింది. అన్న జిన్ వ్యాఖ్యలు అక్షర సత్యాలు. ఇంగ్లాండ్ నుండి విడగొట్టుకోవడం ద్వారా మాత్రమే సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా తాము బలపడగలం అన్న బూర్జువాల ఆలోచనలను ఆకాంక్షలను సాకారం చెయ్యడానికే జాతి నిర్మాతలు మొగ్గు చూపారు తప్ప సామాన్య ప్రజల ఆకాంక్షలను ఈడేర్చలేకపోయారనే చేదు వాస్తవాన్ని ఏమాత్రం మాటలు తడుముకోకుండా జిన్ స్పష్టపరిచాడు. జిన్‌తో ఏకీభవించని సామాన్యుడు ఉండడం కద్దు.

ఏతావాతా ఈ పుస్తకం చదవగానే మనకు అర్థం అయ్యేది ఏమిటంటే – గత 250 ఏళ్ళ అమెరికా చరిత్రలో తరతమ స్థాయిల్లో వర్గదోపిడీ – వర్గ సంఘర్షణలు ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. సంప్రదాయ చరిత్రకారుల పుస్తకాల్లో మీకు ఎక్కడా రేఖా మాత్రంగానయినా ఈ వాస్తవాల ప్రస్థావన ఉండదు. 'అమెరికా ప్రజల చరిత్ర' ద్వారా జిన్ ఈ లోటును భర్తీ చేశాడు. పాఠకులకు ప్రభావవంతమైన అమెరికా చరిత్రను పరిచయం చేశాడు. పరాజితుల, పీడితుల బాధలను గాథలను విస్మరించడమంటే చరిత్రలో ఒక భాగాన్ని మనం విస్మరించడమే. కానీ ఇప్పుడు మీ చేతుల్లో సంపూర్ణ అమెరికా ప్రజల చరిత్ర ఉంది. చదవండి.

# 1

# కొలంబస్, ఇండియన్లు, మానవ ప్రగతి

సముద్రాన దూరంగా పెద్ద పడవ కనబడగానే ఆర్వాక్ స్త్రీ – పురుషులంతా తమ గ్రామాల నుండి అక్కడికి పరుగెత్తుకెళ్ళారు. దక్షిణ అమెరికాకు చెందిన వీరంతా గోధుమరంగు శరీరంతో నగ్నంగా ఉన్నారు. ఈ అపరిచిత పెద్ద పడవను దగ్గర్నుండి చూద్దామన్న కుతూహలంతో నీటిలో ఈదుకుంటూ దాని దగ్గరికి చేరసాగారు. కొలంబస్ ఆయన సహచరులు చేత కత్తులు ధరించి ఓడ దిగి రాగా వారికి ఆర్వాక్ తెగ ప్రజలు స్వాగతం చెప్పారు. అపరిచితులకు స్థానికులు ఆహారం, మంచినీరు, బహుమతులు అందించారు. కొలంబస్ ఆ తర్వాత ఇలా రాసుకున్నాడు. "వాళ్లు చిలకలు, పత్తితో చేసిన బంతులు, బల్లేలు ఇంకా అనేక వస్తువుల్ని మాకోసం తెచ్చారు. పూసలు, గంటలు వంటివి మా దగ్గర నుండి మారకంగా తీసుకున్నారు. తమ దగ్గర ఉన్న ప్రతిదాన్నీ ఇష్టపూర్వకంగా మారకం చేసుకునేందుకు వాళ్లు సంసిద్ధులయ్యారు. స్థానికులు దృఢమైన దేహధారుఢ్యంతో బలిష్టంగా, చక్కని రూపంలో ఉన్నారు. వాళ్ల చెంత ఎలాంటి ఆయుధాలూ లేవు. అవెలా ఉంటాయో కూడా తెలియదు. నేను పట్టాకత్తిని చూపించగా అంచువైపు నుండి దాన్ని తీసుకొని తమకు తాము గాయపర్చుకున్నారు. ఈ ప్రాంతాన ఇనుము వాడకం తెలియదు. బల్లేల్ని వాళ్లు వెదురుతో చేస్తారు. మేం 50 మందిమి కలిసి స్థానికులందర్నీ లోబరుచుకోగలం. మాకు సేవకులుగా మలచుకోగలం."

బహామా దీవులకు చెందిన ఈ అర్వాక్‌లు ప్రధాన భూభాగాన నివశిస్తున్న ఇండియన్ల వలెనే ఉన్నారు. ఆతిథ్యం ఇవ్వటం, ఉన్నవాటిని కలసి పంచుకోవటం వంటి ఉన్నతమైన విలువల్ని వారు పాటిస్తారు. సాంస్కృతిక పునరుజ్జీవనానంతరం ఐరోపాలో ఇటువంటి లక్షణాల్ని మనం చూడజాలము. పోపులు, రాజులు అక్కడ రాజ్యమేలుతున్నారు.

పాశ్చాత్య నాగరికత ఆనాడు ధనం ముంగిట దాసోహమంటున్నది. ఈ సంస్కృతికి ప్రతినిధియైన క్రిస్టోఫర్ కొలంబస్ ఇప్పుడు అమెరికా వైపునకు తొలి దూతగా అరుదెంచాడు.

**కొలంబస్ ఇలా రాశాడు :**

"నేను కనిపెట్టిన తొలి ద్వీపం విండీస్‌కు చేరుకున్న వెన్వెంటనే కొందరు స్థానికులను బందీల్ని గావించాను. ఈ ప్రాంతాల్లో ఏమిటి - ఎక్కడున్నామో వారి నుండి సమాచారాన్ని రాబట్టుకోవాలనేది నా ఉద్దేశం."

కొలంబస్‌కు ప్రధానంగా కావలసిన సమాచారమేమిటి: బంగారం ఎక్కడ లభిస్తున్నదని?

... ... ...

"ఇండియన్లు ఎంతో అమాయకులు. భోళా మనుషులు. వారిని మనమేమన్నా అడిగితే లేదని అస్సలు చెప్పరు. తమ వద్ద ఉన్నవాటిని ఇతరులతో పంచుకునే మనస్తత్వం వాళ్ళది. ఇలాంటి వారు ఉంటారని ఇండియన్లను చూస్తేగాని మనం నమ్మలేము; అంటూ కొలంబస్ పేర్కొన్నాడు. తన నివేదికను పాలకులకు పంపుతూ కొంత సహాయాన్ని కొలంబస్ కోరాడు. అందుకు ప్రతిఫలంగా తన తదుపరి యాత్రలో ప్రభువులకు "కావలసినంత బంగారమూ, బానిసల్ని పట్టుకొస్తానని" వాగ్దానం చేశాడు. మనందరికీ ప్రభువైన భగవంతుడు తన అనుచరులకు విజయాన్ని చేకూరుస్తాడు. అసాధ్యాల్ని మనకు సుసాధ్యం గావిస్తాడంటూ కొలంబస్ మతపరమైన ప్రవచనాలు పలికాడు.

అతిశయోక్తులతో కూడిన నివేదిక - వాగ్దానాల ఫలితంగా కొలంబస్ రెండో సాహసయాత్రకు 17 ఓడలు, 1200 మందికి పైగా సాయుధుల్ని పాలకులు సమకూర్చారు. ఈ యాత్ర లక్ష్యం స్పష్టమే. బానిసలు, బంగారాన్ని కొల్లగొట్టుకోవటం. యాత్రీకులు కెరీబియన్ దీవుల్ని ఒకదాని తర్వాత మరొకదాన్ని గాలించారు. స్థానిక ఇండియన్లను బందీలుగా పట్టుకున్నారు. ఐరోపావాసుల అకృత్యాల సమాచారం ఆ ప్రాంతమంతా గుప్పుమంది. దీంతో గ్రామాలన్నీ ఖాళీలయ్యాయి. హైతీలో నావికులు దీవంతటినీ బంగారం కోసం గాలించారు. తమ కోర్కెలు తీర్చుకునేందుకు స్త్రీలను, పనులు చేయించుకునేందుకు పిల్లల్ని బానిసలుగా పెట్టుకున్నారు. నావిదాద్ కోట వద్ద నావికులు ఇండియన్లతో తలపడ్డారు. పలువురు యాత్రీకుల్ని ఇక్కడ స్థానికులు హతమార్చారు.

హైతీలో కొలంబస్ ఒక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. తన మనుషుల్ని పల్లెలకు పంపించాడు. వారికి ఎక్కడా బంగారం అగుపించలేదు. దీంతో కనీసం బానిసల్నన్నా స్పెయిన్ తీసుకెళ్లాలని వీరు నిర్ణయించుకున్నారు. 1495వ సంవత్సరాన పెద్ద ఎత్తున దాడుల్ని నిర్వహించి

1500 అరావాక్ స్త్రీ, పురుషులు, పిల్లల్ని బంధించారు.  వీరికి స్పానియార్డులను, కుక్కల్ని కాపలాగా పెట్టారు. ఇందులో నుండి బలిష్టంగా, మంచిగా ఉన్న 500 మందిని వేరుచేసి పడవల్లో స్వదేశానికి తీసుకెళ్లారు. బందీల్లోని 200 మంది సముద్ర మార్గం మధ్యలోనే మృతిచెందారు.  సజీవంగా మిగిలిన ప్రాణుల్ని పట్టణ మతాధికారి అమ్మకానికి పెట్టాడు. “బానిసలు అప్పుడే పుట్టిన వారిలాగా నగ్నంగా ఉన్నారు. పశువులతో పోలిస్తే అంతగా కలవరం చెందినట్లుగా కనిపించటం లేద'ని మతాధికారి వ్యాఖ్యానించారు. “పవిత్ర త్రిమూర్తుల పేరిట అమ్మకానికి పనికొచ్చే బానిసల్ని సేకరించి పంపుదాం”, అంటూ కొలంబస్ రాసుకున్నాడు.

అయితే బందీలుగా పట్టుబడిన వారిలో చాలా మంది బానిసలు చనిపోయారు. తన కోసం పెట్టుబడి పెట్టిన మారాజులకు ఓడల నిండా బంగారాన్ని తీసుకొస్తానని కొలంబస్ మాట ఇచ్చి ఉన్నాడు. ఇప్పుడేం చేయాలి. హైతికి చెందిన సికావొ ప్రాంతాన భారీ ఎత్తున స్వర్ణ క్షేత్రాలుంటాయని కొలంబస్ – అతని సహచరులు ఆశించారు. 14ఏళ్ళు పైబడిన స్థానికులందరికీ మూడునెలల కాలానికింత బంగారాన్ని సేకరించి తీరాలని వీరు ఆదేశించారు. దీన్ని సాధించిన వారి మెడలకు రాగిటోకెన్లు వేలాడదీసారు. ఇటువంటి రాగి హారం ఎవరిమెడలో దర్శనమివ్వదో వారి చేతుల్ని నరికివేసారు. విపరీతంగా రక్తస్రావమై బాధితులు చనిపోయేవారన్నమాట.

ఆ ప్రాంతాన ఎంతగాలించినా ఇసుకరేణువుల మధ్య చిన్న చిన్న బంగారు తునకలు మాత్రమే లభించేవి. ఇండియన్లకు కొలంబస్ ఎంతో అసాధ్యమైన పనిని అప్పజెప్పాడన్నమాట. కొలంబస్ అకృత్యాల నుండి తప్పించుకునేందుకు ఇండియన్లు అక్కడినుండి పరారయ్యే ప్రయత్నం చేశారు. అలా పారిపోతున్న వారిని యూరోపియన్లు కుక్కలతో వేటాడి వేటాడి చంపేవారు.

దీంతో ఇక గత్యంతరం లేక ఆర్వాక్‌లు స్పానియార్డులతో తలపడ్డారు. ఐరోపావాసుల వద్ద తుపాకులు, ఖడ్గాలు, గుర్రాలు ఉండగా స్థానికుల దగ్గర వెదురుతో చేసిన ఆయుధాల వంటివే ఉన్నాయి. దీంతో రెండు వర్గాల మధ్య పోరాటం ఏకపక్షం గానే సాగింది. ఓడిపోయి ఖైదీలుగా పట్టుబడిన ఇండియన్లను స్పానియార్డులు ఉరి తీశారు. లేదా సజీవం గానే ఖననం చేశారు. దీంతో యూరోపియన్ల నుండి తప్పించుకునేందుకు అర్వాక్‌లు సామూహికంగా ఆత్మహత్య చేసుకోవటం ప్రారంభించారు. తమ పిల్లల్ని సైతం వాళ్ళు విషం ఇచ్చి చంపేశారు. ఈ విధంగా రెండేళ్ల కాలాన హత్యలు, ఆత్మహత్యల కారణంగా హైతీలో గల 2 లక్షల 50 వేల ఇండియన్లలో సగంమంది మృత్యువాత పడ్డారు.

ఇక బంగారమేమి మిగల్లేదని అర్థమయ్యాక యూరోపియన్లు స్థానికుల్ని పెద్ద యెత్తున బానిసలుగా చేసుకొని వారిచేత ఎస్టేట్‌లో పని చేయించుకోవటం ప్రారంభించారు. ఇలాంటి

ఎస్టేట్లలో వాళ్లచేత  అత్యంత ఒత్తిడితో బండచాకిరీ చేయించుకునేవారు. పర్యవసానంగా దీనికి తట్టుకోలేక వేలాదిమంది బానిసలు చనిపోయారు. 1515 నాటికి 50వేల మంది ఇండియన్లు ఉండగా 1550కి వీరిసంఖ్య 500కు చేరుకున్నది. 1650 సంవత్సరపు ఒక నివేదిక ప్రకారం ద్వీపంలో అప్పటికి ఒక్క స్థానిక అరావాక్ లేదా వారి సంతతివారు కూడా మిగలలేదు.

యువ క్రైస్తవ మత గురువుల బార్టొలోమ్ డిలాస్ కాసస్ రాసిన పుస్తకాల ద్వారానే మనకు కొలంబస్ అనంతరం ఇక్కడి ద్వీపాల్లో ఏం జరిగిందో తెలుస్తున్నది.  కాసస్ క్యూబా ఆక్రమణలో పాల్గొన్నారు.  కొన్నాళ్ల పాటు పెద్దతోటను కలిగి ఉన్నాడు.  ఇందులో ఇండియన్ బానిసలు చేత పనులు చేయించుకున్నారు.  తరువాత కాలాన దీన్నాయన  వదులుకున్నాడు. అంతేకాదు.  స్పానియార్డ్ల క్రూరత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టాడు.

లాస్ కాసస్ ఇండీస్ చరిత్ర గ్రంథస్థం చేసారు. ఈ పుస్తకం రెండో సంపుటిలో ఇండియన్లను స్పానియార్డులు ఎంత క్రూరంగా చూసేవారో సోదాహరణంగా వివరించారు.

"స్థానికులు నెమ్మదస్థులు శాంతియుతంగా ఉండేవారు. వాళ్లను కొల్లగొట్టాలి. రెచ్చగొట్టాలి, విసిగించాలి. పిండేయాలి, చంపేయాలి, నాశనం చేయాలి. ఒక ఇండియన్ గనుక ఎదురు తిరిగి మనవాళ్లనొక్కడ్ని హత్య చేస్తే అందుకు ప్రతీకారంగా ఇండియన్లందరూ మరచిపోలేని విధంగా జవాబు చెప్పాలి".

రోజు రోజుకూ స్పానియార్డ్లలో గర్వం పెరిగిపోతున్న తీరును లాస్కాసస్ వివరించారు.  కొద్ది దూరం సైతం నడవటాన్ని వీళ్లు మానేసారు. స్థానికుల మీదకు ఎక్కి స్వారీ చేయటం, పల్లకీకి పైన కూర్చుని ఇండియన్ల చేత మోయించటం చేసేవారు.  కొందరు ఇండియన్లు పల్లకి ఎండపడకుండా ఆకుల్ని అడ్డం పట్టుకుని మరికొందరేమో కూర్చున్నవారికి బాతు ఈకలతో చేసిన విసినకర్రతో విసురుతూ పల్లకివెంట పరుగెత్తాల్సి వచ్చేది.  యురోపియన్లు ఈ విధమైన రాజసాన్ని ఒలకబోసేవారన్నమాట.

సంపూర్ణ ఆధిపత్యం క్రూరత్వాన్ని మరింతగా పెంచుతుంది. "స్పానియార్డులు తమ కత్తుల పదునును పరీక్షించుకునేందుకు పదులు, ఇరవైల సంఖ్యలో ఇండియన్లను ఊచకోత కోసేవార" ని లాస్కాసస్ పేర్కొన్నారు. "తమను తాము క్రైస్తవులమని చెప్పుకునే ఇరువురు యూరోపియన్లు చిలకలతో ఆడుకుంటున్న ఇద్దరు ఇండియన్ బాలుర్ని చూసారు.   పిల్లల నుండి స్పానియార్డ్లు చిలకల్ని లాక్కున్నారు.  అంతటితో ఊరుకోలేదు. ఆ ఇద్దరి తలల్ని మొండెం నుండి వేరు చేసారు. ఇదంతా యూరోపియన్లు వినోదం కోసం చేసినదేనన్నమాట."

ఇండియన్లు తమను తాము రక్షించుకునే ప్రయత్నంలో ఓడిపోయారు. దీంతో ప్రాణాలను కాపాడుకునేందుకు కొండలు కోనల్లోకి పారిపోసాగారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. స్పానియార్డ్లు, స్థానికులు ఎక్కడ ఉన్నా దొరకబుచ్చుకుని వారిని మట్టుపెట్టారు. "స్థానికులు చివరికి మౌనంగా గనులు, ఇతర చోట్ల వెట్టి చాకిరీ చేస్తూ జీవితాన్ని నెట్టుకొచ్చేవారు. చివరికి అక్కడే తనువు చాలించేవారు. తమను రక్షించేవారెవ్వరూ లేరన్నది వీరికి అర్థమైపోయింది. దీంతో నిస్సహాయంగా మౌనంగా బానిస చాకిరీ చేస్తూ చివరికి మృత్యువాత పడేవారు. గనుల్లో పనిచేయటం ఎంతటి దుర్భరంగా ఉంటుందో లాస్ కాసస్ వివరించారు.

"......ఇండియన్లు కొండల్ని ఒకటికి పదివేల సార్లు తవ్వుతారు. రాళ్లను బద్దలు చేస్తారు, మోస్తారు. మన్నును మోసుకెళ్లి సముద్రాన కడుగుతారు. గంటల తరబడి వొంగొని నీళ్లలో పనిచేస్తున్నందు వల్ల నడుములు విరుగుతాయి. బంగారు గనుల్లోకి నీరు చేరినప్పుడల్లా వాటిని బయటకు తోడటమొక మహా యజ్ఞమై కూర్చుంటుంది......."

గనుల్లో ఆరునుండి ఎనిమిది నెలల పాటు శ్రమిస్తే కొద్దిపాటి స్వర్ణం లభిస్తుంది. ఈ మధ్యకాలాన్నే అక్కడ పనిచేస్తున్న వారిలో మూడో వంతు మంది చనిపోతుంటారు. పురుషులు తమ నివాస ప్రాంతం నుండి మైళ్ల దూరంలో పనిచేస్తుంటే వారి భార్యలు కొండల్ని తవ్వి కస్సావా (ఒక దుంపజాతి మొక్క) తోటల పెంపకానికి భూమిని చదును చేస్తారు.

8-10 నెలలకొకసారి భార్యాభర్తలు కలుసుకునేందుకు అవకాశం ఏర్పడేది. విపరీతమైన చాకిరీ కారణంగా అప్పటికే ఇరువురూ నిస్సత్తులై మానసికంగా కృంగిపోయి ఉండేవారు. ఈ కారణాన వారిలో పునరుత్పత్తి సామర్థ్యం వట్టిపోయేది. కొత్తగా పుట్టిన శిశువులకు తిండిలేక అలమటిస్తున్న తల్లులు పాలివ్వలేక పోయేవారు. నేను క్యూబాలో ఉన్న కాలాన మూడునెలల్లో ఈ విధంగా ఏడు వేల మంది పిల్లలు అశువులు బాసారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లులు తమ బిడ్డల్ని నదిలో విసిరేసారు. ఇలా భర్తలు గనుల్లో, భార్యలు పని ప్రదేశంలోనూ వారి పిల్లలు తల్లి పాలులేని కారణంగానూ చనిపోతుండేవారు. ఈ విధంగా అనతికాలాన్నే ఈ భూమి నిర్మానుష్యంగా మారిపోయింది. ఇంతటి అమానవీయ, దుర్మార్గమైన మనుషుల ప్రవర్తనను నా కళ్లతో నేనే చూసాను. ఇదంతా రాస్తూ ఉంటే నా చేతులు వణుకుతున్నాయి......"

1508వ సంవత్సరాన లాస్కాసస్ విస్పానియాలా వచ్చారు. "అప్పటికి ఇండియన్లతో కలిపి కేవలం 60,000 మంది ప్రజలు మాత్రమే మిగిలారు. 1494 నుండి 1508 మధ్యన యుద్ధాలు, బానిసత్వం, గనుల బారినపడి 30 లక్షల మందికి పైగా జనం మరణించారన్నమాట.

భవిష్యత్తు తరాలవారు ఈ మాటలు చెప్తే నమ్మరేమో? ప్రత్యక్ష సాక్షినైన నేనే ఇదంతా నిజమేనా అంటూ ఒక్కసారి నివ్వెరపోతుంటాను........."

అమెరికా ఖండాన గల ఇండియన్ల భూభాగాన్ని ఐరోపా వాసులు ఆక్రమించుకునే ప్రక్రియ ఈ విధంగా 500 ఏళ్ల క్రితం ఆరంభమైంది. లాస్‌కాసస్ పేర్కొన్నట్లు యురోపియన్లు స్థానికుల్ని లోబర్చుకున్నారు. బానిసలుగా చేసుకున్నారు. పెద్ద ఎత్తున మట్టుపెట్టారు. ఈ దారుణ కృత్యాలకు సుమారు 30 లక్షల మంది ఇండియన్లు బలైనట్లు లాస్‌కాసస్ చెప్పారు. కొందరు చరిత్రకారులు ఈ సంఖ్యను 10 లక్షలకు తక్కువగా లెక్క గడతారు. ఇంకొందరేమో 80 లక్షల మంది ఇండియన్లు మృత్యువాత పడ్డారని నమ్ముతారు. యు.ఎస్.ఏ. పిల్లలు నేడు పఠిస్తున్న చరిత్ర పుస్తకాల్లో ఈ రక్తపు మరకలెక్కడా కనిపించవు. సాహస యాత్రీకునిగా కొలంబస్‌ను ఇవి కీర్తిస్తాయి. కొలంబస్ ఆగమన దినాన్ని అమెరికాలో పండుగగా జరుపుకుంటారు.

... ... ...

చరిత్ర రచనాపద్ధతి ఎలా ఉంటుందో చూడండి. ప్రభుత్వాలు, విజేతలు, దౌత్యవేత్తలు, నాయకుల దృష్టి కోణంనుండి చరిత్రను రాస్తారు. హీరోలు, బాధితుల్ని ఎలా చిత్రీకరించాలన్నదీ ఈ దృక్కోణంతోటే చూస్తారు. అభివృద్ధి పేరిట దురాక్రమణలు, హత్యాకాండల్ని సమర్థించటమనేది ఈ ఆలోచనావిధానంలోని ఒక పార్శ్వం మాత్రమే. ప్రజానీకమంతా అత్యంత సాహసయాత్రీకునిగా కొనియాడదగ్గ విశిష్ట పురుషునిగా కొలంబస్‌కు ఈ చరిత్ర కారులు ముద్ర వేసారు. అమెరికన్ జాతిపితలు జాక్సన్, లింకన్, విల్సన్, రూజ్‌వెల్ట్, కెన్నెడీలు........; పార్లమెంటు (కాంగ్రెస్) ప్రముఖులు, ప్రముఖ సుప్రీం కోర్టు న్యాయమూర్తులూ... తదితరులే అమెరికాకు ప్రతినిధులు అన్నట్లు వీళ్లు భావిస్తారు. అప్పుడప్పుడూ చిన్న చిన్న స్పర్థలూ, తగాదాల్ని మినహాయిస్తే మౌలికంగా అమెరికన్ ప్రజలందరూ ఏక సముదాయంగా ఒకే తరహా ప్రయోజనాలు కలిగి ఉంటారని చరిత్రకారులు పేర్కొంటారు. రాజ్యాంగమూ, భౌగోళిక విస్తరణ, పార్లమెంటు ఆమోదించిన చట్టాలు, కోర్టుల నిర్ణయాలు, పెట్టుబడిదారీ అభివృద్ధి, విద్యా సంస్కృతి, జన మాధ్యమాలు ఇవన్నీ కూడా "జాతి ప్రయోజనాల" కే ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు చెప్పజూస్తారు.

"రాజ్యాల జ్ఞాపకాల సంకలనమే చరిత్ర" అంటారు హెన్రీ కిసింజర్. తన తొలి పుస్తకం "ఎ మెమొరీ రీస్టోర్డ్" నందు ఆయనీ వ్యాఖ్య చేసారు.

ఆస్ట్రియా ఇంగ్లాండ్ నాయకుల దృష్టి కోణం నుండి 19వ శతాబ్దపు ఐరోపా చరిత్రను కిసింజర్ ఇందులో ఉల్లేఖించారు. ఆయా రాజ్యాల నేతల విధానాల ఫలితంగా బాధితులైన

లక్షలాది మంది ప్రజల పరిస్థితుల్ని ఈయన విస్మరించారు. ఈ దేశాల కొద్ది మంది నాయకుల దౌత్యపరమైన కృషి ఫలితంగానే యూరపులో ఫ్రెంచి విప్లవ పూర్వపు శాంతి స్థాపన సాధ్యపడిందని కిసింజర్ పేర్కొన్నారు.

అయితే ఇది యదార్ధమేనా? కొద్దిమంది ఉన్నత వర్గాల వారు మాత్రమే ఈ కాలాన లాభపడ్డారు. ఇదే సమయాన ఇంగ్లాండు కార్మికులు, ఫ్రాన్స్ రైతులు ఆసియా ఆఫ్రికా దేశాల ప్రజలు, మహిళలు, పిల్లలు హింస ఆకలి దోపిడిలకు గురయ్యారు. అణచివేతల్ని చవిచూసారు.

... ... ...

న్యూ ఇంగ్లాండ్‌కు వలస వచ్చిన వారు స్థానికుల్ని తరిమివేసి భూమిని ఆక్రమించుకునేవాళ్ళు. ఇండియన్లు ఈ భూమిని ప్రకృతి సిద్ధంగా ఉపయోగించుకుంటున్నారని, అంతేగాని వారికి దీనిపైన పౌరహక్కేమి లేదని మాసాచ్యుసెట్స్‌చే కాలనీ గవర్నర్ జాన్ విన్‌త్రాప్ పేర్కొన్నారు.

ఈ రీత్యా న్యూ ఇంగ్లాండ్ భూమిని ఖాళీదిగా ఆయన ప్రకటించారు.

ప్యూరిటన్లు (క్రైస్తవ మతానుయాయుల్లో ఒక పక్షం వాళ్ళు) తాము చేస్తున్న చర్యకు సమర్ధనగా బైబిల్‌ను సైతం ఉటంకించేవారు

కొలంబస్ అరుదెంచిన కాలానికి మెక్సికో ఉత్తర ప్రాంతాల్లో కోటి మంది ఇండియన్లు నివిసిస్తుండేవారు. తర్వాతర్వాత సంఖ్య క్షీణిస్తూ పోయింది, చివరికి పదిలక్షల మంది కన్నా తక్కువమంది స్థానికులు మాత్రమే మిగిలారు. శ్వేతజాతీయులు తెచ్చిపెట్టిన వ్యాధుల బారిన పడి ఇండియన్లు భారీ సంఖ్యలో మృతి చెందారు. న్యూ నెదర్‌లాండ్‌కు చెందిన డచ్ యాత్రికుడొకరు 1656 వ సంవత్సరాన ఇలా రాశాడు.

"క్రైస్తవుల ఆగమనానికి పూర్వం (మసూచికం రాకమునుపు) ఇప్పుడున్న జనాభా కన్నా పదిరెట్లు ఎక్కువమందిమి ఉండేవారమని ఇండియన్లు చెప్పారు. మసూచికం వల్ల విపరీతంగా జన నష్టం సంభవించింది. 90శాతం మంది ఈ వ్యాధి బారిన పడి మరణించారు." మాసాచ్యుసెట్స్ తీర ప్రాంతాన గల మార్తాస్‌వినియార్డ్ దీవినందు 1642కు పూర్వం ఇంగ్లీషు వారు రాక మునుపు సుమారు మూడువేల మంది ఇండియన్లు అక్కడే నివసించేవారు. ఈ దీవిలో యుద్ధాలేమీ సంభవించలేదు. అయినప్పటికీ 1764 కొచ్చేసరికి అక్కడ కేవలం 313మంది స్థానికులు మాత్రమే మిగిలారు. బ్లోక్ ఐలాండ్‌లోను ఇదే పరిస్థితి. 1662 వ సంవత్సరాన 1200 నుండి 1500 ఇండియన్లు ఉండగా 1774 కల్లా ఈ సంఖ్య 51కి పడిపోయింది.

స్వంత ఆస్థిని కూడబెట్టుకునే హక్కును సంతరించుకున్న నాగరికతలు తమ విస్తరణ కోసం కావలసిన వనరుల్ని వెతుక్కుంటూ ఇతర ప్రాంతాన్ని ఆక్రమించటం ప్రారంభించాయి. ఇంగ్లీషు వారి ఉత్తర అమెరికా దండయాత్ర ఉద్దేశమిదే. భూమి వంటి సహజ వనరుల కోసమే ఈసాహస యాత్రలు జరిగాయి. భూమి, ఇతర వనరుల కోసం మానవుడు జరిపిన అన్వేషణ ఇది. తన అవసరాల కోసమై చేపట్టిన చేష్టలివి. యూరపువాసులు ఈ విధంగా మోసాలు, అకృత్యాలు, స్థానికుల ఊచకోతల్ని కొనసాగించారు. మానవ చరిత్రలో అనాగరికమైన శకమిది. కొరతలు, పోటీలతో కూడిన కాలాన మనిషి తన అవసరాల కోసం ఆక్రమిత ప్రాంతాలకు చెందిన స్థానికుల్ని మొత్తంగానే మట్టుపెట్టిన ఘోరమిది.

# 2

# సామ్రాజ్యమూ... ప్రజలు...

1897 సంవత్సరాన థియోడర్ రూజ్‌వెల్ట్ తన మిత్రుడొకరికి లేఖ రాశారు. "ఎలాంటి యుద్ధాన్నైనా నేను స్వాగతిస్తాను. ఎందుకంటే దేశానికిది ఎంతో అవసరం. ఈ మాటలు నీ మనసులోనే ఉంచుకో," అంటూ తన అభిమతాన్ని రూజ్‌వెల్ట్ అందులో బయటపెట్టారు.

1890న ఊండెడ్‌నీ గ్రామాన యు.ఎస్. సైన్యం 300 మందికి పైగా అమెరికన్ ఇండియన్లను ఊచకోత కోసింది. అనంతరం ఈ సరిహద్దును మూసివేశారు. లాభాలు దండుకునే లక్షణమున్న ఆర్థిక వ్యవస్థ సహజంగానే విస్తరణను కోరుకుంటుంది. అందుకనుగుణంగానే వ్యవస్థ దృష్టి విదేశాలపైన పడింది. 1893న ఆర్థిక మాంద్యం ఆరంభమయ్యింది. స్వదేశంలో సరుకుల వినిమయం తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో అమెరికన్ సరకులకు విదేశీ మార్కెట్లు అవసరమయ్యాయి. 1890ల నాటి ఆర్థిక సంక్షోభాన్ని తత్ఫలితంగా ఉద్భవించిన వర్గపోరాటాల్ని అదుపులోనికి తెచ్చేందుకు ఇదే సరైన మార్గమని యు.ఎస్. రాజకీయ ఆర్థిక ఉన్నత వర్గాలు ఒక నిర్ణయానికి కొచ్చాయి. ఆనాటి దేశ ఆర్థిక స్థితిగతుల రీత్యా ఈ తరహా ఆలోచనకు కొన్ని వర్గాల నుండి మద్దతు పెరిగింది.

మాతృదేశం విదేశంపైన పోరు జరుపుతున్నప్పుడు సహజంగానే ప్రజల్లో దేశభక్తి ఇనుమడిస్తుంది. సమ్మెలు, ఉద్యమాలు చేస్తున్నవారు వాటిని కట్టిపెట్టి బాహ్య శత్రువుపైన తమ ద్వేషాన్ని మరల్చుకుంటారు. ఈ విధంగా యుద్ధ సమయాన ప్రభుత్వ వ్యతిరేకతలు సమసిపోతాయి. ప్రజలందరూ ఒక్కటై శతృదేశాన్ని తిట్టి పోయటం ప్రారంభిస్తారు. ఉన్నత వర్గాలు కావాలనే స్పృహతో ఈ పనికి పూనుకున్నారని మనం చెప్పలేము. కానీ పెట్టుబడిదారీ విధానం – జాతీయవాద శక్తులు చేయి కలిపి ముందడుగు వేసినప్పుడు సహజంగా జరిగేదిదే.

సముద్రతీరాల్ని దాటి విస్తరించాలనేది కొత్త ఆలోచనేమీ కాదు. మెక్సికో యుద్ధానికి పూర్వమే మన్రో సిద్ధాంతం అమెరికాను కరిబియన్ దీవుల ఆవల వరకూ నడిపించింది. స్పెయిన్ ఆధిపత్యం నుండి లాటిన్ అమెరికన్ దేశాలు స్వాతంత్ర్యాన్ని పొందుతున్న తరుణాన మన్రో సిద్ధాంతం (1823) వెలువడింది. లాటిన్ అమెరికన్ దేశాలు తమ ప్రభావానికి లోబడి ఉంటాయని యూరోపియన్ రాజ్యాలకు యు.ఎస్. స్పష్టం చేసింది. ఆ తర్వాత కొందరు

అమెరికన్లు పసిఫిక్‌ను దాటి హవాయి, జపాన్, చైనా మార్కెట్లవైపు దృష్టి సారించటం ప్రారంభించారు.

ఇవన్నీ వట్టి ఆలోచనల వరకే పరిమితం కాలేదు. అమెరికన్ సైన్యాలు ఈ మేరకు పలు దేశాల్లో స్వయంగా జోక్యాలు చేసుకున్నాయి. 1798-1895 మధ్య కాలాన యు.ఎస్. సైన్యాలు వివిధ దేశాల గడ్డపైన 103సార్లు కాలు మోపారు. సెనెట్ కమిటీకి స్వయంగా రక్షణ మంత్రి అందించిన సమాచారమిది.

### కొన్ని ఉదాహరణల్ని చూద్దాం

**1852-53 : అర్జెంటీనా :** విప్లవ సమయాన అమెరికన్ ప్రయోజనాల్ని పరిరక్షించేందుకై నౌకా దళ సిబ్బంది బ్యునస్ ఎయిర్స్‌లో పాదంమోపారు.

**1853 : నికరాగువా :** రాజకీయ కల్లోల పరిస్థితుల నేపథ్యాన అమెరికన్ ప్రజలు వారి ఆస్తుల్ని కాపాడేందుకు?

**1853-54 : జపాన్ :** జపాన్ ఓడ రేవుల్లో అమెరికన్ నౌకల ప్రవేశానికి మార్గం సుగమం చేసే లక్ష్యంతో యుద్ధ నౌకల ప్రయోగం

**1853-54 : రయిక్యు, బొనిన్ దీవులు :** జపాన్‌కు వెళ్లేందుకు. పూర్వం కొమడోర్ పెర్రి ఈ ప్రాంతాల్ని మూడు సార్లు సందర్శించాడు. రెండుసార్లు నౌకా దళ సైనికుల్ని దింపాడు. సహ, జెకినావా పాలకుల వద్ద నుండి బొగ్గుపైన రాయితీ పొందాడు, బొనిన్ దీవుల్లో సైనిక ప్రదర్శన నిర్వహించాడు. ప్రధానంగా వాణిజ్య అవకాశాల్ని దక్కించుకునేందుకే ఇవన్నీ చేశాడు.

**1854 : నికరాగువా :** నికరాగువాలో అమెరికన్ మతాచార్యునికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా గ్రేటౌన్‌ను విధ్వంసం గావించారు.

**1855 : ఉరుగ్వే :** మాంటివీడియో విప్లవప్రయత్నం సందర్భంగా అమెరికన్ ప్రయోజనాల్ని పరిరక్షించేందుకై యు.ఎస్. యూరోపియన్ నౌకాదళాలు ఇక్కడికివచ్చాయి.

**1859 : చైనా :** షాంగై నందుగల అమెరికన్ ఆస్తులు తదితరాల్ని రక్షించేందుకు యు.ఎస్. సైనికులు చైనా తరలివెళ్ళారు.

**1860 : అంగోలా :** స్థానికులతో స్పర్థల సందర్భాన అమెరికన్ ప్రజల ప్రాణాలు - ఆస్తుల్ని కాపాడేందుకు కిసెంబో ఆక్రమణ.

**1893 : హవాయ్ :** అమెరికన్ల ప్రాణాలు, ఆస్తుల్ని పరిరక్షించేందుకని పైకి చెప్పినప్పటికీ సాన్‌ఫోర్డ్ బి.డోల్. తాత్కాలిక ప్రభుత్వానికి మద్దతుగా సైన్యాన్ని దింపారు.

**1894 : నికరాగువా :** విప్లవానంతరం అమెరికన్ ప్రయోజనాల్ని కాపాడేందుకు బ్లూ ఫీల్డ్ నందు సైనికులను దింపారు.

ఈ విధంగా 1890ల నాటికే విదేశీ గడ్డలపైకి సైన్యాన్ని పంపటం, జోక్యాలు చేసుకున్న ఘటనలు అనేకం జరిగాయి. ఉన్నత స్థాయికి చెందిన సైన్యాధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తల్లో ఇటువంటి విస్తరణవాద సిద్ధాంతం బాగా ప్రబలింది. కొందరు రైతు ఉద్యమ నేతలు సైతం ఈ ధోరణిని సమర్థించారు. విదేశీమార్కెట్ల వల్ల తాము లాభ పడతామనేది వీరి ఉద్దేశ్యమన్న మాట.

యు.ఎస్. నావికాదళ అధికారైన కెప్టెన్ ఎ.టి.మహాన్ ఈ తరహా దురాక్రమణ ధోరణిని బాగా ప్రచారంలో పెట్టారు. థియోడర్ రుజ్‌వెల్ట్, ఇతర అమెరికన్ నాయకుల్ని ఆయన బాగా ప్రభావితం చేశారు. గొప్ప నావికాదళ శక్తి గల దేశాలు ఈ ప్రపంచ మంతటిపైనా జయకేతన మెగురవేయాలని ఆయన పేర్కొంటుండేవారు.

అమెరికా దృష్టికోణం ఎలా ఉండాలో మసాచ్యుసెట్స్ సెనెటర్ హెన్రీ కాబట్ లాడ్జ్ ఒక పత్రికా వ్యాసంలో పేర్కొన్నారు. "దేశ వాణిజ్య అవసరాల నిమిత్తమై ఉపయోగపడేందుకు మనం నికరాగువా కాల్వను తవ్వాలి. వ్యాపార ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ఈ కాల్వపైన పెత్తనాన్ని చెలాయించాలి. అందుకోసం పసిఫిక్‌ను మన గుప్పిట్లో పెట్టుకోవాలి. హవా యియన్ దీవులు, సోమా, ఇంకా క్యూబా తదితరాల్ని ప్రభావం కిందకి తెచ్చుకోవాలి. గొప్ప రాజ్యాలన్నీ ఈ తరహా పనుల్లోనే నిమగ్నమయ్యాయి. ప్రపంచంలోని ఉత్కృష్ట రాజ్యమైన అమెరికా కూడా ఈ మార్గాన్ని వీడరాదు."

స్పానిష్-అమెరికన్ యుద్ధం సందర్భంగా వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తన సంపాదకీయంలో ఈ విధంగా వ్యాఖ్యానించింది. "ఇప్పుడొక నూతన చైతన్యం మనల్ని ఆవహించినట్లు కనపడ్తున్నది. మనం అత్యంత బలవంతులమనీ, ఈ శక్తిని ప్రదర్శించాలన్న కోరిక బాగా పెరిగింది. కొత్తప్రాంతాలకు విస్తరించాలన్న ఆశ, ప్రయోజనాలు పొందాలన్న ఆకాంక్ష, గర్వం, యుద్ధం ద్వారా ఆనందాన్ని ఆస్వాదించాలన్న కోర్కె, ఇలా మన నూతనోత్తేజం-ఉత్సాహాలకు కారణమేదైనా కావచ్చును. ఒక అసాధారణమైన భవిష్యత్తు వైపుగా మన పయనం సాగుతున్నది. అడవిలో మృగాలు రక్తాన్ని మరిగినట్లు మన ప్రజల్లో మహాసామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలన్న తహతహ గోచరిస్తున్నది........."

ఇంతకీ ప్రజల్లో ఈ తరహా ఆకాంక్ష వెనుక వున్న కారణం ఏమిటి. ప్రజల్లో సహజసిద్ధంగా వుండే దౌర్జన్యపూరిత ప్రవృత్తా? వెనువెంటనే ప్రయోజనాలు నెరవేరతాయన్న

భావనా? బడా పత్రికలు, సైన్యం, ప్రభుత్వం, కొందరు పండితులు సృష్టించి – ప్రచారం చేసిన ఆలోచనల ఫలితమా? "ట్యుటోనిక్ ఆంగ్లో – సాక్సన్ జాతుల వారికి జాతి రాజ్యాలను నిర్మించే బాధ్యత అప్పగించబడిందని" కొలంబియా విశ్వ విద్యాలయానికి చెందిన రాజనీతి అధ్యాపకుడు జాన్ బుర్గెస్ పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచానికి రాజకీయ నాగరికతను నేర్పించే కార్యక్రమం వీరిపైన పడిందని చెప్పారు. అంటే దీనిఅర్థం ఏమిటో చూద్దాం. అధ్యక్షునిగా ఎన్నికయ్యేందుకు కొన్ని సంవత్సరాల క్రితం విలియం మెకిన్లే ఇలా అన్నారు: "మిగిలిపోతున్న అదనపు ఉత్పత్తుల్ని అమ్ముకునేందుకు మనకు విదేశీ మార్కెట్ కావాలి." ఇండియానాకు చెందిన సెనేటర్ ఆల్బర్ట్ బెవిరిడ్జ్ 1897లోనే 'అమెరికన్ ప్రజలు వినియోగించగల వాటికన్నా మన ఫ్యాక్టరీలు అధిక ఉత్పత్తులు గావిస్తున్నాయి. ఈరీత్యా ప్రపంచ వాణిజ్యం పైన మనం పెత్తనాన్ని సాధించాలి' అన్నాడు. ఆధునిక ప్రపంచానికి 'రాజకీయ నాగరికత' నేర్పటమంటే ఏమిటో ఇప్పుడు అర్థమయ్యింది కదా!

హోంమంత్రిత్వశాఖ 1898వ సంవత్సరాన ఒక ప్రకటనను విడుదల చేసింది. "అమెరికన్ పరిశ్రమలు, వృత్తిదారులకు సంవత్సరం పొడవునా చేతినిండా పని వుండాలంటే మనం విదేశీ మార్కెట్లను విస్తరిస్తూ పోవాలి. ఇందుకు అనుగుణంగానే మన రాజనీతిజ్ఞత, దౌత్యనీతిని మనం అలవర్చుకోవాల"ని మంత్రిత్వశాఖ పేర్కొన్నది.

ఇందుకనుగుణంగానే విస్తరణవాద రాజకీయ నాయకులు, సైన్యాధికారుల మధ్య నిరంతర సంబంధాలు వుంటూ వుండేవి. థియోడర్ రూజ్‌వెల్డ్ జీవిత చరిత్రకారుడొకరు చెప్తున్నదాన్ని బట్టి ఇది నిజమేనని స్పష్టమవుతున్నది. "1890లో కల్లా లాడ్జ్, రూజ్‌వెల్ట్, మహాన్‌లు తరచు తమ అభిప్రాయాన్ని పంచుకునేవారు. మహాన్‌ను నావికాదళ బాధ్యతల నుండి తప్పించి ఆయన సేవల్ని విస్తరణవాద ప్రచారానికి ఉపయోగించుకోవాలని మిగతా ఇద్దరూ తలంచారు. ఒకసారి రూజ్‌వెల్ట్ హెన్రీ కాబర్ట్ లాడ్జ్‌లకు రుడ్‌యార్డ్ కిప్లింగ్ కవితను పంపించారు. కవిత్వ రచనా స్థాయి తక్కువగా వున్నప్పటికీ ఇది విస్తరణవాదాన్ని బలంగా ప్రతిబింబిస్తున్నదని రూజ్‌వెల్డ్ పేర్కొన్నారు."

కొందరు అమెరికన్లు హవాయి ద్వీపాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం (1893) ఈ ప్రాంతాన్ని యు.ఎస్. స్వాధీనం చేసుకోకపోవడాన్ని రూజ్‌వెల్ట్ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ తటపటాయింపును "శ్వేతజాతి నాగరికతకు వ్యతిరేకంగా జరిగిన నేరం"గా ఆయన అభివర్ణించారు. "నాయక జాతులన్నీ కూడా పోరాటాలకు ఎల్లవేళలా ఉత్సాహం చూపిస్తాయి. యుద్ధాల్లో విజయాలు సాధించిన తరువాతనే నిజమైన శాంతి వెల్లివిరుస్తుందని" ఆయన నావికా యుద్ధ కళాశాలలో గావించిన ఒక ప్రసంగంలో పేర్కొన్నారు.

నిమ్నజాతులు – దేశాల పట్ల రూజ్‌వెల్ట్‌కు తృణీకారభావన వుండేది. న్యూ ఆర్లీన్స్‌లో నివశిస్తున్న ఇటాలియన్ ప్రవాసుల్ని స్థానికుల గుంపొకటి ఊచకోత కోసింది. దీనికి స్పందనగా

ఇటలీ ప్రభుత్వానికి కొంత పరిహారాన్ని చెల్లించాలని భావిస్తున్నట్లు రూజ్‌వెల్ట్ ప్రకటించారు. అయితే తన సోదరికి రాసిన ఒక లేఖలో రూజ్‌వెల్ట్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నాడు. జరిగిన హత్యాకాండలను మంచి ఘటనగా ఇందులో ఆయన అభివర్ణించారు. కొంతమంది దౌత్యవేత్తలతో జరిగిన భోజన సమావేశాన తాను ఇదే విధమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లు రూజ్‌వెల్ట్ చెప్పుకున్నారు.

"మానవ సమాజానికి యుద్ధమనేది ఆదర్శ లక్ష్యంగా రూజ్‌వెల్ట్ పేర్కొంటార"ని తత్వవేత్త విలియం జేమ్స్ వ్యాఖ్యానించారు. జేమ్స్ ఆ కాలపు ప్రముఖ సామ్రాజ్యవాద వ్యతిరేక తత్వవేత్త. "సంగ్రామ కాంక్ష అనేది మగతనపు చిహ్నం. ఏడుపుగొట్టు మొహాలు, గౌరవహీనులు మాత్రమే శాంతిని కోరుకుంటారు. ఉన్నతమైన జీవితాన్ని కాంక్షించలేని అల్పులు మాత్రమే దీన్ని అభిలషిస్తార"నేది రూజ్‌వెల్ట్ అభిప్రాయమని విలియం జేమ్స్ వివరించారు.

... ... ...

1898 కాలాన అమెరికన్ ఉత్పత్తుల్లో 90 శాతం దేశీయంగానే అమ్ముడవుతుండేవి. పది శాతాన్ని మాత్రమే విదేశాల్లో విక్రయించేవారు. ఈ కొద్దిపాటి ఎగుమతులే కోట్లాది డాలర్లను తెచ్చిపెట్టేవి. "1893 నాటికల్లా అమెరికన్ వాణిజ్యం ప్రపంచాన ఇంగ్లాండ్ తప్ప మిగిలిన అన్ని దేశాలను అధిగమించింద"ని 'ద న్యూ ఎంపైర్' గ్రంథాన వాల్టర్ లాఫెబర్ పేర్కొన్నారు. "వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా పొగాకు, ప్రత్తి, గోధుమ పంటల ధరలు – లాభాలు అంతర్జాతీయ మార్కెట్లపైన ఆధారపడి వుండేవి." 1895 నాటికి రెండు దశాబ్దాల కాలాన అమెరికన్ పెట్టుబడిదారుల నూతన విదేశీ పెట్టుబడులు బిలియన్ డాలర్లకు చేరుకున్నది. "దేశీయ ఉత్పత్తులు ఇప్పటికే అవసరాన్ని మించి వుంటున్నాయ"ని 1885వ సంవత్సరాన 'ఏజ్ ఆఫ్ స్టీల్' పత్రిక పేర్కొంది. ఈ రీత్యా భవిష్యత్‌లో విదేశీ ఎగుమతుల్ని పెంచడం ద్వారా మన పారిశ్రామిక మార్కెట్‌ను పెంచుకోవాలని ఇది సూచించింది. ఏజ్ ఆఫ్ స్టీల్ అనేది ఉక్కు పరిశ్రమల రంగానికి చెందిన పత్రిక.

1880 – 1890ల నాటికి చమురు ఎగుమతి పెద్ద వ్యాపారమై కూర్చుంది. 1891 నాటికి రాక్‌ఫెల్లర్ కుటుంబానికి చెందిన స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ అమెరికన్ చమురు మొత్తం ఎగుమతుల్లో 90 శాతాన్ని దక్కించుకున్నది. అలాగే ప్రపంచ చమురు వాణిజ్యాన్ని 70 శాతాన్ని కలిగివున్నది. ఈ దశకాన పత్తి తర్వాత విదేశీ ఎగుమతుల్లో ద్వితీయ స్థానాన్ని చమురు చేజిక్కించుకున్నది.

... ... ...

స్పెయిన్‌కు వ్యతిరేకంగా క్యూబాలో విప్లవం ప్రారంభమైనప్పటి నుండి అక్కడ వాణిజ్య అవకాశాల్ని విస్తరించుకోవాలని వ్యాపార వేత్తలు యోచించ సాగారు. నిజానికి అప్పటికే

క్యూబాలో అమెరికా పెద్ద ఎత్తున పెట్టుబడులుపెట్టి వున్నది. 1896వ సంవత్సరాన అమెరికా అధ్యక్షుడు గ్రోవర్ క్లెవ్‌లాండ్ ఈ వివరాల్ని ప్రకటించారు. తోటలు, రైల్వేలు, గనులు, ఇతర వ్యాపార రంగాల్లో మూడుకోట్ల నుండి ఐదు కోట్ల డాలర్ల అమెరికన్ పెట్టుబడులు ఆనాటికే అక్కడ వున్నాయని గ్రోవర్ వివరించారు. 1889వ సంవత్సరాన అమెరికా, క్యూబాల మధ్యన ఆరుకోట్ల 40 లక్షల డాలర్ల వాణిజ్యం జరగ్గా, 1893 నాటికది 10 కోట్ల 30 లక్షల డాలర్లకు పెరిగింది.

1776 అమెరికన్ విప్లవం వలె క్యూబన్ విప్లవానికి విస్తృతమైన ప్రజానీకపు మద్దతు వున్నది. అయినప్పటికీ క్యూబా పరిణామాల్ని యు.ఎస్. ప్రభుత్వం లాభం – ఆధిపత్య కోణాల నుండి మాత్రమే వీక్షించింది. క్యూబా విప్లవ తొలినాళ్ళలో అప్పటి అధ్యక్షుడు క్లెవ్‌లాండ్ గానీ తర్వాత వచ్చిన మెకిన్లే గానీ తిరుగుబాటు దారుల్ని అధికారికంగా గుర్తించలేదు. విప్లవకారులకు గుర్తింపునిస్తే తన సైన్యాన్ని పంపకుండానే అమెరికా అధికారికంగా వారికి సహాయపడేందుకు వీలు ఏర్పడేది. అయితే విప్లవకారులు స్వతంత్రంగానే విజయం సాధించి అమెరికాను దూరంగా వుంచుతారేమోనన్న భయం యు.ఎస్. పాలకులకున్నది.

అమెరికాకు ఇంకో రకమైన బెదురుకూడా వున్నది. విప్లవకారులు విజయం సాధిస్తే క్యూబాలో శ్వేత – నల్ల జాతివారల మిశ్రమ ప్రభుత్వం ఏర్పడగలదన్న ఆందోళనను క్లెవ్‌లాండ్ ప్రభుత్వం వెలిబుచ్చింది. ఎందుకంటే క్యూబాలో ఈ రెండు వర్గాల ప్రజలూ జీవిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే నల్లవారి ఆధిపత్యం ఏర్పడగలదన్న భయం యు.ఎస్.కు వున్నదన్న మాట. సాటర్‌డే రివ్యూ పత్రికలో (1896) రాసిన ఒక వ్యాసాన విన్‌స్టన్ చర్చిల్ ఈ ఆందోళననే వ్యక్తపరిచారు. చర్చిల్ తండ్రి ఆంగ్లేయుడు కాగా, తల్లి అమెరికన్.

స్పానిష్ దుష్పరిపాలన పర్యవసానంగా విప్లవకారులకు ప్రజల మద్దతు లభించిందని చర్చిల్ పేర్కొన్నారు. అయినప్పటికీ క్యూబా దీవి స్పెయిన్ ఆధిపత్యాన ఉండటమే మేలని ఆయన అభిలషించారు. “విప్లవకారుల్లో 40 శాతం నీగ్రోలే. విజయం సాధిస్తే వీళ్లు నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వాన పెద్ద వాటాను అడుగుతారు. తత్ ఫలితంగా అక్కడ మరో నల్లజాతి రిపబ్లిక్ ఏర్పడే భయం వున్నది”.

ఇక్కడ మరో రిపబ్లిక్ అంటే అది హైతి అన్నమాట. 1803వ సంవత్సరాన ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా వెల్లువెత్తిన విప్లవానంతరం నూతన ప్రపంచాన నల్లవారి ఆధిపత్యంలో ఏర్పడిన తొలిరాజ్యంగా హైతి గణతికెక్కింది. యు.ఎస్. వ్యవహారాలు చూసే స్పానిష్ మంత్రి అమెరికా విదేశాంగ మంత్రికి ఈ విధంగా లేఖ రాశారు.

"ఈ విప్లవాన నల్లజాతివారే ప్రధాన భూమికను నిర్వహిస్తున్నారు. ముఖ్యనేతలే కాదు వారి అనుచరుల్లో 80 శాతం మంది నల్లజాతివారే వున్నారు. ఈ దీవి గనుక స్వాతంత్ర్యాన్ని పొందితే నల్లవాళ్లు విడిపోయి తమ కోసం ప్రత్యేక రిపబ్లిక్‌ను ఏర్పరచుకుంటారు".

స్పానిష్ – క్యూబన్ అమెరికన్ యుద్ధంపైన రెండు సంపుటాల అధ్యయనాన్ని వెలువరించిన ఫిలిప్ ఫోనార్ మెకెన్లే ప్రభుత్వ వైఖరిని బయటపెట్టారు. తొలినుండీ కూడా యు.ఎస్. సర్కార్‌కు క్యూబా స్వాతంత్ర్యం పొందాలని లేదు. ఈ విప్లవం వల్ల మన వాణిజ్య అవకాశాలు దెబ్బతింటాయని స్పెయిన్ వ్యవహారాలు చూసే మంత్రి స్టివార్ట్ ఉడ్ ఫోర్ట్‌తో అధ్యక్ష భవనం పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మన వ్యూహాన్ని కొనసాగించాలని కోరింది. ఏదశలో కూడా క్యూబన్లకు స్వాతంత్ర్యం – న్యాయం అన్న ఆలోచనే అమెరికాకు లేదు. క్యూబన్ విప్లవకారులు స్పానిష్ ప్రభుత్వాన్ని కూలదోసి విజయాన్ని సాధించే ప్రమాదం వున్నందువల్లనే అమెరికా తొందరపడి తన సేనల్ని దింపాల్సి వచ్చిందని మెకెన్లే ప్రభుత్వం వివరణ ఇచ్చుకున్నది. దీన్నిబట్టి ఈ మొత్తం వ్యవహారంలో యు.ఎస్. వైఖరి ఏమిటో మనకు స్పష్టమవుతున్నదన్న మాట.

1898 ఫిబ్రవరి నెలలో హవానా ఓడరేవు వద్ద అమెరికా యుద్ధ నౌక పేలిపోయింది. 268 మంది మృతిచెందిన ఈ సంఘటన ఏవిధంగా జరిగిందో తెలిపే ఆధారాల్ని' యు.ఎస్. బయటపెట్టలేదు. అయితే దీన్ని సాకుగా చూపి మెకెన్లే యుద్ధం దిశగా పావులు కదిపారు.

"అధ్యక్షుడికి యుద్ధం చేయాలనే కోరిక ఏమాత్రమూ లేదు. శాంతి స్థాపన కోసమే ఆయన తన శక్తియుక్తులన్నీ ఉపయోగించారు. అయితే మార్చి మధ్యలోకి వచ్చేసరికే ఒక విషయం స్పష్టమైపోయింది. యుద్ధం ద్వారా మాత్రమే ఈ రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితి తొలగిపోతుంది. అప్పుడే మనం నూతన అమెరికన్ వాణిజ్య సామ్రాజ్యాన్ని నిర్మించుకోగలమని అధ్యక్షుడికి అర్థమైపోయింద"ని వాల్టర్ లాఫెబెర్ పేర్కొన్నారు.

వసంత రుతువు వచ్చేసరికే యుద్ధం ద్వారా మాత్రమే స్పెయిన్‌ను క్యూబా నుండి తరిమివేయగలమని అధ్యక్షుడు మెకెన్లే, వాణిజ్యవేత్తలు ఒక అభిప్రాయానికి వచ్చేశారు. క్యూబాలో తమ సైనిక ఆర్థిక, ఆధిపత్యాన్ని సాధించేందుకు స్వయంగా జోక్యం చేసుకోవాల్సిందేనని అమెరికన్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఈ రీత్యా క్యూబాలో పరిస్థితుల్ని విప్లవకారులకు విడిచిపెట్టేయకూడదని అమెరికా భావించింది. "ద న్యూ మార్కెట్ కమర్షియల్ అడ్వర్‌టైజర్" పత్రిక తొలుత యుద్ధానికి వ్యతిరేకంగా వుండేది. అనంతరం ఇది ప్లేటు ఫిరాయించింది. "మానవాళి స్వేచ్ఛకోసం, ఇంకా ముఖ్యంగా వాణిజ్య – పారిశ్రామిక అభివృద్ధి కోసమై క్యూబాలో అమెరికా జోక్యం చేసుకోవా"లని ఈ పత్రిక మార్చి 10వ తేదీన రాసింది. "ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యాపార – పారిశ్రామిక అభివృద్ధికి తగు స్వేచ్ఛ వుండాలి. అంతర్జాతీయంగా ప్రజానీకపు ప్రయోజనాలు అప్పుడే పరిరక్షింపబడతాయ"ని పేర్కొన్నది.

క్యూబాను మనలో కలుపుకోవద్దంటూ అంతకు పూర్వం అమెరికన్ పార్లమెంటు 'టెల్లర్ సవరణ' చట్టాన్ని ఆమోదించింది. క్యూబా స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే శక్తులు ఈ చట్టాన్ని ముందుకు తెచ్చాయి. మద్దతు ఇచ్చాయి. కొంత మంది వ్యాపార వేత్తలు సైతం స్వేచ్ఛా వాణిజ్యానికి తలుపులు తెరచిఉంటే చాలునని క్యూబాపైన సైనికచర్య అవసరమని భావించారు. ఇలాంటి వారు కూడా టెల్లర్ చట్టాన్ని సమర్థించారు. 1898 నాటికి వ్యాపార వర్గాల ధోరణిలో మార్పు వచ్చింది. అమెరికా సైనిక చొరవ అవసరాన్ని వాళ్లిప్పుడు నొక్కి చెప్పటం ఆరంభించారు. టెల్లర్ సవరణను విభిన్నంగా వ్యాఖ్యానించు కోవలసిన సమయం ఆసన్నమైనదని 'జర్నల్ ఆఫ్ కామర్స్' పేర్కొన్నది.

యుద్ధం ద్వారా ప్రత్యేకంగా ప్రయోజనాలు పొందాలని చూసే వర్గాలు ఉంటాయి. ఇనుము పరిశ్రమకు కేంద్రమైన పిట్స్‌బర్గ్ వాణిజ్య సంఘం బలప్రయోగమే అత్యవసర కర్తవ్యమంటూ ఉత్సాహాన్ని ప్రకటించింది. యుద్ధ వాతావరణం వల్ల ఇనుము పరిశ్రమ ఉత్పత్తులు పెరిగాయని వ్యాపారవేత్తలు హర్షించసాగారు. ఇక సమరమే ప్రారంభమైతే వాణిజ్యం ఇబ్బడిముబ్బడిగా పెరగగలదని వాణిజ్య సంఘం అంచనా వేసింది. నావికా దళానికి అప్పటికే యుద్ధోన్మాదం బాగా పాకింది. మైనె విధ్వంసానంతరం నౌకాదళాన్ని క్షిపణులు – మందుగుండు సామాగ్రి తదితర ఆయుధాలు తయారుచేసే కాంట్రాక్టర్లు ముట్టడించారు. వారందరి ప్రభావం నావికాదళ అధికారులపైన పడింది. యుద్ధమే జరిగితే ఇటువంటి కాంట్రాక్టర్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలొస్తాయన్న సంగతి నేరుగా చెప్పనవసరం లేదుమరి!

"సంగ్రామమే సంభవిస్తే సంపన్న వర్గం ఏపక్షం వహిస్తుందో అనేది బహిరంగ రహస్యమే"నని రస్సెల్ సేజ్ అనే బ్యాంకర్ వ్యాఖ్యానించారు. వాణిజ్యవేత్తలతో ఒక సర్వేను నిర్వహించగా జాన్‌జాకబ్ ఆస్టర్, విలియం రాక్‌ఫెల్లర్, థామస్ ఫార్చ్యూన్ రేయాన్ వంటి వ్యాపారస్థులందరూ యుద్ధాన్నే సమర్థిస్తున్నారని తేలింది. స్పెయిన్‌తో ఇంకా చర్చలు జరపటం వల్ల ఉపయోగమేమీ లేదని జె.పి. మోర్గాన్ పేర్కొన్నారు. హెన్రీ కాబోట్ లాడ్జ్ 1898 మార్చి 21 వ తేదీన మెకెన్లేకు ఒక సుదీర్ఘమైన లేఖ రాశారు. తాను బ్యాంకర్లు, బ్రోకర్లు, వ్యాపారస్థులు, ఎడిటర్లు, మతాచార్లు తదితరులతో మాట్లాడాలని ప్రతీ ఒక్కరు కూడా క్యూబా సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటున్నారని ఆయన అందులో పేర్కొన్నారు.

యుద్ధం ఇంకా ఇలా కొనసాగుతూ పోవటం వాణిజ్యానికి మంచిది కాదు. ఒకే ఒక్క పెద్ద సైనిక చర్య ద్వారా దాన్ని ముగించటం మంచిదని తాను మాట్లాడిన వారందరు అభిప్రాయపడినట్లు లాడ్జ్ వివరించారు. "పెద్ద కార్పొరేషన్లన్నీ కూడ యుద్ధం కావాలని కోరుకుంటున్నాయని" పేర్కొంటూ మెకెన్లే సలహాదారుడొకరి నుండి శ్వేత సౌధానికి టెలిగ్రాం వచ్చింది. "ఈ అనిశ్చిత పరిస్థితి తొలగిపోయినందుకు అప్పుడందరూ హర్షం వెలిబుస్తారు."

ఈ టెలిగ్రాం అందిన రెండు రోజుల తర్వాత యుద్ధాన్ని విరమించవలసిందిగా స్పెయిన్‌కు మెకెన్లే హెచ్చరిక జారీ చేశారు. క్యూబా స్వాతంత్ర్యం గురించి ఈ సందర్భంగా అధ్యక్ష్యుడేమి ప్రస్తావన చేయలేదు. దీని పైన స్పందిస్తూ స్పెయిన్ స్థానాన్ని ఆక్రమించాలని అమెరికా భావిస్తున్నట్లు తోస్తున్నదని న్యూయార్క్ లోగల క్యూబా విప్లవకారుల ప్రతినిధి వ్యాఖ్యానించారు.

"ముందుగా క్యూబా స్వాతంత్ర్యాన్ని గుర్తించకుండా తాను సైనికంగా జోక్యం చేసుకోవాలని అమెరికా భావిస్తున్నది. అలా గనుక చేస్తే క్యూబా విప్లవ కారులపైన అమెరికా యుద్ధానికి దిగినట్లుగా తాను భావించాల్సి వస్తుంద"ని ఆయన పేర్కొన్నారు.

ఏప్రిల్ 11వ తేదీన మెకెన్లె అమెరికన్ కాంగ్రెస్‌ను యుద్ధానికి అనుమతి కోరారు. ఈ సందర్భంగా క్యూబా స్వాతంత్ర్యం విషయాన్ని గానీ, విప్లవకారుల్ని గుర్తిస్తున్నట్లు కానీ ఆయన పేర్కొనలేదు. తొమ్మిది రోజుల అనంతరం క్యూబాపైన సైనిక జోక్యానికి అధ్యక్షునికి అనుమతినిస్తూ కాంగ్రెస్ సంయుక్త తీర్మానాన్ని ఆమోదించింది. యు.ఎస్. సైనికులు క్యూబాను చేరుకున్నారు. టెల్లర్ సవరణ క్యూబా స్వాతంత్ర్యానికి హామీ ఇస్తుందని భావించిన విప్లవకారులు వారికి స్వాగతం పలికారు.

అమెరికన్ ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే క్యూబాకు యు.ఎస్. తన సైన్యాన్ని పంపించిందని స్పానిష్-అమెరికన్ యుద్ధం పైన రాసిన పలువురు చరిత్రకారులు అభివర్ణించారు. నిజమే పలుకుబడి కలిగిన కొన్ని వార్తాపత్రికలు సమరాన్ని కాంక్షిస్తూ అమితావేశాన్ని ప్రదర్శించాయి. అలాగే అనేక మంది అమెరికన్ ప్రజలు టెల్లర్ సవరణను క్యూబా స్వాతంత్ర్యానికి హామీగా పరిగణించారు. పత్రికలు, కొన్ని వర్గాల ప్రజల అభిమతానికి అనుగుణంగానే మెకెన్లె యుద్ధానికి దిగారంటారా? (ఆ రోజుల్లో ప్రజాభిప్రాయ సేకరణ సర్వేలు లేవు) వాణిజ్య వర్గాల ఒత్తిడి ఇందులో లేదంటారా? క్యూబా యుద్ధం తర్వాత కొన్ని సంవత్సరాలు గడచిన అనంతరం వాణిజ్యశాఖలోని విదేశీ వాణిజ్య విభాగ అధిపతి ఈ విధంగా రాశారు:

"వెస్టిండీస్, దక్షిణ అమెరికా దేశాలతో మనకు గల ఆర్థిక సంబంధాలే క్యూబాలోని స్పానిష్ పాలకులపైన అమెరికా యుద్ధానికి దిగటానికి ప్రధాన కారణం. దేశీయ వినిమయానికి మించి ఎన్నో రెట్లు అధికంగా మన పారిశ్రామిక ఉత్పత్తులు ఉంటున్నాయి. అందువల్ల మన సరుకులు అమ్ముకునేందుకు విదేశీ మార్కెట్లు అవసరం. విదేశీ మార్కెట్ల కోసమే మన ప్రభుత్వం విస్తరణ వాదాన్ని అనుసరిస్తున్నది."

1895వ సంవత్సరాన స్పెయిన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమైనప్పటి నుండీ క్యూబా విప్లవకారుల పట్ల అమెరికన్ కార్మిక సంఘాలకు సానుభూతి ఉన్నది. 1897న హవాయిని విలీనం చేసుకోవాలన్న మెకెన్లె ప్రతిపాదనను అమెరికా కార్మిక సమాఖ్య (ఎ.ఎఫ్.ఎల్) తదితర సంఘాలు వ్యతిరేకించాయి. 1897 ఎ.ఎఫ్.ఎల్.మహాసభ క్యూబా తిరుగుబాటు దారులకు

మద్దతు ప్రకటిస్తూనే అక్కడ అమెరికా జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. "క్యూబా ఉద్యమం పట్ల మాకు అవ్యాజమైన సానుభూతి ఉన్నద"ని అమెరికన్ కార్మిక సమాఖ్యకు చెందిన సామ్యూల్ గోంపర్స్ ఒక మిత్రుడికి రాసిన లేఖలో పేర్కొన్నారు. అయితే యుద్ధోన్మాదులకు తాము మద్దతు పలకటం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఫిబ్రవరి నెలలో మైనె వద్ద జరిగిన పేలుడు అనంతరం పత్రికలు యుద్ధాన్ని రెచ్చగొడ్తూ రాశాయి. అంతర్జాతీయ యంత్ర కార్మికుల (మెషినిస్ట్స్) సంఘం పత్రిక ఈ సంఘటనను తీవ్రమైనదిగా పేర్కొంటూనే పారిశ్రామిక ప్రమాదాల్లో కార్మికులు మృతి చెందినప్పుడు దేశాన ఈ విధమైన స్పందనలు రాకపోవటాన్ని ప్రస్తావించింది. 1897 సెప్టెంబరు 10 వ తేదీన లాటియర్‌లో జరిగిన కార్మికుల ఉచకోతను పత్రిక ఉదహరించింది. ఉద్యమిస్తున్న పెన్సిల్వేనియా బొగ్గుగని కార్మికులపైన ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో ఆరోజున 19 మంది అసువులు బాసారు. వాస్తవానికి సమ్మెను భగ్నం చేసేందుకై పాలకులు ఆస్ట్రియన్లు, హంగేరియన్లు, ఇటాలియన్లు, జర్మన్ కార్మికుల్ని రంగంలోనికి దింపింది. వీరందరూ కూడా ఆందోళన కారులతో కలసి సంఘటితమై పోరుబాట పట్టారు. ఈ కార్మికులపైన ఆ దినం జరిగిన కాల్పుల్లో19 మంది చనిపోయారు. ఎక్కువ మందిని వెనుకవైపు నుండి తుపాకితో కాల్చారు. ఈ సంఘటన పట్ల పత్రికలు పెద్దగా నిరసన ప్రకటించలేదు.

పారిశ్రామిక రంగాన దినదినం కార్మికులు బలవుతున్నారు. ఈ విధంగా ఏటా వేలాది మంది శ్రమజీవులు కేవలం కొద్ది మంది అత్యాశకు తమ జీవితాన్ని ఆత్మత్యాగం గావిస్తున్నారు. ఈ విధంగా శ్రామికులు తమ రక్తంతో పెట్టుబడిదారీ విధానానికి రక్తతర్పణం గావిస్తున్నారు. మిల్లులు, గనులు, కార్ఖానాల్లో రోజూ – నెలనెలా – ప్రతిఏటా ఇలా వేలాది మంది బలయిపోతున్నారు. వీరి మరణాలపైన ఎప్పుడూ కూడా విస్తృత జనాందోళనలు ఏనాడూ వ్యక్తం కాలేదు."

కన్నెక్టికట్ ఎ.ఎఫ్.ఎల్. అధికార పత్రిక 'ద క్రాఫ్ట్‌మన్' కూడా మైనె ఓడ మునక ఉదంతంపై పేట్రేగిన ఉన్మాదం గురించి ఈ విధంగా హెచ్చరించింది.

"అమెరికాను నావికా–సైనిక ప్రబలశక్తిగా ప్రదర్శించేందుకు నక్కజిత్తులతో కూడిన పెద్ద వ్యూహాన్ని రచించారు. ఇందుకు సూత్రధారులు పెట్టుబడిదారులే. అయితే కనీస వేతనాన్ని కోరుతూ కార్మికులు ఆందోళనకు దిగితే మాత్రం వాళ్ళను వీధికుక్కల్లా వేటాడి చంపుతారు. పెట్టుబడిదారీ వర్గపు చేష్టలు ఈ విధంగా ఉంటాయన్న మాట!"

యునైటెడ్ మైన్ వర్కర్స్ వంటి కొన్ని కార్మిక సంఘాలు మాత్రం మైనె ఉదంతం తర్వాత అమెరికా జోక్యాన్ని కోరాయి. అయితే అధికశాతం యూనియన్లు యుద్ధానికి వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి. అమెరికన్ లాంగ్‌ఫోర్‌మెన్స్ యూనియన్ కోశాధికారి బోల్టన్ హాల్ శాంతిని కోరుతూ కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

"సంగ్రామమే జరిగితే మనమే శవాలుగా మారతాం, అధిక పన్నుల్ని కడ్తాం. యుద్ధం తాలూకు కీర్తిని మాత్రం ఇతరులు కొట్టేస్తారు. ఈ వాతావరణం నుండి స్పెక్యులేటర్లు లాభాలు గడిస్తారు. చిల్లులున్న పడవలు, చవకబారు వస్త్రాలు – మేజోళ్లు తదితరాల్ని తయారు చేసే కొందరు అధిక ధరలకు విక్రయించుకుంటారు. మనలాంటి సాధారణ ప్రజానీకం ఈ భారాన్ని మోయవలసి ఉంటుంది. తన తప్పేమీలేని స్పానిష్ కార్మిక సోదరుల్ని మనం ద్వేషానికి గురిచేస్తాం. అయితే వాస్తవానికి పాపం వాళ్ల తప్పిదాలేమీ ఉండవు."

సోషలిస్టులు యుద్ధాన్ని వ్యతిరేకించారు. యూదుల దినపత్రిక 'ఫార్వర్డ్'ను మాత్రమే ఇందుకు మినహాయింపుగా చెప్పవచ్చు. కార్మికుల్ని వారి నిజమైన ప్రయోజనాల నుండి పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం క్యూబా స్వేచ్ఛ అంశాన్ని ఒక సాకుగా చూపి సమరోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నానని సోషలిస్ట్ లేబర్ పార్టీ పత్రిక 'ద పీపుల్' పేర్కొన్నది. ప్రజలు తమదైనందిన సమస్యల గురించి ఆందోళనలు చేపట్టకుండా పాలకులు వేసే ఎత్తుగడ ఇదని మరో సామ్యవాద పత్రిక 'ద అప్పీల్ ఫర్ రీజన్' వ్యాఖ్యానించింది. "కొద్ది మంది నాయకులు రెచ్చగొట్టగా ఈ దేశానికి చెందిన పేద కార్మికులు స్పెయిన్ బీద శ్రామికుల్ని చంపేందుకు లేదా గాయపర్చేందుకు వెళ్ళాల్సి రావటం ఘోరమైన విషయమని 'శాన్ ఫ్రాన్సిస్కో వాయిస్ ఆఫ్ లేబర్' పత్రికలో ఒక సోషలిస్టు రచయిత అభివర్ణించారు.

అయితే యుద్ధాన్ని ప్రకటించిన తర్వాత "అత్యధికశాతం కార్మిక సంఘాలు ఇందుకు తమ మద్దతును ప్రకటించాయని" ఫోనర్ వివరించారు. "యుద్ధం చేయటం సరైన – ఘనమైన చర్య"ని శామ్యూల్ గోంపర్స్ ప్రకటించారు. "2 లక్షల 50 వేల మంది కార్మిక సంఘ సభ్యులు సైన్యంలో చేరేందుకు ముందుకొచ్చారని" ఆయన పేర్కొన్నారు. యుద్ధం వల్లనే బొగ్గుకు అధిక ధర పలుకుతున్నదని యునైటెడ్ మైన్ వర్కర్స్ తెలిపింది. గత కొద్ది సంవత్సరాల్లో బొగ్గు, ఇనుము వ్యాపారాల పరిస్థితి ఏనాడూ ఇప్పుడంత ఆరోగ్యకరంగా ఉండి ఉండలేదని ఈ సంఘం సంతోషాన్ని ప్రకటించింది. సమరం వల్ల ఎక్కువ మందికి కొత్తగా ఉద్యోగాలు లభించాయి. వారి జీతాలు పెరిగాయి. "ప్రజల రోజువారి జీవన అవసరాలకు ఖర్చు పెరిగింది. ఆదాయపు పన్ను లేనందున, యుద్ధ కారణంగా పెరిగిన అధిక ధరల భారం పేదలపైనే ఎక్కువగా పడింది. పంచదార, మొలాసిస్, పొగాకు తదితర వస్తువులపైన ప్రభుత్వం యుద్ధం పేరిట పన్నుల్ని పెంచింద"ని ఫోనర్ వాపోయారు.

గోంపర్స్ బహిరంగంగా యుద్ధాన్ని సమర్థించారు. అయితే అంతరంగికంగా మాట్లాడుతూ దీనివల్ల కార్మిక కొనుగోలు శక్తి 20 శాతం తగ్గిందని పేర్కొన్నారు. 1898 మేడే నాడు సోషలిస్టు లేబర్ పార్టీ న్యూయార్క్ నగరాన యుద్ధ వ్యతిరేక ప్రదర్శన చేయాలని తలపెట్టింది. అయితే అధికారులు దీనికి అనుమతించలేదు. అయితే యూదు కార్మికులను యుద్ధానికి మద్దతు తెలుపమని కోరుతూ ఫార్వర్డ్ పత్రిక మే దినోత్సవ ర్యాలీని నిర్వహించేందుకు సర్కారు సరేనన్నది.

"యుద్ధానికి అయ్యే వ్యయాన్ని పేద ప్రజానీకం భరిస్తున్నది. సంపన్నులేమో సంగ్రామం వల్ల లాభాలు దండుకుంటున్నా"రని, చికాగో లేబర్ వరల్డ్ పత్రిక వ్యాఖ్యానించింది. ప్రతిసారీ ధనవంతులిలాగే లబ్దిపొందుతుంటారని ఈ పత్రిక పేర్కొంది.

వెస్టర్న్ లేబర్ యూనియన్ సాల్ట్‌లేక్ సిటీనందు 1898 మే 10వ తేదీన ఆవిర్భవించింది. ఎ.ఎఫ్.ఎల్. నిపుణత లేని కార్మికుల్ని విస్మరిస్తున్నందువల్ల ఇది ఏర్పాటైంది. వృత్తి, జాతి, వర్గం, మతాలకు అతీతంగా శ్రామికులందర్నీ సంఘటితం చేయటమే తమ లక్ష్యమని వెస్టర్న్ లేబర్ యూనియన్ ప్రకటించింది. "కార్మికుల శ్రమను దోపిడీ గావిస్తున్న కార్పొరేషన్లు, ట్రస్టులకు చమరగీతాన్ని పాడటమే తమ సంకల్ప"మని వాగ్దానం చేసింది. "ఆకలితో అలమటిస్తున్న క్యూబా వాసులకు ఉపశమనం కల్పించేందుకే యుద్ధానికి దిగినట్లు పాలకులు తొలుత నమ్మబలికారు. అయితే హవాయిని కలుపుకోవటం ద్వారా ప్రభుత్వ దురాక్రమణ దాహం బట్టబయలైంద"ని సంఘం పత్రిక పేర్కొన్నది.

ఎన్‌సైక్లోపేడియా ఆఫ్ అమెరికన్ హిస్టరీలో రిచార్డ్ మోరిస్ ఇచ్చిన ఈ వివరాల్ని చూడండి:

"స్పానిష్ – అమెరికన్ యుద్ధాన మొత్తం రెండు లక్షల 74 వేల మంది పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 5462 మంది మరణించారు. ఇందులో యుద్ధం వల్ల మృతులు 379 మంది మాత్రమే కాగా మిగిలిన వారు వ్యాధులు, ఇతర కారణాల వల్ల అసువులు బాసారు.

వాల్టర్ మిల్లర్ రాసిన 'ద మార్షల్ స్పిరిట్' గ్రంథాన కూడ ఇవే గణాంకాలు ఇచ్చారు. అయితే సైనికులకు పంపిణీ అయిన విషతుల్య మాంసం గురించి వాటిల్లో ప్రస్తావించలేదు. చికాగోకు చెందిన ఆర్మోర్ అండ్ కంపెనీ 1898 మే నెలలో సైన్యానికి అయిదు లక్షల పౌన్ల గొడ్డు మాంసాన్ని విక్రయించింది. వాస్తవానికి లివర్‌పూల్‌కు ఏడాది క్రితం పంపగా అక్కడి నుండి తిరిగి వచ్చిన నిల్వ సరుకిది. ఈ మాంసం నమూనాల్ని సంబంధిత శాఖ ప్రభుత్వ ఇన్స్‌పెక్టర్ తనిఖీ చేయగా 751 కుళ్లిన సరకు నమూనాల్ని కనుగొన్నారు. తొలి 60 పెట్టెల్ని తెరవగా వీటిల్లో 14 డబ్బాలు పగిలి ఉన్నట్లు తేలింది. స్పెయిన్ సంగ్రామాన యుద్ధశాఖ వ్యవహార సరళిని పరిశోధించిన కమిషన్ 1900 సంవత్సరంలో సెనెట్‌కు సమర్పించిన నివేదికలో ఈ వివరాలున్నాయి. ఈ విధమైన పరిస్థితులున్నందు వల్లనే వేలాది మంది సైనికులు కలుషిత ఆహారాన్ని తిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. యుద్ధగాయాల వల్ల కాకుండా అయిదు వేల మందికి పైగా సైనికులు మరణించిన విషయాన్ని పైన చెప్పుకున్నాం. వీరిలో విషాహారం కారణంగా మృతులెంత మందో వివరించే గణాంకాలు అందుబాటులో లేవు.

స్పానిష్ సైనికుల్ని అమెరికన్లు మూడు నెలల్లో ఓడించారు. అమెరికన్ విదేశాంగ శాఖ మంత్రి జాన్ హే దీన్ని 'స్వల్పకాలాన లభించిన అద్భుత' విజయంగా పేర్కొన్నారు. ఏ యుద్ధంలోనైనా లొంగిపోయిన వారు – విజేతల మధ్యన ఒప్పంద పత్రంపైన సంతకాలు జరుగుతాయి. అయితే స్పెయిన్ సైనికాధికారులకే ఇందులో పాత్ర కల్పించారు. క్యూబా విప్లవకారులెవ్వరికీ ఇందులో ప్రమేయం కల్పించలేదు. అసలు క్యూబన్ విప్లవకారులనే వారెవ్వరూ లేనేలేనన్నట్లు అమెరికన్ సైనికాధికారులు ప్రవర్తించారు. సాయుధ విప్లవ కారులెవ్వరూ రాజధాని సాంటియాగోలోనికి ప్రవేశించరాదని జనరల్ విలియం షాఫర్, క్యూబన్ తిరుగుబాటు నేత జనరల్ కాలిక్స్‌టో గార్షియాతో పేర్కొన్నారు.

సాంటియాగో మున్సిపల్ ఆఫీసులకు బాధ్యులుగా పాత స్పానిష్ పౌర అధికారులే వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. క్యూబన్‌లకు ఈ జవాబుదారీ అప్పగించారన్న మాట.

యుద్ధాన క్యూబన్ విప్లవకారుల పాత్రను అమెరికన్ చరిత్రకారులు దాదాపుగా విస్మరించారు. ఫిలిఫ్ ఫోనర్ తన చరిత్ర గ్రంథాన తొలిసారిగా గార్షియా నిరసన లేఖను ప్రచురించారు. "యుద్ధాన్ని విరమించి శాంతి నెలకొల్పటం, స్పానియార్డుల లొంగుబాటు తదితర ఏఒక్క విషయంపైన జరిగిన చర్చకు సంబంధించిన సమాచారాన్ని నాకు తెలియజేయలేదు.

ఇక అధికారుల నియామకాల దగ్గరకొచ్చేసరికే వీరెవ్వరినీ క్యూబా ప్రజలు ఎన్నుకోలేదు. క్యూబా రాణి ఎంపిక చేసిన పాత వారే మళ్ళీ పీఠాలనలంకరించార"ని ఆయన రాశారు. స్పెయిన్ వాసుల పైన ప్రతీకారాలు–హత్యాకాండలు జరుగుతాయని భయపడి నా సైన్యాన్ని సాంటియాగో రానీయకుండా నిషేధం విధించినట్లు చెప్తున్నారు. ఇలాంటి భావనను వ్యక్తపరచినందుకు నేను నా వ్యతిరేకతను ప్రకటిస్తున్నాను. మేము యుద్ధ నియమాల్ని విస్మరించి ప్రవర్తించే అనాగరికులం కాము. చింపిరి దుస్తులతో, అలసి సొలసిన సైన్యం మాది. మహోన్నతమైన అమెరికన్ స్వాతంత్ర్య పోరాట కాలాన అప్పటి మీ మహామహుల సైన్యం వలెనే నేడు మాది కూడా బీద, బక్కచిక్కిన సైన్యమే. అందువల్ల మేమేమీ ఆటవికుల్లా ప్రవర్తించే వారమే కాదన్న విషయాన్ని మీరు గుర్తించాలి."

క్యూబాకు అమెరికన్ సైన్యంతో పాటుగా యు.ఎస్. పెట్టుబడి కూడా వచ్చిందని ఫోనర్ వ్రాశారు. "క్యూబా నందు స్పానిష్ పతాకం అవనతం కాకమునుపే అమెరికన్ వాణిజ్య వర్గాలు తమ ఆధిపత్యాన్ని అక్కడ ప్రదర్శించటం మొదలుపెట్టాయి. వేలాది మంది వ్యాపారులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, స్టాక్ మార్కెట్ స్పెక్యులేటర్లు, మిమ్మల్ని సంపన్నుల్ని గావిస్తున్నామంటూ రకరకాల పథకాల్ని చేపట్టిన వాళ్ళు క్యూబాను ముంచెత్తారు. హవానా రైల్వే స్టేషన్లో వివిధ వుత్పత్తుల్ని అమ్ముకునే హక్కుల కోసమై ఏడు బృందాలు పోటీ పడ్డాయి.

చివరికి న్యూయార్క్ వాల్ స్ట్రీట్‌కు ప్రాతినిధ్యం వహించే పెర్సివల్ ఫార్కుహర్ ఈ హక్కుల్ని గెలుచుకున్నారు. ఈ విధంగా అమెరికన్ సైనిక దురాక్రమణతో పాటుగా ఏకకాలాన్నే వాణిజ్య ఆక్రమణకూడా ప్రారంభమైందన్న మాట".

"క్యూబానుండి స్పెయిన్ తప్పుకోగానే అమెరికన్ కలప పరిశ్రమ ఈ దీవిలోకి అడుగుపెట్టాల"ని 'లంబర్‌మెన్స్ రివ్యూ' పత్రిక యుద్ధం జరుగుతుండగానే రాసింది. క్యూబాలో కోటి ఎకరాల విస్తరణతో కూడిన అటవీప్రాంతం ఉన్నది. ఈ కలపనంతా అమెరికాకు తెచ్చుకుని బ్రహ్మాండమైన లాభాల్ని గడించవచ్చు".

రైల్వేలు, గనులు, పంచదార వాణిజ్యం వంటి వాటినన్నింటినీ సంగ్రామం ముగియగానే అమెరికన్ వ్యాపారులు ఒక్కటొక్కటిగా కబళించసాగారు. కొద్ది సంవత్సరాల్లోనే క్యూబాలో 30 మిలియన్ డాలర్ల అమెరికన్ పెట్టుబడి వచ్చి పడింది. క్యూబా చక్కెర రంగంలోనికి యునైటెడ్ ఫ్రూట్ సంస్థ అడుగుపెట్టింది. ఎకరం 20 సెంట్ల చొప్పున 19 లక్షల ఎకరాల భూమిని ఈ సంస్థ కొనేసింది. అమెరికన్ పొగాకు కంపెనీ కూడా ఇదే విధంగా వచ్చి చేరింది. ఆక్రమణ పూర్తయ్యేనాటికి అంటే 1901 కల్లా 80 శాతం క్యూబా ఖనిజాల ఎగుమతి అధికారం అమెరికన్ల చేతుల్లోనే ఉన్నదని ఫోనర్ అంచనా వేశారు. ఇందులో అధిక శాతం బెత్లహేం స్టీల్ అధీనంలో ఉన్నది.

సైనిక దురాక్రమణ సమయాన క్యూబాలో వరుస సమ్మెలు జరిగాయి. 1899 సెప్టెంబర్ నెలలో 8 గంటల పనిని కోరుతూ హవానా నందు వేలాది మంది కార్మికులు ఉద్యమించారు. పెట్టుబడిదారులు కార్మికుల మధ్యన సంఘర్షణను ప్రేరేపించటమే తమ లక్ష్యమని వారు ప్రకటించారు. పాత పద్ధతిలో పూర్తిగా అణిగి మణిగి ఉండేందుకు క్యూబా కార్మికుడు ఇక ఏమాత్రమూ సహించే పరిస్థితిలో లేడని వీరు నినదించారు. సమ్మెలో ఉన్న ఏడుగురు కార్మిక నాయకుల్ని అరెస్టు చేయాల్సిందిగా అమెరికన్ జనరల్ విలియమ్ లుడ్లో హవానా మేయరును ఆదేశించారు. అలాగే రైలు ప్రధాన రహదార్లు, నౌకా కేంద్రాల్ని ఆక్రమించుకోవల్సిందిగా సైన్యాన్ని కోరారు. హవానా నగరాన జరుగుతున్న సమావేశాల్ని పోలీసులు విచ్ఛిన్నపరచారు. ఇంతటి దమనకాండ జరిగినప్పటికీ సమ్మె విజయవంతమైంది. నగర ఆర్థిక కార్యకలాపాల్నే కాదు నగర జీవనమే స్తంభించిపోయింది. పొగాకు కార్మికులు, ముద్రణా రంగ శ్రామికులు, బ్యాంక్ ఉద్యోగులూ ఇలా అన్ని రంగాలకూ చెందిన కష్టజీవులూ ఆందోళనలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పాలకులు వందలాది మంది సమ్మెకారుల్ని ఖైదు చేశారు. ఉద్యమాన్ని విరమించవలసిందిగా ఒత్తిడి చేస్తూ జైలులో ఉన్న కొంతమంది నాయకుల పైన క్రౌర్యాన్ని ప్రదర్శించారు.

అమెరికా వెనువెంటనే క్యూబాను తనలో విలీనం చేసుకోలేదు. అయితే 1901 ఫిబ్రవరి నెలలో కాంగ్రెస్ ఆమోదించిన ప్లాట్ సవరణను నూతన క్యూబా రాజ్యాంగాన చేర్చిందాకా యు.ఎస్. సైన్యం క్యూబాను వదలి వెళ్లదని క్యూబా రాజ్యాంగ సభకు స్పష్టం చేసింది. ఈ సవరణ ప్రకారం క్యూబా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించేందుకు అవసరమైతే తాను జోక్యం చేసుకునేందుకు అమెరికాకు హక్కు ఉంటుంది. ప్రజల ప్రాణాలు, ఆస్థి, వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడే బాధ్యతను అక్కడి ప్రభుత్వం స్వీకరించాల్సి ఉంటుంది. అలాగే కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో బొగ్గు గనులు, నావికా ప్రాంతాల్ని పొంది ఉండేందుకు అమెరికన్ సర్కారుకు ప్లాట్ సవరణ ఈ అవకాశాన్ని ఇస్తున్నది.

టెల్లర్ సవరణ, యుద్ధాన్నికి పూర్వమూ,యుద్ధ సమయాన క్యూబాకు స్వేచ్ఛ పేరిట వినిపించిన మాటల్ని బట్టి క్యూబాకు సిసలైన స్వాతంత్ర్యం లభించగలదని అందరూ ఆశించారు. అటువంటి నేపథ్యాన ప్లాట్ సవరణను చూసేసరికే ప్రగతిశీల కార్మిక పక్ష పత్రికలే కాకుండా దేశంలోని అన్ని వార్తాపత్రికలు, బృందాలు కూడా ఈ పరిణామాన్ని నమ్మకద్రోహంగా పరిగణించాయి. బోస్టన్‌లో జరిగిన అమెరికన్ సామ్రాజ్య వాద వ్యతిరేక వేదిక సమావేశం ఈ పోకడను తీవ్రంగా ఖండించింది. ఈ సమావేశాన మాజీ గవర్నర్ జార్జ్ బౌట్‌వెల్ ప్రసంగిస్తూ "క్యూబాకు స్వేచ్ఛ – సార్వభౌమత్వాన్ని మనం వాగ్దానం చేశాం. అందుకు భిన్నంగా వలసవాద బానిసత్వాన్ని ఈ దీవిపైన రుద్దుతున్నా"మని విమర్శించారు.

హవానాలో రాజ్యాంగ నిర్మాణ మహాసభ వేదిక వద్దకు 15 వేల మంది క్యూబన్లు కాగడాలతో ప్రదర్శన జరిపారు. ప్లాట్ సవరణను తిరస్కరించవలసిందిగా వీరు కోరారు. "క్యూబా ప్రజలు సాధారణంగానే అన్ని తరహాల ఆందోళనలకు మద్దతు ప్రకటిస్తుంటా"రని దీన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆక్రమిత సేనల ముఖ్య అధికారి జనరల్ లియోనార్డ్ వుడ్ అమెరికన్ అధ్యక్షుడు మెకన్లేకి హామీ ఇచ్చారు.

రాజ్యాంగాన ప్లాట్ సవరణను చేర్చాలన్న అమెరికన్ ఒత్తిడికి సమాధానమిచ్చేందుకు రాజ్యాంగ నిర్ణాయక సభ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ బృందం రూపొందించిన నివేదికకు ఒక నల్లజాతి ప్రతినిధి అక్షరరూపం ఇచ్చారు.

"క్యూబా స్వాతంత్ర్యానికి భంగం వాటిల్లినప్పుడు తాను జోక్యం చేసుకునే అధికారాన్ని అట్టిపెట్టుకోవాలని అమెరికా సంకల్పించింది. క్యూబా స్వేచ్ఛకు ఎప్పుడూ ప్రమాదం ఏర్పడిందో యు.ఎస్. నిర్ణయించుకుంటుందట. అప్పుడు తత్ పరిరక్షణ పేరిట సైనిక చర్యకు దిగుతుందన్న మాట. అంటే మన ఇంటి తాళం చెవుల్ని తన వద్ద అట్టే పెట్టుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు అది దుర్బుద్ధితోనైనా, సద్బుద్దితోనైనా వాళ్లు లోనికి చొరబడ్తారన్నమాట".

అంటే "అమెరికా మద్దతు దయాదాక్షిణ్యాలతోనే క్యూబా ప్రభుత్వాలు మనుగడ సాగించగలవు. అలాంటి సర్కార్లు క్యూబా ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా అమెరికా ఆశీర్వాదాల నిమిత్తమే పరిపాలన చేస్తాయన్నమాట".

అలాగే బొగ్గగనులు, నావికా స్థావరాల్ని కల్గివుండే అధికారాన్ని కల్గివుండాలన్న యు.ఎస్. ఆకాంక్షను నివేదిక తప్పుబట్టింది. ఇది మన మాతృదేశ స్వతంత్ర్యతను దెబ్బతీయటానికేనని అభివర్ణించింది.

"మన గడ్డను సైనికంగా ఆక్రమించేశారు. మన దేశం ఇంకా పూర్తి స్థాయి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోలేదు. ప్రజలు ఇంకా స్వేచ్ఛా వాయువుల్ని పీల్చేవాతావరణం ఏర్పడలేదు. అమెరికన్లు మన మిత్రులవలె నటిస్తూ ఇక్కడికి చొరబడ్డారు. మన స్వంత ప్రభుత్వం ఇంకా ఏర్పడలేదు. అంటే మనల్ని సంప్రదించకుండానే క్యూబా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే హక్కులు అధికారాల్ని అమెరికా కోరుకుంటున్నదన్నమాట. ఇలాంటి పోకడను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు".

క్యూబా రాజ్యాంగ నిర్ణాయక సభ ప్లాట్ సవరణను పూర్తిగా తిరస్కరించింది. అయితే అమెరికా, ఆక్రమిత సైనికాధికారులు ప్లాట్ సవరణను ఒప్పుకోవల్సిందిగా ఒత్తిడిని పెంచారు. ఈ పనిచేసేవరకూ స్వంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోనీయకుండా బెదిరించసాగారు. ఈ వ్యవహారమిలా 3 నెలల పాటు కొనసాగింది. రాజ్యాంగ నిర్ణాయక సభ అనేకసార్లు దాన్ని వ్యతిరేకించింది. అయితే చివరికి తల ఒగ్గింది. ప్లాట్ సవరణను ఆమోదిస్తూ రాజ్యాంగ సభ తీర్మానించింది. జనరల్ లియొనార్డ్ వుడ్ అనంతరమూ థియోడర్ రూజ్‌వెల్ట్ కొక లేఖ వ్రాశారు. "ప్లాట్ సవరణ ప్రకారం ఇక క్యూబాకు స్వేచ్ఛ అనేది ఒట్టి మాటే" నంటూ అందులో పేర్కొన్నారు.

అమెరికా ఈ విధంగా క్యూబాను తన అదుపాజ్ఞలలోకి తెచ్చుకున్నది.

# 3

# యుద్ధమా - దేశ ఆర్థిక ఆరోగ్యమా!

"దేశ ఆర్థికాభివృద్ధికి యుద్ధం దోహదపడ్తుంది అంటున్నారు రచయిత రాండాల్ఫ్ బౌర్న్. మొదటి ప్రపంచ యుద్ధ సమయాన ఆయనీ వ్యాఖ్యానం చేశారు. నిజమే. 1914వ సంవత్సరాన ఐరోపా దేశాలు యుద్ధాన్ని ప్రారంభించాయి. ఈ కాలాన ప్రభుత్వాలు వర్ధిల్లాయి. దేశభక్తి విరాజిల్లింది. వర్గ పోరాటాలు స్థంభించాయి. కేవలం కొన్ని అడుగుల భూమి కోసం యువకులు యుద్ధరంగాన పెద్ద సంఖ్యలో అసువులు బాసారు.

అమెరికా ఇంకా యుద్ధంలోకి అడుగిడలేదు. దేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. దేశాన వర్గ పోరాటాలు ఉధృతమవుతున్నాయి. అది 1916వ సంవత్సరం వేసవికాలం. శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరాన పెరేడ్‌కు ముందస్తు పూర్వాభ్యాసం జరుగుతుండగా బాంబు పేలి తొమ్మిది మంది మరణించారు. ఈ కేసులో ఇద్దరు వామపక్ష కార్యకర్తలు టాంమూనీ, వారెన్ బిల్లింగ్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు వారికి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఈ సంఘటన జరిగిన అనంతరం న్యూయార్క్ సెనేటర్ జేమ్స్ వర్డ్స్‌వర్త్ ఒక సూచనను చేశారు. "దేశంలో పురుషులందరికీ సైనిక శిక్షణ గరపాలి. అప్పుడే వీళ్లను వర్గాలుగా విడిపోకుండా కాపాడుకోగలుగుతాం. మన యువకులకు ఈ విధంగానైనా దేశం పట్ల తమ బాధ్యత తెలిసివస్తుంద"ని ఆయన వ్యాఖ్యానించారు.

ఇటువంటి బాధ్యతను తీసుకున్న యువత అందుకు ఎటువంటి మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందో యూరప్‌ను చూస్తే మనకు అర్థమౌతున్నది. ఇక్కడి యుద్ధాన 10 మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మిలియన్ల మంది సంగ్రామ భూమిలో ఆకలి, వ్యాధుల బారిన పడి కన్ను మూసారు. ప్రాణానికి మనం విలువ కట్టలేము.

ఈ యుద్ధం కారణంగా మానవాళికి తగినంత మేలు జరిగిందని ఇప్పటి వరకూ ఎవ్వరూ నిర్ద్వందంగా నిరూపించలేకపోయారు. సామ్యవాదులు, దీన్ని "సామ్రాజ్య వాదయుద్ధం"గా పేర్కొన్నారు. అయితే ఈ వాదనకు తగినంత పసలేదు. అభివృద్ధి చెందిన ఐరోపా పెట్టుబడిదారీ దేశాలు, సరిహద్దులు, వలసలు ప్రాబల్యాల్ని పెంచుకునేందుకు మాత్రమే పోరాటానికి దిగాయి.

20వ శతాబ్ది ఆరంభమైన అనతికాలాన్నే యుద్ధం వచ్చింది. ప్రగతి – ఆధునీకరణాల పేరిట పాశ్చాత్య రాజ్యాల ఉన్నత వర్గాలు ఆనందోత్సాహాలు ప్రకటిస్తున్న సమయమిది. ఇంగ్లాండ్ సంగ్రామాన్ని ప్రకటించి ఒక రోజు గడిచాక హెన్రీ జేమ్స్ మిత్రుడొకరికి లేఖ రాశారు. "చీకటి రక్తపాతం అనంతరం ప్రపంచం మెరుగైన స్థితికి చేరుకుంటుంది. నాగరికత ప్రగతి బాటన పడుతుంద"ని ఆయన పేర్కొన్నారు. మాన్‌లో జరిగిన తొలి పోరాటాన బ్రిటిష్–ఫ్రెంచ్ సేనలు జర్మన్లను పారిస్ వైపు పురోగమించ నీయకుండా అడ్డుకున్నాయి. ఈ యుద్ధాన ఇరుపక్షాలకు చెందిన ఐదు లక్షల మంది అసువులు బాసారు. 1914 ఆగష్టు నాటికి బ్రిటిష్ సైన్యంలో చేరాలంటే ఎవరైనా 5 అడుగుల 8 అంగుళాల ఎత్తు ఉండవలసి ఉంటుంది. అక్టోబర్ నాటికి ఈ ప్రమాణాన్ని 5 అడుగుల 5 అంగుళాలకు దించారు. ఇదే నెలలో 30 వేల మంది బ్రిటిష్ సైనికులు చనిపోయారు. దీంతో సైన్యాన చేరేందుకు 5 అడుగుల 3 అంగుళాలు ఉంటే చాలని ప్రభుత్వం ప్రకటించింది. సంగ్రామం మొదలై 3 నెలలు గడిచేసరికి ఆరంభం నాటి బ్రిటిష్ సైన్యం మొత్తం తుడిచి పెట్టుకుపోయింది.

మూడేళ్లపాటు ఇరు వర్గాల సైన్యము ఫ్రాన్స్ వద్ద దాదాపు నిలకడగానే వున్నది. ఒక పక్షం వైరి వర్గాన్ని వెనక్కు నెట్టడం–మళ్ళీ ముందుకు–మళ్ళీ వెనక్కు ఈ విధంగా పరిస్థితి కొనసాగింది. కేవలం కొద్ది అడుగులు, లేదా మైళ్లు ఇలా జరుగుతూ సాగింది. ఈ మధ్యలో శవాల గుట్టలు పెరిగిపోనారంభించాయి. లీడన్ దాటి ముందుకెళ్లాలని జర్మన్లు ప్రయత్నించారు. దీనికి ప్రతిగా బ్రిటిష్–ఫ్రెంచ్ సైనికులు సైన్ నదికి ఇరువైపులా మోహరించి ప్రతీకార దాడులు జరిపారు. ఈ సంగ్రామాన వీరు కొన్ని మైళ్ళ దూరం ముందుకు సాగగలిగారు. పర్యవసానంగా ఆరు లక్షల మంది సైనికులు మృతి చెందారు. రాజు గారి యార్క్ షైర్ దళం ఒక రోజు 800 మందితో దాడిని నిర్వహించింది. 24 గంటల అనంతరం వీరిలో 84 మంది మాత్రమే మిగిలి ఉన్నారు.

ఒక పక్కన ఇంతటి రక్తసిక్తమైన యుద్ధం కొనసాగుతుండగా ఆరు దేశాల పత్రికలు ప్రజలకు ఏమిచెప్తున్నాయి? "బ్రిటిష్ ప్రజలకు ఈ దారుణ మారణకాండల గురించి అసలేమీ తెలీదు. అంతేకాదు మనం విజయాలు పొందుతున్నామని పత్రికలు పేర్కొన్నాయి". జర్మనీలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉన్నది. ఎరిక్ మరియు రిమార్కో తన నవలలో పేర్కొన్నట్లు ఒకవంక మరతుపాకులకు వేలాది మంది బలవుతుంటే ప్రభుత్వం అధికారికంగా "పశ్చిమ గడ్డపైన అంతా ప్రశాంతంగా ఉన్నట్లు" ప్రకటించసాగింది.

ఇంగ్లీష్ సైనికులను కందకాలు దాటి జర్మన్ సైన్యం వైపుగా ముందుకు కదలాలని 1916 జూలై నెలలో జనరల్ డగ్లస్ హేగ్ ఆదేశించారు. వెన్వెంటనే జర్మన్ సైనికులు మర తుపాకులతో కాల్పులు ప్రారంభించారు. ఈ దాడిలో లక్షా 10 వేల మంది బ్రిటిష్ సైనికులు పాల్గొన్నారు. వారిలో 20 వేల మంది మరణించగా మరో 40 వేల మంది గాయాలపాలయ్యారు.

ఇరు పక్షాలు తవ్వుకున్న కందకాల నడుమ మృతదేహాలు చెల్లా చెదరుగా పడిఉన్నాయి. ఎక్కడ చూసినా గాయపడిన వారి మూల్గులు వినిపించసాగాయి. మొత్తంగా ఆ దృశ్యమే ఎంతో భయానకంగా ఉన్నది. 1917 జనవరి ఒకటిన హేగ్‌కు ప్రభుత్వం ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించింది. ఆ వేసవిలో ఏం జరిగిందో విలియం లాంగర్ తన 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ వరల్డ్ హిస్టరీ' పుస్తకాన ఇలా వివరించారు.

లాయిడ్ జార్జి వ్యతిరేకించినా, కొందరు కిందిస్థాయి అధికారులు నివారించినా ఖాతరు చేయకుండా హేగ్ తన సైన్యాన్ని దుందుడుకుగా దూకించారు. ఇప్రె వద్ద జోరుగా వర్షాలు కురుస్తుండగా నీటి మడుగు లేర్పడ్డాయి. ఇటువంటి వాతావరణాన జరిగిన హోరాహోరీ యుద్ధం ఫలితంగా అయిదుమైళ్ల భూమిని బ్రిటీష్ వారు గెల్చుకున్నారు. అందుకు ప్రతిగా మాత్రం నాల్గు లక్షల మంది సైనికుల్ని ఇంగ్లాండు కోల్పోయింది.

ఫ్రెంచ్, బ్రిటిష్ ప్రజలకు తమ సైనికులు పెద్ద ఎత్తున ఈ స్థాయిలో మరణించారన్న వాస్తవాన్ని ఆయా ప్రభుత్వాలు చెప్పకుండా దాచిపెట్టాయి. యుద్ధం ఆఖరి సంవత్సరాన సోమ్ వద్ద జర్మన్లు ప్రత్యర్థులపైన తీవ్రమైన దాడిని చేశారు. ఈ సంఘటనలో మూడు లక్షల మంది బ్రిటిష్ సైనికులు మరణించటమో, గాయపడటమో జరిగింది. ఈ సమయాన లండన్ వార్తా పత్రికలు ఏమని రాశాయో పాల్ ఫుస్సెల్ 'దగ్రేట్ వార్ అండ్ మోడ్రన్ మెమరి' గ్రంథాన ఉటంకించారు.

**నేనేం చేయగలను?**

ఈ సంక్షోభ తరుణాన పౌరులేం చేయాలి.

ఉల్లాసంగా ఉండండి....

యుద్ధభూమిలోని మిత్రుల్ని ప్రోత్సహిస్తూ లేఖలు రాయండి.

వదరుబోతుల మాటల్ని ప్రచారం చేయకండి.

వదంతుల్ని అస్సలు పట్టించుకోకండి.

హేగ్ కంటే మీకెక్కువ తెలుసునని భ్రమపడకండి.

ఇలా సైనికులు మరణించటాలూ, ప్రభుత్వాలు వాటిని కప్పెట్టటాల నేపథ్యాన 1917 వసంతరుతువులో అమెరికా రంగ ప్రవేశం చేసింది. ఈ తరుణాన ఫ్రెంచి సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి. మొత్తం 112 డివిజన్లకు గాను అరవై ఎనిమిదింటిలో ఇటువంటి ఘటనలు సంభవించాయి. ఉన్నతాధికారుల ఆజ్ఞల్ని ధిక్కరించినందుకు 629 మందిని విచారించగా వారిలో 50 మందికి మరణశిక్షను అమలుచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో అమెరికా దళాల ఆవశ్యకత ఏర్పడిందన్న మాట.

సంగ్రామాన తటస్థ వైఖరిని అవలంబిస్తామని యు.ఎస్. అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ ప్రకటించారు. శత్రువులకు సామాగ్రిని తీసుకు వస్తున్న ఎటువంటి ఓడలనైనా తమ

జలాంతర్గాములు సముద్రంలో ముంచేస్తాయని జర్మన్లు 1917 ఏప్రిల్ నెలలో ప్రకటించారు. ఈ విధంగా అనేక పడవల్ని ధ్వంసం చేసినట్లు వారు చెప్పుకున్నారు. దీనికి ఉడ్రోవిల్సన్ స్పందించారు. యుద్ధ ప్రాంతాన సైతం వర్తకపు ఓడల్లో ప్రయాణించే హక్కు అమెరికన్లకు ఉన్నదని ఆయన ప్రకటించారు. ఈ హక్కును తాము వినియోగించుకుంటామన్నారు. ఎవరైనా దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

అమెరికా తాను చేయాలనుకున్న దాన్ని ఆచరణలో పెట్టేందుకు హేతుబద్ధత పేరిట ఇటువంటి వాదనలు చేస్తుంటుందని రిచర్డ్ హాఫ్ స్టాడ్‌టర్ (ద అమెరికన్ పొలిటికల్ ట్రెడిషన్) వ్యాఖ్యానించారు. సముద్రపు జలాల్లో యు.ఎస్. ప్రయాణీకుల హక్కులకు బ్రిటన్ కూడా పలుసార్లు గండికొట్టే చర్యలకు పాల్పడింది. అయినప్పటికీ ఇంగ్లాండ్‌పైన విల్సన్ ఏనాడూ యుద్ధాన్ని ప్రకటించలేదు. "చట్టబద్ధత ద్వారా కాకుండా ఆర్థిక ప్రయోజనాలు, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవలసిన అవసరాల ఆధారంగానే ఉడ్రోవిల్సన్ ఈ తరహా విధాన ప్రకటన చేశార"ని హాఫ్ స్టాడ్‌టర్ వ్యాఖ్యానించారు.

అమెరికాను తటస్థ దేశంగా జర్మనీ ఏనాడూ భావించలేదు. ఎందుకంటే దాని శత్రువులకు ఓడలద్వారా యు.ఎస్. యుద్ధసామాగ్రిని సరఫరా చేస్తూనే ఉన్నది. 1915న బ్రిటిష్ ఓడ లుసితానియా పైన ఒక జర్మన్ జలాంతర్గమి దాడి చేసింది. ఈ దెబ్బకు బ్రిటీష్ నౌక 18 నిమిషాల్లో మునిగిపోయింది. ఈ సంఘటనలో 124 మంది అమెరికన్లతో సహా మొత్తం 1198 మంది మృతిచెందారు. లుసితానియా యుద్ధనౌక కాదని ఈ రీత్యా దాన్ని ధ్వంసం చేయటం తీవ్ర అకృత్యమని అమెరికా వ్యాఖ్యానించింది. అయితే వాస్తవానికి ఈ నౌక నిండా యుద్ధ సామాగ్రే ఉన్నది. ఈ వాస్తవాన్ని బ్రిటీష్, అమెరికన్ ప్రభుత్వాలు దాచిపెట్టాయి. ఈ ఓడ స్వభావాన్ని గురించి అబద్దాలు వల్లెవేశాయి.

దేశ ఆర్థిక పరిస్థితులే అమెరికన్ యుద్ధ విధానాల్ని ప్రభావితం చేశాయని హాఫ్‌స్టాడ్‌టర్ రాశాడు. 1914న అమెరికా తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్నది. ఆనాటి వాతావరణాన్ని జె.పి.మోర్గాన్ సంస్థ ఇలా అభివర్ణించింది. "వ్యాపారాలు ఈ కాలాన సంక్షోభంలో ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు ధరలు విపరీతంగా పడిపోయాయి. భారీ పరిశ్రమలు తమ సామర్థ్యానికి అత్యంత తక్కువగా మాత్రమే సరకుల ఉత్పత్తులు చేస్తున్నాయి. బ్యాంకుల లావాదేవీలు విపరీతంగా తగ్గిపోయాయి. నిరుద్యోగం బాగా పెరిగింది." "అయితే మిత్రపక్షాల (ముఖ్యంగా ఇంగ్లాండు) 1915న యుద్ధ పరికరాల కోసం విజ్ఞాపనలు పెరగటంతో ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. 1917 ఏప్రిల్ కల్లా మిత్రపక్షాలకు అమెరికా 2 బిలియన్ డాలర్ల విలువైన సరుకుల్ని విక్రయించింది. "ఈ విధంగా యుద్ధమూ దాని ద్వారా వచ్చిపడే సంపదల వల్ల అమెరికా సంగ్రామాన మిత్రుల పక్షాన దుమకవలసి వచ్చిందని హాఫ్‌స్టాడ్‌టర్ వ్యాఖ్యానించారు.

విదేశీ మార్కెట్లను చేజిక్కించుకోవటం ద్వారానే అమెరికాను సుసంపన్నం చేయగలమని ఇక్కడి నాయకులు నమ్ముతారు. 1897వ సంవత్సరాన యు.ఎస్. విదేశీ ప్రైవేటు పెట్టుబడుల మొత్తం 700 మిలియన్ డాలర్లుగా ఉండేది. 1914 నాటికిది 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.

అప్పటి విదేశాంగశాఖ మంత్రి విలియం జెన్నింగ్స్ బ్రైయాన్ సంగ్రామంలో యు.ఎస్. తటస్థంగా ఉంటే మంచిదని భావించే వ్యక్తి. అయితే ఈయన కూడా అమెరికాకు విదేశీ మార్కెట్లు అవసరమని భావిస్తున్నారు. అందువల్లనే ఆయన అమెరికన్ పెట్టుబడులు - వ్యాపారాలకు అవరోధంగా ఉన్న అడ్డంకుల్ని తొలగింపజేసే అధ్యక్షుడి చొరవను 1914న అభినందిస్తూ ఒక ప్రకటనను జారీ చేశారు.

తమ విదేశీ వాణిజ్య ప్రయోజనాల్ని పరిరక్షించుకునేందుకు అవసరమైతే ఎదురు తిరిగే దేశాలకు తగిన విధంగా బుద్ధిచెప్పాలని అంతకు పూర్వం 1907లోనే అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ అభిభాషించారు. కొలంబియా విశ్వ విద్యాలయాన ఉపన్యసిస్తూ "మన ఆర్థికవేత్తలకు లభించిన రాయితీల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకోవాల్సిందే" అన్నారు. 1912న జరిగిన సభల్లో ఉపన్యసిస్తూ "దేశీయ మార్కెట్లు మనకు ఏమాత్రమూ సరిపోవు. అందువల్ల విదేశీ మార్కెట్లు తప్పనిసర"న్నారు. బ్రైరాన్‌కు పంపిన ఒక అంతర్గత మెమోలో "ప్రపంచ మంతా మనకు ఆర్థిక ద్వారాలు తెరవాలి. ఈ దిశలో పనిచేయటమే తమ లక్ష్య"మని పేర్కొన్నారు. "అంతర్జాతీయ మార్కెట్లను ఆక్రమించటం న్యాయబద్ధమే"నన్న సూత్రీకరణను సమర్థిస్తున్నట్లు 1914న ఆయన ప్రకటించారు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలాన అమెరికన్ సరకులకు ఇంగ్లాండు మంచి మార్కెట్‌గా తయారైంది. అట్లాగే యు.ఎస్. బ్యాంకులకు బ్రిటన్ అప్పులు తీసుకునే పెద్ద ఖాతాదారైంది. మిత్రపక్షాలకు రుణాల మంజూరీ వ్యవహారాల్ని అమెరికన్ కంపెనీ జె.పి. మోర్గాన్ చూసుకునేది. ప్రైవేటు బ్యాంకులు మిత్రపక్షాలకు అప్పులు ఇవ్వటంపైన ఉన్న నిషేధాన్ని విల్సన్ 1915న ఎత్తేశారు. మోర్గాన్ సంస్థ ఈ విధంగా పెద్ద మొత్తంలో రుణాల్ని సమకూర్చజేసి భారీగా లాభాల్ని గడించింది. ఈ విధంగా జర్మనీపైన బ్రిటన్ విజయం సాధించేందుకు అమెరికన్ ఆర్థిక సంస్థల ఊతం ఎంతగానో ఉపయోగపడింది. జె.పి. మోర్గాన్ ఆర్థిక కార్యకలాపాలు అమెరికన్ ప్రజలందరికీ ప్రయోజనాల్ని తెచ్చిపెట్టినట్లుగా రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు మాట్లాడటం ప్రారంభించారు. నిజమే. యుద్ధం వల్ల ఉత్పత్తులు పెరిగాయి. ఉద్యోగిత ఇనుమడించింది. యు.ఎస్. స్టీల్ సంస్థలు ఒక్క 1916వ సంవత్సరంలోనే యుద్ధ పరికరాల తయారీల కారణంగా 348 మిలియన్ డాలర్ల లాభాల్ని గడించాయి. మరి ఇదే రంగాన పనిచేస్తున్న కార్మికులకు ఇదే స్థాయిలో ప్రయోజనాలు సిద్ధించాయా? లేదని ఇట్టే సమాధానం చెప్పవచ్చును. అమెరికా యుద్ధంలోకి అడుగుపెట్టాక ఆర్థికవ్యవస్థ మొత్తమూ సంపన్నుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. పెట్టుబడిదారు - వడ్డీ వ్యాపారి అయిన బెర్నాడ్ బారూచ్ వార్ ఇండస్ట్రియల్ బోర్డ్ అధిపతిగా నియమితులయ్యారు. సంగ్రామ సమయాన ఏర్పాటు చేసిన వాటిల్లోనే అత్యంత శక్తివంతమైన సంస్థ ఇది. ఈ తరహా ఏజన్సీలన్నింటిలోనూ బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాతలే ప్రముఖ భూమిక నిర్వహించారు.

మొదటి ప్రపంచ యుద్ధ స్వభావం పైన మంచి వ్యాసమొకటి 1915మే నెల అట్లాంటిక్ మంత్లీ సంచికలో ప్రచురితమైంది. "యుద్ధమూ దాని ఆఫ్రికా మూలాలు" శీర్షికన డబ్ల్యు.ఇ.బి. డుబోయిస్ దీన్ని రచించారు. ఈ యుద్ధం జర్మనీ, మిత్రపక్షాల మధ్యన సామ్రాజ్యాధిపత్యం కోసమే జరుగుతున్నది. ఆఫ్రికా ఖండం 20వ శతాబ్దపు బంగారుగని. దక్షిణాఫ్రికాలో బంగారు

– వజ్రాల గనులున్నాయి. అంగోలా –నైజీరియాల్లో కోకో, కాంగో నందు ఏనుగు దంతాలు – రబ్బరు, పశ్చిమ తీరప్రాంతాలు పామ్ ఆయిల్‌కు ప్రసిద్ధి.

సామ్రాజ్యవాదం పైన లెనిన్ విశ్లేషణకు ముందే డుబోయిస్ ఈ వ్యాసాన్ని రచించారు. ఇందులో ఆయన సామ్రాజ్యవాద శక్తుల పోకడల్ని విశదీకరించే ప్రయత్నం చేశారు. సామ్రాజ్యవాద దేశం ఇతర దేశాల్ని కొల్లగొట్టి తద్వారా వచ్చిన సొత్తులో కార్మికవర్గానికి కూడా కొద్దిపాటి భాగాన్ని ఇవ్వచూపుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. "అమెరికాలో ప్రజాస్వామ్యం పుష్కలంగానే ఉన్నది. మరో పక్కన ప్రభువర్గ మొకటి పెరిగిపోతున్నది. ఇదే సమయాన నల్లజాతుల వారి పట్ల ద్వేషం అధికమవుతున్నది. నల్లజాతుల వారిని అణగదొక్కి మీరు లాభాలు పొందండంటూ శ్వేతజాతి కార్మికవర్గాన్ని కులీనవర్గం ప్రోత్సహిస్తున్నది. అమెరికా ప్రజాస్వామ్య సరళి వైపరీత్యమిద"ని డుబోయిస్ పేర్కొన్నాడు. నిజమే ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా సగటు పౌరుడి జీవన ప్రమాణాలు గతానికంటే మెరుగయ్యాయి. "అయితే ఈ సంపదంతా ఎక్కడి నుండి వచ్చింది? .... ఆసియా, ఆఫ్రికా, దక్షిణ మధ్య అమెరికా, వెస్టిండీస్, దక్షిణ సముద్ర దీవుల నుండే ఈ సొత్తంతా పైన పేర్కొన్న దేశాలకు చేరింది."

వర్గ సంఘర్షణ బద్దలవ్వకుండా చూసేందుకు పెట్టుబడిదారీ విధానం దోపిడీ పీడిత వర్గాల మధ్యన అతి చతురతతో రక్షిత మార్గాల్ని ఏర్పరుస్తుందని డుబోయిస్ పేర్కొన్నారు. "ప్రపంచాన్ని ఇప్పుడు బడా వ్యాపారులో, కులీనులో, పెట్టుబడిదారులో మాత్రమే దోపిడీ చేస్తున్నారనుకుంటే పొరపాటే. పెట్టుబడి కార్మికవర్గమూ కలగలసిన ప్రజాస్వామిక రాజ్యమిప్పుడు విశ్వాన్ని కొల్లగొడ్తున్నది."

డుబోయిస్ పేర్కొన్న లక్షణాలన్నీ అమెరికాకు సరిగ్గా అతుకుతాయి. యు.ఎస్. పెట్టుబడిదారీ వర్గానికి ఎల్లప్పుడూ అంతర్జాతీయంగా దేశాల మధ్య స్పర్ధలు–యుద్ధాలూ జరుగుతుండటమంటే ఇష్టం. అప్పుడే స్వదేశాన సంపన్నులు–పేదల మధ్యన సమైక్యతను కృత్రిమంగా సృష్టం చేసేందుకు వీలు కలుగుతుంది. తరచూ పేదలంతా ఐక్యంగా నిర్వహిస్తున్న పోరాటాల్ని ఈ విధంగా పక్కదారి పట్టించవచ్చునన్నమాట. పెట్టుబడిదారులూ – రాజకీయ నాయకులూ చైతన్యంతో ఈ విధంగా చేస్తున్నారని మనం భావించవచ్చునా? దీన్ని తెలుసుకోవటం కష్టమే. తెలిసీ తెలియని జ్ఞానంతో గానీ, లేదా వ్యక్తిగత మనుగడ కోసం గానీ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని మనం భావించవచ్చును. యుద్ధంలోకి దిగటానికి 1917వ సంవత్సరాన జాతీయ ఏకాభిప్రాయ సాధనకు జరిగిన కృషి ఇటువంటి దోపిడీ కోసమేననేది సుస్పష్టం.

సాంప్రదాయిక చరిత్రకారుల ప్రకారం ప్రభుత్వం త్వరగానే ఏకాభిప్రాయ సాధనలో సఫలమైంది. "అధ్యక్షుడూ–ప్రజాభిప్రాయాన్ని బట్టి అమెరికా విధానాలుంటాయ"ని ఉడ్రోవిల్సన్ జీవిత చరిత్రకారుడు ఆర్థర్‌లింక్ రాశారు. అయితే వాస్తవానికి ప్రజలేం భావిస్తున్నారో తెలుసుకొనేందుకు ఆ కాలాన కొలబద్దలేమీ లేవు. జనం యుద్ధాన్ని ఆకాంక్షిస్తున్నారనేందుకు ఎటువంటి సాక్ష్యాలూ కనపడవు. అందువల్లనే ప్రభుత్వం ఏకాభిప్రాయాన్ని మలచేందుకు పెద్ద యజ్ఞమే చేయాల్సి వచ్చింది. సంగ్రామానికి అవసరమైన యువకుల్ని సమకూర్చేందుకు సర్కారు బలవంతంగా వారిని సైన్యంలోకి చేర్పించింది. అందుకు తిరస్కరించిన వారికి కఠిన శిక్షల్ని విధించింది. "ఇక నుండి యుద్ధాలే జరగకుండా చూసేందుకూ, ప్రపంచాన

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకూ", అమెరికా సంగ్రామంలోకి దిగాల్సివచ్చినట్లు ఉడ్రోవిల్సన్ ప్రకటించారు. ఇటువంటి నినాదాలతో ప్రజల్ని ఉత్తేజపర్చేందుకు ఆయన ప్రయత్నించారు. అయినప్పటికీ సైన్యంలో చేరేందుకు ప్రజలు బారులు తీరలేదు. యుద్ధప్రకటన వెలువడిన ఆరు వారాల తర్వాత కూడా 10 లక్షల మంది అవసరమైతే సైన్యంలోకి వచ్చేందుకు కేవలం 73 వేల మంది తమ సంసిద్ధతను ప్రకటించారు. ప్రపంచ యుద్ధంలో అమెరికా పాల్గొనేందుకు ఉద్దేశించిన తీర్మానానికి కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుల నుండి బ్రహ్మాండమైన మద్దతు లభించింది. యుద్ధ ప్రచార నాయకునిగా ప్రముఖ పాత్రికేయుడు జార్జ్ క్రేవ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన ఇందుకోసం ఒక ప్రజా సంబంధాల కమిటీని ఏర్పాటు చేశారు. అమెరికా యుద్ధంలోకి దిగటమే సబబని ప్రజల్ని నమ్మించటమే దీని పని. ఇందు నిమిత్తం కమిటీ 75వేల ఉపన్యాసకుల్ని నియమించి వారి ద్వారా దేశవ్యాప్తంగా అయిదు వేల పట్టణాలు, నగరాల్లో ఏడు లక్షల 50 వేల సభల్ని నిర్వహింపజేసింది. అయిష్టంగా ఉన్న ప్రజల్ని యుద్ధ అనుకూలురుగా రెచ్చగొట్టటమే ఈ మహాయజ్ఞ లక్ష్యమన్న మాట.

... ... ...

అమెరికన్ పార్లమెంటు 1917న 'గూఢచారిత్వ చట్టాన్ని'ఆమోదించింది. అధ్యక్షుడు విల్సన్ వెంటనే దీనిపైన సంతకం చేశారు. "అమెరికా యుద్ధం చేస్తున్నప్పుడు ఎవరన్నా సరే సైన్యంలో చేరేందుకు నిరాకరించినా పనిచేసేందుకు అంగీకరించిన వారిని అడ్డుకున్నా 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష విధించవచ్చు. ప్రభుత్వాన్ని ధిక్కరించినా, తిరుగుబాటు చేసినా, దేశద్రోహానికి పాల్పడినా అలాంటి వ్యక్తులకు ఇదే స్థాయిలో శిక్షలు వేయవచ్చు." ఇదీ గూఢచారిత్వ చట్టంలోని ఒక ముఖ్యాంశం. "అయితే ప్రభుత్వ విధానాలపై చర్చ, వ్యాఖ్యానాలు, విమర్శల్ని నిరోధించటం దీని ఉద్దేశం కాదు'ని, ఇదే శాసనంలోని మరో ప్రకరణం పేర్కొంటున్నది. అమెరికన్ ప్రభుత్వ అసలు ఉద్దేశాలు, రాజ్య స్వభావమూ తెలిసిన వారికి ఈ చట్టం లక్ష్యమేమిటో ఇట్టే తెలిసిపోతుంది. గూఢచారిత్వ చట్టాన్ని రెండు నాల్కల ధోరణిలో రూపొందించినప్పటికీ యుద్ధానికి వ్యతిరేకంగా ఎవరైనా రాసినా – మాట్లాడినా వారిని జైలు పాలు చెయ్యటమే ప్రభుత్వ సంకల్పమనేది సుస్పష్టం. గూఢచారి వ్యతిరేక శాసననం వచ్చిన రెండు నెలలకు ప్రభుత్వం చార్లెస్ షెంక్ అనే సోషలిస్టును అరెస్టు చేసింది. నిర్బంధంగా సైన్యంలో చేరాలన్న చట్టాన్ని, అసలు అమెరికా యుద్ధరంగంలోకి దిగటాన్నే వ్యతిరేకిస్తూ ఈయన 15 వేల కరపత్రాల్ని ముద్రించి ప్రజలకు వాటిని పంపిణీ చేశారు. తప్పని సరిగా సైన్యంలో పేరు నమోదు చేయించుకోవాలన్న నిబంధన అమెరికన్ రాజ్యాంగం 13వ సవరణకు వ్యతిరేకంగా ఉన్నదని ఇందులో ఆయన వివరించారు. "మానవత్వానికే అపచారమైన ఈ చర్య వాస్తవానికి వాల్‌స్ట్రీట్ ఫైనాన్షియర్లకు మాత్రమే లాభదాయకమైనది, సర్కారు దమననీతికి లొంగిపోకండ"ని ఆయన ప్రజానీకాన్ని కోరారు. 'గూఢచారిత్వ వ్యతిరేక చట్టం' క్రింద ఈయనకు కోర్టు ఆర్నెల్లు జైలుశిక్ష విధించింది. (ఆ తర్వాత ఇదే చట్టం కింద నిర్బంధించిన వారికి న్యాయస్థానం మరింత కఠినమైన శిక్షల్ని విధించింది). అమెరికన్ రాజ్యాంగ తొలి సవరణ ప్రకారం ప్రజల పత్రికల భావ ప్రకటనా స్వేచ్ఛను దెబ్బతీస్తూ పార్లమెంటు ఎటువంటి చట్టాన్ని ఆమోదించరాదు. ఈ అంశాన్ని పేర్కొంటూ షెంక్ తనకు విధించిన శిక్షకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

కింది కోర్టు వేసిన శిక్షను సుప్రీం కోర్టు కూడా సమర్థించింది. షెంక్ అప్పీలునుఅది కొట్టివేసింది. ఉదారవాదిగా పేరొందిన ప్రముఖ న్యాయమూర్తి ఓలివర్ వెండెల్ హోమ్స్ ఈ తీర్పును రాశారు. కరపత్రంలో పేర్కొన్న అంశాల్ని విశ్లేషిస్తూ సైనికుల్ని చేర్చుకొనే ప్రక్రియను నష్టపరిచే విధంగా దీన్ని రాశారని తీర్పులో పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రథమ సవరణ కింద షెంక్‌కు రక్షణ లభిస్తుందా? ఈ ప్రశ్నకు హోమ్స్ సమాధానం చెప్పారు.

"థియేటర్లో కూర్చొని మంటలు రేగాయంటూ లేనిది ఉన్నట్లుగా కేకలు వేసి జనాన్ని భయపెట్టటాన్ని వాక్ స్వాతంత్ర్యం కింద పరిగణించలేం. ఈ తరహాలో ప్రజల్ని మోసపుచ్చే చర్యల్ని నిరోధించే హక్కు పార్లమెంటుకు ఉన్నది." హోమ్స్ చాలా తెలివైన వాదన చేశారు. అయితే జాగ్రత్తగా ఆలోచిస్తే యుద్ధాన్ని విమర్శించటాన్ని పై తరహా కట్టుకథతో పోల్చడం హేతుబద్ధమైన వాదనకాదని ఇట్టే అర్థమైపోతుంది. హార్వర్డ్ లాస్కూల్ ప్రొఫెసర్ జకరయ్యచాఫి షెంక్ కేసుకు సరిపడే పోలికను 'అమెరికాలో వాక్ స్వాతంత్ర్యం' అన్న రచనలో ఉటంకించారు. థియేటర్లో నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక అంకం ముగిసి మరొకటి ప్రారంభం కానున్నది. ఈ విరామ సమయాన షెంక్ లేచినిలబడి ఈ థియేటర్లో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం గనుక సంభవిస్తే పారిపోయేందుకు తగినన్ని దారులు లేవంటూ ప్రేక్షకుల్ని హెచ్చరించారు. ఇందులో తప్పేముందని' ఆయన షెంక్‌ను సమర్థించారు.

ఇతరుల జీవితాలకు – స్వేచ్ఛకు ప్రమాదకారి అయినప్పుడు మాత్రమే వాక్ స్వాతంత్ర్యానికి పరిమితులు విధించవచ్చు. మరి ఈ రకంగా చూసినప్పుడు అసలు యుద్ధమే ప్రమాదకారి కదా. ప్రమాదకారే కాదు వినాశనకారి కూడా. అలాంటప్పుడు సంగ్రామాన్ని వ్యతిరేకించే హక్కు పౌరులకు ఉంటుంది కదా. పాలకులు అనుసరిస్తున్న ఇలాంటి ప్రమాదకర విధానాల పట్ల జాగరూకత వహించాల్సిందిగా హెచ్చరించటం కారణమెలా అవుతుంది?

సుప్రీం కోర్టు పచ్చజెండా ఊపటంతో 'గూఢచారిత్వ చట్టం' మొదటి ప్రపంచ యద్ధ కాలం నుండీ అలాగే కొనసాగుతున్నది. యుద్ధ సమయాన్నే దీన్ని ఉపయోగించాల్సి ఉన్నది. అయినప్పటికీ 1950ల నుండి ప్రభుత్వం నిత్యమూ ఈ చట్టాన్ని ఉపయోగిస్తున్నది. కొరియన్ యుద్ధం నుండీ అమెరికా "అత్యవసర పరిస్థితిని" ఎదుర్కొంటున్నదని అందువల్ల ఈ శాసనం ఎల్లకాలమూ చెల్లుతుందని ప్రభుత్వం ప్రకటించుకున్నది. ప్రవాస అమెరికన్లకు కూడా దీన్ని వర్తింపజేసేందుకు 1963వ సంవత్సరాన కెన్నడీ సర్కారు విఫలయత్నం చేసింది. వియత్నాంలో పనిచేస్తున్న జర్నలిస్టులు "డెబ్స్ ఆయన ప్రభుత్వం గురించి విమర్శనాత్మక రచనలు చేస్తున్నారని భావించి అమెరికన్ ప్రభుత్వం ఈ పనికి ప్రయత్నించిందన్న మాట.

యుజినిడెబ్స్ కేసు ఆ తర్వాత సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. 1918 జూన్ నెలలో డెబ్స్ జైల్లో ఉన్న ముగ్గురు సోషలిస్టుల్ని సందర్శించారు. సైన్యంలో తప్పని సరిగా చేరాలన్న చట్టాన్ని విమర్శించినందుకు వీళ్లని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పరామర్శించి బయటికు వచ్చాక కారాగారం వెలుపల డెబ్స్ బహిరంగ సభను నిర్వహించాడు. స్వతహాగా డెబ్ మంచి వక్త. ఈయన ఉపన్యాసం రెండు గంటల పాటు సాగింది. డెబ్స్ ప్రతి మాటకు చప్పట్లు, నవ్వులు వెల్లివిరిశాయి, డెబ్స్ ఆనాటి గొప్ప ఉపన్యాసకర్తల్లో ఒకరుగా ప్రసిద్ధిగాంచారు. "ఆ మధ్య బాలకార్మిక చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా 5–4 ఓటుతో న్యాయమూర్తులు

తీర్పుచెప్పారు. మతిమాలిన తీర్పిది. ఇలా ఎందుకు జరిగిందం'టూ ప్రశ్నించాడు డెబ్స్. జైల్లో ఉన్న కామ్రేడ్స్ గురించి ఆయన ప్రస్తావించాడు. సోషలిస్టులు జర్మన్ అనుకూలురన్న అపవాదు పైన వివరణ ఇచ్చాడు. "నేను ధనికవర్గాన్ని, కులీనుల్ని అసహ్యించుకుంటాను. వాళ్ళను నేను లక్ష్యపెట్టను. అంతేకాదు ద్వేషిస్తాను. జర్మనీకి చెందిన ప్రభు వర్గీయులంటే నాకేమీ ఆపేక్షలేదు. అలాగే మనదేశానికి చెందిన కులీనులపైన కూడా". (విపరీతమైన చప్పట్లు, అభినందనలు).

మనది విశిష్టమైన స్వేచ్ఛాయుత రిపబ్లిక్ అనీ మన వ్యవస్థలు ప్రజాస్వామికమైనవని, మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని, మనల్ని మనమే పరిపాలించుకుంటామని చెప్తుంటారు. ఇవన్నీ హాస్యాస్పదమైన మాటలే. మనల్ని గురించి అతిగా చెప్పుకోవటమంటే ఇదే. చరిత్రలో యుద్ధాలన్నీ దోపిడీకోసమూ, దురాక్రమణ నిమిత్తమే సంభవించాయి. సంగ్రామ మంటే ఇందుకేనన్న మాట. పాలకవర్గాలు యుద్ధాన్ని ప్రకటిస్తాయి. అయితే పాలితులే ఎల్లప్పుడూ పోరాటాల్లో పాలుపంచుకొని ప్రాణాలర్పిస్తుంటారు. యుద్ధమంటే ఎప్పుడూ ఇలాగే జరుగుతుంటుంది....

గూఢచారిత్వ చట్టం కింద డెబ్స్‌ను ప్రభుత్వం అరెస్టు చేసింది. డెబ్స్ సభలో యువకులు పాల్గొన్నారు. ఈయన ఉపన్యాసం వారి మనసుల్ని కలుషితం చేసిందని అందువల్ల వాళ్ళు సైన్యంలో పేర్లు నమోదు చేయించుకునేందుకు తిరస్కరించే ప్రమాదమున్నదని అభియోగం మోపింది.

(నిజానికి డెబ్స్ భావాలు అంతకంటే మరింత శక్తివంతమైనవి).

"మనకు మంచిరోజులు రానున్నాయి. అమెరికాలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ మనం అధికారంలోకి రానున్నాం. మనుషుల్ని బానిసలుగా మార్చే – హీనంగా చూసే పెట్టుబడిదారీ సంస్థలన్నింటినీ మనం అప్పుడు విధ్వంసం గావిస్తాం. వీటిస్థానానే మానవీయ స్వేచ్ఛాయుత వ్యవస్థల్ని పునర్నిర్మిస్తాం. మన కళ్ళముందే ప్రతినిత్యమూ ప్రపంచం మారిపోతున్నది. పెట్టుబడిదారీ సూరీడు అస్తమించనున్నాడు. సామ్యవాద భానుడు ఉదయించబోతున్నాడు. ఒకానొక రోజు ఆసమయం వస్తుంది. సోషలిజం జయిస్తుంది..... అప్పుడు కార్మికవర్గానికి విముక్తిని ప్రకటిస్తాం. సర్వమానవాళి సహోదరత్వాన్ని ఎలుగెత్తి చాటుతాం" (మిన్నంటిన చప్పట్లు – సుదీర్ఘమైన హర్షధ్వానాలు).

కోర్టు విచారణ సందర్భంగా డెబ్స్ కేసునుండి బయటపడేందుకు ప్రతివాదమేమీ చేయలేదు. తన తరపున వాఙ్మూలమిచ్చేందుకు సాక్ష్యుల్ని పిలిపించేందుకు సైతం తిరస్కరించాడు. సభలో మాట్లాడిన విషయాల్ని తానలా అనలేదంటూ తప్పించుకునే ప్రయత్నమేమీ చేయలేదు. జ్యూరీ సభ్యులు ఈ కేసు గురించి చర్చించుకునే ముందు వారి నుద్దేశించి ఆయన మాట్లాడారు.

"యుద్ధాన్ని ఆటంకపరిచే ప్రయత్నం చేసినట్లు నాపైన అభియోగం మోపారు. నేను దాన్ని అంగీకరిస్తున్నాను. యుద్ధాన్ని నేను అసహ్యించుకుంటాను. ఏకాకిగానైనా సరే సంగ్రామాన్ని నేను వ్యతిరేకిస్తాను. ఎక్కడ ఉన్నవారైనా బాధిత ప్రజల పట్ల సానుభూతిని ప్రకటిస్తాను. ఎక్కడ జన్మించిన వారైనా, ఏ దేశస్థులైనా వారికి ఆ అండదండలందిస్తాను" అని ప్రకటించారు డెబ్స్.

జూరీ సభ్యులు డెబ్స్ గూఢచారిత్వచట్టాన్ని ఉల్లంఘించాడని తీర్మానించారు. తనకు శిక్షను ప్రకటించబోయే ముందు న్యాయమూర్తి నుద్దేశించి డెబ్స్ ఇలాగన్నారు.

"గౌరవ న్యాయమూర్తీ, ఈ భూప్రపంచం మీద నివశిస్తున్న మానవులందరితోనూ సౌభ్రాతృత్వాన్ని చాలా ఏళ్ళ క్రితం నేను ప్రకటించుకున్నాను. ఈ భూమ్మీద ఉన్న అతి సామాన్యుడితో మమేకం కావాలని తీర్మానించుకున్నాను. నీచవర్గం వారెవరైనా ఉంటే నేను ఆ కోవకు చెందిన వాడినేనని ఆనాడూ-ఈనాడూ చెప్పుకుంటున్నాను. వారిలో నేరస్థుడెవరైనా ఉంటే అందులో నేను ఉంటానని ఉద్ఘాటిస్తున్నాను. జైళ్ళలో ఒక్క మనిషైనా బందీగా ఉన్నట్లయితే నన్ను నేను స్వేచ్ఛాజీవినని పరిగణించుకోను."

ఈ మాటల్ని జడ్జి తప్పుపట్టారు. ఆత్మరక్షణ కోసమై క్రూరమైన విదేశీశక్తులతో మన దేశం యుద్ధానికి దిగింది. ఇలాంటి తరుణాన అమెరికా చేతిలో ఉన్న కరవాలాన్ని దెబ్బతీసే రీతిన డెబ్స్ ప్రసంగం సాగింద'ని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. డెబ్స్‌కు పదేళ్ళ జైలు శిక్షను విధిస్తూ ఆయన తీర్పు చెప్పారు.

1919 వరకూ సుప్రీంకోర్టు డెబ్స్ పెట్టుకున్న అప్పీలు పైన విచారణను జరపలేదు. యుద్ధం ముగిసింది. సుప్రీంకోర్టు అప్పుడే కేసునుచేపట్టింది. ధర్మస్థానం తరపున జెలివర్ వెండెల్ హోమ్స్ కోర్టు తీర్పును ప్రకటించారు. సుప్రీంకోర్టు డెబ్స్ పదేళ్ల శిక్షను సరైనదిగా అభివర్ణించింది. హోమ్స్-డెబ్స్‌లు పెట్టుబడిదారులు - శ్రామికవర్గాల మధ్యగల వైరుధ్యానికి ప్రతినిధులు. యువకుల్ని సైనికులుగా నియమించుకోవాలనే ప్రభుత్వ సంకల్పానికి డెబ్స్ ఉపన్యాసం అవరోధాన్ని కల్పించే విధంగా ఉన్నదని హోమ్స్ పేర్కొన్నారు.

తొలుత పశ్చిమ వర్జీనియా సంస్కరణ కారాగారంలో డెబ్స్‌ను ఉంచారు. ఆ తర్వాత అట్లాంటాకు మార్చారు. అక్కడీయన 32 నెలలు గడిపారు. 1921న అధ్యక్షుడు హార్డింగ్ డెబ్స్‌ను విడుదల చేశారు. అప్పుడాయన వయస్సు 66 సంవత్సరాలు.

1918 నవంబరులో యుద్ధం ముగిసింది. మొదటి ప్రపంచయుద్ధాన 50 వేల మంది అమెరికన్ సైనికులు మరణించారు. అనతి కాలంలోనే దేశభక్తులతో సహా ప్రభుత్వ తీరుపైన సర్వత్రా అసంతృప్తి - వ్యతిరేకత వెల్లువెత్తింది.

... ... ...

యుద్ధకాలాన పెద్ద సంఖ్యలో ప్రజల్ని జైళ్ళలో పెట్టారు. జాతీయ సమైక్యతను ఆటంక పరుస్తున్నారని ముద్రవేసి దమననీతిని ప్రదర్శించారు. అయినప్పటికీ యుద్ధం ముగియగానే పాలకవర్గానికి సామ్యవాద భయం పట్టుకున్నది. విప్లవకర శక్తుల నుండి వస్తున్న సవాళ్ళను దెబ్బతీసేందుకు సంస్కరణ-దమనకాండ అనే ద్వంద్వ నీతిని ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నది.

విల్సన్ స్నేహితుడైన జార్జి.ఎల్.రికార్డ్ 1919న తన మిత్రుడికి ఒక లేఖను రాశాడు. 'సోషలిజం ప్రమాదాన్ని నివారించేందుకు ఏదో ఒకటి చేయాలి. బోల్షివిక్కులు, సామ్యవాదుల కార్యక్రమానికి ప్రత్యామ్నాయాన్ని చూపిస్తే అమెరికాలోని ప్రగతిశీల శక్తులు నీకు జేజేలు

పలుకుతారు. ఇందుకోసం కొన్ని మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఆర్థిక ప్రజాస్వామీకరణకు నీవు నడుంకట్టాల”ని రికార్డ్ తన మిత్రుడికి సూచించారు.

రిపబ్లికన్లు, డెమాక్రాట్ల మధ్యన ఉన్న స్పర్థలు అంత ముఖ్యమైనవి కావని ఈ రెండు పార్టీలకూ కూడా ప్రమాదకరంగా పరిణమించగల శక్తులు వేరే ఉన్నాయని విల్సన్ సలహాదారు జోసఫ్ టుమాల్టి 1919న అధ్యక్షుడికి గుర్తుచేశారు.

“గతరాత్రి అటార్నీ జనరల్‌పైన జరిగిన హత్యాయత్నం దేశాన నెలకొన్న అశాంతికి దర్పణం పడ్తున్నది. ఒక డెమక్రాట్‌గా నేను రిపబ్లికన్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవటాన్ని జీర్ణించుకోలేను. అయితే ఇంత కన్నా తీవ్రమైన ప్రమాదం నన్నిప్పుడు మరింతగా కలచివేస్తున్నది. నేడిప్పుడొక ప్రభావితమైన ఉద్యమం చాపకింద నీరులాగా విస్తరిస్తున్నది. దాన్ని గనుక అడ్డుకోకపోతే మన కందరికీ ప్రమాదకరంగా పరిణమించనున్నది. పారిశ్రామిక – సామాజిక అశాంతి నెలకొని ఉన్న ఇప్పటి వాతావరణాన సగటు మనిషి మన రెండు పార్టీల పట్ల కూడా ఎంతో అసంతృప్తితో ఉన్నాడు...” అని అనాటి వాస్తవ పరిస్థితిని టుముల్టి విశ్లేషించారు.

‘గత రాత్రి వాషింగ్‌టన్లో’ ఏంజరిగింది? అటార్నీజనరల్ ఎ. మిట్చల్ పాల్మర్ ఇంటిముందు బాంబుపేలుడు సంభవించింది. ఈ సంఘటన జరిగిన ఆర్నెల్ల తర్వాత ప్రభుత్వం అమెరికన్ పౌరులు కాని ప్రవాసుల్ని అరెస్టు చేసింది. యు.ఎస్.కు ప్రవాసం వచ్చిన వారెవరైనా సర్కారు ఆస్థుల్ని ధ్వంసం చేసినా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన జరిపినా అలాంటి వారిని దేశం నుండి బహిష్కరించాల్సిందిగా యుద్ధం చివరి దశలో ఉన్న తరుణాన పార్లమెంటు చట్టాన్ని చేసింది. 1919 డిసెంబరు 21న ఎమ్మాగోల్డమెన్, అలెగ్జాండర్ బెర్క్‌మెన్‌లతో సహా మొత్తం 249 మంది రష్యన్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వీరందర్నీ రష్యాకు పంపించివేశారు. అమెరికన్ రాజ్యాంగం విదేశీయుల్ని దేశం నుండి వెళ్ళగొట్టే హక్కును పార్లమెంటుకు దాఖలు పర్చలేదు. అయితే 1892వ సంవత్సరాన చైనీయుల్ని బహిష్కరించినప్పుడు కాంగ్రెస్ చర్యను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. తనను తాను కాపాడుకొనేందుకు ప్రభుత్వానికుండే సహజమైన హక్కుగా ఈ చర్యను సుప్రీంకోర్టు అభివర్ణించింది.

1920వ సంవత్సరాన దేశవ్యాప్తంగా నాల్గువేల మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. సుదీర్ఘకాలం వారిని ఏకాంతంగా జైళ్ళలో బంధించింది. అనంతరం దేశ బహిష్కారం విధించింది. బోస్టన్లోని సమావేశ మందిరాలు, ఇళ్లపైన తెల్లవారు జామున దాడులు జరిపి ఆరువందల మందిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మొత్తం జరిగిన క్రమం ఫెడరల్ జడ్జిని సైతం కలచివేసింది.

“పోలీసులు దాడులు జరిపి ఆ విషయానికి పెద్ద స్థాయిలో ప్రచారాన్ని కల్పించారు. అరెస్టయిన వ్యక్తులు సమాజానికి ఎంతో ప్రమాదకారులైనట్లు చిత్రీకరించారు. నిజానికి వీరిలో చాలా మంది మామూలు కార్మికులే. గత కాలాన రష్యాలో వాళ్లు వ్యవసాయం చేసుకునేవారు. అలాంటి వారికి జంటగా సంకెళ్లు వేసి బంధించారు. ఆ తర్వాత రైలులో తరలించే పేరిట సామూహికంగా గొలుసులతో బంధించి వీధుల్లో తిప్పారు.

1920 వసంతరుతు కాలాన అరాచకవాది, ప్రెస్సులో అక్షరాలు కూర్చేవాడయిన ఆంద్రియా సాల్సెడోను న్యూయార్కులో ఎఫ్.బి.ఐ. ఏజంట్లు అరెస్టు చేశారు. ఎఫ్.బి.ఐ. కార్యాలయ భవనం 14వ అంతస్థులో అతడ్ని ఎనిమిది నెలల పాటు బంధించి ఉంచారు. ఈ తరుణాన సాల్సెడో మిత్రుడ్నిగానీ, న్యాయవాదుల్ని గాని అక్కడికి అనుమతించలేదు. ఆ తర్వాత సాల్సెడో మృతదేహం ఆ భవంతి కింద భాగాన చితికిపోయి కనిపించింది. 14వ అంతస్థు కిటికీ నుండి దూకి అతడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎఫ్.బి.ఐ. ప్రకటించింది.

సాల్సెడో మిత్రులైన బోస్టన్ ప్రాంతానికి చెందిన ఇద్దరు కార్మికులు (అరాచక వాదులు) ఈవార్త తెలిసిన వెంటనే తుపాకుల్ని చేతబూనారు. మసాచుసెట్స్ రాష్ట్రం బ్రోక్‌టన్లో కారులో తిరుగుతుండగా వీరిద్దర్నీ పోలీసులు అరెస్టు చేశారు. రెండు వారాల క్రితం ఒక చెప్పుల కర్మాగారంలో జరిగిన హత్య కేసును వీరిపైన పెట్టారు. వీరిద్దరి పేర్లు నికోలాసాకో, బార్టోలోమియో వాన్‌జెట్టి. వీరి కేసు ఏడేళ్ళపాటు కోర్టుల చుట్టూ తిరిగింది. కింది కోర్టు విధించిన శిక్షపైన వీరు ఉన్నత న్యాయస్థానానికి అప్పీలు చేసుకున్నారు. అమెరికా, ఇంకా ప్రపంచ వ్యాప్తంగా అనేకుల నుండి సాకో, వాన్‌జెట్టీలకు మద్దతు లభించింది. ఇద్దరికీ న్యాయస్థానం మరణశిక్షను విధించింది. విదేశీయులు, అరాచక వాదులు కాబట్టే వీరిరువురికీ మరణశిక్ష పడిందని కోర్టు విచారణ రికార్డులు – ప్రభుత్వ వాదనలను బట్టిచూస్తే అర్థమవుతున్నది. 1927 ఆగస్టులో నిరసన ప్రదర్శనలు – అరెస్టులు – ఖాకీల ప్రదర్శనల నడుమ సాకో, వాన్‌జెట్టీల మరణశిక్ష అమలైంది.

తన కుమారుడు దాంతెకు సాకో అతికష్టంగా నేర్చుకున్న ఇంగ్లీషులో తన చివరి సందేశాన్ని పంపాడు. తర్వాతి తరాలకు చెందిన లక్షలాది మందికి ఈ మాటలు ఉత్తేజాన్నిచ్చాయి.

"నాగురించి బాధపడి ఏడవకు ఆత్మస్థైర్యాన్ని కూడదీసుకో. అప్పుడే మీ అమ్మను నీవు ఓదార్చగలవు. వృక్షాలతో విలసిల్లే ప్రశాంత ప్రదేశాలకు ఆమెను నడుచుకుంటూ తీసుకెళ్లు. అయితే దాంతో ఒక్క విషయాన్ని గుర్తుంచుకో, నీ సంతోషాన్ని స్వార్థపూరితం కానివ్వకు. బాధితులు, రాజ్య హింసా పీడితులకు సహాయపడ్తూ ఉండు. ఎందుకంటే వాళ్ళే మనకు అత్యంత ఆప్తులు.

.... ఈ పోరు బాటలో మనకు ఆత్మతృప్తి మిగులుతుంది, అలాగే వీళ్లందరి ప్రేమ దక్కుతుంది. ప్రభుత్వం కొన్ని సంస్కరణల్ని అమలు చేసింది. యుద్ధం పేరు చెప్పి సర్కారు ప్రజల్లో దేశభక్తిని రెచ్చగొట్టింది. అవిధేయతను సహించబోమని హెచ్చరించేందుకు నిరసనకారుల్ని జైళ్లపాలు చేసింది. అయినప్పటికీ జనవాహిని భీతిల్లలేదు. అమెరికా అంతటా వర్గపోరాట హోరు నినదించింది. యు.ఎస్.ను వర్గరహిత సమాజమని చెప్తుంటారు. అలాంటి అమెరికా 1920–30 దశకాల్లో వర్గపోరాటాలతో దద్దరిల్లింది."

# 4

# కష్టకాలం - పేదల స్వయం సహాయం

**యు**ద్ధం అప్పుడే ముగిసింది. అది 1919వ సంవత్సరం ఫిబ్రవరి నెల. ఐ.డబ్ల్యు.డబ్ల్యు. నాయకత్వమంతా జైల్లో ఉన్నది. అయినప్పటికీ ఈ సంఘం పిలుపు మేరకు సియాటిల్‌లో అయిదురోజుల పాటు సార్వత్రిక సమ్మె జరిగింది. వాషింగ్‌టన్లో లక్షమంది కార్మికులు ఇందులో పాలుపంచుకున్నారు. దీంతో నగర జీవితం స్తంభించింది.

తొలుత 35 వేలమంది నౌకాశ్రయ సిబ్బంది తమ వేతనాల పెంపుదల కోరుతూ సమ్మెను ప్రారంభించారు. తమకు మద్దతు నీయవల్సిందిగా సియాటిల్ కేంద్ర కార్మిక కౌన్సిల్‌ను వీరు కోరారు. పట్టణమంతా సమ్మెను పాటించాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది. రెండువారాల్లోగా ప్రధానంగా అమెరికన్ కార్మిక సమాఖ్య (ఎ.ఎఫ్.ఎల్)కు చెందిన 110 కార్మిక యూనిట్లు సమ్మెకు సమ్మతి తెలిపారు. ఒక్కో స్థానిక యూనిట్ నుండి ముగ్గురు సభ్యుల్ని తీసుకొని సార్వత్రిక సమ్మె కమిటీని ఏర్పాటు చేశారు. 1919 ఫిబ్రవరి 6వ తేదీన ఉదయం పదిగంటలకు సమ్మె ప్రారంభమైంది.

కార్మికుల మధ్య ఐక్యత అంత సులభంగా సాధ్యపడలేదు. స్థానికంగా ఉన్న ఎ.ఎఫ్.ఎల్. ఐ.డబ్ల్యు.డబ్ల్యు.సభ్యుల మధ్యన స్పర్థలున్నాయి. ప్రవాస జపనీయ కార్మికుల్ని సార్వత్రిక సమ్మె కమిటీలో చేర్చుకున్నారు కానీ వారికి ఓటుహక్కు ఇవ్వలేదు. అయినప్పటికీ కార్మిక సంఘాల సభ్యులు 60 వేల మంది సమ్మెలో పాల్గొన్నారు. మరో 40 వేలమంది తమ సానుభూతిని ప్రకటించారు. మొదటి నుండీ సియాటిల్ కార్మికులకు ప్రగతిశీలకమైన చరిత్ర ఉన్నది. యుద్ధకాలన సియాటిల్ ఎ.ఎఫ్.ఎల్. అధ్యక్షుడ్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. యువకులు తప్పనిసరిగా సైన్యంలో చేరాలన్న నిబంధనకు వ్యతిరేకించినందువల్ల ఆయన్ని సర్కారు జైల్లో పెట్టి హింసించింది. సోషలిస్టు అయిన ఈయన అరెస్టుకు నిరసనగా సియాటిల్‌లో పలు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి.

సమ్మె ప్రభావానికి నగర జీవనమే స్తంభించిపోయింది. నిత్యావసర సేవలకు మాత్రం సమ్మె కారులు మినహాయింపు నిచ్చారు. ఉదాహరణకు అగ్నిమాపక దళసిబ్బంది పనులకు

హాజరయ్యారు. అలాగే లాండ్రీ కార్మికులు ఆసుపత్రి సేవల్ని మాత్రమే చేశారు. సమ్మె నుండి మినహాయింపు నిచ్చినట్లు సూచించే చిహ్నం ఉన్న వాహనాలను మాత్రమే రోడ్డుపైకి అనుమతించారు. నగరానికి చెందిన పలు ప్రాంతాల్లో 35 పాలకేంద్రాల్ని నెలకొల్పారు. పెద్ద వంటశాలల్లో రోజుకు 35 వేల భోజనాల్ని తయారుచేయించారు. వాటిని వివిధ కూడళ్ళకు తరలించి సమ్మె చేస్తున్న కార్మికులకు భోజనం 25 సెంట్లకు, అదే సామాన్య ప్రజలకైతే 35 సెంట్లకు అందజేశారు. కెఫిటేరియా తరహాలో దీన్ని ఏర్పాటు చేశారు. అంటే మాంసాహారం, రొట్టె సేమియా వంటి పదార్థాల్ని ఎవరికి ఏమి – ఎంత కావాలో తీసుకొని తినొచ్చన్నమాట.

నగర శాంతి భద్రతల పరిస్థితిని పర్యవేక్షించేందుకు రిటైర్డు సైనికులతో కూడిన బృందాన్నొకదాన్ని కార్మికసంఘం ఏర్పాటు చేసింది. ఈ దళం రూపొందించటానికి గల ఉద్దేశాన్ని తెలియజేస్తూ సమ్మె ప్రధాన కేంద్రాన గల నల్లబల్లపైన ఈ విధంగా రాశారు.

"నిర్బంధాన్ని ఉపయోగించకుండా శాంతి భద్రతల్ని కాపాడటమే ఈ బృందం ఆశయంగా ఉంటుంది, ఏ ఒక్క కార్యకర్త కూడా ఆయుధాన్ని ధరించడు. పోలీసు తరహా శక్తిని ప్రదర్శించడు. కేవలం ప్రజలకు నచ్చజెప్పడం ద్వారా మాత్రమే వీళ్లు తమ విధుల్ని నిర్వహిస్తారు." సమ్మె కాలాన నగరంలో నేరాలు చాలా తగ్గిపోయాయి. తన 40 ఏళ్ళ అనుభవంలో నగరం ఇంత ప్రశాంతంగా ఉండటాన్ని ఏనాడూ చూడలేదని సమ్మె సందర్భంగా ఇక్కడ నియమితులైన సైనికాధికారి పేర్కొనటం విశేషం.

... ... ...

వాషింగ్‌టన్ విశ్వవిద్యాలయానికి చెందిన 2400 మంది విద్యార్థుల్ని మేయర్ తాత్కాలిక ఉద్యోగులుగా వివిధ పనుల నిమిత్తం నియమించారు. అలాగే వెయ్యి మంది నౌకాశ్రయాల సిబ్బందిని ప్రభుత్వం నగరానికి తీసుకువచ్చింది. అయిదు రోజుల తర్వాత సార్వత్రిక సమ్మెకు తెరపడింది. అంతర్జాతీయ సంఘాల నాయకుల ఒత్తిడుల కారణంగా తాము సమ్మెను విరమించినట్లు సార్వత్రిక సమ్మెకమిటీ పేర్కొంది. అలాగే స్తంభించిపోయిన నగరాన నివశించటంలోని ఇబ్బందుల్ని కూడా పరిగణనలోకి తీసుకొని తామీ నిర్ణయాన్ని గైకొన్నట్లు తెలిపింది.

సమ్మె ప్రశాంతంగా జరిగింది. కానీ ఇది ముగిసిన వెంటనే పోలీసులు పలుచోట్ల దాడులు జరిపి, కార్యకర్తల్ని అరెస్టు చేశారు. సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం, ప్రింటింగ్ ప్రెస్‌లపైన ప్రభుత్వ భటులు దాడులు చేశారు. "ఈ అరాచకానికి మూల విరాట్టుల'ని పేర్కొంటూ 39 మంది ఐ.డబ్ల్యు.డబ్ల్యు. సభ్యుల్ని సర్కారు జైల్లో పెట్టింది.

వాషింగ్‌టన్ నగరం సెంట్రాలిమా ప్రాంతాన కలప పరిశ్రమ కార్మికుల్ని ఐ.డబ్ల్యు.డబ్ల్యు. సంఘటితం గావించింది. ఈ పరిశ్రమకు చెందిన పెద్దలు కూడబలుక్కొని ఐ.డబ్ల్యు.డబ్ల్యు.ను ఇక్కడి నుండి పారదోలాలని కుట్ర పన్నింది. అది నవంబరు 11వ తేదీ 1919వ సంవత్సరం ఆర్మిస్టయిస్ దినోత్సవం. (మొదటి ప్రపంచ యుద్ధం విరమింపజేసిన

సంధికి గుర్తుగా వార్షికోత్సవాన్ని పాటించే రోజు). అశ్విక దళంతో కూడిన బృందం మోకాళ్ల వరకు రబ్బరు బూట్లను ధరించి నగరాన కవాతు జరుపుతున్నది. వీరివద్ద గ్యాస్ పైపులు ఉన్నాయి. తమ మీద దాడి జరగనున్నదని ఊహించిన ఐ.డబ్ల్యు.డబ్ల్యు. అందుకోసం సంసిద్ధమై ఉన్నది. కవాతు ఐ.డబ్ల్యు.డబ్ల్యు. భవనాన్ని చేరుకున్న సమయాన తుపాకీ చప్పుళ్లు వినిపించాయి. ముందుగా ఎవరు కాల్చారో తెలియదు. అశ్వికదళ సభ్యులు హాల్లోను హఠాత్తుగా ముట్టడించి లోనికి చొచ్చుకుపోయారు. ఆ తర్వాత తుపాకీ కాల్పుల హోరు పెరిగింది. అనంతరం కవాతు బృందానికి చెందిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి.

ఆరోజు ఐ.డబ్ల్యు.డబ్ల్యు. కేంద్ర కార్యాలయాన వెస్లీ ఎవరెస్ట్ అనే కలప అడితిలో పనిచేసే కార్మికుడు ఉన్నాడు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారన్న ఆరోపణపైన ఐ.డబ్ల్యు.డబ్ల్యు. నాయకులు విచారణను ఎదుర్కొంటున్న సమయాన ఎవరెస్ట్ సైన్యంలో పనిచేస్తున్నాడు. ఎవరెస్ట్ సైన్యం యూనిఫారం ధరించి ఉన్నాడు. ఆయన చేతిలో తుపాకీ ఉన్నది. జనం వైపు ఎవరెస్ట్ కాల్పులు జరిపాడు. ఆ తర్వాత పారిపోతుంటే పలువురు అతన్ని చుట్టుముట్టారు. నదివైపునకు ఆయన పరుగులు తీశాడు. అప్పుడు నది నీళ్లతో ఉరకలు వేస్తున్నది. దీంతో దూకాలన్న ప్రయత్నాన్ని మానుకొని తనపైకి వస్తున్న ఒకడ్ని తుపాకీతో కాల్చిచంపాడు. ఆ తర్వాత ఆయుధాన్ని నదిలోకి విసిరేశాడు. గుంపుపైకి ముష్టిఘాతాలు కురిపించాడు. జనం ఎవరెస్ట్‌ను పట్టుకొని పట్టణంలోకి ఈడ్చుకొంటూ తీసుకొని వచ్చారు. ఆ తర్వాత జైల్లో బంధించారు. ఆ రాత్రి ఎవరో కారాగారం తలుపుల్ని విరగొట్టి ఎవరెస్ట్‌ను బయటికి లాక్కొచ్చారు. కారులో బ్రిడ్జివద్దకు తీసుకెళ్లి అక్కడ ఉరితీశారు. పోలీసు నివేదిక ప్రకారం ఎవరెస్ట్ మృతదేహంపైన ఒక బుల్లెట్ దూసుకెళ్లిన రంధ్రం కనిపిస్తున్నది.

ఎవరెస్ట్ హత్య కేసులో పోలీసులు ఎవర్నీ అరెస్ట్ చేయలేదు. అయితే కవాతుకు నాయకత్వం వహించిన ఒక సైనికాధికారిని చంపినందుకు స్థిరత్వం లేకుండా గాలికి తిరిగే 11 మందిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం వీరిలో ఆరుగురికి కోర్టు 16 ఏళ్ళ చొప్పున జైలుశిక్ష విధించింది.

సార్వత్రిక సమ్మె అంటే పాలకవర్గాలకు అంతకోపం ఎందుకొచ్చింది? ఎవర్నో ఒకర్ని పట్టుకొచ్చి కేసులు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? సియాటిల్ మేయర్ చేసిన ప్రకటనను గనుక పరిశీలిస్తే ప్రభుత్వానికి సమ్మె కన్నాకూడా దాని ఆశయం – లక్ష్యాల పట్లనే భయం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతున్నది.

“విప్లవం కోసం జరిగిన ఒక ప్రయత్నంలో భాగంగానే సియాటిల్ సమ్మెను పరిగణించాలి. ఈ సందర్భంగా హింస జరగలేదనేది ముఖ్యాంశం కాదు. తొలుత యు.ఎస్.ఎ.లోనూ ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగానూ ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వ్యవస్థను కూలదోయటమే తమ లక్ష్యమని సమ్మెకారులు బహిరంగంగా ప్రకటించారు. నిజమే కార్మికులు తుపాకులు పట్టలేదు. బాంబులు విసరలేదు. ఎవర్నీ చంపలేదు. విప్లవానికి హింస అవసరం

లేదు. సియాటిల్ సార్వత్రిక సమ్మె విప్లవ సాధనకు ఒక పెద్ద ఆయుధం. ప్రశాంతంగా జరిగింది కాబట్టి ఇది మరింత ప్రమాదకరం. సమ్మెను విజయవంతం గావించేందుకు నగరాన్నీ, జనజీవనాన్నీ స్తంభింపజేశారు. దీన్ని మరో రకంగా కూడా చెప్పుకోవచ్చు. వాళ్ళు ప్రభుత్వాన్నే నడవనీయకుండా ఊపిరి తీసేశారు. విప్లవ మంటే ఇదే" అని సియాటిల్ మేయర్ పేర్కొన్నారు.

అంతేకాదు సియాటిల్ సార్వత్రిక సమ్మె ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ స్థాయిలో జరిగిన విప్లవాల నేపథ్యాన సంభవించింది. 'నేషన్' పత్రికలో ఒక రచయిత వ్యాఖ్యానిస్తూ "అసామాన్యమైన అద్భుతాలిప్పుడు జరుగుతున్నాయ"న్నారంటే ఆనాటి వాతావరణం ఏ విధంగా ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చునన్న మాట.

రష్యన్ విప్లవం జార్‌ను కూలదోసింది. కొరియా, ఇండియా, ఈజిప్ట్, ఐర్లాండ్‌ల ప్రజలు పాలకుల క్రూరత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేశారు. ఇంగ్లాండులో రైల్వే కార్మికులు సమ్మెకు దిగారు. సోవియట్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఉద్దేశించిన ఆయుధాలు ఇతర సరుకుల్ని ఓడల కెత్తేందుకు సియాటిల్, సాన్‌ఫ్రాన్సిస్కో నౌకాశ్రయాల ఓడకార్మికులు తిరస్కరించారు. ఇల్లినాయిస్ గని కార్మికులు తమ నాయకత్వాన్ని సైతం ధిక్కరించి సమ్మెను కొనసాగించారు.

పాత నాయకత్వాల పట్ల సగటు పౌరుడు క్రమేణా నమ్మకాన్ని కోల్పోతున్నాడు. స్వశక్తిని గుర్తిస్తున్నాడు. తన మీద నమ్మకాన్నిపెంచుకుంటున్నాడు. అధికార గణం పైనుండి తన పెత్తనాన్ని సామాన్యులపైన రుద్దే రోజులు పోయాయి. ఇలాంటి దమన నీతిని సగటు మనిషి ధిక్కరించసాగాడు.

పెన్సిల్వేనియా స్టీల్ కర్మాగారాల్లో కార్మికులు రోజుకు 12 గంటలు చాకిరీ చేసేవారు. విపరీతమైన కొలిమి వేడిని తట్టుకుంటూ వీళ్ళు పనిచెయ్యాల్సివచ్చేది. 1919న లక్షమంది స్టీలు పరిశ్రమ కార్మికులు 20 ఎ.ఎల్.ఎఫ్. యూనియన్లలో సభ్యులుగా చేరారు. వీరందర్నీ సంఘటితపరిచే బాధ్యతల్ని జాతీయ కమిటి నాయకత్వం స్వీకరించింది. "ఇప్పుడు గనుక మనం వాళ్ల సమస్యల్ని పట్టించుకోకపోతే ఈ లక్ష మంది కార్మికులు యూనియన్లు పక్కనబెట్టి స్వతంత్రంగా ఉద్యమించేటట్లున్నారని" నాయకత్వం పసిగట్టింది.

సార్వత్రిక సమ్మె విషయమై ఈ వారంలో ఓటింగ్ గనుక జరుపకుంటే మేం స్వతంత్రంగా సమ్మెకు పూనుకోవలసి ఉంటుందని జాన్స్‌టౌన్ స్టీల్ కార్మికుల కౌన్సిల్ జాతీయ కౌన్సిల్‌కు టెలిగ్రాం పంపించింది. జాతీయ కమిటీ కోశాధికారి విలియం, జడ్. ఫోస్టర్‌కు యంగ్స్‌టౌన్ జిల్లా కార్మిక సంఘ నేతల నుండి టెలిగ్రాం అందింది. 'సమ్మెను గనుక వాయిదా వేస్తే కార్మికులు మనల్ని ద్రోహులుగా పరిగణిస్తారు. ఆగ్రహంతో కుతకుతలాడుతున్న అప్పుడు కార్మికుల ఎదుటికి వెళ్లటం కూడా కనాకష్టమైపోతుందనేది" ఆ టెలిగ్రాం సారాంశం. ఫోస్టర్ అనంతర కాలాన కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్, ఎ.ఎఫ్.ఎల్. అధ్యక్షుడు గోంపర్స్‌లు సమ్మెను వాయిదా వేయవలసిందిగా ఒత్తిడి చేశారు. అయినప్పటికీ స్టీలు పరిశ్రమ కార్మికులు దీన్ని ఖాతరు చేయలేదు. 1919 సెప్టెంబరు నెలలో లక్ష మంది యూనియన్ సభ్యులతో పాటు మరో 2 లక్షల 50 వేల మంది కార్మికులు సమ్మెకు ఉపక్రమించారు.

సమ్మెలో పాలు పంచుకోనటువంటి అయిదు వేల మంది స్టీలు పరిశ్రమ కార్మికుల్ని అలెగిని కౌంటీ షరీఫ్ తాత్కాలిక ఉద్యోగులుగా నియమించారు. బహిరంగ సభల్ని ఆయన నిషేధించారు.

మొనిసెన్ పోలీసులు వీధుల్లోని జనాన్ని తరిమికొట్టి ఇళ్ళవైపు పరుగులెత్తించారు. బ్రాడక్‌లో సమ్మె చేస్తున్నవారిని పట్టుకొని జైల్లో పెట్టారు. న్యూకాస్లెలో అరెస్టు చేసిన వారికి సమ్మె ముగిసిందాకా విడుదల చేయవద్దని ప్రభుత్వం ఆదేశించింది, న్యాయశాఖ ఇతర దేశాల నుండి ప్రవాసం వచ్చిన వారిని పట్టుకొని వారివారి దేశాలకు పంపించేసింది. ఇండియానాలోని గారీకి కేంద్ర సర్కారు సైన్యాన్ని తరలించింది. సమ్మె చేస్తున్న కార్మికులు అనేక ప్రతికూలాంశాల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఇతర దేశాల నుండి ఈ మధ్యనే అమెరికాకు ప్రవాసం వచ్చిన వారు ఎక్కువ మంది ఉన్నారు. వీరంతా అనేక జాతులకు చెందినవారే. భిన్న భాషలు మాట్లాడతారు. స్టీలు పరిశ్రమల సంస్థలు షెరమాన్ సర్వీస్ అనే సంస్థకు సమ్మెను విఫలం గావించే బాధ్యతను అప్పజెప్పారు. సమ్మెకారుల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టమని, సమ్మె గురించి దుష్ప్రచారం గావించాలని ఈ సంస్థ దక్షిణ చికాగోలోని తన మనుషులకు ఉద్బోధించింది. "ఇటాలియన్లు సెర్బియన్ల నడుమ స్పర్ధను రేకెత్తించండి. ఇటాలియన్లు పనిలోకి వెళ్ళనున్నారని సెర్బియన్లకు తప్పుడు వార్తలందివ్వండి. మీరు గనుక విధులకు హాజరు కాకపోతే ఆ ఉద్యోగాలు ఇటాలియన్లకు పోతాయని బెదరగొట్టండి. అలాగే 30 వేల మంది నల్లజాతి వారిని సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు తీసుకువచ్చింది. ఎ.ఎఫ్.ఎల్.లో సభ్యులు కానందు వల్ల వీరికి యూనియన్ పట్ల భక్తి ప్రపత్తులేమీ ఉండవు.

రోజులు కొనసాగుతున్న కొద్దీ కార్మికుల్లో ఓటమి భయం ఏర్పడసాగింది. క్రమంగా వాళ్లు పనిలోకి వెళ్లసాగారు. 10 వారాలు గడిచే సరికే సమ్మెకారుల సంఖ్య లక్షా 10 వేలకు పడిపోయింది. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు జాతీయ కమిటీ ప్రకటించింది.

1920లో న్యూ ఇంగ్లాండ్, న్యూజెర్సీలకు చెందిన లక్షా 20 వేల మంది వస్త్ర పరిశ్రమ కార్మికులు సమ్మెకు దిగారు. పీటర్‌సన్ (న్యూజెర్సీ)లోని 30 వేల మంది పట్టు పరిశ్రమ కార్మికులు సమ్మె చేశారు. న్యూయార్క్ నగరానికి చెందిన చుట్ట పరిశ్రమ, రెడీమెడ్ వస్త్రాలు, వడ్రంగి, బేకరి రంగాల పనివాళ్లు ఆందోళనా పథాన పడ్డారు. చివరికి క్షురకులు సైతం సమ్మె చేశారు. "గతంలో ఏనాడూ కనీవినీ ఎరుగని స్థాయిలో సమ్మెలు – లాకౌట్లు జరిగాయ"ని పత్రికలు రాశాయి. ఇంటర్నేషనల్ హార్వెస్టర్ సంస్థకు చెందిన 5 వేల మంది, నగర పాలక సంస్థలో పనిచేసే అయిదు వేల మంది కార్మికులు ఉద్యమ బాటన నడిచారు.

1920 గడుస్తున్నకొద్దీ పరిస్థితి అదుపులోకి రాసాగింది. ఐ.డబ్ల్యు.డబ్ల్యు. కుప్ప కూలిపోయింది. సోషలిస్ట్‌పార్టీ బాగా దెబ్బతిన్నది. ప్రభుత్వం దమనీతిని ప్రయోగించి సమ్మెల్ని అదుపు చేసింది. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మెరుగు పడసాగింది. కొద్ది శాతం జనాభాకు ఈ ఫలాలు అందటంతో విస్తృత ప్రజా ఉద్యమాలు సమసిపోయాయి.

... ... ...

అధికశాతం మంది ప్రజల్ని వెనక్కునెట్టేస్తూ కేవలం పై తరగతి వారు మాత్రమే ఆర్థికాభివృద్ధి ఫలాన్ని దండుకుంటున్నారు. ప్రసార మాధ్యమాలు సంపన్నుల గుప్పిట్లో ఉన్నాయి. మరయితే ప్రజలకు నిజాల్ని ఎవరు చెప్తారు? 1920వ దశకంలోని పరిస్థితుల్ని చరిత్రకారుడు మెర్లికర్టి ఇలా అభివర్ణించారు. "జనాభాలోని 10 శాతం మాత్రమే నేడు అభివృద్ధి ఫలితాల్ని అనుభవిస్తున్నారు. అయితే ఇలాంటి వాస్తవాలు జన సామాన్యానికి సక్రమంగా చేరనందున ప్రజల నుండి ఉవ్వెత్తున నిరసనలు వెల్లువెత్తటం లేదు. ప్రధాన రాజకీయ పార్టీలు జనాన్ని అజ్ఞానంలోనే పడి ఉండేలా చేస్తున్నాయి. దేశంలోని అతిపెద్ద ప్రచురణ సంస్థలు నేడు జనాభిప్రాయాన్ని అదుపు చేయగల స్థితిలో ఉన్నాయి. పెద్ద పత్రికలేవీ ఈ చేదువాస్తవాల్ని పాఠకులకు తెలియనీయకుండా వారిని అజ్ఞానాంధకారంలో ఉంచుతాయన్నమాట.

అయినప్పటికీ కొద్ది మంది రచయితలు సామాజిక వాస్తవ పరిస్థితుల్ని తమ రాతల ద్వారా బహిరంగ పరిచారు. ఉదాహరణకు "ఎకోస్ ఆఫ్ ఎ డార్క్ ఏజ్" వ్యాసంలో థియోడర్ డేసియర్, సింక్లరోలెవీస్, లెపాస్, యుంఫోర్డ్, స్కాట్ ఫిట్జ్ గెరాల్డ్‌లు ఇలా రాశారు. 'దేశంలో పై తరగతికి చెందిన 10 శాతం మంది ప్రభువుల వలె తమ జీవితాల్ని పైలా పచ్చీసుగా గడుపుతున్నారు. ఈ సంపద సమాజంలో హింస, అసంతృప్తి, విచ్చలవిడిగా తాగుడు వంటి లక్షణాలు పెరిగిపోతున్నాయ"ని వారు పేర్కొన్నారు.

ఫిలడెల్ఫియా ఆకాశహర్మ్యంపైనుండి ప్రమాదశాత్తు పడి ఒకరు మృతిచెందాడు. మరొకరు న్యూయార్క్‌లోని పలు అంతస్థుల భవనం నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. లాంగ్ ఐలాండ్‌లో ఒకడు తన సహ విద్యార్థిని అతడి భార్యను హత్యచేశాడు. చికాగోలో, న్యూయార్క్‌లో చట్ట విరుద్ధంగా (అప్పుడు అమెరికాలో మద్యనిషేధం అమల్లోఉన్నది) నిర్వహిస్తున్న మద్యం దుకాణాన ఒక్కొక్కరిని దుండగులు చంపేశారు. మానసిక రోగుల శరణాలయాన ఒకడు గొడ్డలితో మరొకరి తలమీద వేటువేశాడు. దీంతో బాధితుడి మెదడు బయటకు వచ్చింది. సింక్లర్ లెవీస్ అనే రచయిత 'బాబిట్' పేరిట ఒక నవలను రాశాడు. నూతన ఎలక్ట్రానిక్ యంత్ర పరికరాలు మధ్య తరగతిని ఏ విధంగా ఆనందమనే భ్రమలో ముంచెత్తుతున్నాయో, సంపద ఎలా కృత్రిమమైన జీవితాల్నిస్తున్నాయో అందులో ఆయన వివరించారు.

"ఆధునిక సదుపాయాలతో మిలమిల మెరిసే ముఖంతో కూడిన అలారం గడియారాలంటే జనంలో వ్యామోహం పెరిగింది. దీనికి గంట, ఆగి ఆగి మోగే అలారం వంటి రకరకాల సౌకర్యాలుండేవి. ఇటువంటి ఖరీదైన అలారం గడియారాన్ని కొనుక్కొని

దాని శబ్దానికి నిద్రమేల్కొంటానని గర్వంగా చెప్పుకునే వస్తు వ్యామోహాల సంఖ్య ఇనుమడించింది. త్వరగా సంపదను కూడబెట్టుకోవాలని భావించిన అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి ప్రవేశించారు. కుటుంబాల్ని కూడా వీళ్లు సరిగ్గా పట్టించుకునేవారు కాదు. తాము ఈ విధంగా ఉంటున్నందుకు ఇంకోపక్క తమను తాము అసహ్యించుకునేవారు. ఇంటి సంగతులు చూసుకోలేకపోతున్నందుకు బాధపడేవారు. మొత్తంగా ఇదేదో విషవలయంలో ప్రవేశించామని బాధపడేవారు. అయితే ఒకసారి ఇందులో అడుగుపెట్టాక ఇక బయటపడలేమని వాపోతుండేవారు.

సుదీర్ఘ పోరాటాల అనంతరం 1920న మహిళలకు ఓటు హక్కు వచ్చింది. ఈ మేరకు రాజ్యాంగానికి 19వ సవరణ పార్లమెంటు ఆమోదం తెలిపింది. అయినప్పటికీ మధ్య – ఉన్నత తరగతుల స్త్రీలు మాత్రమే ఓటేసేవారు. అయితే మహిళా ఓట్లు కూడా పురుషుల్లాగానే పార్టీల వారీగా చీలిపోయేవి. 1920వ దశకాన చాలాకొద్ది మంది రాజకీయ నాయకులు మాత్రమేపేదల పక్షాన మాట్లాడేవారు. ఇతర దేశాల నుండి వలస వచ్చిన పేదలు నివశించే తూర్పు హార్లెం నుండి ఎన్నికైన కాంగ్రెస్ సభ్యుడు ఫియోరెల్లోలా గార్డియా తన ప్రాంతంలో మాంసం ధర అధికంగా ఉన్నదంటూ వ్యవసాయమంత్రి విలియం జార్డిన్‌కు విన్నవించుకున్నాడు. ఈ విషయంపైన దర్యాప్తు జరపాలని మంత్రిని ఆయన కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి జార్డిన్ మాంసాన్ని ఏ విధంగా పొదుపుగా ఉపయోగించుకోవాలో సూచిస్తూ కాంగ్రెస్ సభ్యునికి ఒక కరపత్రాన్ని పంపాడు. దీంతో గార్డియాకు కోపం వచ్చింది. వ్యవసాయ మంత్రికి ఆయన జవాబు రాశాడు. "నేను పేదలకు సాయం చేయమని మిమ్మల్ని అడిగాను. మీరేమో కరపత్రాన్ని పంపించారు. మీ మంత్రిత్వ శాఖ పంపిన కాగితాలు న్యూయార్క్ నగర పిల్లల ఆకలిని తీర్చవు. చిన్నచిన్న ఇళ్ళల్లో అరకొర వసతుల మధ్యన సర్దుకుపోయి బతుకు గడుపుతున్న బీదలకు ఇవేమీ ఆసరా అందించవు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో కష్టాలనుభవిస్తూ కాపురాలు నెట్టుకొస్తున్న న్యూయార్కు గృహిణులకు మాంసాన్ని ఎంత పొదుపుగా వాడుకోవాలో బాగా తెలుసు. మాంసం ద్వారా లాభాలు దండుకుంటున్న వ్యాపారులకు మీ శాఖ అధికారులు బుద్ధిచెప్పి శ్రమజీవుల నోటికి ఇంత పౌష్టికాహారం అందగలదని ఆశించి సమస్యను మీదృష్టికి తీసుకువచ్చాను" అంటూ మంత్రి స్పందన పట్ల గార్డియా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

1920లలో హార్డింగ్, కూలిడ్జ్‌లు అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఆండ్రివ్ మెల్లాన్ ఆర్థికమంత్రి బాధ్యతలు నిర్వహించారు. ఈయన అమెరికాలో కెల్లా అత్యంత సంపన్నులలో ఒకరు. 1923న కాంగ్రెస్‌కు ఈ మెల్లాన్ తన సరికొత్త చట్టాన్ని సమర్పించారు. 'మెల్లాన్ ప్రణాళిక'గా ఇది పేరొందింది. సంపన్నుల ఆదాయపు పన్నును తగ్గించటం ప్రధాన ఉద్దేశ్యమన్న మాట. దీని ప్రకారం అత్యధిక ఆదాయాన్ని సంపాదించేవారు చెల్లిస్తున్న పన్నును 50 నుండి 25 శాతానికి తగ్గించారు. అదే తక్కువ గడిస్తున్న వ్యక్తుల కేమో నాల్గు నుండి మూడు శాతానికి కుదించారు. కార్మికవర్గం అధికంగా ఉండే జిల్లాల నుండి ఎన్నికైన కొద్దిమందికాంగ్రెస్ సభ్యులు దీనికి వ్యతిరేకంగా మట్లాడారు. "చెప్పులు,తోలు తదితర చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న

కార్మికులకు వారంలో మూడు రోజులు మాత్రమే పని లభిస్తున్నదని అలాంటి వారికి ఈ బిల్లు ఏమి మేలు చేస్తుందని" మసాచ్యుసెట్స్ నుండి ఎన్నికైన సభ్యుడు విలియం పి. కానరీ ప్రశ్నించారు. ఈ చట్టం ఆమోదం పొందితే మెల్లాన్‌కు ఆదాయపు పన్నులో ఎనిమిది లక్షలడాలర్లు మిగులుతుంది. అతని సోదరునికి ఆరులక్షల డాలర్ల ఆదా అవుతుంది. అందువల్ల అత్యంత ధనవంతులకు మాత్రమే లాభదాయకంగా ఉన్న ఈ బిల్లును తాను ఆమోదించనని కానరీ పేర్కొన్నారు. మెల్లాన్ ప్రణాళికకు కాంగ్రెస్ ఆమోద ముద్ర లభించింది. 1928న లాగార్డియా న్యూయార్క్ రాష్ట్రంలోని పేద జిల్లాల్లో పర్యటించారు. అక్కడి బీదల పరిస్థితులకు ఆయన కలత చెందారు. "ఇక్కడ ఇంతటి దుర్భర దారిద్ర్యం తాండవిస్తున్నదంటే తాను నమ్మలేక పోతున్నానని" ఆయన బాధపడ్డారు.

... ... ...

1929న స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. అమెరికా తీవ్ర ఆర్థిక మాంద్యానికి లోనయ్యింది. స్పెక్యులేషన్ వ్యాపారం ఆకస్మికంగా అధఃపాతాళానికి పతనం కావటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇందుకు దారితీసిన కారణాల్ని జాన్‌గాల్‌బ్రియత్ తన "ది గ్రేట్ క్రాష్" పుస్తకంలో వివరించారు. మౌలికంగా ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే లోపభూయిష్టంగా ఉన్నందునే ఇలా జరిగిందని ఆయన వివరించారు. "కార్పొరేట్, బ్యాంకింగ్ వ్యవస్థలే అనారోగ్యకరంగా ఉన్నాయి. విదేశీ వాణిజ్య పరిస్థితీ అంతే. ఆదాయాల్లో విపరీతమైన అసమానతలు కనిపిస్తున్నాయి. (జనాభాలోని పై తరగతికి చెందిన అయిదు శాతం మంది మొత్తం ప్రజల ఆదాయంలో 1/3 వంతును పొందుతున్నారు). అందువల్లనే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింద"ని గాల్‌బ్రియత్ విశ్లేషించారు.

పెట్టుబడిదారీ విధానమే స్వాభావికంగా డొల్లతనాన్ని కల్గి ఉంటుందని సోషలిస్టు భావాలు గల విమర్శకులు వ్యాఖ్యానించారు. కార్పొరేట్ లాభాలే ఉత్ప్రేరకంగా పనిచేసే వ్యవస్థ అయినందున ఇది ఏనాడూ పటిష్టంగా మనజాలదు. పెట్టుబడిదారీ వ్యవస్థ పయనం ఎలా ఉంటుందో మనం ఊహించజాలం. మనిషి అవసరాల్ని ఇది పట్టించుకోదు. అత్యధికశాతం ప్రజలను పెట్టుబడిదారీ విధానం నిత్యం ఆర్థిక సంకటంలోనే ఉంచుతుంది. ప్రతి ఒక్కర్నీ తరచూ ఇది సంక్షోభానికి గురిచేస్తుంటుంది. తనను తాను సంస్కరించుకోవాలని, మరింతగా నియంత్రించుకోవాలనిఎంత ప్రయత్నించినా 1929 నాటికి పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంకా వ్యాధిగ్రస్థంగానే ఉన్నది. నమ్మదగిన స్థాయికి ఇది చేరుకోలేదు!

స్టాక్ మార్కెట్ కుప్పకూలాక దేశ ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయింది. అయిదు వేల బ్యాంకులు మూతపడ్డాయి. డబ్బులు లేక అనేక వ్యాపార సంస్థలకు తాళాలు పడ్డాయి. అప్పటికీ కొనసాగుతున్న సంస్థలు మాటిమాటికీ ఉద్యోగుల్ని – జీతాల్ని తగ్గించాయి. పారిశ్రామిక ఉత్పత్తులు 50 శాతం పడిపోయాయి. 1933 నాటికి దేశవ్యాప్తంగా 15 మిలియన్ల కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. మొత్తం కార్మికుల సంఖ్యలో ఇది 1/4 లేదా 1/3వ వంతు ఉన్నది.

1929లో ఫోర్డ్ మోటార్ కంపెనీలో లక్షా 28 వేల మంది పనిచేస్తుండేవారు. 1931 ఆగస్టు నాటికల్లా ఈ సంఖ్య 37 వేలకు పడిపోయింది. 1930 చివరికల్లా న్యూ ఇంగ్లాండుకు చెందిన 2 లక్షల 80 వేల మంది వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉపాధిని పోగొట్టుకున్నారు. "దేశ పరిస్థితి బాగాలేద"ని మాజీ అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ వ్యాఖ్యానించారు.

ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న వారికి అసలేం జరుగుతున్నదో అర్థం కాలేదు. పరిస్థితి వీరిని తికమక పెట్టింది. అయినా వాస్తవాన్ని గుర్తించేందుకు వారు అంగీకరించలేదు. వ్యవస్థ వైఫల్యాలకు బదులు ఇతర కారణాల్ని మీరు చెప్పసాగారు. "చరిత్రలో ఏ భూభాగంలోనూ కనీవినీ ఎరుగని రీతిన అమెరికా నేడు పేదరికంపై విజయం సాధించబోతున్నద"ని హెర్బర్ట్ హూవర్ పేర్కొన్నారు. స్టాక్‌మార్కెట్ కుప్పకూలటానికి కొద్దికాలం క్రితం ఆయనీ వాఖ్య చేశారు. "పని చేయటానికి ఇష్టపడే వారికి కావలసినంత పని ఉన్నద"ని ఫోర్డ్ పేర్కొన్నారు. ఈ మాట అన్న కొద్ది వారాల క్రితం ఆయన తన సంస్థలో 75 వేల మందిని ఉద్యోగం నుండి తీసేశారు.

... ... ...

మొదటి ప్రపంచ యుద్ధాన పనిచేసిన మాజీ సైనికులు ఇప్పుడు పనిలేకుండా ఆకలితో అలమటిస్తున్నారు. వీరికి ఆనాటి సేవలకు ప్రతిఫలంగా భవిష్యత్ తేదీల్ని వేసి ప్రభుత్వం బోనస్ సర్టిఫికెట్లను ఇచ్చింది. తామిప్పుడు తీవ్ర కష్టాల్లో ఉన్నామని అందువల్ల బోనస్ డబ్బులు నేడే చెల్లించాలని కోరుతూ వాషింగ్‌టన్‌లో 1932 వేసవిలో మాజీ సైనికులు పెద్ద ప్రదర్శనను నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి మాజీ సైనికులు చాలా మంది తమ భార్యా పిల్లలతో తరలి వచ్చారు. టికెట్ లేకుండా రైళ్ళలోను, పాత కాలపు ఆటోలు, ఇలా ఏవిధంగా వీలైతే అలా వాషింగ్‌టన్‌కు వీరు పయనమయ్యారు. పశ్చిమ వర్జీనియా గని కార్మికులు, జార్జియా లోహ పరిశ్రమ కార్మికులు తదితరులు ఇందులో ఉన్నారు. కాలిఫోర్నియా నుండి భార్యా – భర్తలు తమ మూడేళ్ల కుమారుడితో కలసి మూడు నెలలు రైలు ప్రయాణం చేసి దేశ రాజధాని కొచ్చారు. న్యూమెక్సికో ప్రాంతానికి చెందిన నిరుద్యోగి ఒకరు తన సంప్రదాయ రెడ్ ఇండియన్ దుస్తులు ధరించి విల్లంబులు చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు.

మాజీ సైనికుల ర్యాలీలో 20 వేల మందికి పైగా పాల్గొన్నారు. పొటొమాక్ నది ఒడ్డున పాత వార్తాపత్రికలు, అట్టపెట్టెలు, తార్పాల్ పట్టాలు వంటి వాటిని కప్పులాగ నిర్మించుకుని వీరంతా రాత్రిళ్ళు విశ్రమించారు. ప్రతినిధుల సభ మాజీసైనికులకు బోనస్ ముందుగానే ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును ఆమోదించింది. అయితే ఈ చట్టం సెనెట్‌లో వీగిపోయింది. దీంతో నిరాశ చెందిన పలువురు మాజీ సైనికులు తమ తమ ఊళ్ళకు వెనుతిరిగారు. మిగిలిన వారు అధ్యక్ష భవనం వద్ద గల కొన్ని సర్కారీ కార్యాలయాల్లో తిష్టవేశారు. దీనికి ఆగ్రహించిన అధ్యక్షుడు హూవర్ నిరసనకారుల్ని తరిమివేయవలసిందిగా సైన్యాన్ని ఆదేశించారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నాల్గు అశ్విక దళాలు, నాలుగు పదాతిదళాలు, మెషిన్‌గన్ దళం ఆరు ట్యాంకులు శ్వేతసౌధం ముందు మోహరించాయి. జనరల్ డగ్లస్‌మకార్థర్ మాకా ఈ సైనిక చర్యకు నాయకత్వం వహించారు. మేజర్ ఐసెన్‌హోవర్, జార్జి ఎస్. పాటన్ సైన్యాధికారులుగా ఉన్నారు. మాజీ సైనికులు ఉన్న భవనాల వైపు ఈ దళం ముందుగా బాష్పవాయువును ప్రయోగించింది. అనంతరం కట్టడానికి నిప్పంటించింది. భాష్పవాయువును వదలగానే మాజీ సైనికులు, వారి భార్యా పిల్లలు బయటకు పరుగెత్తసాగారు. వాళ్ళు తాత్కాలికంగా నిర్మించుకున్న గుడిసెలకు సైనికులు నిప్పంటించారు. అవికాస్తా దగ్ధమైపోయాయి. సైనికుల కాల్పులకు ఇద్దరు మాజీలు మృతిచెందారు. ఇంకా సుమారు వేయి మంది గాయపడ్డారు. 11 సంవత్సరాల పసిపిల్ల కూడా ఈ దమనకాండకు బలైంది. ఎనిమిదేళ్ల బాలుడికి పాక్షికంగా చూపుపోయింది. ఇద్దరు పోలీసుల తలలకు గాయాలయ్యాయి. మొత్తం మీద ప్రపంచ యుద్ధాన దేశం కోసం పోరాడిన సైనికులే నేడు ప్రభుత్వక్రౌర్యాన్ని చవిచూడాల్సి వచ్చింది.

... ... ...

1934, 1935లలో లక్షలాది మంది కార్మికులు అమెరికన్ కార్మిక సమాఖ్య (ఎ.ఎఫ్.ఎల్) నుండి వైదొలగారు. వీళ్లంతా నూతనంగా ఏర్పడిన సామూహిక ఉత్పత్తి కర్మాగారాల్లో అంటే ఆటో, రబ్బర్ వంటి పరిశ్రమల్లో పనిచేయటం ప్రారంభించారు. ఎ.ఎఫ్.ఎల్. వీరిని విస్మరించలేదు. పరిశ్రమల వారీగా కార్మికుల్ని సంఘటితం చేయాలని సమాఖ్య నిర్ణయించింది. జాన్ లూయిస్ ఆధ్వర్యంలో ఇందుకోసమొక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విధంగా ఎ.ఎఫ్.ఎల్ నుండి విడిపోయి స్వతంత్ర సంస్థగా కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్స్ (సి.ఐ.ఓ) ఆవిర్భవించింది.

ఈ కాలంలోనే కొత్త తరహా ఆందోళనా వ్యూహానికి అంకురార్పణ జరిగింది. ఆక్రాన్ (ఓహియొ)కి చెందిన రబ్బర్ పరిశ్రమ కార్మికులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కర్మాగారంలోనే బైఠాయింపు జరిపారు. సమ్మె చేసి బయటకు వెళ్లే బదులు ఫ్యాక్టరీలోనే ఉండిపోవటం వల్ల కొన్ని సానుకూలంశాలు ఉంటాయి. అందరూ ఒకేచోట ఉండిపోవటం వల్ల కార్మికులు కూడ బలుక్కోని భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకోవచ్చు. యాజమాన్యం వారు సమ్మెను విఫలం చేయటానికి బయటి నుండి ఎవర్నీ తీసుకొచ్చేందుకు సాధ్యపడదు. యూనియన్ నాయకుల అవసరం లేకుండా ప్రత్యక్షంగా స్థానికులే పరిస్థితుల్ని తమ నియంత్రణలో ఉంచుకోవచ్చు. ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న 12 మంది కూడబలుక్కుంటే మొత్తం ఫ్యాక్టరీ ఉత్పత్తినే నిలిపివేయవచ్చు. ఆక్రాన్ రబ్బర్ పరిశ్రమ యాజమాన్యం కేవలం గంటసేపట్లోనే స్పందించింది. సమస్య పరిష్కారమైంది. కార్మికుల సమ్మె విజయవంతమైంది.

1936లో ఈ నూతన ఆందోళనా రూపం గురించిన వార్త మిగతా చోట్లకు పాకింది. ఫ్లింటోలో (మిచిగన్) గల ఫిషర్ బాడీ ప్లాంటులో సుదీర్ఘ కాలంపాటు సమ్మె జరిగింది. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఇద్దర్ని యాజమాన్యం తొలగించింది. ఈ చర్యకు నిరసనగా కార్మికులు పనులు

మానివేసి బైఠాయింపు జరిపారు. ఈ ఆందోళన ఫిబ్రవరి దాకా కొనసాగింది. రెండు వేల మంది కార్మికులు 40 రోజుల పాటు సాముదాయిక జీవితాన్ని గడిపారు. ఈ సమ్మెను ఒక యుద్ధంలాగా నిర్వహించామని ఒక కార్మికుడు పేర్కొన్నాడు. కార్మికులు ఈ సందర్భంగా పలు కమిటీల్ని ఏర్పాటుచేశారు. వినోదం, సమాచార సేకరణ, తపాలా, పారిశుధ్యం తదితర అంశాల్ని ఈ బృందాలు చూస్తాయి. తప్పు చేసిన వారిపైన విచారణ జరిపించేందుకై న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. ఎవరన్నా తన వంతు వచ్చినప్పుడు, అంట్లు తీయకపోయినా, పొగతాగినా, మద్యం తెప్పించుకున్నా అలాంటివారిని విచారించి శిక్ష విధిస్తారు. తప్పుచేసిన వారికి శిక్షగా అదనపు పనులు అప్పగిస్తారు. అయినప్పటికీ తన ప్రవర్తనను మార్చుకోని వారిని ప్లాంటు నుండి బహిష్కరిస్తారు. పార్లమెంటరీ నియమావళి, ఉపన్యాసాలివ్వటం, కార్మికోద్యమ చరిత్ర వంటి అంశాలపైన కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించేవారు. మిచిగన్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఇక్కడికి తరలివచ్చి జర్నలిజం, సృజనాత్మక రచనలపైన తర్ఫీదు ఇచ్చారు. సమీప వీధిలోని ఒక హోటల్ యాజమాని సమ్మె చేస్తున్న రెండు వేల మంది కార్మికుల కోసం రోజుకు మూడు సార్లు భోజనాలు ఏర్పాటు చేయించారు.

ఫ్యాక్టరీ నుండి వైదొలగాలని కార్మికుల్ని ఆదేశిస్తూ ప్రభుత్వం ఒక ఉత్తర్వును జారీ చేసింది. పోలీసులు ఈ నిషేధాజ్ఞల్ని అమలు చేయకుండా అడ్డుకునేందుకు వీలుగా అయిదు వేల మంది కార్మికులు ఆయుధాలు ధరించి కర్మాగారం చుట్టూ పహారా కాసారు. పోలీసులు వీరిపైన తొలుత భాష్ప వాయువును ప్రయోగించారు. ఆ తర్వాత తుపాకులతో కాల్పులు జరిపారు. దీంతో 13 మంది గాయపడ్డారు. అయినప్పటికీ పోలీసుల్ని వారు తరిమికొట్టారు. దీనికి ఆగ్రహించిన గవర్నర్ నేషనల్ గార్డును రప్పించారు. ఈ లోగా సమ్మె జనరల్ మోటార్స్ ఇతర యూనిట్లకు విస్తరించింది. చివరికి యాజమాన్యం కార్మికులతో ఆర్నెల్ల కాలానికి గాను ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. అంటే ఇక నుండి ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు సంఘటిత కార్మికశక్తితో లావాదేవీలు నిర్వహించాలన్నసత్యం పారిశ్రామిక వేత్తలకు తెలిసివచ్చిందన్నమాట.

1936వ సంవత్సరాన 48 బైఠాయింపు ఆందోళనలు జరిగాయి. 1937 కొచ్చేసరికి అవి 477కు పెరిగాయి. సెయింట్ లూయిస్ ఎలక్ట్రికల్ కార్మికులు, నేషనల్ గార్డ్ కంపెనీ సిపాయిలు, న్యూజెర్సీ శ్మశాన పనివారు... ఇలా పలు ప్రాంతాల్లోని శ్రామికులు తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమ్మెకు దిగారు. ఈ తరహా ఆందోళనల్ని బైటి నుండి కార్మిక సంఘాల నాయకులెవరూ నియంత్రించరు. స్థానిక పనివాళ్లే స్వతంత్రంగా నిర్ణయించుకొని పోరాటాల్ని నిర్వహిస్తుంటారు. అందువల్ల ఇవి యాజమాన్య దృష్టిలో ప్రమాదకర సమ్మెలుగా పరిణమించాయి. చివరికి యూనియన్ ప్రతినిధులకు కూడా ముందస్తు సమాచారం లేకుండా ఈ బైఠాయింపులు జరిగాయి. హోటల్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి తన అనుభవాన్ని ఇలా వివరించారు. “అది 1937 మార్చి నెల.. హటాత్తుగా కార్మిక సంఘ కార్యాలయాన టెలిఫోన్ మోగింది. తన పేరు మేరీజోన్ అని తమ సంస్థ మేనేజర్ని బయటకు నెట్టి తాము బైఠాయింపు చేశామని అవతలవైపు నుండి ఒకరు పేర్కొన్నారు. మమ్మల్ని ఇప్పుడేం చేయమంటారో సూచించమని

కోరారు. దీంతో మేం కంపెనీ యాజమాన్యం వద్దకు చర్చల కోసం పరిగెత్తాం. మేనేజ్‌మెంట్‌వారేమో ముందుగా సమ్మెకు కూర్చొని ఆనక మమ్మల్ని చర్చలు జరపమని వాళ్ళు కోరటం మీరు సరేనండంటూ సమాధానం చెప్పటం... ఇదంతా బాధ్యతా రహిత్యంగా ఉందని వ్యాఖ్యానించారు." హఠాత్తుగా కార్మికులు బైఠాయింపుకు పూనుకోవటం యాజమాన్యానికి ఇబ్బంది కరంగా పరిణమించిందని పై ఉదంతం తెలియజేస్తున్నది. కార్మికుల ఆందోళనల నేపథ్యాన కార్మిక సంబంధాల బోర్డును రూపొందించేందుకు ఉద్దేశించిన ఎల్.వాగ్నెరో చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. 1936, 1937, 1938 సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా కార్మిక సమ్మెలు ఉధృతంగా జరిగాయి. వాటికి స్పందించిన ప్రభుత్వం పై శాసనాన్ని తీసుకువచ్చింది. 1937లో చికాగో నగరాన రిపబ్లిక్ స్టీల్ కార్మికుల సమ్మె జరిగింది. ఆందోళన కారుల పికెటింగు పైన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 10 మంది కార్మికులు మృతిచెందారు. పోలీసుల ధాటికి బెదిరి కార్మికులు పరుగులు తీస్తున్నప్పుడు ఈ కాల్పులు సంభవించటం గమనార్హం. కార్మికులకు వెనుక వైపున బుల్లెట్‌గాయాలున్నట్లు శవపరీక్షలో వెల్లడైంది. ఈ సంఘటన సైనిక సంస్మరణ దినాన జరిగింది. రిపబ్లిక్ స్టీలు, ఫోర్డ్ మోటార్ కంపెనీ ఇంకా ఇతర భారీ స్టీలు, రబ్బరు, ఎలక్ట్రికల్, మాంసం ప్యాకింగ్ పరిశ్రమల్లోని శ్రామికులు ఈ కాలాన దేశం అంతటా సంఘటితమయ్యారు.

వాగ్నెర్ చట్టాన్ని స్టీలు పరిశ్రమల యజమాన్యాలు కోర్టులో సవాలు చేశాయి. సుప్రీంకోర్టు ఈ శాసనానికి అండగా నిలిచింది. ఈ చట్టం రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు పేర్కొన్నది. రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని ప్రభుత్వం నియంత్రించవచ్చని న్యాయస్థానం పేర్కొన్నది. సమ్మెలు అంతరాష్ట్ర వ్యాపారాన్ని నష్టపరుస్తాయని చెప్పింది. అలాగే కార్మికుల దృష్టికోణం నుండి చూసినప్పుడు సంఘాల నిర్వహణకు ఇది సహాయకారిగా ఉన్నది. ప్రభుత్వం వైపు నుండి చూస్తే వాణిజ్య స్థిరత్వానికి ఉపకరణంగా దోహదపడుతున్నది. యాజమాన్యాలకు కార్మిక సంఘాలంటే అయిష్టమే. అయినప్పటికీ ఫ్యాక్టరీల్లో అక్కడికక్కడ హఠాత్తుగా బైఠాయింపులు, సమ్మెలకన్నా కార్మిక సంఘాల ద్వారా వ్యవహారాలు నడవటమే మేలు కదా! యూనియన్లు అనధికార బైఠాయింపుల్ని అదుపు చేసే చర్యలకు సి.ఐ.ఓ. పూనుకున్నదంటూ 1937న న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక వ్యాసాన్ని రాసింది.

తమ అనుమతి లేకుండా సమ్మెకు పాల్పడితే అలాంటి సభ్యుల్ని సంఘం నుండి బహిష్కరిస్తామని సి.ఐ.ఓ. కార్యవర్గం హెచ్చరించింది. సి.ఐ.ఓ. యూనియన్ల నిర్వహణలో అనేక మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు భాగస్వాములయ్యారు. అలాంటి కమ్యూనిస్టు నాయకులు కూడా పైన పేర్కొన్న అభిప్రాయాన్నే బలపర్చారు. "మనమిప్పుడు కార్మిక సంఘం – యాజమాన్యాల మధ్య నిత్య సంబంధాల్ని ఏర్పరచుకునేందుకు కృషి చేయాలి. కార్మికులు యూనియన్ నియమాల్ని ఖచ్చితంగా పాటించాలని వీరుపేర్కొన్నారు. ఈ విధంగా 1930 దశకాన ప్రత్యక్ష కార్మిక కార్యాచరణను అడ్డుకునేందుకు రెండు రకాల పద్ధతులు అమలయ్యాయి. కార్మిక సంబంధాల బోర్డు యూనియన్లకు చట్టబద్ధత కల్పించి శ్రామికుల బాధల్ని ఆలకించి పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. దీనివల్ల కార్మిక తిరుగుబాట్లు తగ్గుతాయి. అలా వీరి ఆగ్రహాన్ని

ఓటింగు ప్రక్రియ ద్వారా ఎన్నికల వైపుకు మరలించవచ్చన్నమాట. రాజ్యాంగ వ్యవస్థ ప్రజల ఆగ్రహాల్ని – అసహనాన్ని ఓటింగ్‌గా మరల్చినట్లన్నమాట. రాజకీయ స్పర్ధల్ని ఓటింగు చల్చార్చినట్లు కార్మికుల ఆర్థిక సమస్యల్ని పరిష్కరించటం ద్వారా బోర్డు వారి కోపాన్ని ఉపశమింపజేసింది. అలాగే సమరశీల యూనియన్లు కూడా కార్మికుల కోపాన్ని చర్చలు – సంఘ సమావేశాలు, ఒప్పందాల ద్వారా చల్చార్చే ప్రయత్నాలు చేశాయి. తద్వారా పెద్దవిగా విస్తరించాయి. తమ పలుకుబడిని, గౌరవాన్ని పెంచుకున్నాయి.

కార్మికులు దీనివల్ల లాభపడ్డారా? రచయితలు రిచార్డ్ క్లోవార్డ్, ఫ్రాన్సెస్ పివెన్‌లు ఈ అంశాన్ని తమ పుస్తకం "పూర్ పీపుల్స్ మూవ్‌మెంట్స్"లో విశ్లేషించారు. కార్మికులు సంఘాలుగా ఏర్పడటం, వాటికి గుర్తింపు లభించటం కంటే అంతకు పూర్వం హఠాత్తుగా అప్పటి కప్పుడే బైఠాయింపులు జరిపే అధిక విజయాల్ని సాధించుకున్నారని వీరు పేర్కొన్నారు. "తీవ్ర ఆర్థిక మాంద్యం నెలకొన్న కాలాన ఉద్యమాల ద్వారా ఫ్యాక్టరీ కార్మికులు ప్రభుత్వం నుండి ఎక్కువ రాయితీల్నీ రాబట్టుకున్నారు. అప్పుడే వారు బలీయంగా ఉన్నారు. యూనియన్లుగా శ్రామికులు సంఘటితం కావటానికి ముందటి పరిస్థితి ఇది. సంఘం ద్వారా కాకుండా విచ్ఛేదనం ద్వారానే కార్మికశక్తి ప్రదర్శితమయ్యిందన్నమాట."

రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటికి యూనియన్ సభ్యత్వం విపరీతంగా పెరిగిందని పివెన్, క్లోవార్డ్‌లు పేర్కొన్నారు. (సి.ఐ.వో, ఎ.ఎఫ్.ఎల్‌ల సభ్యత్వం ఒక్కొక్కదానికీ 1945 కల్లా 60 లక్షలకు చేరుకున్నది). అయితే సంఘం శక్తి గతంతో పోల్చితే బలహీనపడింది. కార్మిక సంబంధాల బోర్డులోకి నియమితులైన సభ్యులు శ్రామికుల పట్ల అంతగా సానుభూతిని ప్రదర్శించలేదు. మరోపక్కన సుప్రీం కోర్టు బైఠాయింపుల్ని చట్ట వ్యతిరేకమైనవిగా పేర్కొంటూ తీర్పుచెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మె, పికెటింగ్, బహిష్కరణల్ని దెబ్బతీసే విధమైన శాసనాల్ని చేయసాగాయి.

రెండో ప్రపంచ యుద్ధం కారణంగా లక్షలాది సరికొత్త ఉద్యోగాలు పుట్టు కొచ్చాయి. వేతనాలు కూడా అధికమయ్యాయి. దీంతో 1930ల నాటి కార్మికోద్యమాలు నీరసించసాగాయి. 'న్యూ డీల్' వల్ల నిరుద్యోగం 13 మిలియన్ల నుండి 9 మిలియన్లకు తగ్గింది. (ఆర్థిక మాంద్యాన్ని అధిగమించేందుకు రూజ్‌వెల్ట్ చేపట్టిన కార్యక్రమమే న్యూడీల్. భారీఎత్తున ప్రజా పనులు తదితర ఉద్యోగిత పెంచే చర్యలను ఈ సందర్భంగా భారీ ఎత్తున చేపట్టారు). యుద్ధ ఆర్థిక వ్యవస్థ ఒక పక్క ఉపాధిని పెంచగా మరో ప్రక్క ప్రజల్లో దేశభక్తిని రగిలించింది. విదేశీ శతృవులకు వ్యతిరేకంగా వర్గాలకు అతీతంగా దేశ ప్రజల మధ్య ఐక్యతను పెంచింది. కార్పొరేషన్ల తీరుపైన ఉద్యమాలు నిర్వహించేందుకు కార్మికుల్ని సంఘటితపర్చటం కష్టంగా తయారైంది. యుద్ధ కాలాన తాము సమ్మెలకు దిగబోమని సి.ఐ.ఓ., ఎ.ఎఫ్.ఎల్.లు వాగ్దానం చేశాయి.

యుద్ధకాలాన వేతనాలపై ప్రభుత్వం నియంత్రణల్ని విధించింది. ధరల పెరుగుదలపైన మాత్రం అదుపు కరువైంది. పర్యవసానంగా దేశవ్యాప్తంగా అప్రకటిత సమ్మెలు విస్తృతంగా

జరిగాయి. అమెరికన్ చరిత్రలో అంతకు ముందెన్నడూ లేనన్ని సమ్మెలు 1944న సంభవించాయని జెరిమి బ్రెచర్ పేర్కొన్నారు.

1930-40లలో అమెరికన్ కార్మికులు సరికొత్త సందిగ్ధాలను ఎదుర్కొవలసి వచ్చింది. కార్మికుల సమరశీల ఉద్యమాల్ని అదుపుచేసేందుకు ఈ కాలాన రాజ్యవ్యవస్థ పలు రకాల నియంత్రణల్ని తీసుకువచ్చింది. ఇంకో పక్క రాయితీల్ని సైతం అందజేసింది. వాటివల్ల శ్రామికులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలేవి పరిష్కారం కాలేదు. ఆర్థికవ్యవస్థ మెరుగుదల ద్వారా కొద్దిమంది జీవితాలు మెరుగయ్యాయి. వ్యవస్థ పట్ల జనానికి నమ్మకం పెరిగేందుకు ఇది ఉపకరించింది.

1938లో కనీస వేతనాల చట్టం వచ్చింది. బాల కార్మికుల్ని పనుల్లో పెట్టుకోవటాన్ని ప్రభుత్వం నిషేధించింది. వారానికి 40 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలి సంవత్సరాన గంటకు 25 సెంట్లను కనీస వేతనంగా చేశారు. ఇది చాలా తక్కువగా ఉన్నది. ఇంకో పక్క చాలా పనుల్ని ఈ కనీస వేతన చట్టం నుండి ప్రభుత్వం మినహాయించింది. అయినప్పటికీ ఇటువంటి చిన్నపాటి చర్యలు కార్మికుల ఆందోళనల్ని చల్లబర్చేందుకు ఉపకరించాయి. అవసరమున్న వారిలో అతి కొద్ది మందికి మాత్రమే నివాస గృహాల్ని నిర్మించారు. కేంద్రప్రభుత్వం సబ్సిడీపైన ఇళ్లు కట్టించటం, ఆటస్థలాల్ని ఏర్పాటు చేయటం, మురికివాడల వాసుల్ని అపార్ట్‌మెంట్లకు తరలించటం వంటి పథకాలు ప్రజల్లో సంతోషాన్ని కలిగించాయి. అవసరమున్న వారిలో అతికొద్ది మందికి మాత్రమే ఇళ్ళ నిర్మాణం జరిగింది. అయినప్పటికీ ఇటువంటి కార్యక్రమాలు జనంలో సరికొత్త ఆశల్ని చిగురింపజేశాయి. భవిష్యత్‌లో తమకూ ఈ తరహా ప్రయోజనాలు అందగలవని విస్తృత ప్రజానీకం భావించింది. సాంఘిక భద్రతా చట్టం కింద ప్రభుత్వం రిటైరైన వారికి పలు ప్రయోజనాల్ని ఇచ్చింది. నిరుద్యోగభృతి, తల్లులు - పిల్లలకు నిధుల్ని ప్రకటించింది. అయితే రైతులు, వృద్ధులు ఇళ్లల్లో పనిచేసే వారిని ఈ సాంఘిక భద్రత పథకాల నుండి మినహాయించింది. ఇలాంటి వారికి ఆరోగ్య ఇన్సూరెన్స్‌ను నిరాకరించింది. మొత్తం మీద పెద్ద వ్యాపార సంస్థల కిచ్చిన రాయితీలతో పోలిస్తే ప్రజానీకానికి అందించిన తాయిలాలు అతి స్వల్పమేనని కాన్‌కిన్ వ్యాఖ్యానించారు.

# 5

# ప్రజా యుద్ధం?

నిస్సహాయ దేశాలకు అమెరికా పెద్ద దిక్కుగా నిలుస్తున్నట్లు హైస్కూలు పాఠ్యపుస్తకాల్లో ఉంటుంది. అయితే వాస్తవం మరో విధంగా దర్శనమిస్తుంది. స్పెయిన్ నుండి రక్షిస్తున్నట్లు నటిస్తూ యు.ఎస్. క్యూబాలో సైనిక స్థావరాన్ని ఏర్పరచుకున్నది. క్యూబాలోపెట్టుబడులు పెట్టింది. తన ప్రయోజనాలకు భంగకరంగా ఉంటే సైనిక జోక్యానికి దిగే హక్కును ఏర్పరచుకుంది. హవాయి, ప్యూర్టోరికో, గ్వాటిమలాలను ఆక్రమించింది. ఫిలిప్పీన్స్ పైన యుద్ధం చేసి ఆ దేశాన్ని తనకు లోబడేలా చేసుకుంది. బెదిరింపులు, తుపాకులు నిండిన పడవల్నిచూపి భయపెట్టి జపాన్‌కు వాణిజ్య మార్గాన్ని ఏర్పరచుకుంది. ఇతర సామ్రాజ్యవాద దేశాలతోకలసి దోపిడీ గావించేందుకు వీలుగా చైనాతో స్వేచ్ఛా వర్తకపు విధానాన్ని ప్రకటించింది. ఇతర రాజ్యాలతో కలసి చైనాకు సైన్యాన్ని పంపించి పాశ్చాత్యదేశాల ఆధిపత్యాన్ని నిలబెట్టింది. చైనా భూభాగంలో ఈ విధంగా తన సేనల్ని 30 ఏళ్ళకు పైగా మోహరించింది.

చైనాతో స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని ప్రకటించిన అమెరికా, లాటిన్ అమెరికా దగ్గరకొచ్చే సరికే తనకు తప్ప ఇతరులకు తలుపులు మూసేసింది. కొలంబియాలో విప్లవాన్ని రేకెత్తించి పనామాను నూతన రాజ్యంగా ఏర్పాటు చేసింది. పనామా కాలువను తవ్వి దానిపైన నియంత్రణను ఉంచుకునేందుకు ఈ పనిచేసింది. నికరాగువా విప్లవాన్ని అణచివేసేందుకు 1926లో అక్కడికి అయిదు వేల మందితో కూడిన నౌకాదళాన్ని పంపించింది. ఏడేళ్ల పాటు ఆ దేశంలోనే సదరు సైన్యాన్ని తిష్టవేయించింది. 1916న నాల్గోసారి డొమినికన్ రిపబ్లిక్‌లో జోక్యం చేసుకొని ఎనిమిదేళ్లపాటు అక్కడ తన సేనల్ని నిలిపింది. 1915వ సంవత్సరాన హైతీలో రెండోసారి కల్పించుకుని 19 ఏళ్ళ పాటు ఆ దేశంలో సైన్యాన్ని ఉంచింది. అమెరికా 1890–1933 మధ్యకాలాన క్యూబాలో నాల్గుసార్లు, నికరాగువాలో రెండు, పనామాలో ఆరు విడతలు, గ్వాటిమలా ఒకటి, హోండురస్‌లోఏడు విడతలు సైనిక జోక్యం చేసుకున్నది. 1924 నాటికి 20 లాటిన్ అమెరికా దేశాలలో సగం రాజ్యాల ఆర్థిక వ్యవస్థల్ని అమెరికా నియంత్రించే స్థాయికి చేరింది. 1935 కల్లా అమెరికన్ స్టీలు, పత్తి ఎగుమతుల్లో సగభాగం లాటిన్ అమెరికా దేశాలకు వెళ్తుండేది.

మొదటి ప్రపంచ యుద్ధం ముగియటానికి కొద్ది ముందుగా అంటే 1918లో ఏడువేల మంది అమెరికన్ సైనికులతో కూడిన ఒక దళం వ్లాడివోస్తక్ (రష్యా) లో దిగింది. మరో అయిదువేల మంది సైనికులు ఆర్చాంజెలోని రేవు పట్టణాన మోహరించారు. మిత్రపక్షాల సైనిక బృందంలో భాగంగా వచ్చిన ఈ దళం ఏడాది పాటు అక్కడ కొనసాగింది. "రష్యాలో బోల్షివిక్ విప్లవ ప్రభావాన్ని అడ్డుకునేందుకే అక్కడ సైన్యాన్ని దింపినట్లు" అమెరికన్ పార్లమెంటుకు ప్రభుత్వం విన్నవించింది.

ఇతర దేశాల వ్యవహారాలపైన పరుల జోక్యం కూడదన్న నియమాల్ని పరిరక్షించేందుకే తాము రెండో ప్రపంచ యుద్ధంలో అడుగిడినట్లు అమెరికా చెప్పుకుంటుంది. అయితే ఆచరణలో మాత్రం యు.ఎస్. అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది.

అమెరికా ప్రజాస్వామ్య దేశం. జర్మనీలో నియంతృత్వ పాలన కొనసాగుతున్నది. హిట్లర్ ఉత్తర యూరపు జాతి (నార్డిక్) ఆధిపత్యాన్ని ప్రకటిస్తూ యూదులను దారుణంగా అణచివేయసాగాడు. అలాగే తనను వ్యతిరేకించే వారినందర్నీ ఖైదుచేశాడు. అమెరికాలో నివసిస్తున్న నల్లజాతి ప్రజలు తమ పరిస్థితి జర్మన్‌లోని యూదులవలెనే ఉన్నదని భావిస్తుండేవారు. వాస్తవానికి హిట్లర్ అకృత్యాలను అడ్డుకునేందుకు అమెరికా ప్రయత్నించలేదు. 1930వ దశకాన ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లతో కలసి యు.ఎస్. హిట్లర్‌ను మంచిచేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించింది. అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, విదేశాంగ మంత్రి కార్డెల్ హల్‌లు హిట్లర్ యూదుల పట్ల అవలంబిస్తున్న వైఖరిని బహిరంగంగా విమర్శించేందుకు సైతం వెనుకాడేవారు. జర్మనీలో యూదుల అణచివేత పట్ల బాధను వ్యక్తం చేస్తూ 1934న సెనెట్‌లో ఒక తీర్మానం వస్తే విదేశాంగ మంత్రిత్వ శాఖ దాన్ని కాంగ్రెస్ కమిటీకి మళ్లించి ఆమోదించనీయకుండా తొక్కిపెట్టింది.

1935వ సంవత్సరాన ముస్సోలినీ నాయకత్వాన ఇటలీ ఇథియోపియాపైన దాడి జరిపింది. ఇందుకు నిరసనగా ఇటలీకి యుద్ధ సామాగ్రి ఎగుమతిపైన నిషేధం విధిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అయితే యు.ఎస్. వ్యాపార వేత్తలు ఆ దేశానికి చమురు పంపించేందుకు అనుమతించింది. యుద్ధాన్ని కొనసాగించేందుకు ఇటలీకి ఈ చమురు అత్యవసరం. 1936వ సంవత్సరాన స్పెయిన్ ఫాసిస్టు తిరుగుబాటు జరిగింది. ప్రజల చేత ఎన్నికైన సోషలిస్టు – ఉదారవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇది చోటు చేసుకున్నది. ఈ సందర్భాన రూజ్‌వెల్ట్ ప్రభుత్వం స్పానిష్ సర్కారుకు సహాయం చేయకుండా 'తటస్థతా చట్టాన్ని' చేసింది. మరోపక్క హిట్లర్, ముస్సొలినీలు ఫ్రాంకోకు కావలసిన కీలక సహాయాన్ని అందించారు.

అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లు గనుక సహకారం అందించి ఉంటే స్పానిష్ రిపబ్లికన్లు విజయం సాధించి ఉండేవారని ఆర్నాల్డ్ ఆఫనర్ తన "అమెరికన్ అప్పీజ్‌మెంట్" గ్రంథాన పేర్కొన్నారు. 1936 నవంబరు వరకు ఫ్రాంకోకు అండగా నిలిచే విషయాన హిట్లర్ అంత పట్టుదలగా లేరు. అమెరికా ధోరణి వల్లనే స్పానిష్ అంతర్యుద్ధ వాతావరణాన్ని జర్మనీ ఉపయోగించుకొని లాభపడింది.

అమెరికా ఈ తరహా వైఖరిని పొరపాటున తీసుకున్నదా? లేక పరిస్థితిని అంచనా వేయటంలో తప్పటడుగు వేసిందా? వాస్తవమేమిటంటే యు.ఎస్.కు ఫాసిజాన్ని అడ్డుకోవటం పట్ల ప్రత్యేక శ్రద్ధేమీ లేదు. సామ్రాజ్యవాద ప్రయోజనాల్ని విస్తరించుకోవటమే అమెరికా విధానం. ఈ రీత్యానే 1930లలో సోవియట్ వ్యతిరేక వైఖరిని తీసుకున్నది. అనంతరం జపాన్, జర్మనీలో అమెరికన్ లాభాల్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించినప్పుడు మాత్రమే ఆదేశం సోవియట్ అనుకూల – నాజీ వ్యతిరేక విధానాన్ని తీసుకొన్నదన్న మాట.

... ... ...

యూదులపైన హిట్లర్ మారణకాండకు వ్యతిరేకంగా అమెరికా రెండో ప్రపంచ యుద్ధంలోకి దిగలేదు. ఇథియోపియాపై ఇటలీదాడి, హిట్లర్ ఆస్ట్రియా దురాక్రమణ చెకోస్లోవేకియా బలవంతపు ఆక్రమణ, పోలెండ్‌పైన దాడులు యు.ఎస్.ను సంగ్రామంలోకి దించలేదు (ఇంగ్లాండుకు రూజ్‌వెల్ట్ సహాయాన్ని అందించినప్పటికీ హిట్లర్‌పైన యుద్ధాన్ని మాత్రం అప్పటికి ప్రకటించలేదు). అమెరికన్ నావికాదళ కేంద్రం పెరల్‌హార్బర్ పైన జపాన్ 1941 డిసెంబరు 7వ తేదీన బాంబుల వర్షం కురిపించాక మాత్రమే యు.ఎస్. యుద్ధభేరిని మోగించింది. 1937న జపాన్ చైనాపైన దాడిచేసింది. నాన్‌కింగ్‌పైన బాంబులు కురిపించి పెద్ద సంఖ్యలో పౌరుల్ని పొట్టనబెట్టుకున్నది. ఈ రెండు ఘటనల్లోనూ సామాన్య ప్రజలు బలయ్యారు. అప్పుడు అమెరికాకు హృదయం ద్రవించలేదు. తన నావికాదళంపైన దాడి జరిగినప్పుడు మాత్రమే యు.ఎస్.కు ఆగ్రహం పెల్లుబికింది. పెరల్‌హార్బర్ నావికా కేంద్రం అమెరికన్ సామ్రాజ్యవాద ప్రణాళికను ముందుకు తీసుకెళ్లటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది మరి!

... ... ...

యుద్ధమూ, బాంబుల వర్షాల హడావుడికి దూరంగా అమెరికన్ వ్యాపారవేత్తలు, రాయబారులు ప్రశాంతంగా తమ పని తాము కానిచ్చుకున్నారు. యుద్ధం ముగిసేనాటికి యు.ఎస్.ను వారు ప్రపంచ ఆర్థికశక్తిగా తయారుచేశారు. అప్పటివరకూ ఇంగ్లాండు పెత్తనం కొనసాగిన ప్రాంతాల్లోకి అమెరికన్ వాణిజ్యవేత్తలు చొచ్చుకుపోయారు.

... ... ...

జర్మన్ ఆక్రమిత యూరపులో యూదులపైన అత్యాచారాలు జరుగుతున్నందునే రూజ్‌వెల్ట్ యుద్ధంలోకి దిగారని అనేక మంది భావిస్తూ ఉంటారు. యూదుల్ని శిబిరాల్లో బందీలుగా ఉంచి వేలాది మందిని హతమారుస్తుంటే రూజ్‌వెల్ట్ ఈ ఘోరాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించ లేదని హెన్రీ ఫీన్‌గోల్డ్ పరిశోధనలో (ద పొలిటిక్స్ ఆఫ్ రెస్క్యూ) వెల్లడైంది. హిట్లర్ ఘాతుకాలకు మొత్తం 60 లక్షల మంది యూదులు, లక్షలాది మంది ఇతరులు బలయ్యారు. యూదుల్ని కాపాడటానికి రూజ్‌వెల్ట్ ఏనాడూ ప్రత్యేక చొరవను ప్రదర్శించలేదు. విదేశాంగ శాఖకు ఆయన బాధ్యతను అప్పగించారు. విదేశాంగశాఖ యూదు వ్యతిరేకత, అధికార గణంలో స్పందన లేమీ కారణంగా యూదుల రక్షణ చర్యలు కాగితాలకే పరిమితమై పోయాయి.

ఇతర జాతుల కన్నా ఉత్తర యూరపు జాతులు గొప్పవన్న హిట్లర్ భావనను తప్పుగా నిరూపించేందుకే అమెరికా యుద్ధానికి దిగిందనుకుంటున్నారా? వాస్తవానికి యు.ఎస్. సైన్యంలోనే జాతి వివక్ష ఉన్నది. 1945న క్వీన్‌మేరీ ఓడలో అమెరికన్ సైన్యం యూరపుకు పయనమయ్యారు. సైనికులలో నల్లజాతివారిని నౌక ఇంజన్ గదిలో కుక్కి ఉంచారు. ఓడ పైభాగాన నిలబడి స్వచ్ఛమైన గాలిని పీల్చుకునే అదృష్టం వారికి లేకుండా చేశారు. పూర్వకాలంలో బానిసల్ని ఈ విధంగానే తరలించే వారన్న సంగతి విదితమే.

రెడ్‌క్రాస్ సంస్థ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తుండేది. ఇక్కడ కూడా దానంగా వచ్చిన రక్తాన్ని నల్లవారు – తెల్లవారివిగా వేరుచేసి ఉంచేవారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే ఇది జరిగింది. వాస్తవానికి రక్తాన్ని సేకరించి బ్యాంకుగా భద్రపరిచే విధానానికి చార్లెస్ డ్రైవ్‌అనే నల్లజాతి వైద్యుడే అంకురార్పణ చేశారు. ఆయన ఆధ్వర్యంలోనే ఇలా రక్తాన్ని వేరుచేసి ఉంచాల్సి వచ్చింది. ఈ పద్ధతికి స్వస్తి చెప్పేందుకు ఛార్లెస్ ప్రయత్నించారు. దాంతో ఆయన్ని ఈ బాధ్యతల నుండి తప్పించారు. యుద్ధకాలాన శ్రామికుల అవసరం అధికంగా ఉంటుంది. అయినప్పటికీ ఉద్యోగ నియామకాల్లో నల్లవారి పట్ల వివక్ష ఉండేది. వైమానిక విభాగాన నీగ్రోల్ని వాచ్‌మన్ వంటి ఉద్యోగాల్లో మాత్రమే పెట్టుకునే వారు. "వైమానిక రంగాన విభిన్న పనులకు శిక్షణ పొందినప్పటికీ నీగ్రోల్ని తక్కువ స్థాయి ఉద్యోగాల్లో మాత్రమే తీసుకుంటామ"ని సంస్థ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

నల్లజాతివారికి ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రూజ్‌వెల్ట్ కమిషన్‌ను నియమించారు. అయినప్పటికీ ఆచరణలో కొనసాగుతున్న వివక్షను అంతమొందించేందుకు ఆయన పూనుకోలేదు.

ఫాసిస్టు దేశాలు మహిళల పట్ల తీవ్ర వివక్షతను ప్రదర్శించేవి. స్త్రీలు ఇంటికే పరిమితమై ఉండాలని పేర్కొనేవి. మరి ఫాసిజానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్న దేశాలు వీరి పట్ల ఎలా ప్రవర్తిస్తున్నాయి? యుద్ధ సామాగ్రికి సంబంధించిన పరిశ్రమల్లో మహిళలకూ చోటిచ్చేవారు. ఆ తరుణాన అవసరం అలాంటిది మరి. అయితే వారిని ద్వితీయ పౌరులుగా పరిగణించే ధోరణి మాత్రం మారలేదు. పెద్ద సంఖ్యలో స్త్రీలు యుద్ధ పనుల్లో పాలు పంచుకున్నప్పటికీ సిబ్బంది నియామక కమిషన్ వారిని అప్రధాన పనుల్లో మాత్రమే నియమించింది. యుద్ధానికి సంబంధించిన విధాన నిర్ణాయక కమిషన్లకు వారిని దూరంగా ఉంచింది. ఆ కాలాన మహిళా నాయకుల్లో నెలకొన్న చైతన్యం, సమరశీల భావాలు కమిషన్‌కు రుచించలేదని కార్మికశాఖ మహిళా బ్యూరో నివేదిక పేర్కొన్నది.

కొన్ని విషయాల్లో అమెరికా ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరించింది. పెరల్‌హార్బర్‌పై దాడి తర్వాత యు.ఎస్. ప్రభుత్వ విభాగాల్లో జపాన్ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో వ్యక్తమైంది. అది ఎంతదూరం వెళ్లిందంటే పశ్చిమతీర ప్రాంతాన నివశిస్తున్న జపనీస్, అమెరికన్లపైన దాడుల వరకూ వెళ్లింది. "అలాస్కా, హవాయి తదితర అన్ని ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి జపాన్ వాడినీ పట్టుకొని శిబిరాల్లో నిర్బంధించాలి. వీరందర్నీ మట్టుపెట్టాల"ని ఒక కాంగ్రెస్ సభ్యుడు బహిరంగంగా పిలుపునిచ్చారు.

ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌కు ఇలాంటి ఉన్మాద భావాలు లేవు. అయినప్పటికీ పశ్చిమ తీర ప్రాంతాన నివసిస్తున్న జపనీస్, అమెరికన్లను వారెంటు లేకుండా అరెస్ట్ చేసేందుకు అధికారాన్నిచ్చే ఆదేశంపైన (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 9066) 1942న ఆయన సంతకం చేశారు. ఈ ప్రాంతాన లక్షా 10 వేల మంది జపనీస్ – అమెరికన్లు నివశిస్తున్నారు. ఈ ఉత్తర్వు ప్రకారం సైనికులు స్త్రీలు – పిల్లలైనా సరే చూడకుండా వారి ఇళ్ల నుండి బలవంతంగా తరలించి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్ళవచ్చున్నమాట. ఈ విధంగా సైనికులు వేలాది మందిని అరెస్టుచేసి కారాగార వాతావరణంలో నిర్బంధించారు. వీళ్లల్లో అనేకులు జపానీస్‌స్త్రీ – లేదా పురుషునికి అమెరికన్ గడ్డపై జన్మించినందున వారు చట్టబద్ధంగా యు.ఎస్. పౌరులే. యుద్ధ పరిస్థితుల నేపథ్యాన ఈ విధంగా బలవంతంగా జపనీస్ అమెరికన్లను తరలించటం సబబేనని 1944న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ విధంగా నిర్బంధానికి గురైన వారంతా మూడేళ్లపాటు శిబిరాల్లోనే ఉండాల్సి వచ్చింది.

... ... ...

అంతటా మిన్నంటిన దేశభక్తి. యుద్ధంలో గెలవాలని కోరుకుంటూ ఎవరికి చేతనైన రీతిలో వారు పాటుపడ్తున్న సమయమది. ఒకవైపు వ్యాపారులకు దండిగా లాభాలొస్తున్నాయి. కార్మికుల వేతనాలేమో పెరగడం లేదు. ఇలాంటి వాతావరణంతో విసుగు చెందిన కార్మికులు సమ్మెలకు దిగారు. యుద్ధకాలాన సమ్మెలు చేయమని ఎ.ఎఫ్.ఎల్. సి.ఐ.ఓ.లు చేసిన వాగ్దానాల్ని కాలదన్ని శ్రామికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న సమయంలోనే 14 వేల సమ్మెలు జరిగాయి. ఇందులో 67 లక్షల 77 వేల మంది కార్మికులు పాలుపంచుకున్నారు. అమెరికా చరిత్రలోనే గతంలో ఏనాడూ ఇంత పెద్ద ఎత్తున సమ్మెలు జరిగి ఉండలేదు. ఒక్క 1944వ సంవత్సరంలోనే గనులు, స్టీలు పరిశ్రమలు, ఆటోమొబైల్ తదితర కర్మాగారాలకు చెందిన 10 లక్షల మంది కార్మికులు సమ్మెల్లో పాల్గొన్నారు.

యుద్ధం ముగిసింది. అయినా అమెరికా అంతటా సమ్మెలు కొనసాగాయి. 1946 సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే 30 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాలు పంచుకున్నారు. దీంతో కార్మిక సంఘాలు జోక్యం చేసుకొని తమ సభ్యుల్ని అదుపులో పెట్టే చర్యలకు పాల్పడ్డాయి. లేకుంటే యాజమాన్యాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వమూ – కార్మికుల మధ్య పెద్ద సమరమే జరిగి ఉండేదని "స్ట్రైక్" పుస్తక రచయిత జెరొమి బ్రెచర్ పేర్కొన్నారు.

... ... ...

అసలు యుద్ధం జరిగేది దేశాల మధ్య కాదని, దేశాల లోపలేనని కొందరు మేధావులు – విజ్ఞులు తరచూ పేర్కొంటుంటారు. 1945 యుద్ధకాలాన 'పాలిటిక్స్' పేరిట డ్వైట్ మెక్‌డొనాల్డ్ ఒక పత్రికను తీసుకొచ్చారు. ఇందులో ఫ్రెంచ్ తత్త్వవేత్త సిమోన్ పాల్ ఇలా రాశారు. "ఫాసిజం, ప్రజాస్వామ్యం, కార్మికుల నియంతృత్వం తదితర పేర్లతో ఏపాలన నడుస్తున్నప్పటికీ మనకు అసలు శతృవులు అధికార వ్యవస్థ – పోలీసు – మిలటరీలే, సరిహద్దుల వెలుపల ఉన్నవారు కాదు మనకు ప్రత్యర్థి, రక్షకులుగా చెప్పుకుంటూ మనల్ని బానిసల్లాగా తయారుచేసే శతృవులు

దేశంలోపలే ఉన్నారు. రాజ్య వ్యవస్థకు చెందిన ఈ అంగాలకు మనం లొంగి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే అంతకంటే దౌర్భగ్యం ఇంకొకటి లేదు."

పెద్ద సంఖ్యలో అమెరికన్ ప్రజల్ని – సైన్యాన్ని యుద్ధం సందర్భంగా సమీకరించారు. యుద్ధవాతావరణం తాలూకా వేడి విస్తృత జన బాహుళ్యానికి బాగా ఎక్కింది. యుద్ధానంతరం కూడా పెద్ద సైన్యాన్ని కొనసాగించాలని సైనికులు భావిస్తున్నట్లు అభిప్రాయ సేకరణ నివేదికలు పేర్కొన్నాయి. శత్రువు ముఖ్యంగా జపనీయుల పట్ల ద్వేషం వ్యాపించింది. జాతి విద్వేషం మిన్నంటింది. ఇవో జియా (టోక్యో సమీపంలోని దీవి) వద్ద జరిగిన యుద్ధం గురించి టైమ్స్ పత్రిక విలేఖరి ఒక కథనాన్ని రాశారు. "సగటు జపనీయుడు తెలివి లేని మూర్ఖుడు" అనే తరహాలో అందులో ఎద్దేవా చేశారు.

ఏ యుద్ధంలోనూ కనీవిని ఎరుగని విధంగా జర్మనీ, జపాన్ నగరాల్లోని నివాస ప్రాంతాల్లో బాంబుల వర్షం కురిపించేందుకు అమెరికాలో జనాభిప్రాయం అనుకూలంగా ఉన్నదన్నమాట! 'ప్రజాయుద్ధం' అంటే తమపైన జరిగిన దాడికి వ్యతిరేకంగా ప్రజలు యుద్ధం చేయటం. మానవతా కారణాల పైన సంగ్రామానికి దిగటం. అంతేగానీ కొద్దిమంది ఉన్నతశ్రేణుల ప్రయోజనాల కోసం కాదు. నిజంగా జరిగింది ప్రజా యుద్ధమైతే జర్మనీ – జపాన్ జన సామాన్యం పైన యు.ఎస్. బాంబుల వర్షం కురిపించి ఉండేది కాదు.

ఇథియోపియన్ యుద్ధ సమయాన నగరాలపైన ఇటలీ బాంబులు వేసింది. ప్రపంచ యుద్ధం ఆరంభాన రోటర్డ్యాం (హాలెండ్), కొవెంట్రి (ఇంగ్లాండ్) తదితర ప్రాంతాల్లో జర్మన్ విమానాల బాంబుల వర్షం కురిపించాయి. "ఈ చర్యలు అనాగరికమైనవి, మానవత్వానికే మచ్చతెచ్చేవ"ని అప్పుడు రూజ్‌వెల్ట్ వ్యాఖ్యానించారు.

జర్మన్ నగరాలపైన బ్రిటిష్– అమెరికన్ బాంబుదాడులతో పోలిస్తే పై ఘటనలు చిన్నవే. 1943 జనవరి నెలలో మిత్రపక్షాలు కాసబ్లాంకాలో సమావేశమయ్యాయి. "జర్మనీ సైనిక పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థల్ని సర్వనాశనం చేసి ప్రజల నైతిక స్థైర్యం దెబ్బతీసే విధంగా "ఆ దేశంపైన పెద్ద స్థాయిలో వైమానిక దాడి జరపాలని" అవి నిర్ణయం తీసుకున్నాయి. ఈ విధంగా చేసినప్పుడు అది ప్రతిదాడి చేసే శక్తిని కోల్పోతుందని భావించాయి. ఈ నిర్ణయానికి అనుగుణంగా జర్మనీకి చెందిన నగరాలైన కొలోన్, ఎస్సెన్, ఫ్రాంక్‌ఫర్ట్, హంబర్గ్‌లపైన వేయి విమానాలు దండెత్తి బాంబులు వేశాయి. బ్రిటిష్ విమానాలు రాత్రివేళల్లో తిరిగాయి. పౌర ప్రాంతాలపైన అవి బాంబుల వర్షం కురిపించాయి. అమెరికన్ విమానాలు పగటి వేళల్లో మిలటరీ లక్ష్యాలను గురిపెట్టాయి. అయితే ఎంతో ఎత్తు నుండి ఎగురుతూ బాంబులు వేసినందున అవి చాలా సార్లు గురితప్పాయి. 1945న డ్రెస్‌డెన్ పైన జరిగిన బాంబింగ్ అన్నింటికన్నా ఘోరమైనది. ఎంత శక్తివంతమైన బాంబులు ఇక్కడ ప్రయోగించారంటే అగ్ని తుఫాను డ్రెస్‌డెన్ అంతటా విరజిమ్మినట్లైంది. ఈ ఘోర సంఘటనలో లక్ష మందికి పైగా మరణించారు. (విన్‌స్టన్ చర్చిల్ తన 'యుద్ధ జ్ఞాపకాలు' పుస్తకంలోఈ సంఘటన గురించి ఇలా రాశారు: "జర్మనీ తూర్పు ప్రాంత కమ్యూనికేషన్ కేంద్రమైన డ్రెస్‌డెన్ పైన పెద్ద స్థాయిలో మేం దాడి చేశాం") జపాన్ నగరాలపైన బాంబుల దాడి కొనసాగింది. టోక్యో మీద ఒకరాత్రి

బాంబుల వర్షం కురిసింది. ఈ ఘటనలో 80 వేల మంది మరణించారు. 1945 ఆగస్టు 6న హిరోషిమాపైన తొలి ఆటంబాంబు పడింది. లక్ష మందికి పైగా జనం ప్రాణాలు వదిలారు. ఇంకా లక్షల మంది రేడియేషన్ ప్రభావితులై అనంతర కాలాన చనిపోయారు. అప్పుడు అమెరికా నావికా విభాగానికి చెందిన 12 మంది సైనిక సిబ్బంది హిరోషిమా నగర జైల్లో బందీలుగా ఉన్నారు. వీరు కూడా మరణించగా అమెరికన్ ప్రభుత్వం ఈ వార్తను దాచిపెట్టింది. మూడు రోజుల తర్వాత రెండో ఆటంబాంబు నాగసాకి మీద పడింది. కనీసం 50 వేల మంది పౌరులు ప్రాణాలు వదిలారు. ఆటంబాంబు ప్రయోగం వల్ల యుద్ధం త్వరగా ముగుస్తుందని అమెరికా తన చర్యను సమర్థించుకున్నది. లేకుంటే జపాన్ అంతటిపైన దాడులు జరపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అప్పుడు 10 లక్షల నుండి అయిదు లక్షల వరకు జననష్టం సంభవించే ప్రమాదం ఉన్నదని వివరణ ఇచ్చింది. ( ఆటంబాంబు తయారీ ప్రాజెక్టును మాన్‌హటన్ ప్రాజెక్టు పత్రాల్ని కొన్నేళ్ల తర్వాత విడుదల చేసినప్పుడు ఒక విషయం బయటపడింది. ఆటంబాంబు వేయనున్నట్లు ప్రజల్ని ముందుగానే హెచ్చరిస్తే ప్రజలు పారిపోతారని అప్పుడు మిలటరీ లక్ష్యాల్నే నాశనం చేయవచ్చునని జనరల్ జార్జ్ మార్షల్ ప్రభుత్వానికి సూచించినట్లు ఈ పత్రాల ద్వారాతెలిసింది.) అయినప్పటికీ జపాన్ అంతటా దాడులు జరిపితే 10 లక్షల మంది చనిపోయే ప్రమాదమున్నదన్న మాటలుకూడా పూర్తిగా తప్పే. ఆటంబాంబు ప్రభావం గురించి సమాచారం బయటకు వచ్చాక ఆత్మరక్షణ కోసమే ఇలాంటి సమర్థింపు మాటలు చెప్పుకుంటున్నారన్నమాట. వాస్తవానికి 1945 ఆగస్టు నాటికి జపాన్ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. అందువల్ల లొంగిపోయేందుకు అది సిద్ధంగా ఉన్నది. యుద్ధం ముగిసిన వెంటనే న్యూయార్క్ టైమ్స్ మిలటరీ అంశాల విశ్లేషకుడు హన్సన్ బాల్డ్విన్ ఇలా రాశారు. పోట్స్‌డామ్ సమావేశం వైరి పక్షాలవారి లొంగుబాటునకు షరతుల్ని పేర్కొంటూ "జూలై 26న ఒకప్రకటనను విడుదల చేసింది. (పోట్స్‌డామ్ తూర్పు జర్మనీకి చెందిన ఒక పట్టణం) అప్పటికే జపాన్ బాగా దెబ్బతిని ఉన్నది'. మరి హిరోషిమా, నాగసాకిలపైకి బాంబులు ఎందుకు వేసినట్లు.

అమెరికన్ ప్రభుత్వం బాంబు దాడుల పర్యవసానాల్ని అధ్యయనం చేసేందుకు 1944న ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. లొంగిపోయిన అనంతరం ఈ విభాగం సభ్యులు జపాన్‌కు చెందిన వందలాది మంది రాజకీయ నాయకులు, సైన్యాధికారుల్ని ఇంటర్వ్యూ చేశారు.

అన్ని కోణాల నుండి పరిశీలించి, రాజకీయ నాయకుల అభిప్రాయాల్ని సేకరించి ఈ విభాగం తన అభిప్రాయాల్ని ప్రకటించింది. 1945, నవంబరు ఒకటి, లేదా డిసెంబరు 31లోగానే మిత్రపక్షాలకు లొంగిపోవాలని జపాన్ నిర్ణయించుకున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. రష్యా యుద్ధంలో ప్రవేశించక పోయినా, అమెరికా ఆటంబాంబులు వేయకపోయినా జపాన్ తెల్లజెండా చేతబట్టాలని భావించిందని తేలింది.

1945 ఆగస్టు కల్లా అమెరికన్ల నాయకులకు ఈ విషయం తెలుసునా? తెలుసు. ఎందుకంటే జపానీస్ రహస్య సందేశాల్ని అమెరికా పసిగట్టగలిగింది. వాటి అర్థాన్ని తెలుసుకొన్నది. మిత్రపక్షాలతో శాంతి చర్చలు జరపమని జపాన్ తన రష్యా రాయబారికి

సందేశాన్ని పంపించింది. వాస్తవానికి ఏడాది క్రితమే జపాన్ నాయకులులొంగుబాటు గురించి మాట్లాడటం ప్రారంభించారు. 1945 జూన్ నెలలో జపాన్ చక్రవర్తి యుద్ధాన్ని విరమించేందుకు మార్గాల్ని అన్వేషించవలసిందిగా కోరారు. బేషరతుగా లొంగిపోమని అడుగుతుండటమే శాంతికి అవరోధంగా ఉన్నదని జపాన్ విదేశాంగ మంత్రి జూలై 13న మాస్కో రాయబారికి పంపిన సందేశంలో పేర్కొన్నారు. "జపాన్ అభిమతాన్ని వారి రహస్య టెలిగ్రాముల్ని అమెరికన్లు పసిగట్టారు. విషయాన్ని అధ్యక్షునికి విన్నవించారు"ని సంబంధిత చారిత్రక పత్రాల్ని అధ్యయనం చేసిన మార్టిన్ హెర్విన్ పేర్కొన్నారు. అయినప్పటికీ అమెరికా యుద్ధాన్ని కొనసాగించిందన్నారు.

అమెరికా గనుక బేషరతుగా లొంగిపోవాలంటూ ఒత్తిడి చేయకుంటే నామమాత్రపు అధిపతి అయిన చక్రవర్తిని కొనసాగనిస్తామని అంగీకరించి ఉంటే జపాన్ వెన్వెంటనే యుద్ధాన్ని విరమించి ఉండేది.

మరి యు.ఎస్. ఎందుకు సానుకూలంగా స్పందించలేదు. అమెరికన్, జపనీయుల జీవితాల్ని కాపాడగలిగే చర్యను, అంటే యుద్ధానికి ముగింపు ఎందుకు జరగనివ్వలేదు? ఆటంబాంబు తయారీకి ఎంతో ధనాన్ని, శక్తిని వినియోగించారు? అందువల్ల దాన్ని ప్రయోగించి తీరాలనే కోర్కె వారికున్నదా? ట్రూమన్‌కు అటువంటి సరదా ఉన్నట్లు మాన్‌హట్టన్ ప్రాజెక్టు అధిపతి జనరల్ వెస్లీ గ్రోవ్స్ అభిప్రాయపడ్డారు. జపాన్‌పైకి రష్యన్లు రాకమునుపే బాంబును వేయాలని అమెరికన్లు తహతహ లాడారని బ్రిటిష్ శాస్త్రవేత్త పి.ఎం.ఎస్. బ్లాకెట్ అభిప్రాయపడ్డారు.

యూరోపియన్ యుద్ధం ముగిశాక 90 రోజులకు తాము జపాన్ పైకి దండెత్తుతామని రష్యన్లు తెలిపారు. దీనిప్రకారం ఆగస్టు ఎనిమిదో తేదీన జపాన్‌పైన యుద్ధాన్ని ప్రకటించాలి. అయితే అమెరికా తొలుత హిరోషిమా, ఆ తర్వాత నాగసాకిపైన ఆటంబాంబుల్ని వేసింది. దీంతో జపాన్, రష్యా కాకుండా అమెరికాకు లొంగిపోయింది. ఈ విధంగా యుద్ధానంతరం జపాన్, యు.ఎస్. చెప్పుచేతుల్లో ఉంటుంది. రష్యాతో ప్రచ్ఛన్న యుద్ధానికి ఇలా నాంది పలికిందని బ్లాకెట్ వ్యాఖ్యానించారు.

... ... ...

రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్, అమెరికాలు విజేతలుగా నిలిచాయి. (ఇంగ్లాండు, ఫ్రాన్స్, చైనాలకు కూడా ఇందులో పాల్గొని వున్నవి కాని అప్పటికివి బలహీనంగా ఉన్నాయి). ఈ రెండు రాజ్యాలూ స్వస్తిక్, అధికారిక జాతి వివక్షలేమీ లేకుండానే ప్రపంచ దేశాలపైన తన ఆధిపత్యాన్ని రుద్దసాగాయి. ఇందుకోసం ఒక దేశం 'సామ్యవాదం' పేరు చెప్తే మరొకటి ప్రజాస్వామ్య పలుకులు వల్లించింది. ఒకదాని మీద మరొకటి పోటీపడటం, కొన్నిచోట్ల ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో రష్యా అమెరికాలు ముందడుగు వేశాయి. ఫాసిస్టు దేశాల కన్నా పెద్ద స్థాయిలో సైనిక శక్తిని పెంచుకున్నాయి. హిట్లర్, ముస్సోలిని, జపాన్‌లు కూడా చెయ్యని రీతిలో ప్రపంచ దేశాల ప్రజానీకపు భవిష్యత్తును తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. అలాగే తమ దేశ ప్రజల్నీ నియంత్రించాయి. సోవియట్ యూనియన్ మొరటు పద్ధతిలోను

యు.ఎస్. 'నాగరికంగా'నూ ప్రజల్ని అదుపుచేసి తమ పాలనను సుస్థిరం చేసుకున్నాయి. ప్రజానీకంపైన తన భావజాలాన్ని రుద్దాయి.

యుద్ధం అమెరికాకు ప్రపంచ ఆధిపత్యాన్ని తెచ్చిపెట్టింది. అలాగే దేశీయంగా ప్రజల్లో అంతకు ముందు కాలాన ఉన్న అసంతృప్తుల్ని చల్లార్చింది. 30వ దశకాన ప్రబలిన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం తత్ఫలితంగా సమాజాన నెలకొన్న అశాంతి, న్యూడీల్ పథకాల వల్ల కొంత మేరకే ఉపశమించింది. రెండో ప్రపంచ యుద్ధం దీన్ని మరింతగా సర్దుబాటు చేసింది. యుద్ధం రైతులకు అధిక ధరల్ని ఇప్పించింది. ఈ కాలంలో కార్మికుల జీతాలు పెరిగాయి. హెచ్చు గణనీయమైన శాతపు ప్రజానీకానికి సంపదను చేకూర్చింది. దీంతో 1930లలో నెలకొన్న తిరుగుబాటు వాతావరణం చల్లబడింది. "యుద్ధం అమెరికన్ పెట్టుబడిదారీ విధానాన్ని పునరుజ్జీవింప జేసింద"ని లారెన్స్ విట్నర్ రాశారు. యుద్ధం ఫలితంగా నెలకొన్న వాతావరణంలో కార్పొరేట్ సంస్థలు అత్యధిక లాభాల్ని దండుకున్నాయి. 1940లో 6.4 బిలియన్ డాలర్లుగా ఉన్న కార్పొరేట్ లాభాలు 1944 కల్లా 10.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కార్మికులు, రైతులకు కూడా యుద్ధం ఆర్థిక లాభాల్ని అందించింది. దీంతో వ్యవస్థ బాగానే ఉన్నట్లు ఈ రెండు వర్గాలూ భావించసాగాయి.

యుద్ధ వాతావరణాన్ని చూపించితే ప్రభుత్వాలు ప్రజల్ని నియంత్రించటం సులభతరమవుతుంది. సర్కార్లు పాతకాలం నుండీ ఉపయోగిస్తున్న కిటుకే ఇది. వాణిజ్య సంస్థలు – సైన్యం మధ్యన అనుబంధాన్ని నిత్యమూ కొనసాగించాలని తద్వారా స్థిరమైన యుద్ధ ఆర్థిక వాతావరణాన్ని" ఏర్పరచాలని జనరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చార్లెస్. ఇ.విల్సన్ సూచించారు. యుద్ధకాలపు పరిస్థితి ఈయనకు చాలా సంతోషదాయకంగా తోచిందన్నమాట. అందుకే ఈ ప్రతిపాదన.

నిజంగా అలాగే జరిగింది. యుద్ధం ముగిసిన వెంటనే సైన్యాల్ని వెనక్కు రప్పించాలని, ఆయుధాలపైన నియంత్రణలు ఏర్పరచుకోవాలని అమెరికన్ ప్రజానీకం అభిలషించింది. అయితే ఇందుకు విరుద్ధంగా ట్రూమన్ ప్రభుత్వం (రూజ్‌వెల్ట్ 1945 ఏప్రిల్ నెలలో మరణించారు). సంక్షోభవాతావరణాన్ని, ప్రచ్ఛన్న యుద్ధాన్ని కొనసాగించింది. సోవియట్ యూనియన్ రెండో ప్రపంచ యుద్ధంలో ఆర్థికంగా విపరీతంగా నష్టపోయింది. 20 మిలియన్ ప్రజల్ని కోల్పోయింది. అయినప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కూడదీసుకొని పరిస్థితుల్ని చక్కదిద్దుకుంది. పరిశ్రమల్ని సైనికశక్తిని పునర్నిర్మించుకున్నది. ఈ నేపథ్యాన్ని చూపించి ట్రూమన్ ప్రభుత్వం సోవియట్ యూనియన్‌ను తమకు శత్రువుగా చూపించ సాగింది. యు.ఎస్.ఎస్.ఆర్. వల్ల అమెరికాకు తక్షణమే ముప్పుపొంచి ఉన్నదని ప్రచారాన్ని ప్రారంభించింది.

స్వదేశంలోనూ, బయటా కొన్ని చేష్టల ద్వారా కమ్యూనిజాన్ని జనంలో బూచీగా చూపించి భయపెట్టింది. తద్వారా దేశ ప్రజల్లో హిస్టీరియాను రేకెత్తించింది. ఈ విధంగా మిలటరీ బడ్జెట్‌ను ఇబ్బడి ముబ్బడిగా పెంచింది. యుద్ధ సంబంధ ఉత్పత్తుల్ని పెంచి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పర్చింది. అంతర్జాతీయంగా దౌర్జన్యకర పోకడలకు పోయింది. కమ్యూనిస్టు బూచిని చూపి స్వదేశాన అణచివేత చర్యలకు పూనుకున్నది.

... ... ...

ఐరోపా, ఆసియాల్లోని విప్లవోద్యమాలను సోవియట్ విస్తరణ వాదానికి నిదర్శనాలుగా అమెరికన్ పాలకులు తమ ప్రజలకు చూపించసాగారు. హిట్లర్ దురాక్రమణ వాదాన్ని గుర్తుచేస్తూ ఈ విధంగా యు.ఎస్.ఎస్.ఆర్.పైన ఆగ్రహం తెప్పించటమే ఉద్దేశ్యమన్న మాట. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు గ్రీసులో మితవాద భావాలు గల రాజరిక నియంతృత్వం ఉండేది. వామపక్ష జాతీయ విముక్తి కూటమికి ఇక్కడి జన బాహుళ్యంలో మంచి ప్రజాదరణ ఉండేది. యుద్ధం ముగిశాక బ్రిటిష్ సైనికులు గ్రీసులో మోహరించారు. జాతీయ విముక్తి కూటమిని అణచివేశారు. మితవాద నియంతృత్వాన్ని గ్రీసులో పునఃప్రతిష్ఠించారు. పాలకులకు వ్యతిరేకంగా ఉన్నవారిని, కార్మిక నాయకుల్ని జైలు పాలు చేశారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష గెరిల్లా ఉద్యమం విస్తరించసాగింది. 17 వేల మంది గెరిల్లాలు, 50 వేల మంది చురుకైన మద్దతుదారులు, రెండు లక్షల యాభై వేలమంది సానుభూతిపరులతో ఈ ఉద్యమం ఇంతింతై పెరుగుతూపోయింది. (గ్రీసు అప్పటి జనాభా 70 లక్షలు). తిరుగుబాటు దారుల దెబ్బకు తాముతట్టుకోలేక పోతున్నామని అందువల్ల జోక్యం చేసుకోవలసిందిగా బ్రిటన్ అమెరికాను కోరింది. యు.ఎస్. ఇందుకు సానుకూలంగా స్పందించింది. 1947లో అమెరికన్ పార్లమెంటులో ప్రసంగిస్తూ అధ్యక్షుడు ట్రూమన్ ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. "కొద్దిమందితో కూడిన ఆయుధ బృందాలూ లేదా బాహ్యశక్తులు ఎక్కడన్నా స్వేచ్ఛాయుత ప్రజానీకాన్ని అణచివేయాలని చూస్తే అలాంటి దేశాలకు అమెరికా సహాయ ముంటుందని" ట్రూమన్ ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ పేరిట గ్రీసు, టర్కీలకు 400 మిలియన్ డాలర్ల ఆర్థిక – సైనిక సాయాన్ని ఆమోదించాలని ఆయన పార్లమెంటును కోరారు. వాస్తవానికి గ్రీసుకు అమెరికానే బాహ్యశక్తి అవుతుంది. గ్రీకు తిరుగుబాటుదారులు సోవియట్ నుండి కాకుండా యుగొస్లావియా నుండి సాయాన్ని పొందుతున్నారు. యుద్ధ సమయాన యు.ఎస్.ఎస్.ఆర్. తాము గ్రీసులో జోక్యం చేసుకోమని చర్చిల్‌కు హామీ ఇచ్చింది. ఇందుకు ప్రతిఫలంగా రుమేనియా, పోలెండ్, బల్గేరియాల్లో సోవియట్ యూనియన్ జోక్యానికి స్వేచ్ఛ ఇవ్వాలన్న మాట. అమెరికా లాగానే సోవియట్ యూనియన్ కూడా తాను నియంత్రించలేని విప్లవాలకు ఎలాంటి సాయమూ అందించేందుకు ఇష్టపడదు.

"ప్రపంచం రెండు భిన్న జీవన విధానాల్లో ఒకదానిని ఎంపిక చేసుకోవాల"ని ట్రూమన్ అంటారు. ఒకటి మెజార్టీ ప్రజల అభీష్టానికి అనుగుణంగా, స్వేచ్ఛాయుత సంస్థలు గల వ్యవస్థ. రెండోది మైనార్టీ ఆధిపత్యాన అణచివేత – హింసలతో సాగే పాలన. గ్రీసులో జోక్యానికి సంబంధించి ట్రూమన్ సందేశంగా పేర్కొంటూ అధ్యక్షుని సలహాదారు క్లార్క్‌కిఫార్డ్ ఒక మాట చెప్పారు. మధ్య ప్రాచ్య ప్రాంతంలోని సహజ వనరు అంటే చమురుపై ఆధిపత్యమే ఇందుకు కారణమనేది దీని సారాంశమన్నమాట. అయితే ట్రూమన్ స్వయంగా ఈ అంశాన్ని ప్రస్తావించలేదు.

గ్రీసు అంతర్యుద్ధాన్ని అణచివేసేందుకు అమెరికా భారీ ఎత్తున సైన్యాన్ని మోహరించలేదు. కొద్ది మంది మిలటరీ సలహాదారుల్ని, పెద్ద ఎత్తున ఆయుధ సామాగ్రిని అక్కడికి పంపింది. 1947 చివరి అయిదు నెలల్లో ఏథెన్స్ మితవాద ప్రభుత్వానికి 74 వేల

టన్నుల సైనిక పరికరాల్ని సాయంగా అందించింది. జనరల్ జేమ్స్ వాన్ ఫ్లీట్ ఆధ్వర్యంలో 250 మంది సైనికాధికారులు గ్రీసుకు తరలారు. విస్తృత ప్రజానీకపు అండదండలతో సాగుతున్న సాయుధ తిరుగుబాటును దెబ్బతీసేందుకు జనరల్ జేమ్స్ ఒక వ్యూహాన్ని రచించారు. గ్రామ ప్రాంతాల్లోని వేలాది మంది స్థానిక జనాన్ని ఇళ్ళ నుండి తరిమేసి అనంతరం గెరిల్లాలపైన దాడుల్ని జరిపించారు. ఇది తిరుగుబాటు దారుల్ని ప్రజల నుండి వేరుచేసే వ్యూహమన్నమాట.

ఈ విధంగా అమెరికా అండదండలతో గ్రీసు ప్రభుత్వం తిరుగుబాటును అణచివేసింది. ఆ తర్వాత కూడా యు.ఎస్. నుండి గ్రీసుకు ఆర్థిక –సైనిక సాయం కొనసాగింది. ఎస్సో, డౌకెమికల్, క్రిస్లర్, ఇతర అమెరికన్ కార్పొరేషన్లు గ్రీసులో భారీగా పెట్టుబడులు పెట్టాయి. అయినప్పటికీ గ్రీసులో నిరక్షరాస్యత, పేదరికం, ఆకలిచావులు విస్తృతంగా కొనసాగాయి. క్రూర మిలటరీ పాలన క్రింద గ్రీసు ప్రజలు నానా విధాలైన ఇక్కట్లకు గురయ్యారని “ఇంటర్వెన్షన్ అండ్ రివల్యూషన్” గ్రంథ రచయిత రిచర్డ్ బార్నెట్ పేర్కొన్నారు.

ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి చైనాలో ప్రజా విప్లవం కొనసాగుతున్నది. జపనీయులకు వ్యతిరేకంగా పోరాడిన ఎర్ర సైన్యం నాడు అవినీతికర నియంతృత్వ చాంగ్కైషేక్ ప్రభుత్వంపై సమరం నడుపుతున్నది. ఈ సర్కారుకు అమెరికా పూర్తి అండదండలున్నాయి. 1949 నాటికి చాంగ్కైషేక్ ప్రభుత్వానికి యు.ఎస్. రెండు బిలియన్ డాలర్ల సాయం అందించింది. అయితే ఈ ప్రభుత్వం స్వంత సైన్యమూ, ప్రజల మద్దతు కోల్పోయిందని అమెరికన్ విదేశాంగ శాఖ శ్వేతపత్రమే వెల్లడిస్తున్నది. 1949 జనవరిలో ఎర్రసైన్యం పెకింగ్ను ఆక్రమించింది. దీంతో అంతర్యుద్ధం ముగిసింది. చైనాపైన అరుణ పతాకం రెపరెపలాడింది. ఈ అతిప్రాచీన దేశం బాహ్య శక్తుల నియంత్రణ లేని ప్రజా ప్రభుత్వాన్ని తొలిసారిగా ఏర్పాటు చేసుకున్నది.

రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో మితవాదులు, ఉదారవాదులు, రిపబ్లికన్లు, డెమోక్రాట్లను కలుపుకుపోతూ జాతీయ ఏకాభిప్రాయ సాధనకు అమెరికన్ పాలకులు ప్రయత్నించారు. ప్రచ్ఛన్న యుద్ధం, కమ్యూనిజానికి వ్యతిరేకత వంటి అంశాలపైన ప్రగతిశీల శక్తుల్ని మినహాయించి మిగిలిన వారందర్నీ ఏకతాటిపైకి తీసుకురావటమే అసలు ఉద్దేశ్యమన్న మాట. ఇందుకోసం ఒక ఉదారవాద భావాలు గల అధ్యక్షుడు అవసరం. దుందుడుకు విదేశాంగ విధానం, స్వదేశాన సంక్షేమ కార్యక్రమాల్ని అమలు చేస్తూ ఉంటే అప్పుడు మితవాదులు, ఉదారవాదులిరువురి మద్దతూ లభిస్తుంది. ట్రూమెన్ ‘ఫెయిర్ డీల్’ విధానం ఇలాంటిదేమరి. యుద్ధం తాలూకు జ్ఞాపకాలు ఇంకా వెన్నాడుతూనే ఉన్న నేపథ్యంలో ఉదారవాదులు, సంప్రదాయక డెమోక్రాట్లు దురాక్రమణ పూరిత విదేశాంగ విధానానికి మద్దతు ఇస్తే ఇక ఉదారవాద – ప్రగతిశీల కూటమి విచ్ఛిన్నమవుతుందని పాలక వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి. అలాగే కమ్యూనిస్టు వ్యతిరేకత అనేది బాగా పెరిగిపోతే మాతృగడ్డపైనా రాజ్య అణచివేత పోకడలకు ఉదారవాదుల నుండి సులభంగా మద్దతు లభిస్తుంది. 1950లలో ఉదారవాదులు, మితవాదుల్ని ఒకే తాటిపైన నిలిపే ఉదంతం సంభవించింది. అదే కొరియాపై అప్రకటిత యుద్ధం. కొరియాను 35 సంవత్సరాల పాటు జపాన్ ఆక్రమించింది. రెండో

ప్రపంచ యుద్ధానంతరం ఈ దేశానికి విముక్తి లభించింది. ఉత్తర కొరియా సోషలిస్టు నియంతృత్వ దేశంగా అవతరించింది. ఇది సోవియట్ అనుకూల దేశం. దక్షిణ కొరియా అమెరికా కనుసన్నలలో మితవాద నియంతృత్వ రాజ్యమయ్యింది. రెండు కొరియాల మధ్యనా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వాతావరణం ఏర్పడింది. 1950 జూన్ 25న ఉత్తర కొరియా సైనికులు దక్షిణ కొరియా పై దాడికి బయలుదేరారు. అమెరికా పెత్తనం కింద నడుస్తున్న ఐక్యరాజ్యసమితి తన సభ్యుల్ని ఈ సైనిక దాడిని అడ్డుకునేందుకు సహకరించ వలసిందిగా కోరింది. అమెరికా సైనికుల్ని దక్షిణ కొరియాకు అండగా నిలవాల్సిందిగా ట్రూమన్ ఆదేశించారు. ఈ విధంగా యు.ఎస్. సైన్యమే ఐక్యరాజ్య సమితి దళమైంది. "అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎవరైనా సరే పెత్తందారీ పోకడలకు పోవటం మంచిది కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయాన్ని పరిరక్షించేందుకు అమెరికా తన శాయశక్తులా పాటుపడుతుంద"ని ట్రూమన్ ప్రకటించారు.

"ఈ దౌర్జన్యకర ధోరణి"కి అమెరికా ఇచ్చిన సమాధానం ఏమిటి. మూడేళ్ల పాటు అమెరికా కొరియాపైన బాంబుల వర్షం కురిపించింది. నాపాం బాంబులు విసిరింది. దీంతో ఉత్తర దక్షిణ కొరియాలు రెండూ విధ్వంసమయ్యాయి. "నాముందు ఒక ఆకారం కనబడుతున్నది. ఆ మనిషికి కళ్లు లేవు. శరీరమంతా కాలిన భాగాలతో నిండి ఉన్నది. ఒళ్లంతా చీము కారుతున్నది.. వందలాదిగ్రామాలు దగ్ధమైపోవటాన్ని నేను స్వయంగా గమనించాను. కొరియా యుద్ధాన మృతుల సంఖ్య ప్రతి నిత్యమూ పెరుగుతూ పోతున్నద"ని బి.బి.సి. జర్నలిస్టు పేర్కొన్నారు. ఈ యుద్ధాన ఉత్తర – దక్షిణ కొరియాలకు చెందిన సుమారు 20 లక్షల మంది మరణించారు. "సాయుధ పోరాటాన్ని నిరోధించి ఈ ప్రాంతంలో శాంతి భద్రతల్ని పునరుద్ధరించవలసిందిగా ఐక్యరాజ్యసమితి కోరింది. అయితే అమెరికన్ సైనికులు ఏం చేశారు. ఉత్తర కొరియా సైన్యాన్ని వెనక్కి తరమటమే కాకుండా ఇంకా ముందడుగు వేసి 'యల్లో' నది దాకా ఆక్రమించారు. వీరు చైనా సరిహద్దుకు సైతం చేరుకున్నారు. దీంతో ఆగ్రహించిన చైనా తాను యుద్ధరంగాన దుమికింది. చైనా సైనికులు పోరాడుతూ దక్షిణ ప్రాంతం వరకూ చేరుకున్నారు. 1953లో శాంతి చర్చలు జరిగి ఉత్తర – దక్షిణ కొరియాలకు పాత సరిహద్దుల్నే పునరుద్ధరిస్తూ అన్ని పక్షాలూ ఒక నిర్ణయాన్ని తీసుకున్నాయి. కొరియా యుద్ధం అమెరికన్ అధ్యక్షునికి, యుద్ధానికి అనుకూలంగా ఉదారవాదుల మద్దతును కూడగట్టింది. స్వదేశంలో యుద్ధ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు విదేశీ దురాక్రమణలకు అవసరమైన సంకీర్ణ శక్తుల అండదండల్ని ఇది పటిష్టం గావించింది. ఈ పోకడలను వ్యతిరేకించిన ప్రగతిశీలవాదులు అనేక కష్టాలకు గురయ్యారు. కొరియన్ యుద్ధానికి అనుకూలంగా ఈ విధంగా ఒక సరికొత్త జాతినే రూపొందించారని "బియాండ్ న్యూడీల్" పుస్తక రచయిత అలంజూ హాంచే వ్యాఖ్యానించారు. 1948లో ట్రూమన్‌కు వ్యతిరేకంగా వామపక్ష శక్తుల మద్దతుతో ప్రోగ్రెసివ్ పార్టీ టికెట్‌పైన పోటీ చేసిన హెన్రీ వాలెస్ కూడా ఈ యుద్ధానికి అనుకూలంగా మారాడు. తమను, కమ్యూనిస్టుల్ని వెంటపడి వేటాడిన సెనెటర్ జోసఫ్ మెకార్థిని ఉదారవాదులు ద్వేషిస్తారు. అలాంటిది కొరియన్ యుద్ధం వల్ల మెకార్థీయిజానికి సరికొత్తగా ప్రాణప్రతిష్ట జరిగిందని హాంచే పేర్కొన్నారు.

1930వ దశకం అనంతరం రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కమ్యూనిస్టులు బాగా శక్తిని పుంజుకున్నారు. కమ్యూనిస్టు పార్టీకి లక్ష మంది సభ్యులు ఉండి ఉండవచ్చు. కానీ కార్మిక సంఘాల్లో లక్షల మంది సభ్యులున్నారు. కళా రంగంలో కమ్యూనిస్టు అభిమానులు ఎందరో పనిచేస్తున్నారు. ఇంకా పెట్టుబడిదారీ విధానపు వైఫల్యాల్ని అనుభవిస్తున్న సాధారణ ప్రజానీకంలో కమ్యూనిస్టు - సోషలిస్టు అభిమానులు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఈ రీత్యానే రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికాలో పెట్టుబడిదారీ విధానాన్ని పటిష్ట పరిచేందుకు వామపక్ష శక్తుల్ని బలహీన పరిచే పనిని పాలకవర్గాలు చేపట్టాయి. ఆ విధంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి విస్తృత మద్దతును కూడగట్టే పనికి అవి పూనుకున్నాయి. ట్రూమన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన రెండు వారాల అనంతరం అమెరికన్ అధ్యక్షుడు ఎగ్జిక్యూటీవ్ ఆర్డర్ 9835ను 1947 మార్చి 22వ తేదీన జారీ చేశారు. అమెరికన్ ప్రభుత్వంలో చొరబడిన "దేశద్రోహుల్ని" ఏరివేసేందుకు ఈ ఉత్తర్వును తెచ్చారన్నమాట. ఆనాటి పరిస్థితుల్ని "ద ఫిఫ్టీస్" గ్రంథ రచయితలు డగ్లసమిల్లర్, మరియాన్ నోవక్‌లు ఇలా పేర్కొన్నారు. "అమెరికాకు అంతర్గత - బాహ్య శత్రువుల నుండి పరిరక్షించే ఈ యజ్ఞానికి విస్తృత జన బాహుళ్యపు మద్దతు ఉన్నదని అధ్యక్షుడు ట్రూమన్ చెప్పుకున్నారు. దేశానికి అంతర్గత శత్రువులంటే ఆయనదృష్టిలో కమ్యూనిస్టులన్న మాట. అయితే వాస్తవానికి కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేపట్టటం ద్వారా ప్రభుత్వం ప్రజల్లో అటువంటి 'ఉన్మాదాన్ని' రగిల్చింది. 1947 మార్చి 1952 డిసెంబరుల మధ్య కాలంలో అమెరికన్ ప్రభుత్వం 66 లక్షల మంది వ్యక్తులపైన దర్యాప్తును నిర్వహించింది. వీరిలో ఒక్కరూ స్వదేశానికి వ్యతిరేకంగా గూఢచర్యానికి పాల్పడినట్లు రుజువు కాలేదు. అయితే వీరి దేశ భక్తిపైన అనుమానాలున్నాయని ముద్రవేసి 500 మందిని మాత్రం ఉద్యోగం నుండి తొలగించింది. ఈ కేసులన్నింటిలోనూ స్పష్టమైన సాక్ష్యాధారాలేమీ లభించలేదు. ఇటువంటి కేసుల్ని రహస్య పద్ధతుల్లో విచారించారు. సహజ న్యాయసూత్రాలను ఈ సందర్భంగా పాటించలేదు. ఇందుకు సర్కారీ కిరాయి మనుషులు మాత్రమే సాక్ష్యాలు చెప్పారు. ఈ విధంగా దేశద్రోహ చర్యలేమీ రుజువుకానప్పటికీ ఏళ్ళ తరబడి కొనసాగిన ఈ తతంగం వల్ల ప్రభుత్వ యంత్రాంగంలో కమ్యూనిస్టు శ్రేణులు చొచ్చుకుపోయారన్న భావనను ప్రజల్లో చొప్పించగలగారన్న మాట. జనంలో అభద్రతా భావం ఏర్పడింది. మన వ్యవస్థను భద్రంగా కాపాడుకునేందుకు పటిష్టవంతమైన రక్షణ యంత్రాంగం అవసరమన్న పాలకుల ఉద్దేశానికి ఇలా విస్తృత మద్దతు లభించింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం సంభవించిన అంతర్జాతీయ పరిణామాలు కూడా కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదానికి దేశీయంగా అమెరికాలో ప్రజల మద్దతు లభించింది. 1948లో చెకోస్లావేకియాలో కమ్యూనిస్టేతర ప్రభుత్వాన్ని కూల్చివేసి కమ్యూనిస్టు పార్టీ గద్దెనెక్కింది. అదే సంవత్సరం సోవియట్ యూనియన్ బెర్లిన్‌ను దిగ్బంధనం గావించింది. యుద్ధానంతరం తూర్పుజర్మనీ నుండి వేరుపరుస్తూ ఈ నగరాన్ని అమెరికా, రష్యాలు రెండూ ఆక్రమించుకొని ఉండేవి. దీంతో బెర్లిన్‌కు యు.ఎస్.ఎ. విమానాల ద్వారా సరఫరాలు అందించాల్సి వచ్చింది. 1949లో చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇదే ఏడాది సోవియట్ యూనియన్ తొలిసారిగా అణుబాంబును పరీక్షించింది. 1950లో కొరియా యుద్ధం

ఆరంభమైంది. ప్రపంచాధిపత్యానికి కమ్యూనిస్టులు కుట్రపన్నుతున్నారని ఈ సంఘటనలను చూపి అమెరికన్ పాలకులు ప్రజల్ని భయపెట్టసాగారు.

పైన పేర్కొన్న కమ్యూనిస్టు విజయాలే కాకుండా అమెరికన్ ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేసిన కొన్ని ఇతర పరిణామాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇండోచైనాలో ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా విప్లవోద్యమాలు పెరుగుతున్నాయి. ఇండోనేషియాలో డచ్‌వారికి ప్రతికూలంగా పోరు సాగుతున్నది. అమెరికాకు వ్యతిరేకంగా ఫిలిఫ్ఫీన్స్‌లో సైనిక తిరుగుబాటు నడుస్తున్నది.

ఆఫ్రికాలో ప్రజల నిరసనలు సమ్మెల రూపంలో వ్యక్తమవుతున్నాయి. ఫ్రెంచిపాలనలో ఉన్న పశ్చిమ ఆఫ్రికాకు చెందిన 19 వేల మంది రైల్వే ఉద్యోగులు 1947లో చేసిన 160 రోజుల సమ్మె ఆఫ్రికా చరిత్రలోనే అతి సుదీర్ఘమైనదని "లెట్ ఫ్రీడం కమ్ నౌ" గ్రంథాన రచయిత బేసిల్ డేవిడ్ సన్ పేర్కొన్నారు. "మీ కారాగారాల్ని తెరచి ఉంచుకోండి. మరతుపాకుల్ని సిద్ధం చేసుకోండి. అక్టోబరు 10వ తేదీకల్లా మా కోర్కెలు నెరవేర్చకుంటే సార్వత్రిక సమ్మెను ప్రకటిస్తా"మని కార్మికులు గవర్నర్ జనరల్‌కు సందేశమిచ్చారంటే పరిస్థితి తీవ్రత మనకు అర్థమవుతుంది. అంతకు క్రితం 1946లో దక్షిణాఫ్రికాకు చెందిన లక్షమంది బంగారు గనుల కార్మికులు సమ్మె చేశారు. రోజుకు 10 షిల్లింగులు (అంటే రెండున్నర డాలర్లు) వేతనం చెల్లించాలని వీరు అడుగుతున్నారు. దక్షిణాఫ్రికా చరిత్రలో అతి పెద్ద సమ్మె ఇది. దీన్ని అణచివేసి శ్రామికుల్ని మళ్లీ పనులకు మరలించటానికి ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపాల్సి వచ్చింది. 1950న కెన్యాలో వేతనాలు చెల్లించనందుకు నిరసనగా సార్వత్రిక సమ్మె జరిగింది.

అందువల్ల అమెరికన్ ప్రభుత్వానికి, అమెరికన్ వ్యాపార వర్గాల ప్రయోజనాలకు ముచ్చెమటలు పోయిస్తున్నది సోవియట్ విస్తరణవాదం ఏమాత్రమూ కాదు. వాస్తవానికి చైనా, కొరియా, ఇండోచైనా, ఫిలిఫైన్స్‌లలో దేశీయ కమ్యూనిస్టు ఉద్యమాలే నడుస్తున్నాయి. ఇక్కడి వామపక్ష ఉద్యమాలు రష్యా ప్రోత్సాహంతో పుట్టుకొచ్చినవేమీకాదు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువను తిప్పికొట్టి ఓడించేందుకు అమెరికా పెద్ద యజ్ఞాన్నే సంకల్పించాల్సి వచ్చింది. ఇందుకోసం భారీ సైనిక బడ్జెటు అవసరం పడింది. అలాగే విదేశీ విధానాన్ని వ్యతిరేకిస్తున్న శక్తుల్ని అణిచేందుకు, పెద్ద మిలటరీ బడ్జెట్టును వినియోగించేందుకు ప్రభుత్వానికి దేశ ప్రజల మద్దతు కావాలి. కాంగ్రెస్‌లోని ఉదారవాదులు, అధ్యక్షుడు ట్రూమెన్ కలసి కమ్యూనిస్టు వ్యతిరేక చట్టాలు తెచ్చేందుకు, నిరసన కారుల్ని అణచివేసేందుకు రెండో ప్రపంచ యుద్ధానంతరం ఐక్యతా వాణిని వినిపించే ప్రయత్నాల్ని కొనసాగించారు.

ట్రూమన్ కన్నా, సెనెటర్ జోసఫ్, మెకార్తీ ఈ దిశగా మరికొంత దుందుడుకు పోకడలకు దిగాడు. తద్వారా కమ్యూనిస్టు వ్యతిరేకతను మరింతగా రెచ్చగొట్టాడు. విదేశాంగ శాఖలో ఇప్పటికే 205 మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారని పశ్చిమ వర్జీనియాకు చెందిన వోలింగ్ మహిళా రిపబ్లికన్ క్లబ్ సమావేశాన మాట్లాడుతూ మెకార్తీ ప్రకటించాడు. ఈ మేరకు తన వద్ద సాక్ష్యాలున్నాయంటూ కొన్ని పత్రాల్ని ఊపుకుంటూ చూపించాడు. మరుసటి

దినాన సాల్ట్‌లేక్ సిటీలో ప్రసంగిస్తూ ఈ సంఖ్యను 57గా పేర్కొన్నాడు. ఇలా పూట పూటకూ ఒక అంకెను చెప్పుకొచ్చాడు. సెనేట్‌లో ప్రసంగిస్తూ విదేశాంగ శాఖ పత్రాలంటూ కొన్ని ఫొటోస్టాట్ కాగితాల్ని చూపించాడు. వాస్తవానికి అవన్నీ మూడేళ్లనాటి పత్రాలు. ఈ జాబితాలోని ఎక్కువ మంది ఆనాటికి అసలు విదేశాంగశాఖ ఉద్యోగం నుండి రిటైరయ్యారు కూడా. అలాగే విదేశాంగశాఖలో కమ్యూనిస్టులున్నారని, మరొక సారి ఉదారవాదులున్నారని... ఈ విధంగా మాటమాటకూ తన వాదనను మార్చుకుంటూ వచ్చాడు.

కొద్ది సంవత్సరాల పాటు మెకార్తీ ఇదే ధోరణిని కొనసాగించాడు. సెనెట్ కమిటీఛైర్మన్‌గా ఆయన వాయిస్ ఆఫ్ అమెరికా రేడియో కార్యకలాపాలపైన ధ్వజమెత్తాడు. వాయిస్ ఆఫ్ అమెరికాకు విదేశాల్లో గల గ్రంథాలయాల్లో కమ్యూనిస్టులు రాసిన పుస్తకాల్ని పెట్టారని ఆయన ఆరోపించాడు. దీంతో విదేశాంగశాఖ ఆందోళన చెందింది. విదేశీ లైబ్రరీలకు పలు తాఖీదుల్ని పంపింది. దీంతో ఫిలిప్ ఫోనార్ సంపాదకత్వంలో వచ్చిన థామస్ జఫర్సన్ ఏరిన రచనలు, లిల్లియన్ హెల్మాన్ రాసిన "చిల్డ్రన్స్ హవర్" తదితర 40 పుస్తకాల్ని అధికారులు తొలగించారు. అలాగే మరికొన్ని ఇతర గ్రంథాల్ని దగ్ధం చేశారు.

క్రమంగా మెకార్తీ మరింతగా రెచ్చిపోసాగాడు. 1954లో మిలటరీలో వినాశకర కార్యకలాపాలు జరుగుతున్నాయన్న అనుమానాలపైన ఆయన దర్యాప్తును నిర్వహించాడు. కమ్యూనిస్టు అనుమానితులపైన తగినంత కఠినంగా లేరంటూ ఈ సందర్భంగా కొందరు సైనికాధికారులపైన ఆయన దాడులు చేశాడు. ఈ పోకడవల్ల రిపబ్లికన్లు డెమోక్రాట్లు ఇరువురికీ ఆయన అయిష్టుడయ్యాడు. 1954 డిసెంబర్‌లో మెకార్తీని అభిసంశిస్తూ సెనెట్ భారీ ఓటుతో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అమెరికన్ సెనెట్ సభ్యునిగా ఉండతగని రీతిలో ఆయన ప్రవర్తన ఉన్నదని సభ వ్యాఖ్యానించింది. అయితే కమ్యూనిస్టు వ్యతిరేక ఆరోపణలు, ప్రేలాపనలు ఎక్కువైనందుకు సెనెట్ మెకార్తీని అభిసంశించలేదు. సెనెట్ సబ్ కమిటీ ముందు హాజరయ్యేందుకు నిరాకరించటం, విచారణల సందర్భంగా సైన్యాధికారుల్ని దూషించటం వంటి అల్ప విషయాలపైననే సభ తన దృష్టిని నిలపటం గమనార్హం.

ఇదే కాలాన కాంగ్రెస్ మరిన్ని కమ్యూనిస్టు వ్యతిరేక చట్టాల్ని తీసుకువచ్చింది. ఉదారవాది అయిన హుబర్ట్ హంఫ్రి కమ్యూనిస్టు పార్టీని చట్ట వ్యతిరేక సంస్థగా చేయాలని ప్రతిపాదిస్తూ ఒక సవరణను తీసుకు వచ్చారు. సగం దేశభక్తునిగా ఉండటం నాకు ఇష్టం లేదు. న్యాయా న్యాయాలు వల్లిస్తూ దాటవేత వైఖరి నాకు నచ్చదు. "కమ్యూనిస్టు పార్టీని చట్టబద్ధంగా గుర్తించాలని స్పష్టంగా కోరుకోండి. లేదా నిషేధించాలని చెప్పండి. నాన్చుడు ధోరణి నాకు నచ్చదం"టూ సెనటర్ల పైన ఆయన విసుర్లు విసిరారు.

ప్రభుత్వంలోని ఉదారవాదులు కూడా కమ్యూనిస్టుల్ని వేధించే, జైలుపాలు చేసే చర్యలకు పూనుకున్నారు. మెకార్థీ ఒక్క కమ్యూనిస్టుల పైనే కాకుండా ఉదారవాదుల పై కూడా దాడులకు పూనుకున్నారు. తద్వారా ఉదారవాద మితవాద సంకీర్ణాన్ని దెబ్బతీశారు. సెనెట్ మైనార్టీ నాయకుడు లిండన్ జాన్సన్ మెకార్థీ కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రశ్నించకుండా సెనెట్ సభ్యునిగా ఆయన ప్రవర్తన సక్రమంగా లేదంటూ అభిశంసన తీర్మానాన్ని ఆమోదించేందుకు పాటుపడ్డారు.

కెన్నడీ మెకార్తీ గురించి సూటిగా తన అభిప్రాయాలు చెప్పలేదు (అభిశంసన తీర్మానంపైన ఓటింగ్ జరిగినప్పుడు జాన్.ఎఫ్. కెన్నడి సభలో లేరు). కమ్యూనిజంపైన అమెరికా మెతక ధోరణిని అవలంభించినందువల్లనే చైనాలో కమ్యూనిజం విజయం సాధించిందని మెకార్తీ నొక్కి వక్కాణిస్తుండేవారు. కెన్నడీకి కూడా ఇదే విధమైన అభిప్రాయం ఉండేది. చైనాలో 1949 జనవరిలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడినప్పుడు ప్రతినిధుల సభలో మాట్లాడుతూ కెన్నడీ ఇలా అన్నారు.

"దక్షిణాసియాలో ఏర్పడిన ఈ విపరిణామానికి శ్వేతభవనం, విదేశాంగ మంత్రిత్వ శాఖలే బాధ్యత వహించాలి. మన విదేశాంగ విధాన వైఫల్య ఫలితంగానే చైనాను కమ్యూనిస్టు పార్టీ స్వాధీనపర్చుకుంది. కమ్యూనిస్టులతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితేగానీ ఆర్థిక సహాయాన్ని అందించలేదు. మనం ఒత్తిడి చేయటం అక్కడి జాతీయ ప్రభుత్వాన్ని బలహీన పర్చింది. 20 ఏళ్ల యుద్ధం, ఉన్నత స్థానాల్లో అవినీతి గురించి ఆందోళన చెందిన మన సలహాదారులైన లాటిమోర్లు, ఫెయిర్ బ్యాంక్ వంటివారు చైనాలో కమ్యూనిస్టేతర ప్రభుత్వం ఉంటేనే మనకు లాభదాయకమన్న విషయాన్నే విస్మరించారు. (లాటిమోర్, ఫెయిర్ బ్యాంకు లిరువురూ చైనా చరిత్రపైన నిష్ణాతులు, ఫెయిర్ బ్యాంక్ హార్వర్డ్ విశ్వ విద్యాలయ ప్రొఫెసరు. లాటిమోర్‌ను మెకార్థీ తరచూ తీవ్రంగా విమర్శించే వారు) ఆసియా అంతటినీ కమ్యూనిజం ఆక్రమించు కోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతినిధుల సభ భుజస్కంధాలపైన ఉన్నది."

"కమ్యూనిస్టు ఫ్రంట్" వంటి సంస్థల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసేందుకు జాతీయ భద్రత చట్టాన్ని తీసుకురావాలని 1950లో రిపబ్లికన్లు ఒక తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీన్ని ఉదారవాద భావాలుగల సెనెటర్లు గట్టిగా వ్యతిరేకించలేదు. హుబర్ట్ హంఫ్రి, హెర్‌బర్ట్ లేమాన్ వంటివారు ఇందుకు బదులుగా నిర్బంధ కేంద్రాల్ని ఏర్పాటు చేద్దామంటూ ప్రతిపాదించారు. అనుమానితుల్ని ఇందులో నిర్బంధించవచ్చునన్నమాట. ఒకవేళ రాష్ట్రపతి 'అంతర్గత భద్రతా ఎమర్జెన్సీ'ని విధిస్తే అప్పుడు అలాంటి వారిని విచారణ లేకుండా అరెస్టు చేయవచ్చునన్న మాట. ప్రభుత్వం అంతర్గత భద్రతా చట్టానికి అతీతంగా నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేసేసింది (1968లో కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణులపైన ప్రజల్లో అసంతృప్తి రేగినప్పుడు ఈ చట్టాన్ని ఉపసంహరించారు).

1947లో ట్రూమాన్ దేశభక్తి పేరిట ఒక ఎగ్జిక్యూటివ్ ఆదేశాన్ని ప్రకటించారు. అందుకనుగుణంగా న్యాయశాఖ అమెరికన్ ప్రభుత్వాన్ని రాజ్యాంగ వ్యతిరేక చర్యల ద్వారా పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్న ఫాసిస్టు, కమ్యూనిస్టు, నియంతృత్వ, విధ్వంసకర సంస్థలంటూ కొన్ని పేర్లను విడుదల చేసింది. ఈ సంస్థల్లో సభ్యులే కాకుండా సానుభూతిపరుల్ని కూడా దేశ ద్రోహులుగా పరిగణిస్తారు. 1954 కల్లా ఈ జాబితాలో వందలాది సంస్థల పేర్లు చోటు చేసుకున్నాయి. కమ్యూనిస్టుపార్టీ, క్లు, క్లుక్స్ క్లాన్, బోపిన్ కల్చరల్ సెంటర్, సెర్వాంటిస్ ఫ్రాటర్నల్ సొసైటీ, కమిటీ ఆఫ్ నీగ్రోస్ ఇన్ ద ఆర్ట్స్, ద కమిటి ఫర్ ద ప్రొటక్షన్ ఆఫ్ ద బిల్ ఆఫ్ రైట్స్, లీగ్ ఆఫ్ అమెరికన్ రైటర్స్, పీపుల్స్ డ్రామా, వాషింగ్‌టన్ బుక్‌షాప్ అసోసియేషన్, యుగోస్లావ్ సీమన్స్ క్లబ్ వంటి వాటి పేర్లు ఇందులో ఉన్నాయి.

దేశంలో కమ్యూనిస్టు వ్యతిరేక వాతావరణాన్ని మెకార్తీ, రిపబ్లికన్లు కన్నా ఉదారవాద ప్రజాస్వామిక ట్రూమాన్ ప్రభుత్వమే అధికంగా వేడెక్కించింది. ట్రూమన్ సర్కారు న్యాయ మంత్రిత్వశాఖ వరుసగా వామపక్ష - ప్రజాతంత్ర శక్తుల అణచివేత చర్యలకు దిగింది. ఇలాంటి కేసులన్నింటిలోకీ 1950 వేసవిలో జరిగిన జులియస్, ఇథెల్ రోజన్‌బర్గ్ కేసు ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

1950 దశకంలో 'అమెరికా వ్యతిరేక కార్యకలాపాల'ను విచారించేందుకు ఏర్పరచిన కమిటీ అత్యుత్సాహంతో పనిచేసింది. కమ్యూనిస్టులతో సంబంధం ఉన్నవారన్న అనుమానంతో పౌరుల్ని వేధించటం, సమాధానాలు చెప్పని వారిని నిర్బంధించటం వంటి చర్యలకు కమిటీ పాల్పడింది. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా కోట్లాది కరపత్రాల్ని ప్రచురించింది. ఉదారవాదులు ఈ కమిటీ పనితీరును విమర్శించారు. అయితే పార్లమెంటులో మాత్రం ఉదారవాదులు, తిరోగామివాదులు కలసి దీనికి ఏటా నిధులు విడుదల చేసేందుకు అనుకూలంగా ఓటేశారు. 1958లో మాత్రం జేమ్స్ రూజ్‌వెల్ట్ ఒక్కరే ప్రతినిధుల సభలో వ్యతిరేక ఓటు వేశారు. ట్రూమాన్ కమిటీని విమర్శించినప్పటికీ అటార్నీ జనరల్ మాత్రం కమ్యూనిస్టు వ్యతిరేక విషం కక్కాడు. "ఇప్పుడు అమెరికాలో చాలా మంది కమ్యూనిస్టులున్నారు. ఫ్యాక్టరీలు, కార్యాలయాలు, వీధులు ఎక్కడ చూసినా కమ్యూనిస్టులు దర్శనమిస్తున్నారు. ఇలాంటి వారు ఒక్కొక్కరు సమాజానికి చీడపురుగుల్లాంటి వార"ని ఆయన పేర్కొన్నారు.

ఉదారవాద మేధావులు సైతం కమ్యూనిస్టు వ్యతిరేక కూటమిలో చేరిపోయారు. 'కామెంటరీ' పత్రిక రోజన్‌బర్గ్‌లు, వారి మద్దతుదారుల్ని దుయ్యబట్టింది. "కమ్యూనిస్టుల్ని రక్షించటం ద్వారా మన హక్కుల్ని కాపాడుకోగలుగుతారా? లేదు", అంటూ ఇర్వింగ్ క్రిస్టల్ 'కామెంటరీ'లో రాశారు.

అమెరికన్ న్యాయశాఖ స్మిత్ చట్టాన్ని అనుసరించి కమ్యూనిస్టు పార్టీ నాయకుల్ని జైలు పాలు చేసింది. హింసద్వారా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కమ్యూనిస్టు నాయకులు కుట్ర పన్నారని ప్రభుత్వం అభియోగం మోపింది. ఇందుకు లభించిన సాక్ష్యాలు ఏమిటి? కమ్యూనిస్టుల వద్ద మార్క్సిస్టు - లెనినిస్టు సాహిత్యం లభించింది, దీన్ని చూపించి హింసాత్మక విప్లవానికి వారు పాల్పడనున్నట్లు ప్రభుత్వం ఆరోపించింది. కమ్యూనిస్టు పార్టీ ఇప్పటికప్పుడే విప్లవ సాధనకు తయారైనట్లు ఎలాంటి ఆధారాలూ లేవు. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విన్సాన్‌కు అలా కనిపించింది. కమ్యూనిస్టు పార్టీ కుట్రపన్ని ప్రభుత్వాన్ని కూలదన్నేందుకు సిద్ధంగా ఉన్నదని ఆయనకు అనిపించింది! కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులకు కోర్టు జైలు శిక్ష విధించింది. దీంతో అనేక మంది నాయకులు రహస్య ప్రదేశాల్లో దాక్కొన్నారు. జస్టిస్ విన్సన్‌ను ట్రూమనే నియమించారు.

కమ్యూనిస్టులంటే ప్రజల్ని భయపడేలా చేసేందుకు ప్రభుత్వం రకరకాల చర్యలకు పూనుకున్నది. దాంతో మొత్తంగా పౌర సమాజంలోనే కమ్యూనిస్టు వ్యతిరేక వాతావరణం ఏర్పడింది. అత్యధిక సర్క్యులేషన్ గల పత్రికలు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వందలాది వ్యాసాలు, సంపాదకీయాలు ప్రచురించాయి. "మేం కమ్యూనిస్టు పార్టీ సభ్యుల్ని సంపాదక

విభాగంలో నియమించుకోం. అలాంటి వారు నిష్పక్షపాతంగా వార్తలు, వ్యాసాలు రాస్తారన్న నమ్మకం మాకు లేద"ని న్యూయార్క్ టైమ్స్ దినపత్రిక 1956లో సంపాదకీయం రాసింది. 1948,, 1954ల మధ్య కాలంలో హాలీవుడ్ నుండి 40 కమ్యూనిస్టు వ్యతిరేక చలన చిత్రాలు వచ్చాయి. 'ఐ లివ్డ్ త్రీ లైవ్స్' పేరిట వచ్చిన ఒక ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్స్ (ఎఫ్.బి.ఐ) ఇన్ఫార్మర్ కథను 500 వార్తా పత్రికలు సీరియల్గా ప్రచురించాయి. టెలివిజన్ ఛానళ్లు కూడా ఈ గాథను ప్రసారం చేశాయి. కమ్యూనిస్టు పార్టీలోఉండి అంతర్గత విషయాల్ని ఎప్పటికప్పుడు పాలకులకు చేరవేసే ఎఫ్.బి.ఐ. ఏజెంటు కథన్న మాట ఇది. 'ఐ మ్యారీడ్ ఎ కమ్యూనిస్ట్' 'ఐ వాజ్ ఎ కమ్యూనిస్ట్ ఫర్ ద ఎఫ్.బి.ఐ' వంటి పేర్లతో ఈ సమయంలో హాలీవుడ్ చిత్రాలు వచ్చాయి. ఇదంతా ఆనాటి వాతావరణానికి దర్పణం పడుతున్నది.

కమ్యూనిస్టులు తదితర రాజకీయశక్తుల స్వేచ్ఛను పరిరక్షించడానికి ప్రత్యేకంగా ఏర్పడ్డ 'అమెరికన్ పౌర హక్కుల సంఘం' కూడా ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణ నేపథ్యంలో క్రమంగా కాడి పారేసింది. 1940లలోనే హక్కుల సంఘం ప్రణాళికా రచయితలను ఒకర్ని సంఘం నుండి బహిష్కరించడం ద్వారా తన లక్ష్యం నుండి దూరంగా జరిగే పనిలోపడింది. ఎలిజిబెత్ గుర్లీప్లిన్ కమ్యూనిస్టు పార్టీతో సభ్యురాలిగా ఉందన్న కారణాన ఆమెను పౌర హక్కుల సంఘం నుండి వెలివేశారు. 1950వ దశకంలో హక్కుల సంఘం 'బోర్డు మెంబర్లు'గా ఉన్న కార్లిస్ లొమెంట్, ఓవెన్లో లొట్టిమోర్లు తీవ్రమైన వేధింపులకు లోనవుతున్న సందర్భంలో వారికి అండగా నిలవడానికి హక్కుల సంఘం తీవ్రమైన ఊగిసలాట ప్రదర్శించింది. కమ్యూనిస్టు పార్టీ నాయకుల మీద స్మిత్ చట్టం కింద అభియోగాలు మోపి విచారణ జరుపుతున్న తొట్టతొలి సందర్భంలో కూడా ఈ హక్కుల సంఘం బహిరంగంగా వారికి మద్దతు పలికేందుకు వెనుకాడింది. ఇక రోజన్బర్గ్ల విచారణ సందర్భంలోనైతే 'ఇందులో హక్కుల ఉల్లంఘన అంశమే లేదు' అని ప్రకటించి చేతులు దులిపేసుకుంది.

కమ్యూనిస్టు వ్యతిరేకతను వీరోచితగుణంగా చిన్నా పెద్దా అందరికీ నూరిపోశారు. మీక్కిస్పిల్లేన్ రాసిన 'ఒక ఒంటరి రాత్రి' పుస్తకం (1951) ప్రచురిస్తే మూడు లక్షల ప్రతులు అమ్ముడు పోయాయి. ఈ పుస్తకంలో హీరో మైక్హామర్ ఏమంటాడో చూడండి – ఇవాళ రాత్రి నా చేతుల్తో నేను నా చేతివేళ్ళ కన్నా ఎక్కువమందిని చూపాను. తడిగుడ్డల్తో గొంతులు కోసిన విధంగా గుండేసి చంపా ప్రతి ఒక్కళ్ళన్నీ. ఆ ప్రతి నిమిషాన్ని నేను ఎంతో ఆస్వాదించా.. వాళ్ళంతా కమ్యూనిస్టు ముండా కొడుకులు. మిండగాళ్ళు ఏనాడో చచ్చి ఉండాల్సింది." – ఇదీ ఆ పుస్తకం వరస. కామిక్ పుస్తకాల్లోనూ పిల్లల మనసులను విషం చేసే రాతలే. ఓ కామిక్ పుస్తకంలోని హీరో కెప్టెన్ అమెరికా ఏమంటాడో చూడండి. "జాగ్రత్త కమ్యూనిస్టులు, గూఢచారులు, దేశద్రోహులు, విదేశీ ఏజెంట్లు, కాని కెప్టెన్ అమెరికా చుట్టూ ఉన్న మనుషులు విధేయులు, స్వేచ్ఛా జీవులు, మీరు కూడా రండి వీళ్ళతో చేరండి". కథలు, కామిక్లే కాదు స్కూలు పిల్లల్లో కమ్యూనిస్టు వ్యతిరేక బూచిని రేపెట్టేదానికి 'మాక్డ్రిల్' పేరిట సోవియట్ వాళ్ళు అమెరికా మీద దాడి చేస్తే ఇలా సైరన్ మోగిస్తాం అప్పుడు మీరంతా మీమీ బల్లల కింద నక్కిదాక్కోవాలి. 'ఆల్ క్లియర్' (అంతా సవ్యంగా ఉంది) అని మేం చెప్పేవరకూ మీరంతా అలానే ఉండాలి – అంటూ అదే పనిగా విన్యాసాలు చేయించేవాళ్ళు.

నిజానికి ఆ కాలంలో ప్రభుత్వం తలుచుకుంటే నిరాయుధీకరణ విధానానికీ విస్తృతమైన ప్రజా మద్దతు కూడగట్టే పరిస్థితి నెలకొని ఉంది. 30వ దశకంలోని మహామాంద్యం మూలాన పునాదులంతా కదలిపోయిన అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థ యుద్ధం మూలంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని సజావుగా నడుపుకోవచ్చు. ఇబ్బడిముబ్బడిగా లాభాలూ పోగేసుకోవడాన్ని రుచి మరిగింది. అందుకే ట్రూమన్ అనుసరించిన పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక విధానాలు ఆకర్షకంగా కనిపించాయి. ట్రూమన్ యుద్ధ పెద్ద బాలశిక్ష తెరవడానికి ముందే ఉక్కు వ్యాపార పత్రిక 1946 నవంబరు సంచికలో ఇలా రాసుకొచ్చింది.

"ట్రూమన్ అనుసరించబోయే విధానాలు ఈ దేశంలో యుద్ధ సన్నాహక ఏర్పాట్లు చాలా కాలం పాటు కొనసాగగలవనే కృత సంకల్పాన్ని, హామీని ఇస్తున్నాయి."

ఈ అంచనాలు తదనంతర కాలంలో ఖచ్చితంగా అని తేలాయి. 1950 వ దశకం తొలినాళ్ళలో అమెరికా బడ్జెట్ 40 బిలియన్ డాలర్లు కాగా ఇందులో మిలిటరీ బడ్జెట్ వాటా 12 బిలియన్ డాలర్లు. 1955 నాటి కల్లా మిలిటరీ బడ్జెట్ వాటాయే 40 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. దేశ బడ్జెట్ మాత్రం 62 బిలియన్ డాలర్లే.

ఇక 1960లో చూస్తే మిలిటరీ బడ్జెట్ 45.8 బిలియన్ డాలర్లకు చేరింది. దేశ బడ్జెట్‌లో ఇది 49.7 శాతం. ఆ ఏడాది జాన్.ఎఫ్.కెనడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అధ్యక్షపీఠం అధిరోహించిన మరునాటి నుండే మిలిటరీ వ్యయాన్ని పెంచుకుంటూ పోయాడు. కేవలం పద్నాలుగు నెలల కాలంలో రక్షణశాఖకు 9 బిలియన్ డాలర్లు కుప్పించాడని 'బ్యాలన్స్ ఆఫ్ టెర్రర్' పుస్తక రచయిత ఎడ్గార్ బాటమ్ బహిర్గతం చేసాడు.

సోవియట్ సైనిక – ఆయుధ పాటవం గురించి అనవసర భయ సందేహాలు రేకెత్తిస్తూ, ఆదేశం కన్నా బాంబర్ల విషయంలో ఇంత వెనుకున్నాం. మిస్సైళ్ళ విషయంలో ఇంకా ఇంత వెనుక ఉన్నాం.' అని ఊదరగొడుతూ 1962 నాటికి అణ్వాయుధాల తయారీనీ అగ్ర స్థాయికి పెంపొందించుకు పోయారు.

హిరోషిమాను సర్వనాశనం చేసిన ఆటంబాబు సైజువి 1500 తయారు చేసి పెట్టారు. వీటితో ఈ భూపటలం మీద పేరున్న ప్రతి నగరాన్నీ ధ్వంసం చెయ్యవచ్చు. ఇంకో విధంగా చెప్పుకోవాలంటే ఈ భూమ్మీద నివసించే ప్రతి మనిషికి – ఆడా మగా పిల్లాపీచూ తేడా లేకుండా – 10 పౌండ్లు టి.యన్.టిని సిద్ధం చేసారు. ఇన్ని అణు బాంబులు ప్రయోగించడానికి అనే పేరిట, ఖండాంతర ప్రయోగ క్షిపణులుగా ఓ యాభై, అణు జలాంతర్గాములు, మరో 80 ఖండాంతర సైనిక స్థావరాలల్లో 90, 1700 బాంబర్లు, యుద్ధ విమాన వాహక నౌకలపై మరో 300 ఫైటర్ బాంబర్లు. క్షేత్ర ఆధారంగా ప్రయోగించడానికి మరో వెయ్యి సూపర్ సోనిక్ ఫైటర్లు అమెరికా అమ్ములపొదిలో జమ చేసారు.

నిజానికి సోవియట్ రష్యా దగ్గర ఆనాటికి అమెరికా కన్నా తక్కువ ఆయుధాలే ఉన్నాయి. ఖండాతర ప్రయోగ క్షిపణులు యాభై – వందా మధ్యన ఉంటాయి. లాంగ్‌రేంజ్ బాంబరు ఓ రెండు వందలపై చిలుకు ఉండి ఉంటాయి. కాని అమెరికా రక్షణ బడ్జెట్ ఏటికేడాది

పెరిగిపోతానే వచ్చింది. ఆయుధ పోటీ ఉన్మాదం మాదిరి పట్టేసింది. ఆయుధ తయారీ కార్పొరేట్ కంపెనీల లాభాలమీద లాభాలు పోగేసుకున్నాయి. తక్షణ కాంట్రాక్టుల పుణ్యమా అని ఉపాధి అవకాశాలూ పెరిగాయి. ఉద్యోగుల జీతాలూ పెరిగాయి. ఏతావాతా అమెరికన్ కార్మికవర్గంలో గణనీయమైన భాగం యుద్ధ పరిశ్రమల మీద ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి దాపురించింది.

1970 నాటికి అమెరికా మిలిటరీ బడ్జెట్ 80 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఆయుధ ఉత్పత్తి కార్పొరేట్ కంపెనీల జాతకాలు ఒక్కసారిగా మారిపోయాయి. 40 బిలియన్ డాలర్లు ఆయుధ వ్యవస్థ మీద ఖర్చుచేస్తే – ఈ ఆదాయం అంతా 12 నుండి 15 బడా కార్పొరేట్ కంపెనీలు స్వంతం చేసుకున్నాయి. నిజానికి సర్కారు ఇచ్చే కాంట్రాక్టులే లేకపోతే ఈ కంపెనీలన్నీ ఏనాడో మూతపడేవి. కేవలం సర్కారీ కాంట్రాక్టుల కోసమే ఇవి పుట్టుకొచ్చాయా అన్న అనుమానం రాకమానదు ఎవరికైనా. స్వయానా ఆర్థిక శాస్త్రవేత్త, జాయింట్ ఎకనామిక్ కమిటీ ఛైర్మన్ అయిన సెనెటర్ వాల్ డగ్లస్ విచారణలో తేలిన విషయం ఏమిటంటే – "నిజానికి సర్కారు కేటాయించిన ప్రతి ఏడు కాంట్రాక్టులలో ఆరు కాంట్రాక్టులు పోటీ రహితమైనవి. అధికారిక రహస్యం పేరిట ప్రభుత్వమే తనకు నచ్చిన కంపెనీని పిలిచి రహస్యంగా కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు తెలుస్తుంది".

"పేరు గాంచిన వంద అతిపెద్ద రక్షణ కాంట్రాక్టులు చేపట్టే కార్పొరేట్ కంపెనీలలో 2500 మంది మాజీ రక్షణ మిలిటరీ ఉద్యోగులు కొలువుకు కుదురుకున్నారు. ఇందు మూలానే ఏమో ఈ వంద కంపెనీలే మొత్తం కాంట్రాక్టులలో 67.4 శాతం వాటా దక్కించుకున్నాయి." అని సెనెట్ కమిటీ విచారణ నివేదిక ఒకటి చమత్కరించింది.

దేశంలో అనేక చోట్ల దుర్భర దారిద్ర్యం తాండవిస్తున్న ఈ దేశం నిరంతరం యుద్ధ ఆధారిత ఆర్థిక వ్యవస్థ మీదే నెట్టుకొస్తా వుంది. యుద్ధాలే లేకపోతే చాలామందికి ఉపాధి ఉండదు. చేతిలో డబ్బు ఆడదు. అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థ మాదిరి నడవాలంటే యుద్ధం ఉండక తప్పదు. ఇంత చేసినా సంపద పంపిణీలో తీవ్రమైన అసమానతలు చోటు చేసుకున్నాయి. 1944 – 61 మధ్య కాలంలో కూడా ఈ అసమానతలలో వీసమెత్తు మార్పులేదు. జనాభాలో పై ఐదు శాతం మంది 45 శాతం ఆదాయాన్ని స్వంతం చేసుకుంటుంటే కింది ఐదుశాతం మంది మొత్తం ఆదాయంలో 5 శాతంతో సరిపెట్టుకునే పరిస్థితి. 1953లో చూస్తే కేవలం 1.6 శాతం వయోజన జనాభా 80 శాతం స్టాక్‌మార్కెట్ షేర్లను, 90 శాతం కార్పొరేట్ బాండ్లను స్వంతం చేసుకుని ఉన్నారు. దేశంలో రెండు లక్షల కార్పొరేట్ కంపెనీలు ఉంటే కేవలం 200 బడా కార్పొరేట్ కంపెనీలు (అంటే 1/1000 శాతం కంపెనీలు) జాతి సంపదలో 60 శాతం మీద ఆధిపత్యం సంపాదించాయి.

# 6

# అజలేని విజయం - వియత్నాం

1945 శీతాకాలంలో జపాన్ ఓటమి పాలయింది. ఒకప్పటి ఫ్రెంచి వలస రాజ్యంగా ఉన్న ఏ ఇండో చైనానయితే యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఆక్రమించుకుందో, ఓటమి చవిచూశాక బలవంతాన ఆ ఇండో చైనా నుండి వెనుదిరగాల్సి వచ్చింది. ఈ మధ్యకాలంలోనే ఇండో చైనా గడ్డ మీద విప్లవ ఉద్యమం అభివృద్ధి చెందింది. వలస ఆధిపత్యానికి చరమగీతం పాడి ఇండో చైనా రైతాంగానికి నవనవోన్మేష జీవితం అందించాలనే కృతనిశ్చయంతో పనిచేసింది ఆ ఉద్యమం. ఈ పోరాటానికి కమ్యూనిస్టు నాయకుడు హోచిమన్ నాయకత్వం వహించాడు. విప్లవకారులు జపాన్ సేనలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఇండో చైనా గడ్డ మీద నుండి జపాన్ నిష్క్రమించడంతో 1945 ఏడాది చివర్లో హనోయ్ నగర వీధులలో లక్షలాది మంది ప్రజానీకం విజయోత్సవం జరుపుకున్నారు. తమ దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. థామస్ పైన్ రాసిన మానవ హక్కులు – పౌర హక్కుల నుండి, ఫ్రెంచి విప్లవం నుండి, అమెరికా స్వాతంత్ర్య ప్రకటనల నుండి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ప్రకటనలో ఇలా పేర్కొన్నారు. "జన్మతః మానవులందరూ సమానులే. సృష్టికర్త నుండి అవిభాజ్యమైన హక్కులు పొంది ఉన్నారు. పరిపూర్ణ జీవితం, మానవ స్వేచ్ఛ, ఆనందం – ఇవే ఆ అవిభాజ్యమైన హక్కులు."

ఇంగ్లండ్ రాజుకు వ్యతిరేకంగా 1776లో అమెరికన్లు తమ ఇబ్బందులు సబ్బందులు ఎలా ఏకరువు పెట్టుకున్నారో వియత్నాం వాసులుగా ఫ్రెంచి వలస పాలనకు వ్యతిరేకంగా తమ ఆరోపణలను సంధించారు.

ఫ్రెంచి వలస పాలకులు ఇండో చైనా మీద అమానవీయ చట్టాలు రుద్దారు. స్కూళ్ళ కన్నా లెక్కకు మిక్కిలిగా జైళ్ళను నిర్మించారు. వియత్నాం దేశభక్తులను నిర్దయగా, కిరాతకంగా హత్య గావించారు. తిరుగుబాట్లను రక్తపుటేర్లలో ముంచెత్తారు. ప్రజాభిప్రాయాన్ని గడ్డిపోచ కింద తీసిపారేశారు. వాళ్ళు మా ధాన్య క్షేత్రాలను, గనులను, అడవులను, ముడి ఖనిజ సంపదను కొల్లగొట్టుకుపోయారు.

ఏమాత్రం సమర్ధనీయం కానీ, తలకు మించిన పన్నుల భారాన్ని మోపి ప్రజానీకాన్ని, ముఖ్యంగా రైతాంగాన్ని దుర్భర దారిద్ర్యంలోకి నెట్టారు. ఒక్క ఏడాదిలోనే 1944–45 మధ్య కాలంలో దాదాపు రెండు లక్షల మంది పౌరులు ఆకలి చావులకు బలయ్యారు.

యావత్ వియత్నాం ప్రజానీకం ఉమ్మడి లక్ష్యంతో సమైక్యమై ఆరు నూరైనా సరే సొంతగడ్డని ఫ్రెంచి వలస పాలకులు పునరాక్రమించుకోవడానికి చేసే ఏ ప్రయత్నాన్ని అయినా ఎంత కష్టమోర్చి అయినా సరే తిప్పికొట్టాలనే కృతనిశ్చయంతో ఉన్నారు.

వియత్నాం యుద్ధం మీద అమెరికా రక్షణ శాఖ ఒక అధ్యయనం నిర్వహించింది. 'అతి రహస్యం'గా తొక్కిపెట్టింది. అయితే ప్రఖ్యాతి గాంచిన 'పెంటగాన్ పేపర్స్' కేసులో డేనియల్ ఎల్స్‌బర్గ్, ఆంథోని రూనోల పుణ్యమా అని ఈ పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అందులో హోచిమిన్ కార్యకలాపాల గురించి ఇలా అభివర్ణించారు.

"…. అటు జపాన్, ఇటు ఫ్రెంచి  పాలకులను నికరంగా ఎదిరించి పోరాడగల దేశవ్యాప్త రాజకీయ సంస్థగా 'వియత్ మిన్హ్'ను నిర్మించడంలో హోచిమన్ తన కార్యదక్షతను చూపించాడు. యుద్ధకాలంలో దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు, అభిమానులు, అనుచరగణం ఉన్న ఏకైక నాయకుడు హోచిమిన్.

జపనీయులను కూలదోసి ప్రజాతంత్ర గణతంత్ర వియత్నాం దేశాన్ని స్థాపించాడు. సంకీర్ణ బలగాలకు ఆహ్వాన ఏర్పాట్లు చేశాడు. 1945 సెప్టెంబర్ నెలలో కొన్ని వారాల పాటు వియత్నాం తొలిసారిగా ఒకే ఒకసారి విదేశీ ఆధిపత్యం లేని పాలనతో ఆధునిక చరిత్రలో కాలుమోపింది. హోచిమిన్ నాయకత్వాన ఉత్తర దిక్కు నుండి దక్షిణ కొస వరకూ ఐక్యంగా నిలిచింది.

అయితే పశ్చిమ దేశాలు ఈ పరిస్థితుల్లో మార్పులు తీసుకువచ్చే పనిలో పడ్డాయి. ఇంగ్లండ్ ఇండో చైనా దక్షిణ భాగాన్ని ఆక్రమించుకొని ఫ్రెంచి పాలకులకు అప్పచెప్పింది. చైనా (కమ్యూనిస్టు విప్లవానికి ముందు ఉన్న చాంగ్–కై–షేక్ పాలనలో ఉంది) ఇండో చైనా దక్షిణ భాగాన్ని ఆక్రమించుకుంది. ఈ భూభాగాన్ని ఫ్రెంచి పాలకులకు అప్పచెప్పమని చైనాను అమెరికా ఒప్పించే ప్రయత్నంలో పడింది. ఈ సందర్భంలో హోచిమిన్ ఒక అమెరికన్ పత్రికా విలేఖరితో 'చూడబోతే మేం ఒంటరి పాటయ్యాం. ఇహ మా కాళ్ళ మీద మేం నిలబడాలి' అని వ్యాఖ్యానించాడు.

1945 అక్టోబర్ – 1946 ఫిబ్రవరి మధ్యకాలంలో హోచిమిన్ అమెరికా అధ్యక్షుడు ట్రూమన్‌కు ఎనిమిది ఉత్తరాలు రాశాడు. అట్లాంటిక్ ఒప్పందంలో పొందుపరచిన దేశాల స్వయం నిర్ణయాధికారం గురించి పదే పదే గుర్తు చేశాడు. ఇందులో ఒక లేఖ ట్రూమన్‌తో పాటు ఐక్యరాజ్యసమితికి కూడా పంపాడు.

"ప్రభువులు నికరమైన మానవతావాద దృక్పథంతో ఈ విషయాన్ని పరిశీలించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నా. 1944 శీతాకాలం నుండి 1945 వసంతకాలం వరకు చూస్తే రెండు లక్షల మంది వియత్నామీయులు ఆకలి చావులకు బలయ్యారు. ఫ్రెంచి పాలకులు బలవంతపు వసూళ్ళకు దిగి నిల్వచేసిన ధాన్యం పుచ్చిపోయింది. 1945 వేసంగిలో నాలుగింట మూడొంతుల వ్యవసాయ భూములు వరదల్లో మునిగిపోయాయి. ఫలితంగా తీవ్రమైన కరువు ఏర్పడింది. ఆరింట ఐదొంతుల పంట చేతికి అందలేదు. జనం ఆకలికి అలమటించిపోతున్నారు. ప్రపంచంలోనే అతి శక్తివంతమైన మీ బోటి దేశాలు, అంతర్జాతీయ సహాయక సంస్థలు పూనుకుని తక్షణం ఆపన్న హస్తం అందించకుంటే మేం తీరని వినాశనాన్ని చవి చూడాల్సి వస్తుంది" అని హోచిమిన్ ఈ లేఖలో అభ్యర్థించాడు.

ట్రూమన్ స్పందించకుండా మిన్నకుండిపోయాడు.

1946 అక్టోబర్‌లో ఫ్రెంచి పాలకులు ఉత్తర వియత్నాంలోని రేవు పట్టణమైన హాయ్‌పాంగ్ మీద బాంబుల వర్షం కురిపించారు. వియత్నాంను ఎవరూ పరిపాలించుకోవాలి అన్న అంశం మీద వియత్ మిన్హ్ ఉద్యమానికి ఫ్రెంచి పాలకులకు మధ్యన ఎనిమిదేళ్ళ పాటు సాగిన సుదీర్ఘ యుద్ధానికి అదే నాంది పలికింది. 1949లో చైనాలో కమ్యూనిస్టు విప్లవం జయప్రదం కావడం, ఆ మరుసటి ఏడాదే కొరియాతో యుద్ధానికి తలపడటంతో ఫ్రెంచి పాలకులకు అమెరికా భారీ మొత్తాల్లో ఆర్థిక సాయం అందిస్తూ వచ్చింది. ఇదంతా సైనిక వ్యయానికి ఉద్దేశించి చేసిన సాయమే. 1954 నాటికి ఇండో చైనా భూభాగం మీద ఉన్న ఫ్రెంచి సైన్యానికి అమెరికా 3,00,000 తేలికపాటి ఆయుధాలు, మిషన్‌గన్లు సరఫరా చేసింది. బిలియన్ డాలర్ల రొక్కం ఆర్థిక సాయంగా అందించింది. అంటే ఫ్రెంచి యుద్ధ ఖర్చులను అమెరికా 80 శాతం భరించింది. అమెరికాకు ఇంత అవసరం ఏమొచ్చింది? ఆసియాలో కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించడానికి గాను అమెరికా ఈ మేరకు సాయం అందించాల్సి వచ్చింది అని పైకి చెప్పేవారు. కానీ ఈ విషయమై బహిరంగ చర్చకు ఎక్కడా ఆస్కారం ఇవ్వలేదు. అసలు కారణం ఏమిటంటే అమెరికా జాతీయ భద్రతా సమితి దేశ విదేశాంగ విధానం ఎలా ఉండాలనే అంశం మీద అధ్యక్షుల వారికి సలహాలు ఇస్తుంటుంది. అవన్నీ రహస్య నివేదికల రూపంలో ఉంటాయి. 1950లో 'చైనీస్ చెక్కర్' అనే సిద్ధాంతం అమెరికా అధికార నడవాల్లో బహుళ వ్యాప్తిలో ఉండేది. ఈ ఆటలో చెక్క బల్ల మీద చెక్కిన కంచాల్లో గోళీలు ఉంచి ఒక గోళీని దాటితే ఆ వరసన దొర్లుకుంటూ చివరి కంచా వరకు చేరవచ్చు. అలాగే ఒక దేశంలో కనుక కమ్యూనిజం విజయం సాధిస్తే చుట్టుపక్కల ఉన్న దేశాలు ఆ వ్యామోహంలో పడి – అలా దేశాలకు దేశాలే కమ్యూనిస్టుల ప్రాభవంలోకి వస్తాయి. కాబట్టి తొలిగా కమ్యూనిస్టు పతాకాన్ని ఎగురవేయబోయే దేశాన్ని ఆరు నూరైనా కమ్యూనిస్టు దేశంగా మారకుండా నిలవరించాలి అనేది ఈ సిద్ధాంత సారాంశం. అందుకే ఇండో చైనా కమ్యూనిస్టు

దేశంగా అవతరించకుండా ఉంచడానికే అమెరికా ఫ్రెంచి సైన్యానికి అన్ని విధాలా తోడ్పాటు అందించాలని అధ్యక్షుల వారికి రహస్య నివేదిక అందించింది జాతీయ భద్రతా వ్యవహారాల సమితి.

1952 జూన్‌లో ఇదే సమితి రూపొందించిన రహస్య మెమోలో అమెరికా మిలిటరీ స్థావరాలు చైనా, ఫిలిప్పీన్, తైవాన్, జపాన్, దక్షిణ కొరియా తీర ప్రాంతాల్లో వరుసగా ఒక దాని తర్వాత ఇంకొకటి స్థానం సంపాదించిన వైనాన్ని ఉదహరించింది.

ఆగ్నేయ ఆసియా కమ్యూనిస్టుల ప్రాబల్యంలోకి వెళ్ళిపోతే పసిఫిక్ మహా సముద్ర తీరానికి ఆవల అమెరికన్ ప్రయోజనాలకు చైనా అడ్డంకిగా మారుతుంది. దీనికి మించి మధ్యప్రాచ్యంలో అమెరికా రక్షణ ప్రయోజనాలు మౌళికంగా దెబ్బతినిపోతాయి.

ఆగ్నేయాసియాలో ప్రత్యేకించి మలయా, ఇండో చైనా దేశాలు రబ్బరు, తగరం వంటి సహజ వనరులతో యావత్ ప్రపంచ అవసరాలు తీర్చడంతో సమృద్ధంగా అలరారుతున్నాయి. పెట్రోలియం, ఇతర వ్యూహాత్మక సరుకుల ఉత్పత్తిదారులుగా ఉన్నాయి.

అలాగే జపాన్ తన బియ్యం అవసరాల కోసం ఆగ్నేయాసియా మీద ఆధారపడి వుంది. ఆగ్నేయాసియాలో కనుక కమ్యూనిజం విజయం సాధిస్తే 'జపాన్ కూడా కమ్యూనిజానికి చోటివ్వక తప్పని పరిస్థితికి నెట్టబడితే' విషయం మరింత ముదురుపాకానపడుతుంది. ఈ దృష్ట్యానే 1953లో అమెరికన్ కాంగ్రెస్ అధ్యయన నివేదిక ఇలా పేర్కొంది.

"ప్రాదేశికంగా ఇండో చైనా సంపద్వంతమైన బియ్యం, రబ్బరు, బొగ్గు, ముడి ఇనుము వంటి సహజ వనరులకు ఆలవాలంగా ఉంది. భౌగోళికంగా చూస్తే ఆగ్నేయాసియా ప్రాంతంలో కీలకమైన వ్యూహాత్మక స్థానంలో ఉంది ఇండో చైనా."

అదే ఏడాది హోంశాఖ తయారుచేసిన నివేదికలో ఫ్రెంచి వాళ్ళు ఇండో చైనా యుద్ధాన్ని కోల్పోయేలా ఉన్నారు. అంతర్గతంగా తగిన మద్దతు కూడగట్టుకోవడంలో విఫలమయ్యారు అని పేర్కొంటూ 'ఆ ప్రాంతాన్ని దక్కించుకోవడానికి ఏదన్నా ద్వైపాక్షిక ఒప్పందం గురించి ఆలోచిద్దామా అంటే అది ఇండో చైనాను కోరి కమ్యూనిజం వైపుకు నెట్టినట్లు అవుతుంది. ఇది కేవలం ఇండో చైనాకే పరిమితం కాదు. ఆగ్నేయాసియా అంతటా ప్రభావం చూపిస్తుంది' అన్న భయ సందేహాలు వ్యక్తం చేసింది. "ఒకవేళ ఆ భూభాగం నుండి ఫ్రెంచి సైన్యం నిష్క్రమించాలని నిర్ణయించుకుంటే మనం ఆ స్థానాన్ని ఆక్రమించుకోవాలేమో లోతుగా ఆలోచన చేయాలి" అన్న వాక్యంతో ఆ నివేదిక ముగిసింది.

ఫ్రెంచి వాళ్ళకు అంతర్గత మద్దతు లభించకపోవడం, వియత్నాం ప్రజానీకం, విప్లవోద్యమం హోచిమిన్ వెన్నంటి ఉండటంతో 1954లో ఫ్రెంచి సైన్యం ఇండో చైనాను వీడి

వెళ్ళింది. జెనీవాలో జరిగిన ఒక అంతర్జాతీయ సమావేశంలో ఫ్రెంచి ప్రభుత్వానికి – వియత్ మిన్హ్‌కు మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఫ్రెంచి సైన్యం తాత్కాలికంగా దక్షిణ వియత్నాంకు ఉపసంహరించుకునేట్లు, వియత్ మిన్హ్ ఉత్తర వియత్నాంకు పరిమితం అయేట్లు – రెండేళ్ళ తరువాత ఈ రెండు భూభాగాలను ఏకీకరించి వియత్నామీయులు తమ స్వంత ప్రభుత్వాన్ని తామే ఎన్నుకునేట్లు ఉభయ పక్షాలూ ఒక అంగీకారానికి వచ్చాయి.

అయితే వియత్నాం ఏకీకరణను అడ్డుకోవడానికి అమెరికా వేగంగా పావులు కదిపింది. దక్షిణ వియత్నాంను అమెరికా అదుపులోకి తెచ్చుకోవడానికి చురుకుగా ప్రయత్నాలు సాగించింది. అమెరికాలోని న్యూజెర్సీలో నివసిస్తున్న వియత్నాం మాజీ అధికారి ఎన్‌గువోడీన్‌డైమ్‌ను తీసుకొచ్చి సైగాన్‌లో ప్రభుత్వాధినేతగా నియమించింది. అతన్ని అడ్డం పెట్టుకుని వియత్నాం ఏకీకరణ – ఎన్నికల ప్రక్రియలను అడ్డం కొట్టేందుకు ప్రోత్సహించింది. 1954లో అమెరికా త్రివిధ దళాల అధిపతులకు ఉద్దేశించిన ఒక 'నోట్'లో ఒప్పందం ప్రకారం స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ఇరుగు పొరుగు దేశాల్లో (జెనీవా సదస్సు నిర్ణయానుసారం ఇండో చైనాను లావోస్, కంబోడియా, వియత్నాం అనే మూడు భాగాలుగా విభజించారు) అనివార్యంగా నష్టం జరుగుతుంది. ఈ మూడు ప్రాంతాలూ కమ్యూనిస్టుల పాలనలోకి వెళ్ళిపోతాయి" అన్న హెచ్చరిక చేశాయి ఇంటిలిజెన్స్ వర్గాలు. ఎన్నికల కోసం వియత్–మిన్హ్ చేసిన విజ్ఞప్తులను డైమ్ పెడచెవిన పెట్టాడు. పదే పదే వాయిదా వేశాడు. అమెరికా అందించిన డబ్బు, ఆయుధాలతో తన పరిపాలనను బలోపేతం చేసుకున్నాడు. పెంటగాన్ పేపర్‌లలో పేర్కొన్నట్లు – "దక్షిణ వియత్నాం అక్షరాలా అమెరికా సృష్టి."

... ... ...

1965లో 2,00,000 మంది అమెరికన్ సైనికులు దక్షిణ వియత్నాంలో కాలుమోపారు. 1966లో మరో 2,00,000 మంది సైన్యాన్ని రంగంలోకి దించారు. 1968 నాటికి ఈ సంఖ్య 5,00,000 దాటింది. దక్షిణ వియత్నాంలోని వైమానిక స్థావరాలను ఉపయోగించుకొని అమెరికన్ బాంబర్లు చరిత్రలో కనీ వినీ ఎరుగని స్థాయిలో బాంబుల వర్షం కురిపించాయి ఆ చిన్న దేశం మీద. 1965 జూన్ 5న సైగాన్ నుండి పంపిన వార్తా కథనం ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ పత్రిక అమెరికన్ బాంబింగ్ మూలంగా వియత్నాంలో చోటు చేసుకున్న మానవ హననం గురించి తొలిసారిగా బయటి ప్రపంచానికి వార్త పొక్కింది.

"గత సోమవారం నుండి కమ్యూనిస్టులు క్యయాంగ్ ఎన్‌గై నుండి వెనక్కి తగ్గుతున్న క్రమంలో అమెరికన్ జెట్ బాంబర్లు దగ్గర్లోని కొండ ప్రాంతం మీద బాంబుల వర్షం కురిపించాయి. వాళ్ళు ఆ కొండల్లో తలదాచుకోవడానికి వెళ్ళి ఉంటారనే అంచనాతో ఈ దాడుల్లో కనీసం ఐదువందల మంది వియత్నామీయులు మరణించి ఉంటారని ఒక అంచనా. వాళ్ళంతా వియత్

కాంగ్ సైనికులే అనేది అమెరికన్ల వాదన. కానీ నాపాం బాంబులు, జెల్లీ గ్యాసోలిన్ మూలంగా ఒళ్లు కాలి వైద్యం కోసం వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిలో నాలుగింట మూడొంతుల మంది గ్రామీణ మహిళలే" – అని న్యూయార్క్ టైమ్స్ ప్రకటించింది.

సెప్టెంబర్ 6న సైగాన్ నుండి వెలువడిన మరో వార్తా కథనం వివరాలు ఇలా ఉన్నాయి.

"దక్షిణ సైగాన్‌లోని బీన్‌హోవ ప్రావిన్సులో ఆగస్టు 15వ తేదీన అమెరికన్ విమానాలు ప్రమాదవశాత్తు బౌద్ధ మతస్తుల 'పగోడా'మీద, ఒక క్యాథలిక్ చర్చి మీదా బాంబులు కురిపించాయి. 'పగోడా' మీద బాంబులు కురిపించడం ఇప్పటికిది మూడోసారి. ఇదే ప్రాంతంలో ఉన్న కావోదాయ్ మతస్తుల గుడి మీద కూడా రెండుసార్లు బాంబింగ్ జరిగింది. డెల్టా ప్రాంతంలో జరిగిన నాపాం బాంబు దాడుల మూలంగా ఒక మహిళ రెండు చేతులూ కాలిపోయాయి. కనురెప్పలు కూడా కాలి కళ్ళు మూసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. నిద్రించడానికి ఆ మహిళ తల అంతా దుప్పటితో ముసుగేసుకోవలసిన పరిస్థితి. ఆమె పిల్లలిద్దరూ బాంబు దాడిలో చనిపోయారు. అది కళ్ళారా చూసిన ఫలితంగా ఆమె నోట మాట పడిపోయింది."

దక్షిణ వియత్నాంలో తమ దేశం ప్రదర్శిస్తున్న వాయు శౌర్య ప్రతాపాల మూలంగా అమాయక వియత్నాం పౌరులు మరణించడాన్ని ఎక్కువమంది అమెరికన్‌లు హర్షించలేకపోయారు.

దక్షిణ వియత్నాంలోని విశాలమైన భూభాగాలను 'ఫ్రీ ఫైర్ జోన్స్' పరిగణించింది అమెరికన్ సైన్యం. ఆయా ప్రాంతాలలో ఉండే ముసలీ ముతకా, పిల్లా, జెల్లా సహా ఎవరినైనా సరే శత్రువుగా పరిగణించి ఇష్టారాజ్యంగా బాంబులు కురిపించడమే ఈ 'ఫ్రీ ఫైర్ జోన్స్' ఉద్దేశం. వియత్‌కాంగ్ సైన్యానికి ఆశ్రయం కల్పిస్తున్నాయన్న అనుమానం ఉన్న ప్రతి పల్లె మీదా పడి అమెరికన్ సైన్యం యువకులను కాల్చి చంపింది. ఇళ్ళను తగలేశారు. మహిళలు, పిల్లలు, ముసలివాళ్ళను శరణార్థి శిబిరాలకు తరలించారు. జొనాథన్ షెల్ రాసిన 'ది విలేజ్ ఆఫ్ బెన్‌సుక్' అనే పుస్తకంలో ఇలాంటి సైనిక చర్యను కళ్ళకు కట్టినట్లు వివరించాడు. అమెరికన్ సైన్యం ఒక గ్రామాన్ని చుట్టుముట్టి దాడులు మొదలుపెట్టింది. దారిన సైకిల్ తొక్కుతూ పోతున్న ఒకతన్ని కాల్చి చంపారు. నది ఒడ్డున విహారానికి వచ్చిన ముగ్గుర్ని ఉన్నపళాన కాల్చి పారేసి మృత్యుగహ్వరంలోకి నెట్టేశారు. ఇళ్ళు ధ్వంసం చేశారు. ఆడవాళ్ళూ, ముసలివాళ్ళు, పిల్లలను అందరినీ కలిపి ఒక చోట మందలా పోగేసి వాళ్ళ ఆవాస ప్రాంతం నుండి దూరంగా మళ్ళేశారు.

'ఆపరేషన్ ఫోనిక్స్' పేరిట అజ్ఞాతంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అయి ఉండొచ్చు అన్న అనుమానంతో దక్షిణ వియత్నాంలో ఇరవై వేల మంది పౌరులను ఎలాంటి

విచారణ జరిపించకుండా సిఐఎ కాల్చి చంపించేసింది. అమెరికన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి భజన చేసే ఒక విశ్లేషకుడు 1975 జనవరిలో రాసిన ఒక వ్యాసంలో "నిస్సందేహంగా ఆపరేషన్ ఫోనిక్స్‌లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చు. అయితే ఈ ఆపరేషన్ ద్వారా కమ్యూనిస్టు నిర్మాణం ధ్వంసం అయింది. కొంతమంది కమ్యూనిస్టుల బెడదా తీరిపోయింది" అని వాకృచ్చాడు.

వియత్నాం యుద్ధం ముగిశాక అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ విడుదల చేసిన రికార్డులను పరిశీలిస్తే దక్షిణ వియత్నాంలో అమెరికన్ సైన్యం నెలకొల్పిన క్యాంప్ ఖైదులలో 65,000 నుండి 70,000 మంది ఖైదీలు ఉన్నారని, అనునిత్యం వీళ్ళు చిత్రహింసలకు గురవుతూ ఉండేవారని, కొన్ని సందర్భాలలో అమెరికన్ అధికారులు ప్రేక్షకులుగా జరిగే చిత్రహింసల తంతును చూస్తూ ఉండేవారని, కొన్ని సందర్భాలలో వాళ్ళూ స్వయంగా పాల్గొన్న దాఖలాలు ఉన్నాయన్న నిజాలు బయటపడ్డాయి. యుద్ధ ఖైదీలుగా చిక్కిన వియత్నామీయులను ఉంచిన రెండు ప్రధాన బందీఖానాలలో ఫూక్యువోక్, క్యుయి ఎన్‌హాన్ – తిష్టవేసిన అమెరికన్ సలహాదారుల కళ్ళెదుటే ఖైదీలను అనునిత్యం క్రూరమైన చిత్రహింసలకు గురిచేసేవారని రెడ్‌క్రాస్ సంస్థ పరిశీలకుల గమనంలోకి వచ్చింది.

యుద్ధం ముగిసేనాటికి వియత్నాం, లావోస్, కంబోడియాల మీద అమెరికా సైన్యం 7 లక్షల టన్నుల బాంబులు కురిపించిందని లెక్క తేలింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఐరోపా, ఆసియా ఖండాల్లో కురిపించిన బాంబుల కన్నా రెట్టింపు మోతాదు బాంబులను ఆ చిన్న దేశం మీద కురిపించారు. దీనికి తోడు వృక్ష జాతులను నాశనం చేయడానికి విమానాల నుంచి విషపు రసాయనాలు వెదజిమ్మారు. దాంతో అమెరికాలోని మస్సాచుసెట్స్ రాష్ట్రం అంత భూభాగం యావత్తు విషతుల్యంగా మారింది. దీని ఫలితంగా వియత్నాం తల్లులు అవకరాలతో కూడిన బిడ్డల్ని ప్రసవించారు. యేల్ యూనివర్శిటీ జీవ రసాయన శాస్త్రవేత్తలు వియత్నాం యుద్ధంలో అమెరికన్ సైన్యం విరజిమ్మిన విష రసాయనాన్ని (2, 4, 5, టి) ఎలుకల మీద పరీక్ష చేసి అంగవైకల్యంతో పుట్టిన వాటి సంతు ఆధారంగా ఆ విష ప్రభావం మానవుల మీద ఇంతకన్నా భిన్నంగా ఉండదని తేల్చి చెప్పారు.

1968 మార్చి 16న అమెరికన్ సైనికుల పటాలం ఒకటి క్యుయాంగ్ ఎన్‌గై ప్రావిన్సులోని మైలాయ్ 4 అనే శివారుపల్లెను చుట్టుముట్టింది. ఆ ఊళ్ళో ఉన్న ముసలివాళ్ళను, బిడ్డల్ని చంకనెత్తుకున్న మహిళలను చుట్టుముట్టి వాళ్ళందరినీ ఒక గోతిలోకి దించి మరీ వరసాగ్గా పిట్టల్ని కాల్చి చంపినట్లు చంపేశారు. లెఫ్టినెంట్ విలియమ్ కాలీ మీద ఆ తరువాత జరిగిన సైనిక విచారణలో జేమ్స్ దువల్సీ అనే సైనికుడు ఇచ్చిన సాక్ష్యాన్ని న్యూయార్క్ టైమ్స్ ప్రచురించింది.

"లెఫ్టినెంట్ కాలీతో పాటు పాల్ డి మియాడ్లో అనే సైనికుడు ఖైదీలందరినీ గోతిలోకి నెట్టి కాల్చి చంపారు. అంతకుముందే మహిళల చంకల్లో వున్న కొంతమంది చంటిబిడ్డలకు మియాడ్లో తినడానికి చాక్లెట్లు ఇచ్చాడు. అందుకే కామోసు అతను ఏడుస్తూ కాల్పులు జరిపాడు. లెఫ్టినెంట్ కాలీ కాల్పులు జరపమని ఆదేశాలిచ్చాడు. సరిగ్గా ఎలా ఆజ్ఞాపించాడో గుర్తు లేదు కానీ 'కాల్పులు మొదలెట్టండీ' అని ఆదేశాలు ఇచ్చాడు. మియాడ్లో నాకేసి తిరిగి 'కాల్చూ, నువ్వు కాల్చవే' అనడిగాడు. అతను ఏడుస్తూనే అడిగాడు. 'నా వల్ల కాదు, నే కాల్చను' అని బదులిచ్చా నేను. లెఫ్టినెంట్ కాలీ మియాడ్లోలు తుపాకులు గుంతలోకి బారు చేసి కాల్పులు మొదలుపెట్టారు. లోపలున్న జనాలు ఒకళ్ళ మీద ఇంకోళ్ళు పడి తొక్కుకుంటూ పైకి ఎగబాకి బయటపడటానికి ప్రయత్నించారు. బిడ్డ తల్లులు తమ పసిపాపల్ని అక్కున చేర్చుకుని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ కనిపించారు..." అని దువర్సీ తన ప్రత్యక్ష సాక్షి కథనం వినిపించారు.

ప్రముఖ జర్నలిస్టు సైమూర్ హెర్ష్ 'మైలాయ్ 4' అనే పుస్తకంలో ఇలా వివరించాడు.

అమెరికాలో జరుగుతున్న మైలాయ్ విచారణకు సంబంధించి సైనిక పరిశోధకులు 1969 నవంబర్‌లో ఆ నిర్జన ప్రాంతాన్ని సందర్శించే నాటికి మూడు చోట్ల సామూహిక ఖనన స్మశాన వాటికలు, గోతిలోకి తోసి కాల్చి చంపిన వారి అవశేషాలు కనిపించాయి. దాదాపు 450 నుండి 500 మందిని మరీ ముఖ్యంగా మహిళల్ని, చిన్నపిల్లల్ని కాల్చి చంపి పూడ్చి పెట్టినట్లు వాళ్ళు ఒక అంచనాకు వచ్చారు.

జరిగిన ఘాతుకాన్ని కప్పి పెట్టడానికి సైన్యం శతథా ప్రయత్నించింది. కాని రావ్ రెడైవ్ అవిర్ అనే అతని పేరిట ఒక ఉత్తరం చెలామణీలోకి వచ్చింది. ఈ నరమేధం గురించి అతనికి తెలుసు. అమాయక ప్రజలను హత్య చేస్తున్న సందర్భంలో సైనిక ఫొటోగ్రాఫర్ ఒకతను ఫొటోలు కూడా తీశాడు. అతని పేరు రొనాల్డ్ హెయిబెర్లె. అప్పట్లో సేమూర్ హెర్ష్ దక్షిణాసియా కేంద్రంగా పనిచేస్తున్న 'డిస్పాచ్ న్యూస్ సర్వీస్' అనే సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ సంస్థ ప్రధానంగా యుద్ధ వ్యతిరేక వార్తల మీదనే దృష్టి కేంద్రీకరించి పని చేస్తుంది. ఈ నరమేధానికి సంబంధించిన తొలి వార్తలు 1968 మే నెలలో రెండు ఫ్రెంచి వార్తా పత్రికలలో వచ్చాయి. అందులో ఒక దానిపేరు 'సద్ వియత్నామ్ ఎన్‌లుట్టె'. పారిస్ కేంద్రంగా శాంతి కోసం కృషి చేస్తున్న ఉత్తర వియత్నాం ప్రతినిధి వర్గం ఒకటి ఈ వార్తను ప్రధానంగా వెలుగులోకి తెచ్చింది.

మైలాయ్ నరమేధం గురించి అనేకమంది సైనిక అధికారులు విచారణ ఎదుర్కొన్నారు. కానీ లెఫ్టినెంట్ కాలీ మాత్రమే దోషిగా తేలాడు. మొదట అతనికి యావజ్జీవిత ఖైదు విధించారు. ఆ తర్వాత రెండు దఫాలుగా ఈ శిక్ష తగ్గించబడింది. మూడేళ్ళు జైలులో గడిపాక అతన్ని

జైల్లో ఉంచడానికి బదులు గృహ నిర్బంధంలో ఉంచమని ప్రెసిడెంట్ నిక్సన్ ఆర్డరు వేశాడు. ఆ తరువాత అతనికి పెరోల్ లభించింది. వేలాదిమంది అమెరికన్లు అతనికి మద్దతుగా నిలిచారు. కమ్యూనిస్టులకు అలా జరిగి తీరాల్సిందే అన్న దేశభక్తియుత అభిప్రాయం వారిది. ఇంకొంతమందేమో 'ఇలాంటి దారుణాలు ఇంతకు ముందు ఎన్ని జరగలేదూ – కేవలం ఈ మనిషిని మాత్రమే ఒంటరి చేసి శిక్షించడం ఏమిటీ' అనే సానుభూతి కోణంలో అతనికి మద్దతుగా నిలిచారు. మైలాయ్ ఊచకోతను కప్పిపెట్టడానికి ప్రయత్నించాడు అనే ఆరోపణల మీద విచారణను ఎదుర్కొన్న కల్నల్ ఒరాన్ హెండర్సన్ అయితే 1971లో 'ప్రతి అమెరికన్ సైనిక బ్రిగేడ్‌కూ మైలాయ్ లాంటి చరిత్ర ఉంది వియత్నాంలో. కానీ అది బయటపడలేదు. ఇది బయటపడింది. అంతే తేడా' అని విలేఖరుల ముందు నిర్భీతిగా ప్రకటించాడు.

నిజానికి మైలాయ్ ఉదంతం బయటపడిన వివరాల రీత్యా ప్రాముఖ్యతను సంతరించుకుంది. నిర్బంధంగా సైన్యంలో చేరిన యువకుడు ఒకతను తన ఇంటికి రాసిన ఉత్తరం ఒకదాన్ని హెర్ష్ వెలుగులోకి తెచ్చాడు.

ప్రియమైన అమ్మకు, నాన్నకు

ఈ రోజు మేం చేసిన పనికి నాకు చాలా గర్వంగా ఉంది. నా స్నేహితులూ, నా దేశం కూడా గర్వపడే పనిచేశాం. కంటబడ్డ ప్రతి పాకనూ తగలబెట్టాం ఇవాళ.

గ్రామీణ శివార్లలో ఉండే చిన్న చిన్న పల్లెలు ఇవి. ఇక్కడ నివసించే ప్రజలు కడుపేదలు. మా సైనిక పటాలం ఊరి మీద పడి పాకలన్నీ అగ్గిబుగ్గి చేశాం. ఆ ఇళ్ళలో ఉన్నవాళ్ళ దగ్గర అస్తుబిస్తుగా ఉండేదంతా దోచేశాం. ఇంకాస్త వివరంగా చెప్పడానికి ప్రయత్నిస్తా.

తాటాకులతో నేసిన పూరిగుడిసెలు అన్నీ. ప్రతి ఇంట్లో బంకమన్నుతో మెత్తిన బంకర్లు ఉన్నాయి. ఏదన్నా ఉపద్రవం వాటిల్లితే వీటిల్లో కుటుంబం మొత్తం తలదాచుకుంటుంది. ఒకరకంగా విమానదాడుల నుండి తలదాచుకునే స్థావరాల వంటివి ఇవి.

కాని మా దళ కమాండర్ మాత్రం ఇలాంటి బంకర్లు తవ్వింది మామీద దాడి చెయ్యడానికి అని భావించాడు. అది నేరమే కదా. అందుకే బంకరు ఉన్న ప్రతి గుడిసెనూ కాల్చి బూడిద చేసెయ్యమని అర్డరు వేశాడు.

మొత్తం పది హెలికాప్టర్లలో ఈ గుడిసెల మధ్య ల్యాండయ్యాం. ఒక్కోదాన్లోంచి ఆరుగురేసి చొప్పున నేల మీదకు దూకాం. దూకుతూనే ఎదురుగా కనబడ్డ పాకల మీదకు గుళ్ళ వర్షం కురిపించాం ఎవరికి వాళ్ళం.

ఆ తరువాత ప్రతి పాకకూ నిప్పెట్టాం. జనాలు ఏడ్చుకుంటూ, మొత్తుకుంటూ ఉన్నారు. మేం మగాళ్ళు అందరినీ వేరు చేస్తుంటే ఆడాళ్ళు 'నా బిడ్డను వేరు చెయ్యకయ్యా', 'మా ఆయన్ను వొదిలిపెట్టండయ్యా', 'మా నాయన్ని వదిలి పెట్టండయ్యా', 'మా తాత ముసలోడు

వదిలెయ్యండయ్యా' అని ఏడుస్తూ ప్రాధేయపడ్డారు. వెక్కిళ్ళు పెడుతూ కొందరు సొమ్మసిల్లిపోయారు.

'వాళ్ళ ఇళ్ళను తగలబెట్టి, బియ్యం నేల పాలు చేసి, గొడ్డు గోదా ఉంటే కాల్చి పారేస్తా ఉంటే భయవిహ్వలురై చూస్తుండిపోయారు.'

... ... ...

ఒక సాధారణ అమెరికన్ సైనికుల కంపెనీ మైలాయ్‌లో సాగించిన ఈ నరమేధం అత్యున్నత సైనికాధికారులు, వీరి నాయకులు కలిసి వియత్నాం ప్రజానీకం మీద సాగించిన అనేకానేక దుర్మార్గాలతో పోలిస్తే చిన్న విషయం అనిపించడంలో ఆశ్చర్యం లేదు. 1966 తొలినాళ్ళలో రక్షణ శాఖ సహాయ కార్యదర్శి జాన్ మెక్‌నాటన్ వియత్నాం పర్యటనకు వచ్చి ఉత్తర వియత్నాం భూభాగంలోని పల్లెలకు పల్లెల్నే బాంబింగ్‌తో ధ్వంసం చేసి పారేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు కాబట్టి ఒక కొత్త వ్యూహాన్ని ప్రతిపాదించాడు.

"ఇలా ఊళ్ళ మీద విమానల్లోంచి బాంబులు కురిపించి ధ్వంసం చేయడం మూలంగా ఆశించిన ఫలితాలు రాకపోగా ఇంటా బయటా నిరసనలూ, గగ్గోలు పెరిగిపోతా ఉన్నాయి. అందుకే ఆనకట్టలు, వంతెనలు పేల్చెయ్యండి. సరిగ్గా లెక్క చూసి ఈ పని చేశామా మనం ఆశించిన ఫలితం వస్తుంది. ఆచితూచి మరీ దెబ్బ వేసెయ్యాలి. ఈ విధ్వంసం మూలంగా ప్రత్యక్షంగా జనాలు చావరు. మనుషులు మునిగిపోకుండా కూడా చూడండి. కానయితే పంట పొలాలన్నీ వరదతో పోటెత్తిపోవాలి. పంటలు పండే అవకాశం లేకుండా చూడాలి. అది చాలు వాళ్ళు ఆకలితో మాడి చావడానికి. తినడానికి తిండి దొరక్కపోతే ఏం చేస్తారు? అది మనం అందిస్తాం. అదీ చర్చలకని కాళ్ళబేరానికి వస్తే" – ఇదీ నాడు అమెరికన్ రక్షణ శాఖ పన్నిన క్రూరమైన ఎత్తుగడ.

జనావాసాల మీద బాంబులు కురిపించడం ద్వారా వియత్నాం ప్రజానీకంలో 'ప్రతిఘటించాలనే ఆలోచనలను' నిర్వీర్యం చేయాలనేది అమెరికన్ వ్యూహం. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అమెరికా అధ్యక్షుడు జాన్సన్ 'మిలిటరీ టార్గెట్ల' మీద మాత్రమే బాంబింగ్‌కు పరిమితం అవ్వండి అని బహిరంగంగా పదే పదే హెచ్చరించినా అమెరికన్ సైన్యం మాత్రం జర్మనీ, జపాన్ దేశాలలో జనావాసాల మీద బాంబుల వర్షం కురిపించింది ఈ వ్యూహంతోనే. పెంటగాన్ పత్రాలను పరిశీలిస్తే 1966వ సంవత్సరంలో ఒక దశలో సిఐఎ 'లక్ష్యాలను మాత్రమే ఛేదించాలనే ప్రభుత్వ ఆలోచనకు భిన్నంగా మరింత ఉధృతంగా, విస్తారంగా బాంబింగ్ జరపాలని సైన్యానికి సిఫార్సు చేసింది.'

ఇదే సందర్భంలో వియత్నాం సరిహద్దున ఉన్న దేశం లావోస్‌లో సిఐఎ తరఫున ప్రతిష్టించిన ఒక మితవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగింది. ప్రపంచంలోనే అత్యంత సుందరమైన పీఠభూములు ఉన్న ఈ దేశం బాంబు దాడుల్లో ముదనష్టం

అయిపోయింది. ఈ నిజాల్ని ప్రభుత్వమో, పత్రికలో చెప్పలేదు. ఆ దేశంలో నివసిస్తున్న అమెరికన్ – ఫ్రెడ్ బ్రాన్ ఎఫ్‌మాన్ – 'వాయిసెస్ ఫ్రమ్ ది ప్లెయిన్ జార్స్' అన్న పుస్తకం ద్వారా బయటి ప్రపంచానికి తెలియచెప్పాడు.

"1964 మే నుండి 1969 సెప్టెంబర్ వరకు జరిగిన బాంబు దాడుల గురించి 25000 కథనాలు వెలువడ్డాయి. దాదాపు 75000 టన్నుల బాంబులు లావోస్ మీద కురిపించాయి. వేలాదిమంది మరణించారు. అంతే సంఖ్యలో గాయాల పాలయ్యారు ప్రజలు. వేలకు వేల మంది నేలమాళిగల్లో బ్రతుకులీడ్చారు. పీఠభూముల్లోని ఈ సమాజం మట్టసంగా నేలకు చదును చెయ్యబడింది" అని జరిగిన విధ్వంసాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించారు.

... ... ...

1973 సెప్టెంబర్‌లో లావోస్‌లో పనిచేసిన మాజీ ప్రభుత్వాధికారి జెరోమ్ డూ లిటిల్ 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో ఇలా రాశారు.

"నేను వియత్నాం, లావోస్‌లలో ఉన్న అమెరికన్ రాయబార కార్యాలయంలో సమాచార విభాగం పనులు చూసే క్రమంలో 'అబద్దాలు ఆడటానికి మనం ఎందుకు వెరవాలి' అనిపించేది. కాంబోడియా మీద అమెరికన్ సైన్యం జరిపిన బాంబు దాడుల గురించి పెంటగాన్ ఇస్తున్న సమాచారం కూడా అప్పట్లో నాలానే అనుకుని మరీ అబద్ధాలు ప్రచారంలో పెట్టింది.

నేను లావోస్ తొలిసారిగా చేరుకోగానే చిన్న దేశం మీద నిర్దాక్షిణ్యంగా అంత పెద్ద ఎత్తున బాంబింగ్ జరపాల్సిన అవసరం ఏమిటని పత్రికల వాళ్ళు అడిగితే నేను ఏమని సమాధానం చెప్పాలో ముందుగానే నాకు తర్ఫీదు ఇచ్చారు.

"లావోస్‌లోని రాజరిక ప్రభుత్వం అభ్యర్ధన మీద అమెరికా నిరాయుధ గూఢచారి విమాన సేవలు అందిస్తుంది. ఈ విమానాలకు రక్షణగా సాయుధ బాంబర్ విమానాలు ఉంటాయి. మా మీద కాల్పులు జరిగితే ఎదురు కాల్పులు జరిపే హక్కు ఈ రక్షణ విమానాలకు ఉంటుంది. జరిగిన ఘటన అందులో భాగమే" అన్న రెడీమేడ్ సమాధానం చెప్పేవాణ్ణి ఎప్పుడూ.

"అబద్దాలు చెప్పడంలో ఉద్దేశ్యం అసలు నిజాలు దాచడానికే. అయితే ఆ నిజాలు తెలియకూడని జనం మా అమెరికన్ ప్రజానీకం కావడమే ఇక్కడి వైచిత్రి."

1968 నాటికి యుద్ధ క్రూరత్వం అనేకమంది అమెరికన్‌ల ఇంగితాన్ని తట్టిలేపింది. చాలామంది అమెరికా ఈ యుద్ధాన్ని గెలవలేకపోవడమే పెద్ద సమస్యగా భావించారు కూడా. 40,000 మంది సైనికులు ఈ యుద్ధంలో మరణించారు. రెండున్నర లక్షల మంది గాయపడ్డారు. అయినా యుద్ధం ముగింపు కనుచూపు మేరలో కనబడటం లేదు.

లిండన్ జాన్సన్ ఒక అనాగరిక యుద్ధాన్ని ఎగసనదోసి గెలవలేక ఓటమి పాలయ్యాడు. ప్రజల్లో అధ్యక్షుడి పలుకుబడి అడుగుజారిపోయింది. అతను ఎక్కడ బహిరంగ సభ పెట్టినా అక్కడల్లా యుద్ధానికి, అధ్యక్షునికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శన స్వాగతం పలికేది. 'అధ్యక్షా ఈ రోజు ఎంతమంది పిల్లల్ని బలి ఇచ్చావు' అన్న నినాదాలతో యావత్ అమెరికా మారుమోగిపోయింది. 1968 వసంతకాలం వచ్చేసరికి తాను మరోసారి అధ్యక్ష పదవికి పోటీపడబోవడం లేదని జాన్సన్ ప్రకటించాడు. అంతేకాదు వియత్నాంతో శాంతి చర్చలు పారిస్‌లో మొదలవుతాయని కూడా ప్రకటించాల్సి వచ్చింది.

1968 శీతాకాలంలో అమెరికాను వియత్నాం యుద్ధం నుండి బయటపడేస్తానన్న వాగ్దానంతో రిచర్డ్ నిక్సన్ అధ్యక్ష పదవికి ఎన్నికయ్యాడు. బలగాల ఉపసంహరణ మొదలుపెట్టారు కూడా. 1972 ఫిబ్రవరి నాటికి కేవలం లక్షన్నర మంది సైన్యం మాత్రమే మిగిలి వుంది. అయినా బాంబింగ్ సహా అన్ని యుద్ధ దారుణాలూ కొనసాగుతూనే వున్నాయి. నిక్సన్ తెలివి ఎలా చూపించాడంటే – వియత్నాం యుద్ధం అమెరికా పాపం అన్న అపప్రథను పోగొట్టడానికి సైగాన్‌లో ఉన్న కీలుబొమ్మ ప్రభుత్వానికి ఆయుధాలూ, డబ్బు, వైమానిక తోడ్పాటు అందించి వియత్నాం సైన్యంతో యుద్ధం నడిపిస్తూ అది వాళ్ళూ వాళ్ళూ కొట్టుకు చస్తున్నారనే అభిప్రాయం కల్పించే దిశగా పావులు కదిపాడు. అంటే నిక్సన్‌కు కూడా యుద్ధాన్ని ముగించాలనే ఆలోచన లేదు, కాకపోతే ఈ యుద్ధంలో ప్రజలు ఏహ్యాగించుకుంటున్న అమెరికా ప్రత్యక్ష జోక్యాన్ని మసిబూసి మారేడుకాయ చేసి ప్రజల మనసుల్లో వ్యతిరేకతను తొలగించే విఫలయత్నం చేశాడు.

1970 వసంత కాలంలో నిక్సన్ హయాంలోనే దేశ అంతర్గత వ్యవహారాల కార్యదర్శి హెన్రీ కిసింజర్ ఆదేశాల మేరకు సైన్యం కాంబోడియాను ఆక్రమించింది. బాంబింగ్ ద్వారా సుదీర్ఘ విధ్వంసానికి పూనుకుంది. ఈ విషయాన్ని ప్రజలకు తెలియనీయకుండా అతి గోప్యంగా ఉంచింది. ఈ వ్యవహారం బట్టబయలై దేశంలో తీవ్ర నిరసనలు చెలరేగాయి. అమెరికా చట్ట సభ ఈ మిలిటరీ వైఫల్యం దృష్ట్యా నిక్సన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికన్ సైన్యాన్ని యుద్ధం కొనసాగింపుకు వినియోగించరాదని, సెనెట్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు ఎలాంటి మిలిటరీ చర్య తీసుకోకూడదని తీర్మానించింది. ఆ మరుసటి ఏడాదిలో అమెరికా తన వంతు సైనిక సహకారం అందించలేదు. కానీ దక్షిణ వియత్నాం పాలకులు లావోస్‌ను ఆక్రమించుకోవడానికి చెయ్యాల్సిన సాయం అంతా చేసింది. ఈ దురాక్రమణ ప్రయత్నమూ విఫలమైంది. ఒక్క 1971 ఏడాదిలోనే అమెరికా – లావోస్, కాంబోడియా, వియత్నాం దేశ భూభాగాల మీద ఎనిమిది లక్షల టన్నుల బాంబులు కురిపించింది.

... ... ...

ఇంకో విచిత్రం ఏమిటంటే వియత్నాంలో అమెరికా ప్రత్యక్ష సైనిక జోక్యాన్ని 1965 ఆగస్టులో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో 61 శాతం మంది సమర్థించారు. 1971 మే

నెలలో జరిపిన మరో సర్వేలో అదే 61 శాతం మంది ప్రజానీకం అమెరికా జోక్యాన్ని తప్పుపట్టారు. బ్రూస్ ఆండ్రూస్ అనే హార్వర్డ్ విద్యార్థి ఈ ప్రజాభిప్రాయాన్ని విశ్లేషించి యుద్ధాన్ని వ్యతిరేకించిన వారిలో అత్యధికులు యాభై ఏళ్ళ పైబడినవాళ్ళు, మహిళలు, నల్లజాతి వారని తేల్చాడు. అలాగే 1964లో జరిపిన ఓ సర్వే లెక్క తీస్తే యుద్ధాన్ని అమెరికన్ పత్రికలు పెద్ద సమస్యగా ప్రాచుర్యంలోకి తీసుకురాని నేపథ్యంలో – 53 శాతం విద్యాధికులు ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు వియత్నాంకు సైనిక బలగాలను పంపడం సమర్ధనీయమే అన్నారు. మాధ్యమిక విద్యార్థులలో 33 శాతం మంది మాత్రమే ఒక మేరకు సుముఖత వ్యక్తం చేశారు.

మీడియా, ఉన్నత విద్యను నియంత్రిస్తున్న కార్పొరేట్ శక్తులు, సంపన్న వర్గాలూ కలిసి అమెరికా విదేశాంగ విధానం దూకుడుగా ఉండాలని కోరుకుంది గాక ప్రజలందరూ యుద్ధాన్ని బలపరిచే అపర దేశభక్తులుగా చిత్రీకరించడానికి శతథా ప్రయత్నిస్తున్నాయి.

1968 ఏడాది మధ్యలో లూయిస్ లిప్‌సిట్జ్ దక్షిణ అమెరికాలోని నిరుపేద శ్వేత జాతీయులు, నల్లజాతివారిలో ఒక సర్వే నిర్వహించారు. ఆ సర్వే సారాంశాన్ని గుది గుచ్చి ఇలా చెప్పారు – "పేదలకు సాయం చెయ్యాలనుకుంటే అమెరికా వియత్నాం యుద్ధం నుండి బయటకు రావాల్సిందే. యుద్ధం పేరిట వేస్తున్న పన్నుల భారం అంతకంతకూ పెరిగి పెనుభారంగా మారి సాధారణ ప్రజానీకాన్ని చంపుకు తింటున్నాయి. ఇది అర్థం పర్థం లేని యుద్ధం."

సాధారణ అమెరికన్ పౌరులలో యుద్ధం పట్ల ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయనేది స్వతంత్రంగా అంచనా వెయ్యడానికి నిర్బంధంగా సైన్యంలో చేరడానికి పేర్లు నమోదు చేయించుకున్న వారిలో ప్రబలిన యుద్ధ వ్యతిరేక భావనల తీవ్రతే కొలమానంగా చెప్పుకోవచ్చు. ఇలా నిర్బంధంగా సైన్యంలో చేరడానికి పేర్లు నమోదు చేయించుకున్న వారిలో అత్యధికులు అల్పాదాయాల కుటుంబీకులు. అమెరికా చరిత్రను తరచి చూస్తే గతంలోనూ సైనికుల్లో యుద్ధం పట్ల వ్యతిరేకత బహిర్గతమైన సందర్భాలు చాలానే వున్నాయి. మెక్సికో యుద్ధం, మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం – ఇలా అనేక సందర్భాలలో సైనికులు తమ పేర్లు నమోదు చేయించుకోవడానికి అయిష్టత ప్రదర్శించారు. కానీ వియత్నాం యుద్ధం సందర్భంగా సైనికులలో పెల్లుబికిన వ్యతిరేకత అంతా ఇంతా కాదు.

మొదట ఈ వ్యతిరేకత అక్కడక్కడా విడి విడి, ఏకాకి ఘటనలుగా మొదలయ్యాయి. 1965 జూన్‌లో రిచర్డ్ స్టీవ్‌కె అనే వెస్ట్ పాయింట్ యూనివర్శిటీ పట్టభద్రుడు వియత్నాంలో ఓ మారు మూల గ్రామం మీద దాడికి బయల్దేరిన యుద్ధ విమానం ఎక్కడానికి నిరాకరించాడు. 'ఈ యుద్ధం కోసం ఏ అమెరికన్ పౌరుడూ తన ప్రాణాల్ని ఫణంగా చెల్లించనవసరం లేనంత దండగ మారి యుద్ధం' అని చెప్పి మరీ భీష్మించుకు కూచున్నాడు. ఇందుకు గాను అతని మీద

సైనిక న్యాయస్థానంలో విచారణ జరిపించి సర్వీసు నుండి డిస్మిస్ చేశారు. మరుసటి ఏడాది మరో ముగ్గురు ప్రైవేట్ సైనికులు ఒక నల్లజాతీయుడు, ఒక ప్యూర్టోరికా దేశస్తుడు, మరొక లిథువేనియా ఇటలీ దేశస్తుడు – వియత్నాం యుద్ధాన్ని తప్పు పట్టారు. 'ఈ యుద్ధం అన్యాయం, అనైతికం, చట్ట విరుద్ధం' అని చెప్పి మరీ యుద్ధంలో పాల్గొన నిరాకరించారు. ఆ ముగ్గురి మీదా సైనిక విచారణ జరిపించి ఖైదు శిక్ష 'విధించారు.

1967లో దక్షిణ కరోలినా రాష్ట్రంలోని ఫోర్ట్ జాక్సన్ సైనిక కేంద్రంలో పనిచేస్తున్న కెప్టెన్ హోవర్డ్ లెవీ అనే సైనిక వైద్యుడు అమెరికన్ సైన్యంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ బారెట్స్' దళానికి పాఠాలు చెప్పడానికి నిరాకరించాడు. 'మీరంతా శిశు హంతకులు, మహిళలను, రైతులను హత్య చేసినవాళ్ళు. మీకు పాఠాలు చెప్పడం నా వృత్తికే అవమానం' అని వాళ్ళని కటువుగా విమర్శించాడు. అందుకుగాను ఆ డాక్టరు మీద సైనిక న్యాయ విచారణ జరిగింది. 'ఇలాంటి ప్రకటనల ద్వారా అతను సైనికులలో యుద్ధం పట్ల వ్యతిరేకత ప్రోది చేస్తున్నాడని' అతని మీద అభియోగం మోపారు. ఆ నేరాన్ని విచారించిన ఒక సైనిక కల్నల్ అతను అన్న మాటలు నిజమా, కాదా అనేది సమస్య కాదు ఇక్కడ అతని మీద మోపిన అభియోగాలు సరైనవా కాదా నిర్ధారించడమే విచారణ పరిధిలోని అంశం అని ప్రకటించి సదరు డాక్టరును దోషిగా ప్రకటించారు. ఆ డాక్టరుకు జైలు శిక్ష విధించారు.

రాను రానూ ఈ విడి విడి ఘటనలు ద్విగుణీకృతం అయ్యాయి. ఓక్‌లాండ్‌లో ఒక నల్లజాతి ప్రైవేటు సైనికుడు వియత్నాంకు పోవాల్సిన సైనిక దళవిమానం ఎక్కడానికి నిరాకరించాడు. గతంలో యుద్ధం పట్ల వ్యతిరేకత ప్రదర్శించినందుకుగాను శిక్షగా అతను పదకొండేళ్లపాటు కఠిన శ్రమకు ఓర్చాల్సిన పనుల్లో పెట్టారు. లెఫ్టినెంట్ సుసాన్ ష్నాల్ అనే నావికాదళ నర్సు యూనిఫారం తోటే శాంతి ప్రదర్శనలో పాల్గొన్నది. నావికాదళ ఆస్తుల మీద విమానం నుండి యుద్ధ వ్యతిరేక కరపత్రాలు విసిరేసింది అనే అభియోగాల మీద సైనిక న్యాయ విచారణను ఎదుర్కొంది. వర్జీనియా రాష్ట్రంలోని నారేఫోక్ సైనిక కేంద్రంలో పైలెట్లకు 'ఫైటర్ విమానాలు' నడిపించడం ఎలానో నేర్పడానికి నిరాకరిస్తూ 'ఈ యుద్ధం అనైతికం' అని ప్రకటించి తన నిరసన తెలిపాడు. 1968 తొలినాళ్లలో ఒక సైనిక లెఫ్టినెంటు అమెరికా అధ్యక్ష భవనం ముంగిట "120,000 మంది సైనికుల దుర్మరణాలు– దేనికోసం" అన్న ప్లకార్డును ప్రదర్శించిన నేరానికిగాను వాషింగ్టన్ డి.సి.లో అరెస్టు చేశారు. జార్జి డేనియల్స్, విలియమ్స్ హార్వే అనే ఇద్దరు నల్లజాతి మెరైనర్లు పాత సైనికులతో యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడారనే అభియోగం మీద ఒకరికి ఆరేళ్లు, ఇంకొకరికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. (ఆ తర్వాత శిక్షా కాలాన్ని తగ్గించారు)

అంతూ దరీ లేకుండా యుద్ధం కొనసాగుతున్న కొద్దీ సాయుధ దళాల నుండి సైనికులు తప్పుకోవడం కూడా అధికం అయింది. వేలాది మంది పశ్చిమ యూరోప్ ప్రాంతాలకు–

ఫ్రాన్స్, స్వీడన్, హాలండ్– తరలిపోయారు. ఈ సంఖ్య 50,000 నుండి లక్ష వరకూ ఉండొచ్చని ఒక అంచనా. కొంతమంది అమెరికాలోనే ఉండిపోయారు. కొద్దిమంది సైనికులయితే బాహాటంగానే సైనికాధికారులకు వ్యతిరేకంగా తిరగబడి వచ్చి 'చర్చి'లలో తలదాచుకున్నారు. వారిని బంధించి తీసుకెళ్లి సైనిక విచారణ జరిపించకుండా అడ్డుకోవడానికి వందలాది మంది యుద్ధ వ్యతిరేక కార్యకర్తలు ఆ చర్చిలను చుట్టుముట్టి పహారా కాసారు. బోస్టన్ యూనివర్శిటీలో అలా తలదాచుకోను వచ్చిన 'రేక్రోల్' అనే పద్దెనిమిదేళ్ల యువకుడిని సైన్యం పాలబడకుండా కాపాడడానికి వెయ్యిమంది విద్యార్థులు ఐదు రోజుల పాటు రాత్రింబవళ్లూ చర్చికి కాపలా కాసారు.

'క్రోల్' ఉదంతం అమెరికాలో సర్వసాధారణమైన తంతు అని చెప్పుకోవచ్చు. దండోపాయంతో అతను తన పేరు సైన్యంలో నమోదు చేసుకునేలా చేసారు. అతనిది సాధారణ కుటుంబ నేపథ్యం. 'త్రాగుడు' నేరారోపణ మీద కోర్టుకు తీసుకువచ్చారు. జైలుకు వెళ్తావా, నిర్బంధంగా సైన్యంలో పేరు నమోదు చేయించుకుంటావా– తేల్చుకోమని అడిగారు. సహజంగానే అందరిలానే అతనూ రెండో ప్రత్యామ్నాయాన్నే ఎంచుకున్నాడు. సైన్యంలో పేరు నమోదు చేయించుకున్నాడు. ఆ తరువాత అతను యుద్ధ స్వభావాన్ని గురించి ఆలోచించాడు.

ఐదు రోజులు గడిచాక ఆదివారం రానే వచ్చింది. బోస్టన్ యూనివర్శిటీలో ఉన్న చర్చి చుట్టూ బిలబిలమంటూ ఫెడరల్ ఏజెంట్లు వాలిపోయారు. దారికి అడ్డుగా ఉన్న విద్యార్థులను పడదోసుకుంటూ, తొక్కుకుంటూ దూసుకుపోయి తలుపులు విరగగొట్టి లోపలికి ప్రవేశించి 'క్రోల్'ను తీసుకుపోయారు. 'నేను హత్యలు చెయ్యలేను, నా మనస్సాక్షి అందుకు ఒప్పుకోదు' అంటూ చర్చిలో ఉండగా స్నేహితులు అందించిన పుస్తకాల్లోంచి ఒక వాక్యం ఎత్తి రాసాడు– "మనం చేసిన పాపం ఊరికినే కొట్టుకుపోదు. ఏదో ఒక రోజున ఈ పాపం పండుతుంది. అందుకు తగ్గ ప్రతిఫలం అనుభవించాల్సి వస్తుంది."

జి.ఐ. యుద్ధ వ్యతిరేక ఉద్యమం సుసంఘటితంగా నడిచింది. దక్షిణ కరోలినాలోని ఫోర్ట్ జాక్సన్ వద్ద తొలి 'జి.ఐ. కాఫీహౌస్' వెలసింది. అక్కడ సైనికులకు కాఫీ, తీపి బిస్కట్లతో (డోనట్స్) పాటు యుద్ధ వ్యతిరేక సాహిత్యం కూడా అందుబాటులో ఉండేది. ఇతరులతో స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం ఉండేది. ఆ కాఫీ హౌస్‌ను అమెరికాలో తరచూ చూసాం అని చెపుకునే అంతుబట్టని ఆకాశపు వస్తువు (యు.ఎఫ్.ఓ)గా పిలుచుకునేవాళ్లు. చాలా ఏళ్లపాటు నడిచింది. చివరకు కోర్టు జోక్యంతో ఈ కాఫీ హౌస్ 'పబ్లిక్ న్యూసెన్స్'గా మారిందని అభియోగం మోపి మూతబెట్టారు. కానీ దేశంలోని వివిధ ప్రాంతాలలో ఓ అరడజనుకుపైగా జి.ఐ.కాఫీ హౌస్‌లు వెలిసాయి ఈలోగా. మాస్సాచ్యూట్స్‌లోని ఫోర్ట్ డెవెన్స్ దగ్గర యుద్ధ వ్యతిరేక పుస్తకశాల వెలిసింది. రోడ్ ఐలాండ్ దగ్గర ఉన్న నావికాకేంద్రం న్యూపోర్ట్ 'దగ్గర కూడా ఇలాంటి పుస్తక శాలే ఇంకొకటి వెలిసింది.

రహస్య దినపత్రికలు దేశ వ్యాప్తంగా ఉన్న మిలిటరీ స్థావరాల దగ్గర వెలిసాయి. 1970 నాటికి ఇట్లాంటి పత్రికలు దాదాపు యాభై వరకూ సర్క్యులేషన్‌లో ఉన్నాయి. లాస్ ఏంజెల్స్ నుండి 'ఎబౌట్ ఫేస్', వాషింగ్టన్‌లోని టకీమా నుండి 'ఫెడ్ అప్', ఫోర్ట్‌జాక్సన్ నుండి 'షార్ట్‌టైమ్స్', చికాగో నుండి 'వియత్నాం జి.ఐ.' ఉత్తర కరోలినా నుండి 'బ్రాగ్ బ్రీఫ్స్', జార్జియాలోని ఫోర్ట్ గార్డెన్ నుండి 'లాస్ట్ హెరాస్', ఇదయహోలోని మౌంటెన్‌హోమ్ వైమానికి స్థావరం దగ్గర నుండి 'హెల్పింగ్ హాండ్' వంటివి అనేకం ఆ కాలంలో బాగా చలామణీలో ఉన్న అజ్ఞాత పత్రికలు. ఈ పత్రికలలో యుద్ధవ్యతిరేక వార్తలతో వ్యాసాలతో పాటు, జి.ఐ.ల వేధింపులకు సంబంధించిన వార్తలు, సైనిక సర్వీసులలో ఉన్నవారి హక్కులు, న్యాయపరమైన సలహాలు కూడా ప్రచురితమయ్యేవి. మిలిటరీ ఆధిపత్యాన్ని నిలవరించడం ఎలానో బోధపరిచేవి.

సైనికులలో యుద్ధ వ్యతిరేకతతోపాటు మిలిటరీ జీవితంలోని క్రూరత్వము, అమానవీయతల పట్ల కూడా తీవ్ర వ్యతిరేకత పెంపొందింది. సైనిక చెరసాలలు, బహిరంగ చెరసాలలో ఈ ధోరణి ప్రస్ఫుటంగా కనబడేది. కాలిఫోర్నియాలోని ఒక బహిరంగ చెరసాలలో 1968 ప్రాంతంలో కాపలాగా ఉన్న సైనికుడు మానసిక భావోద్వేగాలకు లోనయిన ఒక ఖైదీని కాల్చి చంపాడు. దీన్ని నిరసిస్తూ మొత్తం 27 మంది ఖైదీలు పనులు వదిలేసి వచ్చి బైఠాయించారు. యూజీనీపాటిర్ అంతర్జాతీయ గీతాన్ని ఆలపించారు. వాళ్లందరి మీదా సైనిక విచారణ జరిపించింది ప్రభుత్వం. సైన్యంలో తిరుగుబాటు లేవదీయడానికి ప్రయత్నించారనే అభియోగం మీద పద్నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. అయితే ఈ వ్యవహారం బట్టబయలై ప్రజలలో నిరసన వ్యక్తమయ్యే సరికి శిక్షా కాలాన్ని గణనీయంగా తగ్గించారు.

అసమ్మతి యుద్ధ భూమికే పాకింది. 1969 అక్టోబరులో 'మారిటోరియం డే' పేరిట అమెరికాలో మహత్తర యుద్ధ వ్యతిరేక ప్రదర్శన జరిగిన రోజునే వియత్నాం యుద్ధంలో పాల్గొనడానికి వెళ్లిన కొంతమంది జి.ఐ.లు భుజాలకు నల్లరిబ్బన్లు చుట్టుకుని ప్రజా నిరసనకు మద్దతు పలికారు. డానాంగ్ దగ్గర పెట్రోలింగ్ చేస్తున్న పటాలంలో సగం మందికిపైగా ఇలా నల్లరిబ్బన్లు చుట్టుకుని కనిపించారని ఒక వార్తా ఏజెన్సీ ఫొటోగ్రాఫర్ తెలియచేసారు. కుచి ప్రాంతంలో పని చేస్తున్న ఒక సైనికుడు 1970 అక్టోబరు 26న తన స్నేహితుడికి ఉత్తరం రాస్తూ "యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించిన వాళ్లను ప్రత్యేకం విడదీసారు. వాళ్లే కొన్ని 'కంపెనీ'ల మంది ఉన్నారు. యుద్ధ నిరాకరణ ఇవాళ ఇక్కడ సైన్యంలో పెద్ద విషయం కాదు. సర్వసాధారణమైపోయింది" అని వివరించాడు. ఒక్క నాలుగు నెలల కాలంలో మొదటి వాయు సైనిక డివిజన్‌లో పని చేస్తున్న 109 మంది సైనికుల మీద యుద్ధం చెయ్యడానికి నిరాకరించారన్న అభియోగాలు నమోదు అయ్యాయని ఫ్రెంచి వార్తా పత్రిక 'లేమాండే' వెలుగులోకి తెచ్చింది. ఇలాంటివి సర్వసాధారణం అయిపోయాయి అని ఆ పత్రికా విలేఖరి వ్యాఖ్యానించాడు. ఒక

నల్లజాతి సైనికుడు తన ఎడమ పిడికిలి బిగించి యుద్ధాన్ని ధిక్కరిస్తూ ఇది మా కోసం జరిగే యుద్ధం కాదు అని అనడం తన చెవులారా విన్నానని ఆ విలేఖరి తెలిపాడు.

'టైమ్' పత్రికలో పనిచేసే 'వాలెస్ టెర్రీ' అనే నల్లజాతి విలేఖరి వందలమంది నల్లజాతి సైనికులతో జరిపిన సంభాషణలను రికార్డు చేసాడు. సైన్యంలో నెలకొన్న వర్ణ వివక్ష ధోరణులు, యుద్ధం పట్ల అసంతృప్తి వాళ్ల సంభాషణల్లో వ్యక్తం అయ్యాయి. పై అధికారులను పరోక్షంగా బెదిరించిన సంఘటనలు అనేకం నమోదయ్యాయి. ఏ అధికారి అయితే యుద్ధంలో దిగమని ఆదేశాలిస్తాడో, ఏ అధికారి మీద సైనికులకు అసంతృప్తి ఉండేదో అలాంటి అధికారులు బస చేసిన టెంట్లలోకి రాత్రిపూట బాంబుల అవశేషాలు వేసి వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతియ్యడం, పరోక్షంగా 'నీకూ ఈ గతే పడుతుంది' అని బెదిరించడం వంటి ఘటనలు రివాజుగా మారాయి. ఒక్క 1970 సంవత్సరంలోనే ఇలాంటివి 209 ఘటనలు చోటు చేసుకున్నట్లు పెంటగాన్ నివేదిక బయట పెట్టింది.

వియత్నాం యుద్ధం నుండి వెనుకకు మరలివచ్చిన సైనికులు యుద్ధానికి వ్యతిరేకంగా 'వియత్నాం వెటరన్స్' పేరిట జట్టుకట్టారు. 1970 డిసెంబరు నెలలో డెట్రాయిట్ నగరంలో జరిగిన 'వింటర్ సోల్జర్' పేరిట ఏర్పడిన ప్రజా పరిశోధనా కమిటీ ముందు బహిరంగ సాక్ష్యం ఇవ్వడానికి వందలాది మంది ముందుకొచ్చారు. వారు యుద్ధంలో వియత్నామీయుల పట్ల అమెరికన్ సైన్యం చేసిన అకృత్యాల గురించి తాము విన్నవీ, కన్నవీ అన్నీ వివరించారు. 1971 ఏప్రిల్ నెలలో వాషింగ్టన్‌లో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో వీరు వేలాదిగా పాల్గొన్నారు. ఒకరి తర్వాత ఒకరుగా కాపిటల్ చుట్టూతా వేసిన ముళ్ళకంచె మీదుగా వియత్నాం యుద్ధంలో తాము గెలుచుకున్న పతకాలను గిరాటేసి మరీ యుద్ధం పట్ల తమ అభిప్రాయాల్ని క్లుప్తంగా అక్కడి జనానికి వివరించారు. కొందరు భావోద్వేగంతో కదిలిపోతూ ప్రసంగిస్తే ఇంకొందరు మంచుకోతలా బాధగా, మరికొందరు మాట రాక మౌనంగా, నిర్వికారంగా యుద్ధం పట్ల తమ వ్యతిరేకతను విస్పష్టంగా ప్రకటించారు.

1970 వేసంగిలో 28 మంది మిలిటరీ కమిషన్డ్ ఆఫీసర్లు, వియత్నాం వెటరన్లు కలిసి తాము మొత్తం 250 మంది సైనికాధికారుల ప్రతినిధులుగా ఒక సంస్థగా ఏర్పడ్డామని, వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. 1972 క్రిస్మస్ పండుగ దగ్గరి రోజుల్లో హనోయ్, హాయిఫాంగ్ పట్టణాల మీద భారీ స్థాయి బాంబు దాడులు జరుగుతున్న నేపథ్యంలో మొదటిసారిగా బి–52 బాంబర్ విమానాల పైలెట్లు విమానాలు నడపడానికి తిరస్కరించారు.

'వెస్ట్ పాయింట్ క్యాడెట్స్' విభాగం నుండి అనేకమంది సైనికులు తప్పుకున్నారని 1973 జూన్ 3 నాటి న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రచురించింది. 'సమాజంలో పలుకుబడి ఉండి, క్రమశిక్షణ కొరవడిన, సైనిక వ్యతిరేక భావనలతో ముప్పిరిగొన్న ఒక ప్రశ్నించే తరం,

వియత్నాం యుద్ధం పుణ్యాన వెలుగులోకి వచ్చిన అతివాదం ప్రభావం వీరి మీద పడిందని ఆ పత్రిక వ్యాఖ్యానించింది.

అయితే యుద్ధ వ్యతిరేక ఉద్యమం సమాజంలో పలుకుబడి ఉన్నవాళ్ళు చేస్తున్న ఉద్యమం అనేది పాక్షిక సత్యం. ఈ ఉద్యమంలో వారూ భాగస్వాములుగా ఉన్నా ప్రధానంగా ముందుండి నడిపించింది మాత్రం అతి సాధారణ కుటుంబాల నుండి వచ్చిన జి.ఐ.లు. వాళ్ళలో శ్వేతజాతీయులు ఉన్నారు, నల్లజాతీయులు ఉన్నారు, మూలవాసులు, చైనీయులు... ఇలా ప్రవాస మైనారిటీ అమెరికన్‌లు ఎందరో ఉన్నారు.

న్యూయార్క్ నగరంలో నివసించే శామ్ చోయ్ అనే చైనీస్ అమెరికన్ తన పదిహేడవ ఏట సైన్యంలో చేరడానికి పేరు నమోదు చేయించుకున్నాడు. వియత్నాం యుద్ధానికి పంపించారు. సైనికులకు వండి పెట్టే పనిలో పెట్టారు. కాని తోటి సైనికులంతా అతని మొహకవళికలు వియత్నామీయులను పోలి ఉండటాన్ని అలుసుగా తీసుకొని ఎప్పుడూ ఆట పట్టించేవాళ్ళు. అతన్ని ఓ శత్రువులా చూసేవాళ్ళు.

ఒకరోజు ఇలానే అతన్ని మిగతావాళ్ళు ఆట పట్టిస్తుంటే భరించలేక ఒకళ్ళ దగ్గర తుపాకీ లాక్కుని బెదిరింపుగా కాల్పులు జరిపాడు. 'ఎందుకు నన్నిట్లా వేధించుకు తింటారూ. ఇక్కడ మీకాడ పనిచేసే కన్నా పారిపోయి ఆ వియత్‌కాంగ్ వాళ్ళలో చేరిపోతే కనీసం వాళ్ళయినా నన్ను నమ్మి ఉండునేవో' అని అరిచాడు. అతన్ని మిలిటరీ పోలీసులు తమ అధీనంలోకి తీసుకుని చిత్తుగా కొట్టారు. సైనిక న్యాయ విచారణ జరిపించారు. ఫోర్ట్ లీవెన్‌వర్త్‌లో పద్దెనిమిది నెలల పాటు 'బండచాకిరీ' చేసేలా శిక్ష విధించారు. అక్కడ ఉన్నన్నాళ్ళూ 'గడియారంలో టైం పెట్టుకున్నట్లుగా రోజూ ముప్పూటలా ఠంచనుగా కొట్టేవారట' అతన్ని. న్యూయార్క్ చైనా టౌన్ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలన్నీ చెబుతూ చివరగా 'నేను నా తోటి చైనా పిల్లలకు చెప్పాలనుకునేది ఒక్కటే – అమెరికన్ సైన్యం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. భరించలేనంతటి మానసిక చిత్రహింసలకు గురిచేసింది' అన్నాడు.

1972 ఏప్రిల్ నెలలో 142 మంది సభ్యులు ఉన్న జి.ఐ. సైనికుల కంపెనీలో యాభై మంది దాకా 'పెట్రోలింగ్'కు వెళ్ళడానికి తిరస్కరించారు. 'ఇది మా యుద్ధం కాదు' అని కేకలు పెట్టారు. 1973 జూలై 14 న్యూయార్క్ టైమ్స్ దినపత్రికలో ఇలాంటిదే ఇంకో వార్త వచ్చింది. "వియత్నాం యుద్ధ ఖైదీలను ఉంచిన జైలులో మానవత్వంతో వ్యవహరిస్తున్న అమెరికన్ సైనికులలో ఒకరితో పై అధికారి 'శత్రువులకి సాయం చెయ్యకు' అని దర్పంగా చెబితే 'ఎవరు శత్రువులు, ఎవరి శత్రువులు' అని ఆ సైనికుడు నిలదీశాడట." అక్కడా సైనికులు అంతా కలిసి ఆ చెరసాలలోనే ఒక శాంతి కమిటీ వేశారట. ఆ కమిటీలో ఉన్న సార్జెంట్‌ను అక్కడి నుండి వెనక్కి రప్పించేసిందట ప్రభుత్వం. అతను ఏం చెప్పాడో వినండి.

"మేము మా స్థావరం చేరుకునే దారిలో ఒక్కటంటే ఒక్క పల్లె కూడా పచ్చగా లేదు. దాదాపు అన్ని పల్లెలనూ సర్వనాశనం చేసి పెట్టారు. నేనోచోట కూలబడిపోయా. నన్ను నేను ప్రశ్నించుకున్నా – ఇది రైటా, తప్పా అని. పల్లెలను నాశనం చేయడం, ప్రజలను మూకుమ్మడిగా హత్య చేయడం సరైనదేనా అని తర్కించుకున్నా. నాకు సమాధానం దొరికింది. ముమ్మాటికీ మాది తప్పనిపించింది."

1973లో వియత్నాం నుండి అమెరికన్ సైన్యం ఉపసంహరించుకుంటుందని ప్రకటించినాక వాషింగ్టన్‌లో పెంటగాన్ అధికారులూ, శాన్‌డియోగోలోని నావికాదళ అధికార ప్రతినిధులూ ఒక ప్రకటన చేశారు. నావికాదళంలో ఉండతగినవాళ్ళ 'ఉండతగనివాళ్ళ' ఏరివేత చేపట్టాం అనేదే ఆ ప్రకటన సారాంశం. పసిఫిక్ దళంలో అలాంటివాళ్ళు ఆరువేల మంది ఉన్నారని వాళ్ళు లెక్క తేల్చారు. అందులో నల్లజాతీయులు గణనీయంగా ఉన్నారు. దాదాపు 5,63,000 మంది జి.ఐ.లను 'గౌరవరాహిత్యం'గా సర్వీసు నుంచి పంపించివేశారు. (దీనిమూలంగా మాజీ సైనికులకు అందే రాయితీలు, సదుపాయాలు ఏవీ వీరికి అందవు). 1973లో సర్వీసు నుంచి పంపించేసిన ప్రతి ఐదుగురిలో ఒక్కరు ఇలా 'గౌరవ రాహిత్యం'గా ఇంటికి సాగనంపబడినవాళ్ళే. అంటే వీరంతా సైన్యం పట్ల క్రమశిక్షణాయుత విధేయత పాటించనివారే. 1971 లెక్కలు చూస్తే ప్రతి వెయ్యి మందిలో 177 మంది వరకూ విధులకు గైర్హాజరు అయ్యారు. ఇలా ఒకసారి కాదు రెండు సార్లు కాదు, నాలుగైదు తడవలు విధులకు గైర్హాజరు అయిన వాళ్ళు ఎందరో ఉన్నారు. 1967లో సైన్యం విడిచిపెట్టి పారిపోయిన వాళ్ళ సంఖ్య 47000. అదే 1971 వచ్చేసరికి ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. 89,000 మంది పారిపోయారు సైన్యం నుండి.

సైన్యాన్ని అంటిపెట్టుకుని ఉండి, విధేయతగా యుద్ధం చేసిన 'రోన్ కోవిక్' లాంటి వాళ్ళ కథ వేరేగా ఉంది. రోన్ కోవిక్ వాళ్ళ నాన్న 'లాంగ్' దీవులలోని ఒక సూపర్ మార్కెట్లో పనిచేసేవాడు. పదిహేడు సంవత్సరాల వయసులో రోన్ కోవిక్ సైన్యంలో తన పేరు నమోదు చేయించుకున్నాడు. రెండేళ్ళ తరువాత వియత్నాంలో పంథొమ్మిదేళ్ళ వయసులో బాంబు షెల్ తగిలి అతని వెన్నుపూస ఛిద్రమైపోయింది. యువక వయసులోనే అతని బతుకు చక్రాల కుర్చీ పాలయిపోయింది. అమెరికాకు తిరిగి వచ్చాక వియత్నాం యుద్ధంలో గాయపడిన వారికి అందే వైద్య చికిత్సలలో అమానుషత్వాన్ని కళ్ళారా చూశాడు. యుద్ధం మీద లోతైన ఆలోచనలు చేసి చివరికి యుద్ధ వ్యతిరేక వియత్నాం 'వెటరన్స్'తో చేయి కలిపాడు. ఎక్కడ ప్రదర్శన జరిగినా వెళ్ళి యుద్ధానికి వ్యతిరేకంగా ప్రసంగించేవాడు. ఒకనాటి సాయం సమావేశంలో ప్రముఖ నటుడు డొనాల్డ్ సూథర్‌లాండ్ మొదటి ప్రపంచ యుద్ధానంతరం డాల్టన్ ట్రంబో రాసిన నవలలోంచి కొన్ని వాక్యాలు ఎత్తి చదవడం విన్నాడు. "జానీ తుపాకి అందుకున్నాడు, కాల్చాడు. అవయవాలు తెగిపడి, మొహం ఛిద్రమైపోయిన ఒక సైనికుడి శవం. బయటి

ప్రపంచానికి శక్తివంతమైన సందేశం ఇవ్వడానికి అతను ఎంచుకున్న మార్గం ఇది. తుపాకి శబ్దం వినబడితే చాలు ఎవరైనా నిలువునా వొణికిపోవాల్సిందే ఈ సంఘటన చూశాక.”

సూథర్‌లాండ్ చదివిన పేరాను నేను ఎన్నటికీ మర్చిపోలేను. నన్ను నిలువునా కదిలించేసింది. ఒకే గొంతుక కాని లక్షలాది ప్రతిధ్వనులు. నేను ఎప్పుడు ఆసుపత్రికి వెళ్ళినా ఆ వాక్యాలే నన్ను వెంటాడేవి. అప్రయత్నంగానే నా కళ్ళలో నీళ్ళు ఊరిపోయేవి అంటాడు కోవిక్.

ఒకసారి యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్న నేరారోపణ మీద కోవిక్‌ను అరెస్టు చేశారు. చక్రాల కుర్చీలో కూచోబెట్టి జైలు ఆవరణలోనే విచారణ చేసి వేరే గదిలోకి తీసుకెళ్ళారు. బోర్న్ జైలులో జూలై 4న జరిగిన ఆ సంఘటన గురించి కోవిక్ ఇలా వివరించారు.

విచారణ బల్లకు అటుగా కూర్చున్న అధికారి ‘నీ పేరేంటి’ అని అడిగాడు. ‘రోన్ కోవిక్’ అని చెప్పి ఆ తరువాత అతను అడగబోయే ప్రశ్నకు ముందే సమాధానం చెప్పా – ‘వృత్తి – యుద్ధ వ్యతిరేక పోరాటంలో ఉన్న వియత్నాం వెటరన్’ను అని –

‘ఏంటీ’ అని వెటకారంగా అడిగాడతను నన్ను కింద నుండి పైకి చూస్తూ.

నేను మళ్ళీ చెప్పా – ‘నేను వియత్నాం’ వెటరన్‌ను. యుద్ధానికి వ్యతిరేకంగా పోట్లాడుతున్నా’ అని గట్టిగా చెప్పా.

దానికతను నాకేసి కచ్చగా చూస్తూ ‘నువ్వు అక్కడే చచ్చి ఉండాల్సింది’ అంటూ తన అసిస్టెంటు కేసి చూసి ‘ఈ తిక్కలోణ్ణి తీసుకెళ్ళి మేడమీంచి కిందకి తోసెయ్యండి’ అన్నాడు.

“నా వేలి ముద్రలు, ఫొటోలు తీసుకుని తీసుకెళ్ళి నన్ను ఒక సెల్‌లో పడేశారు. నన్ను డాక్టరు పరీక్ష చేసేటపుడు మూత్రం పోసుకునే ట్యూబు పక్కకి తప్పిపోయింది. దాంతో నా ఒంటి మీద గుడ్డలు తడిసిపోయాయి మూత్రంతో. అట్లానే పడుకోవడానికి ప్రయత్నించా. నావల్ల కాలా. ఒంట్లో ఓపిక నశించి అలిసిపోయినట్లు అనిపిస్తోంది. కాని నా గుండెల్లో మంట రాజుకుంటూనే ఉంది.”

... ... ...

1972లో మియామీలో జరిగిన రిపబ్లికన్‌ల సదస్సుకు కోవిక్ తదితరులు వెళ్ళారు. చక్రాల కుర్చీల్లోనే హాల్లోకి చేరుకున్నారు. నిక్సన్ అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నిక కాబడినందుకు అంగీకార పూర్వక ప్రసంగం చేయడానికి లేచి నిలబడగానే ‘వీల్ ఛైర్’లో ఉన్న వియత్నాం ‘వెటరన్స్’ యుద్ధాన్ని ఆపండి’, ‘అమాయక ప్రజల మీద బాంబు దాడులు ఆపండి’ అని ఒక్కపెట్టున నినాదాలు చేశారు. సదస్సుకు హాజరైన ప్రతినిధులు ‘ద్రోహుల్లారా’ అని వీళ్ళని తిట్టిపోశారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వీళ్ళని చక్రాల కుర్చీల పళాన ఎత్తుకొచ్చి బయట పడేశారు.

1973 శీతాకాలం వచ్చేసింది. అమెరికన్ పాలకులకు కనుచూపు మేరలో విజయం కానరాకుండా పోయింది. ఉత్తర వియత్నాం సైన్యం దక్షిణ వియత్నాంలోని అనేక ప్రాంతాల్లోకి చొచ్చుకు వచ్చేసింది. ఎట్టకేలకు అమెరికా తన సైన్యాన్ని ఉపసంహరించుకోవడానికి ఒప్పుకుంటున్నట్లు చెబుతూనే ఉత్తర వియత్నాం విప్లవ సైన్యం ఇప్పుడు ఉన్న చోటుకే పరిమితం కావాలని, కమ్యూనిస్టులు, కమ్యూనిస్టేతరులతో కూడిన ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించాలని ఒక మెలిక పెట్టింది. అయితే సైగాన్ ప్రభుత్వం ఇందుకు నిరాకరించింది. దాంతో అమెరికన్ పాలకులు తమ చివరి ప్రయత్నంగా ధూర్తబలాన్ని ప్రదర్శించి అయినా సరే ఉత్తర వియత్నామీయులను లొంగదీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా బి-52 బాంబర్లతో హనోయ్, హైపాంగ్ పట్టణాల మీద బాంబుల వర్షం కురిపించారు. ఇళ్ళు, ఆసుపత్రులు నేలమట్టం చేశారు. వేలాదిమంది అమాయక పౌరులు ఈ దాడుల్లో హతమైపోయారు. అయినా ఆశించిన ఫలితం దక్కలేదు. బి-52 బాంబర్లను విప్లవ సైన్యం చాలామటుకు కూల్చేసింది. అమెరికన్ పాలకుల దుర్మార్గాన్ని తెగనాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరసన పెల్లుబికింది. దాంతో కిసింజర్ హడావుడిగా పారిస్ బయల్దేరి వెళ్ళాడు. గతంలో అంగీకరించిన శాంతి ఒప్పందం మీదే మరోసారి సంతకాలు చేశాడు.

అమెరికన్ సైన్యం ఉపసంహరణ మొదలయింది. కానీ సైగాన్ ప్రభుత్వానికి ఆర్థిక, సైనిక, ఆయుధ సాయం కొనసాగించింది. అయినా ఆ ప్రభుత్వం బతికి బట్టకట్టలేకపోయింది. 1975లో దక్షిణ వియత్నాంలోని ప్రధాన పట్టణాల మీద ఉత్తర వియత్నాం సేనలు దండెత్తాయి. 1975 ఏప్రిల్ చివరి నాటికి సైగాన్‌లోకి ప్రవేశించాయి. అమెరికన్ రాయబార కార్యాలయ సిబ్బంది అక్కడ నుండి ఉడాయించింది. కమ్యూనిస్టు పరిపాలనలో తమ భాగోతాలు సాగవనుకున్న వియత్నామీయులు కూడా అదే తోవ పట్టారు. ఆ రకంగా వియత్నాం యుద్ధం ముగిసింది. సైగాన్ పట్టణానికి హోచిమిన్ నగరంగా పేరు పెట్టారు. ఉత్తర, దక్షిణ వియత్నాంల ఏకీకరణ జరిగింది. వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అవతరించింది.

చరిత్రను సంప్రదాయబద్ధంగా చిత్రించే చరిత్రకారులు, రాజకీయ నాయకులు చొరవ తీసుకోవడం మూలాన ఏ పారిస్‌లోనో, బ్రస్సెల్స్‌లోనో, వెర్సయిల్స్ లోనో పరిణితి చెందిన చర్చల ద్వారా యుద్ధానికి ముగింపు పలికారని రాసుకు వస్తుంటారు. ప్రజల కోరిక మేరకు యుద్ధం అంతమయిందని చరిత్రలో మనం చదువుకున్న సందర్భం అత్యంత అరుదుగా ఎదురవుతుంది. వియత్నాం యుద్ధం విషయానికి వచ్చేసరికి రాజకీయ నాయకులు కడపంక్తిలో ఉన్నారు. ప్రజలు ముందు పీఠిన ఉండి ఈ యుద్ధానికి స్వస్తి చెప్పేలా రాజకీయ నాయకులని లొంగదియ్యగలిగారు. అమెరికా విషయంలో కూడా నెలలకు 'టోన్‌కిన్' జలసంధి ఉదంతం చోటు చేసుకుంది.

1965 ఏప్రిల్ 2న సిఐఎ డైరెక్టర్ జాన్ మెక్‌కాన్ ప్రభుత్వానికి పంపిన ఒక 'మెమో'లో "ఉత్తర వియత్నాం మీద ఇప్పటి దాకా జరిగిన బాంబింగ్ మూలంగా ఆ దేశం మన దారికి వచ్చింది లేదు, తన విధానాన్ని మార్చుకుందీ లేదు కాబట్టి మరింత ఉధృతంగా బాంబింగ్ జరపాలని" సలహా ఇచ్చాడు. "అయితే బాంబింగ్‌ను నిలిపివెయ్యమని రకరకాల శక్తుల నుండి మన మీద వత్తిడి విపరీతంగా పెరగవచ్చు. ప్రజలు, పత్రికలు, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాల నుండి అలాంటి వత్తిడి ఒక బలమైన శక్తిగా మారే లోపుగా మనం మన పని కానిచ్చెయ్యాలి" అని ముందుచూపుతో చెప్పాడు.

రక్షణ శాఖ సహాయ కార్యదర్శి జాన్ మెక్‌నాటన్ 1966 తొలిపాదంలో ప్రభుత్వానికి పంపిన 'మెమో' మరింత దుర్మార్గమైనది. అందులో ఏం రాసి వుందో చూడండి –

"ప్రజలను లక్ష్యంగా చేసుకుని మనం చేస్తున్న బాంబు దాడుల మూలంగా ఇంటా బయటా మన మీద అసహ్యం వెల్లువెత్తి పోతా వుంది. ఇంతకన్నా లాకులు, డామ్‌లు బాంబులతో సర్వనాశనం చేసి పంటలకు నీరు లేకుండా చేసిన జనాలు తిండి దొరక్క ఆకలికి అలమటించి కరువు బారిన పడి చచ్చేలా చూడటం మంచిది."

అంతేకాదు పెంటగాన్ చరిత్రకారులు రాసినదాన్ని బట్టి చూస్తే 1967 మే నెలలో ఇదే మెక్‌నాటన్ వియత్నాం యుద్ధం పట్ల పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత గురించి ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించిన దాఖలాలు ఉన్నాయి. "యుద్ధం పట్ల ప్రజలలో నెలకొన్న అశాంతి, అసంతృప్తుల తీవ్రత, విస్తృతి గురించి మనం ఆందోళన పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి దేశంలో. ప్రత్యేకించి యువతరం, మహిళలు, మేధావులు, లేమితో సహజీవనం సాగిస్తున్న ప్రజానీకంలో ఈ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో వుంది. ఇవాళ కనుక ప్రభుత్వం 20,000 మంది రిజర్వ్ సైనికులను రిక్రూట్ చేసుకోవడానికి పిలుపునిస్తే పరిస్థితులు పూర్తిగా తారుమారయి పోయేలా వున్నాయి. చేతిలో ఉన్న పిట్ట జారిపోయే పరిస్థితి ఉందని చెప్పడం అతిశయోక్తి కాదు. సైన్యంలో చేరడానికి గాని, యుద్ధంలో కాలుమోపడానికి గానీ, కనీసంగా సహకరించడానికి గాని అనువైన పరిస్థితులు లేవు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకా ఏముంటుంది?" అని మెక్‌నాటన్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశాడు.

యుద్ధం పేరిట అమెరికా అడ్డగోలుగా వ్యవహరించడానికీ కొన్ని పరిమితులు ఉన్నాయి. ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా పిలవబడే దేశం పిట్ట మాదిరి ఒక చిన్న దేశాన్ని, అందునా వెనుకబడిన దేశాన్ని తన దారికి తెచ్చుకోవడానికి అదే జరిగింది. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలు అగ్రభాగాన నిలిచారు. రాజకీయ నాయకులు కడగా నిలబడ్డారు. అమెరికన్ అధ్యక్షుడు వీళ్ళ కన్నా ఇంకా వెనుకబడ్డాడు. సుప్రీం కోర్టు యుద్ధ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ వేసిన వ్యాజ్యాలన్నింటినీ మౌనంగా పక్కన పెట్టి మొహం తిప్పేసుకుంది. ఇక అమెరికన్ కాంగ్రెస్ (పార్లమెంట్) ప్రజాభీష్టానికి కొన్ని సంవత్సరాలు వెనుకబడి ఉంది.

అమెరికన్ సైన్యం కాంబోడియాలో జోక్యం చేసుకుంది. దేశవ్యాప్తంగా యూనివర్శిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున అలజడి రేపడంతో అమెరికన్ కాంగ్రెస్ నిద్దురలోంచి మేలుకుంది. కాంగ్రెస్ అనుమతి లేనిదే కాంబోడియాకు సైన్యాన్ని పంపకూడదని తీర్మానం చేసింది. అమెరికన్ దళాలను వియత్నాం గడ్డ మీద నుండి తరిమికొట్టాక గాని అధ్యక్షుడి అధికారాలను నియంత్రిస్తూ కాంగ్రెస్‌లో ఒక బిల్లు పెట్టారు. కాంగ్రెస్ అనుమతి లేనిదే యుద్ధానికి దిగరాదని ఆంక్షలు విధించారు. తప్పనిసరి పరిస్థితి అయితే కాంగ్రెస్ అనుమతి లేకుండా తనంతట తానుగా అరవై రోజుల పాటు యుద్ధం నడిపే అధికారాన్ని అధ్యక్షుడికి ఇవ్వాలనే మినహాయింపు చేర్చారు.

వియత్నాం యుద్ధంలో అమెరికా ఓటమి అంచున ఉన్న మూలానో, యుద్ధ వ్యతిరేక ఉద్యమానికి తలొగ్గి వెనక్కి తగ్గాల్సి వచ్చిందనో ప్రజలు గ్రహించకూడదని పాలక వర్గాలు నానా తంటాలు పడ్డాయి. శాంతిని ఆశించి ప్రభుత్వం యుద్ధానికి స్వస్తి చెప్పడానికి చర్చలు చేపట్టిందనే ప్రచారం హోరెత్తించింది. అయితే ఈ యుద్ధం పట్ల జనాభిప్రాయం ఎలా ఉందనే సున్నితమైన వాస్తవాన్ని ప్రభుత్వ అధీనంలో ఉన్న రహస్య పత్రాలు అనేకం విడమర్చి చెబుతాయి. పెంటగాన్ పత్రాలలో ఉన్న గణాంకాలు అసలు నిజం ఏమిటో బయటపెడతాయి.

1964 జూన్‌లో అమెరికా మిలిటరీ – రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు, అమెరికన్ రాయబారి హెన్రీకాబట్ లాడ్జ్‌తో కలిసి హోనోలూలులో సమావేశం అయ్యారు. 'ఆగ్నేయాసియా ప్రాంతంలో మనం అనుసరిస్తున్న విధానం పట్ల ప్రజాభిప్రాయం మా చెడ్డగా తయారయిందని, అందుకే అధ్యక్షుడికి బలమైన మద్దతు కూడగట్టాల్సిన తక్షణ అవసరం ఉందని' రస్క్ ఆ సమావేశంలో అన్నాడు.

కీలుబొమ్మ ప్రభుత్వంలోంచి డైమ్‌ను దింపేసి కాన్హ్ అనే సైనిక జనరల్‌ను ప్రతిష్టించారు. "అమెరికన్ రాయబారి లాడ్జ్ జూన్ 5న సైగాన్‌కు తిరిగి రావడంతోటే నేరుగా ఎయిర్‌పోర్ట్ నుండి వెళ్ళి జనరల్ కాన్హ్‌ను కలిశాడు. అతనితో జరిపిన చర్చలలో ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది ఒకే అంశం మీద. అమెరికా ప్రభుత్వం ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే పనిలో ఉందని, సమీప భవిష్యత్‌లోనే ఉత్తర వియత్నాం మీద సైనిక చర్య తీసుకునే అవకాశం ఉందని జనరల్ కాన్హ్‌కు నమ్మకం కలిగించే పనిచేశాను" అని పెంటగాన్ చరిత్రకారులు రాశారు. ఇది జరిగిన రెండు వారాలకి దాదాపు వెయ్యిమంది సైనికులను బలిపెట్టాల్సి రావడాన్ని అటు అమెరికన్లు, ఇటు ప్రపంచ ప్రజానీకం ఇంకేమాత్రం హర్షించే పరిస్థితి లేదు. అమెరికన్ చరిత్రలోనే అత్యంత భారీ మూల్యం చెల్లించుకున్న యుద్ధం ఇది. మొత్తంగా ఒక తరం ప్రజా చైతన్యాన్ని పూర్తిగా తప్పుదోవ పట్టించడానికి పాలకవర్గాలు శతధా ప్రయత్నించి విఫలమయ్యాయి.

... ... ...

అమెరికాలో నడిచిన యుద్ధ వ్యతిరేక ఉద్యమం ప్రజల మీద ఎంత ప్రభావం చూపింది అనే దానికి కొండ గుర్తు ఏమిటంటే యుద్ధ వ్యతిరేక నిరసనకారుల మీద ప్రభుత్వం మోపిన అభియోగాలు రుజువు అయ్యాయని తీర్పులు ఇవ్వడానికి 'జ్యూరీ'లు నిరాకరించాయి. 1971లో వాషింగ్టన్‌లో జడ్జీలు ప్రదర్శనకారుల మీద అభియోగాలను కొట్టి పారెయ్యడమే పనిగా పెట్టుకున్నారు. అదే ఒక రెండేళ్ళ క్రితం అయితే ఖచ్చితంగా ఆ అభియోగాల మీద ప్రదర్శనకారులకు జైలు శిక్షలు పడేవే. 'బాల్టిమోర్ ఫోర్', 'కాటన్స్ విల్లె నైన్', 'మిల్ వైవ్‌కీ ఫోర్టీన్', 'బోస్టన్ ఫైవ్' కేసులుగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనకారుల మీద మోపబడిన ప్రముఖ కేసుల్లో కూడా ముద్దాయిలకు స్వల్ప శిక్షలతో సరిపెట్టారు. చివరిగా అటువంటి దాడి చేసిన వారి కేసు 'కామ్‌డెన్ 28'లో పాల్గొన్నవాళ్ళు మత బోధకులు, నన్‌లు, సామాన్య ప్రజలు. 1971 ఆగస్టులో న్యూజెర్సీలో చోటుచేసుకుంది ఈ సంఘటన. దాదాపు నాలుగేళ్ళ క్రితం 'బాల్టిమోర్ 4' కేసులో ఇలాంటి దాడులకే పూనుకున్న నేరారోపణలపై యుద్ధ వ్యతిరేక ప్రదర్శనకారులకు అందరికీ శిక్షలు పడ్డాయి. ప్రధాన నిందితులుగా పేర్కొన్న ఫిల్ బెర్రిగాన్‌కు ఆరేళ్ళ జైలు శిక్ష పడింది. కాని 'కామ్‌డెన్ 28' కేసులో జ్యూరీ ముద్దాయిలందరినీ బేషరతుగా విడుదల చేసింది. కేసు కొట్టి పారేసింది. తీర్పు వెలువడగానే జ్యూరీలో ఒకరైన శామ్యూల్ బ్రెయిల్ వైట్ అనే 53 ఏళ్ళ నల్లజాతి టాక్సీ డ్రైవర్, సైన్యంలో పదకొండేళ్ళ పాటు పనిచేసిన అనుభవశాలి నేరారోపణ ఎదుర్కొన్నవారికి ఒక ఉత్తరం అందించాడు. ఆ ఉత్తరం సారాంశం ఇదీ–

"దేవుడు ఇచ్చిన తెలివితేటలతో మీరంతా మంచే చేశారు. శెహభాష్. అధికారం కట్టబెట్టి, ముందుండి తమని నడిపించమని నమ్మకంతో ప్రజలు అందలం ఎక్కిస్తే తమ బాధ్యత మరచి యుద్ధం అనే మాయదారి జబ్బు తలకి ఎక్కించుకున్నవారికి మీరు సరైన మందు వేశారు. మృత్యుహేలతో, దేశాన్ని విధ్వంసం దిశగా నెట్టేస్తున్న పాలకులు ప్రజల ఆకాంక్షలను వంచించారు. ఇది తప్పని తెలిసి కూడా అనేకమంది ఒంటిస్తంభం మేడలో కూచుని జరిగేదంతా ప్రేక్షకుల మాదిరి చూస్తూ ఉండిపోతే మీరు; కేవలం మీరు మాత్రమే మీ బాధ్యత నెరవేర్చడానికి రోడ్డు మీదకు వచ్చారు... ఇవాళ కాకపోతే రేపయినా, కనీసం సమీప భవిష్యత్తులో సకల దేశాల ప్రజానీకం శాంతి సౌఖ్యాలతో సహజీవనం సాగించే రోజు ఒకటి వస్తుంది.

... ... ...

# 7

# డెబ్భయ్యవ దశకం - అంతా అదుపులో ఉంది

**7**0వ దశకం తొలినాళ్లలో వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం సన్నగిల్లిపోయి పరిస్థితి చెయ్యిజారిపోయిన పరిస్థితి తలెత్తింది. మిచిగాన్ యూనివర్శిటీ సర్వే పరిశోధక కేంద్రం వివరాల ప్రకారం, 1970 నాటికి అమెరికన్ పౌర సమాజంలో అన్ని తరగతుల ప్రజానీకంలో 'ప్రభుత్వం మీద నమ్మకం' అడుగంటిపోయింది. వర్గ పొందిక రీత్యా పరిశీలిస్తే ఆసక్తికరమైన తేడాలు కనబడ్డాయి. 40 శాతం మంది వృత్తి నిపుణులతో (ప్రొఫెషనల్స్) ప్రభుత్వం మీద రాజకీయ విశ్వాసం సన్నగిల్లితే అదే కార్మికుల విషయానికి వస్తే 66 శాతం మందిలో అవిశ్వాసం పాదుకుంది.

గతంలో ఓటర్లు తాము రిపబ్లికన్ పార్టీకో, డెమోక్రటిక్ పార్టీకో చెందిన వారుగా చెప్పుకోవడం పరిపాటి. కాని 70వ దశకంలో ఓటర్లు ఈ రెండు పార్టీల పేరెత్తడానికే అయిష్టత ప్రదర్శించసాగారు. 1940వ దశకంలో కేవలం 20 శాతం మంది మాత్రమే తాము ఏ పార్టీకి చెందని 'స్వతంత్రులం' అని చెప్పుకునేవారు. కాని 1974కి వచ్చేసరికి 34 శాతం మంది తమని తాము 'స్వతంత్రులు'గా చెప్పుకున్నారు.

కోర్టులు, జ్యూరీలు, ఆఖరుకు జడ్జీలు కూడా అసాధారణ రీతిలో స్పందించసాగారు. జ్యూరీలు అతివాదులను (రాడికల్స్) నిర్దోషులుగా ప్రకటించి విడుదలకు సిఫార్సు చెయ్యడం పరంపరగా కొనసాగింది. ఏంజెలా డేవిస్ పక్కా కమ్యూనిస్టు. కానీ 'వెస్ట్‌కోస్ట్' కోర్టులో జ్యూరీలో అందరూ శ్వేత జాతీయులు ఉన్నప్పటికీ ఏంజెలా డేవిస్‌ను నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసారు. ప్రభుత్వం అడుగడుగునా తప్పుడు ప్రచారం చేసిమరీ సర్వనాశనం చెయ్యాలనుకున్న 'బ్లాక్‌పాంథర్స్'కు చెందిన సభ్యులను అనేక విచారణలలో జ్యూరీలు నిర్దోషులుగా తేల్చి విడుదల చేసారు. న్యూక్లియర్ ప్లాంట్ నిర్మించబోయే స్థలంలో ఒక కంపెనీ సంకేతాత్మకంగా నిలబెట్టిన 500 అడుగుల టవర్‌ను 'శామ్‌లవ్‌జాయే' అనే యువకార్యకర్త కూలదోసాడనే అభియోగం మీద అరెస్టు చేసి కోర్టులో నిలబెట్టారు. పశ్చిమ మస్సాచ్యుట్స్‌లో విచారణకు వచ్చిన ఈ కేసును జడ్జి కొట్టేసాడు. కాంబోడియా మీద జరిపిన బాంబు దాడులకు నిరసన తెలియచేసిన ఆరుగురు వ్యక్తులు శ్వేతసౌధంలో సందర్శకులకు కేటాయించిన 'లైను' తిప్పి లోపలికి ప్రవేశించారనే నేరం మీద అరెస్టు చేసి కోర్టుకు తెస్తే జడ్జిగారు వాళ్లకు శిక్ష విధించడానికి నిరాకరించారు.

ప్రభుత్వం, కార్పొరేట్ వ్యాపారానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జన సామాన్యంలో ఇంతటి అయిష్టత పెరిగిపోవడానికి కారణం– వియత్నాం యుద్ధం, ఈ యుద్ధంలో అసువులు బాసిన 55000 మంది సైనికులు. ఈ యుద్ధాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వం చేసిన లెక్కకు మిక్కిలి ఆకృత్యాలు, అబద్ధాలే. వీటన్నిటికీ మించి అధ్యక్షుడు నిక్సన్ పరిపాలనలో వెలుగులోకి వచ్చిన 'వాటర్‌గేట్ కుంభకోణం' అమెరికా చరిత్రలోనే తొలిసారిగా అధికారంలో ఉన్న అధ్యక్షుడు రాజీనామా చెయ్యడానికి దారి తీసింది ఈ కుంభకోణం, 1974 ఆగస్టు నెలలో నిక్సన్ తన పదవికి రాజీనామా చేసారు.

నిక్సన్‌ను అభిశంసించడానికి వేసిన హౌస్‌కమిటీ అతని మీద మోపిన అభియోగాలలో చాలామటుకు దాటవేసింది. ఎందుకంటే నిక్సన్ కంటె ముందు అమెరికా అధ్యక్షులుగా వ్యవహరించిన వారిలో ఎందరో అలాంటి పనులకు పూనుకున్నవాళ్లే. నిక్సన్ తరువాతి కాలంలో అధ్యక్షుడు కాబోయేవాళ్లూ అలాంటి పనులు తలకెత్తుకోక తప్పని పరిస్థితి. శక్తివంతమైన బహుళజాతి కార్పొరేట్ సంస్థలతో అమెరికా అధ్యక్షుడు అనేవాడికి ఉండే బాదరాయణ సంబంధాలు జగమెరిగిన సత్యమే. అందుకే ఈ సంబంధాలను గురించిగాని, కాంబోడియా మీద బాంబింగ్ జరిపించిన వ్యవహారం మీద గానీ హౌస్‌కమిటీ ఎలాంటి వ్యాఖ్యలూ చెయ్యలేదు. ఎందుకంటే అధ్యక్ష పదవిలో ఎవరు ఉన్నా ఇలాంటివి ఒక 'పాలసీ'గా అనుసరించాల్సిందే. అందుకే నిక్సన్ విషయంలో కొట్టొచ్చినట్లు బయటపడిన ఇతరత్రా అంశాల మీదే హౌస్‌కమిటీ విచారణ జరిపింది.

చివరికి నివేదిక రానే వచ్చింది. తీర్పు ఏమిటంటే– 'నిక్సన్‌ను సాగనంపండి– వ్యవస్థను మాత్రం యథాతథంగా కొనసాగించండి' అని. కెనడీకి సలహాదారుగా పనిచేసిన థియోడర్ సోరెన్‌సెన్ వాటర్‌గేట్ కుంభకోణం మీద తన అభిప్రాయాన్ని ఇలా చెప్పుకొచ్చాడు– "చట్టాల్ని అమలు చెయ్యాల్సిన మన వ్యవస్థలో ఇలాంటి పెద్ద పెద్ద తప్పులు దొర్లడానికి ప్రధాన కారణం వ్యక్తులే తప్ప వ్యవస్థ కాదు. అందుకే కుళ్లిన ఆపిల్ పళ్లు పారేసుకోవాలే తప్ప, పళ్లు నిలవచేసుకునే బ్యారల్‌ను మట్టిపాలు చేసుకోకూడదు."

అనుకున్నట్టే 'బ్యారల్'ను కాపాడుతూ వచ్చారు. నిక్సన్ దిగిపోయాడు కానీ అతని విదేశాంగ విధానం మాత్రం యథాతథంగా కొనసాగింది. ప్రభుత్వానికి, కార్పొరేట్ ప్రయోజనాలకు మధ్య ఉన్న అక్రమ సంబంధం యథావిధిగా కొనసాగింది. వాషింగ్టన్‌లో కార్పొరేట్ లాబీయిస్టులు ఫోర్డ్‌కు అత్యంత సన్నిహితులు, మిత్రులూనూ. అలెగ్జాండర్ హేగ్ నిక్సన్‌కు అత్యంత విశ్వసనీయ సలహాదారుగా పనిచేసాడు. వాటర్‌గేట్ ఉదంతంలో బయటపెట్టాల్సి వచ్చిన 'టేపు'ల్ని తకరారు చేసాడు. ప్రజలకు తప్పుడు సమాచారం అందించాడు. అలాంటి వ్యక్తిని ఫోర్డ్ నాటో సైనిక దళాల ప్రధానాధికారిగా నియమించాడు. అలాగే ఫోర్డ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక చేసిన మొదటి పని 'నిక్సన్'కు క్షమాభిక్ష ప్రసాదించాడు. క్రిమినల్ చర్యలు చేపట్టకుండా మినహాయింపు ఇస్తూ, భారీ 'పెన్షన్' మొత్తాలు అందుకుని కాలిఫోర్నియాలో స్థిరపడేందుకు నిక్సన్‌కు చెయ్యవలసిన సాయం అంతా చేసాడు.

క్లబ్బు రూల్సు పాటించని వారికి ఎలాంటి నొప్పి కలగకుండా, తీవ్రమైన శిక్షలేమీ లేకుండా సాగనంపినట్లు నిక్సన్ జమానాలో అధికారులను ఇంటికి సాగనంపారు. కొద్దిమందికి జైలు శిక్షలు పడినా అవి స్వల్పమైనవే. ఫెడరల్ సంస్థలకు సంబంధించిన వారితో ఉదారంగా వ్యవహరించి జైళ్లకు పంపడమేగాక, సాధారణ ఖైదీలకు ఎవరికీ అందని ప్రత్యేక సౌకర్యాలన్నీ కల్పించారు. రిచర్డ్ క్లింజనీస్ట్ నేరాన్ని అంగీకరించినందుకుగాను 100 డాలర్ల జరిమానా ఒక నెల జైలు శిక్ష విధించి ఆనక దీన్ని రద్దు చేసారు.

నిక్సన్ పదవి ఊడింది. కానీ జాతీయ భద్రత పేరిట అధ్యక్షుడు ఎలాంటి అసాధారణమైన చర్యలైనా చేపట్టే అధికారాలు మాత్రం ఆ పదవిని అలానే అంటిపెట్టుకుని ఉన్నాయి. 1974 జూలైలో సుప్రీం కోర్టు ఈ విషయాల్ని తక్కువగా అంచనా వేసింది. నిక్సన్ తన ఆధీనంలో ఉన్న వైట్‌హౌస్ (అధ్యక్షభవనం) టేపులను వాటర్‌గేట్ కుంభకోణాన్ని విచారిస్తున్న 'స్పెషల్ ప్రాసిక్యూటర్'కు అందించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే అదే సందర్భంలో 'అధ్యక్ష రహస్య సమాచార హక్కు'ను నొక్కి వక్కాణించింది. అయినా నిక్సన్ కేసు విషయంలో మాత్రం ఈ క్లాజును అనువర్తింప చెయ్యలేదు. అయితే అధ్యక్షుడి హక్కును సుప్రీం కోర్టు గుర్తిస్తుంది అన్న ప్రకటన మూలంగా "మిలిటరీ, రాయబార, రహస్యాలు, సున్నితమైన జాతీయ భద్రతా రహస్యాలు" కాపాడుకునే అవసరాల పేరిట అధ్యక్ష పదవిలో ఉన్న వారెవరైనా సరే నిజాలను కప్పిపెట్టే అవకాశాన్ని సజీవంగా ఉంచినట్లయింది.

వాటర్‌గేట్ ఉదంతం విచారణను టీవీల్లో ప్రసారం చేసారు. కానీ సెనెట్ కమిటీ కార్పొరేట్ కంపెనీలతో అధ్యక్షునికి ఉన్న 'కనెక్షన్ల' విషయాన్ని విచారించే సమయంలో హఠాత్తుగా ఈ ప్రసారాలు నిలిచిపోయాయి. కీలకమైన అంశాలను ప్రసారం చెయ్యడం, చెయ్యకపోవడం అనేది టీవీ పరిశ్రమ గుత్త హక్కుగా మారిపోయింది. వాటర్‌గేట్ ఉదంతం ఇంటిదొంగ వ్యవహారంలాంటిది. ఈ అంశానికి మీడియా మొగలాయిలు ఇచ్చినంత ప్రచారంలో వందోవంతు కూడా మైలాయ్ నరమేధం విషయంలోగానీ, కాంబోడియా మీద విచ్చలవిడిగా జరిపిన బాంబుదాడుల విషయంలోగానీ, ఫెడరల్ బ్యూరో సిఐఎల కుట్రల విషయంలోగానీ ప్రసారం చెయ్యడానికి సాహసించలేదు. సోషలిస్టు వర్కర్స్ పార్టీ, బ్లాక్ పాంథర్స్, తదితర అతివాద పార్టీల విషయం అమెరికన్ సర్కారు చేసిన కుళ్లు రాజకీయాల గురించి పేపర్లలో మీకు భూతద్దం పెట్టి వెతికినా సమాచారం దొరకదు. వాటర్‌గేట్ డిపార్ట్‌మెంట్‌లో చొరబడి అతి రహస్యాన్ని బట్టబయలు చేసిన 'బ్రేకింగ్–న్యూస్'లు వియత్నాం యుద్ధం విషయంలో మీకు మచ్చుకు కూడా కానరావు టీవీల్లో.

1975లో వ్యవస్థను చక్కబెట్టే సంక్లిష్ట ప్రక్రియ మొదలయింది. 'మాయాగుయెజ్ ఉదంతం' తరహా మిలిటరీ యాక్షన్‌లు ఇంటా బయటా మొదలయ్యాయి. వ్యవస్థ పట్ల రోసిపోయి, భ్రమలు కోల్పోయిన ప్రజాసామాన్యంలో వ్యవస్థ విమర్శలు స్వీకరిస్తుంది తనని తాను చక్కదిద్దుకుంటుంది అనే భ్రమలు కల్పించడం పాలకుల తక్షణ అవసరంగా మారికూర్చుంది. దీనికో ప్రామాణిక పద్ధతి ఉండనే ఉంది. నేర పరిశోధన గురించి విపరీతంగా ప్రచారం చెయ్యడం, ప్రత్యేకించి ఎంపిక చేసిన ముద్దాయిలను దొరకబుచ్చడం, వ్యవస్థను మాత్రం

యథావిధిగా కొనసాగేలా జాగ్రత్త పడడం, ఇదీ ఆ ప్రామాణిక పద్ధతి. చట్టాలను అమలు చెయ్యాల్సిన ఎఫ్.బి.ఐ., సి.ఐ.ఎ. వంటి అత్యున్నత సంస్థలే ఆ చట్టాలను చట్టుబండలు చేసిన తీరు వాటర్‌గేట్ ఉదంతంతో బయటపడింది. ఇంటి దొంగతనంలో నిక్సన్‌కు అన్నివిధాలా సాయంగా నిలిచాయి. 1975లో 'కాంగ్రెస్ నేషనల్ హౌస్ కమిటీ' సిఐఎ, ఎఫ్‌బిఐల మీద విచారణ జరిపింది.

సిఐఎను విచారించిన సందర్భంలో ఆ సంస్థ ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించాల్సిన తన పరిధిని ఉల్లంఘించి అన్ని రకాల రహస్య కార్యకలాపాలకు పూనుకుంటుందనే నిజం బయటపడింది. ఉదాహరణకు 1950లోనే యల్‌ఎస్‌డి డ్రగ్ ప్రభావం ఎలా ఉంటుందో కొంతమంది అమాయకుల మీద ప్రయోగించే పనికి సిఐఎనే స్వయంగా పూనుకుంది. అలా సిఐఎ ప్రయోగానికి లోనయిన ఒక సైంటిస్టు న్యూయార్క్ నగరంలోని ఒక హోటల్ కిటికీ నుండి బయటకు దూకేసి అతని మరణానికి కారకురాలయింది.

క్యూబా అధినేత కాస్ట్రో, తదితర దేశాల నాయకులను హత్య కావించే పథకాలలోనూ సిఐఎ భాగస్వామి అయింది. 1971లో క్యూబాలో 'ఆఫ్రికన్‌స్వైన్ ఫీవర్' వైరస్‌ను ప్రవేశపెట్టి ఐదు లక్షల పందులను నిర్మూలించేలా చేసింది. సిఐఎ కిరాయికి కుదుర్చుకున్న ఒక ఏజెంట్ కెనాల్ జోన్‌లో ఉన్న ఆర్మీ కేంద్రం నుండి అందుకున్న ఈ వైరస్‌ను కాస్ట్రో వ్యతిరేక క్యూబన్లకు అందించినట్లు ఒక విలేఖరికి వివరించారు.

హెన్రీ కిసెంజర్ నాయకత్వాన ఏర్పడిన నలభై మంది సభ్యులుగల రహస్య కమిటీ ఒకటి చిలీలో సాల్వడర్ అలెండీ అధ్యక్షతన ఏర్పడిన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు సిఐఎ సహకారంతో పని చేసినట్లు కూడా ఈ విచారణలో వెల్లడయింది. లాటిన్ అమెరికా దేశాల్లో బహు అరుదుగా జరిగే నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత ఎన్నికలలో తొలిసారిగా ఒక మార్క్సిస్టు నాయకుడు, సాల్వడర్ అలెండీ, చిలీకి అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు. అలాంటి ప్రభుత్వాన్ని కూలదోయడంలో ప్రపంచ టెలికాం దిగ్గజం ఎ.టి.&టి. హస్తం కూడా ఉంది. 1974లో చిలీలో అమెరికన్ రాయబారిగా పని చేసిన డేవిడ్ పోప్పెర్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోసి అమెరికా సాయంతో అధికార పగ్గాలు చేపట్టిన మిలిటరీ నియంతృత్వ ప్రభుత్వం మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందని, అటువంటి తప్పులు సరిదిద్దుకోవాలని సూచించాడు. అందుకుగాను కిసింజర్, 'ఆ పెద్దమనిషిని రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడం మానుకోమని చెప్పండి' అని సందేశం పంపాడు.

ఇక ఎఫ్.బి.ఐ. విషయానికి వస్తే – ఆ సంస్థ చాలా ఏళ్లుగా చట్టవిరుద్ధంగా అతివాద–వామపక్ష రాజకీయ గ్రూపులను, సంస్థలను దెబ్బతియ్యడం, విచ్ఛిన్నం చెయ్యడమే పనిగా పెట్టుకుంది. ఫోర్జరీ చేసిన ఉత్తరాలు పంపండం, ఇ–మెయిళ్లు రహస్యంగా చదవడం వంటివి షరా మామూలు కార్యక్రమాలు దీనికి. 1960–66 మధ్య కాలంలో అలాంటి సంఘటనలు 92 ఉన్నాయని ఎఫ్.బి.ఐ స్వయానా ఒప్పుకుంది. బ్లాక్ పాంథర్ నాయకుడు ఫ్రెడ్ హాంప్టన్ హత్యా కుట్ర కేసులో కూడా ఎఫ్‌బిఐ హస్తం ఉన్నట్లు అనుమానించారు.

'కాంగ్రెషనల్ సెనెట్ కమిటీ' విచారణలో విలువైన సమాచారం చాలా బహిర్గతమయింది. కాని మితవాద, మధ్యేవాద పత్రికలలోగానీ, టీవీ ప్రసారాల్లోగానీ దీని గురించి ప్రచారమే లేదు. కమిటీ నివేదికలు ఉద్గ్రంథాల సైజులో వెలువడ్డాయి కానీ చదివే పాఠకులు ఏరీ? అయినా ఈ తంతు అంతా ఎందుకు నడిచిందో తెలుసా? వ్యవస్థలో లోపాలు సరిదిద్దే ప్రయత్నం నిజాయితీగా జరిగిందని ప్రజలను మభ్యపెట్టడానికే.

ప్రభుత్వం ఇలాంటి కార్యకలాపాలపై లోతైన విచారణ జరిపించడానికి సిద్ధంగా లేదు. కొన్ని పరిమితులకు లోబడే ఈ వ్యవహారం నడిపిస్తుందని విచారణల్లోనే బయటపడిపోయింది. సెనెట్ కమిటీ అనుబంధంగా మరో కమిటీని (చర్చ్ కమిటీ) వేసి, ఏ సంస్థల మీద అయితే దర్యాప్తు నిర్వహించాలో వాటి సహకారంతోనే విచారణ జరిపి రూపొందించిన నివేదిక చిత్తు ప్రతిని తిరిగి అదే సిఐఎ సంస్థకు అప్పగించి, అందులో ఏ భాగాలయినా తొలగించాలేమో చూసి చెప్పమని అడిగింది. అంటే విలువైన సమాచారం ఎంతో బయటపడే అవకాశం ఉన్నా కమిటీ, సిఐఎతో రాజీ సూత్రంగా వెలువరించిన తుది నివేదికలో అటువంటి సమాచారం పరిహరించబడింది.

ఇంకా చిత్రమైన విషయం ఏమిటంటే – అమెరికన్ కాంగ్రెస్ (మన పార్లమెంటు లాంటిది) ప్రతినిధులు వేసిన 'పైక్' కమిటీ సిఐఎ, ఎఫ్‌బిఐలతో ఇలాంటి మొహమాటాలేం పెట్టుకోకుండా తుది నివేదికను రూపొందించింది. కానీ ఏ ప్రతినిధులయితే ఈ కమిటీని వేసారో వాళ్లే ఈ నివేదికను 'రహస్య సమాచారంగా' తీర్మానించి అటక ఎక్కించేసారు. అయితే ఈ నివేదికలో అంశాలు డేనియల్ షూర్ అనే న్యూస్ రీడర్ సహకారంతో న్యూయార్క్ నగరంలో 'విలేజ్ వాయిస్' అనే సంస్థ ద్వారా ప్రసారం అయ్యాయి. కానీ దేశంలో పేరెన్నికగన్న టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ వంటి ఏ ఒక్క బడా దినపత్రికలోనూ ఈ వివరాలు ప్రచురించబడలేదు. సిబిఎస్‌లో పనిచేసే డేనియల్ షూర్‌ను ఆ సంస్థ ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. ఆ రకంగా 'జాతీయ భద్రత' పేరిట ప్రభుత్వానికి, మీడియాకు మధ్య ఒకరికొకరు సహకరించుకునే పరిస్థితి వచ్చింది.

ఫైడల్ కాస్ట్రో తదితర విదేశీ నాయకుల హత్యలకు సిఐఎ కుట్రలు పన్నిన తీరు గురించి చర్చ్ కమిటీ ఆసక్తికరమైన దృక్కోణాల్ని ఆవిష్కరించింది. సైనిక జోక్యం ద్వారా వేలాది మంది అమాయక పౌరుల మరణాలకు కారణం కావడం కన్నా దేశభక్తుల మధ్యన ఉండాల్సిన పెద్ద మనిషి ఒప్పందాన్ని ఉల్లంఘించి పరాయిదేశాల నాయకులను హత్యగావించేదానికి ప్రయత్నించడం క్షమార్హం కాని నేరంగా భావించింది. హత్యాపథకాల నివేదికకు 'ముందుమాట'గా ఇలా రాసింది–

'ఒకసారి బలప్రయోగం, హింసా మార్గాలను ఎంచుకున్నాక ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండనే ఉంటుంది. అయితే తడిగుడ్డతో గొంతులు కోసే విధంగా టార్గెట్ చేసి మరీ విదేశీ నాయకులపై చేసే అంతర్జాతీయ హత్యా ప్రయత్నాలకు, విదేశాల అంతర్గత వ్యవహారాలలో 'ఇతర పద్ధతులలో' మనం జోక్యం చేసుకునే విధానానికి చాలా తేడా ఉంది.

అమెరికన్‌ల మనసులోను రహస్యంగా ప్రభావితం చేసేందుకు 'చర్చి కమిటీ' సిఐఎ చేపట్టిన 'ఆపరేషన్స్'ను వెలుగులోకి తెచ్చింది.

"ప్రస్తుతం సిఐఎ కొన్ని వందల మంది విద్యావేత్తల, విద్యాధికుల (యూనివర్శిటీ పరిపాలనాధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, పాఠాలు బోధిస్తున్న గ్రాడ్యుయేట్ స్టూడెంట్లు) సేవలు వినియోగించుకుంది. సమాచారం చేరవెయ్యడం (ఉప్పందించడం), ఇంటెలిజెన్స్ అవసరాల కోసం తగిన ప్రాథమిక సహకారం అందించడం, విదేశాల్లో ప్రచారం కోసం పుస్తకాలు, ఇతరాలు రాసి ఇవ్వడం వంటి సహకారం అందిస్తున్నారు వారంతా. దాదాపు 100 అమెరికన్ కాలేజీలు, యూనివర్శిటీలలో ఇలాంటి వాళ్లు ఉన్నారు. వాళ్లు సిఐఎకు సమాచార ఏజెంట్లుగా పని చేస్తున్న విషయం వాళ్లకు తప్ప మూడో కంటికి తెలియదు. కొన్ని యూనివర్శిటీలలో మాత్రం ఇలాంటి వ్యవహారాలకు సంబంధించిన సమాచారం యూనివర్శిటీ అధికారులలో కనీసం ఒక్కరికైనా ఉంది. అమెరికన్ విద్యా రంగంతో సిఐఎకు ఉన్న ఈ లింకులు దేశీయంగా సున్నితమైన అంశం అనీ, ఈ కార్యకలాపాలపై కఠిన నియంత్రణలు ఉండాలని ఆ సంస్థ భావిస్తుంది."

సిఐఎలో 'కోవర్ట్ ఆపరేషన్స్' విభాగం అధిపతి 1961లో రాసిన ఒక వ్యాసంలో 'వ్యూహాత్మక ప్రచారంలో ఈ పుస్తకాలే కీలక పాత్ర పోషిస్తాయి' అని పేర్కొన్నారు. 1967నాటికి సిఐఎ ప్రాయోజిత పుస్తకాలు దాదాపు వెయ్యికిపైగా ఉన్నట్లు 'చర్చి' కమిటీ దృష్టికి వచ్చింది. ఈ పుస్తకాల ప్రచురణలకు తగిన ఆర్థిక సాయం అందచెయ్యడమో, పూర్తిగా ఆ భారం తలకెత్తుకోవడమో చేసింది సి.ఐ.ఎ.

లావోస్ మీద జరిపిన 'బాంబింగ్' గురించి ఈ చర్చి కమిటీ ముందర హెన్రీ కిసింజర్ తన వాదన వినిపించారు. సిఐఎ దీన్ని రహస్య కార్యకలాపంగా పేర్కొని వ్యవహారం అంతా మూతబెట్టాలని చూసింది. కిసింజర్ ఏమంటాడంటే– 'లావోస్‌లో సిఐఎ ఈ రకంగా యుద్ధానికి దిగడం, గతంతో పోల్చి చూస్తే సరైన జాతీయ విధానం అనిపించుకోదు. మనం దీన్ని ఇంకో రకంగా చేసి ఉంటే బావుండు అనేది నా ఆలోచన' అన్నాడు. అంటే చేసిన తప్పుడు పని గురించి ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తప్పుడు పద్ధతిలో చేసినందుకేనా మీ బాధా అని 'చర్చి' కమిటీ సభ్యులలో ఒక్కరంటే ఒక్కరు కూడా అతన్ని నిలదియ్యలా.

ఆ రకంగా 1974–75 మధ్య కాలంలో దేశంలో పుండాకోరులను ఏరివేసి వ్యవస్థను ఆరోగ్యకరంగా, కనీసం జనామోదం కూడగట్టే దిశగా ప్రయత్నాలు జరిగాయి. నిక్సన్ రాజీనామా, ఎఫ్.బి.ఐ–సిఐఎల అక్రమాలు బహిర్గతం కావడం, ఫోర్డ్ అధ్యక్ష పదవి చేపట్టడం– ఇవన్నీ ప్రజలలో వ్యవస్థ మీద అడుగంటిపోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు చేపట్టిన చర్యలే. ఇన్ని తంటాలు పడినా ప్రజల మనస్సులో ఇంకా అనేక సందేహాలు, అనుమానాలు. ప్రభుత్వం, మిలిటరీ, కార్పొరేట్ వ్యాపార సంస్థల పట్ల అపనమ్మకం, అయిష్టత కొనసాగుతూనే ఉన్నాయి.

1976 వచ్చేసరికి అధ్యక్ష ఎన్నికలు తోసుకువచ్చేసాయి. వ్యవస్థ మీద ప్రజల్లో నమ్మకం సడలిపోయిందే అన్న భయాందోళన పాలకవర్గాల్లో పెరిగిపోయింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా ఏడాది 2 మిలియన్ డాలర్ల ఆదాయం గడించే విలియం సైమన్ అటు నిక్సన్, ఇటు ఫోర్డ్

హయాంలలో ఖజానా కార్యదర్శిగా పనిచేసాడు. వర్జీనియా రాష్ట్రంలోని 'హాట్‌స్ప్రింగ్స్'లో 1976 శీతరుతువులో ఏర్పాటు చేసిన ఒక బిజినెస్ కౌన్సిల్ మీటింగ్‌లో సైమన్ ప్రసంగించాడు. "ప్రపంచం అంతా సోషలిజం దిశగా, సమసమాజం దిశగా తొక్కుకుంటూ పోవడానికి చూస్తున్న ప్రస్తుత తరుణంలో అమెరికన్ వాణిజ్య వ్యవస్థ 'పరిస్థితి' వేగిరం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే భావిస్తున్నా. స్కూళ్లు, సమాచార-ప్రసార రంగాలను, ప్రజల ఆలోచనలను ప్రభావితం చెయ్యడంలో ప్రైవేటు రంగం విఫలమయ్యిందని నే భావిస్తున్నా" అన్నాడు సైమన్ తన ప్రసంగంలో. ఈ మాటలు అమెరికన్ కార్పొరేట్ కుబేరుల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి.

వియత్నాం యుద్ధం, వాటర్‌గేట్ కుంభకోణం, విద్యార్థి లోకంలో నెలకొన్న అశాంతి, అలజడి, నైతిక విలువల పతనం, ఒక తరం ఎన్నడూ చవిచూడనంతటి మాంద్యం, ఇతరత్రా అనేక సాంస్కృతిక ఉపద్రవాలు కలగలిసి వ్యవస్థను ప్రశ్నించే అనుమానించే ధోరణులు ప్రబలిపోయాయి. సంస్థాగత విశ్వాస సంక్షోభం సమాజంలో పాదుకుంది.

తరచూ సైమన్ ఒక మాట చెబుతూ ఉండేవాడు-"అమెరికన్లు 'లాభం' అనే మాట అన్నా, లాభాపేక్ష ద్వారానే మన సమాజం సంపదలతో తులతూగడం సాధ్యం అన్నమాట అన్నా అపనమ్మకం పెంచేసుకున్నారు. ఈ వ్యవస్థ మూలంగానే మానవాళికి కష్టాలు, కడగండ్లు ఎదురవుతున్నాయనే అభిప్రాయం ఎందుకో బలపడుతుందిగానీ అది ఒట్టి నిరాశ నుండి, స్వార్థం నుండి అనైతికత నుండి వ్యక్తం అవుతున్న అభిప్రాయాలే. మనం పెట్టుబడిదారీ విధానంలోని మానవీయ కోణాన్ని చూసి అర్థం చేసుకోవాల్సింది ఎంతైనా ఉంది."

1976వ సంవత్సరానికి ఇంకో ప్రాధాన్యత కూడా ఉంది. అమెరికా స్వాతంత్ర్యం ప్రకటించుకుని అప్పటికి సరిగ్గా రెండు వందల ఏళ్లు. ద్విశతాబ్ది స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏర్పాట్లు ఆర్భాటంగా జరుగుతున్నాయి. అమెరికా, జపాన్, పశ్చిమ ఐరోపా దేశాలకు చెందిన కొంతమంది మేధావులు ఒక 'త్రైపాక్షిక కమిషన్'గా ఏర్పడి ఒక నివేదిక వెలువరించారు. 'ప్రజాస్వామ్యాల నిర్వహణ' (ది గవర్నబిలిటీ ఆఫ్ డెమోక్రసీస్) అనేది ఆ నివేదిక శీర్షిక. హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ గిరీ చేస్తున్న శామ్యూల్ హాంటింగ్‌టన్ ఈ నివేదికలో అమెరికాకు సంబంధించిన భాగాల్ని రచించాడు. వియత్నాం యుద్ధ కాలంలో అధ్యక్ష భవనానికి దీర్ఘకాలం కన్సల్టెంట్‌గా పనిచేసాడు ఇతను. అతను రచించిన భాగానికి 'ప్రజాస్వామిక తెంపరితనం' అన్న మకుటాన్ని ఉంచాడు. అమెరికా ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి దాని మీద చర్చ పెట్టాడు- "1960వ దశకంలో అమెరికా అంతటా ప్రజాస్వామిక అనుకంపన నాటకీయ రీతిలో ఉవ్వెత్తున ఎగిసిపడింది. ప్రదర్శనలు, నిరసనోద్యమాలు, ధర్నాలు, సమస్యల వారీగా సంస్థల నిర్వహణలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నల్లజాతీయులు, ఇండియన్లు, చికానోలు, శ్వేతజాతీయులు, విద్యార్థులు, మహిళలు వీరూ వారూ అని తేడా లేకుండా సంఘటితమై వినూత్న పద్ధతులలో ఉద్యమాలు నిర్వహించారు. మధ్యతరగతి ఉద్యోగ సంఘాలు బలపడ్డాయి. ఇవన్నీ సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాల్లో సమానత్వాన్ని మరోమారు అంచనా వేసుకునే లక్ష్యంతో సాగాయి."

అదే సందర్భంలో తరిగిపోతున్న ప్రభుత్వ పలుకుబడి, అధికారాలను గురించి వేలెత్తి చూపించారు. 1960వ దశకంలో ముందుకు వచ్చిన 'సమానత్వం' డిమాండ్ల మూలంగా ఫెడరల్ ప్రభుత్వ బడ్జెట్ రూపు రేఖలనే మార్చేసిందింటాడు. 1960లో విదేశీ వ్యవహారాల వ్యయం మొత్తం బడ్జెట్ వ్యయంలో 53.7 శాతంగాను, సామాజిక వ్యయం 22.3 శాతంగాను ఉండేది. 1974 నాటికి విదేశీ వ్యవహారాల వ్యయం 33 శాతానికి తగ్గి సామాజిక వ్యయం 31 శాతానికి పెరిగింది. ప్రభుత్వం రక్షణ రంగం మీద విపరీతంగా వ్యయం చేస్తుంది అని విమర్శించిన ప్రజలు 1960లో కేవలం 18 శాతం మంది, కానీ 1969 నాటికి వారి సంఖ్య 52 శాతానికి పెరిగింది. ప్రజల ఆలోచనా తీరులో వచ్చిన మార్పులకు సంకేతం ఇది.

జరిగింది అంతా మంచి అని హాంటింగ్‌టన్ భావించలేదు. పైపెచ్చు "1960వ దశకంలో ఉవ్వెత్తున సాగిన ఈ ప్రజాస్వామిక చైతన్యం వ్యవస్థలో ప్రభుత్వం, ప్రైవేటు అధికారాలకు సవాళ్లు విసిరింది" అని వాపోయాడు. "ప్రశ్నించే తత్వం ఇటు కుటుంబంలో, అటు విశ్వవిద్యాలయాల్లో వ్యాపారంలో, ప్రభుత్వ-ప్రైవేటు సమావేశాల్లో, రాజకీయాల్లో సర్కారీ బ్యూరోక్రసీలో, మిలిటరీ సర్వీసులలో- అన్ని రంగాలలో ఏదో ఒక రూపంలో ప్రభావం చూపించింది. వయసు, హోదా, అంతస్థు, అనుభవం, వ్యక్తిత్వం, మేధస్సు- ఈ గుణగణాల రీత్యా తమ కన్నా అధికులుగా భావించేవారి పట్ల ఒకనాడు చూపించిన వినయవిధేయతలతో ఇహపని లేదని ప్రజలు భావిస్తున్నారు- ఇదిగో ఈ ధోరణులే 70వ దశకంలో ప్రజాస్వామిక నిర్వహణకు తలనొప్పులు తెచ్చిపెట్టాయి" అంటాడు హాంటింగ్టన్.

వీటన్నింటికీ మించి అధ్యక్షుడి అధికారాలు పతన దిశగా కొనసాగడం పట్ల మరింత ఆందోళన వ్యక్తం చేసారు.

"రెండవ ప్రపంచ యుద్ధానంతర దశకాల్లో అమెరికా మంచి చెడ్డలు ఏలుబడిలో ఉన్న అధ్యక్షుడు కీలకమైన వ్యక్తులు, కార్యనిర్వాహక యంత్రాంగం ఫెడరల్ బ్యూరోక్రసీ, కాంగ్రెస్‌ల సహకారంతో పాటు మరీ ముఖ్యంగా వ్యాపారం, బ్యాంకింగ్, లా కంపెనీలు, మీడియా, దాతృత్వ సంస్థల వంటి ప్రైవేటు రంగ యంత్రాంగం కీలకమైన మద్దతుతో సరిచూసేవాడు" అంటాడు హాంటింగ్టన్. బహుశా హాంటింగ్టన్ అత్యంత నిజాయితీగా అమెరికా అధ్యక్షుడికి, ప్రైవేటు రంగానికి మధ్యన ఉండే అవినాభావ సంబంధం గురించి అసలు నిజాలు కక్కేసిన సందర్భం ఇది.

"అధ్యక్ష ఎన్నికలలో ఎవరు గెలుపొందాలన్నా విశాల ప్రజా సంకీర్ణ మద్దతు ఎంతో అవసరం. అయితే ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుంచే అంతటి విశాల సంకీర్ణమూ అధ్యక్షుల వారు ఈ దేశాన్ని నడిపించే సత్తాకు అవరోధంగాను, అసందర్భమైనదిగాను అనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో అతని ముందు ఉండే ప్రత్యామ్నాయాలు ఏమిటి? సమాజంలోని కీలక సంస్థలు, ప్రభుత్వంలోని కీలక విభాగాల నాయకుల మద్దతు కూడగట్టుకోవడమే. అందుకే విశాల సంకీర్ణంలోని కీలక వ్యక్తులను కాంగ్రెస్‌లోకి, కార్యనిర్వాహక విభాగంలోకి, ప్రైవేటు రంగ యంత్రాంగంలోకి తీసుకోవాలి" అంటూనే హాంటింగ్టన్ అందుకు ఉదాహరణలు కూడా చెప్పాడు.

"ఈ ఉద్దేశ్యంతోటే ప్రెసిడెంట్ ట్రూమన్ గణనీయమైన సంఖ్యలో నిష్పక్షపాత సైనికులను, రిపబ్లికన్ పార్టీకి చెందిన బ్యాంకర్లను, వాల్‌స్ట్రీట్ లాయర్లను తన చేతికి తెచ్చుకున్నాడు. దేశాన్ని సజావుగా పరిపాలించాలంటే ఎక్కడెక్కడ అధికార కేంద్రాలు ఉన్నాయో వాటన్నింటి నుండి సహకారం రాబట్టుకున్నాడు. ఆ తరువాత ఐసన్‌హోవర్ కూడా ఈ సంప్రదాయాన్నే తనూ అనుసరించాడు. కెనడీ కూడా దాదాపుగా ఇవే పద్ధతులలో సంకీర్ణ సాయం పొందే ప్రయత్నం చేసాడు" అని వివరించాడు.

కానీ తాజాగా ప్రభుత్వం అధికారాలు ఉడిగిపోయి దద్దమ్మలా తయారవడం హాంటింగ్టన్‌ను తీవ్రంగా కలవరపరిచింది. వియత్నాం యుద్ధం పట్ల వెల్లువెత్తిన వ్యతిరేకత మూలంగా ప్రభుత్వం ఏకంగా ముసాయిదా బిల్లును రద్దు చేసుకోవాల్సి వచ్చింది. "ఇప్పుడు సమస్య ఏమిటంటే, భవిష్యత్తులో దేశ రక్షణకే ఏదన్నా విపత్తు వచ్చిపడితే (ఏదో ఒక నాటికి అనివార్యంగా వచ్చిపడేదే) ప్రభుత్వం తన దగ్గర ఉన్న వనరుల మీద అధికారం చెలాయించినట్లే. విపత్తులను ఎదుర్కోవడానికి అవసరమయ్యే త్యాగాలను ఏ అధికారంతో సమీకరించగలుగుతుందో?" అని ప్రశ్నించాడు.

ఇరవైయ్యవ శతాబ్దం మూడో పాదం నాటికి ప్రపంచ వ్యవస్థ మీద అమెరికా ఆధిపత్యం చలాయించే అవకాశాలు ఉన్నాయని హాంటింగ్టన్ ఊహించాడు. అటువంటి దశలో ఇప్పుడు మనం చవిచూస్తున్న అతి ప్రజాస్వామ్యం పనికిరాదు అందుకే 'రాజకీయ ప్రజాస్వామ్యానికి' కొన్ని పరిమితులు విధించాలని సూచించాడు.

ఈ 'త్రైపాక్షిక సదస్సు'ను 1973లో డేవిడ్ రాక్‌ఫెల్లర్, జిబెన్యూ బ్రెజెనెస్కీలు నిర్వహించారు. రాక్‌ఫెల్లర్ ఛేస్ మనహాటన్ బ్యాంకు ఉన్నతాధికారి. ఇటు అమెరికాలోనూ, అటు ప్రపంచ దేశాల్లోనూ 'సత్తా' ఉన్న ఫైనాన్స్ అధిపతి. బ్రెజెనెస్కీ కొలంబియా యూనివర్శిటీ ప్రొఫెసర్. అంతర్జాతీయ సంబంధాల స్పెషలిస్టు. అమెరికా దేశీయాంగ మంత్రిత్వ శాఖకు ముఖ్య సలహాదారు.

ఈ సదస్సు గురించి 'ఫార్ ఈస్టర్న్ ఎకనమిక్ రివ్యూ' (1977 మార్చి 25 సంచిక)లో రాబర్ట్ మానింగ్ ఇలా రాసుకొచ్చాడు–

'ఈ సదస్సు నిర్వహణ కోసం కావాల్సిన చొరవ అంతా రాక్‌ఫెల్లర్ తీసుకున్నాడు. సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి జార్జ్ ఫ్రాంక్లిన్ మాటల్లో చెప్పాలంటే అమెరికా, యూరప్, జపాన్ దేశాల మధ్య క్షీణిస్తున్న సంబంధాల గురించి రాక్‌ఫెల్లర్ ఆందోళనకు గురవుతూ ఉండేవాడు. తన ఆందోళనను అభిప్రాయాలను ఆంగ్లో–అమెరికన్ అగ్రవాణిజ్యాధిపతుల గ్రూపు మీటింగుల్లో తరచూ వెల్లడిస్తూ ఉండేవాడు. బిల్డర్‌బెర్గ్‌లో ఈ సమావేశాలు జరుగుతా ఉండేవి. మైక్ బ్లూమెంథాల్ కూడా రాక్‌ఫెల్లర్‌ను గట్టిగా సమర్థించేవాడు. ప్రపంచంలో పరిస్థితులు తీవ్ర అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీని గురించి మనలాంటి వాళ్లు కాకపోతే, ఏవో ఒకటి ఎవరు చేస్తారూ అని రాక్‌ఫెల్లర్‌ను బలపరిచాడు. దాంతో రాక్‌ఫెల్లర్ ఈ సదస్సు ప్రతిపాదన ముందుకు తెచ్చాడు. రాక్‌ఫెల్లర్ అనుంగు మిత్రుడు బ్రెజెనెస్కీ ఈ ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చాడు."

త్రైపాక్షిక సదస్సును ఏర్పాటు చెయ్యడానికి దారితీసిన తీవ్ర అస్తవ్యస్త పరిస్థితులు ఏమిటో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. కమ్యూనిజం, తృతీయ ప్రపంచదేశాల్లో చెలరేగుతున్న విప్లవోద్యమాలే, ఈ ఉద్యమాలది వేటి దిశ, దశ వాటిదే. కానీ ఈ ప్రమాదాన్ని నిలవరించాలంటే ఆసియా, ఐరోపా, అమెరికా ఖండాలలో ఉన్న జపాన్, ఐరోపా, అమెరికా దేశాల మధ్య గరిష్ట ఐక్యత ఏర్పాడాలని, త్రిఖండ పెట్టుబడిదారీ విధానం ఒక్కటే అఖండ కమ్యూనిజానికి అడ్డుకట్ట వెయ్యగలదని వాళ్లు భావించారు.

దీంతో పాటు ఈ సదస్సు ఇంకో కార్యం కూడా చక్కబెట్టాలని నిర్ణయించుకుంది. స్వామి కార్యంతోపాటు నెరవేర్చుకోవాలి అనుకున్నారు. ఆ స్వకార్యం ఏమిటో 1967లోనే జార్జిబాల్ వివరించాడు. ఇతగాడు కెనడీ హయాంలో ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖకు 'అండర్ సెక్రెటరీ'గా పనిచేశాడు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన 'లెహ్‌మాన్ బ్రదర్స్'లో డైరెక్టరు కూడా. అంతర్జాతీయ వాణిజ్య ఛాంబర్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ అతను ఇలా చెప్పాడు..

"రెండవ ప్రపంచ యుద్ధానంతరం గడిచిన ఈ ఇరవై ఏళ్లలో మన కార్యాచరణ ద్వారా మనల్ని గుర్తించే స్థాయికి చేరుకోవాలి. ఇప్పటిదాకా మాటలతో పొద్దుపుచ్చాం. నూతన వాణిజ్య కార్యకలాపాల పరిధిని జాతి–రాజ్యాల సరిహద్దుల పేరిట నియంత్రించే సంకుచిత ధోరణిని మనం చెరిపెయ్యాలి."

ఇహ ఆ తరువాత పరిస్థితుల్లో వచ్చిన మార్పులు ఎంత విస్తారమైనవో అర్థం చేసుకోవడానికి అమెరికన్ బ్యాంకింగ్ వ్యవస్థ ఉదాహరణ ఒక్కటిచాలు. 1960లలో విదేశాలలో శాఖలు ఉన్న అమెరికన్ బ్యాంకుల సంఖ్య 8. 1974నాటికి ఈ సంఖ్య 129కి పెరిగింది. ఈ విదేశీ శాఖల ఆస్తులు 1960 నాటికి 3.5 బిలియన్ డాలర్లు కాగా 1974 నాటికి 155 బిలియన్ డాలర్లకు పెరిగింది.

ఆ రకంగా త్రైపాక్షిక సదస్సు బహుళజాతి కంపెనీల పనుపున నూతన ఆర్థిక వ్యవస్థను నిర్మించేదానికి అవసరమైన అంతర్జాతీయ లింకులను సంఘటితం చెయ్యడానికి ఉపయోగపడింది. ఈ సదస్సుకు హాజరయినవారంతా జపాన్, పశ్చిమ ఐరోపా, అమెరికా దేశాలకు చెందిన రాజకీయవేత్తలు, బడా వాణిజ్యవేత్తలు, మీడియా మొఘులాయిలే. ఛేస్‌మన్ హాటన్ బ్యాంక్, లెహ్‌మాన్ బ్రదర్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, బ్యాంకోడిపారిస్, లాయడ్స్ బ్యాంక్ (లండన్), బ్యాంక్ ఆఫ్ టోక్యోలతోపాటు చమురు, ఉక్కు, ఆటోమొబైల్, విమాన నిర్మాణ రంగాలు, ఎలక్ట్రిక్ పరిశ్రమల అధిపతులు హాజరయ్యారు. 'టైమ్' పత్రిక, వాషింగ్టన్ పోస్ట్, కొలంబియా బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్, డైజీత్, జపాన్ టైమ్స్, లండన్ ఎకనమిస్టు వంటి పత్రికాధిపతులూ ఈ సదస్సుకు హాజరు పట్టీలో ఉన్నారు.

# 8

# కార్టర్ - రీగన్ - బుష్ ఇరుపార్టీల ఏకాభిప్రాయం

1977 నుండి 80ల వరకూ దేశాన్ని పరిపాలించిన అధ్యక్షుడు జిమ్మీకార్టర్. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి. భ్రమలు కోల్పోయిన ప్రజానీకం మీద పట్టుకోసం ప్రయత్నాలు చేసాడు. నల్లజాతీయులకు, పేదలకు అంతో ఇంతో సాయం అందే చర్యలు చేపట్టినా, విదేశాల్లో 'మానవ హక్కుల' గురించి తరచూ మాట్లాడినా చారిత్రకంగా చూస్తే అమెరికన్ వ్యవస్థ రాజకీయ పరిధులను దాటి వ్యవహరించలేదు. కార్పొరేట్ సంస్థల సంపద, అధికారాలకు కొమ్ముకాయడం, భారీ మిలిటరీ యంత్రాంగాన్ని కొనసాగించడం, దేశ ఆర్థిక వనరులను పెద్ద ఎత్తున మిలిటరీ రంగానికి ఖర్చు చెయ్యడం, విదేశాల్లో పచ్చిమితవాద-నియంత ప్రభుత్వాలతో షరీకవడం-ఇవీ అమెరికన్ వ్యవస్థ రాజకీయ పరిధులు-కార్టర్ హయాంలోనూ ఇవి యథాతథంగా కొనసాగాయి.

అంతర్జాతీయంగా బలీయమైన సంస్థలకు ప్రతినిధులు హాజరయిన త్రైపాక్షిక సదస్సు ఆనాడు ఉన్న పరిస్థితుల్లో జిమ్మీకార్టర్ అమెరికన్ అధ్యక్ష పదవికి తగిన వ్యక్తి అని భావించాయి. వాటర్‌గేట్ కుంభకోణంలో నిండా మునిగిపోయిన రిపబ్లికన్ పార్టీ ఎన్నికలలో అనివార్యంగా మట్టికరవడం ఖాయం అని త్రైపాక్షిక సదస్సుకు బీజం వేసిన రాక్‌ఫెల్లర్, బ్రెజెనెస్కీలు తలపోసినట్లు 'ఫార్ ఈస్ట్రన్ ఎకనమిక్ రివ్యూ' రాసింది. అందుకే వారు జిమ్మీకార్టర్ అభ్యర్థిత్వం వైపు మొగ్గ చూపినట్లు ఆ పత్రిక వెల్లడించింది.

అమెరికన్ ప్రభుత్వం పట్ల, ఆర్థిక వ్యవస్థపట్ల, విదేశాలలో చేపట్టిన మిలిటరీ కార్యకలాపాల పట్ల ప్రజానీకంలో విస్తరించిపోతున్న అసంతృప్తికి తక్షణం అడ్డుకట్ట వెయ్యడం అధ్యక్షుడిగా జిమ్మీ కార్టర్ కర్తవ్యం అని పాలకవర్గాలు భావించాయి. అందుకే కార్టర్ ప్రచారం ప్రధానంగా భ్రమలు కోల్పోయి, కృద్ధులై ఉన్న ప్రజానీకాన్ని ఉద్దేశించే సాగింది. నల్లజాతీయుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎందుకంటే 1930వ దశకంలోని మహా ఆర్థిక మాంద్యం

తరువాత నిరుద్యోగులలో, కార్మికవర్గంలో చెలరేగిన అసంతృప్తి పాలకవర్గాల వెన్నులో ఒణుకు పుట్టించింది.

బహుజనరంజకంగా తన ప్రచారం కొనసాగించాడు కార్టర్. అధికారం – సంపదలను పోగేసుకున్న వాళ్ల చేతుల్లో దగాపడ్డాం అన్న భావనకు గురయిన అన్ని తరగతుల ప్రజలను స్వాంతన పరిచేవిధంగా ప్రచార విజ్ఞప్తులు కొనసాగించాడు. స్వయానా తాను లక్షాధికారి అయినా తనని తాను సాధారణ వేరుశెనగ రైతుగా అభివర్ణించుకునేవాడు. వియత్నాం యుద్ధాన్ని కడకంటా బలపరిచిన వ్యక్తి అయినా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలలో చెలరేగిన భావోద్వేగాలను బలపరుస్తూ ప్రసంగాలు చేసేవాడు. అరవయ్యవ దశకాన్ని ఒక ఊపు ఊపేసిన యువ తిరుగుబాటుదార్లను స్వాంతన పరిచేందుకు మిలిటరీ బడ్జెట్‌లో తాను కోత విధించేందుకు సిద్ధం అని నమ్మబలికాడు.

ప్రచార ఆర్భాటంతో నిర్వహించిన లాయర్ల సదస్సులో 'చట్టాలను కలవారి చుట్టాలుగా మార్చడాన్ని తప్పుబడుతూ' ప్రసంగించాడు. ఎన్నికలలో గెలిచిన తరువాత వాటిషియా హారిస్ అనే నల్లజాతి మహిళను 'హౌసింగ్ అర్బన్ డెవలప్‌మెంట్' మంత్రిత్వ శాఖకు కార్యదర్శిగా నియమించాడు. 'ఆంద్రూయంగ్' అనే నల్లజాతి మానవహక్కుల కార్యకర్తను ఐక్యరాజ్య సమితికి రాయబారిగా చేసాడు. యుద్ధ వ్యతిరేక ఉద్యమ కార్యకర్త శామ్‌బ్రౌన్‌ను యువజన సర్వీసుల కార్పొరేషన్‌కు అధిపతిగా నియమించాడు.

అయితే కార్టర్ నడిపే కీలక సమావేశాలన్నీ త్రైపాక్షిక సదస్సుకు అమెరికా తరఫున నివేదిక సమర్పించిన హార్వర్డ్ రాజకీయ సైంటిస్టు శామ్యూల్ హాంటింగ్టన్‌తోనే నడిచేవి. "అధ్యక్ష పదవికి ఎన్ని గ్రూపుల, తరగతుల సాయం తీసుకున్నా ఆ పదవిలో కొనసాగడానికి బలమైన సంస్థాగత తోడ్పాటు అవసరం" అన్న హాంటింగ్టన్ ఉపదేశాన్ని ఔదలదాల్చాడు. ప్రచ్ఛన్న యుద్ధ సమర్థకుడు, మేధావి అయిన బ్రెజెనెస్కీని జాతీయ భద్రతా సలహాదారుగా నియమించాడు కార్టర్. రక్షణ శాఖను హెరాల్డ్ బ్రౌన్‌కు అప్పచెప్పాడు. ఇతగాడు వియత్నాం యుద్ధకాలంలో బాంబింగ్ చేసేటప్పుడు పాటించాల్సిన అన్ని జాగ్రత్తలనూ అలక్ష్యపెట్టి విచక్షణారహితంగా బాంబింగ్ జరపడానికి అనుమతి ఇచ్చిన ఆద్యుడు అని పెంటగాన్ పత్రాలు చెబుతాయి. ఇంధనశాఖ కార్యదర్శిగా జేమ్స్ షెల్లింగర్‌ను నియమించాడు. ఇతగాడు నిక్సన్ హయాంలో రక్షణ శాఖ కార్యదర్శిగా పనిచేసాడు. డిఫెన్సు బడ్జెట్ కోతకు గురి అవుతూ తగ్గుముఖం పట్టడాన్ని ఏ మాత్రం సహించని వ్యక్తిగా, డిఫెన్సు బడ్జెట్‌ను తదేక దీక్షతో పెంచుకుంటూ పోవడానికి శ్రద్ధగా కృషి చేసే వ్యక్తిగా వాషింగ్టన్ పత్రికా రంగం ఇతన్ని అభివర్ణించింది. పైపెచ్చు షెల్లింగర్ స్వయానా అణు ఇంధనాన్ని బలంగా సమర్థించే వ్యక్తి.

కార్టర్ హయాంలోని మంత్రివర్గానికి బలమైన కార్పొరేట్ రంగంతో పొత్తు ఉండేది. అధ్యక్ష పదవికి కార్టర్ ఎన్నుకోబడిన తరువాత అతి స్వల్ప కాలంలోనే ఆర్థిక వ్యవహారాల పాత్రికేయుడు ఒకరు ఇలా రాసాడు– "ఇప్పటిదాకా కార్టర్ చేతలు, మాటలు ప్రత్యేకించి

అతని క్యాబినెట్ మంత్రివర్గం కూర్పు వాణిజ్య వర్గాలకు బహుధా స్వాంతన కూర్చే విధంగా ఉన్నాయి." ఇహ వాషింగ్టన్ ప్రముఖ పాత్రికేయుడు టామ్‌వికర్ మాటల్లో చెప్పాలంటే– "అందుబాటులో ఉన్న సాక్ష్యాలను బట్టి చూస్తే కార్టర్ వాల్‌స్ట్రీట్ విశ్వాసం పొందేందుకు నిశ్చయించుకున్నాడని అనిపిస్తుంది."

స్వంత ప్రజలను అణచిపెడుతున్న పరాయి దేశాల ప్రభుత్వాల పట్ల కార్టర్ మెతక విధానాలు అవలంబించాడు. ఐక్యరాజ్య సమితికి రాయబారిగా నియమించిన 'ఆండ్రూయంగ్'ను అడ్డం పెట్టుకుని ఆఫ్రికా దేశాలలో అమెరికా పరపతి పెంచే దానికి కృషి చేసాడు. నల్లజాతీయుల పట్ల దక్షిణాఫ్రికా శ్వేత జాత్యహంకార ప్రభుత్వం అనుసరిస్తున్న కటువైన విధానాలను సడలించుకోవాలని విజ్ఞప్తి చేసాడు. వ్యూహాత్మక అవసరాల రీత్యా దక్షిణాఫ్రికాలో ఒక శాంతియుత ఒప్పందం ఆనాటి అవసరం. దక్షిణాఫ్రికా భూభాగాన్ని 'రాడార్ ట్రాకింగ్ వ్యవస్థ'ను నడుపుకునే దానికి అమెరికా ఉపయోగపెట్టుకుంటుంది. విలువైన ఖనిజ వనరులు, వజ్రాల వంటి ఖరీదైన ముడి సరకులకు నెలవు అయిన దక్షిణాఫ్రికాలో అమెరికన్ కార్పొరేట్ సంస్థల పెట్టుబడులు గణనీయంగా ఉన్నాయి. ఈ రెండు ప్రయోజనాలు కాపాడుకోవడానికయినా దక్షిణాఫ్రికాలో స్థిరమైన ప్రభుత్వం అమెరికాకు అవసరం. నల్లజాతీయులను అణచివేసే విధానాలు ఇంకా అలానే కొనసాగితే దక్షిణాఫ్రికాలో అంతర్యుద్ధం చెలరేగే ప్రమాదం ఉందని అమెరికా అంచనా వేసింది. అందుకే 'శాంతియుత పరిష్కార మార్గాన్ని' ముందుకు తెచ్చింది.

ఇదే వ్యూహాన్ని ఇతర దేశాలలోనూ అనుసరించింది. తక్షణ వాస్తవిక వ్యూహాత్మక ప్రయోజనాలను, మానవ హక్కులను మిళితం చేసి తన విధానాలను ముందుకు తీసుకుపోయింది. ఈ విధానాలకు తక్షణ ఆచరణాత్మక దృక్పథమే కేంద్ర బిందువు తప్ప మానవీయత కాదు. అయితే అమెరికా విదేశాంగ విధానం గొప్ప మానవీయ కోణాన్ని ఆలంబనగా చేసుకుందని ప్రపంచానికి చాటి చెప్పడానికి కొన్ని సంకేతాత్మక చర్యలు చేపట్టింది కార్టర్ ప్రభుత్వం. చిలీలో కొంతమంది రాజకీయ ఖైదీల విడుదలకు అక్కడి మిలిటరీ ప్రభుత్వాన్ని ఒప్పించింది. "ప్రపంచబ్యాంకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో పనిచేసే అమెరికన్ ప్రతినిధులు కనీస మానవ హక్కులను హరించే, ఎటువంటి విచారణా జరిపించకుండా ఖైదు చేసి చిత్రహింసలు పెడుతున్న ఏ దేశానికైనా రుణసాయం అందించే వీల్లేకుండా ఓటు చెయ్యాలని ప్రతిపాదిస్తూ హెర్మన్ బాడిల్లో అమెరికన్ కాంగ్రెస్‌లో ఒక బిల్లు ప్రవేశపెట్టాడు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వెయ్యమని జిమ్మీకార్టర్ స్వయంగా కాంగ్రెస్ ప్రతినిధులందరికీ వ్యక్తిగత లేఖ రాసాడు. ఈ బిల్లు 'హౌస్'లో మూజువాణీ ఓటుతో నెగ్గింది కానీ 'సెనెట్'లో ఓటమి పాలయింది. కార్టర్ హయాంలో అమెరికా అనుసరించిన మానవహక్కుల పరిరక్షణా విధానంలోని డొల్లతనం ఇది."

ప్రపంచవ్యాపితంగా అమాయక పౌరులని రాజకీయ భేదాభిప్రాయల కారణంగా ఖైదు చేసి, చిత్రహింసల పాల్జేసి, సామూహికంగా హత్యలు చెయ్యడానికి తెగబడిన అనేక ప్రభుత్వాలకు అమెరికా బాసటగా నిలిచింది. ఫిలిప్పీన్స్, ఇరాన్, నికరాగువా, ఇండోనేషియా తదితర దేశాలలో జరిగిన ఘాతుకాలకు పరోక్షంగా అండగా నిలిచింది.

'ది న్యూ రిపబ్లిక్' పత్రిక ప్రభుత్వ ఉదార ధోరణులను, కార్టర్ విధానాలను సమర్థిస్తూ ఇలా పేర్కొంది– "అమెరికా విదేశాంగ విధానం రాబోయే నాలుగేళ్లలో నిక్సన్– ఫోర్డ్ల హయాంలో రూపు కట్టిన సిద్ధాంతాలను మరింత అభివృద్ధి చేసి సాగేదిగా ఉండాలి. ఇదేమీ ప్రతికూలాంశంగా భావించరాదు. విధిగా అమెరికా విధివిధానాల్లో కొనసాగింపు ఉండాలి. అదే చరిత్రలో అంతర్భాగం."

జిమ్మీ కార్టర్ యుద్ధ వ్యతిరేక ఉద్యమానికి చెలికాడుగా తనని తాను ప్రచారం చేసుకున్నాడు. కాని నిజానికి 1973 వసంతకాలంలో నిక్సన్ హైపాంగ్ ఓడరేవును పేల్చి వెయ్యడాన్ని, ఉత్తర వియత్నాం మీద మరలా బాంబింగ్ జరపడాన్ని కార్టర్ సమర్థించాడు. 'కొన్ని నిర్ణయాల పట్ల మనకు ఇష్టం లేకపోయినా ప్రెసిడెంట్ నిక్సన్‌కు మనం వెన్నుదన్నుగా ఉండి, అమెరికా అధ్యక్షుడికి మనమంతా బాసటగా నిలవాలని' జిమ్మీకార్టర్ విజ్ఞప్తి చేసాడు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక అమెరికా సేనల బాంబు దాడులకు సర్వనాశనం అయిన వియత్నాంకు పునర్నిర్మాణ సాయం విధిగా అందించాల్సి ఉన్నా కార్టర్ అందుకు నిరాకరించాడు. ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో ఈ విషయమై ప్రశ్నిస్తే కార్టర్ ఏమని జవాబు ఇచ్చాడో తెలుసా– "అమెరికాకు అలాంటి ప్రత్యేక బాధ్యత ఏమీ లేదు, ఎందుకంటే అది పరస్పర ధ్వంసరచన కాబట్టి" అని సమర్థించుకున్నాడు.

ఈ భూగోళంలో అర్ధ దూరాన్ని దాటుకుని అమెరికా వాయుసైన్యం, బాంబర్లు, 20 లక్షల మంది సైన్యం ఒక చిన్న భూభాగం మీద విరుచుకుపడి ఎనిమిదేళ్ల పాటు ఆ దేశాన్ని ధ్వంసం చేసి పది లక్షల మంది ప్రాణాలు నిలువునా హరించి ఆ భూభాగాన్ని ఎందుకూ కొరగాకుండా మన్నూ మశానం చేసిన ఒక దేశాధ్యక్షుడు ఇంత నిస్సిగ్గుగా వియత్నాం యుద్ధాన్ని 'పరస్పర ధ్వంస రచన' అని అంటాడని ఎవరూ ఊహించనైనా లేరు. కానీ కార్టర్ అన్నాడు.

రక్షణ శాఖ– పెంటగాన్ పేపర్లలో బయటపడినట్లు జరిగిన యుద్ధాన్ని మిలిటరీ– ఆర్థిక ప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా ఒక దేశ ప్రజానీకం మీద అమెరికా చేసిన దాడిగా కాకుండా, దురదృష్టవశాత్తూ చోటు చేసుకున్న తప్పిదంగా మాత్రమే భావితరాల దృష్టికి తీసుకురావాలనే పాలకవర్గాల వంచనా పూరిత ప్రచారం ఆనాడే మొదలయింది. వియత్నాం యుద్ధకాలంలో ప్రముఖ మేధావి, యుద్ధ వ్యతిరేకి అయిన నోమ్‌ఛోమ్‌స్కీ 1978లోనే మీడియా ఈ యుద్ధ చరిత్రను ఎలా మసిబూసి మారేడుకాయ చెయ్యాలని చూస్తుందీ వివరించాడు. 'చరిత్రలో నమోదయిన వాస్తవాలను ధ్వంసం చేసి, వాటి స్థానంలో వాటమైన కథలు అల్లి, యుద్ధం నుండి నేర్వాల్సిన గుణపాఠాలు తీసుకోకపోగా, సామాజికంగా పూచీ పడాల్సిన అవసరం లేని అంచనా తప్పిదంగా, అజ్ఞానంగా ప్రచారంలోకి తీసుకువస్తుంది మీడియా. ఒక తరం యావత్తు ఇందుకు మూల్యం చెల్లించుకుంటుంది" అన్నాడు ఛోమ్‌స్కీ.

వియత్నాం యుద్ధం తరువాత అమెరికా సైనిక, ఆర్థిక అగ్రాధిపత్యం పట్ల ప్రజలలో ఉన్న భ్రమలు చాలా మేరకు తొలగిపోయాయి. ప్రజలలో విశ్వాసం మరింత సడలకుండా

ఉండడానికి కార్టర్ ప్రభుత్వం ప్రత్యక్ష దురాక్రమణలకు పోకుండా పరోక్షంగా దెబ్బతీసే విదేశాంగ నీతిని ఎంచుకుంది. దానికి మానవ హక్కులనూ అడ్డం పెట్టుకుంది. దక్షిణాఫ్రికా, చిలీ దేశాలలో ఒకింత రాజకీయ సంస్కరణల కోసం అమెరికా ఒత్తిడి తెచ్చినా బాగా లోతుగా గమనిస్తే వీటి పర్యవసానంగా ఆయా దేశాల్లో అమెరికా సైనిక, వాణిజ్య ప్రయోజనాలకు ఏం ఢోకా లేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుందని స్పష్టమవుతుంది.

సెంట్రల్ అమెరికాలోని చిన్న దేశమైన పనామాతో పనామా కాలువ ఒప్పందాన్ని తిరిగి చర్చల ద్వారా సాధించుకున్నదీ ఈ ఉద్దేశంతోనే. అమెరికన్ కంపెనీలకు డెలివరీ ఛార్జీలలో ఏటా 1.5 బిలియన్ డాలర్ల భారం తగ్గేలా, టోల్‌టాక్సు రూపంలో ఏటా 150 మిలియన్ డాలర్లు అమెరికా సంపాదించుకునేలా – ఇందుకు ప్రతిగా పనామా ప్రభుత్వానికి ఏటా 2.3 మిలియన్ డాలర్లు చెల్లించేలాగా– అదనంగా ఆ ప్రాంతంలోని పద్నాలుగు మిలిటరీ కేంద్రాలను యథావిధిగా నిర్వహించుకునే– అమెరికన్ కార్పొరేట్, మిలిటరీ ప్రయోజనాలు ఈడేరేలా ఒప్పందం కుదుర్చుకుంది.

గత చరిత్రలోకి తొంగి చూస్తే 1903లో అమెరికా కొలంబియాకు వ్యతిరేకంగా ఒక తిరుగుబాటు లేవదీసి మధ్య అమెరికాలో పనామా దేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతంలో మిలిటరీ కేంద్రాలు నెలకొల్పుకునేలా, పనామా కాలువ మీద ఆధిపత్యం చెలాయించేలా మొత్తానికి ఆ దేశ సార్వభౌమ హక్కులను అమెరికా గుత్తకు వాడుకునేలా పనామా దేశం మీద ఒక ఒప్పందాన్ని రుద్దింది. పనామాలో చెలరేగుతున్న 'అమెరికన్ వ్యతిరేక ఉద్యమ' తీవ్రత దృష్ట్యా కార్టర్ ప్రభుత్వం 1977లో ఆ దేశంతో పునఃచర్చలకు సిద్ధపడింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక పనామా కాలువ మీద నిజాయితీగా ఒక వ్యాఖ్య చేసింది. 'దాన్ని మనం దొంగిలించాం. కానీ దొంగతనానికి సంబంధించి మనల్ని పట్టిచ్చే సాక్ష్యాలన్నింటినీ చరిత్ర పుస్తకాల్లోంచి చెరిపేసాం.'

1977 నాటికి పనామా కాలువ సైనిక ప్రాధాన్యత కోల్పోయింది. భారీ టాంకర్లు, యుద్ధ విమాన వాహక నౌకలు ఆ కాలువ గుండా పయనించే వీలు లేకుండా పోయింది. దానికి తోడు పనామాలో చెలరేగిన అమెరికన్ వ్యతిరేక అల్లర్లు, దోపిడీలు కార్టర్ ప్రభుత్వాన్ని పునరాలోచనలో పడేసింది. పనామా మీద బలప్రయోగం కన్నా దశలవారీగా సైనిక స్థావరాలను తరలించే దానికి (ఎందుకంటే అప్పటికి ఆ స్థావరాలను తరలించి వేరే చోట స్థాపించుకునే వీలున్న భూభాగాలు అమెరికా కనుసన్నలలో ఉన్నాయి) ఒప్పందం చేసుకోవడానికే మొగ్గు చూపింది. అలాగే నిర్ణీత కాల వ్యవధి తరువాత పనామా కాలువ మీద న్యాయపరమైన యాజమాన్యహక్కునీ ఆ దేశానికి అప్పగించడానికి రాజీపడింది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కావాలనుకుంటే అమెరికా నేరుగా సైనిక జోక్యం చేసుకోవడానికి వీలు కల్పించేలా ఆ ఒప్పందంలో పారిభాషికాపదజాలాన్ని వాడింది.

విదేశాంగ వ్యవహారాలు నడిపించడంలో కార్టర్ ప్రభుత్వం పెద్దమనిషి తరహాగా, లౌక్యంగా వ్యవహరించినా 60, 70వ దశకాలలో కొన్ని మౌలిక విధానాలు క్రియాశీలంగా వెలుగులోకి వచ్చాయి. అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు గతంలో ఏనాడూ లేనంత క్రియాశీలంగా

ప్రపంచ వ్యాపితంగా తమ కార్యకలాపాలు విస్తరించాయి. 70వ దశకం తొలిపాదంలో కేవలం మూడు వందల అమెరికన్ కార్పొరేట్ సంస్థలు, ఏడు అతిపెద్ద బ్యాంకులు సహా, 40 శాతం లాభాలను అమెరికా సరిహద్దుల ఆవల ఉన్న ప్రపంచదేశాల నుండే సంపాదించాయి. వీటిని 'బహుళజాతి' కంపెనీలు అని వ్యవహరిస్తుంటారు కాని ఇందులో 98 శాతం మంది అత్యున్నత అధికారులు అమెరికన్లే. అమెరికా, రష్యాల తరువాత అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నిభాయిస్తుంది ఈ 300 కార్పొరేట్ కంపెనీలే.

ఈ గ్లోబల్ కంపెనీలకు – పేద, వర్ధమాన దేశాలకు మధ్య ఉన్న సంబంధం దోపిడీ సంబంధాలే అని చాలా కాలం క్రితమే రుజువయింది. అమెరికా వాణిజ్య విభాగం గణాంకాలూ ఈ సత్యాన్నే వివరిస్తాయి. 1950–65 మధ్యకాలంలో అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు యూరప్‌లో పెట్టిన పెట్టుబడులు 8.1 బిలియన్ డాలర్లు, అక్కడ సంపాదించిన లాభాలు 5.5 బిలియన్ డాలర్లు. అదే లాటిన్ అమెరికాలో పెట్టిన పెట్టుబడులు 3.8 బిలియన్ డాలర్లు కాగా పోగేసుకున్న లాభాలు 11.2 బిలియన్ డాలర్లు. ఆఫ్రికాలో పెట్టిన 5.2 బిలియన్ డాలర్లకు ప్రతిగా సంపాదించిన లాభాలు 14.3 బిలియన్ డాలర్లు.

ఇది సామ్రాజ్యవాద దోపిడీకి ఒక 'క్లాసికల్' ఉదాహరణ. సహజ సంపదలతో అలరారే దేశాలు బలాఢ్యదేశాల దోపిడీకి గురవుతూనే ఉన్నాయి. బలాఢ్యదేశాలు ఇలాంటి దోపిడి మార్గాల ద్వారానే బలాధిక్యతను సంపాదించుకున్నాయి. అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు నూటికి నూరు శాతం పేద, వర్ధమాన దేశాలలో లభించే వజ్రాలు, కాఫీ, ప్లాటినమ్, పాదరసం, సహజరబ్బరు, కోబాల్ట్‌ల మీద ఆధారపడి ఉన్నాయి. 98 శాతం మాంగనీసు కోసం విదేశాల మీద ఆధారపడ్డాయి. 90 శాతం క్రోమ్, అల్యూమినియంల కోసం పరాయిదేశాల వనరుల మీద ఆధారపడి ఉన్నాయి. ప్లాటినమ్, పాదరసం, కోబాల్ట్, క్రోమ్, మాంగనీస్ వంటివి 20 నుండి 40 శాతం వరకూ ఒక్క ఆఫ్రికా దేశాల నుండే గడిస్తున్నాయి.

అధ్యక్ష భవనంలో అధికారం రిపబ్లికన్‌లకు దక్కినా డెమోక్రాట్లకు దక్కినా విదేశీ సైనికాధికారులకు శిక్షణ ఇవ్వడం అమెరికా మౌలిక విదేశాంగ నీతిగా కొనసాగింది. 'స్కూల్ ఆఫ్ అమెరికన్' పేరిట పనామా కాలువ జలసంధి ప్రాంతంలో సైన్యం ఒక శిక్షణా శిబిరాన్ని నడుపుతుంది. లాటిన్ అమెరికా దేశాల్లోని మిలిటరీ అధికారులు అనేక మంది ఇందులో గ్రాడ్యుయేట్ శిక్షణ పొందారు. 1973లో ప్రజాస్వామిక పద్ధతులలో చిలీ అధ్యక్ష పదవికి ఎన్నిక అయిన కమ్యూనిస్టు యోధుడు సాల్వడార్ అలెండీ మీద తిరుగుబాటు చేసి హత్యగావించి అధికారం చేజిక్కించుకున్న మిలిటరీ కుట్రలో పాల్గొన్న ఆరుగురు అత్యున్నత అధికారులు ఈ 'స్కూల్' నుండి 'గ్రాడ్యుయేట్'లుగా బయటికి వచ్చిన వాళ్లే. కాబట్టి ఈ స్కూల్‌లో నేర్పిన శిక్షణ ఏమిటో, ఎలాంటిదో వేరుగా చెప్పనక్కరలేదు. "ఇక్కడ గ్రాడ్యుయేట్‌లుగా ఉత్తీర్ణులయిన వారు ఏ దేశానికి చెందిన వారయినా మాతో 'టచ్'లో ఉంటారు, మేమూ వాళ్లతో 'టచ్'లో ఉంటాం" అని ఆ స్కూల్ కమాండెంట్ ఎటువంటి దాపరికం లేకుండా చెప్పనే చెప్పాడు.

అయినా అమెరికా అంత సంపద్వంత దేశమై ఉండి కూడా బహు ఉదారత్వాన్ని చాటుకుంటుంది అని పేరు గడించింది. తరచూ ప్రకృతి విలయాలకు లోనయిన దేశాలకు ఆర్థిక సాయం ప్రకటిస్తుంటుంది. అయితే అది కూడా అమెరికా పట్ల రాజకీయ విధేయతలలో హెచ్చు తగ్గుల ఆధారంగానే ఉంటుంది. పశ్చిమ ఆఫ్రికా ఖండంలో వరుసగా ఏడేళ్లపాటు అనావృష్టి మూలంగా కరువు కాటకాలు సంభవించి మొత్తం పది లక్షల మంది జనాభా మృత్యువాతపడ్డారు. కెర్నెగీ ఎండోమెంట్ సంస్థ అక్కడి పరిస్థితుల మీద ఇచ్చిన నివేదికలో ఇలా పేర్కొంది– "అమెరికాకు చెందిన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (ఐ.డి.ఎ) పశ్చిమ ఆఫ్రికాలో సంచార జాతులు జీవనం సాగించే సాహెల్ ప్రాంతానికి– ఇది మొత్తం ఆరు దేశాల్లో విస్తరించి ఉంది– అందచేసిన సాయం నామమాత్రం. ఈ ప్రాంతానికి సాయం అందించడంలో ఈ సంస్థ పూర్తిగా విఫలమయ్యి తన చేతకాని తనాన్ని బయటపెట్టుకుంది. ఈ ఆరు దేశాలకు అమెరికాతో గాఢమైన చారిత్రక, ఆర్థిక, రాజకీయ సంబంధాలు లేకపోవడమే బహుశ ఐడిఎ నిర్లక్ష్యపూరిత వైఖరికి కారణం అయి ఉంటుంది."

1975లో వాషింగ్టన్ రహస్య సందేశం ఒకటి పత్రికలలో వెలుగుచూసింది. "ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఓటు వేసిన దేశాలకు అందించే సాయంలో కోత విధించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి హెన్రీకిసింజెర్ ఆదేశాలు ఇచ్చారు. ఆహారం, మానవతా దృక్పథంతో అందించే కనీస సాయం కూడా ఈ కోతకు మినహాయింపు కాదని స్పష్టం చేసారు".

ఇంకా చెప్పుకోవాలంటే ఆరింట ఐదు సందర్భాలలో అమెరికా అందించే సాయం 'సైనిక పరంగానే ఉంటుంది. ఒక్క 1975 సంవత్సరంలోనే అమెరికా ఎగుమతి చేసిన ఆయుధసాయం విలువ 9.5 బిలియన్ డాలర్లు. తాను అధికారంలోకి వస్తే నియంతృత్వ ప్రభుత్వాలకు ఆయుధ సాయం ఆపేస్తానని కార్టర్ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసాడు. అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యాక వాగ్ధానభంగమూ కావించాడు. ఆయుధ ఎగుమతుల్లో భారీ ఎత్తున తరలివెళ్లింది ప్రజాకంటక నియంతృత్వ ప్రభుత్వాలకే. అలాగే బడ్జెట్‌లో సింహభాగం మిలిటరీ పద్దుకిందే హారతికర్పూరం అయిపోతూ ఉండేది. డెమోక్రటిక్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ సమావేశంలో జిమ్మీ కార్టర్ ప్రసంగిస్తూ 'మన దేశ రక్షణ విషయంలోగానీ, మన మిత్రదేశాలకు ఇచ్చిన పూచీల విషయంలోగానీ ఏ మాత్రం రాజీపడకుండా రక్షణ బడ్జెట్‌ను ఏటా 5 నుండి 7 బిలియన్ డాలర్ల వరకూ తగ్గించవచ్చు" అని స్పష్టం చేసాడు. కానీ అధ్యక్ష పీఠం ఎక్కాక కోత మాట అటుంచి ఏకంగా రక్షణ బడ్జెట్‌ను మరో 10 బిలియన్ డాలర్లు పెంచాడు. అమెరికా రాబోయే ఐదేళ్లలో వెయ్యి బిలియన్ డాలర్లు మిలిటరీ రంగాల మీద ఖర్చు చెయ్యాలని ప్రతిపాదించాడు. అధ్యక్షుడి మనసు ఎరిగిన వ్యవసాయ శాఖ స్కూళ్లలో చదువుకునే పిల్లలకు మధ్యాహ్నం పూట ఉచితంగా అందించే పాలకోటాను రద్దు చేసి ఏటా 25 బిలియన్ డాలర్లు ఆదా చేసింది.

వ్యవస్థ మీద ప్రజలలో విశ్వాసం కల్పించే గురుతర బాధ్యతను తలకెత్తుకున్న కార్టర్ ప్రజల ఆర్థిక ఈతిబాధలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాడు. వేతనాలకంటే నిత్యావసర ఆహార పదార్థాల ధరలు జోరుగా పెరిగిపోయాయి. అధికారిక అంచనాలమేరకే నిరుద్యోగం 6 నుండి 8 శాతం వరకూ ఉంది. అనధికారిక లెక్కల ప్రకారం ఇది ఇంకా ఎక్కువే. ప్రత్యేకించి యువజనుల్లో, మరీ ముఖ్యంగా నల్లజాతియువజనుల్లో నిరుద్యోగం 20 నుండి 30 శాతంగా ఉండింది.

కార్టర్‌కు గట్టి మద్దతు దారులుగా నిలిచిన నల్లజాతి ప్రజానీకంలో అతని విధానాల పట్ల అసంతృప్తి పెరిగిపోయింది. పేద మహిళల గర్భస్రావానికి అందించే ఫెడరల్ సాయాన్ని కార్టర్ వ్యతిరేకించాడు. 'ఇది అన్యాయం కాదా, డబ్బుగల మహిళలు సునాయాసంగా గర్భస్రావం చేయించుకోగలుగుతుంటే డబ్బులేని కారణాన పేద మహిళలు అకారణగర్భాన్ని మొయ్యవలసిందేనా' అని ప్రశ్నిస్తే కార్టర్ చాలా తేలిగ్గా తీసుకున్నాడు ఈ విషయాన్ని. 'మంచిది, మీకు తెలియంది కాదు, జీవితంలో అన్నీ సజావుగా ఉండవు. డబ్బు ఉన్న మహిళలు అనుభవించే హక్కు డబ్బులేని మహిళలకు దక్కకపోవడం అన్యాయం అని నేను అనుకోను' అని జవాబిచ్చాడు.

అలాగే కార్టర్ ప్రభుత్వానికి, ఆయిల్, గ్యాస్ విషయాల్లో 'జనాకర్షక' విధానాలకు అస్సలు పొత్తుకుదరలేదు. వినియోగదారులకు 'నియంత్రిత ధరలకు' ఆయిల్, గ్యాస్ అందించే సౌలభ్యానికి అంటకత్తెర వెయ్యాలని కార్టర్ ప్రభుత్వం భావించింది. ఎందుకంటే సహజ వాయువును ఉత్పత్తి చేసే ఎక్సాన్ కార్పొరేషను, సహజవాయు నిక్షిప్త భూభాగాలూ రాక్‌ఫెల్లర్ కుటుంబం చేతుల్లో ఉన్నాయి. 'నియంత్రిత ధరలకు' స్వస్తి చెప్పడం ద్వారా రాక్‌ఫెల్లర్‌కు అపారలాభాలు గడించిపెట్టి స్వామిభక్తిని చాటుకోవాలనుకున్నాడు జిమ్మీకార్టర్.

అంతకు ముందు కార్టర్ హయాంలోని ఫెడరల్ ఇంధన నిర్వహణ సంస్థ విదేశాల నుండి, ప్రత్యేకించి గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్, సరఫరా చేసిన ముడి చమురు ధర 79.1 మిలియన్ డాలర్లు ఎక్కువ చేసి చూపినట్లు లెక్కతీసింది. అప్పటికే ఈ పెంచి చూపిన తప్పుడు ధరల భారాన్ని వినియోగదారుల నుండి వసూలు చేసారు. 1978 వేసవి కాలంలో గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ చేసిన తప్పుకు రాజీ సూత్రంగా 42.2 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరో పక్కన గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ చెల్లింపుల మూలంగా కంపెనీల ఆ లాభాల మీద ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదు. ఎందుకంటే మొత్తాన్ని అంతకుముందు సంవత్సరాల్లోని లెక్కల ఖాతాల్లోనే సర్దుబాటు చేసినట్లు తన వాటాదారులకు రాతపూర్వకంగా స్పష్టం చేసింది.

అమెరికన్ ఇంధన వ్యవహారాల విభాగానికి చెందిన లాయరేమో 'వ్యాజ్యం వేస్తే ఏళ్లూ పూళ్లూ గడుస్తుంది కాబట్టి మధ్యేమార్గంగా రాజీఫార్ములాను రూపొందించి అంగీకరించాం' అని ప్రకటించాడు. అంటే రాజీ ఖరీదు 36.9 మిలియన్ డాలర్లు అన్నమాట. ఇదంతా ప్రజాధనమే కదా. దోషులను ఇట్లానే వదిలిపెడతారా ఎక్కడైనా? ఎవరైనా బ్యాంకుకు కన్నం

వేసి, దోచుకున్న సొత్తులో సగం వెనక్కి ఇచ్చేస్తే విచారణ, జైలు శిక్ష లేకుండా చేసేస్తారా? కానీ గల్ఫ్ కార్పొరేషన్ కంపెనీ విషయంలో కార్టర్ ప్రభుత్వం చేసింది అదే. చట్టాలు కలవారి చుట్టాలు అని కార్టర్ ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

కార్టర్ ప్రభుత్వం అనుసరించిన విధానాల మూలంగా అమెరికాలో అనూహ్యంగా వస్తున్న 'సంపద అసమ పంపిణీ'లో వీసమెత్తు తేడా రాలేదు. మితవాదులు అననీండీ, ఉదారవాదులు అననీండి, రిపబ్లికన్ అననీండి, డెమోక్రాట్ అననీండి– అమెరికా అధ్యక్ష పీఠాన్ని ఎవరు ఎక్కినా 'సంపద అసమ పంపిణీ' యథావిధిగా కొనసాగింది. ఆండ్రూ జింబాలిస్ట్ అనే అమెరికన్ ఆర్థికవేత్త 'లెమాండె డిప్లమాటిక్' అనే ఫ్రెంచి పత్రికకు 1977లో ఒక వ్యాసం రాస్తూ "అమెరికాలో 10 శాతం మంది ధనవంతులు అట్టడుగున్న ఉన్న 10 శాతం మంది జనాభాకన్నా 30 రెట్లు ఎక్కువ ఆదాయం గడిస్తున్నారు. కేవలం 1 శాతం మంది 33 శాతం దేశ సంపదను అనుభవిస్తున్నారు. కేవలం 5 శాతం మంది భాగ్యవంతులు స్టాక్ మార్కెట్లోని 83 శాతం షేర్లను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. దేశంలోని 100 అతిపెద్ద కార్పొరేట్ కంపెనీలు సగటున 26.9 శాతం పన్నులు చెల్లిస్తుంటే, బడా ఆయిల్ కంపెనీలు 5.8 శాతం పన్నులు చెల్లించాలి. కాని వాస్తవానికి 200,000 డాలర్లు సంపాదించే 244 మంది వ్యక్తులు ఒక్క నయాపైసా పన్ను కూడా చెల్లించలేదు" అని సాధికారికంగా వివరించాడు.

1979లో జిమ్మీ కార్టర్ ప్రభుత్వం పేదలకు కొన్ని సదుపాయాలు కల్పించాలని అన్యమనస్కంగానే ప్రతిపాదించాడు. కానీ పార్లమెంటు ఈ ప్రతిపాదనలను బలంగా త్రిప్పికొట్టింది. 'బాలల సంరక్షణ నిధి' అని వాషింగ్టన్‌లోని ఒక సంస్థకు డైరెక్టరుగా ఉన్న నల్లజాతి మహిళ– 'మారియన్ రైట్ ఎడెల్‌మాన్' ఈ విషయమై న్యూయార్క్ టైమ్స్ పత్రికలో' ఓపెన్ ఎడిటోరియల్ రాసింది–

"ప్రతి ఏడుగురు పిల్లల్లో ఒకరికి (అంటే కోటి మందికి) ప్రాథమిక వైద్యసదుపాయం అందుబాటులో లేదు. 17 ఏళ్లలోపు వయసు ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరు (అంటే కోటీ ఎనభై లక్షల మంది పిల్లలు) ఏనాడూ దంత వైద్యుడి దగ్గర వైద్యానికి పోలేదు. ఈ లోటుపాట్లను సరిదిద్దడానికి పిల్లలకు ప్రాథమిక వైద్యసదుపాయాలు అందచేసే పథకాలకు 288 మిలియన్ డాలర్ల నిధులు కావాలని అర్థిస్తే సెనెట్ బడ్జెట్ కమిటీ 88 మిలియన్ డాలర్ల కోత విధించింది. కానీ లిట్టన్ పరిశ్రమను నష్టాల నుండి బయటపడెయ్యడానికి ఇరాన్ రాజు షాకు రెండు యుద్ధ వాహక నౌకలు తయారు చేసి అమెరికా నావికాదళం తరపున అందించడానికి 725 మిలియన్ డాలర్ల 'బెయిల్–అవుట్' ప్యాకేజికి ఆమోదముద్ర వేసింది" అని ఆమె కార్టర్ ప్రభుత్వాన్ని ఎండగట్టింది.

కార్టర్ చేపట్టిన 'పన్నుల సంస్కరణలూ' ప్రధానంగా కార్పొరేట్ కంపెనీలకే లబ్ధిచేకూర్చాయి. 'నేషన్' పత్రికలో ప్రముఖ ఆర్థికవేత్త రాబర్ట్ లెక్‌మాన్ ఒక వ్యాసం రాస్తూ '1978 ఆఖరి త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల లాభాలు గత ఏడాదిలో అదే కాలానికన్నా 44 శాతం పెరిగాయని' పేర్కొన్నాడు.

"గత నవంబరు నెలలో అధ్యక్షుల వారు అత్యంత నిర్లక్ష్యంగా తగ్గించిన 18 బిలియన్ డాలర్ల పన్నులలో సింహభాగం రాయితీని ఈ కంపెనీలు కొట్టేసినందునే ఇంతటి అనూహ్య లాభాలు గడించాయి ఆ కంపెనీలు" అని కూడా సాధికారంగా విశ్లేషించాడు.

1979లో ఒక వైపున పేదలు నిధుల్లో కోతను చవి చూస్తుంటే మరో పక్కన ఎక్సాన్ ఆయిల్ కంపెనీ ఛైర్మన్ జీతం ఏడాదికి 830,000 డాలర్లకు పెరిగింది. మోబిల్ ఆయిల్ కంపెనీ ఛైర్మన్ అయితే ఏకంగా పది మిలియన్ డాలర్లు జీతం రూపేణా అందుకున్నాడు. ఆ ఏడాదిలోనే ఎక్సాన్ కంపెనీ నికరాదాయం 50 శాతం పెరిగి 4 బిలియన్ డాలర్లు ఆర్జించింది. మూడు వేల గ్యాసోలిన్ స్వయం ఉపాధి యూనిట్లు మూతబడ్డాయి.

కార్టర్ కొన్ని సామాజిక సంక్షేమ పథకాలను అమలు చెయ్యడానికి ప్రయత్నించాడు. కానీ మిలిటరీ బడ్జెట్ వీటిని మింగేసింది. సోవియట్ సోషలిస్టు రష్యా ప్రభావం జనాల మీద పడకుండా చూడడానికి ఆ మాత్రం కనీస పథకాలు అవసరం అని కార్టర్ భావించాడు. సోవియట్ రష్యా సైనిక దళాలు 1979లో ఆఫ్ఘనిస్తాన్‌లోకి ప్రవేశించినప్పుడు జిమ్మీ కార్టర్ సంకేతాత్మక నిరసనలకు, చర్యలకు మాత్రమే పరిమితం అయ్యాడు. డ్రాఫ్ట్ బిల్లును పునరుద్ధరించడం, 1980లో జరగనున్న మాస్కో ఒలంపిక్స్‌ను బహిష్కరించడం వంటి చర్యలు తీసుకున్నాడు.

మరో పక్కన వామపక్ష తిరుగుబాటు ఉద్యమాలను అణిచివెయ్యడానికిగాను నిరంకుశ పాలిత దేశాలకు అమెరికా ఆయుధ సాయం కొనసాగించింది. 1977లో కార్టర్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు ఒక నివేదిక సమర్పిస్తూ అందులో ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు నిర్మొహమాటంగా చెప్పింది కూడా. "మానవ హక్కుల ఉల్లంఘన విషయంలో గర్హించదగిన రీతిలో ఉన్న దేశాల పట్ల– రక్షణ రీత్యా, విదేశాంగ ప్రయోజనాల రీత్యా 'మన' అవసరాలకు తగినట్లు వ్యవహరించాల్సి వస్తుంది" అని ఆ నివేదికలో పేర్కొన్నాడు.

ఈ కారణాలను అడ్డం పెట్టుకునే ఎల్‌సాల్వడార్‌లో రైతాంగ తిరుగుబాట్లను అణగదొక్కడానికి ప్రయత్నిస్తున్న అక్కడి సైనిక ప్రభుత్వానికి 5.7 మిలియన్ డాలర్ల రుణాలు ఇవ్వడానికి అనుమతించాలని కార్టర్ 1980 వసంత కాలంలో కాంగ్రెస్‌ను కోరాడు. ఫిలిప్పీన్స్‌లో జాతీయ అసెంబ్లీకి 1978లో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా గెలిచిన ఫెర్దినాండ్ మార్కోస్ తన మీద పోటీ చేసి ఓడిపోయిన 21 మంది అభ్యర్థులలో పదిమంది ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను అరెస్టు చేయించాడు. కొంతమంది చిత్రహింసలకు గురయ్యారు. అనేక మంది పౌరులు హత్యకావించబడ్డారు. అయినా కార్టర్ ప్రభుత్వం మార్కోస్ ప్రభుత్వానికి రాబోయే ఐదేళ్లకుగాను 300 మిలియన్ డాలర్ల ఆయుధ సాయం అందించాలని కాంగ్రెస్‌ను కోరింది.

నికరాగువాలోని సోమొజో నియంతృత్వ ప్రభుత్వం దశాబ్దాల పాటు మనుగడలో ఉండేందుకు అమెరికా అన్ని విధాలా సాయం అందించింది. అయితే ఆ ప్రభుత్వం బలహీనత,

నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా చెలరేగిన ప్రజాబాహుళ్య తిరుగుబాటును పసికట్టలేని కార్టర్ ప్రభుత్వం యథావిధిగా సైనిక ప్రభుత్వానికి ముందరే ఆ ప్రభుత్వం కుప్ప కూలిపోయింది.

ఇరాన్ రాజు షా నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా 1978 చివరి నాటికి దేశవ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. 1978 సెప్టెంబరు 8న షా సైన్యం వందలాది మంది ప్రదర్శన కారులను ఊచకోత కోసింది. అయినా ఆ మరునాడే షా పరిపాలనకు తన మద్దతు కొనసాగుతుంది అన్న కార్టర్ రహస్య సందేశం టెహ్రాన్‌కు చేరింది.

వరుసగా మూడవ రోజున కూడా షా ప్రభుత్వం నిరసనకారుల మీద గుండ్ల వర్షం కురిపించింది. అంతకు ముందు రోజున రాజు షా మొహమ్మద్ రెజాఫ్లెహావీ అధికార నివాసమైన రాజభవనానికి ఫోన్ చేసి మరీ కార్టర్ తన మద్దతు తెలిపాడు. 37 ఏళ్ల ఏకచ్ఛత్రాధిపత్య పాలనలో షా ఏనాడూ చవి చూడనంతటి సంక్షోభాన్ని ఎదుర్కొన్నాడు. ఇరాన్‌కు కొత్త ప్రధానిగా రాజుచే నియమించబడిన అతను పార్లమెంటులో ప్రసంగిస్తుండగా తొమ్మిది మంది సభ్యులు 'రక్తపంకిలమైన నీ చేతుల్లో పరిపాలన మాకొద్దు' అని నినదిస్తూ సమావేశాన్ని బహిష్కరించి బయటికి వచ్చేసారు.

1978 డిసెంబరు 13 న్యూయార్క్ టైమ్స్ సంచికలో నికోలాస్ కేజ్ రాసిన వార్తా కథనంలో ఇలా రాసాడు– "షా పరిపాలనకు వ్యతిరేకంగా బలపడుతున్న సవాళ్లను పరిష్కరించడంలో తగిన సాయం అందించడానికి అమెరికా నుండి ఎగిరివచ్చిన డజన్ల కొద్దీ నిపుణుల బృందంతో అమెరికన్ రాయబార కార్యాలయం కిటకిటలాడిపోతుంది. కొత్తగా వచ్చి చేరుతున్న వాళ్లలో ఇరాన్ మీద పట్టున్న సిఐఎ స్పెషలిస్టులు, రాయబారులు, సైనికాధికారులు ఉన్నారని అభిజ్ఞవర్గాల భోగట్టా."

1979 తొలినాళ్లలో ఇరాన్ సంక్షోభం మరింత తీవ్రమైన దశలో సిఐఎలో ఇరాన్ వ్యవహారాల మాజీ ప్రధాన విశ్లేషకుడు ఒకరు న్యూయార్క్ టైమ్స్ పత్రిక విలేఖరి సేమూర్ హెర్ష్‌కు ఆసక్తికరమైన వివరాలు వెల్లడించాడు. "ఇరాన్‌లో అసమ్మతివాదులను రహస్యంగా ఖైదు చేసి చిత్రహింసల పాల్జేసేందుకు 'సవాకి' అనే పేరిట రహస్య పోలీసు దళాన్ని 1950లలోనే సిఐఎ సహకారంతో షా నెలకొల్పాడని, సిఐఎ అత్యున్నత అధికారి ఒకరు చిత్రహింసలలో మెళకువలు నేర్పే శిక్షణ 'సవాకి' బృందానికి ఇచ్చాడని, ఈ విషయాలన్నీ తన తోటి సన్నిహితులు అందరికీ తెలుసునని" ఆ మాజీ సిఐఎ అధికారి వివరించాడు.

చివరికి ప్రజాబాహుళ్య తిరుగుబాటుకు తలొగ్గి ఇరాన్ రాజు దేశం విడిచిపెట్టి పారిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వైద్యసేవలు అందించే పేరిట కార్టర్ ప్రభుత్వం 'షా'కు అమెరికాలో ఆశ్రయం కల్పించింది. దీంతో ఇరాన్ విప్లవకారులలో అమెరికన్ వ్యతిరేక భావనలు మరింత బలపడ్డాయి. దరిమిలా 1979 నవంబరు 4న టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అందులోని 52 మంది ఉద్యోగులను బందీలుగా చేజిక్కించుకున్న మిలిటెంట్ విద్యార్థులు ఇరాన్ మాజీ రాజు షా చేసిన నేరాలకు తగిన శిక్ష

విధించేలా ఇరాన్‌కు అప్పగిస్తేనే తమ చేతిలో బందీలుగా ఉన్న అమెరికన్ సిబ్బందిని విడిచిపెడతాం అనే షరతు విధించారు.

పద్నాలుగు నెలలపాటు రాయబార కార్యాలయ ఉద్యోగులు బందీలుగా ఉండిపోవడంతో పతాక శీర్షిక వార్తగా కొనసాగింది. ఈ ప్రచారంతో అమెరికన్లలో ఉధృతమైన స్థాయిలో జాతీయవాద భావనలు ప్రోది అయ్యాయి. పనిలో పనిగా కార్టర్ ప్రభుత్వం సరైన వీసాలు లేకుండా (గడువు మీరిన) దేశంలో ఉంటున్న ఇరాన్ విద్యార్థులకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 'ఇమ్మిగ్రేషన్ & న్యాచురలైజేషన్ సర్వీస్ డిపార్ట్‌మెంటుకు తాఖీదులు ఇచ్చాడు. న్యూయార్క్ టైమ్స్ మలి పత్రిక కూడా 'సంయమనం' పాటించాలని చెబుతూనే ఈ చర్యను గట్టిగా సమర్థించాల్సిన పరిస్థితి. రాజకీయవేత్తలు, పత్రికలు, మీడియా కలిసి 'ఉన్మాద పూరిత' పరిస్థితులు సృష్టించాయి. పరిస్థితులు ఎంతదాకా వచ్చాయంటే ఒక హైస్కూలు ప్రారంభోత్సవ ఉపన్యాసం ఇవ్వాలని ముందుగా నిర్ణయించిన ఇరాన్-అమెరికన్ అమ్మాయి పేరును చివరి నిమిషంలో తప్పించి వేరే వాళ్లకు ఆ అవకాశం కల్పించారు. దేశ వ్యాప్తంగా కార్లు, బస్సులు, లారీల 'బంపర్లు' అన్నింటిమీదా 'ఇరాన్ మీద బాంబులు వెయ్యాలి' (బాంబ్ ఇరాన్) అనే స్టిక్కర్లు వెలిసాయి.

తదనంతర కాలంలో యాభై రెండు మంది బందీలను సజీవంగా, ఆరోగ్యవంతంగా విడుదల చేసారు మిలిటెంటు విద్యార్థులు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఏ జర్నలిస్టు సాహసించని రీతిలో 'బోస్టన్ గ్లోబ్' పత్రికా విలేఖరి అలాన్ రిచ్‌మన్ పదునైన చర్చను ముందుకు తెచ్చాడు. "తాజా సంఘటనలో మానవహక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా అమెరికన్లు స్పందించిన తీరు ఇతరత్రా సందర్భాలలో కానరాకపోవడం ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సందర్భమే. ఈ సంఘటనలో 52 మంది అమెరికన్ల మానవ హక్కులు ప్రమాదంలో పడినమాట వాస్తవమే. ఈ అంకె మన ఊహకైనా అందుతుంది. కానీ అర్జెంటీనాలో 15000 మంది అమాయక పౌరులు శాశ్వతంగా ఆచూకీ లేకుండా పోయారు. ఇరాన్ విద్యార్థుల చేతుల్లో బందీలుగా చిక్కిన 52 మంది మన భాష మాట్లాడతారు కాబట్టి వారి బాధ మనకు అర్థమైంది. కాని నిరుటి ఏడాది గ్వాటిమాలాలో 3000 మంది అమాయక పౌరులను నిలువునా కాల్చి చంపారు. వారి బాధ ఏంటో మనం అర్థం చేసుకోలేకపోవడానికి కారణం వారి భాష మనకు తెలియకనా?" అని పౌర సమాజాన్ని నిలదీసాడు.

1980లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో జిమ్మీ కార్టర్, రోనాల్డ్ రీగన్‌తో తలపడే సమయానికి బందీలు ఇంకా ఇరాన్ రాడికల్ విద్యార్థుల ఆధీనంలోనే ఉన్నారు. కానీ ప్రజలు తాము ఎదుర్కొన్న ఆర్థిక ఈతి బాధలకు ప్రతీకారంగానే కార్టర్‌ను ఓడించారు. రీగన్‌వరుసగా రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నిక అయి ఎనిమిదేళ్ల పాటు అధికారం చలాయించాడు. ఆ తరువాత జార్జి బుష్(సీ) ఆ పీఠం ఎక్కాడు. అధికార పార్టీ మారడంతో కార్టర్‌హయాంలో అనుసరించిన కాస్తో కూస్తో ఉదారవాద విధానాలూ పూర్తిగా పక్కకి పోయాయి. కొత్త ప్రభుత్వ హయాంలో పేదలకు అందే సదుపాయాల్లో మరింత కోత, సంపన్నులకు మరిన్ని పన్నురాయితీలు, మిలిటరీ

బడ్జెట్ పెంపు, ఫెడరల్ కోర్టులో మితవాద జడ్జీల నియామకాలు, కరిబియన్ ప్రాంతంలో విప్లవ ఉద్యమాన్ని నాశనం చేసేందుకు కంకణం కట్టుకోవడం– వంటి ప్రజా కంటక విధానాలు అమలులోకి వచ్చాయి.

పన్నెండేళ్లపాటు రిపబ్లికన్ పార్టీ తరపున రీగన్–బుష్ (సీ) ద్వయం అధ్యక్ష పదవిలో కొనసాగిన మూలాన యావత్ న్యాయవ్యవస్థ పై నుండి కిందదాకా మితవాద వ్యవస్థగా స్థిరపడిపోయింది. 1991 శీతాకాలం నాటికి రీగన్–బుష్(సీ)లు ఇద్దరూ కలిసి ఫెడరల్ కోర్టులలో మొత్తం 837 మంది జడ్జిలను నియమించారు. చివరకు సుప్రీం కోర్టును కూడా మితవాద ధోరణులవైపు మొగ్గు చూపడానికి అవసరమైనంత మంది న్యాయమూర్తులను కూడా నియమించేసారు.

రీగన్–బుష్‌ల హయాంలో బాగా లబ్ధిపొందిన వాళ్లు ఎవరన్నా ఉన్నారంటే అది అమెరికన్ కార్పొరేట్ రంగమే. 60–70 దశకాలలో దేశంలో పర్యావరణ ఉద్యమం ప్రముఖంగా కొనసాగింది. నదులు, సముద్రాలు, పీల్చేగాలులు విషతుల్యమై పని పరిస్థితులు దుర్భరంగా మారి ఏటా వేలాది మంది చనిపోవడం చూసి జాతీయావత్తు భయదవిహ్వల అయిపోయింది. 1968 నవంబరులో పశ్చిమ వర్జీనియాలోని ఒక గని పేలుడులో 78 మంది కార్మికులు మరణించారు. ఇందుకు నిరసనగా ఆ జిల్లా అంతటా తీవ్రమైన నిరసనోద్యమాలు చెలరేగాయి. ఆ ఒత్తిడికి పార్లమెంటు 1969లో కోల్‌మైన్ హెల్త్ & సేఫ్టీ యాక్ట్‌ను రూపొందించింది. నిక్సన్ హయాంలోని కార్మిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఈ చట్టాన్ని 'పర్యావరణం పట్ల జాతి జనులలో పెరిగిన స్పృహ'కు గుర్తుగా కొనియాడాడు.

ఆ మరుసటి ఏడాదిలోనే కార్మికోద్యమం, వినియోగదారీ సంస్థల ఒత్తిడి మూలంగా వృత్తి రుగ్మతల భద్రతా చట్టం (1970) మీద నిక్సన్ సంతకాలు చేసాడు. బహుశా దీన్ని కార్మికవర్గం ఓట్లు కూడాగట్టుకోవడంలో భాగంగా ముందుకు తెచ్చి ఉండవచ్చు. అయినా ఇది కీలకమైన, ముఖ్యమైన చట్టంగా చెప్పుకోవాలి. పని ప్రదేశంలో కార్మికులకు భద్రత, వృత్తిరుగ్మతల నుంచి రక్షణ కల్పించే ఈ చట్టం అమలుకు తగిన యంత్రాంగం కూడా రూపొందించబడింది. తదనంతర కాలంలో నిక్సన్ ఆర్థిక సలహాదారుల మండలి ఛైర్మన్‌గా ఉన్న హెర్బర్ట్ స్టీన్ ఈ పరిణామాల మీద వ్యాఖ్యానిస్తూ "పర్యావరణ నియంత్రణ పేరిట కదిలిన ఈ జగన్నాథ రథచక్రాలను నిలవరించడం ప్రభుత్వానికి అసాధ్యంగా మారింది" అన్నాడు.

జిమ్మీ కార్టర్ అధ్యక్ష పదవి చేపట్టాక ఈ చట్టాన్ని ప్రస్తుతిస్తూనే అటు వాణిజ్యవర్గాలనూ ప్రసన్నం చేసుకోవడానికి తహతహలాడిపోయాడు. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేసే బాధ్యతను యూలాబిన్ హామ్ అనే మహిళ చేతికి అప్పగించాడు. ఆవిడ ఈ చట్టం అమలు కోసం తీవ్రంగా కృషి చేసింది. కాని విజయం సాధించిన సందర్భాలు అతి కొద్ది మాత్రమే. మరో వంక చమురు ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం– నిరుద్యోగం పెచ్చరిల్లడం మూలాన అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో సంక్షోభ సంకేతాలు బయట పడడంతో కార్టర్ ప్రభుత్వం ఈ

చట్టం మూలాన వాణిజ్య వ్యాపార పారిశ్రామిక వర్గాలకు ఎదురవుతున్న ఇబ్బందుల మీద దృష్టి పెట్టాడు. కార్పొరేట్ కంపెనీలకు నియంత్రణల నుండి సడలింపు కల్పించాడు. కార్మికులు, వినియోగదారుల ప్రయోజనాలు దెబ్బతింటున్నా కార్టర్ మొగ్గు కార్పొరేట్ కంపెనీల 'సంక్షేమం' మీదే ఉంది. కార్పొరేట్ కంపెనీల జమా ఖర్చుల లెక్కల్లో, ఖర్చుల మీద నియంత్రణ పాటించాల్సి వచ్చేసరికి తొలివేటు పర్యావరణ నియంత్రణలకు అయ్యే వ్యయం మీదే వేసాయి. ప్రజల ఆరోగ్యం, భద్రత కార్పొరేట్ కంపెనీల లాభాల ముందు ద్వితీయ ప్రాధాన్యత గల అంశంగా మారిపోయింది.

రీగన్, బుష్(సీ) హయాంలో 'పొదుపు' అనే మాట కార్పొరేట్ లాభాలకు పర్యాయపదంగా మారిపోయింది. కార్పొరేట్ లాభాలకు – కార్మికుల, వినియోగదారుల సంక్షేమానికి చుక్కెదురు అనే విషయం వేరుగా చెప్పనక్కరలేదు. రీగన్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే 'పర్యావరణ చట్టాల' కఠిన తర అమలుకు బదులు 'స్వచ్ఛంద అమలు' కోరుతూ, ఈ అమలు కూడా కార్పొరేట్ కంపెనీల వ్యాపార నిర్ణయాల మీద ఆధారపడి ఉండేలా చేసేందుకు పూనుకున్నాడు. ఆరోగ్య –భద్రతా చట్టానికి ఒక బడా వాణిజ్య వేత్తను ఛైర్మన్‌గా నియమించాడు. ఆ చట్టం లక్ష్యాల నీడ అంటేనే గిట్టని పెద్ద మనిషి ఆయన. ఇతగాడు ఛైర్మన్‌గా పదవీ స్వీకారం చెయ్యగానే తలపెట్టిన తొలి కార్యక్రమం ఏంటంటే– టెక్స్‌టైల్స్ పరిశ్రమలో కార్మికులకు పత్తిదూగర వలన ఏర్పడే వృత్తిరుగ్మతల గురించి తెలియచెప్పే లక్షప్రతుల బుక్‌లెట్స్‌ను ధ్వంసం చేయించాడు.

రీగన్–బుష్(సీ) ప్రభుత్వాల జంట ప్రాధాన్యతలు ఏమిటంటే– ఒకటి : భారీ మిలిటరీ పద్దును కొనసాగించడం, రెండు : ఆయిల్ కంపెనీల లాభదాయకతను మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లేలా చూడడం, రోనాల్డ్ రీగన్ అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టగానే శ్వేతసౌధాన్ని, అధ్యక్ష నివాసాన్ని పునరలంకరించడానికి 23 చమురు కంపెనీల అధిపతులు 270,000 డాలర్లు విరాళంగా ఇచ్చారు. చమురు ధరలపై ప్రభుత్వ నియంత్రణలు తొలగిస్తూ రీగన్ నిర్ణయం తీసుకున్న నాలుగువారాలకు ఈ విరాళం అందించిన చమురు కంపెనీలు, ఈ నియంత్రణలు తొలగించిన మూలంగా తక్షణం 2 బిలియన్ డాలర్లు (200,00,00,000 డాలర్లు) లబ్ధిపొందాయని అసోసియేటెడ్ ప్రెస్ ఒక వార్త ద్వారా తెలియ చెప్పింది. ఓక్లహోమా నగర నివాసి, కోర్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీ యజమాని అయిన జాక్ హోడ్రెన్ "ఈ దేశ అత్యున్నత పౌరుడు, అత్యున్నత భవన సముదాయంలో నివసించాలి. దేశాధ్యక్షుడు రీగన్ ఇంధన వ్యాపారానికి ఎంతో తోడ్పాటును ఇచ్చాడు" అని ఏమీ దాచుకోకుండానే ఉన్న విషయం బయట పెట్టాడు.

రీగన్ అధ్యక్ష పదవిని ఏలిన తొలి విడత నాలుగేళ్ల పదవీ కాలంలోనే మిలిటరీ బడ్జెట్ కేటాయింపులను ట్రిలియన్ (ఒకటి పక్కన పదమూడు సున్నాలు) డాలర్లకు చేర్చాడు. పేదలకు లబ్ధి చేకూర్చే పథకాల్లో తీవ్ర కోత పెట్టి దాన్ని మిలిటరీ బడ్జెట్‌కు మళ్లించాడు. ఒక్క 1984లోనే సామాజిక పథకాలకు చేసే వ్యయంలో 140 బిలియన్ డాలర్ల కోత పెట్టి డిఫెన్సు

బడ్జెట్ 181 బిలియన్ డాలర్లు పెంచాడు. అలాగే మరో 190 బిలియన్ డాలర్లు సంపన్నులకు పన్ను రాయితీలుగా ప్రకటించాడు.

ఒక పక్కన సంపన్నులకు భారీ ఎత్తున పన్ను రాయితీలు ఇస్తూ, మరో పక్కన రక్షణ వ్యయం భారీగా పెంచేసి అయినా గానీ బడ్జెట్‌ను సమతూకంగా అజమాయిషీ చెయ్యగలననీ, పన్ను తగ్గింపు మూలాన మరింత మంది పన్నులు కట్టడానికి ముందుకు రావడం ద్వారా అదనపు ఆదాయం వచ్చి ఆర్థిక వ్యవస్థ సజావుగా సాగుతుందని దృఢ విశ్వాసంతో చెప్పేవాడు రీగన్. ప్రముఖ ఆర్థిక వేత్త, నోబుల్ బహుమతి గ్రహీత వాస్సిలీ లియోంటిఫ్ మాత్రం "ఇలా జరిగే అవకాశం లేదు. నిజానికి ఇలా జరగదని గ్యారంటీ ఇవ్వడానికి నే సిద్ధంగా ఉన్నాను" అని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పాడు.

వాణిజ్య విభాగం గణాంకాలు పరిశీలించినా మనకు వాస్తవాలు రీగన్ అంచనాలకు భిన్నంగా కనిపిస్తాయి. 1973-75, 1979-82 మధ్య కాలంలో కార్పొరేట్ పన్నులు తగ్గాయి. సాపేక్షంగా పెట్టుబడులు పెరగాల్సిందిపోయి, తీవ్రంగా పడిపోయాయి. 1975-79 మధ్య కాలంలో కార్పొరేట్ పన్నులు అంతకు ముందుకన్నా కాస్త పెచ్చుగా ఉన్న సందర్భంలో మాత్రం మూలధన పెట్టుబడులు అనూహ్యరీతిలో పెరిగాయి.

రీగన్ హయాంలో బడ్జెట్ కోతలకు చెల్లించిన మానవవనరుల మూల్యం మాత్రం ఇంతా అంతా కాదు. ఉదాహరణకు మూడున్నర లక్షల మంది వికలాంగులకు అందుతూ వచ్చిన సామాజిక భద్రతా సదుపాయాలు రద్దు అయ్యాయి. ఈ పథకాన్ని నీరు గార్చడానికి అధికారులు చెయ్యాల్సిన దానికన్నా ఎక్కువే చేసారు. ఒక చమురు కంపెనీలో పని చేసే కార్మికుడు పని ప్రదేశంలో ప్రమాదం పాలబడితే కంపెనీ డాక్టరు, గవర్నమెంటు సూపర్‌వైజరు అతను పనికి పనికిరాడని, వికలాంగులకు ఇచ్చే సదుపాయాలు సిఫార్సు చేస్తే ఫెడరల్ ప్రభుత్వం ఈ సిఫార్సును రద్దు చేసి అతను పనిలో కొనసాగాలని ఆదేశించింది. ఆ ఆదేశాల ప్రకారం తిరిగి పనిలో కుదురుకున్న కొన్నాళ్లకే ఆ కార్మికుడు మరణించాడు. 'దీన్ని ప్రజాసంబంధాల (పిఆర్-పబ్లిక్ రిలేషన్) సమస్య'గా చెప్పి చేతులు దులిపేసుకున్నారు ఫెడరల్ ప్రభుత్వ ప్రతినిధులు. రాయ్ బెనాలిడెజ్ అనే వియత్నాం యుద్ధహీరో, రీగన్ చేతుల మీదుగా పార్లమెంటు మెడల్ అందుకున్న మనిషి- గుండె, మోచెయ్యి, కాలు ప్రాంతాల్లో బాంబుగోళం ముక్కలు గుచ్చుకుని పనికి పనికిరాడని నిర్ధారిస్తే సామాజిక భద్రతా అధికారులు మాత్రం 'నిక్షేపంగా ఉన్నావ్, పని చేసుకోవడానికి అవేవీ అడ్డంకి కావు' అని తీర్మానించి వికలాంగ సదుపాయాలు అందించేందుకు నిరాకరించారు. దీని మీద పార్లమెంటు కమిటీ ముందు హాజరయిన ఈ యుద్ధవీరుడు రీగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న అమానవీయ విధానాలను తీవ్రంగా విమర్శించాడు.

రీగన్ హయాంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఒక 1982 సంవత్సరంలో 3 కోట్ల మంది నిరుద్యోగం పాలబడ్డారు. ఒక కోటి అరవై లక్షల మంది ఆరోగ్య బీమా సదుపాయం కోల్పోయారు. (సహజంగా అమెరికాలో ఈ బీమా సదుపాయం ఉద్యోగంతో ముడిపడి ఉంటుంది) మిచిగాన్ రాష్ట్రంలో నిరుద్యోగం రేటు దేశంలోకల్లా అత్యధికంగా ఉంది. అలాగే 1981 నుండి లెక్కలు తీస్తే దేశవ్యాప్తంగా శిశుమరణాల రేటు అధికం అయ్యింది.

పది లక్షల మంది స్కూలు పిల్లలకు ఉచిత మధ్యాహ్న భోజన పథకం అందకుండాపోయింది. పిల్లల్లో పోషకాహార విలువలు పడిపోయాయి. ప్రభుత్వం అధికారికంగా నిర్ధారించిన పేదరికం ప్రమాణాల ప్రకారమే దేశంలో కోటి ఇరవై లక్షల మంది పిల్లలు పేదరికంలో బతుకుతున్నారు. డెట్రాయిట్ లాంటి ప్రాంతాల్లో శిశుమరణాల రేటు బంగ్లాదేశ్ వంటి పేదదేశంలోని శిశుమరణాల రేటుతో సమంగా ఉంది. "అమెరికాలో క్షుద్బాధతో ఉన్న ప్రజానీకం పట్ల ఈ ప్రభుత్వం సిగ్గుమాలిన తనంతో వ్యవహరిస్తుంది" అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది.

ప్రజా సంక్షేమం పెనుదాడికి గురయింది. మగతోడు లేని తల్లీ బిడ్డలకు అందించే ఆర్థిక సహకారం, ఆహార కూపన్లు, పేదలకు ఉద్దేశించిన వైద్య సదుపాయాలు – ఇలా ఒకటొకటిగా ఊడబీకారు. రాష్ట్రాల వారీ తరతమ భేదాలతో నెలకు 500 నుండి 700 డాలర్ల ఆర్థిక సాయం అందేది వీరికి. ఇది కూడా అధికారికంగా నిర్ధారించిన పేదరికం ప్రమాణం (నెలకు 900 డాలర్ల ఆదాయం) కన్నా తక్కువే. ఈ మాత్రం సాయం కూడా ఆగిపోవడంతో వారి పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. శ్వేతజాతి పిల్లలకన్నా నల్లజాతీయుల పిల్లలు నాలుగురెట్లు ఎక్కువ మంది ఈ సదుపాయాల మీద ఆధారపడి ఉంటారు అమెరికాలో. పేదరిక నిర్మూలన ఇంకెంత మాత్రం ప్రభుత్వ బాధ్యత కాదు, కార్పొరేట్ కంపెనీలు ఈ సమస్య పరిష్కారానికి ధీటుగా స్పందిస్తాయని రీగన్ ప్రభుత్వ ప్రతినిధులు పై నుండి కిందదాకా ఒకటే పాట పాడేవాళ్లు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా స్థానిక దిన పత్రికలో ఒక తల్లి రాసిన లేఖ సంక్షిప్త సారాంశం ఇదీ, చదవండి...

"నేను, నా పిల్లలు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం మీద జీవితం వెళ్లమారుస్తున్నాం. నా ఇద్దరు బిడ్డలు స్కూల్లో చదువుకుంటున్నారు. నేను 'డిస్టింక్షన్'లో గ్రాడ్యుయేషన్ (పట్టభద్రురాలు) పూర్తి చేసా. వెయ్యి మందికిపైగా ఉన్న క్లాసులో నాది 128వ ర్యాంకు. ఇంగ్లీషు, సామాజిక శాస్త్రాల్లో బి.ఎ పూర్తి చేసా. లైబ్రేరియన్ పనిలో నాకు కొంత అనుభవం ఉంది. పిల్లల ఆలనాపాలనా చూడగలను. సామాజిక కార్యక్రమాల్లో, 'కౌన్సిలింగ్' ఇవ్వడంలో చురుగ్గా ఉంటాను. నేను పట్టభద్రుల నిరుద్యోగ ఉపాధి కల్పనా కేంద్రం చుట్టూ చాలాసార్లు తిరిగాను. వాళ్లు నాకో దోవ చూపించలేకపోయారు. వారం వారం లైబ్రరీకి వెళ్లి ఆ వారంలో పేపర్లలో పడిన 'వాంటెడ్ కాలమ్స్' అన్నీ తిరగేసేదాన్ని నా అభ్యర్థిత్వం (రెస్యూమ్)తో పంపిన విజ్ఞాపన పత్రాల కాపీలతో పెద్ద బౌండు పుస్తకమే కుట్టవచ్చు. ఏడాదికి 8000 డాలర్లు (నెలకు 634 డాలర్లు– అంటే అధికారిక నిరుద్యోగ ప్రమాణం కన్నా తక్కువ) ఇవ్వగలిగే ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు చేసాను. గంటకు 3 1/2 డాలర్లు ఇచ్చే పార్ట్‌టైం లైబ్రరీ పనికి కుదురుకున్నా. ఇది చాలదన్నట్లు ఇపుడు నా బాధలకు తోడు ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలకు స్వస్తి చెప్పింది. పరిస్థితి ఎలా ఉందంటే ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులు ఉంటాయి. పని చూపించే నాథుడు లేడు. ప్రభుత్వం ఉంది కాని ప్రజాపాలన లేదు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఉంది, పని చేసేందుకు మనుషులు ఉన్నారు. కానీ ఉద్యోగాలు ఉండవు... క్రితం వారం నేను మంచం అమ్మేసి నా కారుకు ఇన్సూరెన్స్ కట్టాను. ప్రజారవాణా వ్యవస్థ లేని దిక్కుమాలిన దేశంలో ఉద్యోగం కోసం

నే చేసే వేటకు 'కారు' చచ్చేంత అవసరమాయె. ఎవరో ఇరుగమ్మ దయ తలిచి ఇచ్చిన ఫోమ్ రబ్బరు నేలమీద పరుచుకుని పడుకుంటున్నా. ఇదీ నా తల్లితండ్రులు తాము కన్న కలలు సాకారం చేసుకోవడానికి వచ్చిన అమెరికా. కష్టపడి పని చెయ్యి, మంచి చదువు అబ్బించుకో, రూల్స్ నికార్సుగా పాటించు- నువ్వు అమాంతం ధనవంతుడివి అయిపోతావు- అమెరికా అవకాశాలకు పుట్టినిల్లు. ఇక్కడ ఎవరైనా తాముకన్న కలలు నిజం చేసుకోవచ్చు అని నమ్మి వచ్చారు నా తల్లిదండ్రులు. కానీ నేను నా బిడ్డలకు రెండు పూటలా సరయిన తిండి పెట్టలేకపోతున్నా. హూందాగా బతకాలన్నా అలాంటి బతుకు నాపాలిట ఎండమావిగా మారింది."

రీగన్ ప్రభుత్వం పార్లమెంటులోని డెమోక్రాట్ల సాయంతో అతి సంపన్నులపై పన్నులను 50 శాతానికి తగ్గించింది. 1986లో రిపబ్లిక్ -డెమోక్రట్ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఏర్పడిన కమిటీ రూపొందించిన 'పన్ను సంస్కరణల బిల్లు'లో ఈ పన్ను రేటును 28 శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసింది. "ఒక స్కూలు టీచరు, ఓ ఫ్యాక్టరీ కార్మికుడు, ఒక శతకోటీశ్వరుడూ- అందరూ సమానంగా 28 శాతం పన్ను చెల్లించమని చెప్పడమే ఇది" అన్నారు బార్లెట్ మరియు స్టీలేలు ఈ ప్రతిపాదనను విమర్శిస్తూ. ఎక్కువ ఆదాయాలు గడించే వారి నుండి ఎక్కువ పన్ను రాబట్టాలనే సంప్రదాయ ఆర్థిక సిద్ధాంతం దాదాపుగా మృతప్రాయంగా మారిపోయింది ఆ నాటికి.

1978 నుండి 1990ల వరకూ ఈ రకమైన 'పన్నుల సంస్కరణ బిల్లుల' పుణ్యమా అని 'ఫోర్బ్స్' పత్రిక ఎంపిక చేసే తొలి 400 మంది ప్రపంచ కుబేరులలోని అమెరికన్ల సంపద మూడు రెట్లు పెరిగింది. ఏడాదికి ప్రభుత్వం 70 బిలియన్ డాలర్ల పన్నుల ఆదాయం కోల్పోయింది. ఆ రకంగా ఈ పదమూడేళ్లలో అమెరికాలోని అత్యధిక ధనికుల్లో పై ఒక్క శాతం మంది ట్రిలియన్ల డాలర్లు పోగేసుకున్నారు. "అమెరికన్ ప్రజాస్వామ్యం చేసిన నయవంచన గురించి ప్రజలకు ఎవరు చెప్తారు?" అని విలియమ్ గ్రెయిడర్ రాసిన పుస్తకంలో ఇలా అంటాడు-

"ఇలాంటి పరిస్థితి దాపురించడానికి రిపబ్లికన్లే కారణమని నమ్మి, ఆడిపోసుకుని, సమతూక పన్నుల విధానం పునరుద్ధరించబడాలంటే శ్వేత సౌధంలో అధికారాన్ని డెమోక్రాట్లు గెలుచుకోవాలని విశ్వసించే జనాలు అరాయించుకోలేని వాస్తవం ఇంకొకటుంది. డెమోక్రాట్లు పూర్తిగా అధికారాన్ని హస్తగతం చేసుకుని, రోనాల్డ్ రీగన్ ఇంకా వాషింగ్టన్‌లో కాలూనని 1978లోనే ఈ పరిస్థితి ఏర్పడిందనేది ప్రజల దృష్టిలో ఉన్నట్లు లేదు. పన్నుల విధానం ఇలా సంపన్నుల సేవలో తరించిపోవడానికి దారితీసిన ప్రతిమూల మలుపు పరిస్థితుల్లో మెజారిటీ డెమోక్రాట్ల హస్తం ఉంది.

ఈ శతాబ్దపు చివరి దశకాల్లో ఆదాయపు పన్ను అనులోమానుపాతంలో పెరగకపోవడం మాట అటుంచితే సామాజిక భద్రతా పథకాలు విలోమానుపాతంలో తగ్గుముఖం పట్టాయి. పేద, మధ్యతరగతి ప్రజానీకం మీద సామాజిక భద్రతా పథకాల కోసం పన్ను వేస్తూ ఏటా 42000 డాలర్ల సంపాదన ఉన్నవారి మీద ఈ పన్ను లేకుండా మినహాయింపు ఇచ్చారు. 1990లో చూస్తే ఏటా 37,800 డాలర్ల ఆదాయం ఉన్న కుటుంబం దగ్గర నుంచి సామాజిక

భద్రతా పన్ను కింద 7.65 శాతం ఆదాయం వసూలు చేస్తే ఏటా 3,78,000 డాలర్ల ఆదాయం ఉన్న వారి నుండి ఈ పన్ను కేవలం 1.46 శాతం మాత్రమే వసూలు చేసారు.

ఈ రకమైన పన్నుల విధానం మూలంగా నాలుగింట మూడొంతుల మంది వేతన జీవులు ఏటేటా తమ ఆదాయాల్లో ఆదాయపు పన్ను రూపేణా కన్నా సామాజిక భద్రతా పన్నుల రూపేణా ఎక్కువ చెల్లించాల్సి వచ్చింది. సిగ్గు చేటైన విషయం ఏంటంటే కార్మికవర్గ అభిమానం గల పార్టీగా చెప్పుకునే డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జిమ్మీ కార్టర్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే ప్రభుత్వం ఇంతటి నయవంచనకు పూనుకుంది.

రీగన్ హయాం ముగిసే నాటికి అమెరికాలో ధనికులు- పేదల మధ్యన ఉండే అంతరాలు నాటకీయంగా పెరిగిపోయాయి. 1980లలో ఒక ఫ్యాక్టరీ కార్మికుడి జీతం కన్నా ఆ కంపెనీ సి.ఇ.ఓ 40 రెట్లు ఎక్కువగా జీతం పుచ్చుకునే వాడల్లా 1989 నాటికి అది 93 రెట్లకు ఎగబాకింది. 1977-89 మధ్యన పన్నెండేళ్ల కాలంలో అతి సంపన్నులుగా ఉన్న ఒక్క శాతం మంది ఆదాయాలు (పన్ను చెల్లింపులకు ముందు) 77 శాతం పెరిగాయి. ఇదే కాలంలో ఐదింట రెండు వంతులుగా ఉన్న పేద ప్రజానీకం ఆదాయంలో మెరుగుదల లేకపోగా తరుగుదలకు దారితీసింది.

పన్నుల చెల్లింపులో వచ్చిన అనుకూల మార్పుల మూలంగా ఒక్క శాతంగా ఉన్న అతి సంపన్నుల ఆదాయాలు పన్ను చెల్లింపుల తర్వాత కూడా 87 శాతానికి పెరిగాయి. ఇదే కాలంలో అల్పాదాయ వర్గాలలో ప్రతి ఐదింట నాలుగు వంతుల జనాభా ఆదాయం (పన్ను చెల్లింపుల తరువాత) 8.6 శాతం కన్నా పెరగలేదు. కొన్ని సందర్భాలలో 5 శాతం పడిపోయింది కూడా.

అట్టడుగు ఆదాయవర్గాల వారి పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారితే ఇహ నల్లజాతీయులు, వలస ప్రజలు, మహిళలు, యువజనుల పరిస్థితి మరింత దిగజారిపోయింది. రీగన్-బుష్(సీ) హయాంలో అల్పాదాయ వర్గాల ప్రజానీకం తీవ్ర సంక్షోభాన్ని చవిచూసారు. ఒకవైపు వనరుల అందుబాటు లేకపోవడం, మరోవైపు వర్ణవివక్షత మూలంగా శ్వేత జాతీయేతర అల్పాదాయ వర్గాల ప్రజానీకం దుర్భర పరిస్థితులు చవిచూసింది. పౌర హక్కుల ఉద్యమాలు ఒక మేరకు సాధించిన విజయాల ఫలితంగా ఆఫ్రికన్-అమెరికన్‌ల పరిస్థితి కొంత మెరుగయినా మిగతావారు మరింత వెనుకబడిపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలం నుండి ట్రూమన్ నుండి రీగన్ ఆ తర్వాత బుష్ (సీ) వరకూ అటు డెమోక్రాట్లు ఇటు రిపబ్లికన్‌లు భారీ మిలిటరీ బడ్జెట్‌లకు వత్తాసుగా నిలిచారు.

సోవియట్ యూనియన్ సైనికపరంగా నానాటికీ బలోపేతం అవుతుంది. ఏనాటికైనా అది పశ్చిమ ఐరోపా ప్రాంతాన్ని ఆక్రమించుకునే అవకాశం ఉందనే సాకు చూపించి పాలకులు

ట్రిలియన్‌ల కొద్దీ డాలర్లను, అణు, అణుయేతర ఆయుధాలు గుట్టలుగా పోగెయ్యడానికి ఖర్చు చేసారు. కాని ప్రచ్ఛన్న యుద్ధ సిద్ధాంతకర్త, సోవియట్‌లో అమెరికా రాయబారిగా పనిచేసిన జార్జి కెన్నన్ మాత్రం ఇవన్నీ అర్థం పర్థంలేని భయాలని కొట్టిపారేసాడు. సిఐఎలో ఇరవై ఐదేళ్ల పాటు పనిచేసి, ఒక దశలో సోవియట్‌కు వ్యతిరేకంగా జరిగిన గూఢచర్య కార్యకలాపాలకు డైరెక్టరుగా పనిచేసిన హారీ రోషిఙ్‌కె 1980లలోనే "నేను సర్వీసులో ఉన్నన్నాళ్లూ పశ్చిమ యూరప్‌నో లేక అమెరికానో ఆక్రమించుకోవడం సోవియట్ ప్రయోజనాలకు ఏ రకంగా లాభదాయకం అనే విషయమై ఒక్కటంటే ఒక్క పక్కా ఇంటిలిజెన్స్ అంచనా నా దృష్టికి రాలేదు" అని ప్రకటించాడు.

అయితే ప్రజలలో ప్రచ్ఛన్న యుద్ధ భయాల్ని రేకెత్తించి లెక్కకు మిక్కుటంగా ఆయుధాలు పోగెయ్యడానికి మాత్రం పాలకవర్గాలకు సోవియట్ బూచి బాగా ఉపయోగపడింది. ఉదాహరణకు వందలాది న్యూక్లియర్ యుద్ధ బాంబులను ఒకే మారు ప్రయోగించగల సామర్థ్యం ఉన్న 'ట్రైడెంట్' సబ్‌మెరైన్‌ను 1.5 బిలియన్ డాలర్ల ఖర్చుతో నిర్మించారు. నిజానికి ఇది ఒట్టి దండగమారి వ్యవహారం. అమెరికా అమ్ముల పొదిలో ఉన్న వేలాది అణుబాంబులకు ఇవి అదనం మాత్రమే. ఈ 1.5 బిలియన్ డాలర్ల సొమ్ముతో ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు ఐదేళ్లపాటు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణగా టీకాలు వేయించవచ్చు. (రూత్ సివార్డ్. మిలిటరీ వ్యయం-సామాజిక వ్యయం 1987-1988)

రక్షణ రంగంలో రీసెర్చి విభాగాన్ని నిర్వహించే 'రాండ్ కార్పొరేషన్'లో పని చేసిన ఒక విశ్లేషకుడు ఒక ఇంటర్వ్యూలో అసాధారణ విషయాలు అలవోకగా చెప్పాడు. 'మిలిటరీ దృష్టిలో కూడా లెక్కకు మిక్కుటంగా పోగడిపోయిన ఈ ఆయుధాల్లో చాలా మటుకు అనవసరమైనవే. అయితే సొంత గడ్డమీదా, విదేశాల్లోనూ 'పలుకుబడి' పెంచుకునేదానికి మాత్రం బాగా పనికొచ్చాయి' అని చెప్పాడు అతను.

మాకు ఒక బలమైన అధ్యక్షుడు, అతనికి ధీటైన రక్షణ రంగ కార్యదర్శి- ఈ ఇద్దరు ఉంటే చాలు. ఎప్పుడు కావాలంటే అప్పుడు పార్లమెంటుకు హాజరయి "రష్యా మనకన్నా రెండింతలు ఆయుధాలు పోగేసుకున్నా సరే మేం మాత్రం మనకు ఎంత అవసరమో అంత మేరకే ఆయుధాలు సమకూర్చుకుంటున్నాం" అని చెప్పి అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న రక్షణ వ్యయాన్ని సమర్థించుకోగలరు. ఇంతకన్నా రాజకీయ బూతు ఇంకొకటి ఉండదు. అసలు ఆయుధ పోటీయే మోసకారిది అయినప్పుడు దేశ అంతర్గత భద్రత కోసం, అంతర్జాతీయ ప్రయోజనాల కోసం అని చెప్పి ఇలా ఆయుధాలు గుట్టలు గుట్టలుగా పేర్చడానికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యడం అర్థరహితం.

సోవియట్ రష్యా మిలిటరీ వ్యయాన్ని అతిగా అంచనావేసి చూపించామని స్వయానా సి.ఐ.ఎ. 1984లో ఒక ఒప్పుకోలు ప్రకటన చేసింది. 1975 నుండి సోవియట్ రక్షణ వ్యయం ఏటా 4 నుండి 5 శాతం పెరుగుతూ ఉందని సిఐఎ లెక్క చెప్పేది. కానీ వాస్తవానికి

ఈ పెరుగుదల 2 శాతం మాత్రమే. ఈ రకమైన తప్పుడు లెక్కలతో, మోసకారితనంతో అమెరికా మిలిటరీ వ్యయాన్ని పెంచేసుకుంటూ పోయింది.

1989లో సోవియట్ రష్యా విచ్ఛిన్నం అయింది. ఇక 'సోవియట్ బూచి'ని చూపించినా జనాలు నమ్మే పరిస్థితి లేదు కాబట్టి మిలిటరీ బడ్జెట్‌ను కొంత తగ్గించినా మొత్తానికి రక్షణ వ్యయం మాత్రం భారీగానే ఉండేది. దీనికి రిపబ్లికన్లు, డెమోక్రాట్లు పార్టీల విభేదాలకు అతీతంగా వంత పాడేవారు. 1992లో ఆయుధ సేవల పార్లమెంటరీ కమిటీకి అధిపతిగా ఉన్న డెమోక్రట్ పార్టీ అభ్యర్థి లెస్ ఆస్పిన్ "మారిన అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా మిలిటరీ వ్యయంలో 2 శాతం కోత పెట్టాలని" సిఫార్సు చేసాడు. అంటే మిలిటరీ బడ్జెట్‌ను 281 బిలియన్ డాలర్ల నుండి 275 బిలియన్ డాలర్లకు తగ్గించారు. ఇదీ రక్షణ వ్యయం తగ్గింపులో దాగి ఉన్న రహస్యం.

ఆ ఏడాది అటు రిపబ్లికన్, ఇటు డెమోక్రట్ పార్టీల చట్టసభ ప్రతినిధులు మిలిటరీ వ్యయంలో 'మైనరు' కోతలకు మాత్రమే అంగీకరించారు. కాని ప్రజల ఆలోచనలు వేరేగా ఉన్నాయి. నేషనల్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన ఒక సర్వేలో తేలింది ఏమంటే– 59 శాతం మంది ప్రజానీకం ఏటా 10 శాతం చొప్పున రాబోయే ఐదేళ్లలో మిలిటరీ బడ్జెట్‌ను 50 శాతానికి తగ్గించాలని కోరుకున్నారు. కానీ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా వ్యవహరించారు పార్లమెంటు ప్రతినిధులు. ప్రజావాణిని పార్లమెంటులో వినిపించడంలో కూడా ఘోరంగా విఫలమయ్యారు ఈ 'ప్రజాప్రతినిధులు'(?). 1992 వేసంగిలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు కలిసి బడ్జెట్ వ్యయంలోంచి గణనీయమైన మొత్తాన్ని 'మానవీయ అవసరాల కోసం' బదిలీ చెయ్యడానికి అనుమతిస్తూ ఓటేసారు. ఏమిటా మానవీయ అవసరాలంటే 'ఐరోపా పరిరక్షణ' అట. 120 బిలియన్ డాలర్లు ఐరోపా పరిరక్షణ పేరిట ఖర్చు చేసారు. ఐరోపాకు సోవియట్ రష్యా నుండి ప్రమాదం పొంచి ఉంది అని ఇన్నేళ్లూ చెప్పుకొచ్చారు. ఇవాళ ఆ రష్యానే ముక్కుచెక్కలయిపోయి సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నాగానీ, 'ఐరోపా పరిరక్షణ' కోసం అంటూ అదీ మానవీయ అవసరాల పేరిట ఇంత భారీ మొత్తాన్ని దుర్వినియోగం చేసారు పాలకులు.

డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లు రెండు వేర్వేరు పార్టీలకు చెందిన వారయినా విదేశాంగ నీతి విషయంలో ఎక్కడ లేని ఐక్యత ప్రదర్శించేవారు. రీగన్–బుష్(సీ) హయాంలో అమెరికన్ ప్రభుత్వం విదేశాల్లో సైనిక జోక్యం పెంచడంలో చాలా దూకుడు తనం ప్రదర్శించింది. అనేక దేశాల్లో ప్రత్యక్ష సైనిక జోక్యానికి పాల్పడింది. మరికొన్ని దేశాల్లో అక్కడ ఉన్న పచ్చి మితవాద నియంతల ప్రభుత్వాలకు అండగా పరోక్షంగా జోక్యం చేసుకుంది.

నికరాగువాలో ప్రజా బాహుళ్య మద్దతుతో 'శాండినిస్టా ఉద్యమం' (1920ల నాటి విప్లవనాయకుడు అగస్టోశాండినో పేరిట మొదలైన ఉద్యమం) అమెరికా మద్దతుతో అధికారంలో కొనసాగుతున్న పచ్చి నియంతృత్వ, అవినీతికర 'సోమోజో' ప్రభుత్వాన్ని కూలదోసింది. శాండినిస్టా

ఉద్యమంలో మార్క్సిస్టులు, ఇతర వామపక్ష పార్టీలు, అభ్యుదయ జాతీయవాద శక్తులు సంకీర్ణ భాగస్వాములుగా ఉన్నారు. అధికారంలోకి రాగానే రైతులకు భూములు పంచడం, పేదలకు విద్యావైద్య సదుపాయాలు అందించడానికి పూనుకుంది శాండినిస్టా ప్రభుత్వం. నికరాగువాలో విప్లవం విజయవంతం అయిన కొన్నాళ్లకే అమెరికాలో రీగన్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. నికరాగువా ప్రజాప్రభుత్వ పోకడలలో 'కమ్యూనిస్టు ప్రమాదం' పొంచి ఉందని రీగన్ ప్రభుత్వం ఒక నిర్ధారణకు వచ్చింది. పైపెచ్చు మధ్య అమెరికా ప్రాంతంలో అప్పటిదాకా అప్రతిహతంగా సాగుతున్న అమెరికన్ ఆధిపత్యానికి శాండినిస్టా ప్రభుత్వం సవాలుగా పరిణమించిందని భావించి తక్షణమే ఆ ప్రభుత్వాన్ని కూలదోసే పనిలోకి దిగింది. సోమొజా ప్రభుత్వంలో ప్రజల ద్వేషాగ్నికి గురయిన 'నేషనల్ గార్డు' (ప్రభుత్వసైన్యం) నాయకులను చేరదీసి సిఐఎ మార్గదర్శకత్వంలో 'కాంట్రా'ల పేరిట ప్రతీఘాత విప్లవ శక్తులను పోగేసి శాండినిస్టా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎగదోసింది.

'కాంట్రా'లకు నికరాగువాలో ప్రజా పునాదీ లేదు. మద్దతూ లేదు. అందుకే పొరుగునే, అమెరికా ఆధిపత్యంలో ఉన్న మరో పేద దేశం హోండురాస్‌ను స్థావరంగా మార్చుకున్నారు. అక్కడ నుండి సరిహద్దులలోని గ్రామాలు. ఊళ్లమీద పడి మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా ఎవరిని పడితే వాళ్లను చంపడం, అకృత్యాలకు పాల్పడడం చేసేవాళ్లు.

'కాంట్రా'లకు కల్నల్‌గా పని చేసిన ఎడ్గార్ ఛమారో అప్పటి అకృత్యాల గురించి ప్రపంచకోర్టులో ఇలా వాంగ్మూలం ఇచ్చాడు-

"శాండినిస్టా ప్రభుత్వాన్ని ఓడించాలంటే కమ్యూనిస్టు తిరుగుబాటుదార్లు ప్రపంచంలో ఏమి చేస్తారో- కిడ్నాప్‌లు, దొంగతనాలు, చిత్రహింసలు, దోచుకోవడాలు, హత్యలు- ఆ ఎత్తుగడలను అనుసరిస్తే తప్ప కాంట్రాలకు వేరే మార్గం లేదని సిఐఎ మాకు నూరిపోసేది. అనేక మంది పౌరులు తడిగుడ్డలతో గొంతులు కోసే రీతిలో హత్యకావించబడ్డారు. ఇంకా అనేక మంది చిత్రవధలకు, మానభంగాలకు, దోపిడీలకు గురయ్యారు. నేను ఈ సంస్థలో చేరేటప్పుడు ఇది నికరాగువా ప్రజల కోసం నికరాగువాలు చేస్తున్న పోరాటం అనుకుని చేరాను. కానీ ఈ సంస్థ అమెరికా ప్రభుత్వం చేతిలో ఒక సాధనంగా మారిపోయింది."

నికరాగువాలో అమెరికా ప్రభుత్వం రహస్య కార్యకలాపాలు చేపట్టడానికి కారణాలు ఉన్నాయి. ప్రజాభిప్రాయ సర్వేలన్నీ ఆ దేశంలో అమెరికా సైనిక జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి. 1989లో సిఐఎ లాటిన్ అమెరికా ఏజెంట్ల సాయంతో నికరాగువా ఓడరేవులో ఉన్న నౌకలను పేల్చివెయ్యడానికి 'మైన్స్' అమర్చింది. ఈ రహస్యం బయటపడే సరికి రక్షణ శాఖ కార్యదర్శి పోన్‌బర్గర్ ఎబిసి న్యూస్‌తో మాట్లాడుతూ 'నికరాగువా ఓడరేవులని పేల్చి వెయ్యాల్సిన అగత్యం అమెరికాకు లేదు' అని చెప్పాడు.

ఆ తరువాత ఏడాదిలో, వియత్నాం యుద్ధకాలంలో చవిచూసిన ప్రజా వ్యతిరేకత దృష్టిలో పెట్టుకుని అమెరికన్ కాంగ్రెస్ ఒక తీర్మానం చేసింది. "అమెరికా ప్రత్యక్షంగాగానీ,

పరోక్షంగాగానీ, సైనికపరంగా గానీ, పారా మిలటరీ సాయంతోగానీ నికరాగువాలో ఎలాంటి జోక్యానికీ పూనుకోరాదు” అనేది ఆ తీర్మానం సారాంశం. అయితే ఈ తీర్మానాన్ని ఉల్లంఘించి మరీ రీగన్ ప్రభుత్వం కాంట్రాలకు రహస్యంగా తోడ్పడే పనికి పూనుకుంది. మధ్యవర్తుల ద్వారా నిధులు అందించే ఏర్పాట్లు చేసింది. అరబ్బు ప్రపంచంలోని ఏకైక మిత్రదేశమైన సౌదీ అరేబియా 'కాంట్రా'లకు 32 మిలియన్ డాలర్లు నిధులు ఇచ్చేలా చూసింది. గ్వాటిమాలా దేశాన్ని ఏలుతున్న సైనిక నియంతల సాయంతో కాంట్రాలకు విచ్చలవిడిగా ఆయుధాలు అందించింది. అమెరికా ఆర్థిక సాయం మీద ఆధారపడి ఉండే ఇజ్రాయిల్‌నూ ఇందుకు ఉపయోగపెట్టుకుంది.

1986లో బీరూట్ నుండి వెలువడే ఒక పత్రికలో వచ్చిన కథనం గొప్ప సంచలనానికి దారితీసింది. అమెరికా తన శతృదేశంగా భావించే ఇరాన్‌కు ఆయుధాలు అమ్మిందని, ఇందుకు బదులుగా లెబనాన్ ముస్లిం తీవ్రవాదుల చేతుల్లో బందీలుగా ఉన్న అమెరికన్లను విడిపించేందుకు ఇరాన్‌ను సాయం చెయ్యమని కోరిందని, ఈ ఆయుధాల అమ్మకం ద్వారా లభించిన లాభాలను కాంట్రాలు ఆయుధాలు సమకూర్చుకోవడానికి అందించింది అనేది ఆ వార్తా కథనం సారాంశం.

నవంబరు 1986లో ఈ విషయమై ప్రెసిడెంట్ రీగన్‌ను ఒక పత్రికా గోష్టిలో నిలదీస్తే సమర్థింపుగా అన్నీ అబద్ధాలే చెప్పాడు. ఇరాన్‌కు పంపిన 'షిప్‌మెంట్'లో నామకః కొన్ని యుద్ధ ట్యాంకు వ్యతిరేక మిస్సైళ్ళు మాత్రమే ఉన్నాయి. థర్డ్ పార్టీలు ఇరాన్‌కు షిప్‌మెంట్ పంపకూడదని అమెరికన్ ప్రభుత్వం ఏనాడూ ఆదేశించలేదు. బందీలను విడిపించుకోవడానికి బదులుగా ఆయుధాలను మారకం వెయ్యలేదు. ఒకవేళ ఆయుధాలు పంపామే అనుకున్నా అది ఇరాన్‌లోని మధ్యేవాద శక్తులతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి ఇది పనికొస్తుంది అని రీగన్ బదులిచ్చాడు. ఇంత పచ్చి అబద్ధాల పర్వం ఇంకాస్త ముందుగా మొదలయింది.

1986 అక్టోబరు నెలలో ఒక రవాణా విమానంలో కాంట్రాలకు ఆయుధాలు చేరవేస్తున్న విషయం పసిగట్టి నికరాగువా ప్రభుత్వం ఆ విమానాన్ని బలవంతంగా దించేసింది. ఆ విమానాన్ని నడుపుతున్న అమెరికన్ పైలట్‌ను బందీగా చిక్కించుకుంది. అయినా అమెరికన్ ప్రభుత్వం నిస్సిగ్గుగా అబద్ధాలు లంకించుకుంది. రక్షణశాఖ సహాయ మంత్రి ఇలియట్ అబ్రామ్స్, మంత్రి 'ఘుల్జ్'లు ఇద్దరూ 'ఈ ఉదంతంతో అమెరికాకు సంబంధం లేదని' బుకాయించారు. అయితే పట్టుబడ్డ పైలట్ తాను సిఐఎ తరఫున పనిచేస్తున్నట్లు వాంగ్మూలం ఇవ్వడంతో అమెరికా పాత్రకు సంబంధించి బలమైన సాక్ష్యాలు సమకూరాయి.

'ఇరాన్–కాంట్రా' ఉదంతం అమెరికా ప్రభుత్వం రక్షణ వ్యవహారాలలో అవలంబించే ద్వంద్వవైఖరికి స్పష్టమైన తార్కాణం. కళ్లెదుట కనిపించే వాస్తవాలను కాదనడమే తొలి ఆకర్షణ. సాక్ష్యాలు మరీ బట్టబయలయితే విచారణ జరిపిద్దాం అనే ప్రకటన ఇవ్వడం రెండో దశ. కానీ ఆ విచారణ ముందుకు సాగదు. విచారణకు సంబంధించి ప్రచారాన్ని మాత్రం 'ప్రెస్' మహామోత ఎక్కిస్తుంది. కానీ గుండెలోతు రహస్యాలను పొరబాటున కూడా తడమదు.

విదేశాంగ నీతిలో అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అమెరికా ప్రభుత్వం తాను రూపొందించుకున్న చట్టాలను తానే అనేకమార్లు ఉల్లంఘించిన చరిత్రకు 'ఇరాన్–కాంట్రా' ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే. 1973లో వియత్నాం యుద్ధం ముగింపుకు వచ్చిన దశలో పార్లమెంటు అమెరికన్ అధ్యక్షుడి అధికారాలను నియంత్రించడానికి ఇండోచైనా మీద చేసిన నిర్దాక్షిణ్యమైన బలప్రయోగాన్ని అడ్డుకోవడానికి ఒక చట్టం చేసింది.

' 'అమెరికా సైనిక బలగాలను తీవ్రమైన ఆటుపోటులు ఉన్న పరిస్థితుల్లోకి నడిపించడానికిగానీ, పరిస్థితుల రీత్యా అలాంటి ఆటుపోటులు ఎదురయ్యే అవకాశం ఉందనిపించినా గానీ దేశాధ్యక్షుడు సాధ్యమైన ప్రతిదశలో కాంగ్రెస్‌ను సంప్రదించాకే బలగాలను ముందుకు నడిపించాలి" అని ఆ చట్టం చెబుతుంది.

ఈ చట్టం అలా చేసారో లేదో అమెరికా అధ్యక్షుడు గెరాల్డ్‌ఫోర్డ్ ఇలా ఆ చట్టాన్ని త్రోసిరాజని కాంబోడియా ద్వీపాన్ని ఆక్రమించుకోవడానికి, ఆ పట్టణాన్ని బాంబులతో విధ్వంసం చెయ్యడానికి ఆదేశించాడు. మాయాగుయెజ్ అనే ఓడలో పనిచేస్తున్న ఒక అమెరికన్ నావికుడిని అక్కడి ప్రభుత్వం తాత్కాలికంగా నిర్బంధించి ఆనక వొదిలేసినా, ఆ సాకుమీద ఇలాంటి దారుణానికి ఒడిగట్టాడు. పైపెచ్చు ఈ దాడులకు ఆదేశాలు ఇవ్వడానికి ముందుగా కాంగ్రెస్‌ను మాట మాత్రం కూడా సంప్రదించలేదు.

అలాగే 1982 శీతాకాలంలో లెబనాన్‌లో అంతర్యుద్ధం భీకరంగా జరుగుతున్న నేపథ్యంలో అక్కడ నెలకొన్న తీవ్ర ప్రమాదకర పరిస్థితులను గమనంలోకి తీసుకోకుండా అధ్యక్షుడు రీగన్ అమెరికన్ మెరైన్లను అక్కడికి పంపాడు. 'యుద్ధ అధికారాల చట్టం' ప్రకారం కాంగ్రెస్‌ను సంప్రదించిన పాపాన పోలేదు. ఆ మరుసటి ఏడాదే అమెరికన్ సైనిక బ్యారక్స్ దగ్గర ఉగ్రవాదులు అమర్చిన బాంబుపేలి రెండు వందల మంది మెరైన్లు దుర్మరణం పాలయ్యారు.

ఈ గాయం ఆరక ముందే 1983 అక్టోబరు నెలలో కరీబియన్ ద్వీపాల్లోని అతి చిన్న దేశం అయిన గ్రెనెడాను ఆక్రమించడానికి అమెరికన్ సైన్యాన్ని పంపాడు రీగన్. (లెబనాన్‌లో పోయిన పరువు ప్రతిష్టల మీద ప్రజల దృష్టి నిలపకుండా, వారిని దారిమళ్లించేందుకు రీగన్ ఈ చర్య చేపట్టాడు అంటారు కొందరు విశ్లేషకులు). ఈ సందర్భంగా కూడా 'కాంగ్రెస్'ను ముందస్తుగా సంప్రదించలేదు. కాకపోతే ముందస్తు సమాచారం మాత్రం అందించాడు. ఈ ఆపరేషన్‌కు 'అర్జెంట్‌ఫ్యూరీ' (శీఘ్రకోపం) అని పేరుపెట్టారు. గ్రెనడా మీద దండెత్తి పోవడానికి గల కారణాలు ఏమిటని ఆరా తీస్తే– ఆ దేశంలో చెలరేగిన తిరుగుబాటు మూలంగా ఆ దీవులలో చదువుకుంటున్న అమెరికన్ విద్యార్థుల భద్రతకు రక్షణ కరువు అవొచ్చనే సందేహం వచ్చిందట. దానికి తోడు తూర్పు కరీబియన్ దేశాల సంస్థ అమెరికాను శీఘ్రమే జోక్యం చేసుకోవాలని అర్థించిందట.

అమెరికన్ ప్రభుత్వం చెప్పిన ఈ సాకుల్లోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతూ న్యూయార్క్ టైమ్స్ విలేఖరి బెర్నార్డ్ గ్వెర్ట్‌జ్‌మాన్ 1983 అక్టోబరు 29 సంచికలో సూటిగా, అసాధారణ రీతిలో ఒక వ్యాసం రాసాడు.

గత ఆదివారం నాడు తూర్పు కరిబియన్ దేశాల సంస్థ అమెరికా తదితర మిత్ర దేశాలను సైనిక సాయం అందించాల్సినదిగా పంపించిన అభ్యర్థన కూడా అమెరికా సూచన మేరకు పంపినదే. ఆ సంస్థతో ఉన్న ఒప్పంద సూత్రాలకు అనుగుణంగా రాతపూర్వక అభ్యర్థన అందితే తప్ప అమెరికా ఆ విషయాన్ని పరిశీలించే అవకాశం లేనందున అలాంటి అభ్యర్థన పంపించమని అడిగిందీ అమెరికానే. ఇంకా చెప్పాలంటే ఈ అభ్యర్థన పత్రం ఎలా ఉండాలనేది వాషింగ్టన్‌లోనే ఒక ముసాయిదా తయారు చేసి ప్రత్యేక దూత ద్వారా కరీబియన్ నాయకులకు పంపించారు."

అమెరికన్ నౌకలు బారులు తీరి గ్రెనడా దిక్కుకు రావడం కనిపెట్టి క్యూబా, గ్రెనడా దేశాలు రెండూ అమెరికన్ వైద్యవిద్యార్థుల క్షేమానికి మాది పూచీ, దయ చేసి గ్రెనడా భూభాగాన్ని దురాక్రమించే ఆలోచన విరమించుకోండి అని అమెరికన్ ప్రభుత్వానికి అత్యవసర సందేశం పంపించాయి. అయితే అమెరికన్ పాలకులు శాంతియుత మార్గాల ద్వారా ఆ విద్యార్థులను అక్కడ నుంచి క్షేమంగా దాటించే ఆలోచనే చెయ్యలేదు. గ్రెనడా అధికారులతో చర్చలకు ఏమాత్రం సుముఖత చూపించలేదు. అధ్యక్షుడు రీగన్ మాత్రం 'సరిగ్గా సమయానికి మనం జోక్యం చేసుకున్నాం' అన్నాడు. నిజానికి అమెరికన్ వైద్య విద్యార్థులను అక్కడ ఎవరైనా సతాయిస్తున్నారా, వాళ్ళు అక్కడ నుంచి రాదలచుకుంటే వీలుకాని పరిస్థితులు ఏమన్నా ఉన్నాయా, ప్రత్యక్షంగా సైన్యాన్ని ఆ దేశం మీదకు దండెత్తి పంపాల్సిన అవసరం ఉందా అన్న ప్రశ్నలకు అవునని సమాధానం చెప్పే ప్రబల సాక్ష్యాలు ఏమీ చూపకుండానే రీగన్ అలా ప్రకటించడం కన్నా నయవంచన ఇంకొకటి ఉండదు.

'వియత్నాం యుద్ధం మూలంగా ఎదురయిన పరాజయభారం నుండి తలెత్తుకు తిరగాలన్నా, అమెరికా తాను ఒక శక్తివంతమైన దేశాన్ని అని ప్రజలను, ప్రపంచ దేశాలనూ నమ్మించాలన్నా అమెరికా అర్జంటుగా ఏదో ఒకటి చేసి చూపాల్సిన అవసరం రీత్యా గ్రెనడాను బలిపెట్టింది' అని ప్రభుత్వ అత్యున్నత అధికారి ఒకరు గ్వెర్ట్‌జ్‌మాన్‌తో చెప్పాడు. 'ఊరికే గప్పాలు కొడుతూ, శక్తిని ప్రదర్శిస్తూ ఉంటే ఎలా? దాన్ని ఉపయోగపెడితేనే కదా అర్థం అయ్యేది.'

కరీబియన్ ప్రాంతంలో అమెరికా సైనిక జోక్యానికి పెట్టుబడిదారీ వ్యవస్థను మార్కెట్ చేసేదానికి మధ్యన ఉన్న 'బాదరాయణ సంబంధం జగమెరిగిన సత్యమే. అమెరికా గ్రెనడాను ఆక్రమించుకున్న ఎనిమిదేళ్ళ తరువాత వాల్ స్ట్రీట్ జర్నల్ (అక్టోబరు 29, 1991) సంచికలో 'బ్యాంకుల దురాక్రమణ' అన్న వ్యాసం ప్రచురించబడింది. గ్రెనడాలోని పెట్టుబడిదారుడు సెయింట్ జార్జి 7500 మంది సిబ్బందితో 118 బ్యాంకులకు అధిపతిగా దేశంలోని ప్రతి 64 మంది జనాభాకు ఒక బ్యాంకు చొప్పున 'సేవలు' అందిస్తున్నాడనే సమాచారం ఇచ్చారు. ఆ 'సేవలు' ఏంటో కూడా వివరించారు. 'నల్లధనం పోగెయ్యడానికి, పన్నుల ఎగవేతకు, ఆర్థిక మోసాలకు ఆలవాలంగా మారిన సెయింట్ జార్జి కరిబియన్ ప్రాంతపు 'కాసబ్లాంకా'గా ఎదిగాడు' అని ఆ పత్రిక పేర్కొంది.

కరిబియన్ సముద్ర ప్రాంత దేశాలలో అమెరికా సైనిక జోక్యం గురించి లోతైన అధ్యయనం చేసిన రాజకీయ శాస్త్రవేత్త స్టీఫెన్ షలోమ్ చివరకు తేల్చి చెప్పింది ఏమంటే– అమెరికా సైనిక జోక్యం చేసుకున్న సందర్భాలు అక్కడి అమెరికన్ జాతీయులను రక్షించే ఉద్దేశ్యంతో కాదు, అమెరికా జోక్యం చేసుకోకపోయినా వాళ్ళ క్షేమానికి వచ్చిన హాని ఏమీ లేదు. అయినా వాషింగ్టన్ ఇలా పదే పదే కరిబియన్ దేశాలలో జోక్యం చేసుకోవడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఆ ప్రాంతాన్ని తన అదుపు ఆజ్ఞలలో ఉంచుకోవడం. తన సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి అవసరమైతే హింసను రుద్దడానికయినా వెనుకాడని సంసిద్ధతను ప్రదర్శించడమే" ఇంకా చెప్పాలంటే– "నిజంగా అమెరికన్ పౌరులు ప్రాణాలు ప్రమాదంలో పడినప్పుడు.. ఉదాహరణకు ఎల్ సాల్వడార్‌లో ప్రభుత్వ ప్రాయోజిత హంతక ముఠాలు 1980లో నలుగురు చర్చి మహిళలను హతం చేసినప్పుడు అమెరికా చేతులు ముడుచుకు కూర్చుంది. అప్పుడు జోక్యం చేసుకోవడానికిగానీ, మెరైన్లను దింపడం గానీ, బాంబింగ్ చెయ్యడానికి గానీ ప్రభుత్వానికి మనసు రాలేదు. ఇంకా సిగ్గు చేటైన విషయం ఏమిటంటే కిరాయి హంతక ముఠాలతో రాజ్యం ఏలుతున్న ప్రభుత్వానికి వాషింగ్టన్ నుండి సైనిక, ఆర్థిక సహకారం సజావుగా అందింది. మిలిటరీ శిక్షణ అందించడానికి, ఇంటిలిజెన్స్ సమాచారం ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడానికి, రాయబార మద్దతు కూడగట్టడానికి వాషింగ్టన్ వెనుకాడలేదు."

ఎల్‌సాల్వడార్‌లో అమెరికా ఇలాంటి పాత్ర ఎందుకు పోషించింది? ఎందుకంటే ఆ దేశంలో 60 శాతం భూమి కేవలం 2 శాతం మంది చేతుల్లో ఉంది. వారికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం అధికారంలో ఉంటేనే ప్రజల బతుకులు ఎంత రోసిపోయినా అమెరికా వాణిజ్య వర్గాల ప్రయోజనాలకు మాత్రం ఏ ఢోకా ఉండదు. అందుకే అలాంటి ప్రభుత్వం కొమ్ముకాసింది అమెరికా. అమెరికా వ్యాపార ప్రయోజనాలకు ప్రమాదకరంగా పరిణమించే తిరుగుబాటుదార్లకు మెజారిటీ ప్రజల మద్దతు ఉన్నా అమెరికా మాత్రం కన్నెర్ర చేస్తుంది. 1932లో ఇలానే ఎల్‌సాల్వడార్‌లో అధికారం చలాయిస్తున్న సైనిక నియంతృత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా మద్దతుతో పెద్ద తిరుగుబాటు జరిగితే అమెరికా ఒక యుద్ధ వాహక నౌకను, రెండు 'డిస్ట్రాయర్' నౌకలను సైనిక ప్రభుత్వానికి అండగా పంపింది. ఈ అండ చూసుకునే ఆ సైనిక ప్రభుత్వం 30 వేల మంది సాల్వడార్ పౌరులను ఊచకోత కోసింది.

ఇలాంటి కళంకిత చరిత్రను తిరగరాయడానికి జిమ్మీకార్టర్ ప్రభుత్వం ఇసుమంత ప్రయత్నించలేదు. లాటిన్ అమెరికాలో సంస్కరణలను కోరుకుంది. కానీ అమెరికన్ కార్పొరేట్ ప్రయోజనాలు దెబ్బతింటాయేమో అన్న భయంతో అక్కడి విప్లవాలను అణగదొక్కడానికే చూసింది. 1980లో ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రిచర్డ్ కూపర్ పార్లమెంటులో మాట్లాడుతూ– ఇప్పుడు ఉన్న దానికన్నా మెరుగైన, అసమానతలను తగ్గించే సంపద వ్యవస్థ రావాలని కోరుకుంటున్నాం. అయితే ఇప్పుడున్న ఈ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒడిదుడుకులకు లోనయ్యే ప్రమాదమూ ఉంది. వ్యవస్థలో మౌలిక మార్పులు తీసుకురావడం మూలంగా మన సంక్షేమాన్ని మనం కూలగొట్టుకోలేం కదా' అన్నాడు.

1980 ఫిబ్రవరి నెలలో ఎల్ సాల్వడార్‌లో ఉన్న క్యాథలిక్ మత గురువు (ఆర్చిబిషప్) ఆస్కార్ రొమెరో అమెరికా అధ్యక్షుడికి వ్యక్తిగతంగా ఒక లేఖ పంపుతూ 'ఎల్ సాల్వడార్‌కు సైనిక సాయం నిలిపివేయాలని' అభ్యర్థించాడు. రొమెరో ఈ లేఖ రాయడానికి కొన్ని రోజుల ముందు మెట్రోపాలిటన్ క్యాథడ్రాల్ చర్చి ఎదుట గుమికూడిన అమాయక పౌరుల మీద జాతీయ భద్రతా దళాలు, పోలీసులు కలిసి కాల్పులు జరిపి 24 మందిని పొట్టన పెట్టుకున్నారు. అయినా జిమ్మీకార్టర్ ప్రభుత్వం ఎల్ సాల్వడార్‌లోని సైనిక ప్రభుత్వానికి సైనిక సాయం కొనసాగించింది. ఇది జరిగిన నెల రోజులలోపే ఆర్చిబిషప్ రొమెరో హత్యకు గురయ్యాడు.

మితవాద నాయకుడు రాబర్ట్ డి అముబిసన్ ఈ మత గురువు హత్యకు ఆదేశించాడనేందుకు కొండంత సాక్ష్యాలు ఉన్నాయి. అయితే అతగాడికి ప్రభుత్వ రక్షణ శాఖ ఉపమంత్రి నికోలాస్ కార్రాంజా వత్తాసు ఉంది. నికోలాస్ కార్రాంజా ఆనాటికి సిఐఎ నుండి ఏటా 90,000 డాలర్ల పారితోషికం అందుకుంటూ ఉన్న మనిషి. ఏతావాతా మానవహక్కుల మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి మత గురువు రొమెరో హత్యలో అముబిసన్ ప్రమేయం లేదని తేల్చేసాడు. కార్టర్ తరువాత రీగన్ అధికారంలోకి వచ్చాడు. ఎల్‌సాల్వడార్ సైనిక ప్రభుత్వానికి అందే సాయం భారీగా పెరిగింది. 1946 నుండి 1979 వరకూ ఆ సైనిక ప్రభుత్వానికి అమెరికా నుండి అందిన మొత్తం ఆర్థిక సాయం 16.7 మిలియన్ డాలర్లు, కాగా రీగన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదే ఈ సాయం 82 మిలియన్ డాలర్లకు పెరిగింది.

ఎల్‌సాల్వడార్‌లో జరుగుతున్న అమానుష హత్యాకాండ దృష్ట్యా అమెరికన్ ప్రభుత్వం ఇక మీదట ఎల్ సాల్వడార్ సైనిక ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక సాయం అందించాలన్నా అధ్యక్షుడే స్వయంగా అక్కడ మానవ హక్కులు సక్రమంగా అమలు జరుగుతున్నాయని 'సర్టిఫై' చెయ్యాలని పార్లమెంటు తీర్మానించింది. అయితే రీగన్ ఈ తీర్మానాన్ని అసలు సరకు చెయ్యలేదు. 1982 జనవరి 28న ఎల్ సాల్వడార్ సైనిక ప్రభుత్వం అనేక గ్రామాల్లో రైతుల ఊచకోతకు పాల్పడిందనే నిర్ధారిత వార్తలు వెలువడ్డాయి. ఇది జరిగిన మరుసటి రోజే సాల్వడార్ ప్రభుత్వం మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడడం లేదని రీగన్ సర్టిఫికేట్ ఇచ్చాడు. ఆ తర్వాత మరి మూడ్రోజులకే సాల్వడార్ సైనికులు పేదల కొంపల్లో జొరబడి ఇరవై మందిని బయటకు ఈడ్చుకొచ్చి కాల్చి చంపారు.

ఈ వ్యవహారం అంతా గమనించి 'సర్టిఫికేషన్' కోసం పార్లమెంటు ఒక చట్టం చేసింది. 1983 చివరి దశలో పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టాన్ని రీగన్ తన 'వీటో' అధికారాలతో బుట్టదాఖలా చేసాడు.

రీగన్ హయాంలో పత్రికా ప్రజాస్వామ్యం బిక్కుబిక్కుమంటూ బతికింది. 'మోకాళ్లదండ' (ఆన్ బెండెడ్‌నీ) అన్న పుస్తకంలో మార్క్‌హెర్ట్స్‌గార్డ్ ఆ వివరాలన్నీ గ్రంథస్తం చేసాడు. రేమాండ్

బోనర్ అనే విలేఖరి ఎల్‌సాల్వడార్‌లో జరుగుతున్న సైనిక ఆకృత్యాల గురించి, అందులో అమెరికా పాత్ర గురించి న్యూయార్క్ టైమ్స్‌లో నిరంతర కథనాలు వెలువరించాడు. ఒక దశలో ఆ పేపరు అతణ్ణి ఆ బాధ్యతల నుండి తొలగించింది. అమెరికాలో శిక్షణ పొందిన ఒక సైనిక బెటాలియన్ 'ఎల్ మోజోటె' పట్టణంలో వందలాది మంది అమాయక పౌరులను ఊచకోత కోసిన విషయాన్ని బోనర్ 1981లో వెలుగులోకి తెచ్చాడు. అయితే రీగన్ ప్రభుత్వం అదంతా ఒక కట్టుకథ అని కొట్టిపారేసింది. అయితే 1992లో ఫోరెన్సిక్ జీవ శాస్త్రవేత్తలు కొందరు ఆ ప్రాంతంలో అనేక మానవ కంకాళాలను వెలికితీసారు. అందులో అనేకం పిల్లల కంకాళాలు. ఆ మరుసటి ఏడాది ఐక్యరాజ్య సమితి నియమించిన కమిషన్ ఒకటి 'ఎల్ మోజోటె'లో సామూహిక హత్యాకాండ జరిగిన విషయాన్ని ధృవీకరించింది.

అమెరికాతో స్నేహపూర్వక, సన్నిహిత సంబంధాలు కొనసాగించినంతకాలం లాటిన్ అమెరికా దేశాలలోని సైనిక నియంతృత్వ ప్రభుత్వాల పట్ల (గ్వాటిమాలా, ఎల్ సాల్వడార్, చిలీ) రీగన్ ప్రభుత్వం ఎలాంటి ఉలికిపాటునూ ప్రదర్శించలేదు. అదే ఏ సైనిక ప్రభుత్వమైనా అమెరికా ప్రయోజనాలకు ఎదురు తిరిగితే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసేది. లిబియాలో మహమ్మద్ గడాఫీ ప్రభుత్వం పట్ల అమెరికా పాలకులు ఆందోళన పడేది ఈ కారణాల రీత్యానే. 1986లో పశ్చిమ బెర్లిన్‌లోని ఒక డిస్కో క్లబ్ మీద గుర్తు తెలియని ఉగ్రవాదులు చేసిన దాడిలో ఒక అమెరికన్ మాజీ సైనికుడు మరణించాడు. దీనికి వెంటనే ప్రతీకారం తీర్చుకోవాలని అమెరికా నిర్ణయించింది. పశ్చిమ ఐరోపా దేశాల్లో ఎక్కడ ఉగ్రవాదులు దాడులు జరిగినా అమెరికా గడాఫీని వేలెత్తి చూపేది. ఐతే ఏనాడూ గడాఫీకి వ్యతిరేకంగా వీసమెత్తు సాక్ష్యాన్ని లోకానికి వెల్లడి చెయ్యలేదు. ఈ దఫా కూడా అదే తంతు. కానీ ఈ సారి మాటలు కాదు చేతల్లో చూపించాలని రీగన్ భావించాడు. లిబియా దేశ రాజధాని ట్రిపోలి నగరం మీదకు యుద్ధ విమానాలను పంపించాడు. గడాఫీ నివాసం మీద బాంబులు వేయమని ఆజ్ఞాపించాడు. విమానాలు కురిపించిన బాంబుల మూలంగా దాదాపు వందమంది పౌరులు మరణించి ఉంటారని రాయబార వర్గాలు అంచనా వేసాయి. ఈ దాడుల్లో గడాఫీకి ఏం కాలేదుగానీ, అతని దత్తపుత్రిక ప్రాణాలు కోల్పోయింది.

'ఇంపీరియల్ ఎలిబీస్' (సామ్రాజ్యవాదం సాకులు) అన్న పుస్తకంలో ప్రొఫెసర్ స్టెపాన్ షా లీమ్ ఈ ఘటన మీద వ్యాఖ్యానిస్తూ "నిరాయుధ లక్ష్యాల మీద జరిగే రాజకీయ ప్రేరేపిత హింసాకాండను ఉగ్రవాదంగా మనం నిర్వచించుకుంటున్నాం. చెప్పాలంటే, లిబియా మీద అమెరికా చేసిన వైమానిక దాడులు అటువంటి తీవ్రమైన అంతర్జాతీయ ఉగ్రవాదానికి ఒక సజీవ ఉదాహరణ" అన్నాడు.

... ... ...

ఏతావాతా అమెరికా విదేశాంగ విధానం సోవియట్ రష్యా ఉనికి మూలానే ఇలా ఉండేది అని భావించే వారందరూ, అది సరికాదు ప్రపంచంలో ఏమూల విప్లవం సిద్ధించే

అవకాశం ఉన్నా అమెరికా కలవరపాటుతో ఇలా దురాక్రమణపూరిత విధానాలు అవలంబిస్తుందని అర్థం చేసుకోసాగారు. అభ్యుదయ సామాజిక శాస్త్రవేత్త నోమ్‌ఛోమ్‌స్కీ ఏనాడో ఈ విషయం స్పష్టం చేసాడు– “దేశ రక్షణ పేరిట చేసే అప్పీళ్లన్నీ మోసపూరితమైనవే. ప్రచ్ఛన్న యుద్ధబూచిని అడ్డం పెట్టుకుని యూరప్‌లోగాని, జపాన్‌లోగానీ ఇతర తృతీయ ప్రపంచ దేశాల్లోగాని తలెత్తుతున్న జాతీయవాద స్వాతంత్ర్యేచ్ఛని అణగదొక్కడానికి అమెరికా తాను చేపట్టే చర్యలను సమర్థించుకుంటుంది” అని వ్యాఖ్యానించాడు.

జాతీయవాద స్వాతంత్ర్య భావన శక్తివంతమైన అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు నష్టం చేకూరుస్తుందని దాని భయం. నికరాగువాలోనో, క్యూబాలోనో, చిలీలోనో, ఎల్ సాల్వడార్‌లోనో విప్లవం స్థిరపడి పోయిందంటే యునైటెడ్ ఫ్రూట్, అనకొండ కాపర్, ఇంటర్నేషనల్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ తదితర అమెరికన్ బహుళ జాతి కంపెనీలకు దెబ్బ తగిలినట్లే. అందుకే అమెరికన్ పాలకవర్గాలు ఏ విదేశంలో సైనిక జోక్యం చేసుకోవాల్సి వచ్చినా ‘జాతీయ ప్రయోజనాల కోసం’ తప్పడం లేదని ప్రజలను నమ్మించేందుకు బలమైన ప్రచారం చేస్తాయి. జాతీయ ప్రయోజనాలంటే ఇందాక మనం చెప్పుకున్న తరహా బహుళజాతి కంపెనీ ప్రయోజనాలన్న మాట. దానికోసం ప్రజలు పన్నుల రూపంలో డాలర్లను, యుద్ధ సేనల రూపంలో కొడుకులను త్యాగం చెయ్యాలి.

ప్రచ్ఛన్న యుద్ధ ప్రమాదం తొలగిపోయినా ఇంకా సిఐఎ లాంటి సంస్థలు మనుగడ సాగిస్తున్నాయి. తన ఉనికి అవసరం అని రుజువు చేసుకుంటూ ఉన్నాయి. ఈ విషయమై న్యూయార్క్‌టైమ్స్ పత్రిక (1992 ఫిబ్రవరి 4) సంచిక ఇలా వ్యాఖ్యానించింది– ‘రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలం నుండి మనం శత్రువుగా చెప్పుకొస్తున్న దేశం (రష్యా) కుప్పకూలిపోయింది. కానీ ఆ బూచిని చూపి ఇప్పటిదాకా వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేసి స్థాపించుకున్న సిఐఎ, దాని సోదర సంస్థలు, సముపార్జించి పెట్టుకున్న గూఢచారి ఉపగ్రహాలు, కొండకోనల్లోని రహస్య స్థావరాలు, గుట్టల కొద్దీ డాక్యుమెంట్లు ఇవన్నీ కూడా ఇవాళ ప్రాసంగికతను కోల్పోలేదని అమెరికన్ ప్రజానీకం మనసుల్లో ఇంకించడానికి ఏదో ఒక నెపం దొరుకుతూనే ఉంది.”

మిలిటరీ బడ్జెట్ భారీగా కొనసాగుతూనే ఉంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో 300 బిలియన్ డాలర్లు ఉండే మిలిటరీ బడ్జెట్ ఆ తరువాత కాలంలో 280 బిలియన్ డాలర్లకు స్వల్పంగా తగ్గింది. త్రివిధ దళాల అధిపతి కొలిన్ పావెల్ ఏమో ‘మిగిలిన ప్రపంచంలో ఉన్న నరకాల్ని భయపెట్టి పారదలుచుకున్నాం. ఇదేదో నేను ఆషామాషీగా చెప్పడం లేదు’ అంటాడు. మరో పక్కనుండి బుష్ అధికార యంత్రాంగమేమో భారీ మిలిటరీ బడ్జెట్ అవసరాన్ని ఒప్పించేందుకే అన్నట్లు ‘పనామా’ దేశం మీద తేలికపాటి యుద్ధానికి, ‘ఇరాక్’ మీద సుదీర్ఘ యుద్ధానికి తెరతీసింది.

యుద్ధానికి కాలు దువ్విన తొలిరోజు నుండి అమెరికా అధికారగణం, మీడియా కలిసి సద్దాంను మరో హిట్లర్‌గా చిత్రించేందుకు రోజుకు ఇరవై నాలుగు గంటలకు పైగా కృషి

చేసాయి. బాగ్దాద్‌లో అడుగుపెట్టడమే తరువాయి అన్నదశలో యుద్ధాన్ని విరమించి సద్దాంను గద్దెమీద కొనసాగించింది. అప్పట్లో అమెరికా ఉద్దేశం సద్దాంను బలహీనపరచడమే తప్ప అతని అడ్డు తొలగించుకోవాలి అనుకోలేదు. ఇరాన్ పక్కలో బల్లెంలా ఇరాక్‌ను వాడుకోవడమే అమెరికా లక్ష్యం. నిజానికి గల్ఫ్ యుద్ధ సమయంలో అమెరికా అటు ఇరాన్‌కు, ఇటు ఇరాక్‌కు రెండు చేతులా ఆయుధాలు అమ్మింది. బలాబలాల పొందికను సరిచూసుకునే వ్యూహంతో ఒకసారి ఇరాన్‌ను ఇంకొకసారి ఇరాక్‌ను మరోసారి ఇరాన్‌ను తర్వాత ఇరాక్‌ను ఇలా వంతులవారీగా బలపరుచుకుంటూ వచ్చింది.

అందుకే యుద్ధం చివరి దశలో ఇరాకీ అసమ్మతి వాదులు సద్దాం ప్రభుత్వాన్ని కూలదొయ్యాలని చేసిన ప్రయత్నాలకు అమెరికా మద్దతు ఇవ్వలేదు. 1991 మార్చి 21 న్యూయార్క్ టైమ్స్ సంచికలో వచ్చిన వార్త సారాంశం ఇదీ– "అధ్యక్షుడు సద్దాం అమెరికా జోక్యం అవసరం లేకుండానే ఇరాక్ ముక్కచెక్కలు కాకుండా కాపాడుకోవడానికి గాను దేశంలోని తిరుగుబాట్లను అణచివేసుకోవడం ఉపయుక్తం, ఉత్తమం అని ప్రెసిడెంట్ జార్జిబుష్ అధికారిక, ఆంతరంగిక సమావేశాల్లో ఈ రోజు స్పష్టం చేసారు."

దీంతో సద్దాం హుస్సేన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీసిన కుర్దిష్ మైనారిటీలు నిస్సహాయులైపోయారు. సద్దాం వ్యతిరేక వర్గాల్లో ముఖ్య నాయకులందరూ ఉరితాళ్లకు వేలాడారు బాగ్దాద్ పురవీధుల్లో. "నిజానికి ఇరాకీ సైన్యంలో గోడదాటుడు వ్యవహారం భారీగానే చోటుచేసుకునేది. కానీ ఎప్పుడైతే వైరిపక్షానికి అమెరికా మద్దతుగా నిలిచేలా లేదని స్పష్టం అయిందో ఈ కప్పదాటు వ్యవహారం అంతా సద్దుమణిగి పోయింది" అని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వెల్లడి చేసింది.

జిమ్మీ కార్టర్‌కు భద్రతావ్యవహారాల సలహాదారుగా ఉన్న జెబిన్యూ బ్రెజ్‌నెస్కీ గల్ఫ్ యుద్ధం ముగిసిన నెలరోజులకు చల్లగా ఈ యుద్ధం మూలాన ఒనకూడిన లాభ నష్టాలను అంచనా వేసాడు– "ఎవ్వరూ నిరాకరించవీల్లేనంత గొప్ప లాభాలు ఒనగూడాయి. పచ్చి దురాక్రమణ వాదాన్ని తిప్పికొట్టాం, తగిన విధంగా శిక్షించాం, ఇది మొదటి లాభం. ఇక నుండి అమెరికా సైనిక శక్తిని ఎవరూ తేలిగ్గా తీసిపారెయ్యలేరు. ఇది రెండవ లాభం. మధ్య ప్రాచ్యం, పర్షియాగల్ఫ్ ప్రాంతంలో ఇహ నుండి అమెరికాకు ఎదురే ఉండదు. ఇదీ మూడవ లాభం" అని వివరించాడు.

అయితే బ్రెజ్‌నెస్కీ 'కొన్ని ప్రతికూల పరిణామాల సంభావ్యత పట్ల కూడా ఆందోళన వ్యక్తం చేసాడు. 'ఇరాక్' మీద భారీ స్థాయిలో నిర్వహించిన గగనతల దాడుల తీవ్రత మూలంగా అరబ్బుల ప్రాణాలంటే అమెరికాకు లెక్కపత్రం లేకుండా పోయింది అనే అభిప్రాయం ప్రబలడానికి ఒక సాక్ష్యంగా నిలిచే ప్రమాదం ఉంది. ఫలితంగా ఇంతటి తీవ్ర స్థాయిలో విరుచుకుపడాల్సిన అవసరం ఉందా అనే నైతిక ప్రశ్న తలెత్తేందుకూ అవకాశం ఉంది' అన్నాడు.

బెజెనెస్కీ వాడిన 'అరబ్బుల ప్రాణాలంటే లెక్కలేనితనం' అన్న పదం అమెరికాలో గల్ఫ్ యుద్ధ కాలంలో చెలరేగిన అరబ్బు వ్యతిరేక జాత్యహంకారానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అరబ్-అమెరికన్‌ల మీద లెక్కలేనన్ని దాడులు జరిగాయి. చంపుతామని బెదిరింపులు. ఆఖరుకు కారు బంపర్లమీద 'ఇరాకీ ఎదురుపడితే నేను బ్రేకులు నొక్కను' అన్న స్టిక్కర్లు... ఇలా ఒకటేమిటి జాత్యహంకార వికృత ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. ఒహియోలో ఇలాంటి దాడుల మూలంగా అరబ్- అమెరికన్ వ్యాపారవేత్త ఒకరు మరణించాడు కూడా.

బ్రెజెనెస్కీ అభిప్రాయాలు గల్ఫ్ యుద్ధం మీద డెమొక్రటిక్ పార్టీ అభిప్రాయాలుగా మనం పరిగణించవచ్చు. బుష్ అధికార యంత్రాంగం కూడా దీనికి అనుగుణంగానే నడుచుకుంది. ఫలితాల పట్ల ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. పౌర మరణాల సంఖ్యను తక్కువ చేసి చూపించింది. ఎక్కడా వ్యతిరేకత లేకుండా సర్దుకుంది. ప్రెసిడెంట్ జార్జిబుష్ అయితే పట్టలేని సంతోషం వ్యక్తం చేసాడు. 'వియత్నాం పీడకలను మనం అరేబియా ద్వీపకల్పాల ఎడారుల్లో శాశ్వతంగా సమాధి చేసాం' అని ఓ రేడియో ప్రసంగంలో ప్రకటించాడు.

సర్కారు బాకాగా ఉండే మీడియా కూడా తందానా పాడింది. దేశంలో ప్రముఖ దినపత్రికలయిన టైమ్, న్యూస్‌వీక్ పత్రికలు ఈ విజయాన్ని శ్లాఘిస్తూ ప్రత్యేక సంచికలు వెలువరించాయి. పరిమిత సంఖ్యలో (అంటే కొన్ని వందలు) అమెరికా సైన్యానికి నష్టం జరిగినందుకు హర్షం ప్రకటించాయి. కానీ ఇరాకీ సైనికులు, అమాయక పౌరుల మరణాల సంఖ్యను ఏమాత్రం బయటకు పొక్కనీయలేదు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంపాదకీయంలో (1991 మార్చి 30 సంచిక) గల్ఫ్ విజయాన్ని వేనోళ్ల శ్లాఘించింది- "పర్షియా గల్ఫ్ యుద్ధంలో అమెరికా సైన్యం అద్భుతమైన తుపాకి బలంతో సాధించిన ఈ గొప్ప విజయం, ఇప్పటికీ రక్త మోడుతున్న వియత్నాం యుద్ధ గాయాలను ప్రజల మనసుల్లోంచి శాశ్వతంగా తుడిచి పెడుతుంది" అన్న విశ్వాసం వ్యక్తం చేసింది.

# 9

# ఆగామి తిరుగుబాటు

**చ**రిత్ర పుస్తకాల గుట్టల బరువు కింద కుంగిపోతూ, దేశము దేశభక్తులు చూపించిన మార్గంలో గౌరవంగా వణికిపోతూ, లొంగిపోయేలా కుంగదీయబడే క్రమంలో మనం నిలదొక్కుకుని వెన్ను నిటారుగా నిలుపుకుని నిలబడాలంటే, అనుద్దేశ పూర్వకంగా ఇంతకాలం ఈషణ్మాత్రం గౌరవించని ప్రజా ఉద్యమాల ఆసరానే కావాలి.

ఇప్పుడు చలామణిలో ఉన్న చరిత్ర అంతా జాతి నిర్మాతలు, దేశాధ్యక్షులు చుట్టూ అల్లిన చరిత్రయే. సామాన్య వీరుడు స్పందించగలిగే శక్తిని అణగదొక్కిన చరిత్రయే. సంక్షుభిత కాలాల్లో మనల్ని రక్షించేందుకు ఏ దైవదత్త మహానుభావుడి రాక కోసమో ఎదురు చూడాలని ఉద్బోధించేవే. స్వాతంత్ర్య విప్లవ కాలంలో జాతి నిర్మాతలు, బానిస తిరుగుబాట్ల కాలంలో ఒక అబ్రహం లింకన్, మహా మాంద్యం అలుముకున్న కాలంలో ఒక రూజ్‌వెల్ట్, వియత్నాం-వాటర్ గేట్ సంక్షోభాల కాలంలో ఒక కార్టర్... ఇలా ఎవరో ఒకరి కోసం మనం ఎదురుచూడాలి. దేశం ఇలా ఒక సంక్షోభం లోంచి ఇంకో సంక్షోభంలో కూరుకుపోతున్నా రెండు సంక్షోభాల మధ్య ఉన్న కాలాన్ని చూపించి మనకి మనం సర్దిచెప్పుకుంటూ, 'రాజ్యం సుభిక్షంగా ఉంది' అని అనుకోమంటున్నారు. పౌరునిగా మనకు ఉన్న ఏకైక పరమోన్నత కర్తవ్యం ఏమిటంటే మన ముందు ఇద్దరు అభ్యర్థులను నిలబెట్టి - వాళ్లిద్దరూ కూడా ఒకే కుదురు నుండి పుట్టిన రెండు కొమ్మల్లా, అత్యంత ధనిక శ్వేతజాతి కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లయి, ఒకే రకపు ఛాందస భావాలకు ప్రతినిధులయినా సరే - ఆ ఇద్దరిలో ఎవరో ఒకర్ని మన 'రక్షకుని'గా ఎన్నుకోవడమే.

ఈ 'రక్షకుడు' అనే భావన రాజకీయాలకే పరిమితం కాలేదు. మన సంస్కృతిలో ఒక భాగం అయిపోయింది. మన బలాన్ని తాకట్టు పెట్టేసి, మన శక్తిని మనమే తక్కువ చేసుకుని, మనల్ని మనమే నీడల చాటుకు నెట్టేసుకుంటూ స్టార్లు, లీడర్లకేసి చూడ్డానికి అలవాటుపడిపోయాం. అయితే గతంలో అనేక సందర్భాల్లో ఈ భావదారిద్ర్యాన్ని వదిలించుకుని

తిరగబడిన ఘట్టాలూ ఉన్నాయి. అయితే ఈ తిరుగుబాట్లను పాలకవర్గాలు కట్టడి చేసాయి. ప్రపంచ చరిత్రలోనే అత్యంత నియంత్రిత వ్యవస్థ అమెరికన్ ప్రజాస్వామిక వ్యవస్థ. అపారమైన ప్రకృతి వనరులు. అద్భుతమైన మేధస్సు– శ్రామిక శక్తిగల ఈ వ్యవస్థ సంపద పంపిణీ ద్వారా ప్రజల అసంతృప్తిని అలజడి చేసే కొద్దిపాటి మైనారిటీ స్థాయికి కట్టడి చెయ్యగలదు. అమెరికా చాలా శక్తివంతమైన, పెద్దదేశం. వివిధ తరగతుల పౌరులను వివిధ రకాలుగా సంతృప్తి పరచగలదు. అసంతృప్తులకు తమ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛను ఇవ్వగలదు. అవకాశాలు, రాయితీలు, ఉదారత్వం, ఎంపిక చేసిన వారికి రివార్డులు, అదృష్టం కలిసి వస్తే తగిలే మిలియన్ డాలర్ల లాటరీలు – ఇలా ఒకటేమిటి సర్దుకుపోవడానికి ప్రతి మనిషికీ ఎన్నో మార్గాంతరాలు. ఇహ సంక్లిష్టమైన నియంత్రణా పద్ధతులకూ కొదవేలేదు. పని పరిస్థితులు, ఓటింగ్ విధానం, చర్చి, కుటుంబం, స్కూలు, మీడియా– ఇవన్నీ జమిలిగా ప్రజలలో పొడసూపే తిరుగుబాటు ధోరణులను అణిచివేస్తాయి. మనిషిని మనిషికి కాకుండా చేస్తాయి. అది కూడా దేశభక్తి, దేశం పట్ల అనురక్తి సృష్టించే పేరిట నడిపిస్తాయి.

ఈ దేశంలో ఒక్క శాతం ప్రజానీకం యావత్ దేశ సంపదలో మూడో వంతును హక్కుభుక్తం చేసుకున్నారు. మిగిలిన సంపద కూడా 99 శాతం మందికి చేరే తీరు ఎలా ఉంటుందంటే ఈ 99 శాతం మందికీ ఒకరి మీద ఒకరికి గుర్రుగా ఉంటుంది. కొద్దిపాటి ఆస్తులు ఉన్న వాళ్లకు ఆస్తులు లేని వాళ్లంటే పడదు. నల్ల జాతీయులకు తెల్లవాళ్లకు పడదు. స్థానికులకు వలస ప్రజలంటే గుర్రు. మేధావులకు, వృత్తి నిపుణులకు, విద్య లేని వాళ్లన్నా నైపుణ్యం లేని వాళ్లన్నా ఈసడింపు– వీరికి వారి మీదా, వారికి వీరి మీదా ఏవగింపు. కోట్లకు పడగలెత్తిన వాళ్లు దోచుకోగా, దాచుకోగా మిగిలిన అస్తుబిస్తు సంపద కోసం ఒకరిమీద ఒకరు జాతివైరానికి దిగినట్లు హింసాత్మకంగా తన్నులాడడం షరా మామూలుగా నడిచే వ్యవహారం.

'నూతన రాజ్యాంగాన్ని మెజారిటీ వర్గం నియంత్రిస్తుందేమో' అని దేశ నిర్మాతల్లో ఒకరైన మాడిసన్ భయపడ్డాడు. అతను, అతని సహవాసులు కల్సి అమెరికన్ రాజ్యాంగ ప్రతిజ్ఞను ఈ మాటలతో మొదలుపెట్టారు. “అమెరికన్ ప్రజలమైన మేము.. కొత్త ప్రభుత్వం సకల జనుల పక్షాన నిలుస్తుందని ఆశిస్తున్నాము. ఇలాంటి మిథ్యను ఒక వాస్తవంగా అంగీకరిస్తే దేశ అంతర్గత భద్రతకు ఢోకా ఉండదని భావిస్తున్నాము.

ఈ ఆశ తరతరాలుగా ఆశగానే కొనసాగుతూ వస్తుంది. జెండా, దేశభక్తి, ప్రజా స్వామ్యం, దేశ ప్రయోజనాలు, దేశ రక్షణ, దేశ భద్రత ఇలా ఎన్నో భౌతిక, వాచ్య సంకేతాల చుట్టూతా ఈ ఆశను నడిపిస్తున్నారు. నిక్సన్ అజ్ఞాతంలోకి కనుమరుగు కావడం, దేశ స్వాతంత్ర్య ద్విశతాబ్ది ఉత్సవాలు, కార్టర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం– ఇవన్నీ పరిస్థితులను

పునరుద్ధరించడానికి ఉద్దేశించినవే. అయితే ఇవాళ దేశంలో నెలకొన్న అనిశ్చితిని తొలగించడానికి పాత వ్యవస్థను పునరుద్ధరించడం పరిష్కారం కాదు. రీగన్–బుష్ హయాంలో ఈ పరాయీకరణ భావం మరింత పెరిగిపోయింది. 1992లో 'మార్పు కోసం' అనే ఓటి నినాదంతో క్లింటన్ అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యాడు. కాని ఆశాజీవుల అంచనాల మేరకయినా మార్పు సాధించడంలో విఫలమయ్యాడు.

ఇన్ని దౌర్భాగ్యాల పరంపర మధ్యన పాలకవర్గాలకు – కార్పొరేట్ సంస్థల సి.ఇ.ఓ.లు, సైనిక జనరల్స్, రాజకీయ నాయకులు – జాతి నిర్మాతలు పాదుకొల్పిన ఆశావహ దృక్పథం పట్ల దేశ ప్రజానీకంలో సమైక్యతా దృష్టిని నెలకొల్పడం కీలక ప్రాధాన్యతగా మారిపోయింది. అందుకే ప్రజలంటేనే ప్రభుత్వం, ప్రభుత్వానికి – ప్రజలకు ఉమ్మడి శత్రువు సరిహద్దులకు ఆవల ఉన్నాడు. ఆ శత్రువుతో పోరాడే క్రమంలో జరిగే యుద్ధాలూ, తలెత్తుతున్న ఆర్థిక సంక్షోభాలూ దురదృష్టకరమైన తప్పిదాలుగానో, విషాదాంత అనూహ్య సంఘటనలుగానో భావించాలనే కొత్త ప్రచారాన్ని లంకించుకున్నాయి. సంపద, ఆదాయాల విషయానికి వచ్చేసరికి నూటికి తొంబై తొమ్మిది మంది వెయ్యిన్నొక్క విధాలుగా చీలిపోయి పరస్పర ద్వేషంతో రగిలిపోతూ ఉండేలా చేసిన ఈ పాలకవర్గాలే స్వకార్యం–స్వామికార్యానికి వచ్చేసరికి ఈ 99 శాతం మంది కూడా 'శతృవుతో పోరాటం' విషయానికి వచ్చేసరికి గరిష్ట ఐక్యతతో తమకు అండదండగా నిలవాలని పాలకవర్గాలు కోరుకోవడం అన్నింట్లోకెల్లా విచిత్రం. పేదవాళ్ల సంక్షేమం కోసం అంటూ మధ్య తరగతి ఆదాయవర్గాల మీద పన్నులు వేసి పేదల పట్ల తూష్ణీభావాన్ని, నరనరాన వ్యతిరేకతను పెంపొందించడంలో ఎంతలా ఆరితేరిపోయాయి పాలకవర్గాలు.

ఏది ఏమైనా తాత్కాలికమైన స్థానిక ప్రతిఘటనోద్యమాలు సాధించిన అనూహ్య విజయాలు ఒక రకంగా ప్రజలు ఎంత శక్తివంతులో తెలియ చెప్పేందుకు ప్రబల తార్కాణాలుగా నిలుస్తాయి. అయితే అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశంలో లక్షలాది ప్రజానీకానికి ఏదో ఒక ప్రతిఫలం అందేలా చూసి వారందరూ పాలకవర్గాలకు విధేయులుగా, వినయంగా ఉండేలా చూసుకోకపోతే బండి నడపడం కష్టం. సైనికులకు, పోలీసులకు, అధ్యాపకులకు, మంత్రులకు అధికార యంత్రాంగ భాగస్వాములకు, సామాజిక కార్యకర్తలకు, కార్మికులకు, చెత్త ఏరే పనివాళ్లకు, అగ్నిమాపక సిబ్బందికి– ఇలా ప్రతి తరగతి ప్రజానీకానికి మేలు చేస్తున్నట్లు కనబడాలి. నాలుగు జీతం రాళ్లు సంపాదించే జనాలు కాస్తోకూస్తో మెరుగ్గా ఉన్నవాళ్లు సమాజంలోని సంపన్నులతో జట్టు కట్టేలా చూసుకోవాలి. ఎందుకంటే వీళ్లే అటు ఉన్నత తరగతికి, ఇటు లేని తరగతుల జనాభాకు మధ్యన ఘర్షణ నివారించేందుకు ఉపయోగపడేది. వ్యవస్థ యథావిధిగా నడిచేందుకు సహకరించేది. ఈ మధ్యతరగతి తన విధేయత చూపించడం మానేసిందా, వ్యవస్థ కుప్పకూలడం మొదలయినట్టే.

ఇది ఎప్పుడు జరుగుతుందంటే భద్రజీవులం అనుకుంటూ కొద్దిపాటి అసౌకర్యమేగా అని సర్దుకోవడం మానేసి మనం ఈ వ్యవస్థను కాపాడేదానికి జైలులోపల కావలి జీవితాల్ని గడుపుతున్నాం, తనని తాను కాపాడుకోవడానికి మనకు కొన్ని ఈనాంలు పారేస్తున్నా ఈ వ్యవస్థ అవసరమైతే తన ఉనికి కోసం మనల్ని చంపి ఉప్పుపాతర వెయ్యడానికి కూడా వెనుదీయదు అని అర్థం చేసుకున్నప్పుడు మన జీవిత కాలంలోనే ఈ వ్యవస్థ పట్ల మనం చూపుతున్న విధేయతను ఉపసంహరించుకోవడానికి అవసరమైన నిర్దిష్ట సత్యాలు మన కళ్లముందే సాక్షాత్కరిస్తాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానం తెచ్చిపెట్టిన పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ ప్రభావాలు, అణుయుగంలో జరుగుతున్న అర్థరహితమైన యుద్ధాలు– ఇవన్నీ ఏదో ఒక రోజున ఈ వ్యవస్థకు కాపలాదారులుగా ఉన్న మేధావులు, ఇళ్ల యజమానులు, పన్ను చెల్లింపుదార్లు, వృత్తి నిపుణులు, ప్రభుత్వ ఉద్యోగులు సహా భద్రజీవులందరిని భౌతిక, మానసిక హింసకు గురి చేస్తాయి. ఇవాళ నల్లజాతి ప్రజలు, పేదలు, విదేశీ గడ్డమీద ఉన్నారనుకుంటున్న శత్రువులు అలాంటి హింసకు లోనవుతున్నారు. రేపు మన వంతు రాదనే గ్యారంటీ లేదు. ఆర్థిక వ్యవస్థలు అంతర్జాతీయీకరించబడడం, శరణార్థులు–అక్రమ వలసదారులు దేశాల సరిహద్దులను ఇట్టే దాటే అవకాశాలు పెరగడం మూలంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాలు ఇంకెంత మాత్రమూ ప్రపంచ పేద దేశాల్లో తీవ్ర తరమవుతున్న ఆకలి అనారోగ్యాల పట్ల ఉపేక్షాభావం ప్రదర్శించడానికి వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ వ్యవస్థ లాభాపేక్షతో ఎంత అహేతుకంగా నడుస్తుందంటే– ఒక పక్కన నగరాలు, పట్టణాలు మౌళిక వసతుల కొరతతో క్షీణించి పోతుంటే రెండో ప్రక్కన ఇన్సూరెన్స్ కంపెనీలు ఇనుప రెక్కల ఆకాశ హర్మ్యాలు నిర్మించుకుంటున్నాయి. ఒక పక్కన పిల్లలు ఆడుకోవడానికి సరైన మైదానాలు ఏర్పాటు చెయ్యడానికి నిధులు ఉండవుగానీ, మానవ నాగరిక విధ్వంసానికి బిలియన్ల కొద్దీ డాలర్లు ఆయుధాల తయారీకీ, అమ్మకాలు, కొనుగోళ్లకు కేటాయిస్తున్నారు. దగుల్బాజీ పనులు చేసే వాళ్ళకు లక్షల డాలర్ల ఆదాయం పొందే అవకాశాలు కల్పిస్తూ ఒక రచయితను, ఒక చిత్రకారుడిని, ఒక కళాకారుడిని, ఒక సంగీతజ్ఞుడిని ఆదుకోవడానికి చేతులు రాని ప్రభుత్వంగా తయారయింది. పెట్టుబడిదారీ విధానం సర్వకాల సర్వావస్థల యందూ అట్టడుగు ప్రజానీకం ప్రయోజనాలను పట్టించుకోదు. ఇప్పుడు మధ్య తరగతి ప్రజానీకం కూడా ఆ కోవలోకి జమయిపోయారు. ఒకప్పుడు నిరుద్యోగం పేదల కుటుంబాలకే పరిమితం అనుకునేవారు. ఇప్పుడిది మధ్య తరగతి ఉద్యోగులు, వృత్తి నిపుణులనూ తాకింది. కాలేజీ విద్య పూర్తి చేస్తే ఉద్యోగానికి ఢోకా ఉండదు అనే భరోసా ఇప్పుడు సన్నగిల్లింది. స్కూళ్ళు, కాలేజీల నుండి బయటకొచ్చే నవతరానికి మంచి భవిష్యత్తు ఉందనే పూచీ లేదు. ఇది పేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలకు మాత్రమే పరిమితం అయి ఉండి ఉంటే అది వేరే సంగతి. వాళ్లను భరించడానికి ఎలానూ జైళ్లు ఉన్నాయి. కాని ఇవాళా, రేపూ మధ్యతరగతి

భద్రలోకపు కుటుంబాల నుండి వచ్చిన పిల్లల సంగతీ అదే అయితే పరిస్థితులు చెయ్యి దాటిపోయినట్లే. పేదరికంతో సహజీవనానికి అలవాటుపడి పోయినవారు చేతిలో నయాపైసా లేకపోయినా రోజు గడిపెయ్యడానికి అలవాటు పడిపోయారు. కాని మధ్య తరగతి ప్రజానీకం అలా కాదే. అధిక ధరలు, అధిక పన్నుల మూలంగా జేబులో ఉన్న నాలుగు డబ్బులూ ఊడ్చుకుపోయి చేతిలో చిల్లిగవ్వ లేక ఊపిరిసలపని విధంగా తయారయ్యారు.

1970, 80, 90... ఇలా దశాబ్దం దశాబ్దానికీ లెక్క తీస్తే నేరాల రేటు నాటకీయంగా పెరిగిపోయింది. దీనికి కారణాలు ఏమిటో వేరుగా  చెప్పనక్కరలేదు. మీరు అమెరికాలోని ఓ పెద్ద నగరంలో ప్రయాణిస్తే చాలు. ఒకవైపు పోగుపడిపోయిన సంపద, మరోవైపు విస్తరిస్తున్న పేదరికం, మరులుగొలిపే విచ్చలవిడి వాణిజ్య ప్రకటనల హోర్డింగులు, ఏం చేసైనా సరే దక్కించుకోవాలనే సంస్కృతిని ప్రోది చెయ్యడం కళ్లకు కట్టినట్లు కనబడతాయి. పీకలు తెగకోసుకునే ఆర్థిక పోటీలో చట్టబద్ధమైన రాజ్యహింస, కార్పొరేట్ కంపెనీల దోపిడీ ఒకవైపు, వీటితో సమాంతరంగా పెరిగిపోతున్న చట్టవిరుద్ధమైన నేరాలు ఇంకోవైపు. ఈ నేరాల్లో ఎక్కువ భాగం దొంగతనాలే. అమెరికన్ జైళ్లలో మగ్గిపోతున్న వారిలో అత్యధికులు పేదలు, చదువులేని వాళ్లు, తక్కువ చదువుకున్న వాళ్లు మరీ ముఖ్యంగా శ్వేతేతర జాతీయులు జైలుశిక్ష అనుభవిస్తున్న వారిలో సగం మంది అరెస్టు కావించబడడానికి నెలరోజుల ముందు నిరుద్యోగులుగా మారినట్లు లెక్కలు  చెబుతున్నాయి.

యువకులలో నేరాలకు పాల్పడిన వారిలో ఎక్కువలో ఎక్కువ మంది మత్తుమందులకు బానిసలై దారినపోయే వాళ్లను బెదిరించి డబ్బులు దోచుకున్న సంఘటనలే. ఇందులో వారూ వీరూ అనే తేడా లేదు. అటు మధ్య తరగతితోపాటు, ఇటు సాటిపేదలూ ఇలాంటి దోపిడీలకు గురవుతున్నవారే. విద్య, సంపద– ఈ రెండూ ఒక తరగతికే పరిమితం అయిపోయిన సమాజంలో ఇలాంటి నేరాలన్నీ లేని తరగతి ప్రజల వర్గ ఆక్రోశానికి ప్రతిఫలనాలే.

నేరాలను అరికట్టడానికి మరిన్ని జైళ్లను తెరవడం, మరింత కఠిన శిక్షలు విధించడం అనివార్యం, అవసరం అని మధ్య తరగతి భద్రలోక జీవులు భ్రమించినంత కాలం ఈ నేరాలు నియంత్రించలేనంత స్థాయికి పెరిగిపోతాయే తప్ప వీటిని కట్టడి చెయ్యడం సాధ్యం కాదు. నేరము–శిక్ష అనే ప్రహసం ఇలా అనంతంగా కొనసాగిపోతూనే ఉంటుంది. దీనికి అంతం ఎప్పుడని ఆలోచిస్తే ప్రతి మనిషికీ చేసేందుకు పని దొరకడం ఒక్కటే మార్గం. అప్పుడే ప్రతి మనిషికీ అసలైన రక్షణ లభిస్తుంది అనేది స్పష్టం అవుతుంది. ఇది జరగాలంటే ప్రభుత్వ జాతీయ ప్రాధాన్యతలే మారిపోవాలి. అందుకు వ్యవస్థను మార్చడం తప్ప మరో మార్గాంతరం లేదు.

రాబోయే కాలం సంక్షోభాలకు, పోరాటాలకే కాదు నూతనోత్తేజానికీ అవకాశాలు ఉన్న కాలం. ఇప్పుడున్న ఈ (పెట్టుబడిదారీ) వ్యవస్థ చ(క్రంలో సాధించలేని అద్భుతమైన మార్పులని కొద్దిపాటి హింసద్వారా సాధించే ఉద్యమం విజయవంతం కావడానికి అవకాశాలు ఉన్నకాలం. ఎందుకంటే నూటికి తొంభైతొమ్మిది మంది- అటు ఈ వ్యవస్థకు బందీలుగా, ఇటు ఈ వ్యవస్థకు కాపలాగా ఉన్నవాళ్లు- వాళ్ల ఉమ్మడి ప్రయోజనం ఎందులో ఇమిడి ఉందో అర్థం చేసుకుని ఒకరితో ఒకరు పంచుకుంటూ ఉన్నారు. ప్రభుత్వం గిడసబారిపోయింది. దానితో వాళ్ల ప్రయోజనాలు నెరవేరవని అర్థం అయిపోయింది. ప్రజల సంకల్పబలం ముందు కులీన శక్తుల ఆధీనంలో ఉన్న ఆయుధాలు, డబ్బు, సమాచార నియంత్రణ- ఇవేవీ పనికి రాకుండాపోతాయి. ఇప్పటిదాకా ఈ వ్యవస్థకు ఊడిగం చేసినవాళ్లు ఇహను ఊడిగం చెయ్య నిరాకరిస్తారు. వాళ్ల శక్తి, సమయం ప్రమాదకరమైన ఈ పాత వ్యవస్థను ధ్వంసం చేసి నూతన వ్యవస్థను నిర్మించుకోవడానికి వినియోగిస్తారు.

ఇప్పటిదాకా ఈ వ్యవస్థకు బందీలుగా ఉన్న వారు గతంలో ఎన్నడూ చూడని విధంగా ఊహించని విధంగా ఇదే వ్యవస్థ మీద తిరుగుబాటు చేస్తారు. ఈ నూతన శకంలో మన ఆశ ఏమిటంటే ఇప్పటిదాకా ఈ వ్యవస్థకు కాపలాగా ఉన్న (మధ్యతరగతి) వారు బందీలతో చెయ్యి కలుపుతారు అనే. ఇప్పటిదాకా చదవను, రాయనుకే పరిమితం అయిన మేధావులు కూడా ఆ కాపలాదార్లలో భాగమే. ఇది మనం అర్థం చేసుకుని ఆచరణకు పూనుకుంటే మన జీవితాలే కాదు మన తరువాతి తరం, వారి తరువాతి తరువాతి తరం జీవితాలు కూడా సుందర సుస్యందన ప్రపంచాన్ని, మరో ప్రపంచాన్ని అనుభవించి పలవరిస్తాయి.

# 10

# ప్రజల మీద యుద్ధం

రెండవ ప్రపంచ యుద్ధం విజేతలు సోవియట్ రష్యా, అమెరికా దేశాలు (ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జాతీయవాద చైనా లాభపడినా అది స్వల్పమే.) అప్పటి నుంచి ఈ రెండు దేశాలూ అధికారిక వర్ణ వివక్షత, స్వస్థిక్ గుర్తులు లేకపోవడం వినా వేటికవే తమ ప్రభావాన్ని పెంచుకోవడానికి వేటి సామ్రాజ్యాలు అవి నిర్మించుకునే పనిలో పడ్డాయి. భాగాలు పంచుకోవడానికి, ఈ ప్రపంచం మీద ఆధిపత్యం సంపాదించడానికి ఒకదాన్తో ఒకటి తలపడ్డాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా ఒక విధంగా ప్రపంచ ఆధిపత్యాన్ని స్థిరపరుచుకోవడంతోపాటు అంతర్గతంగా కూడా ప్రజల మీద పట్టు పెంచుకుంది. 30వ దశకంలో చోటు చేసుకున్న మహా మాంద్యం మూలంగా తలెత్తిన నిరుద్యోగం ఆర్థిక– సామాజిక సంక్షోభాలు 'న్యూడీల్' (నూతన ఒప్పందం) పేరిట ఒక మేరకు సద్దుమణిగాయి. అయితే యుద్ధం మూలంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభం నుండి గట్టెక్క గలిగింది. 30వ దశకంలోని మహామాంద్యం మూలంగా తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్న రైతులకు అధిక మద్దతు ధరలు, కార్మికులకు అధిక వేతనాలు లభించడంతో ఊరట చెందారు. అందుకే లారెన్స్ విట్నర్ 'ఈ యుద్ధం అమెరికన్ పెట్టుబడిదారీ విధానానికి కొత్త ఊపిరులు ఊదింది' అన్నాడు. ఈ యుద్ధం మూలంగా లాభపడిన వాళ్లు ఎవరయ్యా అంటే – కార్పొరేట్ కంపెనీలకు అగ్రతాంబూలం ఇవ్వొచ్చు. 1940లో కార్పొరేట్ కంపెనీల లాభాలు 6.4 బిలియన్ డాలర్లు కాగా 1944 నాటికి ఇవి 10.8 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అలాగే రైతులు, కార్మికులు ఈ వ్యవస్థలో సర్దుకుపోవడానికి తగినన్ని ప్రోత్సాహకాలూ వారికి దక్కాయి.

ప్రభుత్వాలకు ఇది పాత పాఠమే, కొట్టిన పిండే. యుద్ధం అనేది నియంత్రణల మూలంగా తలెత్తే సమస్యలను పరిష్కరిస్తుంది. అందుకే జనరల్ ఎలక్ట్రిక్ (జి.ఇ) కంపెనీ ప్రెసిడెంటు ఛార్లెస్ ఇవిల్సన్ యుద్ధకాలంలో ఒనగూడిన లాభాలతో పరమానందభరితుడై "వాణిజ్యరంగం– సైన్యం మధ్య కుదిరిన  ఈ కొత్త దోస్తీ కలకాలం ఇలాగే కొనసాగాలని,

యుద్ధకాలపు ఆర్థిక వ్యవస్థ చిరకాలం నిలవాలని" అభిలషిస్తూ ఆ మేరకు ఒక ప్రకటన కూడా చేసాడు.

తరువాత జరిగింది కూడా అదే. నిజానికి ప్రపంచ యుద్ధం ముగియగానే ప్రజలలో నెలకొన్న యుద్ధం తాలూకు భయంకర జ్ఞాపకాలు, యుద్ధభీతి – నిరాయుధీకరణ, నిస్సైనికీకరణ విధానాలకు అనువుగా మొగ్గచూపాయి. అయితే ట్రూమన్ ప్రభుత్వం (రూజ్‌వెల్ట్ 1945 ఏప్రిల్‌లో చనిపోయిన మూలంగా ట్రూమన్ అధ్యక్ష పదవి చేపట్టాడు) మాత్రం ప్రచ్ఛన్న యుద్ధవాతావరణాన్ని, సంక్షోభాన్ని సృష్టించే దిశగా పని చేసింది. సోవియట్ రష్యా బలమైన ప్రత్యర్థిగా ఎదిగిపోతున్న మాట వాస్తవం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఒక్క రష్యాలోనే 2 కోట్ల మంది ప్రజానీకం అసువులు బాసారు. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయింది. అయినా ఆ దేశం అనూహ్యంగా అత్యంత వేగంగా పారిశ్రామికాభివృద్ధిని సాధిస్తూ, సైనిక పరంగా కూడా బలాన్ని సంతరించుకుంది. అయితే ట్రూమన్ ప్రభుత్వం రష్యాను ప్రత్యర్థి దేశంగా కాకుండా తక్షణమే అమెరికాకు ముప్పు తెచ్చిపెట్టే దేశంగా చిత్రించింది. వరసవారీ చర్యల ద్వారా ఇంటా, బయటా కమ్యూనిజం పట్ల ఒక భయోత్పాతాన్ని, ఒక రకమైన ఉన్మాద ధోరణులను రెచ్చగొట్టింది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని మిలిటరీ బడ్జెట్‌ను విపరీతంగా పెంచుకుంటూ, యుద్ధ సంబంధిత ఆర్డర్లు పెంచుకుని ఆర్థిక వ్యవస్థ ఉద్దీపనకు పూనుకుంది. ఇటువంటి ఆర్థిక విధానాల మూలంగా సరిహద్దులకు ఆవల పొగరుమోతు చర్యలకు దిగడానికి, అంతర్గతంగా మరింత అణిచివేత ధోరణులతో పరిపాలన సాగించేదానికి అవకాశం చిక్కింది.

యూరప్, ఆసియా దేశాలలో వెల్లివిరిసిన విప్లవ పోరాటాలను రష్యా విస్తరణ వాదానికి, హిట్లర్ అనుసరించిన దురాక్రమణ పూరిత విధానాలకు కొనసాగింపే అని ప్రజలను నమ్మించేందుకు అమెరికన్ పాలకవర్గాలు శతధా ప్రయత్నించి ఒక మేరకు విజయం సాధించాయి.

యుద్ధానికి ముందు గ్రీసుదేశాన్ని మితవాద రాజరిక–సైనిక నియంతృత్వ ప్రభుత్వం పరిపాలిస్తూ ఉండేది. వామపక్షాల నాయకత్వంలో ఆ దేశంలో సాగిన జాతీయ విముక్తి సంఘటన పోరాటాన్ని బ్రిటిష్ సైనిక జోక్యంతో అణిచివేసారు. పచ్చి మితవాద సైనిక నియంతృత్వ ప్రభుత్వాన్ని మరలా గద్దెనెక్కించారు. జాతీయ విముక్తి సంఘటన నాయకులను జైళ్లపాలు చేసింది ఆ ప్రభుత్వం. కార్మిక సంఘాలను రద్దు చేసి, నాయకులను వెంటాడింది. ఈ దారుణ అణిచివేత విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష గెరిల్లా తిరుగుబాటు ఉద్యమం మొదలయింది. దాదాపు 17000 మంది యోధులు గెరిల్లా సైన్యంలో చేరారు. మరో 50000 మంది క్రియాశీలక కార్యకర్తలు, రెండున్నర లక్షల మంది సానుభూతి పరులతో గెరిల్లా పోరు ఉచ్ఛదశకు చేరుకుంది. 70 లక్షల జనాభా గల దేశంలో తిరుగుబాటు గెరిల్లాల సంఖ్యా, ప్రభావమూ తక్కువ కాదు. బ్రిటిష్ ప్రభుత్వం ఈ తిరుగుబాటును సంభాళించడం తన వల్ల కాదని చేతులు ఎత్తేసింది. తక్షణమే అమెరికాను జోక్యం చేసుకోమని కోరింది. అమెరికన్ హోంమంత్రిత్వ శాఖ అధికారి

మాటల్లో చెప్పాలంటే 'రవి అస్తమించని' సామ్రాజ్యంగా చెప్పుకునే గ్రేట్ బ్రిటన్ ఒకే ఒక్క గంటలో ప్రపంచ నాయకత్వాన్ని అమెరికాకు ఒప్పగించింది.

అమెరికా కూడా ట్రూమన్ అడుగుజాడలో నడిచింది. 1947 వసంతకాలంలో ట్రూమన్ అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో గ్రీసు, టర్కీ దేశాలకు 400 మిలియన్ డాలర్ల ఆర్థిక, సైనిక సాయం అందించాలని కోరాడు. 'సాయుధ మైనారిటీ ముఠాల మూలంగానో, సీమాంతర శక్తుల ఒత్తిడికో లోబడకుండా ఉండడానికి జరిగే ప్రతిఘటనకు, ప్రజలకు స్వేచ్ఛ ప్రసాదించేందుకు'గాను అమెరికా ఈ మేరకు సాయం అందించాల్సిందే అని ప్రకటించాడు.

నిజం చెప్పాలంటే ప్రపంచ దేశాలపై సీమాంతర ఒత్తిడి పెంచడంలో అమెరికా కన్నా మొనగాడు దేశం లేదు. గ్రీకు తిరుగుబాటుదారులకు యుగోస్లోవియా నుంచి అంతో ఇంతో ఆర్థికసాయం అందితే అందుతూ ఉండవచ్చు కానీ ఇందులో సోవియట్ ప్రమేయం లేదు. ఇంకా చెప్పాలంటే రుమేనియా పోలండ్, బల్గేరియాలలో సోవియట్‌కు అడ్డు తగలకుండా ఉంటే గ్రీస్ వ్యవహారంలో అమెరికాకు తాము అడ్డు రాబోమని సోవియట్ రష్యా చర్చిల్‌కు వాగ్దానం చేసింది. సోవియట్ కూడా ఆనాడు అమెరికా మాదిరిగానే నియంత్రించలేని విప్లవాలను ఆహ్వానించడానికి సిద్ధంగా లేదు.

ప్రపంచ దేశాలకు ప్రత్యామ్నాయ జీవన విధానాలను ఎంచుకునే హక్కు ఉందని ట్రూమన్ తరచూ అంటుండేవాడు. 'మెజారిటీ ప్రజలు స్వేచ్ఛ కోరుకునే' నమూనా ఒకటి, 'మైనారిటీ శక్తులు హింసతోను, భయోత్పాతంతోను ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరించివేసే నమూనా' ఇంకొకటి అని ట్రూమన్ ఈ రెండు వ్యవస్థల మధ్య తేడాను వివరించేవాడు. ట్రూమన్ దృష్టిలో మొదటి నమూనా అమెరికా తరహా స్వేచ్ఛ, రెండవది సోవియట్ తరహా కమ్యూనిస్టు నియంతృత్వం అని. అయితే గ్రీసులో తిరుగుబాటును అణచివెయ్యడానికి అమెరికా జోక్యం చేసుకున్నది ఈ వాగాడంబర ప్రయోజనాల కోసం కాదు. ఆనాటికి గ్రీసు దేశం మధ్య ప్రాచ్యంలో అత్యంత విలువైన సహజ వనరులతో అలరారుతున్న దేశం అనే వాస్తవం ట్రూమన్ గమనంలో ఉందని అతని సలహాదారుడు క్లార్క్ క్లిఫోర్ట్ వివరించాడు.

గ్రీసులో నెలకొన్న అంతర్యుద్ధంలో అమెరికా ప్రత్యక్ష సైనిక జోక్యానికి పూనుకోలేదు. కాని ఆయుధాలు, సైనిక సలహాదారులతో ఆ దేశం మీద దండెత్తింది. 1947లోని చివరి ఐదు నెలల్లో గ్రీసు మితవాద ప్రభుత్వానికి అమెరికా 74,000 టన్నుల మిలిటరీ సామాగ్రి అందించింది. ఇందులో టైమ్ బాంబర్లు, నాపాం బాంబులు కూడా ఉన్నాయి. జనరల్ జేమ్స్ వాన్‌ఫ్లీట్ నాయకత్వాన రెండువందల యాభైమంది సైనికాధికారులను గ్రీకు సైన్యానికి క్షేత్రస్థాయి సలహాలిచ్చి దగ్గరుండి మరీ నడిపించింది. వాన్‌ఫ్లీట్ సలహాలను అనుసరించి గెరిల్లాలను ఒంటరిపాలు చెయ్యడానికి వారికి ప్రజా మద్దతు అందకుండా నిలవరించడానికి పల్లె ప్రాంతాల్లోని జనావాసాలను నిలువునా ఖాళీ చేయించింది గ్రీస్ ప్రభుత్వం.

గ్రీకు దేశంలో జోక్యం ఒక తీరు అయితే చైనాలో అమెరికా జోక్యం ఇంకో తీరుగా నడిచింది. అమెరికా హోంమంత్రిత్వ శాఖ వెలువరించిన శ్వేతపత్రం వివరాల ప్రకారమే చాంగ్-కై-షేక్ ప్రభుత్వమూ, సైన్యమూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. 1949 జనవరి నాటికి కమ్యూనిస్టు చైనా ప్రజావిముక్తి దళాలు పెకింగ్‌లో కాలుబెట్టాయి. అంతర్యుద్ధం ముగిసిపోయింది. అధికారం కమ్యూనిస్టుల వశం అయింది. సీమాంతర శక్తుల ప్రమేయం లేకుండా సుదీర్ఘ ప్రాచీన చరిత్ర కలిగిన దేశంలో తొలిసారిగా ప్రజా ప్రభుత్వం ఏర్పాటయింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా దేశీయంగా తాను అనుసరించబోయే విప్లవాలను అణచిపెట్టే లక్ష్యం గల విదేశాంగ విధానానికి అనుగుణంగా జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించే దానికి ప్రత్యేకంగా విశేషమైన కృషి చేసింది. ఇందుకోసం అతివాదులను మినహాయించి మితవాదులను, ఉదారవాదులను, రిపబ్లికన్, డెమోక్రాట్ పార్టీలకు చెందినవారిని ప్రచ్ఛన్న యుద్ధం, కమ్యూనిస్టు వ్యతిరేక వాతావరణానికి అనుకూలంగా సమీకరించింది.

ఈ రకమైన సంకీర్ణం మాటున ఉదారవాద డెమోక్రట్ అధ్యక్షుడు విదేశాంగ విధానంలో దూకుడు ప్రదర్శిస్తూ పచ్చి మితవాదులను ఆకర్షిస్తూ, రెండో చెంపన కొన్ని సామాజిక సంక్షేమ పథకాలతో ఉదారవాదులను ఆకట్టుకుంటూ తమ ప్రయోజనాలు నెరవేర్చుకోసాగాయి పాలకవర్గాలు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రాడికల్ భావాలతో ప్రజానీకంలో దురాక్రమణపూరిత విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా రేకెత్తించిన అడ్డుగోడలను కూలదోయడానికి సంప్రదాయ, ఉదారవాద డెమోక్రట్లు ఎలానూ ఉండనే ఉన్నారు. అందుకే అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక భావావేశం (మూడ్) బలంగా వేళ్ళూనుకుంది. ఈ గుడ్డి వ్యతిరేకత మూలంగా దేశంలో అంతర్గతంగా ప్రజాస్వామిక, పౌర హక్కులకు ఎసరు వస్తున్నా పట్టని ధోరణి ప్రబలిపోయింది. ఫలితంగా 1950లో ట్రూమన్ ప్రభుత్వం కొరియా మీద అప్రకటిత యుద్ధానికి దిగడానికి ఈ సంకీర్ణ రాజకీయం ఎంతో సహకరించింది.

కొరియా జపాన్ ఆక్రమణలో 35 ఏళ్ళపాటు మగ్గింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం కొరియాలో సగభాగం సోవియట్ ప్రభావంతో సోషలిస్టు రాజ్యంగా అవతరించింది. మిగిలిన సగభాగం అమెరికా ప్రభావంతో మితవాద నియంతృత్వ ప్రభుత్వంగా అవతరించింది. ఈ రెండు దేశాల మధ్యన పరస్పర బెదిరింపుల ప్రకటనల పర్వం జోరుగా సాగుతుండేది. 1950 జూన్ 25న ఉత్తర కొరియా సైన్యం దక్షిణ దిశగా కదిలి 38వ అక్షాంశాన్ని దాటి దక్షిణ కొరియా ఆక్రమణకు పూనుకుంది. అమెరికా ఆధిపత్యంలో నడుస్తున్న ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 'ఈ సైనిక దాడిని తిప్పికొట్టడానికి ముందుకు రావాలని' తీర్మానించింది. దక్షిణ కొరియాకు సైనిక సాయం అందించమని అమెరికన్ సైనిక దళాలను ట్రూమన్ ఆదేశించాడు. అమెరికన్ సైన్యమే ఐక్యరాజ్యసమితి దళంగా అవతారం ఎత్తింది. ఒక పక్కన విదేశీ గడ్డ మీదకు అమెరికన్ సైన్యాన్ని నడిపిస్తూనే "అంతర్జాతీయ వ్యవహారాలలో బలప్రయోగ సూత్రానికి మరలితే దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అమెరికా మాత్రం అంతర్జాతీయ న్యాయసూత్రాల పరిరక్షణకే కట్టుబడి ఉంటుంది" అని ట్రూమన్ ప్రకటించాడు.

బలప్రయోగ సూత్రానికి బదులిచ్చే పేరిట అమెరికా మూడేళ్ళపాటు ఏకధాటి 'బాంబింగ్'తో ఉత్తర, దక్షిణ కొరియా దేశాలను శిథిలాలమయం చేసేసింది. నాపాం బాంబులు వేసింది. దాని ఫలితాన్ని బిబిసి జర్నలిస్టు ఒకరు ఇలా అభివర్ణించారు.

"నా కళ్ళ ముందు ఒక వింత జీవి నిలబడి వుంది. రెండు కాళ్ళూ దొడ్డికాళ్ళుగా ఉండి, చేతులు రెండూ ముడుచుకోలేని స్థితిలో గూనితనంతో ఉన్న జీవి స్వయానా ఒక మనిషి. రెండు కళ్ళూ లేవు. ఒళ్ళంతా కాలిన గాయాలతో కొన్ని చోట్ల పెచ్చులు కట్టి, కొన్ని చోట్ల చర్మం లోపలి భాగాలు కనబడుతూ పచ్చటి రసి కారుతూ... భగవంతుడా నాపాం బాంబు ప్రభావం ఇంత హృదయవిదారకంగా ఉంటుందా?? అమెరికన్ అధ్యక్షుల వారిని, ఉదారవాదులనీ (లిబరల్స్) కొరియా సరిహద్దుల వెంబడి యుద్ధానికి ప్రేరేపించిన ఘటనలు ఏమైనా గానీ... ఈ భూభాగం మీద గ్రామాలకు గ్రామాలే బూడిద కుప్పలుగా మారడం నా కళ్ళారా చూశాను. ఈ భయ బీభత్స విధ్వంసకాండ నానాటికీ విస్తరిస్తూనే వుంది..."

ఇంతకుముందే చెప్పుకున్నట్లు పరాయి దేశాల్లో జోక్యం చేసుకోవడానికి, అలవిమాలిన సైనికీకరణకు అనుగుణమైన విదేశాంగ నీతిని నిరంతరాయంగా కొనసాగించడానికి వీలుగా జాతీయ ఏకాభిప్రాయాన్ని (నేషనల్ సైక్) మలిచారు. ఈ అభిప్రాయాలతో ఏకీభవించని వాళ్ళను దేశభక్తిహీనులుగానో, అతివాదులుగానో ముద్రవేసి సతాయించే దానికి సులువైన వాతావరణం ఒకటి ఏర్పడిపోయింది. 'బియాండ్ ది న్యూ డీల్' అన్న పుస్తకం రాసిన ఆలోంజో హాంబీ ఏమంటాడంటే కొరియా యుద్ధాన్ని న్యూరిపబ్లిక్ పత్రిక, ది నేషన్ పత్రిక, 1948లో వామపక్షాలు బలపరిచిన అభ్యుదయవాదిగా ట్రూమన్‌తో దేశాధ్యక్ష ఎన్నికలలో తలపడిన హెగ్రీవాలెస్‌లు సమర్ధించారు. ఉదారవాదులుగా భావించినవారిలో పెక్కుమంది కమ్యూనిస్టులను వేధించిన సెనెటర్ మెకార్ధీని ద్వేషించారు గానీ కొరియా యుద్ధాన్ని మాత్రం సమర్ధించారు. దాంతో మెకార్ధీయిజానికి కొత్త ఊపిరులు ఊదినట్లయింది.

30వ దశకంలో సంభవించిన ఆర్థిక మాంద్యకాలంలో ఫాసిజానికి వ్యతిరేకంగా యుద్ధం జరుగుతున్న కాలంలో కమ్యూనిస్టుల ప్రభావం మెండుగా ఉండేది. ఇంతా చేసి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం ఒక లక్షదాకా ఉండేదేమో. కాని కార్మిక సంఘాల్లో, సాంస్కృతిక కళారంగాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యం మూలంగా అసంఖ్యాకమైన ప్రజానీకంలో కమ్యూనిజం పట్లా, సోషలిజం పట్లా గొప్ప అనురక్తిని ప్రోదిచేసింది. అందుకే రెండవ ప్రపంచ యుద్ధం ముగియగానే అమెరికన్ పాలక వర్గాలు అంతర్గతంగా పెట్టుబడిదారీ విధానాన్ని పటిష్టం చేసుకుంటూ, ఒక సామ్రాజ్యాన్ని నిర్మించుకోవడానికి జాతీయ ఏకాభిప్రాయం కూడగట్టే క్రమంలో కమ్యూనిస్టు పార్టీని ఒంటరిపాటు చేసి బలహీనపరచడానికే నడుం కట్టింది. గ్రీసు, టర్కీ దేశాల పట్ల అమెరికా వ్యవహార శైలి ఎలా ఉండబోతుంది అని ప్రెసిడెంట్ ట్రూమన్... ప్రకటించిన రెండు వారాలకే 1947 మార్చి 22న జి.ఓ. నెం. 9835 జారీ చేశాడు. ఈ జి.ఓ.ను అనుసరించి అవిధేయులుగా ఉన్న ఎవరింట్లోనైనా చొరబాటుదారులు ఉన్నారేమో తనిఖీ చేసే "విశేషాధికారం" ప్రభుత్వానికి కట్టబెట్టింది. డగ్లస్ మిల్లర్, మారియన్ నౌఆక్‌లు

సంయుక్తంగా రచించిన 'యాభయ్యవ దశకం (ది ఫిఫ్టీస్) అన్న పుస్తకంలో దీని గురించి ఇలా వ్యాఖ్యానించారు.

"జాతి యావత్తునీ ఒక విధమైన సామూహిక ఉన్మాదం (మాస్ హిస్టీరియా) కుదిపివేసిందని అధ్యక్షుడు ట్రూమన్ రేపు ఏదో ఒకరోజు నెపం ప్రజల మీదకే నెట్టేస్తాడు. కానీ దేశాన్ని అంతర్గత, బాహ్యగత ప్రమాదాల నుండి కాపాడే పేరిట కమ్యూనిస్టులపై విజయం సాధించే పేరిట తాను అనుసరించిన విధానాలే ఈ రకమైన ఉన్మాదానికి మూలకారణం అని పొరబాటున కూడా అంగీకరించడు. 1947 మార్చి నుండి 1952 డిసెంబర్ మధ్య కాలం వరకూ భద్రతా కారణాల పేరిట దేశంలోని 66 లక్షల మంది ప్రజలను అదుపులోకి తీసుకుని 'ఇన్వెస్టిగేషన్' (నేరశోధన) నిర్వహించారు. గూఢచర్యానికి పాల్పడిన దాఖలా ఒక్కటి కూడా వెల్లడికాలేదు కానీ ప్రభుత్వ సర్వీసుల నుండి 500 మందిని 'సందేహాస్పద విధేయత' సాకున డిస్మిస్ చేశారు. ఈ దాష్టీకం అంతా 'రహస్య సాక్ష్యాల' పేరిట, కిరాయికి కుదుర్చుకున్న ఇన్ఫార్మర్ల సమాచారం ఆధారంగా నడిపించారు. కోర్టులు, జడ్జిలు, జ్యూరీల ఊసే లేదు. ఎర్రభీతితో చేపట్టిన ఈ కార్యక్రమం మూలంగా ప్రభుత్వం అంతా వేగులతో నిండిపోయింది అని ప్రజలను భ్రమింపచేశారు. ప్రజల మనసుల్లో ఒక విధమైన భయోత్పాతం నిండిపోయి దేశవ్యాప్తంగా మితవాద ఆలోచనా విధానం ముప్పిరిగొన్నది. దేశభద్రత, పాలనా వ్యవస్థను కాపాడుకోవడానికి మించిన పరమోన్నత తక్షణ కర్తవ్యం వేరేదీ లేదనే గట్టి నిర్ణయానికి వచ్చేశారు సగటు అమెరికన్లు."

రెండవ ప్రపంచ యుద్ధానంతరం చోటు చేసుకున్న ప్రపంచవ్యాపిత పరిణామాలు కమ్యూనిస్టు వ్యతిరేక క్రూసేడు (పవిత్ర యుద్ధం) నడపడానికి అవసరమైన ప్రజా మద్దతును కూడగట్టుకోవడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించాయి. 1948లో చెకోస్లోవేకియా కమ్యూనిస్టు పార్టీ అధికారంలో వున్న కమ్యూనిస్టేతర ప్రభుత్వాన్ని రద్దు చేసి కమ్యూనిస్టు పాలన నెలకొల్పింది. ఆ ఏడాదే సోవియట్ యూనియన్ బెర్లిన్ పట్టణాన్ని దిగ్బంధించింది. ఈ పట్టణాన్ని ఒకవైపున సోవియట్ సేనలు, ఇంకో వైపున మిత్రపక్షాల సారధ్యంలో అమెరికన్ సేనలు ఆక్రమించుకున్నాయి యుద్ధకాలంలో. సోవియట్ సేనలు ఆక్రమించుకున్న భాగం తూర్పు జర్మనీలో వుంది. అయితే ఈ దిగ్బంధం మూలంగా మిత్రపక్షాల అధీనంలో ఉన్న బెర్లిన్ భూభాగానికి అవసరమైన సరుకులను అమెరికా విమానాల సాయంతో రవాణా చేసుకోవలసి వచ్చింది. ఆ మరుసటి ఏడాదిలోనే (1949) చైనాలో కమ్యూనిస్టు విప్లవం జయప్రదం అయింది. అదే ఏడాదిలో సోవియట్ రష్యా తొలిసారిగా అణుబాంబు ప్రయోగం విజయవంతంగా నిర్వహించింది. 1950లో కొరియా యుద్ధం మొదలయింది. ఈ గొలుసుకట్టు పరిణామాలను చూపించి ప్రపంచం ఆనాడు కమ్యూనిస్టు దురాక్రమణ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదని అమెరికన్ పాలకవర్గాలు ప్రజానీకాన్ని నమ్మించాయి.

నిజానికి కమ్యూనిస్టు విజయాల కన్నా ఆ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వలస దేశాల్లోని ప్రజలలో పెల్లుబుకిన స్వాతంత్ర్య కాంక్ష, స్వతంత్ర్య పోరాటాలు, తిరుగుబాట్లు అమెరికా

ప్రభుత్వాన్ని తెగ కలవరపెట్టాయి. ఇండో చైనాలో ఫ్రెంచి వలస పాలనకు వ్యతిరేకంగా విప్లవోద్యమం విస్తరిస్తూ ఉంది. ఇండోనేషియాలో డచ్ వలస పాలనకు వ్యతిరేకంగా విప్లవోద్యమం విస్తృతమవుతోంది. ఫిలిప్పీన్స్‌లో అమెరికాకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చెలరేగింది.

ఆఫ్రికా ఖండంలో జనజీవన అసంతృప్తులు సమ్మెల రూపంలో వెల్లువెత్తుతున్నాయి. ఈ సమ్మెల తీవ్రత ఎలాంటిదో బాసిల్ డేవిడ్‌సన్ 'స్వాతంత్ర్యం రానీ' (లెట్ ఫ్రీడమ్ కమ్) అన్న పుస్తకంలో వివరించాడు – ఫ్రెంచి వలస పాలనలో వున్న పశ్చిమ ఆఫ్రికాలో 1947లో దాదాపు 19,000 మంది రైల్వే కార్మికులు 160 రోజుల పాటు చేసిన సుదీర్ఘ సమ్మె ఆఫ్రికా చరిత్రలోనే అరుదైన సమ్మెగా నిలిచిపోయింది. ఈ సుదీర్ఘ పోరాట సందర్భంగా సమ్మెకారులు అప్పటి గవర్నర్ జనరల్‌కు పంపిన సందేశమే వారి పోరాట మిలిటెంట్ స్వభావాన్ని తెలియజేస్తుంది. 'మీ జైళ్ళను తెరచి పెట్టుకోండి. ఫిరంగులు, మిషన్‌గన్లు సిద్ధం చేసుకోండి. మీరేం చేసుకున్నా సరే అక్టోబర్ 10 అర్ధరాత్రి లోపు మా డిమాండ్లను పరిష్కరించకపోతే మేం సార్వత్రిక సమ్మెలోకి వెళ్ళడం ముమ్మాటికీ ఖాయం' అని రైల్వే కార్మికులు హెచ్చరించిందే కాక అన్న మాట ప్రకారం మిలిటెంట్ సమ్మెకు దిగారు. అంతకుముందు ఏడాది దక్షిణాఫ్రికాలో దాదాపు లక్ష మంది బంగారపు గని కార్మికులు రోజుకు పది షిల్లింగులు (రెండున్నర డాలర్లు) వేతనంగా చెల్లించాలనే డిమాండ్‌తో పని బందు పెట్టారు. సైన్యం రంగంలోకి దిగి బలప్రయోగం చేస్తే తప్ప వారిని తిరిగి పనిలో పెట్టడం సాధ్యం కాలేదు. 1950లో కెన్యాలో 'కరువు జీతాల' కోసం సార్వత్రిక సమ్మె జరిగింది.

కాబట్టి అమెరికా ప్రభుత్వాన్ని, అమెరికన్ వ్యాపార వర్గ ప్రయోజనాలను సోవియట్ విస్తరణ వాదం కన్నా పైన పేర్కొన్న సమరశీల ప్రజాపోరాటాలు, ఉద్యమాలు, తిరుగుబాట్లే ఎక్కువగా కలవరపెట్టాయి. నిజానికి చైనా, కొరియా, ఇండో చైనా, ఫిలిప్పీన్ దేశాలలో ఎగసిన ప్రజా సాయుధ పోరాటాలు ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నడిచినవే తప్ప వీటిని సోవియట్ ఎగసనదోసింది అన్న ప్రచారంలోనూ వాస్తవం లేదు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాట్లు విప్లవించిన కాలం అది. వీటిని నిలవరించే బ్రహ్మ ప్రయత్నంలో భాగంగానే అమెరికన్ పాలకవర్గాలు బడ్జెట్‌కు మిలిటరీతత్వాన్ని అబ్బించే దానికి, దేశ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని చిదిమేసే దానికి పార్టీ రహిత ఏకాభిప్రాయానికి పాకులాడాయి. ట్రూమన్, చట్టసభలలోని ఉదారవాదులు కలిసి న్యాయవిచారణలు, కమ్యూనిస్టు వ్యతిరేక చట్టాలు, విధేయ ప్రమాణాల వంటి అప్రజాస్వామిక, వేధింపుల చట్టాలతో అలాంటి ఏకాభిప్రాయాన్ని సాధించడానికి కృషి చేశారు.

ఈ నేపథ్యంలోనే విస్కాన్‌సిన్ రాష్ట్ర సెనెటర్‌గా ఉన్న జోసెఫ్ మెకార్థీకి ట్రూమన్ కన్నా రెండాకులు ఎక్కువ చదివే దానికి అవకాశం కలిగింది. 1950లో వెస్ట్ వర్జీనియాలోని వీలింగ్ అనే ప్రాంతంలో రిపబ్లికన్ పార్టీ మహిళా విభాగం సమావేశంలో ప్రసంగిస్తూ ఓ పేపర్ల పొత్తికను ఎత్తి చూపిస్తూ 'ఇదిగో ఇందులో 205 మంది భాగోతాలు ఉన్నాయి, వాళ్ళంతా కమ్యూనిస్టులు, హోం డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు.

నేను వీళ్ళందరి పేర్లూ హోంశాఖ కార్యదర్శికి అందజేశా. అయినా వాళ్ళు ఇంకా ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు' అని ఆరోపించాడు. ఆ మర్నాడు సాల్ట్ లేక్ సిటీలో ప్రసంగిస్తూ అలవాటుగా చేతిలో పేపర్ల కట్ల జనానికి చూపిస్తూ 'ఇదిగో 57 మంది కమ్యూనిస్టుల లిస్టు' (ఈ సంఖ్య తడవ తడవకీ మారిపోయేది) అని ఊగిపోయాడు. ఆ తరువాత కొద్ది కాలానికే సెనెట్‌లో ప్రసంగిస్తూ యధావిధిగా కాయితాల కట్ట చూపిస్తూ 'ఇదిగో హోండిపార్ట్‌మెంట్ స్వయంగా తయారుచేసిన 100 మంది జాతకాలు. వీళ్ళను ఏం చేసే దమ్ము ప్రభుత్వానికి లేదా' అని హూంకరించాడు. నిజానికి హోంశాఖ తయారుచేసిన ఆ వ్యక్తిగత నివేదికలు తాజావి కాదు. మూడేళ్ళ క్రితంవి. అందులో చాలామందికి అప్పటికే ఉద్వాసన పలికింది ప్రభుత్వం. అయినా మెకార్థీ ఆ పాత కవిలికట్టెలలోని అంశాలనే తనకు చిత్తం వచ్చిన రీతిలో మార్పులు, చేర్పులు జోడిస్తూ సెనెట్‌లో ప్రస్తావించాడు. కొందరి వ్యక్తిగత వివరాలతో హోంశాఖ 'ఉదారవాది' అని పేర్కొన్న చోట 'కమ్యూనిజం పట్ల మొగ్గు ఉన్నవారు' అని, 'చురుకైన సానుభూతిపరుడు' అని ఉన్న చోట 'చురుకైన కమ్యూనిస్టు' అని తనకు తోచిన విశేషాలు వాడాడు ఆ ప్రసంగంలో.

మెకార్థీ ఈ తంతును ఆ తరువాత కొన్నేళ్ళ పాటు కొనసాగించాడు. ప్రభుత్వ వ్యవహారాలపై సెనెట్ నియమించిన శాశ్వత పరిశోధక ఉపసంఘానికి ఛైర్మన్ గిరీ వెలగబెట్టే క్రమంలో హోంశాఖ సమాచార కార్యక్రమాలను మొత్తంగా ఆఖరుకు వాయిస్ ఆఫ్ అమెరికా రేడియో, దేశాంతర గ్రంథాలయాలు అన్నింటి మీదా ఇష్టారాజ్యంగా అజమాయిషీ చెలాయించాడు. చివరకు కమ్యూనిస్టు వాసనలు ఉన్న పుస్తకాలను కూడా వదిలిపెట్టలేదు. హోంశాఖ మొత్తం గడగడలాడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లైబ్రరీలకు గొలుసుకట్టు ఆదేశాలు ఇచ్చింది. నలభై పుస్తకాలను లైబ్రరీల నుండి తొలగించారు. అందులో థామస్ జెఫర్సన్ ఏరిన రచనలు (ఫిలిప్ ఫోవర్ సంకలనకర్త), విల్లియన్ హెల్‌మన్ రాసిన 'ది చిల్డ్రన్ అవర్' వంటి పుస్తకాలూ వున్నాయి. కొన్ని పుస్తకాలను తగలేశారు. మెకార్థీ మరింత అడ్డూ అదుపూ లేకుండా తయారయ్యాడు. 1954 వసంతకాలంలో మిలిటరీ రహస్యంగా భావించిన అపరాధ పరిశోధనలకు (ఇన్వెస్టిగేషన్) సంబంధించిన వాద ప్రతివాదనలు వినడానికి కూడా కూచోబెట్టాడు. కమ్యూనిస్టులు అని అనుమానం ఉన్న వారి పట్ల కరుడుగా వ్యవహరించడం లేదని సైనిక జనరల్స్‌ను దుయ్యబట్టసాగాడు. పతాక స్థాయికి చేరిన మెకార్థీ వ్యవహార శైలి పట్ల అటు డెమోక్రాట్లు, ఇటు రిపబ్లికన్‌లు చిర్రెత్తిపోయారు. 1954 డిసెంబర్‌లో 'అమెరికా సంయుక్త రాష్ట్రాల సెనెట్ సభ్యుడిగా మెకార్థీ ప్రవర్తన అతని హోదాకు తగినట్లుగా లేదని' అమెరికన్ కాంగ్రెస్‌లో మెజారిటీ సభ్యులు అభిశంసన తీర్మానాన్ని బలపరిచారు. అయితే ఈ అభిశంసన తీర్మానంలో కూడా ఎక్కడా మెకార్థీ వదరిన కమ్యూనిస్టు వ్యతిరేక అబద్ధాలను గురించి గానీ, గోరంతలు కొండంతలు చేసే దుష్టబుద్ధిని గురించి గానీ ఎక్కడా ప్రస్తావించలేదు. సభా హక్కుల ఎన్నికల సెనెట్ ఉపకమిటీ ముందు హాజరుకా నిరాకరించిన కారణంతో మెకార్థీని అమెరికన్ చట్ట సభ అభిశంసించింది.

ఒక పక్క సెనెట్ మెకార్థీని అభిశంసిస్తున్న క్రమంలోనే మరోవంక పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక బిల్లులను అనేకం సెనెట్ ఆమోదించింది. 'లిబరల్'గా పేరుపొందిన హబెర్ట్ హంఫ్రీ ఈ బిల్లులకు సవరణ ప్రతిపాదిస్తూ 'కమ్యూనిస్టు పార్టీని చట్టవిరుద్ధమైన పార్టీగా' ప్రకటించాలని కోరాడు. 'గౌరవనీయులైన సెనెటర్లు సాంకేతికాలు, చట్టాలూ అని సన్నాయి నొక్కులు నొక్కుకుంటారో, కమ్యూనిస్టు పార్టీ దేనికి ఉందో గ్రహించి ఈ సవరణను ఆమోదిస్తారో తేల్చుకోవాలి' అని నిండు సభలో ప్రకటించాడు.

ప్రభుత్వంలో ఉదారవాదులుగా పేరొందినవారే కమ్యూనిస్టులను ఒంటరిపాటు చేయడానికి, విచారణలకు, జైళ్ళలో ఖైదు చేయడానికి, కాల్చి చంపడానికి తమ వంతు ఆజ్యం పోశారు. ఈ దగాకోరు వ్యవహారం నడపడానికి మితవాదులు, ఉదారవాదుల మధ్య సంకీర్ణం అవసరం అని రాజకీయంగా భావించి, ఆ మేరకు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నా మెకార్థీ కమ్యూనిస్టులతో పాటు ఉదారవాదుల మీద కూడా తన దాడిని ఎక్కుపెట్టాడు. ఉదాహరణకి సెనెట్‌లో మైనారిటీల నాయకుడిగా ఉన్న లిండన్ జాన్సన్ మెకార్థీపై అభిశంసన తీర్మానం నెగ్గడానికి సహకరించాడు కానీ ఎక్కడా కూడా మెకార్థీ అనుసరిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక విద్వేషం గురించి పల్లెత్తుమాట మాట్లాడలేదు. ఇక జాన్ ఎఫ్. కెనడీ అయితే ఆచితూచి వ్యవహరించాడు. మెకార్థీకి వ్యతిరేకంగా నోరు విప్పలేదు అసలు. అన్నిటికీ మించి అభిశంసన తీర్మానం ఓటింగ్‌లోనే పాల్గొనకుండా గైర్హాజరయ్యాడు. సభలో ఉంటే అనుకూలంగా ఓటు వేసేవాడా, వ్యతిరేకంగా ఓటు వేసేవాడా అన్నది ఊహకైనా తట్టని విధంగా వ్యవహరించాడు. చైనాలో కమ్యూనిజం విజయవంతం కావడానికి ప్రభుత్వం అనుసరించిన మెతక వైఖరే కారణం అనేది మెకార్థీ అభిప్రాయం. కెనడీ కూడా దాదాపు ఇదే అభిప్రాయంతో ఉన్నాడు. చైనా కమ్యూనిస్టులు పెకింగ్‌ను వశం చేసుకున్న నేపథ్యంలో 1949 జనవరి నెలలో 'అమెరికన్ కాంగ్రెస్' ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కెనడీ ఇలా అన్నాడు.

"స్పీకర్ సార్, ఈ వారాంతంలో చైనా, అమెరికాలు ఎంతటి భారీ ఉపద్రవాన్ని చవిచూడాల్సి వచ్చిందో మీకు తెలుసు. ఈ వైఫల్యానికి మధ్యప్రాచ్యంలో మన విదేశాంగ విధానం బొక్కబోర్లా పడటానికి అధ్యక్ష భవనం, హోంమంత్రిత్వ శాఖలు పూర్తిగా బాధ్యత వహించాలని నే భావిస్తున్నా!

కమ్యూనిస్టులతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోతే ఆర్థిక సాయం అందించేది లేదు అని అదేపనిగా అమెరికా ఒత్తిడి చేయడం మూలంగా చైనా జాతీయ బూర్జువా ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

మన రాయబారులు, వాళ్ళ సలహాదారులు, లాట్టిమోర్, ఫెయిర్‌బ్యాంక్ లాంటి మహాశయులూ కలిసి ఇరవై ఏళ్ళుగా యుద్ధాలు, అంతర్యుద్ధాలలో నలిగిపోయి, అత్యున్నత

స్థాయిలో అవినీతి ప్రబలిపోయిన చైనా అప్రజాస్వామిక వ్యవస్థను చక్కదిద్దడంలో అమెరికా ఏం పందెం ఒడ్డిందో (స్టేక్) గుర్తించలేకపోవడం మూలానే చైనా ఈనాడు కమ్యూనిస్టుల వశం అయింది.

"కనీసం ఇప్పటికైనా ఈ సభ తెలివితెచ్చుకుని ఆసియా ఖండాన్ని కమ్యూనిజం కమ్మేయకముందే తన బాధ్యత ఏమిటో గుర్తిస్తుందని ఆశిస్తున్నాను."

ఇది కెనడీ ప్రసంగ సారాంశం. ఈ ప్రసంగంలో ఉదహరించిన లాట్టిమోర్, జాన్‌ఫెయిర్‌బ్యాంక్‌లు చైనా చరిత్ర పరిశోధనలో విశిష్టులు. లాట్టిమోర్ మెకార్థీ ఫేవరెట్ టార్గెట్, జాన్ ఫెయిర్ బ్యాంక్ హార్వర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్.

1950లో రిపబ్లికన్‌లు అంతర్గత భద్రతా చట్టాన్ని ఒకదాన్ని సిఫార్సు చేశారు. 'కమ్యూనిస్టు కార్యాచరణ' కమ్యూనిస్టులతో పొత్తు కట్టే పార్టీలు, సంస్థలు అన్నీ ఈ చట్టాన్ని అనుసరించి విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని ప్రతిపాదించారు. కానీ ఉదారవాదులుగా పేరుపడ్డ సెనెటర్లు ఈ దుర్మార్గమైన క్లాజుకు వ్యతిరేకంగా ఎలాంటి ప్రతిఘటనా ప్రదర్శించలేదు. మీదు మిక్కిలి హ్యూబర్ట్ హంఫ్రీ, హెర్బట్ లెహ్‌మాన్ వంటి వాళ్ళు దీనికన్నా అనుమానితుల కోసం నిర్బంధ శిబిరాలు (డిటెన్షన్ సెంటర్) (నిజానికి నాజీ కాన్‌సంట్రేషన్ క్యాంపుల వంటివి) ఏర్పాటు చేయడం మంచిదని సూచించాడు. దేశాధ్యక్షుడు 'అత్యవసర పరిస్థితి'ని (ఎమర్జెన్సీ) ప్రకటించిన పక్షంలో అనుమానితులను విచారించకుండానే నిర్బంధించవచ్చు అని సిఫార్సు చేశారు. ఏతావాతా అటు అంతర్గత భద్రతా చట్టంతో పాటు 'డిటెన్షన్ క్యాంప్' బిల్లు కూడా రంగంలోకి వచ్చింది (1968లో కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం అడుగంటిన నేపథ్యంలో ఈ చట్టాలను రద్దు చేశారు).

1947లో ట్రూమన్ జారీ చేసిన 'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్' ప్రాతిపదికగా న్యాయమంత్రిత్వశాఖ అమెరికా ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైన పద్ధతుల్లో (విప్లవం) కూలదోయాలనీ కానీ, ప్రభుత్వ స్వభావాన్ని మార్చాలని కానీ లక్ష్యంగా పెట్టుకున్న నియంతృత్వ, ఫాసిస్టు, కమ్యూనిస్టు సంస్థల జాబితాను రూపొందించాలని నిర్ణయించబడింది. కేవలం అటువంటి సంస్థలతో సభ్యులుగా ఉన్నవాళ్ళనే కాదు సానుభూతిపరులను అవిధేయుల జాబితాలో చేర్చడమా లేదా అనేది అటార్నీ జనరల్ హక్కుగా వుంటుందని సర్కారు ప్రకటించింది. 1954 నాటికి ఇలాంటి జాబితాలో వందల సంస్థల పేర్లను చేర్చారు. కు–క్లక్స్–క్లాన్ వంటి శ్వేతవర్ణ దురహంకార సంస్థలతో పాటు కమ్యూనిస్టు పార్టీని, చాప్లిన్ సాంస్కృతిక కేంద్రం, 'నౌకర్ల' సౌహార్థ సంఘం, నీగ్రో కళాకారుల కమిటీ, రచయితల సమాఖ్య, అమెరికన్ పర్యావరణ ప్రేమిక బృందం, ప్రజానాటక రంగం, వాషింగ్టన్ బుక్ షాప్ సమాఖ్య, యుగోస్లేవియా రేవు కార్మికుల క్లబ్బు వంటి అనేక సంస్థలు ఈ జాబితాకు ఎక్కాయి.

పచ్చి కమ్యూనిస్టు విద్వేషి మెకార్థీయో, రిపబ్లికన్‌లో కాదు అచ్చంగా ఉదారవాద డెమొక్రట్ పార్టీ తరపున అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన ట్రూమన్ ప్రభుత్వం చేపట్టిన గొలుసుకట్టు

ప్రాసిక్యూషన్‌లు జాతి ఆలోచనల్లో కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణులు ప్రకోపించేందుకు దోహదపడ్డాయి. రోజెన్‌బర్గ్‌లపై జరిగిన విచారణోదంతం సర్కారీ ప్రాసిక్యూషన్‌లలో బోలుతనాన్ని బహిర్గతం చేసాయి.

రోజన్-బర్గ్‌ల కేసులో ఎథెల్ రోజెన్‌బర్గ్ సోదరుడు డేవిడ్ గ్రీన్‌గ్లాస్ కీలక సాక్షి. 1944-45 ప్రాంతంలో న్యూ మెక్సికోలోని లాస్ అలమోస్ ప్రాంతంలో ఉన్న మన్‌హాటన్ ప్రాజెక్టు లేబరేటరీలో అణుబాంబు తయారీ, పాటవ పరీక్షకు సంబంధించి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో డేవిడ్ మెకానిక్‌గా చేస్తున్నాడు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారం రష్యా వాళ్లకు అందించడానికి సహకరించమని జూలియస్ రోజన్‌బర్గ్ తనను అడిగాడని, బావ కోసమని, జ్ఞాపకాల ఆధారంగా కొన్ని స్కెచ్‌లు గీసి ఇచ్చానని, అణుబాంబుల విస్ఫోటనానికి ఉపయోగించే లెన్సుల పరిశోధనలు చెయ్యడం తన బావ వ్యాపకమని, జెల్-ఓతో నింపిన సగం కార్డ్‌బోర్డ్ పెట్టెను బావ తనకు అందించాడని, దాన్ని మెక్సికోలో మిగతా సగం పెట్టె ఉన్న మనిషి ఒకతనిని కలిసి ఇచ్చిరమ్మని చెప్పాడని వాంగ్మూలం ఇచ్చాడు. తదనంతరం మిగతా సగం పెట్టె ఉన్న ఆసామిగా హారీగోల్డ్ కోర్టులో ప్రత్యక్షమై గ్రీన్ గ్లాస్ చెప్పిన సమాచారం ఏంటో జ్ఞాపకం చేసుకుని చెప్పాడు.

హారీగోల్డ్ ఒక గూఢచర్యం కేసులో అరెస్టయి విచారణ అనంతరం 30 ఏళ్లు జైలు శిక్షపడి, అప్పటికి పదమూడేళ్ల శిక్ష అనుభవించిన వ్యక్తి. అలాంటి వ్యక్తి గ్రీన్‌గ్లాస్ వాంగ్మూలాన్ని నిగ్గు తేల్చేందుకు తన వాంగ్మూలం వినిపించడానికి వచ్చాడు. రోజన్‌బర్గ్‌లను తాను ఎన్నడూ కలవలేదని అయితే సోవియట్ రాయబార కార్యాలయం తాలూకు అధికారి ఒకరు జెల్‌ఓతో కూడిన సగం కార్డుబోర్డు పై భాగాన్ని ఇచ్చి గ్రీన్‌గ్లాస్‌ను కలవమని చెప్పాడని, నేను జూలియస్ నుండి వచ్చానని చెప్పామన్నాడని, గ్రీన్‌గ్లాస్ ఇచ్చిన స్కెచ్‌లు తీసుకువచ్చి అదే రష్యన్ అధికారికి ఒప్పచెప్పానని హారీగోల్డ్ వాంగ్మూలం ఇచ్చాడు.

ఈ మొత్తం వ్యవహారంలో సమాధానం దొరకని ప్రశ్నలు ఎన్నో. జైలు నుండి విముక్తి కల్పిస్తామని ఆశ చూపించి హారీగోల్డ్‌తో ఆ రకంగా వాంగ్మూలం ఇప్పించారా? అలా కాకుంటే ముప్పైఏళ్లు శిక్షపడినవాడిని 13 ఏళ్ల శిక్ష అనుభవించాక తెచ్చి వాంగ్మూలం ఇప్పించిన మరో రెండేళ్లకే 'పెరోల్' మీద ఎందుకు, ఎలా విడుదల చేసినట్లూ? గ్రీన్‌గ్లాస్ నేర అంగీకార ప్రకటన వెనుక ఇలాంటి తీవ్ర శిక్షల బెదిరింపు పని చేసిందా? లేకుంటే పదిహేనేళ్ల శిక్ష పడిన గ్రీన్‌గ్లాస్ ఏడున్నర ఏళ్లకే జైలు నుండి ఎలా విడుదల అయినట్లూ? గ్రీన్‌గ్లాస్ శాస్త్రవేత్త కాదు, కేవలం మెకానిక్కు. అటువంటి అతను అణుబాంబు తయారీకి సంబంధించిన స్కెచ్‌లను జ్ఞాపకం తెచ్చుకుని గీసి ఇచ్చినట్లు చెప్పాడు. ఈ విషయం నమ్మదగినదిగా ఉందా? మెకానిక్‌కు తెలివితేటలు ఉండకూడదా అనే ప్రశ్న తలెత్తవచ్చు. కాని గ్రీన్‌గ్లాస్ బ్రూక్లిన్‌లోని పాలిటెక్నిక్

యూనివర్శిటీలో ఆరు కోర్సులు ఎంచుకుని చదివి ఐదింట డింకీలు కొట్టిన మనిషి. అంతేకాదు తొలుత గ్రీన్‌గ్లాస్, హారీగోల్డ్‌లు కోర్టులో వినిపించిన కథనాలు ఏకరీతిలో లేవు. న్యూయార్క్‌లోని టాంబ్స్ జైలులో ఇద్దరినీ ఒకే అంతస్థు జైలుకొట్టాల్లో ఉంచాక కూడబలుక్కుని మరీ సాక్ష్యం చెప్పిన దాఖలాలనూ కొట్టిపారెయ్యలేం.

అసలు హారీగోల్డ్ వాంగ్మూలమే నమ్మశక్యం కానిరీతిలో ఉంది. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ రోజన్‌బర్గ్‌ల కేసులో ఇతనితో నాలుగువందల గంటలపాటు ఇంటర్వ్యూలు చేసిన విషయం బయటకు పొక్కడంతో సదరు ఎఫ్.బి.ఐయే అతన్ని ఈ మేరకు సిద్ధం చేసి ఉంటుందనే కోణాన్ని కొట్టిపారెయ్యలేం. తరచూ ఊహాత్మకమైన అబద్ధాలు అతికినట్టు చెప్పే అలవాటు ఉన్న మనిషి ఇతను. రోజెన్‌బర్గ్‌ల కేసు తదనంతర కాలంలో జరిగిన ఒక కేసు విచారణలో హారీగోల్డ్‌ను డిఫెన్సు లాయరు భార్యాపిల్లల గురించిన ఊహాత్మక కథనాలను గురించి ప్రశ్నించాడు. 'ఆరేళ్లుగా నువ్వు అబద్ధాలు చెప్తున్నావు కదూ' అని అతన్ని ప్రశ్నించగా, 'ఆరేళ్లుగా కాదు పదహారేళ్లుగా నేను అబద్ధాలు ఆడతానే ఉన్నాను' అని బదులిచ్చాడు. విచిత్రంగా రోజన్‌బర్గ్‌ల కేసులో అదే హారీగోల్డ్ ఒక్కడే సాక్షి.

హారీగోల్డ్‌ను ఇంటర్వ్యూ చేసిన ఎఫ్‌బిఐ ఏజెంటును ఇరవై ఏళ్ల తరువాత ఒక జర్నలిస్టు ఇంటర్వ్యూ చేస్తూ హారీగోల్డ్ ఉపయోగించిన కోడ్ వర్డ్ గురించి అడిగాడు. అందుకు బదులుగా ఆ ఏజెంటు ఇచ్చిన సమాధానం ఏంటంటే– "నిజానికి గోల్డ్ ఆ కోడ్‌వర్డ్‌ను గుర్తు తెచ్చుకోలేకపోయాడు. 'నేను ఫలానా చోట నుండి వచ్చాను అనో అలాంటిదో ఇంకేదో' అని నీళ్లు నమిలాడు. 'బహుశా జూలియస్ అనే పదం అయి ఉంటుందా' అని నే సూచనప్రాయంగా ప్రశ్నించా. దాంతో అతని మతిమరుపు ఎగిరిపోయింది. అసలు కోడ్‌వర్డ్ గుర్తుకు తెచ్చుకున్నాడు."

ఈ సమాధానం చాలదూ ఎఫ్‌బిఐ ఏజెంట్లు హారీగోల్డ్ ఏమని వాంగ్మూలం ఇవ్వాలో తర్ఫీదు ఇచ్చారని తెలుసుకునేందుకూ?

రోజన్‌బర్గ్‌ల మీద మోపిన అభియోగాలు రుజువయినందున విచారణ జరిపిన న్యాయమూర్తి ఇర్వింగ్ కాఫ్‌మన్ తీర్పు వెలువరిస్తూ– "రష్యా అణుబాంబును తయారు చేస్తుందని మన శాస్త్రవేత్తలు ఊహించిన దానికన్నా ముందే వారి చేతుల్లో అణుబాంబు పరిజ్ఞానాన్ని ఉంచడం ద్వారా, మీ ఈ నడత మూలంగా కొరియా కమ్యూనిస్టు దురాక్రమణకు గురై 50,000 మంది అమెరికన్ సైనికులు మృత్యువాతపడేందుకు కారణమయ్యారు. ఏమో మీరు చేసిన నమ్మకద్రోహం మూలంగా రేపు లక్షలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిరావచ్చు. అందుకే మీ ఇద్దరికీ మరణశిక్ష విధిస్తున్నా, ఎలక్ట్రిక్‌ఛైర్ ద్వారా ఈ శిక్షను అమలు చెయ్యాలని ఆదేశిస్తున్నా" అని ప్రకటించాడు.

రోజన్‌బర్గ్‌లతో సహకుట్రదారుడిగా మోర్టాన్‌నోబెల్ విచారణ ఎదుర్కొన్నాడు. ప్రధానసాక్షి నోబెల్ సన్నిహిత మిత్రుడు, దగ్గరుండి పెళ్లి జరిపించినవాడు. అంతేకాదు తన

రాజకీయ గతం గురించి అబద్ధాలు చెప్పాడనే అభియోగాలమీద అప్పటికే ఫెడరల్ ప్రభుత్వ విచారణను ఎదుర్కొంటున్నవాడు. నయానో భయానో అతనితో సాక్ష్యం చెప్పించాలని ఎఫ్‌బిఐ ఏజెంట్లు నిర్ణయించుకున్నారు. అతని పేరు మాక్స్ ఎలిట్చర్. ఒకసారి తను మోర్టాన్ నోబెల్‌ను కార్లో ఎక్కించుకుని మన్‌హాటన్ హౌసింగ్ ప్రాజెక్టులో నివసిస్తున్న రోజన్‌బర్గ్‌ల ఇంటికి తీసుకువెళ్లినట్లు, నోబెల్ కారు దిగి ఫిల్మ్‌డబ్బాలాంటిది తీసుకువెళ్లినట్లు తిరిగి వచ్చేటప్పుడు ఉత్తచేతులతో తిరిగి వచ్చినట్లు వాంగ్మూలం చెప్పాడు. అయితే ఆ ఫిల్మ్ డబ్బాలో ఏముంది అనే వివరం చెప్పలేదు. నోబెల్‌కు వ్యతిరేకంగా గట్టి సాక్ష్యాధారాలు లేవు. అందుకే అతని తరపు లాయరు 'డిఫెన్సు' వాదన కూడా చెయ్యలేదు. కానీ 'జ్యూరీ మాత్రం' నోబెల్‌ను దోషిగా తేల్చింది. కాఫ్‌మాన్‌కు ముప్ఫై ఏళ్ల కఠిన కారాగారవాస శిక్ష విధించారు. అల్కాట్రాజ్‌కు కారాగారవాసానికి పంపారు. పెరోల్ కోసం పెట్టుకున్న పిటిషన్లను వరుసగా తిరస్కరిస్తానే వచ్చింది జైలు యంత్రాంగం. పంతొమ్మిదేళ్లపాటు వివిధ జైళ్లలో శిక్ష అనుభవించిన అనంతరం విడుదల అయ్యాడు.

1970లో వెలుగుచూసిన ఎఫ్‌బిఐ డాక్యుమెంట్లలో విభ్రాంతికర అంశాలు బయటపడ్డాయి. రోజెన్‌బర్గ్‌ల కేసును విచారించిన న్యాయమూర్తి ఈ కేసులో ఏం శిక్ష విధించబోతున్నదీ ముందుగానే రహస్యంగా ప్రాసిక్యూటర్‌లకు వెల్లడి చేసాడని బహిర్గతమయింది. ఇంకో పత్రంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫ్రెడ్ విన్సన్, అటార్నీ జనరల్ హెర్బర్ట్ బ్రౌనెల్‌ల మధ్యన రోజన్‌బర్గ్‌ల కేసు అప్పీలు విషయమై విచారణ జరుగుతున్న నేపథ్యంలో 'ములాకత్' జరిగిందనీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎవరన్నా మరణశిక్షపై 'స్టే' విధిస్తే తాను తక్షణమే ఫుల్‌బెంచిని పిలిచి ఆ స్టేను రద్దు చేయిస్తానని అటార్నీకి మాట ఇచ్చినట్లు వెల్లడయింది.

రోజన్‌బర్గ్‌లకు విధించిన శిక్షకు వ్యతిరేకంగా యావత్ ప్రపంచంలో నిరసనలు వెల్లువెత్తాయి. ప్రపంచ యుద్ధానికి ముందు ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్‌కు ఉత్తరం రాయడం ద్వారా ఆటంబాంబు తయారీకి దోహదం చేసిన అల్బర్ట్ ఐన్‌స్టీన్ రోజన్‌బర్గ్‌ల కేసులో శిక్ష రద్దు పరచమని స్వయంగా అప్పీలు చేసాడు. జీన్–పాల్–సార్త్రే, పాబ్లో పికాసో, బార్టొలొమి వాంజెట్టీ సోదరి తదితర ప్రముఖులు ఎందరో అమెరికన్ అధ్యక్షులకు ఈ కేసులో శిక్ష రద్దు గురించి అప్పీలు చేసారు. ప్రెసిడెంట్ ట్రూమన్‌కు చేసిన అప్పీలును అతను అధ్యక్ష పదవి నుండి వైదొలగనున్న 1953 వసంతకాలంలో తిరస్కరించాడు. ఆ తర్వాత అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన ఐసన్‌హోవర్‌కు చేసిన అప్పీలూ తిరస్కరించబడింది.

చివరి నిమిషంలో జస్టిస్ విలియమ్ ఒడగ్లస్ మరణశిక్ష అమలు మీద స్టే విధించాడు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి విన్సన్ తక్షణమే దేశంలోని పలు ప్రాంతాలకు విమానాలు

పంపించి సెలవుల్లో ఉన్న న్యాయమూర్తులందరినీ హడావుడిగా ఆకాశమార్గాన వాషింగ్టన్‌కు రప్పించి ఫుల్‌బెంచిని సమావేశపరిచి జస్టిస్ విలియమ్ డగ్లస్ ఇచ్చిన స్టేను రద్దు చేసి 1953 జూన్ 19లోగా రోజన్‌బర్గ్‌లకు మరణశిక్ష అమలు పరచాలని తీర్పు వెలువరించాడు. ద్రోహులుగా ముద్రవేసిన వారిని ప్రభుత్వం కడదాకా ఎంతలా వెంటాడుతుంది అనేది అమెరికన్ ప్రజానీకానికి సోదాహరణంగా తెలియచెప్పిన ఉదంతం ఇది.

అదే యాభైయ్యవ దశకం తొలిపాదంలో అమెరికనేతర కార్యకలాపాలపై నియమించిన పార్లమెంటు కమిటీ ప్రజలను భయవిహ్వలతకు గురిచేసింది. కమ్యూనిస్టులతో 'కనెక్షన్లు' ఉన్నాయనే పేరిట వేలాదిమందిని 'ఇంటరాగేషన్'తో వేధించింది. న్యాయవిరుద్ధమైన ఈ ఇంటరాగేషన్‌లో స్పందించేందుకు ఎవరన్నా నిరాకరిస్తే చట్ట ఉల్లంఘన అభియోగాలు మోపి శిక్షలు వేయించేది. 'కమ్యూనిజం గురించి నువ్వు తెలుసుకోవాల్సిన వంద సంగతులు' (కమ్యూనిస్టులను ఎలా దొరకబుచ్చుకోవడం, ప్రతిచోటా దొరకబుచ్చుకోవచ్చు) అనే కరపత్రాలు ముద్రించి లక్షలాదిగా పంచారు. ఉదారవాదులు పైకి ఈ చర్యలను విమర్శించినా ఈ కమిటీకి ఏటా తగినన్ని నిధులు విడుదల చెయ్యడానికి మితవాదులతోకలిసే ఓటు వేసేవారు. 1958లో మాత్రం పార్లమెంటరీ కమిటీలోని ఒకే ఒక సభ్యుడు (జేమ్స్‌రూజ్‌వెల్ట్) నిధుల విడుదలకు వ్యతిరేకంగా ఓటువేసాడు. ఈ కమిటీ పనితీరును ట్రూమన్ విమర్శించాడు. కాని ఆయన నియమించిన అటార్నీ జనరల్ వైఖరే ఇలాంటి తప్పుడు ఇన్వెస్టిగేషన్‌లకు ఊతం ఇచ్చింది. "అమెరికాలో ఇవాళ చాలామంది కమ్యూనిస్టులు ఉన్నారు. ఫ్యాక్టరీలలో, ఆఫీసుల్లో, కసాయి కొట్లలో, వీధిమూలల్లో, ప్రైవేటు వ్యాపారాల్లో ఎక్కడబడితే అక్కడ వాళ్లే– వాళ్లలో ప్రతి ఒక్కళ్లూ ఈ సమాజాన్ని నిర్మూలించే క్రిములు మోస్తూ ఉన్నారు" అని విద్వేషం కక్కాడు ఆ పెద్దమనిషి.

ఉదారవాద మేధావులు కూడా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార రథం మీద ఎక్కి ఊరేగారు. 'కామెంటరీ' అనే పత్రిక రోజన్‌బర్గ్‌లను, వారిని సమర్థించేవారిని తెగనాడుతూ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ఇర్వింగ్‌క్రిస్టల్ అనే రచయిత మార్చి 1952 సంచికలో 'కమ్యూనిస్టులను బలపరచడం ద్వారా మనం మన హక్కులు కాపాడుకుంటున్నాం అనుకుంటున్నారా– కానే కాదు' అని నిస్సిగ్గుగా ప్రకటించాడు.

ట్రూమన్ పదవీకాలంలోనే న్యాయమంత్రిత్వ శాఖ కమ్యూనిస్టు పార్టీ నాయకులను 'స్మిత్ చట్టం'కింద విచారించేందుకు తగిన చర్యలు తీసుకుంది. ప్రభుత్వాన్ని బలప్రయోగంతోను, హింసతోను పడదొయ్యాలని పదిమందికీ నేర్పిస్తున్నారు. నూరిపోస్తున్నారు' అని వాళ్ల మీద అభియోగాలు మోపారు. కమ్యూనిస్టులు అమ్మే మార్క్సిస్టు–లెనినిస్టు సాహిత్యంలో హింసాత్మక విప్లవబోధనలు ఉన్నాయి కాబట్టి ఆ సాహిత్యాన్నే సాక్ష్యాలుగా కోర్టులో ప్రవేశపెట్టారు. (ఈ విచారణ గురించి మరింత ఆసక్తికర సమాచారం కోసం హ్యూగోరాసిన 'బ్లాక్స్ డిసెంటింగ్ ఒపీనియన్' అనే పుస్తకం చూడండి).

వాస్తవానికి కమ్యూనిస్టు పార్టీ తక్షణమే హింసాత్మక విప్లవం లేవదీయడానికి ప్రయత్నిస్తుంది అనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ లేవు. కానీ ట్రూమన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించిన జస్టిస్ విన్సన్ ఈ కేసులో తీర్పు ఇచ్చాడు. "కాలం కలిసివచ్చినప్పుడు హింసాత్మక విప్లవం లేవదీసే ఆలోచనతో ఉన్నారని అనేందుకు కావల్సిన స్పష్టమైన, వర్తమాన ఆధారాలు ఉన్నాయి కాబట్టి వీరు తక్షణమే ప్రమాదాన్ని కొనితెచ్చేలా ఉన్నారు" అని తీర్పు చెప్పాడు. దాంతో మొత్తం కమ్యూనిస్టు పార్టీనే జైల్లో పెట్టారు. పార్టీ అనుబంధ సంఘాలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాయి.

మొత్తానికి ఎలాగైతేనే పాలకవర్గాలు ప్రజలలో కమ్యూనిస్టుల పట్ల తీవ్ర భయాందోళనలు రేకెత్తించడంలో విజయం సాధించాయి. కమ్యూనిస్టుల మీద ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టినా పట్టీపట్టనట్టు వ్యవహరించే సరళి ప్రజలకు అబ్బించారు. కమ్యూనిస్టు వాసనలు తగిలిన వారందరినీ గృహ నిర్బంధంలో ఉంచారు. కమ్యూనిస్టు బూచిని అణిచివేసే పేరిట పరాయి దేశాల్లో సైనిక చర్యలు చేపట్టారు. కమ్యూనిస్టుల పట్ల విషం చిమ్మే కొత్త సంస్కృతిని పాదుకొల్పారు. అత్యధిక సర్క్యులేషన్ గల పత్రికలు పనిగట్టుకుని కమ్యూనిస్టు విద్వేషాన్ని రెచ్చగొట్టాయి. 'కమ్యూనిస్టులు ఆ బాట ఎందుకు పట్టారు' 'జాగ్రత్త కమ్యూనిస్టులు మీ పిల్లాడి వెనుకపడుతున్నారు' వంటి కథనాలు వెలువరించేవి. "కమ్యూనిస్టులకు వార్తలను నిజాయితీగా, విషయగతంగా అందించే నేర్పు ఉండదు కాబట్టే మేం మా పత్రికలోని వార్తావిభాగంలోగాని, సంపాదక విభాగంలోగాని కమ్యూనిస్టులను పనిలో పెట్టుకోం" అని 1956లో న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంపాదకీయం రాసింది. ఎఫ్‌బిఐకి ఇన్ఫార్మర్‌గా పనిచేసే ఒకతను, కమ్యూనిస్టులలో చేరి వారి రహస్యాలు చేరవేస్తూ ఆనక ఎఫ్‌బిఐ ఏజెంటుగా ఉద్యోగం సంపాదించాడు. 'నేను మూడు జీవితాలు జీవించాను' అని అతగాడు రాసిన కథనాన్ని దాదాపు 500 పత్రికలలో ధారావాహికంగా అచ్చొత్తారు. టీవీ సీరియల్‌గా వేసారు. హాలీవుడ్ సినిమాలదీ ఇదే తంతు. 1948-54 మధ్య కాలంలో దాదాపు 40 కమ్యూనిస్టు వ్యతిరేక సినిమాలు తీసి జనాల మీదకి వదిలారు.

ప్రత్యేకించి కమ్యూనిస్టులు, ఇతర రాజకీయ పార్టీల పౌరసత్వహక్కులను పరిరక్షించేందుకు ఆవిర్భవించిన అమెరికన్ పౌరహక్కుల సంఘం కూడా ప్రచ్ఛన్న యుద్ధవాతావరణ నేపథ్యంలో తన బాధ్యత నుండి క్రమేపీ తప్పుకోసాగింది.

వాస్తవానికి ఆ రోజున ఉన్న వాతావరణం నిరాయుధీకరణ పాలసీకి పెద్దఎత్తున ప్రజా మద్దతు కూడగట్టేందుకు అనుకూలంగా ఉంది. 1930వ దశకంలో కుదేలయిపోయి పునాదులంటా కదిలిపోయిన వ్యవస్థ యుద్ధం మూలంగా వ్యవస్థను నిలబెట్టుకోవచ్చు. అపారమైన లాభాలు పోగేసుకోవచ్చు అని పాలకులు గ్రహించారు. దీనికి తోడు ట్రూమన్ అనుసరిస్తున్న పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకత ఇంకా కలిసివచ్చింది. 1946 నవంబరులోనే ఉక్కు పరిశ్రమల

రంగం గురించి యాజమాన్యాలు వెలువరించే ఒక ప్రచురణలో 'యుద్ధ సన్నాహాలు కొనసాగిస్తామని ఇచ్చిన నికరమైన వాగ్దానం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు రాబోయే కాలంలో భారీ వ్యాపారం సమకూరుస్తాయని భావిస్తున్నాం" అని ప్రకటించింది.

ఆ తరువాత చోటు చేసుకున్న పరిణామాలు ఈ ముందస్తు అంచనా సరైనదే అని రుజువు చేసాయి. 1950లో అమెరికా బడ్జెట్ 40 బిలియన్ డాలర్లు అయితే ఇందులో మిలిటరీ వ్యయం 12 బిలియన్ డాలర్లుగా కేటాయించారు. 1955కు వచ్చేసరికి 60 బిలియన్ డాలర్ల బడ్జెట్‌లో మిలిటరీ కేటాయింపులు 40 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. 1960 నాటికి మిలిటరీ బడ్జెట్ 45.8 బిలియన్ డాలర్లకు పెరిగింది. మొత్తం బడ్జెట్‌లో ఇది 9.7 శాతం. ఆ ఏడాదే జాన్.ఎఫ్. కెనడీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. గెలిచిన వెంటనే మిలిటరీ వ్యయాన్ని పెంచాడు. 14 నెలల కాలంలో మరో 9 బిలియన్ డాలర్లు మిలిటరీ బడ్జెట్‌కు కేటాయించారు.

1962 నాటికి సోవియట్ మిలిటరీ బలం హెచ్చింపు గురించి జనాలను బెదరకొట్టే కథనాలు విరివిగా ప్రచారంలోకి వచ్చాయి. రష్యాకన్నా బాంబర్లు తక్కువగా ఉన్నాయి. మిస్సైళ్లు తక్కువగా ఉన్నాయి అనే సన్నాయి నొక్కు ప్రచారాలు మొదలయ్యాయి. నిజానికి ఆనాటికే హిరోషిమా పట్టణాన్ని సర్వనాశనం చేసిన అణుబాంబుల వంటివి 1500 టన్నులదాకా అమెరికా అమ్ములపొదిలిలో ఉన్నాయి. ప్రపంచంలోని పట్టణాలన్నింటినీ సర్వనాశనం చెయ్యగల అణ్వాయుధ సామర్థ్యం అమెరికాకు ఉంది. ఆడ, మగా– పిల్లా, జెల్లా అనే తేడా లేకుండా తలకు 10 టన్నుల టియన్‌టి కురిపించగల సత్తా అమెరికాది. సొంతగడ్డమీద నుండే ఈ బాంబులను ప్రయోగించడానికి అమెరికా దగ్గర 50 ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లు, 80 మిస్సైళ్లు కలిగిన సబ్‌మెరైన్ (జలాంతర్గామి), ఖండాంతర సైనిక స్థావరాల్లో 90 మిస్సైళ్లు సోవియట్‌ను ఆఘమేఘాల మీద చేరుకోవడానికి 1700 బాంబర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్‌ల(జల ఓడలు) మీద సిద్ధంగా మరో 300 ఫైటర్ – బాంబర్లు మరో వెయ్యి సూపర్ సోనిక్ (మానవరహిత) విమానాలు ఉన్నాయి.

అదే సోవియట్ విషయానికి వస్తే 50 నుండి 100 ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్ళు, 200 లాంగ్ రేంజ్ బాంబర్లు మాత్రమే ఉన్నాయి. అయినా రష్యా బలం బూచి చూపి అమెరికన్ మిలిటరీ వ్యయం నానాటికీ పెరిగిపోతూనే వచ్చింది. ఆ పెరుగుదల కూడా ఒక ఉన్మాదంతో కూడినదిగా కనిపిస్తుంది. డిఫెన్సు కాంట్రాక్టులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. కార్పొరేట్ కంపెనీలు లాభాల మీద లాభాలు పోగేసుకోసాగాయి. ఉపాధి అవకాశాలు, వేతనాలు పెరిగాయి. గణనీయమైన సంఖ్యలో అమెరికన్‌లు యుద్ధ పరిశ్రమల మీద ఆధారపడి జీవించే స్థాయి దాపురించింది.

1970 నాటికి అమెరికా మిలిటరీ బడ్జెట్ 80 బిలియన్ డాలర్లకు పెరిగింది. దాంతో రక్షణ పరికరాలను ఉత్పత్తి చేసే కార్పొరేట్ సంస్థల పంట పండింది. 40 బిలియన్ డాలర్లు

ఆయుధాల కొనుగోలుకు ఖర్చు చేస్తే అందులో మూడింట రెండు వంతులు 12 నుండి 15 కార్పొరేట్ సంస్థలే చేజిక్కించుకున్నాయి. వీటికి మాత్రమే గవర్నమెంట్ మిలిటరీ కాంట్రాక్టులు పూర్తి చేయగల సత్తా ఉందని కారణంగా చెప్పారు. కాని సెనెటర్ పాల్ డగ్లస్ అధ్యక్షతన పనిచేసిన సంయుక్త సెనెటర్ల ఆర్థిక సంఘం మాత్రం ఇందుకు భిన్నమైన వాస్తవాలు వెలుగులోకి తెచ్చింది. "టెండర్లు వేసిన కంపెనీలలో ఏడింట ఆరువంతులు పోటీదాయకం (కాంపిటేటివ్) అయినవి కావు. రక్షణ రహస్యాల పేరిట ప్రభుత్వం తనకు నచ్చిన కంపెనీని ఎంపిక చేసుకుని ఈ కాంట్రాక్టులు కట్టబెట్టింది" అని ఆ కమిటీ నిగ్గు తేల్చింది.

1950వ దశకంలోనే సి. రైట్‌మిల్స్ అనే రచయిత 'అధికార అగ్రేసరులు' (ది పవర్ ఎలైట్) అనే పుస్తకంలో రాజకీయ వేత్తలు, కార్పొరేట్ సంస్థలతో పాటు అమెరికన్ మిలటరీని కూడా అధికార అగ్రేసరులలో భాగంగా అభివర్ణించాడు. ఈ మూడు అంగాలూ ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయి పనిచేస్తాయి అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో. 'రక్షణ కాంట్రాక్టులు నిర్వహించే అతి పెద్ద వంద సంస్థలలో దాదాపు రెండువేల మంది పై చిలుకు అత్యున్నత మాజీ సైనికాధికారులు ఉద్యోగులలో పనిచేస్తున్నారని, ఈ వంద సంస్థలే 67.4 శాతం కాంట్రాక్టులు దక్కించుకున్నాయని సెనెట్ కమిటీ బయటపెట్టింది.

ఇదిలా వుంచితే మరోపక్క నుంచి అమెరికా ప్రపంచ దేశాలకు ఆర్థిక సాయం అందించే పేరిట యావత్ భూగోళం మీద అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు నియంత్రణ సాధించేందుకు అవసరమైన 'నెట్‌వర్క్'ను పేనుతా వచ్చింది. ఆయా దేశాలను రాజకీయంగా ప్రభావితం చేసేందుకు ఆర్థిక సాయాన్ని ఒక సాధనంగా మలుచుకుంది. 1948లో రూపొందించిన మార్షల్ ప్లాన్ ప్రకారం పశ్చిమ ఐరోపా దేశాలకు నాలుగేళ్ళలో 16 బిలియన్ డాలర్లు ఆర్థిక సాయంగా ప్రకటించింది అమెరికా. ఈ సాయానికి ఒక ఆర్థిక లక్ష్యం ఉంది. అదే అమెరికా కార్పొరేట్ కంపెనీలకు మార్కెట్ కల్పించడం. ఇవాల్టికీ సహాయ, పునర్నిర్మాణ ఆర్థిక సాయం పేరిట అమెరికా అందించే నిధుల లక్ష్యం కూడా ఆయా దేశాల మార్కెట్‌లలో అమెరికన్ కంపెనీల పట్టు బిగించడానికే. మానవతా దృక్పథం, అంతర్జాతీయ సాయం అని పైకి ఎన్ని మేలి ముసుగులు కప్పినా అంతిమంగా దేశీయ ప్రయోజనాల కోసమే అమెరికా ఆర్థిక సాయం చేస్తుంటుంది.

1952 నుండి అమెరికా అందించే ఆర్థిక సాయాన్ని కమ్యూనిస్టేతర దేశాల్లో తన సైనిక స్థావరాలను నెలకొల్పే, సైనిక శక్తిని పెంచుకునే రాజకీయ లక్ష్యాలతో నిర్వహించింది.

మార్షల్ ప్లాన్ కూడా రాజకీయ ప్రేరేపితమైనదే. అప్పట్లో ఇటలీ, ఫ్రాన్స్ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు బలంగా వుండేవి. అమెరికా ఆర్థిక సాయాన్ని అడ్డుపెట్టుకుని ఆ రెండు దేశాల్లో కమ్యూనిస్టులను మంత్రి వర్గం నుండి దూరంగా పెట్టేలా అక్కడి ప్రభుత్వాలను ఒత్తిడి

చేసింది. ఈ బృహత్తర ప్రణాళిక మొదలు కావడానికి ముందు ట్రూమన్ ఆంతరంగిక కార్యదర్శి డీన్ ఎఛెసన్ ఇలా చెప్పాడు. 'ఈ సహాయ, పునర్నిర్మాణ కార్యక్రమాలు మానవతా దృక్పథంలో భాగంగా ప్రకటించినవే. మీ కాంగ్రెస్ మీ ప్రభుత్వానికి ఈ రోజు ఈ సహాయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందచేయడానికి అనుమతించిందంటే దానికి ప్రధాన కారణం జాతి స్వీయ ప్రయోజనాలే' అన్నాడు.

1952 నుండి ఆర్థిక సాయాన్ని కమ్యూనిస్టేతర ప్రపంచ దేశాల్లో తన మిలిటరీ బలాన్ని, బలగాలనీ పెంచుకోవడానికి బాహాటంగానే ఉపయోగపెట్టుకోసాగింది అమెరికా. అప్పటి నుంచి వరస పదేళ్ళలో మొత్తం 90 దేశాలకు 50 బిలియన్ డాలర్లు ఆర్థిక సాయంగా అందించింది. ఇందులో కేవలం 5 బిలియన్ డాలర్లు మాత్రమే సైనికేతర ఆర్థికాభివృద్ధి సాయంగా అందించింది. అంటేనే అమెరికా ఆర్థిక సాయాన్ని తన మిలిటరీ ప్రయోజనాలకు ఎలాంటి సాధనంగా ఉపయోగించుకున్నదీ మనం అర్థం చేసుకోవచ్చు.

జాన్.ఎఫ్. కెనడీ అధ్యక్ష పీఠం అధిరోహించాక 'అభివృద్ధి కోసం చెట్టాపట్టాల్' అనే పేరిట ఓ పథకం ప్రకటించాడు. లాటిన్ అమెరికా దేశాల్లోని ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి సామాజిక సంస్కరణలు అవసరం. అలాంటి సంస్కరణల కోసమే ఈ 'చెలిమి' అని నమ్మబలికాడు. కానీ అభివృద్ధి పేరిట అమెరికా లాటిన్ అమెరికా దేశాలకు అందించిన నిధులు ప్రధానంగా ఆయా దేశాల్లోని మితవాద నియంతృత్వ ప్రభుత్వాలు తమ అధికారాన్ని పదిలం చేసుకోవడానికి సామాజిక విప్లవాలను పాశవికంగా అణచి వేయడానికి మాత్రమే ఉపయోగపడ్డాయి.

మిలిటరీ సాయంతో మొదలైన ఈ తొలి అడుగు వామనుడి పాదంలా సైనిక జోక్యం దాకా వెళ్ళింది. కొరియా యుద్ధం మొదలయినప్పుడు ట్రూమన్ పదే పదే ఈ ప్రపంచం బలప్రయోగంతో నడవాలా? న్యాయ సూత్రాల ప్రకారం నడవాలా? అనే వాదన లేవదీశాడు. కాని, ట్రూమన్ కానీ అతని తదనంతరం అమెరికా అధ్యక్షులయిన వాళ్ళు గానీ చేతల్లో ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. బలప్రయోగంతో, సైనిక జోక్యంతో అమెరికా ప్రయోజనాలు, ప్రజాస్వామ్యం నిలబెట్టడం కోసం అనే వంకతో అనేక దేశాల్లో తలదూర్చారు. ఇరాన్ ప్రభుత్వం చమురు పరిశ్రమను జాతీయం చేసిందనే ఒక్క కారణంతో 1953లో సిఐఎ జోక్యం చేసుకుని అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టింది.

1954లో గ్వాటిమాలాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడం లోనూ సిఐఎ హస్తం వుంది. పొరుగున్న వున్న హోండురస్, నికరాగువా దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాల్లో శిక్షణ ఇచ్చిన కిరాయి సైనికులకు దన్నుగా నాలుగు అమెరికన్ ఫైటర్ విమానాలు పంపించి మరీ గ్వాటిమాలా పౌర ప్రభుత్వాన్ని గద్దె దింపి అక్కడ నియంతృత్వ సైనిక ప్రభుత్వాన్ని ప్రతిష్టించింది. కల్నల్ కార్లోస్ కాస్టిల్లో అర్మాస్‌ను అధ్యక్షుడిగా చేసింది.

ఇతగాడు ఒకప్పుడు అమెరికాలోని కాన్సాస్ రాష్ట్రంలోని లీవెన్‌వర్త్ ఫోర్ట్‌లో సైనిక శిక్షణ పొందిన అతను.

గ్వాటిమాలాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక అయిన పౌర అధ్యక్షుడు జాకబ్ అర్బాంజ్ మధ్యేవాద సోషలిస్టు భావాలు గల వ్యక్తి. 56 సీట్లు గల పార్లమెంటులో 4 గురు కమ్యూనిస్టు ప్రతినిధులు ఎన్నికయ్యారు. అర్బాంజ్ ప్రభుత్వం అమెరికాకు చెందిన 'యునైటెడ్ ఫ్రూట్' అనే కార్పొరేట్ కంపెనీ కబంధహస్తాల్లో ఉన్న 234,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అందుకు తగిన పరిహారం ప్రకటించింది. అయితే ఆ కంపెనీ ఇందుకు సమ్మతించలేదు. దరిమిలా సైనిక తిరుగుబాటు ద్వారా అర్బాంజ్ ప్రభుత్వాన్ని కూలదోసి అధ్యక్ష పీఠం కైవసం చేసుకున్న అర్మాస్ ఆ భూమిని తిరిగి యునైటెడ్ ఫ్రూట్‌కు కట్టబెట్టాడు. విదేశీ పెట్టుబడుల మీద అర్బాంజ్ ప్రభుత్వం విధించిన పన్నులు, సుంకాలు రద్దు చేసాడు. రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిపే విధానాన్ని ఒక్క కలంపోటుతో రద్దు చేసాడు. రాజకీయ విమర్శకులు వేలాది మందిని జైళ్లలో కుక్కాడు.

1958లో ఐసన్‌హోవర్ ప్రభుత్వం వేలాది మంది అమెరికన్ మెరైనర్లను లెబనాన్ గడ్డమీదకు పంపింది. లెబనాన్‌లో అధికారంలో ఉన్న అమెరికన్ అనుకూల ప్రభుత్వం ప్రజావిప్లవం మూలంగా పతనం అంచుకు చేరిన దశలో అమెరికా సైనిక జోక్యం ద్వారా ఆ సర్కారును గట్టెక్కించింది. ఆ వంకతో చమురు సంపద్వంతమైన ఆ దేశంలో తిష్టవేసింది.

కమ్యూనిస్టులు, సోషలిస్టులు, యునైటెడ్‌ఫ్రూట్ లాంటి అమెరికన్ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారు ఎవరైనాసరే అధికారంలో కొనసాగకుండా చూడడానికి అమెరికన్ పాలకవర్గాల్లో డెమొక్రాట్లు, రిపబ్లికన్లు, కన్సర్వేటివ్‌లు అన్న తేడాలు లేకుండా అందరూ ఏకరీతిగా వ్యవహరిస్తారు. 1961లో క్యూబా విషయంలోనూ ఇదే జరిగింది. ఫ్లోరిడాకు 90 మైళ్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపకల్పం క్యూబా,. అమెరికా అండదండలు ఉన్న సైనిక నియంత బాటిస్టా ప్రభుత్వాన్ని 1959లో ఫైడల్‌కాస్ట్రో బృందం తిరుగుబాటుద్వారా కూల్చేసింది. ఈ ప్రజా విప్లవం అమెరికా వ్యాపార ప్రయోజనాలకు ప్రమాదకరంగా పరిణమించింది. ప్లాట్ అనే సెనెటర్ చేసిన సవరణ ఆధారంగా క్యూబాలో ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని అమెరికా తలపోసింది. కాని ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ ఇరుగుపొరుగు దేశాలతో సఖ్యతగా ఉండాలనే ఉద్దేశంతో 'ప్లాట్' సవరణను రద్దు చేసాడు. అయినా కూడా క్యూబాలోని గ్వాంటనమా సముద్ర పాయ దగ్గర అమెరికా ఇప్పటికీ ఒక నావికా స్థావరం నడుపుతోంది. క్యూబా ఆర్థిక వ్యవస్థ మీద పెత్తనం చలాయించడానికి అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు ఉవ్విళ్లూరుతున్నాయి. క్యూబాలోని గనులు, వస్తూత్పత్తి పరిశ్రమలు, చమురు శుద్ధి కర్మాగారాలు, డెయిరీ ఫారాలలో అమెరికా కంపెనీలు 80 నుండి 100 శాతం వాటాలు కలిగి ఉన్నాయి. చక్కెర పరిశ్రమలో 40 శాతం, రైల్వేలో 50 శాతం వాటాలు ఉన్నాయి.

1953లో కా(స్ట్రో చేసిన తొలి తిరుగుబాటు విఫలమైంది. శాంటియాగోలోని సైనిక బ్యారక్‌ల మీద చేసిన దాడి ఫలించలేదు. బందీగా చిక్కిన కా(స్ట్రో జైలు జీవితం గడిపాడు. తరువాత మెక్సికో చేరుకున్నారు. అక్కడ అర్జెంటీనా విప్లవకారుడు చేగువేరా తోడయ్యాడు. వీరు ఇరువురూ కలిసి గెరిల్లా దళాలను కూడదీసి 1956లో మరోసారి సాయుధ తిరుగుబాటు లేవదీశారు. బాటిస్టా సైన్యానికి వ్యతిరేకంగా (అడవుల్లో, కొండల్లో ఉండి) గెరిల్లా యుద్ధ తంత్రం నడుపుతూ ప్రజా మద్దతు కూడగట్టుకున్నారు. ప్రజాబలంతో అడవులు వీడి సీదాగా రాజమార్గాన వచ్చి హవానా మీద విరుచుకుపడ్డారు. 1959 నూతన సంవత్సరాది రోజున బాటిస్టా సైనిక నియంతృత్వ ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం కైవసం చేసుకున్నారు.

అధికారంలోకి రాగానే కా(స్ట్రో దేశంలో అందరికీ చదువు, ఉండటానికి ఇల్లు, భూమిలేని రైతాంగానికి భూమి కల్పించాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించాడు. యునైటెడ్ ఫ్రూట్ సహా మొత్తం మూడు అమెరికన్ కార్పొరేట్ కంపెనీల కబ్జాలో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని కా(స్ట్రో ప్రభుత్వం జప్తు చేసింది.

సార్వత్రిక విద్య, సార్వత్రిక ఆవాస సౌకర్యాలు కల్పించాలంటే కా(స్ట్రో ప్రభుత్వానికి నిధులు కావాలి. ఇలాంటి సామాజిక ప్రయోజనాలు ఉన్న పథకాలకు అమెరికా అప్పులు ఇవ్వదు, ఆర్థిక సాయమూ చెయ్యదు. ఐ.యం.ఎఫ్., ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలలో కూడా అమెరికాదే పెత్తనం కాబట్టి అవి కూడా పైసా విదిలించడానికి సిద్ధంగా లేవు. కా(స్ట్రో తలపెట్టిన పథకాలు విజయవంతం అయితే అతని పరిపాలన బలపడిపోతుంది. విప్లవం బలోపేతం అవుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ అలా జరగకూడదు. జరగనివ్వరాదనేది అమెరికా ఆలోచన. ఇలాంటి పరిస్థితుల్లో క్యూబా క్రూడాయిల్ (ముడి చమురు) దిగుమతి కోసం రష్యాతో ఒక ఒప్పందం చేసుకుంది. అయితే రష్యా నుండి దిగుమతి చేసుకున్న ముడిచమురును శుద్ధి చేసేది లేదని క్యూబాలోని అమెరికన్ కంపెనీలు భీష్మించుకు కూచున్నాయి. దాంతో కా(స్ట్రో ఆ కంపెనీలను జాతీయం చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇందుకు ప్రతీకారంగా అమెరికా క్యూబా నుండి పంచదార కొనుగోళ్ళలో భారీ కోత పెట్టింది. పంచదార ఎగుమతుల మీదే ప్రధానంగా ఆధారపడిన క్యూబా ఆర్థిక వ్యవస్థను ఆ రకంగా దెబ్బతీయాలనేది అమెరికా లక్ష్యం. అయితే ఆ లక్ష్యం నెరవేరలేదు. అమెరికా దిగుమతి చేసుకో నిరాకరించిన ఏడు లక్షల టన్నుల పంచదారను రష్యా తక్షణమే దిగుమతి చేసుకుంది.

క్యూబా సామాజికంగా మార్పు చెందింది. ఇరుగు పొరుగు దేశాలతో సఖ్యతగా ఉండాలనే అమెరికా పాలసీని క్యూబా విషయంలో పక్కన పెట్టారు. 1960లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఐసన్ హోవర్ ప్రవాసంలో ఉన్న కా(స్ట్రో వ్యతిరేకులను పోగు చేసి భవిష్యత్తులో వాళ్ళ ద్వారా క్యూబాను కా(స్ట్రో పాలన నుండి విముక్తం చేయాలనే లక్ష్యంతో వీళ్ళందరికీ గ్వాటిమాలాలో సిఐఎతో శిక్షణ ఇప్పించడానికి రహస్యంగా ఆమోదముద్ర వేశాడు. 1961 వసంతకాలంలో జాన్ ఎఫ్. కెనడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యాడు. అప్పటికి సిఐఎ

1400 మంది ప్రతీఘాత విప్లవకారులకు సాయుధ శిక్షణ ఇచ్చింది. కెనడీ పావులు ముందుకు కదిపాడు. 1967 ఏప్రిల్ 17న ఈ పధ్నాలుగు వందల మంది తిరుగుబాటు దళాలతో కొంతమంది అమెరికన్ సైనికులు కూడా కలిసి హవానాకు దక్షిణాన ఉన్న 'బే ఆఫ్ పిగ్స్' జలసంధి దగ్గర కాలుమోపారు. కాస్ట్రో నియంతృత్వ పాలనలో విసిగిపోయి ప్రజలు వాళ్ళతో చేతులు కలుపుతారు అని భావించారు అమెరికన్ పాలకులు. కాని ఎక్కడా ప్రజల తిరుగుబాటు ఊసే లేకుండా పోయింది. కాస్ట్రో పాలన ప్రజారంజక పాలన కావడమే దానికి కారణం. దాంతో మూడంటే మూడే రోజుల్లో సిఐఎ ప్రేరేపిత తిరుగుబాటు దళాల పీచమణిచేశాయి కాస్ట్రో సైనిక దళాలు.

'బే ఆఫ్ పిగ్స్' ఉదంతం తరువాత అమెరికా ప్రపంచమంతటా అబద్ధాలు ప్రచారం చేసే పనికి తెరలేపింది. ట్రూమన్ మాటల్లో చెప్పాలంటే ఇది న్యాయసూత్రాల ఉల్లంఘన. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆవిర్భావం సందర్భంగా చేసుకున్న ఒప్పందం స్ఫూర్తికి విరుద్ధం ఇది. "ఏ దేశం కానీ, దేశాలు కానీ ఏ కారణాల రీత్యా అయినా గానీ, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఇంకో దేశ బాహ్య, అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదు" అని రాజ్యాంగ పీఠికలో రాసుకుంది అమెరికా. కానీ క్యూబా మీద దాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి తన రాజ్యాంగ సూత్రాలను తానే ఉల్లంఘించింది.

'బే ఆఫ్ పిగ్స్' దగ్గర దాడికి సన్నాహాలు జరుగుతుండగానే మీడియా నాలుగు రోజుల ముందే ఈ విషయం పసిగట్టి సిఐఎ రహస్య స్థావరాలు, అక్కడి కదలికల గురించి వార్తలు వెలుగులోకి తెచ్చాయి. దాంతో అధ్యక్షుడు కెనడీ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ "ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికా సైనిక బలగాలు క్యూబా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవు" అని ప్రకటించాడు. దీన్ని సమర్థించుకోవడానికి క్యూబాలో తిరుగుబాటు లేవదీయడానికి ప్రయత్నించింది క్యూబన్ జాతీయులే అన్న అడ్డగోలు వాదన కూడా చెయ్యొచ్చు. కానీ వీరిని దళాలుగా తయారుచేసింది, పోగేసిందీ, శిక్షణ ఇచ్చింది, తిరుగుబాటుకు ప్రేరేపించిందీ ముమ్మాటికీ అమెరికాయే. అమెరికా బాంబర్లు, పైలెట్లు వీరికి అండగా నిలిచారు. గుర్తు తెలియని నౌకలను కూడా ఈ తిరుగుబాటుదారులకు అందించింది కూడా అమెరికాయే. ఫైటర్ విమానాలు నడిపిన నలుగురు పైలెట్లు మరణించారు కాని వీళ్ళు ఏ పరిస్థితుల్లో ఎక్కడ మరణించారనే విషయం వారి కుటుంబాలకు కూడా తెలియనివ్వలేదు అమెరికన్ పాలకులు.

దేశవ్యాప్తంగా గుడ్డి కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదాన్ని ప్రేరేపించడానికి అటు ఉదారవాదులు, ఇటు మితవాదులు చేయి కలిపినట్లే, పబ్లిక్‌ని మోసం చేయడానికి కెనడీ అధికార యంత్రాంగంతో మీడియా కూడా అత్యుత్సాహంగా చేయి కలిపింది. 'న్యూ రిపబ్లికన్' పత్రిక క్యూబా ప్రవాసీయులకు సిఐఎ సాయుధ శిక్షణ ఇస్తున్న విషయమై ఒక వ్యాసం ప్రచురించాలని నిర్ణయించింది. 'బే ఆఫ్ పిగ్స్' ఉదంతానికి ముందే ఈ వ్యాసం ప్రచురితం కావలసి వుంది. ప్రముఖ చరిత్రకారుడు ఆర్థర్ షెల్సింగర్‌కు ఈ వ్యాసం నకలు ముందస్తుగా

అందించింది ఆ పత్రికే. అతను ఆ కాయితాలు కెనడీకి చూపించాడు. ఈ వ్యాసం వెలుగులోకి రాకూడదని కెనడీ కోరాడు. కెనడీ కోర్కెను ఆ పత్రిక మన్నించింది. అలాగే జేమ్స్ రెస్టాన్, టర్నర్ కాటలెడ్జ్‌లు 'న్యూయార్క్ టైమ్స్'లో సంయుక్తంగా ఒక వ్యాసం ప్రచురించడానికి ఇచ్చారు. అది కూడా ప్రతిపాదిత క్యూబా దురాక్రమణ గురించే. కాని ప్రభుత్వం వద్దని 'విన్నవించడం'తో వారిరువురూ ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇందుకు ఆ పత్రికను ఆర్థర్ షెల్సింగర్ ప్రస్తుతిస్తూ – 'గొప్ప దేశభక్తియుత కర్తవ్యం నిర్వహించింది. పత్రికలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి దేశాన్ని దుంపనాశనం వైపు నెట్టి వుంటే ఆశ్చర్యపోయి ఉందునేమో కానీ న్యూయార్క్ టైమ్స్ పత్రిక చూపిన దేశభక్తిని అభినందించకుండా ఉండలేకపోతున్నా' అన్నాడు. ఇలాంటి ఉదారవాద మేధావుల బాధ అల్లా ఏంటంటే ప్రపంచ దేశాల్లో వెల్లువెత్తుతున్న విప్లవోద్యమాలను అణచివేయడానికి అమెరికా జోక్యం చేసుకుంటున్న తీరు మీద వీరికి ఎలాంటి ఆందోళనా లేదు. అయితే ఆ జోక్యాలు చాలామటుకు ఫలించకుండా పోవడం పట్ల తెగ ఆందోళన వ్యక్తం చేసేవాళ్ళు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన పదిహేనేళ్ళకి యుద్ధకాలంలోను, ఆ తరువాతా కమ్యూనిస్టు భావజాల వ్యాప్తిని అరికట్టడానికి ముందుకు తెచ్చిన 'న్యూ డీల్' నడుములు విరగగొట్టడానికి 1960లో వెసులుబాటు చిక్కింది అమెరికన్ పాలకవర్గానికి. కమ్యూనిస్టు పార్టీ నాయకులంతా జైళ్ళ పాలయ్యారు. పార్టీ కకావికలమయిపోయింది. సభ్యత్వం దిగజారిపోయింది. కార్మికోద్యమం మీద పార్టీ పట్టు నామమాత్రంగా వుండింది. నిజానికి కార్మికోద్యమమే స్వయంగా మితవాద ధోరణులను ఆలంబనగా చేసుకుని నడుస్తా ఉంది., నోరెత్తి అడిగేవాడు లేకుండా పోవడంతో మిలిటరీ బడ్జెట్ సగం జాతీయ బడ్జెట్‌ను మింగేసింది. ప్రజలు కూడా పట్టించుకోవడం మానేశారు.

అణ్వాయుధాల నుండి వెలువడే రేడియో ధార్మికత మానవాళి ఆరోగ్యం మీద విపరీతమైన దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కాని ప్రజలకు ఈ ప్రమాదాల గురించి అంతగా అవగాహన లేదు. అణు పరీక్షల మూలంగా తలెత్తే సమస్యల గురించి అతిగా ప్రచారం జరుగుతుంది అని అణు శక్తి కమిషన్ బూకరింపు మొదలయింది. "దేశం (అమెరికా) తలపెట్టిన అణు పరీక్షల గురించి వెలుగులోకి వచ్చిన భయానక కథనాలు సత్యశోధనకు నిలబడవు" అని 1955లో రీడర్స్ డైజెస్ట్ పత్రికలో ఒక వ్యాసం అచ్చొత్తి వదిలారు.

50వ దశకంలో అమెరికా అంతటా వాయుదాడుల నుండి రక్షణ కోసం భూసొరంగాల నిర్మాణం గురించి (ఎయిర్ రెయిడ్ షెల్టర్స్) విపరీతమైన ఆర్భాటపు ప్రచారం జరిగింది. అణుబాంబులు పేల్చినా ప్రజలకు రక్షణ కల్పించేలా ఆ భూసొరంగాలు నిర్మిస్తాం అని ప్రజలు బేఫర్వాగా ఉండొచ్చని పాలకులు గాలి కబుర్లు చెప్పారు. హెర్మన్‌ఖాన్ అనే శాస్త్రవేత్త (ఇతగాడు సర్కారు కన్సల్టెంట్ కూడా) అణ్వాయుధ యుద్ధం మీద ఒక పుస్తకం రాశాడు. "ప్రపంచాన్ని

దుంపనాశనం చేయకుండా అణ్వాయుధ యుద్ధం చేయవచ్చని, ప్రజలు అనవసరంగా భయపడాల్సిన పనిలేదని' అందులో భరోసా ఇచ్చాడు. హెన్రీ కిసెంజర్ 1957లో రాసిన ఒక పుస్తకంలో 'సరైన ఎత్తుగడలు అనుసరిస్తే అణుయుద్ధం అందరూ భావించేంత వినాశకారి కాదు' అని సన్నాయి నొక్కులు నొక్కాడు.

ప్రజలను నానా రకాలుగా మభ్యపెట్టి మొత్తానికి ఎలాగైతేనేం అమెరికన్ పాలక వర్గాలు యుద్ధాల మీద ఆధారపడి నడిచే ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దగలిగారు. ఒక పక్కన దేశంలో చాలా చోట్ల దరిద్రం తాండవిస్తుంటే అతి కొద్దిమంది మాత్రం ఈ 'వార్ ఎకానమీ' పుణ్యమా అని కోట్లాది డాలర్లు కూడగట్టుకుని అనతికాలంలోనే సంపన్నులుగా ఎదిగారు. సామాజిక సంక్షోభం గురించి మసిపూసి మారేడుకాయ చేసే రాతలు రాశారు. అమెరికన్ పౌర సమాజంలో సంపద పంపిణీలో తీవ్రమైన అసమానతలు నెలకొన్నాయి. 1944–61 మధ్యకాలంలో – అమెరికాలో స్వర్ణయుగం అని చెప్పుకునే ఈ కాలంలో కూడా పరిస్థితుల్లో ఏ మార్పూ లేదు. అట్టడుగు ఐదోవంతు కుటుంబాలు దేశ స్థూల ఆదాయంలో 5 శాతం పొందుతూ వుంటే, పై స్థాయి ఐదో వంతు కుటుంబాలు 45 శాతం ఆదాయం గడించాయి. 1953లో చూస్తే కేవలం 1.6 శాతం వయోజన జనాభా 80 శాతం కార్పొరేట్ షేర్లను, 90 శాతం కార్పొరేట్ బాండ్లను కలిగి వున్నారు. దేశంలో ఆ రోజుకు ఉన్న 2 లక్షల కార్పొరేట్ సంస్థలలో పదో వంతు కంపెనీలు, అంటే కేవలం 200 కార్పొరేట్ కంపెనీలు 60 శాతం ఉత్పాదక సంపదను కైవశం చేసుకున్నాయి.

జాన్ ఎఫ్. కెనడీ అధికారం చేపట్టాక రూపొందించిన తొలి బడ్జెట్‌లోనే ఆదాయాలు, సంపద పంపిణీల్లో గానీ, పన్ను రాయితీల్లో గానీ ఎలాంటి మార్పులూ ఉండవని స్పష్టంగా ప్రకటించాడు. కెనడీ బడ్జెట్ సందేశాన్ని 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కాలమిస్టు జేమ్స్ రెస్టాన్ విశ్లేషిస్తూ 'అకస్మాత్తు మార్పులకు తావు లేకుండా' ప్రధానంగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృతనిశ్చయంతో ఈ ప్రభుత్వం ఉన్నట్లుంది అని రాసుకొచ్చాడు.

> "ప్లాంట్ల విస్తరణకు, ఆధునీకరణకు పన్ను రాయితీలు ఇవ్వడం ద్వారా వ్యాపార పెట్టుబడులకు ఊరటనిచ్చాడు. పౌర హక్కుల మీద దక్షిణాది మితవాదులతో లడాయికి దిగకుండా మంచి పనిచేశాడు. వేతనాల పెంపుదల డిమాండ్లను సాధ్యమైనంత కనిష్ట స్థాయిలో ఉంచాలని యూనియన్లను అభ్యర్థించడం ద్వారా పోటీ ప్రపంచ మార్కెట్‌లో మన ఉత్పత్తుల గిరాకీ పెరిగేలాగా, ఉపాధి అవకాశాలు మరింత పెరిగేలా వ్యూహం రచించాడు. వ్యాపార వర్గాలతో తాను ప్రచ్ఛన్న యుద్ధానికి తలపడబోవటం లేదనే హామీ ఇచ్చాడు.

అలాగే ఈ వారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ప్రభుత్వ ప్రాయోజిత ఇండ్ల ఇన్స్యూరెన్స్ విషయంలో వివక్షతను అంతమొందిస్తానన్న తన వాగ్దానం నెరవేర్చడానికి అప్పుడే తొందరపడబోవటం లేదని, 'జాతీయ ఏకాభిప్రాయం' సాధించేదాకా ఈ విషయాన్ని పక్కన పెడతాననీ ప్రకటించాడు.

అధ్యక్ష పీఠం ఎక్కిన తరువాత గడిచిన ఈ పన్నెండు నెలల కాలంలో కెనడీ అమెరికన్ రాజకీయ యవనికలో నిర్ణయాత్మకంగా మధ్యేవాద ధోరణిని అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశాడు" - అంటూ జేమ్స్ రెస్టాన్ తన వ్యాసంలో కెనడీ పాలన గురించి స్థూలంగా వివరించాడు.

మధ్యే మార్గం అంటే నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరగడం అని వేరుగా చెప్పనక్కరలేదు. ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఎలాంటి మార్పులు తలపెట్టనక్కరలేదు. కార్మికులకు, నల్లజాతి ప్రజానీకానికి ఏం చేయనక్కరలేదు. దోపిడీ వ్యవస్థను యధాతథంగా కొనసాగించడమే మధ్యే మార్గ రాజకీయ పరమార్థం.

ఈ విధానాల మూలంగా అంతా సజావుగా నడుస్తుంది అన్న పాలక వర్గాల నమ్మకాన్ని వమ్ము చేస్తూ 60వ దశకంలో అమెరికా అంతటా అనేకానేక తిరుగుబాట్లు విస్ఫోటించాయి.

# 11

# క్లింటన్ హయాం ప్రజాస్వామిక సంక్షోభం

**ఓ**టర్ల నిర్లిప్తత నేపథ్యంలో 1996లో బిల్ క్లింటన్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1992లో కూడా ఇదే పరిస్థితి. 19 శాతం ఓటర్లు డెమోక్రట్, రిపబ్లికన్ పార్టీలను కాదని మరోపార్టీ అభ్యర్థి రాస్‌పెరోట్‌కు ఓటు చేశారు. ఎంపిక చేసుకోవడంలో వారి ముందు ఉన్న ప్రత్యామ్నాయాల పట్ల ఓటర్లు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. సగం మంది ఓటర్లు పోలింగ్ బూత్‌ల ఛాయలకు రాలేదు. ఓటు చేసిన వారిలో కూడా క్లింటన్ ప్రత్యర్థిగా నిలబడ్డ రాబర్ట్ డోల్ కన్నా క్లింటన్ నయం అనే రీతిలో ఓటుచేసినా, ఓటింగ్ 49 శాతానికి మించలేదు క్లింటన్‌కు. అప్పటి పరిస్థితి గురించి ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ఆనాడు కారు బంపర్లకు అతికించుకున్న స్టిక్కర్‌లను గుర్తు తెచ్చుకుంటే చాలు. 'దేవుడా! మేం ఓటెయ్యాలనేది నీ అభిమతం అయితే మాకో అభ్యర్థిని ఇవ్వు' అని ఆ స్టిక్కర్‌లలో రాసి వుంది.

రెండవసారి అధ్యక్ష పీఠం ఎక్కిన సందర్భంగా 'నూతన శతాబ్దిలోకి అడుగిడ బోతున్నాం' అంటూ క్లింటన్ ఒక ప్రసంగం చేస్తూ 'నూతన శతాబ్దంలో మనకు ఓ నూతన తరహా ప్రభుత్వం కావాలని' అమెరికన్ ప్రజానీకం తీర్పు చెప్పారు అన్నాడు. కానీ అప్పటికే నాలుగేళ్ళ క్లింటన్ పరిపాలన చవిచూసిన అమెరికన్ ప్రజానీకం అదే క్లింటన్ నుండి నూతన తరహా ప్రభుత్వాన్ని ఆశించి అతని అభ్యర్థిత్వానికి ఓటు వేశారని భావించడానికి గణాంకాలు సహకరించడం లేదన్న నిజం బహుశా క్లింటన్‌కూ తెలుసునేమో.

క్లింటన్ రెండవ దఫా ప్రమాణ స్వీకారోత్సవం రోజు యాదృచ్ఛికంగా మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ జన్మదినోత్సవం కావడం, దేశం యావత్తూ ఆ సంరంభాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో క్లింటన్ తన ప్రసంగంలో మార్టిన్ లూథర్ కింగ్ పేరును పలుమార్లు ప్రస్తావించాడు. అయితే క్లింటన్, మార్టిన్ లూథర్‌కింగ్‌లు ఇద్దరూ వేరు వేరు సామాజిక తత్వాలకు ప్రతినిధులు.

1968లో మార్టిన్ లూథర్‌కింగ్ హత్య గావించబడ్డాడు. అప్పటికే అతను అమెరికన్ ఆర్థిక వ్యవస్థను పరిష్కరించడం సాధ్యం కాదని, మౌలికంగానే ఈ వ్యవస్థ దుర్మార్గమైనదని, వ్యవస్థలో సమూలమైన, మౌలికమైన అతివాద మార్పులు అవసరం అనే నిర్ధారణకు వచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాల గురించి ఎలుగెత్తి చాటుతూ 'రాజకీయ ఆర్థిక సత్తాను ప్రజలకు పంపిణీ చేసే కొత్త ప్రత్యామ్నాయం' కావాలని నినదించాడు.

ఇక క్లింటన్ విషయానికి వస్తే బడా కార్పొరేట్ కంపెనీలన్నీ డెమోక్రటిక్ పార్టీకి గతంలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో నిధుల వరద పారించాయి. క్లింటన్ అధ్యక్షుడిగా మెలిగిన తొలి నాలుగేళ్ళ కాలంలో 'మార్కెట్ వ్యవస్థ' 'ప్రైవేట్ రంగాల' పట్ల అత్యంత విశ్వాసం ప్రకటించాడు. 1992 ఎన్నికల ప్రచారం సందర్భంగా మార్టిన్ మారియెట్ కార్పొరేషన్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి అతి స్పష్టంగా 'డెమోక్రాట్లు నానాటికీ వ్యాపార వర్గాల వైపు మొగ్గు చూపుతున్నారు. కార్పొరేట్ సంస్థలు కూడా అంతకంతకూ డెమోక్రాట్లకు దగ్గరవుతున్నాయి' అని ప్రకటించాడు.

మార్టిన్ లూథర్‌కింగ్ ఆలోచనలకు, క్లింటన్ రాజనీతికి ఏమన్నా సాపత్యం ఉందా?

అలాగే మార్టిన్ లూథర్‌కింగ్ వియత్నాం యుద్ధాన్ని ఎంతగా వ్యతిరేకించాడో, మిలిటరీ సత్తాను నానాటికీ పెంచుకుపోతున్న పాలక వర్గాల ధోరణినీ అదే స్థాయిలో వ్యతిరేకించాడు. 'ఈ ఉన్మాదానికి ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టాలి. వర్ణ వివక్షత, ఆర్థిక దోపిడీ, మిలిటరీ తత్వం ఇవన్నీ ఒకే తానులో ముక్కలని' స్పష్టంగా ప్రకటించాడు.

1992లో క్లింటన్ అధ్యక్షుడిగా ఎన్నిక అయింది కూడా సామాజిక మార్పు తీసుకు వస్తాననే నినాదంతో కాదు. ఓటర్ల పొందిక ఆధారంగా రూపొందించిన 'ఓట్ మేనేజ్‌మెంట్' మీదే క్లింటన్ ప్రధానంగా ఆధారపడ్డాడు. పార్టీని మధ్యే మార్గం వైపు నడిపించాడు. అంటే మహిళలు, నల్లజాతీయులు, కార్మికుల మద్దతు కొనసాగేందుకు తగిన రీతిలో స్పందించడానికి మాత్రమే పరిమితం అయి మితవాద ఓటర్లను ఆకర్షించడానికి నేరాల పట్ల కఠిన వైఖరి, బలమైన మిలిటరీ శక్తిగా అమెరికాను నిలబెట్టడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చాడు.

అధికారంలోకి వచ్చాక రిపబ్లికన్‌ల సర్కారు కన్నా కాస్త భిన్నంగా మరింత మంది శ్వేతేతరులను వివిధ పదవుల్లో కూచోబెట్టాడు. అయితే ఇలా నియమించిన వారిలో ఎవరన్నా ముక్కుసూటిగా ఉండి కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తే వారిని తక్షణమే వదిలించుకున్నాడు.

వాణిజ్య శాఖ కార్యదర్శిగా నియమించుకున్న రోనాల్డ్ బ్రౌన్ నల్లజాతీయుడు, కార్పొరేట్ న్యాయవాదిగా పనిచేసిన అనుభవం ఉన్నవాడు. ఇతని పని తీరు పట్ల క్లింటన్ పూర్తిగా సంతృప్తి చెందాడు. (దురదృష్టవశాత్తు ఇతగాడు ఒక విమాన ప్రమాదంలో మరణించాడు). అయితే న్యాయశాఖలో పౌర హక్కుల విభాగ కార్యదర్శిగా నియమించిన మరో నల్లజాతి మేధావి లాని గుయెనీర్ అంటే క్లింటన్‌కు మొహం మొత్తేసింది. వర్ణ వివక్షతకు తావులేని

సామాజిక సమానత్వం, ఓటర్ల ప్రాతినిధ్యం గురించి ఇతగాడు చేసిన ప్రతిపాదనలను మితవాదులు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ సాకున అతణ్ణి పదవి నుండి తప్పించాడు. అలాగే మరో నల్లజాతి మహిళ, సర్జన్ జనరల్ జాయిస్ లీన్ ఎల్డర్స్ సెక్స్ ఎడ్యుకేషన్‌లో హస్తప్రయోగాన్ని ఒక అంశంగా చేర్చాలని ప్రతిపాదించిన కారణంతో ఆవిడ పదవికి మంగళం పాడేశారు.

అలాగే సుప్రీం కోర్టు జడ్జీలుగా ఇరువురి నియామకంలోనూ ఇదే రకమైన బుజ్జగింపు ధోరణిని అనుసరించాడు. డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్‌లూ ఆహ్వానించదగినవారుగా ఉండాలనే పేరిట రూథ్‌బేడర్ గిన్స్‌బర్గ్, స్టీఫెన్ బేయర్‌లను నియమించాడు తప్ప న్యాయవ్యవస్థలో ఉదారవాదులను నియమించే దానికి మొగ్గు చూపలేదు. బ్రేయర్, గిన్స్‌బర్గ్‌లు ఇరువురూ కఠినాతికఠినమైన శిక్షలు విధించడం రాజ్యాంగబద్ధమే అని విశ్వసించేవాళ్ళు. హెబియస్ కార్పస్ పిటిషన్ (శరీరాన్ని ప్రవేశపెట్టండి)లను తీవ్ర ఆంక్షలతో నిరాకరించే వాళ్ళూను. రాజ్యాంగ ధర్మాసనం తీర్పులు చెప్పాల్సిన అనేక సందర్భాలలో మితవాద ఆలోచనలతో ఉన్న జడ్జీలతో కలిసి ఓటు చేసినవారు వీరిరువురూ.

సుప్రీం కోర్టు జడ్జిల సంగతి పక్కనపెట్టి ఫెడరల్ కోర్టు జడ్జిల నియామకాల విషయం చూపినా 70వ దశకంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన గెరాల్డ్ ఫోర్డ్ స్థాయిలో అయినా ఉదారవాదులను నియమించడానికి ముందు వెనుకలాడాడు. 1996లో ప్రచురించిన 'ఫోర్డ్ హామ్ లా రివ్యూ' అధ్యయన నివేదిక ప్రకారం క్లింటన్ హయాంలోని మూడేళ్ళ కాలంలో ఇచ్చిన తీర్పుల్లో సగానికి సగం అంటే పావు వంతు కూడా ఉదారవాద నిర్ణయాలు లేవు. అందుకే న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంపాదకీయంలో ఇలా రాసింది. 'రీగన్, బుష్‌ల హయాంలో తమ సైద్ధాంతిక తత్వానికి అనుగుణమైన జడ్జిలను నియమించే దానికి అవసరమైతే స్వపక్షంతోను, ప్రతిపక్షంతోనూ కయ్యానికి కాలు దువ్వేవారు కాని ఇందుకు భిన్నంగా క్లింటన్ మాత్రం ఏమాత్రం వివాదాస్పదం అవుతుందనే సూచన కనబడినా తాను ఎంపిక చేసిన జడ్జిల నియామకాన్ని పక్కన పెట్టేసేవాడు."

శాంతి భద్రతల విషయంలో తాను గట్టి పట్టుదల మనిషి అని చూపించుకోవడానికి తెగ ఆరాటపడేవాడు. 1992లో ఆర్కాన్సస్ గవర్నర్‌గా ఉంటూ అధ్యక్ష అభ్యర్థిగా ప్రచారంలో తలమునకలుగా ఉండి కూడా మతిస్థిమితం లేని ఒక వ్యక్తికి విధించిన మరణశిక్ష అమలును పర్యవేక్షించడం కోసం హడావుడిగా ఆర్కాన్సస్‌కు తరలి వెళ్ళాడు. ఆర్కాన్సస్ గవర్నర్ గిరీ చేస్తున్నప్పుడు టెక్సాస్‌లోని వాకీ పట్టణంలో ఒక మతస్తులు సాయుధులై ఒక బిల్డింగ్ కాంప్లెక్స్‌ను తమ అధీనంలో ఉంచుకున్న సందర్భంలో వారి మీద ఎఫ్.బి.ఐ. దాడి చేయడానికి అనుమతి ఇచ్చాడు. ఈ దాడిలో 86 మంది. అందులో మహిళలు, పిల్లలు, అమాయక పౌరులు ఉన్నారు – మరణించారు.

క్లింటన్ తొలిసారిగా అధ్యక్ష పదవి చేపట్టిన కాలంలోనే అవసరమైన ఖైదీలకు ప్రభుత్వ ఖర్చులతో న్యాయవాదులను నియమించే స్టేట్ రిసోర్స్ సెంటర్‌లకు కేటాయించే నిధుల్లో భారీగా కోత పెడుతూ చట్టం చేశాడు. దీని ఫలితంగా జార్జియా రాష్ట్రంలో మరణశిక్ష విధించబడిన

ఒక ఖైదీ హెబియస్ కార్పస్ పిటిషన్ దావాలో న్యాయవాది సహకారం లేకుండా హాజరు కావలసిన పరిస్థితి తలెత్తింది అని న్యూయార్క్ టైమ్స్ వెలుగులోకి తెచ్చింది. వెలుగు చూడని అలాంటి ఉదంతాలు ఇంకెన్నో.

అలాగే 1996లో క్లింటన్ చేసిన ఇంకో చట్టం మూలంగా జైళ్ళలోని అమానవీయ పరిస్థితులను సరిదిద్దేందుకు జైళ్ళ వ్యవస్థలో ప్రత్యేక అధికారులను నియమించడం జడ్జిలకు తలకు మించిన భారంగా పరిణమించింది. అలాగే పౌర హక్కులకు సంబంధించి వేసే దావాల్లో న్యాయస్థానం అందించే విభాగానికి అందించాల్సిన ఫెడరల్ నిధులను నిలిపివేస్తూ ఇంకో చట్టం చేశాడు.

1996లో అటు డెమోక్రాట్లు, ఇటు రిపబ్లికన్‌లు అత్యుత్సాహంతో క్లింటన్ ప్రవేశపెట్టిన 'క్రైం బిల్లు'కు మద్దతు పలికారు. ఈ బిల్లు మొత్తం నిశితంగా పరిశీలిస్తే నేర నివారణ కన్నా, శిక్షలు విధించడం మీదే క్లింటన్ ప్రభుత్వం కేంద్రీకరించింది అని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. అనేక నేరాలను మరణశిక్ష పరిధిలోకి తెచ్చింది. కొత్తగా మరిన్ని జైళ్ళను తెరవడానికి 8 బిలియన్ డాలర్లు కేటాయించింది.

రాజకీయ నాయకులు నేరాల పీచమణచదలుచుకున్నారు అని ఓటర్లకు సందేశం ఇవ్వడానికి ఇంత తంతు నడిపాడు. ప్రఖ్యాత నేర మనస్తత్వ పరిశోధకుడు టాడ్ క్లియర్ న్యూయార్క్‌టైమ్స్‌లో 'మొండివాడు మూగవాడు' అని ఒక వ్యాసం రాశాడు. "ఈ బిల్లు మూలంగా దాదాపు లక్ష మంది నిందితులకు కఠిన శిక్షలు పడ్డాయి. 1973 నుండి చూసుకుంటే ఇంత పెద్ద ఎత్తున కఠిన శిక్షలు విధించబడటం ఇదే ప్రథమం. దీనిమూలంగా ప్రపంచంలోనే అత్యధిక క్రైం రేటు గల దేశంగా అమెరికా పేరు తెచ్చుకుంది. పోనీ ఇంత కఠిన శిక్షలు విధించడం మూలంగా హింసాత్మక నేరాలు తగ్గాయా అంటే అదీ లేదు. పైపెచ్చు గతంలోకన్నా పెరిగాయి. ఎందుకని? కఠిన శిక్షలు విధించడం మూలంగా నేరాలు తగ్గుముఖం పడతాయనే సర్కారు ఆలోచనే తప్పు. వాస్తవానికి పోలీసులు, జైళ్ళు నేరస్వభావాన్ని నియంత్రించలేవు. న్యూయార్క్ రాష్ట్రంలో ఉన్న 70 శాతం ఖైదీలు, న్యూయార్క్ నగర శివార్లలోని 8 నైబర్‌హుడ్ ప్రాంతాలకు చెందినవారే. ఈ 8 ప్రాంతాల్లో నిష్ట దరిద్రం, నిరాశ, రోజు గడవని బాధాతప్త జీవితాలు పోగడిపోయి ఉన్నాయి. నేరాలకు పురికొల్పేది ఇటువంటి దుర్భర సామాజిక పరిస్థితులే" అని టాడ్ క్లియర్ స్పష్టం చేశాడు.

అధికారాన్ని అంటిపెట్టుకుని ఉన్నది రిపబ్లికన్‌లయినా, డెమోక్రాట్‌లయినా వారిరువురి మధ్యనా ఒక సామ్యం ఉంది. ప్రజానీకంలో చెలరేగే అసంతృప్తి జ్వాలలు తమ అధికార పీఠాన్ని తాకకుండా ఉండటానికిగాను తమకు తాముగా రక్షించుకుని తమ వాదనలు వినిపించుకునే అవకాశం లేని అభాగ్యజీవులకి వ్యతిరేకంగా ప్రజల మనోభావాలను ఎగసన దోస్తుంటారు. ఇటువంటి రాజకీయాల లక్ష్యం ఏమిటో 1920లోనే ప్రముఖ సామాజిక విమర్శకుడు హెచ్.ఎల్. మెంకన్ సూటి అయిన మాటల్లో చెప్పాడు. "ఈ నీచ రాజకీయాల పరమార్థం ఏమిటంటే ప్రజలకు నిరంతరం ఏదో ఒక బూచిని చూపించి వ్యాకుల పరచడం. వాళ్ళు స్థిమితపడేలోగా ఇంకో బూచిని ముందుకు తీసుకురావడం. తమ అధికారాన్ని

రక్షించుకోవడానికి పాలకులు ఈ కనికట్టు ఆటని నిరంతరాయంగా ఆడుతూనే ఉంటారు. ఊహాజనిత ప్రమాదాలను ప్రజల మనస్సుల్లో నాటి వారిని అసలు శత్రువుకు వ్యతిరేకంగా సమీకృతం కాకుండా కలవరపెడుతూనే వుంటారు.”

నేరస్తులు కూడా ఈ కోవలోకే వస్తారు. పాలకుల చేతుల్లో పాచికలు వీరు. ఒకసారి వలస ప్రజానీకం, ఇంకోసారి సబ్సిడీలు, పేదలు, లేదూ కొన్ని పరాయి ప్రభుత్వాలు – ఒకసారి ఇరాక్, అంతకుముందు ఉత్తర కొరియా, దానికన్నా ముందు క్యూబా. కొత్త కొత్త ప్రమాదాలను కనిపెట్టి గోరంతలు కొండంతలుగా ప్రచారం చేసి వ్యవస్థ వైఫల్యాలను మరుగుపరిచే ప్రయత్నంలో భాగంగానే పాలకులు ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు.

వలస ప్రజానీకం అన్నింటిలోకీ సులభమైన టార్గెట్. వీళ్ళకు ఓటు హక్కులేని మూలాన వీళ్ళు ఎట్లా పోయినా రెండు పార్టీలకు జరిగే నష్టం ఏమీ లేదు. అందుకే అమెరికా చరిత్రను తరచి చూస్తే పాలకవర్గాలే ప్రాంతీయ జాతి విద్వేషాలను రెచ్చగొట్టిన తీరు మనకు కనిపిస్తుంది. 19వ శతాబ్దం మధ్యభాగంలో ఐర్లాండ్ ప్రవాసుల మీద, ఆ తరువాత చైనీయుల మీద, పిదప తూర్పు దేశాల నుండి వచ్చిన వారి మీద, ఆ తరువాత దక్షిణ ఐరోపా ప్రవాసీయుల మీద ఇలాంటి జాతి విద్వేష ప్రచారం రేపెట్టి వారి మీద లెక్కలేనన్ని దాడులు జరగడానికి కారణభూతం అయ్యారు. ఇంతా చేసి ప్రవాసీయుల మీద జరిగే దాడులను అరికట్టేలా పటిష్టమైన చట్టాలు తీసుకురావడానికి బదులు 1920లో ‘ఇమ్మిగ్రేషన్’ చట్టాలను మరింత కఠినతరం చేశారు.

60వ దశకంలో చెలరేగిన ఉద్యమాల నేపథ్యంలో పాలకులు చేపట్టిన సంస్కరణల్లో భాగంగా తిరిగి ఇమ్మిగ్రేషన్ (వలస) చట్టాలను కాస్త సరళం చేశారు. కానీ 90వ దశకం వచ్చేసరికి డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లు ఒకే తరహా వాదనను వ్యక్తం చేశారు. ఆర్థికమాంద్యం మూలంగా అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు తొలగిస్తున్న వారిలో అమెరికన్‌లు ఎక్కువగా ఉన్నారని, ఖర్చు తగ్గించుకునే పేరిట కంపెనీలు చౌకగా పనిచేస్తే కార్మికులు ఉన్న దేశాల్లోకి తమ యూనిట్లను తరలిస్తున్నాయని, దక్షిణాదిన ఉన్న సరిహద్దు దేశం మెక్సికో గుండా ప్రవాసీయులు విపరీతంగా వచ్చి పడుతూ, అమెరికన్ ఉద్యోగాలు కొల్లగొడుతున్నారని, వాళ్ళు అన్ని రకాల సౌకర్యాలు పొందుతూ అందుకుగానూ సాధారణ అమెరికన్ ప్రజానీకం మీద పన్నులు మోపే స్థితి తీసుకువచ్చారని, తదాది విద్వేష ప్రచారానికి తెరతీశారు. ఈ ప్రచార ప్రభావానికి లొంగిన అమెరికన్ ప్రజానీకం మానసిక స్థితిని అడ్డం పెట్టుకుని ప్రవాస అమెరికన్‌లకు కల్పించే (భోయనం టికెట్లు – ముసలివారికి, వికలాంగులకు సహా) సామాజిక సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ క్లింటన్ హయాంలో ఒక చట్టం చేశారు. 1997లో దాదాపు లక్షమంది చట్టబద్ధమైన ప్రవాసీయులకు ఈ సౌకర్యాలను రద్దు చేయనున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఈ లక్షమందిలో అధికాధికంగా ఉన్నవారు పేదలు, ముసలివారు, వికలాంగులు. వీరంతా అమెరికన్ పౌరులు కావడానికి తగిన పరీక్షలు పాసవ్వాలని హుకుం జారీ చేశారు.

ఇలా నోటీసులు అందుకున్న లక్షమందిలో సగం మంది ఈ పరీక్షలు పాసయ్యే అవకాశం లేని వాళ్ళు. వాళ్ళు ఇచ్చిన కొన్ని నెలల గడువులోగా ఇంగ్లీషు నేర్చి, మాట్లాడగలిగి, పరీక్ష పాసవ్వాలి. కానీ ఎక్కువమంది కొత్తగా నేర్చుకునే వయసు దాటిపోయిన వాళ్ళు,

ముసలివాళ్ళు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్నవాళ్ళు. మాస్సాచ్యుసెట్స్‌లో నివసించే ఒక పోర్చుగల్ ప్రవాసీయుడు తమ దుస్థితిని ఒక విలేఖరికి ఇలా నివేదించాడు. "ఏ రోజు సర్కారు నుండి నోటీసు అందుకోవాల్సి వస్తుందో అని బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నాం. సామాజిక సంక్షేమం కింద అందే చెక్కు రాకుంటే మా గతేం కాను? తిండికి మలమలమాడాల్సిందే కదా! భగవంతుడా బతుకంటేనే రోతపుట్టి పోతుంది."

ఇక మెక్సికోలో దుర్భర దారిద్ర్యం నుండి బయటపడే మార్గం లేక పొట్ట చేతపట్టుకుని అక్రమంగా అమెరికాకు వలస వచ్చినవారి పరిస్థితి వర్ణనాతీతం. అక్రమ వలసలను అరికట్టే పేరిట రెండువేల మైళ్ళ సరిహద్దు పొడుగూతా అమెరికన్ ప్రభుత్వం వేలాది మంది గార్డులను నిలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపించనుందో వివరిస్తూ మెక్సికో నుండి రాయిటర్ వార్తా సంస్థ ఒక కథనం వెలువరించింది (1997 ఏప్రిల్ 3న). "అక్రమ వలసల మీద ప్రభుత్వం విరుచుకుపడితే అది మెక్సికన్లలో ఆగ్రహావేశాల జ్వాలను రగిలించే పరిస్థితి ఉంది. ఎందుకంటే ఏటా వేలాదిమంది ఉదర పోషణార్థం ఇక్కడ నుండి చట్టబద్ధంగా గానీ, చట్టవిరుద్ధంగా గానీ అమెరికాకు వలసపోతుంటారు."

ఒకప్పుడు అమెరికా అందించిన ఆర్థిక మిలిటరీ సాయంతో గ్వాటిమాలా, ఎల్‌సాల్వడార్ దేశాలలోని నియంతల ప్రభుత్వాలు నియమించిన కిరాయి హంతక దళాల ఊచకోత నుండి తప్పించుకోవడానికి వేలాదిమంది ప్రజానీకం ఆ రెండు దేశాల నుండి కట్టుబట్టలతో పారిపోయి వచ్చి అమెరికాలో తలదాచుకున్నారు. వీరిని 'రాజకీయ శరణార్థులు'గా భావించని అమెరికన్ ప్రభుత్వం బలవంతానా వీళ్ళందరినీ వారి వారి దేశాలకు త్రిప్పి పంపే ఏర్పాట్లు చేసింది. పోనీ వీరిని రాజకీయ శరణార్థులుగా పరిగణిద్దామా అంటే – వీరికి ఈ దుస్థితి ఎదురవడానికి తామే కారణం అని పరోక్షంగా అంగీకరించినట్లు అవుతుంది. ఆ రెండు దేశాల ప్రభుత్వాలూ తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. కాబట్టి ఆ ప్రభుత్వాలకు ఎలాంటి సాయం అందించరాదని దేశంలో వెల్లువెత్తిన నిరసనలను సరకు చేయకుండా అమెరికా ప్రభుత్వం అక్కడి నియంతలకు అన్నివిధాలా సాయం అందించింది. పైపెచ్చు మానవ హక్కుల విషయంలో ఆ ప్రభుత్వాల పని తీరు మెరుగవుతుంది కాబట్టే సాయం అందిస్తున్నామని సమర్థింపులకు దిగింది.

1996లో అమెరికన్ కాంగ్రెస్ 'ఉగ్రవాద వ్యతిరేకత – మరణ శిక్ష విధింపు' చట్టాన్ని ప్రతిపాదించినపుడు క్లింటన్ అధ్యక్షుడి హోదాలో ఈ బిల్లుకు ఆమోదముద్ర వేశాడు. ఈ చట్టం ప్రకారం ఎవరన్నా ప్రవాసీయుడికి కోర్టు శిక్ష విధిస్తే – అది ఎంత తీవ్రమైన నేరం, ఎంత కఠినమైన శిక్ష అనేదానితో నిమిత్తం లేకుండా అలాంటివారిని బలవంతంగా స్వదేశానికి తిప్పి పంపేందుకు ఈ చట్టం వెసులుబాటు కల్పిస్తుంది. చట్టబద్ధంగా అమెరికా శాశ్వత పౌరసత్వం పొంది పెళ్ళై, పిల్లలు ఉన్నా ప్రవాసీయుడు అయితే చాలు అతనికి దేశబహిష్కార శిక్ష విధించవచ్చు. ఈ చట్టం ఆమోదముద్ర పొందడమే తరువాయి వందలాదిమంది శాశ్వత ప్రవాసీయులు అరెస్టులకు గురయ్యారని 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది.

ప్రవాసీయుల పట్ల ప్రభుత్వం రూపొందించిన ఈ నూతన విధానం 'నూతన శతాబ్దికి నూతన ప్రభుత్వం' అందిస్తానన్న క్లింటన్ వాగ్దానం కేవలం నోటిమాట అని తేల్చేసింది. ఎప్పుడో 18వ శతాబ్దంలో అమెరికన్ పాలకులు అనుసరించిన 'ఏలీన్ & సెడిషన్ లా' మెకార్థీ హయాంలో రూపొందించిన 1950 – మెక్ కార్రన్ – వాల్టర్ చట్టాల వంటి క్రూర స్వభావాన్ని పుణికి పుచ్చుకుంది క్లింటన్ రూపొందించిన నూతన విధానం.

'రండి – అలిసిపోయిన బాటసారులు, పేదలు, నిర్భాగ్యపు ప్రజలూ.. ఇక్కడ స్వేచ్ఛావాయువులను అనుభవించి పలవరించండి. ఆవలి ఒడ్డు కాదనుకున్న శరణార్థులారా రండి. గూడులేని, విధి చిన్న చూపు జనులను నా దగ్గరకు పంపండి. ఇదే నా చేతిలో వెలుగుతున్న దివిటీ మీకు పసిడి తలుపుల కేసి దారి చూపిస్తుంది" అని స్వేచ్ఛా ప్రతిమ (లిబర్టీ స్టాట్యూ) మీద చెక్కిన పలుకులను అపహాస్యం చేస్తుంది.

అలాగే 1996 వేసంగిలో (బహుశా రాబోయే ఎన్నికలలో మధ్యేవాద ఓటర్ల నుండి ఓట్లు రాబట్టాలనే దృష్టితో) క్లింటన్ ఇంకో దివాళాకోరు చట్టం చేశాడు. 'న్యూడీల్' పేరిట ఫెడరల్ ప్రభుత్వాలు పేద కుటుంబాలకు వారి పిల్లలకు అందించే ఆర్థిక సాయానికి కేంద్ర ప్రభుత్వ మద్దతును ఉపసంహరిస్తూ చేసిన ఈ చట్టానికి 'సంక్షేమ సంస్కరణలు' అని పేరు పెట్టాడు. ఈ చట్టం అసలు ఉద్దేశం పేదలకు, నిస్సహాయులకు అందే ఆర్థిక సాయాన్ని ఎగవేయడమే. కానీ దీనికో అందమైన ముసుగును కప్పారు. 'పర్సనల్ రెస్పాన్సిబిలిటీ & వర్క్ ఆపర్చ్యునిటీ రీకన్సియలేషన్ యాక్ట్ ఆఫ్ 1996' అని పేరు పెట్టారు. దీని ఉద్దేశం ఏమిటంటే ఒంటరి తల్లులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి రెండేళ్ళు పరిమితి విధించారు. ఆ తరువాత ఇలాంటి మహిళలు అందరూ ఏదో ఒక పని వెతుక్కుని తమ పొట్ట పోసుకుంటూ పిల్లలను సాకాలి. అలాగే జీవితకాలపు సదుపాయాన్ని ఐదేళ్ళ కాలానికి కుదించారు. అలాగే పిల్లలు లేని వాళ్ళయితే మూడేళ్ళలో ఏదేని మూడు నెలల పాటు భోయనం టికెట్లు (ఫుడ్ స్టాంప్స్) పొందవచ్చని పరిమితి విధించింది.

ఈ చట్టం పర్యవసానాలు ఎలా ఉంటాయో 'లాస్ ఏంజల్స్ టైమ్స్' పత్రిక ఇలా వివరించింది. 'చట్టపరమైన ప్రవాసీయులకు వైద్య సదుపాయం అందకుండా పోతుంది. నగదు సాయం ఐదేళ్ళకు కుదించబడింది. వీటన్నింటి ఫలితంగా క్షయ, సుఖవ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ వ్యయంలో రాబోయే ఐదేళ్ళలో 50 బిలియన్ డాలర్లు ఖర్చు తగ్గించాలనేది ప్రభుత్వ లక్ష్యం'. (ఇది న్యూజనరేషన్ ఫైటర్ విమానాల కొనుగోలు కోసం క్లింటన్ ప్రభుత్వం చేసే ఖర్చుతో పోలిస్తే నామమాత్రమే). ఎన్నికలలో క్లింటన్‌కు అనుకూలంగా ప్రచారం ఎత్తుకున్న 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కూడా 'ఈ చట్టం అసలు ఉద్దేశం పని కల్పించడం మాత్రం కాదు, పేదలకు అందే సంక్షేమానికి ఎసరు పెట్టి బడ్జెట్‌లో సమతూకం సాధించాలనుకుంటుంది' అని క్లింటన్ ప్రభుత్వాన్ని ఘాటుగానే విమర్శించింది.

పేదల సదుపాయాల్లో ఇలా కోతపెట్టడం పైకి చిన్న సమస్యగా కనిపించవచ్చుగానీ నిజానికి అంతకన్నా పెద్ద సమస్య. వీరికి అందే ఆర్థికసాయం నిలిచిపోయేలోగా ఉపాధి సంపాదించుకోవడం. 1990లో న్యూయార్క్ నగరంలో శానిటేషన్ (పారిశుధ్య) విభాగంలో ఏడాదికి 23000 డాలర్ల చెల్లింపు మీద 2000 ఖాళీలు ఉన్నాయని ప్రకటిస్తే లక్షమంది దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ళ తరువాత చికాగోలో 'స్టూఫర్స్' అనే గొలుసుకట్టు రెస్టారెంట్‌లో 550 ఖాళీలు ఉన్నాయని ఇంటర్వ్యూలకు పిలిస్తే ఏడువేల మంది హాజరయ్యారు. ఇల్లినాయిస్‌లోని కామన్వెల్త్ ఎడిసన్‌లో ప్రకటించిన ఖాళీలకు దరఖాస్తు చేసుకునేందుకు తెల్లారగట్ట నాలుగున్నరకు రెండువేల మంది బారులు తీరి నిలబడ్డారు. 1997లో మన్‌హట్టన్‌లోని రూజ్‌వెల్ట్ హోటల్‌లో 700 ఉద్యోగాలకు నాలుగువేల మంది క్యూ కట్టారు. న్యూయార్క్ నగరంలో సామాజిక సంక్షేమ సదుపాయం అందుకుంటున్న 70,000 మంది వయోజనులకు ఇప్పుడున్న ఉపాధి రేటు ప్రకారం ఉద్యోగాల్లో కుదురుకోవడానికి 24 ఏళ్ళు పడుతుంది.

క్లింటన్ ప్రభుత్వ ఘోరవైఫల్యం ఏమిటంటే సామాజిక సంక్షేమ సదుపాయాలు ఉపసంహరిస్తూ ఉద్యోగాలు వెతుక్కోమని చెప్పి చేతులు దులిపేసుకోవడమే. ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ఏమాత్రం చొరవ చూపలేదు. కాని 'న్యూడీల్' అమలులో ఉన్న కాలంలో ప్రభుత్వమే బిలియన్ల కొద్దీ డాలర్లు ఖర్చు చేసి లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించింది.

పైపెచ్చు 'ప్రభుత్వమే పెద్ద దిక్కుగా ఉండాలనుకునే రోజులు పోయాయి' అని క్లింటన్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చెప్పుకొచ్చారు. రిపబ్లికన్‌లు ప్రజల సంక్షేమం పేరిట అతిగా ఖర్చు పెడుతుంది. అందుకే పార్టీకి ప్రజలు మద్దతు ఇచ్చారు కాని అంతకు అంతమందీ ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు అనేది డెమోక్రాట్ల అంచనా. నిజానికి రెండు పార్టీలు ప్రజాభిప్రాయాన్ని పొరబాటుగా అంచనా వేశాయి.

మీడియా కూడా తన వంతుగా ఈ విషయాన్ని కలగాపులగం చేసేసింది. 1994 నడి ఏడాదిలో జరిగిన ఎన్నికలలో కేవలం 37 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సగానికన్నా కాస్త ఎక్కువమంది రిపబ్లికన్‌లకు ఓటు వేశారు. మీడియా మాత్రం రిపబ్లికన్‌లకు విప్లవాత్మక విజయం లభించిందని ఊదరగొట్టింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక అయితే ప్రజలు 'స్మార్ట్ గవర్నమెంట్' పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు అని హెడ్డింగ్ పెట్టింది. ప్రజా సంక్షేమ పథకాలను క్రమంగా వదిలించుకోవాలన్న రిపబ్లికన్‌ల అజెండాకు ప్రజల మద్దతు ఉన్నట్లు చిత్రీకరించింది. ఇంకా విచిత్రం ఏమిటంటే ఈ పతాక శీర్షిక క్రిందనే న్యూయార్క్ టైమ్స్, సి.బి.ఎస్., న్యూస్ కార్పొరేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఒక సర్వేలో 65 శాతం ప్రజానీకం అసహాయ ప్రజల బాగోగులు పట్టించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అభిప్రాయపడినట్లు వార్తా కథనాన్ని కూడా ప్రచురించింది.

క్లింటన్ – రిపబ్లికన్‌లది ఒకటే కోరస్ అయింది. 'బాధ్యతల మారి ప్రభుత్వం' అనేది ఇవాళా రేపూ పనికి రాదనేదే వారిరువురి వాదన. ఈ బాధ్యత అనేది కేవలం సామాజిక

సంక్షేమ పథకాలకు సంబంధించి మాత్రమే అనేది ముఖ్యంగా మన గమనంలో ఉండాలి. బడా కాంట్రాక్టులు, మిలిటరీ బడ్జెట్, కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చే సబ్సిడీలు, పన్ను రాయితీలు – ఇవేవీ ప్రభుత్వానికి భారం కాదు. పైపెచ్చు ఏటా రాశిలోనూ వాసిలోనూ ఇవి మాత్రం పెరిగిపోతూనే ఉంటాయి.

'బాధ్యత గల ప్రభుత్వం' అనేది ఈనాటి ఆలోచన కాదు. అమెరికన్ జాతి నిర్మాతలే దీనికి అంకురార్పణ చేశారు. బలమైన కేంద్ర ప్రభుత్వం ఉండేలా రాజ్యాంగ నిర్మాణం కావించారు. బానిస యజమానులు, భూయజమానులు, పారిశ్రామిక ఉత్పత్తిదారులు, బాండ్లు గల వాళ్ళ ప్రయోజనాలు కాపాడటం కోసం బలమైన కేంద్ర ప్రభుత్వం అవసరంగా భావించారు. అప్పట్నుంచి గడిచిన 200 ఏళ్ళలో వరసవారీ ప్రభుత్వాలు ధనబలం, కండబలం వున్న ఆసాములకు ఊడిగం చేశాయి. రైలు మార్గాలు, రోడ్డు మార్గాలు నిర్మించే పేరిట లక్షలాది ఎకరాలు అతి కొద్దిమందికి కట్టబెట్టాయి. దేశీయ ఉత్పత్తుల మార్కెట్‌ను కాపాడుకోవడానికి విదేశీ దిగుమతులపై అధికాధిక సుంకాలు విధించాయి. ఆయిల్ కంపెనీలకు పన్ను శెలవులు, రాయితీలు ఇచ్చాయి. సమ్మెలన్నా, కార్మికుల, కష్టజీవుల తిరుగుబాట్లన్నా సాయుధ బలగాలను ఉపయోగించి నిర్దాక్షిణ్యంగా అణిచేసి యజమానుల కొమ్ము కాశాయి.

ఇరవయ్యవ శతాబ్దంలో అడుగుపెట్టాక అదీ ప్రత్యేకించి 1930, 1960లలో మొత్తం అమెరికన్ వ్యవస్థనే ఓ కుదుపు కుదిపేసిన సమ్మెలు, అలజడులు తిరుగుబాట్ల దృష్ట్యా నమ్ముకున్న వ్యవస్థ ఎక్కడ కుప్పకూలిపోద్దో అన్న భయంతో రాజకీయ నాయకులు పేద ప్రజానీకం కోసం సామాజిక సంక్షేమ పథకాలు ప్రకటించాయి. అది లగాయతు కార్పొరేట్ కంపెనీలు 'బాధ్యతల మారి ప్రభుత్వం' అని నిందించసాగాయి.

అధ్యక్షుడు క్లింటన్ ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా అలన్‌గ్రీన్‌స్పాన్‌ను పునర్నియమించాడు. ఈయన వడ్డీ రేట్లను నియంత్రించడం మీదే ప్రధానంగా దృష్టి పెట్టాడు. గ్రీన్ స్పాన్ ప్రధాన లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం. ఎందుకంటే బాండ్లు, షేర్లు గుట్టలు గుట్టలుగా పోగేసుకున్న అతి కొద్దిమంది ఈ ద్రవ్యోల్బణం మూలంగా తమకు రావలసిన లాభాలు చిక్కిపోతాయేమో అని ఆందోళన పడటంతో వారిని ఆ ఇబ్బంది నుండి గట్టెక్కించడమే తన పరమోన్నత కర్తవ్యంగా ఎంచుకున్నాడు ఫెడరల్ రిజర్వు అధిపతి. కార్మికులకు జీతాలు ఎక్కువ ఇవ్వడం ద్రవ్యోల్బణానికి ఒక కారణంగా, అలాగే ఉపాధి అవకాశాలు పెరగకపోతే జీతాలు ఇలా పెచ్చు స్థాయిలోనే ఉంటాయనేది ఇంకో కారణంగా గ్రీన్‌స్పాన్ భావించాడు.

బడ్జెట్‌లో సమతూకం సాధించడం, వార్షిక లోటును తగ్గించుకుంటూ రావడం – ఈ లక్ష్యాలు క్లింటన్ ప్రభుత్వానికి ఒక 'అబ్సెషన్'గా మారాయి. ఈ లక్ష్యాలు సాధించడానికి ధనవంతుల మీద పన్నులు పెంచాలి లేదా మిలిటరీ బడ్జెట్‌ను కుదించాలి. ఈ రెండూ చెయ్యలేదు కనుక మిగిలిన ఏకైక ప్రత్యామ్నాయంగా పేదలకు, పిల్లలకు, వయోవృద్ధులకు, పెళ్ళికాని తల్లులకు, విడాకులు పొందిన మహిళలకు అందించే ఆర్థిక సాయం, విద్యా కేటాయింపులలో కోత విధించడానికి నిర్ణయించుకున్నాడు.

క్లింటన్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక కూడా ఇదే ధోరణిని అనుసరించాడు.

"దేశంలో శిథిలమయిపోతున్న స్కూళ్ళను పునరుద్ధరించడానికి 5 బిలియన్ డాలర్లు ఖర్చు చెయ్యాలనేది ప్రెసిడెంట్ క్లింటన్ విద్యా ప్రణాళిక. అయితే ఫెడరల్ బడ్జెట్‌లో సమతూకం సాధించడంలో భాగంగా ఈ పథకాన్ని అటక ఎక్కించేశారు."

**– న్యూయార్క్ టైమ్స్ 1997 మే 8 సంచిక**

"అధ్యక్షుల వారి శ్వేతసౌధం జోక్యం చేసుకోవడంతో దేశంలోని పదిన్నర లక్షల మంది ఇన్సూరెన్స్ లేని పిల్లలకు ఆరోగ్య భీమా కల్పించాలనే పథకాన్ని సెనెట్ తిరస్కరించింది. శ్వేతసౌధం అధికారి ఒకరు ఈ పథకం మూలంగా బడ్జెట్‌లో బ్యాలెన్స్ దెబ్బ తింటుందని గట్టిగా చెప్పాక ఏడుగురు ప్రజా ప్రతినిధులు తమ ఓటును ఆమోదం ఉండి అనామోదానికి మార్చుకున్నారు."

**– 'బోస్టన్ గ్లోబ్' పత్రిక 1997 మే 22 సంచిక**

కానీ ఇదే ప్రభుత్వం సైన్యాన్ని, మారణాయుధాలను నిర్వహించడానికి ఏడాదికి 250 బిలియన్ డాలర్లు ఖర్చు చేయడానికి వెనుకాడలేదు. ఒకేసారి జాతి యావత్తు రెండు ప్రాంతీయ యుద్ధాలను ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉండాలనేది క్లింటన్ ప్రభుత్వ ఆలోచన. బుష్ హయాంలో రక్షణ శాఖ మంత్రిగా పనిచేసిన డిక్ చెనీ మాత్రం 1989లో సోవియట్‌లో సోషలిస్టు రాజ్యం కూలిపోయాక "అలాంటి ప్రమాదానికి అవకాశాలు కనుచూపు మేరలో లేవు. లేశమాత్రమైనా అవకాశాలు కూడా లేవు" అని గట్టిగా నొక్కి చెప్పాడు.

అయినా ఎఫ్–22 విమానాల తయారీకి 70 బిలియన్‌లు కేటాయించారు. ఇందుకు రిపబ్లికన్‌ల మద్దతు ఉంది. అసోసియేటెడ్ ప్రెస్ మాత్రం 'ఈ యుద్ధ విమానాల నిర్మాణ ప్రాజెక్టు వ్యయం అటు చేసి ఇటుచేసి 100 బిలియన్ డాలర్లు దాటుతుందని జనరల్ అక్కౌంటింగ్ ఆఫీసు అంచనాలను' ఉటంకిస్తూ ఒక వార్త వెలువరించింది.

ఇప్పటికీ అమెరికా విదేశాంగ విధానం గుండెకాయ బలప్రయోగ సూత్రమే. క్లింటన్ ఇంకో ఆరు నెలలు పదవిలో ఉంటాడనగా బాగ్దాద్ మీద బాంబులు కురిపించి రావడానికి విమానాలు పంపాడు. మాజీ అధ్యక్షుడు బుష్ కువైట్ సందర్శించడానికి వెళ్ళినపుడు అక్కడ హత్య చేయడానికి ఓ పథకం పన్నారని, అందుకు ప్రతిగా ఈ దాడి చేశాం అని ప్రకటించాడు. ఇలాంటి పన్నాగం పన్నారనేందుకు బలమైన సాక్ష్యాలు లేవు. కుట్ర జరిగిందని చెప్పిన కువైట్ పోలీసు యంత్రాంగం అవినీతి భాగోతం ప్రపంచానికంతా తెలిసిందే. బాగ్దాద్‌లోని 'ఇంటెలిజెన్స్ హెడ్ క్వార్టర్స్'ను ధ్వంసం చేశామని అమెరికా చెప్పుకొచ్చింది. కాని అది జనావాస ప్రాంతం. ప్రముఖ కళాకారుడి కుటుంబం సహా ఆరుగురు పౌరులు మరణించారు ఈ బాంబు దాడిలో.

కానీ ఈ దాడుల వెనుక అసలు ఉద్దేశం ఇరాక్ పాలకులకు గట్టి హెచ్చరిక పంపడం అని ప్రముఖ కాలమిస్టు మోల్లీ ఇవ్‌నిస్ ఒక వ్యాసంలో విశ్లేషించాడు. 'ఇరాక్ మీద ఉగ్రవాదం ముద్ర వేయడానికి' ఇది ఒక ఎత్తుగడ. 'ఉగ్రవాదులు విచక్షణా రహితంగా వ్యవహరిస్తారు.

పగ తీర్చుకోవడానికి ఉవ్విళ్ళూరుతుంటారు. గుర్తింపు కోసం దాడులు చేస్తుంటారు' అని స్థూలంగా అందరూ అంగీకరిస్తారు. వ్యక్తులకయినా, దేశాలకయినా ఈ సూత్రం వర్తిస్తుంది. అమెరికా బాగ్దాద్ మీద చేసిన దాడి ఉగ్రవాద దాడియే.

ప్రపంచంలోని అత్యంత క్రూరమైన పాలకులకు అమెరికా ఆయుధాలు సరఫరా చేసింది. ఇండోనేషియా ప్రభుత్వం తూర్పు తైమూర్‌ను ఆక్రమించుకునే క్రమంలో ఏడు లక్షల జనాభా గల ఆ దేశంలో రెండు లక్షల మందిని హత్య చేసింది. అలాంటి ప్రభుత్వానికి ఎఫ్-16 యుద్ధ విమానాలు అమ్మడానికి క్లింటన్ ప్రభుత్వం అంగీకరించింది.

ఈ నిర్ణయం గురించి 'బోస్టన్ గ్లోబ్' పత్రిక (1994 జూలై 11 సంచిక) ఇలా వ్యాఖ్యానించింది.

"జనరల్ సుహార్తో ప్రభుత్వంతో ఇక్కడి ఆయుధ కాంట్రాక్టర్లు, చమురు కంపెనీలు, గనుల కార్పొరేషన్లు వ్యాపార సంబంధాలు పెట్టుకుంటే తప్పేంటని సెనెటర్లు వాదించడం చూస్తే అమెరికన్లు వ్యాపార ప్రయోజనాల కోసం మానవ మారణ హోమానికి పాల్పడిన నరహంతక ప్రభుత్వాలతో కూడా చేతులు కలుపుతారని ప్రపంచ ప్రజానీకం భావిస్తే అందుకు వారిని తప్పు పట్టాల్సిన పనిలేదనిపిస్తుంది."

1996లో నోబుల్ శాంతి బహుమతి తూర్పు తైమూర్‌కు చెందిన జోస్‌రామోస్ - హోర్టాకు లభించింది. ఈ బహుమతి లభించడానికి ముందు బ్రూక్లిన్‌లోని ఒక చర్చిలో అతగాడు ప్రసంగిస్తూ ఇలా చెప్పాడు -

"1977 వేసంగిలో నేను ఇక్కడ న్యూయార్క్‌లో ఉండగా 21 ఏళ్ళ లేబ్రాయపు వయసులో ఉన్న నా సోదరి మారియా విమాన బాంబు దాడిలో మరణించిందనే సమాచారం అందింది. అమెరికా సరఫరా చేసిన బ్రోంకో అనే యుద్ధ విమానం ఈ దాడులకు పాల్పడింది. ఇంకొద్ది నెలలు గడవకముందే 17 ఏళ్ళ వయసులో నా తమ్ముడు గైను, ఊళ్ళో ఇంకా అనేకమంది జనాలని అమెరికా సరఫరా చేసిన బెల్ హెలికాప్టర్‌లో వచ్చి చంపేశారన్న వార్త వినాల్సి వచ్చింది నేను. అదే ఏడాది నా మరో తమ్ముడు నన్ను పట్టుకుని అమెరికా అమ్మిన ఎం-16 తుపాకీతో కాల్చి చంపారు."

జోన్ రామోస్ - హోర్టా కుటుంబం యావత్తు అమెరికా అమ్మిన ఆయుధాల పాల్పడి మరణించింది.

ఇలాగే టర్కీ ప్రభుత్వం తిరుగుబాటు కుర్దులు నివసించే గ్రామాలను బాంబు దాడులతో మన్నూ మశానం చేయడానికి అమెరికా తయారుచేసిన సికోర్స్కి హెలికాప్టర్లను వాడింది. 'యుద్ధ బీభత్సం - ఆయుధ వ్యాపారానికి చెల్లించుకుంటున్న మానవ మూల్యం' పేరిట పుస్తకం రాసిన జాన్ తిర్మన్ ఈ దాడులను కుర్దు ప్రజానీకంపై సాగించిన ఉగ్రవాద దాడులుగా అభివర్ణించాడు. 1997 నాటి గణాంకాలు చూస్తే ప్రపంచ దేశాలన్నీ కలిపి చేసే ఆయుధ వ్యాపారం కన్నా ఒక్క అమెరికా చేసే ఆయుధ వ్యాపారమే ఎక్కువ అని లెక్క తేలింది. లారెన్స్‌కోర్బ్

రీగన్ హయాంలో రక్షణ శాఖ అధికారిగా పనిచేశాడు. ఆ తరువాత అతను యుద్ధ వ్యతిరేక కార్యకర్తగా మారాడు. ఆయుధాల అమ్మకాన్ని నిరసిస్తూ – "ఇదంతా కేవలం డబ్బు కోసం చేసే వ్యాపారం. ముందుగా మనమే అందరికీ ఆయుధాలు అమ్ముతాం. ఆ తర్వాత ఆ ఆయుధాలను ఎదుర్కోవడానికి మరింత అధునాతన ఆయుధాలు తయారుచేసి అమ్ముతాం. ఇలా ఇదొక విషవలయంలా కొనసాగుతూనే ఉంటుంది" అంటాడు.

అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు మించి వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం పరిపాటిగా మారింది. 1996 అంతర్జాతీయ మానవ హక్కుల పర్యవేక్షణ సంఘం వెలువరించిన నివేదికను న్యూయార్క్ టైమ్స్ పత్రిక (1996 డిసెంబర్ 5) సంక్షిప్తంగా ఇలా వివరించింది.

"శక్తివంతమైన దేశాలు అనేకం ప్రత్యేకించి అమెరికా మానవ హక్కుల విషయంలో ఇండోనేషియా, మెక్సికో, నైజీరియా, సౌదీ అరేబియా దేశాల మీద ఒత్తిడి పెంచడంలో విఫలమవుతున్నాయి. కారణం ఆయా దేశాల్లో ఆకర్షణీయమైన ఆయుధ మార్కెట్లను కోల్పోతామనే భయం."

సోవియట్‌లో సోషలిస్టు రాజ్యం విచ్ఛిన్నమయిపోయాక అవతరించిన నూతన సోవియట్ దేశాల పట్ల అమెరికా అనుసరిస్తున్న వైఖరిలో కూడా మానవ హక్కుల కన్నా వాణిజ్య, వ్యాపార ప్రయోజనాలే ప్రాధాన్యత సంతరించుకోవడం యాదృచ్ఛికం కాదు. రష్యాను పెట్టుబడిదారీ విధానం వైపు నడిపించాలనే ఆత్రుత, ఆ దేశ మార్కెట్‌ను అమెరికన్ సరుకుల దిగుమతుల కోసం బార్లా తెరిపించాలనే ఆరాటాలతో అమెరికా అప్పటి రష్యా అధ్యక్షుడు బోరిస్ ఎలిస్తిన్ అనుసరించిన ఏకపక్ష దుందుడుకు విధానాలను విమర్శించే సాహసం చేయలేదు. పైపెచ్చు క్లింటన్ ప్రభుత్వం ఎలిస్తిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలబడింది. అది కూడా రష్యా నుండి వేర్పడి స్వాతంత్ర్యం పొందాలని ఉద్యమాలు నడుస్తున్న చెచెన్యా మీద కిరాతకంగా బాంబు దాడులు చేసిన తదనంతరం.

ఆయుధాలతో పాటు ఆర్థిక సాయం అందజేతను ప్రపంచ దేశాల మీద తన పట్టు బిగించడానికి వినియోగించుకోవడం అమెరికా విదేశాంగ నీతిలో మరో పార్శ్వం. 1993 నుండి అమెరికా పేద దేశాలకు అందించే ఆర్థిక సాయాన్ని క్రమంగా రద్దు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ సాయాన్ని అందించే 'ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్' కార్యనిర్వాహక అధికారిగా ఉన్న జె. బ్రెయిన్ అట్‌వుడ్ అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ 'ఇహ మీదట పేద దేశాల మీద అమెరికా పరపతిని, ప్రభావాన్ని ఆర్థిక సాయం ద్వారా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు' అని చెప్పాడు.

ఆ పని చేయడానికి అమెరికా ఆధిపత్యంలో నడుస్తున్న ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు ఎట్లానూ నడుం బిగించాయి. అప్పుల భారంతో ఉన్న తృతీయ ప్రపంచ దేశాలకు అప్పులు ఇచ్చి, వాటిని తిరిగి రాబట్టుకోవడానికి దుబారా వ్యయాన్ని తగ్గించుకోవాలనే

పేరిట ఆయా దేశాల్లో అమలవుతున్న సామాజిక సంక్షేమ పథకాల్లో కోత పెట్టమనో, అసలుకే ఎత్తి వేయమనో ఈ రెండు అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు షరతులు విధించేవి.

అమెరికా ఆర్థిక విధానాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల మీద (ముఖ్యంగా కెనడా, మెక్సికో దేశాలతో చేసుకున్న ఒప్పందాల వంటివి) ఆధారపడి ఉంటాయని అందరూ భావిస్తుంటారు. నిజానికి ఈ ఒప్పందాలు అమెరికన్ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలు కాపాడే రీతిలో ఉంటాయి. అందుకే క్లింటన్ హయాంలో డెమోక్రాట్లు, రిపబ్లికన్‌లు అనే తేడా లేకుండా 'ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' మీద ఆమోద ముద్ర వేశారు. అయితే ఈ 'నాఫ్టా' ఒప్పందాన్ని కార్మిక సంఘాలు గట్టిగా వ్యతిరేకించాయి. ఈ ఒప్పందాన్ని అడ్డం పెట్టుకుని కార్పొరేట్ కంపెనీలు తమ వ్యాపారాన్ని అతి తక్కువ జీతాలకు దుర్భరమైన పరిస్థితుల్లో పనిచేసే శ్రామికులు ఉన్న దేశాలకు తరలిస్తాయని, విపరీతమైన శ్రమ దోపిడీకి పాల్పడతాయనేది కార్మిక సంఘాల ఆరోపణ. 'స్వేచ్ఛా వాణిజ్యం' అనేది బూటకం. ఇది పై పై ముసుగు మాత్రమే. అమెరికా ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడానికి వాణిజ్యాన్ని అడ్డం పెట్టుకోవడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. దీనికే 'జాతీయ ప్రయోజనాలు' అని ముద్దు పేరు పెట్టుకుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను అడ్డం పెట్టుకునే మెక్సికో రైతులు తమ టమోటా ఉత్పత్తులను అమెరికాకు దిగుమతి కాకుండా నిలవరించింది. అలాగే థాయ్‌లాండ్ ప్రభుత్వ చెవులు మెలేసి మరీ ఆ దేశంలో అమెరికా పొగాకు కంపెనీలు కాలూనేలా చేసింది. ఒక పక్కన స్వదేశంలో పొగాకు ఉత్పత్తుల మీద నిషేధం విధించాలని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అమెరికా ఇలాంటి చర్యకు పూనుకుంది. ఇంకా పచ్చి దుర్మార్గం ఏంటంటే స్వేచ్ఛా వాణిజ్య స్ఫూర్తికి భిన్నంగా క్యూబా, ఇరాన్ దేశాలకు ఆహారం, మందులు సరఫరా చేస్తున్న ఓడలను అడ్డుకోవడం. దీని పర్యవసానంగా ఆ రెండు దేశాల్లో అమాయక పౌరులు, మహిళలు, పిల్లలు వేల సంఖ్యలో సరైన వైద్య సదుపాయం అందక మరణించారు. 1996లో ఐక్యరాజ్యసమితికి అమెరికా రాయబారిగా పనిచేస్తున్న మేడలైన్ ఆల్‌బ్రైట్‌తో ఒక టీవీలో '60 నిమిషాలు' అనే ప్రశ్నోత్తర కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా 'అమెరికా విధించిన ఆంక్షల మూలంగా ఇరాక్‌లో 50,000 మంది పిల్లలు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. అంటే హిరోషిమాలో మరణించిన పిల్లల కన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి కదా ఈ మరణాలు – ఇంత మూల్యం చెల్లించుకోవడం అవసరమా' అని ఒక శ్రోత ప్రశ్నించాడు. దానికి మేడమ్ ఆల్‌బ్రైట్ ఇచ్చిన సమాధానం ఏమిటో తెలుసా "మంచిది. ఇలా పోల్చి చెప్పడం ఇబ్బందే. కానీ ఇరాక్ ఆ మూల్యం చెల్లించాల్సిందే."

ప్రపంచ జనాభాలో అమెరికా జనాభా కేవలం 5 శాతం మాత్రమే. కాని ప్రపంచ ఉత్పత్తిలో 30 శాతం ఉత్పత్తిని ఒక్క అమెరికానే వినిమయం చేస్తుంది. అంటే అమెరికాలో ఉన్న వాళ్ళందరూ గొప్పగా సుఖపడిపోతున్నారు అనుకోబాకండి. కేవలం 1 శాతంగా ఉన్న కోటీశ్వరులు లబ్ధి పొందుతున్నారు. 1970 నుండి అపారమైన సంపద పోగేసుకుంటున్న ఈ అల్ప సంఖ్యాకులు 1995 నాటికి కేవలం పన్నుల రాయితీల మూలంగానే వందల బిలియన్ల

డాలర్లు పోగేసుకున్నారు. జాతి సంపదలో 40 శాతం ఈ కొద్దిమంది దగ్గరే పోగడిపోయింది.

'ఫోర్బ్స్' అనే వాణిజ్య పత్రిక లెక్కల ప్రకారం 1982 నాటికి 400 సంపన్న కుటుంబాలు 92 బిలియన్ డాలర్ల ఆస్తులు కూడబెట్టుకున్నారు. మరో పదమూడేళ్ళకు అంటే 1995 నాటికి ఈ ఆస్తులు 480 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. 'డౌ జోన్స్' స్టాక్‌మార్కెట్ 1980 – 95 మధ్య కాలంలో 400 శాతం వృద్ధి చెందింది. కానీ ఇదే కాలంగా వేతన కార్మికుల కొనుగోలు శక్తి 15 శాతం పడిపోయింది.

కాబట్టి అమెరికా ఆర్థిక వ్యవస్థ 'భేషుగ్గా' ఉందనే వాదన మీరు నమ్మదలుచుకుంటే అది 'భాగ్యవంతులకు మాత్రమే పరిమితం అని మీరు గుర్తుంచుకోవాలి. ఈ దేశంలో 40 లక్షల మంది ప్రజానీకానికి ఆరోగ్య బీమా సదుపాయం లేదు. పోషకాహార లేమితో ఈ దేశంలో మరణించే పిల్లల సంఖ్య పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఏ ఇతర దేశంతో పోల్చి చూసినా ఎక్కువే. ఇక శ్వేతేతర జాతీయుల విషయానికి వస్తే ఈ పరిస్థితి మరింత దుర్భరం. నల్లజాతి పసిపిల్లల మరణాలు తెల్లజాతి పసిపిల్లల మరణాల కన్నా రెండు రెట్లు ఎక్కువ. హార్లెమ్‌లాంటి చోట నల్ల జాతీయుల ఆయుఃప్రమాణం 46 ఏళ్ళని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించింది. ఇది కాంబోడియా, సూడాన్ దేశాల్లోని ప్రజల ఆయుఃప్రమాణం కన్నా తక్కువ.

అమెరికన్ పాలకులు 1920 నాటి పరిణామాల నుండి గుణపాఠాలు నేర్చుకోకుండానో, ఒకవేళ నేర్చుకున్నా మర్చిపోయినట్లు నటిస్తూనో ప్రజల జీవితాల్ని 'స్వేచ్ఛా మార్కెట్ల' దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టేస్తున్నారు. పర్యావరణం కళలు, సంస్కృతి వంటి విలువలను 'మార్కెట్' పట్టించుకోదు. 'స్వేచ్ఛా మార్కెట్లు' ఇవాళ వేలాదిమంది అమెరికన్లను నిరుద్యోగులుగా మార్చేసింది. లక్షలాది మందికి ఆరోగ్య సేవలు అందకుండా చేసింది. పిల్లలకు చదువు లేకుండా చేసింది. తలదాచుకోను ఇళ్ళు లేకుండా చేసింది. రీగన్ హయాంలోనే సబ్సిడీతో కట్టించాల్సిన ఇళ్ళ సంఖ్యను నాలుగు లక్షల నుండి నలభై వేలకు కుదించింది. క్లింటన్ హయాంలో ఈ పథకం దాదాపుగా అటక ఎక్కేసింది.

1997లో రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తూ క్లింటన్ అమెరికన్ ప్రజానీకానికి 'కొత్త తరహా ప్రభుత్వ పాలన' అందిస్తా అని వాగ్దానం అయితే చేసాడు గానీ ప్రజల అవసరాలు తీర్చే పనులేమీ చేపట్టలేదు. అలా చెయ్యాలంటే సామాజిక సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున నిధులు అవసరం. నిధులు పోగెయ్యడానికి రెండు మార్గాలు ఉన్నాయని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఒకటి ధనవంతుల మీద పన్నులు వేయడం. రెండవది మిలిటరీ వ్యయం తగ్గించడం, కానీ క్లింటన్ ప్రభుత్వం తనకన్నా ముందర రాజ్యం చేసిన ప్రభుత్వాల మాదిరే ఈ రెండింటి జోలికి పోలేదు. ఎందుకంటే ఈ రెండు వర్గాలూ ఇవాళ అమెరికాలో బలాఢ్యమైన వర్గాలు.

వీళ్ళ బలం అల్లా వీళ్ళ వెనుక పోగుపడివున్న సంపదే. ప్రస్తుతానికి వీరి మీద పన్ను గరిష్టంగా 37 శాతం ఉంది. అదే రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో వేసినట్లు 70–90 శాతం పన్ను విధిస్తే ఏడాదికి కొన్ని వందల బిలియన్ల డాలర్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు

సమకూరుతుంది. అలాగే సంపద పన్ను విధిస్తే కొన్ని ట్రిలియన్ డాలర్లు వరదలా వచ్చి పడతాయి.

ఇక మిలిటరీ వ్యయం విషయానికి వస్తే మార్గం ఏమిటో 1992 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రాండల్ ఫోర్స్‌బర్గ్ అనే మిలిటరీ వ్యవహారాల నిపుణుడు చక్కగా చెప్పాడు. "ఏటా మిలిటరీ బడ్జెట్‌లో నిర్దిష్ట శాతం తగ్గిస్తూ మిలిటరీ వ్యయాన్ని 60 బిలియన్ డాలర్లకు పరిమితం చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిపోయిన నేపథ్యంలో మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ కనీస మొత్తం మిలిటరీ అవసరాలకు సరిపోతుంది. పైపెచ్చు అమెరికన్ విదేశాంగ విధానం కూడా నిస్సైనికీకరణ చెందుతుంది" అని సాధికారికంగా వివరించాడు.

కానీ క్లింటన్ ప్రభుత్వానికి ఈ మాటలు రుచించలేదు. 1996 లెక్కలు చూస్తే ప్రపంచం మొత్తం మిలిటరీ మీద పెట్టే ఖర్చుకున్న అమెరికా ఒక్కటే చేసే ఖర్చు ఎక్కువ అని లెక్క తేలింది. రష్యా కన్నా నాలుగు రెట్లు, చైనా కన్నా ఎనిమిది రెట్లు, ఉత్తర కొరియా కన్నా నలభై రెట్లు, ఇరాక్ కన్నా ఎనభై రెట్లు అమెరికా మిలిటరీకి ఖర్చు చేస్తుంది. ఇదంతా జాతి సంపద దుర్వ్యయమే.

మిలిటరీ వ్యయాన్ని భారీగా తగ్గించుకోవడం ద్వారా యుద్ధ అవకాశాలను సన్నగిల్ల చేయవచ్చు. అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి ఆయుధమే మార్గం అనే ధోరణికి స్వస్తి పలకవచ్చు. ఇరుగు పొరుగు శాంతి, సుఖ సంతోషాలతో బతకాలనే కోరిక మానవ నైజంలోనే ఉంది. కాబట్టి సహజంగానే ప్రజలు ఇలాంటి ప్రయత్నాలను హర్షిస్తారు. నైతికంగా మద్దతు ఇస్తారు.

ప్రజలను ఈ విధానానికి అనుకూలంగా మలుచుకునే దానికి చిత్తశుద్ధి ఉండాలే గానీ పాలకులకు బ్రహ్మాండమైన నైతిక వాదనలు అందుబాటులో వున్నాయి. అధునాతన ఆయుధాలతో జరిగిన అన్ని యుద్ధాల్లోనూ 10:1 నిష్పత్తిలో అమాయక పౌరులు మరణిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఈ యుద్ధాలు పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. ఏ దేశంలో అయినా పిల్లలకు అమెరికా గడ్డ మీద జీవించే పిల్లలకు ఉన్నంత బతికే హక్కు ఉంది. వారే రేపటి తరం. వారి భవిష్యత్తు కోసం అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి సైనికేతర మార్గాలే శరణ్యం అన్న సందేశాన్ని బలంగా ప్రచారం చేయాలి.

ఈ రకం ఒక పక్క మిలిటరీ వ్యయాన్ని తగ్గిస్తూ, రెండో పక్క నుండి ఆదాయాలు పెరిగే కొద్దీ పెచ్చు పన్ను వసూలు చేసే మార్గం అవలంబిస్తే ప్రభుత్వ ఖజానాకు చేరే సొమ్ములో దేశంలో అందరికీ ఆరోగ్య సంరక్షణ సదుపాయం అందించవచ్చు. పని చేయగల ప్రతి చేతికీ పని కల్పించవచ్చు. జెట్ బాంబర్లు, న్యూక్లియర్ జలాంతర్గాములు నిర్మించడానికి ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చి కోట్ల డాలర్లు కుమ్మరించే బదులు, ఇళ్ళ నిర్మాణం, ప్రభుత్వ రంగ రవాణా వ్యవస్థ, నదులు, చెరువులు పూడికలు తీయించడం, గట్లు కట్టించడం వంటి అనేక ప్రజోపయోగ పనులు చేపట్టవచ్చు. తద్వారా ప్రజల సుందర సుస్యందన జీవితాలు నిశ్చింతగా గడుపుతారు.

ఇది మార్గం కాదనుకుంటే మిగిలే ప్రత్యామ్నాయం ఒక్కటే. వలసల మూలంగా నగరాలు 'సెప్టిక్' అయిపోవడం, గ్రామీణ ప్రాంత ప్రజానీకం అప్పుల పాలవడం, యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోవడం, దారి తప్పిన యువత మత్తుమందు వ్యాపారంలో, నేరాల్లో సమిధలుగా మారడం, మతోన్మాదం మత్తులో పడి స్వీయ హననానికి పాల్పడటం (1996లో ఇలాంటి గ్రూపు ఒకటి సామూహిక ఆత్మహత్యలకు పాల్పడింది), ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉగ్రవాద చర్యలకు పాల్పడటం (1995లో ఓక్లహామా నగరంలోని ప్రభుత్వ భవనం పేల్చివేతలో 168 మంది దుర్మరణం పాలయిన ఉదంతం వంటివి) వంటి సామాజిక రుగ్మతలను పెంచి పోషించే నేటి విధానాలనే పాలకులు అంటిపెట్టుకుని ఉండటం, నేరాలను అరికట్టే పేరిట మరిన్ని జైళ్ళు నిర్మించడం, మరింత మందిని ఖైదు చెయ్యడం, ఉరితియ్యడం... ఈ విష వలయంలోనే కొనసాగడం. ఈ రెండే పాలకుల ముందు ఉన్న మార్గాలు.

ఇహ మిగిలిన మరో ప్రజా ప్రత్యామ్నాయం ఏమిటంటే నూతన శతాబ్ది ఆరంభంలో అయినా జాతి నిర్మాతలు రూపొందించిన రాజ్యాంగ హక్కులు జాతి జనులందరికీ కల్పించాలని, ప్రభుత్వం అందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సమతూక న్యాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఉద్యమించడం. అంటే జాతి సంపదను మరింత హేతుబద్ధంగా, మరింత మానవీయంగా పంపిణీ అయ్యే రాజకీయ – ఆర్థిక విధానాల కోసం పోరుసల్పడం. 'అవకాశాల పుట్టి గడ్డ', 'తలుచుకుంటే ఎవరైనా ధనవంతులు కావచ్చు', 'ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు – విజయాన్ని వరించవచ్చు' అనే నినాదాల మాటున వ్యక్తి వాదాన్ని, స్వార్థాన్ని పెంచి పోషించే విషమ, వినిమయ, క్షీణ సంస్కృతికి యువత 'గుడ్‌బై' చెప్పడం.

ఈ క్రమం 1990 మధ్య దశకం నుండే ఆరంభమయింది కూడా. అమెరికాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మిలిటరీ వ్యయాన్ని తగ్గించడానికి గాని, సంపన్నుల మీద వేసే పన్నులు పెంచడానికి గాని, సార్వజనీన ఆరోగ్య బీమా – సంరక్షణ కల్పించడానికి గాని, పర్యావరణాన్ని పరిరక్షించడానికి గాని సిద్ధంగా లేవని నానాటికీ ఎక్కువమంది ప్రజానీకం గ్రహిస్తున్నారని వరుస వారీగా వెలువడుతున్న సర్వే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలలో, నగరాలలో ఈ లక్ష్యాలను సాధించడానికి వందలాది సమూహాలు తమ తమ పరిధుల్లో కృషి చేయడం 90వ దశకం నుండే ఆరంభించాయి. అయితే ఇవన్నీ సంఘటితపడి జాతీయ ఉద్యమ స్వభావం ఇంకా సంతరించుకోవలసి వుంది.

ఇది కూడా అసాధ్యమైనదేం కాదు. 1995లో దాదాపు లక్షమంది నల్ల జాతీయులు దేశ రాజధానిలో ఉమ్మడి సమస్యల మీద భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆ మరుసటి ఏడాదే దాదాపు యాభై వేల మంది పెద్దలు, పిల్లలు దేశ రాజధాని వాషింగ్టన్‌లో బాలల సమస్యల మీద ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో అన్ని జాతుల ప్రజానీకం పాల్గొన్నారు. అమెరికాలో ఇవాళ అన్ని జాతుల ప్రజానీకం నివసిస్తున్నారు. వర్ణాంతర వివాహాలు సర్వసాధారణం అయిపోయాయి. నల్లజాతి ప్రజల నాయకుడు జెస్సీ జాక్సన్ ఆశించినట్లు 'ఇంద్రధనుస్సు

వర్ణాల సంకీర్ణం' ఏర్పడటానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. 80వ దశకంలో అన్ని జాతులకు చెందిన పేద ప్రజానీకానికి సంబంధించిన సమస్యలను లేవనెత్తి యావత్ జాతికి చురుకు తగిలించాడు జెస్సీ జాక్సన్.

60వ దశకంలో అమెరికన్ పాలక వర్గాలను గడగడలాడించిన ఉద్యమాల సంస్కృతి కనుమరుగైపోలేదు. ఇవాళ సినిమాల్లో, టీవీల్లో, సంగీతంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలన్న చైతన్యం కనబడుతుంది. పేదలకు, ధనవంతులకు మధ్య పెరిగిపోతున్న అంతరానికి 'ప్రజాస్వామ్యం' అనే అబద్ధాన్ని అతికి చెలామణీ చేస్తున్నారన్న గ్రహింపు పెరిగింది.

కార్మికోద్యమం మళ్ళీ జవజీవాలు పుంజుకుంటుంది. కేవలం తెల్ల చొక్కా కార్మికులను సంఘటితం చేయడానికే పరిమితం కాకుండా వ్యవసాయ కార్మికులను, వలస కార్మికులను కూడా కూడగడుతుంది. నాయకత్వ స్థానాల్లోకి యువతను ఎక్కువగా ఆకర్షిస్తూ ఆదర్శవాదాన్ని పెంపొందించే కృషి చేస్తుంది. కార్పొరేట్ నేరాల పట్ల ప్రజలను కార్మికులే జాగృతం చేస్తున్నారు.

వియత్నాం యుద్ధ కాలంలోను, ఆ తరువాత అడపా దడపా పౌర హక్కుల ఉద్యమాల్లోను పాలు పంచుకుంటున్న మతనాయకులు ఇవాళ సమాజంలోని ఆర్థిక అసమానతల గురించి మాట్లాడుతున్నారు. ఈ నూతన పరిణామం మీద 1996 వేసంగిలో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఇలా నివేదించింది.

"కొన్ని దశాబ్దాల కాలం క్రితం వరకూ ఎన్నడూ లేనంతగా ఇవాళ మత నాయకులు కార్మిక సంఘాలతో కొన్ని ఉమ్మడి అంశాల మీద కలిసి వస్తున్నారు. స్వేదశాలలకు (ఇండోనేషియా, ఫిలిప్పీన్, బంగ్లాదేశ్ వంటి వెనుకబడిన దేశాల్లో కారుచౌక జీతాలకు దుర్భరమైన పని పరిస్థితుల్లో పని చేయించుకుంటున్న అమెరికన్ అవుట్ "సోర్స్డ్ ఆఫీసులను 'స్వెట్ షాప్' లేదా స్వేదశాలలు అంటారు). వ్యతిరేకంగా కార్మిక సంఘాలు చేసే ఆందోళనకు నైతిక మద్దతునిస్తున్నారు. కనీస వేతనాలు పెంచాలనే డిమాండ్ పట్ల సానుభూతితో ఉన్నారు. కోళ్ళ పరిశ్రమలో పనిచేసే వారి నుండి కాపలాదార్ల (వాచ్‌మెన్) వరకూ అసంఘటితంగా ఉన్న కార్మికులను సంఘటితం చేసే కృషిని వెన్ను తడతా వున్నారు. ఒకప్పుడు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు సీజర్ ఛావెజ్ ఉధృతంగా నడిపిన ఉద్యమం, ఆనాటి ఆర్థిక మహా మాంద్యం పరిస్థితులు లేవు గనుక సరిపోయింది గానీ, లేకుంటే మత నాయకులంతా ఆనాడు కార్మికోద్యమంతో జట్టు కట్టిన పరిస్థితి నేడూ మనం చూడాల్సి వచ్చేదేమో."

కార్పొరేట్ ఆధిపత్యంలో నడుస్తున్న మీడియా వైఖరి పట్ల కూడా తిరుగుబాటుకు రంగం సిద్ధమవుతున్న పరిస్థితి ఉంది. 1994లో శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఒక టీవీ కేంద్రం 'మహా మోసం' (డెడ్లీ డిసెప్షన్) అనే అకాడమీ అవార్డు పొందిన డాక్యుమెంటరీని ప్రసారం చేయడానికి నిరాకరించింది. అణ్వాయుధ తయారీ పరిశ్రమతో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ కుమ్మక్కయి మోసానికి పాల్పడిన తీరును ఈ డాక్యుమెంటరీ సిన్మాలో అద్భుతంగా చిత్రీకరించారు. టీవీ కేంద్రం నిరాకరణకు నిరసనగా కార్యకర్తలు ఆ టీవీ కేంద్ర భవంతుల పక్కనే వున్న ఖాళీ

స్థలంలో ఊరి జనాలను పోగేసి మొత్తం సినిమా ప్రదర్శించారు. దీంతో ఒత్తిడికి లోనయిన ఆ టీవీ కేంద్రం సదరు డాక్యుమెంటరీ చిత్రాన్ని యధాతథంగా ప్రసారం చేసింది.

డెమోక్రాట్, రిపబ్లికన్ పార్టీల మీద భ్రమలు క్రమంగా తొలగిపోతున్న నేపథ్యంలో స్వతంత్ర రాజకీయ ఉద్యమాలను నిర్మించడానికి 90వ దశకం మధ్య భాగం నుండే కృషి ప్రారంభమయింది. 'టెక్సాస్'లో 'అలయన్స్ ఫర్ డెమోక్రసీ' పేరిట దేశవ్యాప్తంగా కార్పొరేట్ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించే దానికి ఒక ప్రయత్నం జరిగింది. అలాగే 'మిడ్ వెస్ట్' ప్రాంతంలో పచ్చి మితవాద అభ్యర్థికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామిక అభ్యర్థిని పోటీకి నిలబెట్టారు. 1996లో అనేక కార్మిక సంఘాలు కలిసి లేబర్ పార్టీని ఏర్పాటు చేశాయి.

ఇలా విడివిడిగా జరుగుతున్న ప్రయత్నాలన్నీ సంఘటితపడి ఒకే ఛత్రం కిందకు ఎప్పుడు వస్తాయి? ఇంకో పదేళ్ళు పడుతుందా, యాభై ఏళ్ళు ఆగాలా ఇంకా ఇంకో వందేళ్ళు పడుతుందా? జోస్యం చెప్పలేం. ఇదంతా ఎప్పటికి జరిగేను అని నీరసపడి కాళ్ళు జాపెయ్యడం కన్నా – ఎప్పుడు జరిగినా మన మంచికే కాబట్టి మన వంతు కృషి మనం చేద్దాం అని ప్రతి ఒక్కరూ చైతన్యపూరితంగా ఆలోచించి ఆచరణలో కలిసి రావాలి.

ప్రజాస్వామ్యానికి నికార్సయిన అర్థం ఏమిటి? ప్రజల భాగస్వామ్యం విస్తృతం, విశాలం కావడమేగా. పెట్టుబడిదారీ విధానం, జాతీయవాదాల సంకుచిత పరిధులు అధిగమించిననాడే ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా పరిమళిస్తుంది. చరిత్రను మనం ఒకసారి తిరగేస్తే ఇదేదో ఆకాశం నుండి ఊడిపడేది కాదని స్పష్టం అవుతుంది. ప్రజా ఉద్యమాలు, నిర్మాణం – ఆందోళన – పోరాటం, సమ్మెలు, బహిష్కరణలు, ధర్నాలు, ప్రదర్శనలు – ఇవన్నీ వెల్లువలా సాగాలి. అధికారంలో ఉన్నవారు కోరుకునే స్థిరత్వాన్ని మూలాలకంటా దెబ్బ తియ్యాలి.

1992లో అనుకుంటా రిపబ్లికన్ పార్టీ విరాళాలు సేకరించడానికి విందు ఏర్పాట్లు చేసింది. ఈ విందుకు హాజరు కావాలంటే వ్యక్తులు గానీ సంస్థలు గాని నాలుగు లక్షల డాలర్లు ముట్టచెప్పుకోవాలి. (డెమోక్రాట్లు కాస్త చౌక ధర పెట్టారు). విలేఖరులు శ్వేతసౌధం ప్రతినిధిని దీని గురించి నిలదీస్తే "నిజమే. ఇది ఈ వ్యవస్థలో అడుగు పెట్టడానికి చెల్లించుకోవలసిన మూల్యమే" అని బదులిచ్చాడు. 'మరి అంత డబ్బు లేనివాళ్ళ సంగతీ' అని విలేఖరులు ప్రశ్నిస్తే 'వారు ఇతర మార్గాలు చూసుకోవాలి' అని బదులిచ్చాడు.

అమెరికన్ సమాజంలో సమూలమైన మార్పులు ఆశించే వారికి మంచి 'క్లూ' అందించాడు. ప్రజలు తమకు తోచిన రీతిలో ఈ వ్యవస్థలో తమ భాగస్వామ్యాన్ని డిమాండ్ చేసి మరీ సాధించుకోవాలి.

# అనుబంధం

# అమెరికా ప్రజా గళాలు

## హొవార్డ్‌జిన్, ఆంథోనీ ఆర్నోవ్

### కొన్ని భాగాలు

# I

# కొలంబస్ - లాస్‌కాసాస్ విప్లవానికి ఆయత్తం కావడమే సగం విప్లవం విజయవంతం అయినట్లు

### ఫ్రెడరిక్ డగ్లస్

పోరాడందే ప్రగతి లేదు. అది నైతికం కావచ్చు, భౌతికం కావచ్చు లేదూ రెండూ కావచ్చు కాని అది అనివార్యంగా పోరాటం అయి తీరాలి. గొంతెత్తి డిమాండు చెయ్యందే అధికారం నీకు చెవిఒగ్గదు గతంలో ఎన్నడూ ఇందుకు భిన్నంగా జరగలేదు. ఇక ముందూ జరగబోదు. నువ్వు చేయాల్సిందల్లా ఏ డిమాండు లేవనెత్తితే ప్రజలందరూ నీ చుట్టూ చేరతారో ఖచ్చితంగా తెలుసుకోవడం, అలా తెలుసుకోవాలంటే నువ్వు జనాల్లో ఉండి వారికి జరిగిన అన్యాయం ఏమిటో? వాళ్ళు ఇంకేం అన్యాయాల పాలు కాబోతున్నారో తెలుసుకోవాలి. మాటల్తో అడ్డుకుంటారో, చేతుల్తో అడ్డుకుంటారో లేక రెండింటికి సై అంటారో జనాలు తేల్చుకోవాలంటే ఈ రెండిట్లోగాని, ఈ రెండుగానీ చెయ్యనిదే ఈ అన్యాయాలు ఇలానే కొనసాగుతాయనే చైతన్యాన్ని నువ్వు ప్రజలకు అందించాలి.

### హెన్రీడేవిడ్ థోరియో

### శాసనోల్లంఘన గురించి రాస్తూ , మెక్సికోయుద్ధానికి నిరసనగా

చట్టాన్ని అతిగా గౌరవించడం మూలాన సర్వసాధారణంగా స్వాభావికంగా జరిగేది ఏంటంటే ఒక పటాలం సైనికులు, వాళ్ళకో కల్నలు, అతనిమీద ఒక కెప్టెన్ ఆ పైన పై అధికారుల యంత్రాంగం, గంధకం, ప్రైవేటు ప్రయోజనం, ఇవన్నీ ఒక ఆర్డరులో లయబద్ధంగా మార్చింగ్ చేసుకుంటూ కొండలూ, వాగులూ దాటి తమ మనసాక్షికి వ్యతిరేకంగా యుద్ధంలో కాలు బెడతారు. వాళ్ళ ఇంగితానికి, వాళ్ళ చైతన్యానికి వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొంటారు. అందుకే వాళ్ళు ముందుకు వేసే ప్రతి అడుగూ హృదయ కంపాన్ని, అనుకంపనల్నీ పుట్టిస్తుంటాయి.

**జెర్మేన్ వెస్లీ లాంజెన్**

**పారిపోయిన బానిస, సైరాకన్‌లో 1850 శరణార్థి బానిస చట్టంమీద మాట్లాడుతూ**

నాకు ఆ పైవాడు స్వేచ్ఛను ప్రసాదించాడు. దాన్ని కడకంటా కాపాడుకోమనే ఆదేశాన్ని ఇచ్చాడు. నేను చట్టాల్ని గౌరవించను. నాకు ఈ చట్టాలంటే భయంలేదు. ఈ చట్టం నన్ను వెలివేసింది. అందుకే నేను చట్టాన్ని వెలివేస్తున్నా.

**మేరీ ఎలిజెబత్, కాన్సాస్ గౌరవపురస్కారం పొందిన ప్రముఖ వ్యక్తి**

"ఈ దేశాన్ని వాల్ స్ట్రీట్ (స్టాక్ మార్కెట్) ఏలుతున్నది. ఇది ఇంకెంత మాత్రమూ ప్రజల యొక్క ప్రజలచేత ప్రజల కొరకు పరిపాలించబడుతున్న ప్రభుత్వం కాదు. వాల్‌స్ట్రీట్ యొక్క వాల్ స్ట్రీట్ కొరకు వాల్‌స్ట్రీట్ చేత నడుస్తున్న ప్రభుత్వం"

**అలెక్స్ మోల్‌వర్, పర్షియాగల్ఫ్‌లో యుద్ధం చేస్తున్న ఒక అమెరికన్ సైనికుడి తండ్రి**

**సీనియర్ బుష్‌కు రాసిన ఆగ్రహలేఖ**

"ఇరాక్ ప్రభుత్వం విషవాయువు ప్రయోగించి తన సొంత ప్రజానీకాన్నే హతం చేస్తున్నప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు అధ్యక్షా! పర్షియాగల్ఫ్‌లో అమెరికా సైనిక చర్యను వ్యతిరేకించడానికి నా కొడుకు అతని సహసైనికులు ఏం చేసినా వారినే బలపరుస్తూనే ఉంటాను.

**జాతీయ ప్రయోజనం**

వర్గ ప్రయోజనాలు బహిర్గతం కాకుండా ఉండడానికి 'జాతీయ ప్రయోజనాల రీత్యా' అనే మేలిముసుగు కప్పుతున్నారు పాలకులు.

**(క్రిస్టోఫర్) కొలంబస్‌కు పశ్చిమార్ధ భూగోళంలో తొలి ఐరోపా సామ్రాజ్యవాద ప్రతినిధిగా పరిగణిస్తుంటారు.తనని తాను క్రీస్తు సేవకుడిగా అభివర్ణించుకునే ఇతను హిస్పానియోలలో బంగారం కోసం సాగించిన అన్వేషణలో భాగంగా అక్కడి మూల వాసులను కిడ్నాప్‌లు చేసి, వికలాంగులను చేసి అతి కిరాతకంగా హత్యలు చేసిన చరిత్రను కొలంబస్ సహచరుడయిన బార్ట్‌లోమ్ డిలాస్ కాసాస్‌యే స్వయంగా బయటపెట్టాడు.**

# దుంపనాశనానికి గురయిన ఇండీస్ తెగ ప్రజ సంక్షిప్త చరిత్ర (1542) - లాస్ కాసాస్

1492లో ఇండీస్ దీవులను కనుగొన్నారు. ఆ మరుసటి ఏడాదే ఆ భూములను ఆక్రమించుకోవడానికి స్పానియార్డ్‌లు బయల్వెడతారు. తొలిగా ఆ దీవులమీద కాలు మోపి నలభై తొమ్మిదేళ్ళు గడిచాక హిస్పానియోల అనే సుందరమైన, ఆహ్లాదకరమైన దీవిలోకి చొరబడ్డారు. ఆరువందల లీగుల చుట్టుకొలత ఉన్న దీవి అది.

అక్కడ ప్రజలు మానవత్వం మూర్తిభవించిన కల్లా కపటం లేని మనుష్యులు. స్పానిష్ క్రిస్టియన్ యజమానుల కింద చాకిరీ చేస్తూ విధేయంగా, విశ్వాసంగా పడి ఉన్న ప్రజలు వాళ్ళు. పేచికోరులు కాదు, రాగద్వేషాలు లేని వాళ్ళు. ఒద్దికగా, మహా ఓపికగా ఉండే మనుషులు స్వభావరీత్యా శాంత మూర్తులు, ఎవరి పట్ల ద్వేష భావం లేని వాళ్ళు కాకపోతే శారీరకంగా బలహీనులు బండ చాకిరీ చెయ్యలేక ఎందరి ప్రాణాలో గుటుక్కుమనేవి. అదొక విషాదం.

ప్రపంచానికి పెడగా, ప్రశాంతంగా గొర్రెల మందలా ఒక కట్టగా జీవిస్తున్న ఈ దీవిలోకి స్పానియార్డులు ఆకలిగొన్న రేసుల్లా, సివంగుల్లా, చిరుతల్లా ఈ మంద మీదకి ఎగబడి పోయారు, నలభై రెండేళ్ళనాడు. అత్యంత కిరాతకంగా మూలవాసులను చిత్రహింసలు పెట్టి, భయపెట్టి గాయపరిచి అప్పటికీ తృప్తి చెందకపోతే నిలువునా నరికి చంపి భయదవిహ్వాలంగా పెత్తనం చలాయించారు. క్రూరత్వంలోనూ కొత్త పొకడలు పోయే వాళ్ళు. కనీవినీ ఎరుగనంతటి చిత్రహింసల కొలిమిగా మార్చేసారు ఆ దీవిని. ఒకప్పుడు 3 లక్షల జనాభా ఉన్నా ఆ దీవిలో చివరికి రెండువందల మందిని మాత్రం మిగిల్చారు.

రోమ్ నుండి వాలడోలీడ్ దీవి ఎంత దూరం ఉంటుందో ఇక్కడ నుండి క్యూబా కూడా అంతే దూరంలో ఉంటుంది. ఇప్పుడు ఈ దీవి జనావాసంలేని భూ భాగంగా మారిపోయింది. శాన్‌జువాన్ (ప్యూర్టోరికా) జమైకా దీవులు అతి పెద్ద దీవులు. అపారమైన సహజ సంపదలతో ఆకర్షణీయంగా అలరారే దీవులు ఈ రెండు దీవులు కూడా నరసంచారం లేని సుందరముదనష్టమైన దీవులుగా మారిపోయాయి.

క్యూబాకు, హిస్పానియోలాకు ఉత్తరదిక్కున సమీపంలో లుకామోస్ ద్వీప సముదాయం ఉంది. చిన్నా పెద్దవి అన్నీ కలిపి అరవై ద్వీపాల సముదాయం ఇది. సెవిల్లే మహారాజు తోటలకన్నా అద్భుతమైన అందాలతో అలరారె దీవులు ఇవి. ప్రపంచంలోనే అత్యంత ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన ఈ దీవుల్లో ఏడు లక్షల మంది ప్రజానీకం నివసించేవారు. ఇప్పుడు ఈ దీవుల్లో నర మానవుల సంచారం లేకుండా పోయింది. వీళ్ళందరినీ పట్టి బంధించి హిస్పానియోలాకు తెచ్చి బానిసలుగా అమ్మిన వాళ్ళను అమ్మగా మిగిలిన వారిని హతం చేసేవారు.

అలాగే శాన్‌జువాన్ పరిసరాల్లో ఉన్న మరో ముప్పై దీవులదీ ఇదీ పరిస్థితి దాదాపు 2100 లీగుల వైశాల్యంలో ఉన్న ఈ దీవులు దుంపనాశనం అయిపోయాయి.

ఆరెగావ్,పోర్చుగల్ సహా స్పెయిన్ భూభాగం ఎంత ఉంటుందో అంతకు పదింతలు వైశాల్యంగల భూమి, సెవిల్లే – జెరూసలం పట్టణాల మధ్య ఉన్న దూరంకంటే ఎక్కువ వైశాల్యం ఉన్న భూమి దాదాపు 2000 లీగుల పైబడిన భూమిని స్పానియార్డులు క్షమింపశక్యం కానంతటి క్రూరత్వంతో దుంపనాశనం చేసి పెట్టారు. ఒక జాతి మూలవాసులను సమూలంగా అంతం చేసి రక్త చరిత్రను సృష్టించారు.

క్రిష్టియన్లు చేపట్టిన నరకలోకపు కిరాతక హత్యలకు గురయిన మూలవాసుల సంఖ్య నిజాయితీగా నిక్కచ్చిగా లెక్కిస్తే 12 లక్షల పైమాటే. ఇంకా చెప్పాలంటే నన్ను నేను మోసం చేసుకోకుండా ఉండాలంటే ఈరకంగా హతమయిపోయిన వాళ్ళు 15 లక్షలు ఉంటారని నేను బలంగా నమ్ముతున్నాను.

క్రైస్తవులం అని చెప్పుకునే స్పానియార్డులు దయా పాత్రమైన ఆదివాసీ జాతి జనులను ఈ భూమ్మీద నుండి తుడిచి పెట్టడానికి ఎంచుకున్న సర్వసాధారణ మార్గం నరహంతక, రక్తదాహ యుద్ధాలు. ఆత్మరక్షణ కోసం ఎదురుతిరిగిన వారినల్లా ఊచకోత కోశారు. తప్పించుకో చూచినవారిని బంధించి చిత్రవధలకు గురిచేసి చంపారు. సర్వసాధారణంగా స్పానియార్డులు యుద్ధాల్లో ఆడవాళ్ళను, పిల్లలను వదిలేసి మగవాళ్ళను ముఖ్యంగా యువకులను ఊచకోతకు గురిచేసేవారు. కాగా పోగా మిగిలినవాళ్ళను బానిసలుగా చేసుకునేవారు. వీళ్ళను జంతువులకన్నా హీనంగా చూసేవారు. దయాపాత్రమైన అనేక రెడ్ ఇండియన్ జాతి తెగల ప్రజలను ఈ రకంగా తుడిచిపెట్టేవారు.

ఇంతటి మానవ వినాశనానికి వాళ్ళు పాల్పడింది ఎందుకో తెలుసా? కేవలం బంగారం కోసం. రాత్రికి రాత్రే అపారమైన సంపద పోగేసుకుని కుబేరులై పోదామనే దురాశ. నిజానికి ఇలాంటి దుర్బుద్ధి క్రైస్తవ మత విశ్వాసాలకు వ్యతిరేకం. ఎంతకూ తీరని ఈ ధనదాహమే వారిని చరిత్రలో 'విలన్'లుగా నిలబెట్టింది. మూలవాసులు అమాయకులు, సహన శీలురు కాబట్టే స్పానియార్డ్లు వారిని తేలిగ్గా లక్ష్యం చేసుకున్నారు. వారిపట్ల పశుప్రవృత్తితో వ్యవహరించారు. అనేక ఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను కాబట్టే పూర్తి జ్ఞాతితో నేనీ మాట అంటున్నా. పశు ప్రవృత్తి అనేది కూడా చాలా చిన్నమాటే. పశువుల పట్ల కూడా మానవుడు ప్రేమాభిమానాలు చూపిస్తాడు. కాని స్పానియార్డ్లు మూలవాసులను అంతకన్నా కడుహీనంగా చూశారు.

క్రైస్తవమత విశ్వాసకులం అని చెప్పుకునే వీరు కత్తులు, బల్లాలు పూని గుర్రాలెక్కి మరీ ఈ నరమేధానికి పాల్పడ్డారు. పట్టణాల మీద దాడులు చేసి పిల్లాజెల్లా ముసలీముతకా అనే తారతమ్యం లేకుండా మహిళలను ఆఖరికి గర్భవతులను కూడా వెంటాడి వేటాడి, ఒంట్లో కత్తులు దూసి, అవయవాలు నరికేసి, ఖండఖండాలుగా చిద్రువలు చేసి కసాయి వాళ్ళ కన్నా కడుహీనంగా, కిరాతకంగా, రాక్షసంగా ప్రవర్తించారు. ఒక్క వేటుకు తల నరకాలని, ఒక వేటుకు శరీరాన్ని రెండు ఖండాలుగా చెయ్యాలని, ఒక్క వేటుకు ఇద్దరేసి శరీరాలని నరకాలని, బల్లెంతో ఒక్క పోటుకు సఫా చెయ్యాలని, బల్లెంతో గుచ్చి గాల్లోకి లేపాలని – ఇలాంటి కిరాతక పందేలు వేసుకుని మరీ హత్యాకాండకు తెగబడ్డారు. తల్లుల రొమ్ములు కరుచుకుపోయి ఉన్న బిడ్డల్ని లాగి కాళ్ళుపట్టి తలను బండకేసి బాదడం, నదుల్లోకి విసరడం, తల్లిగుండెలను కరుచుకుని ఉన్న బిడ్డ ఒంట్లోంచి దూరి తల్లి ఒంట్లోంచి బయటకు వచ్చేలా కత్తి దుయ్యడం వంటి అమానుష కాండకు పాల్పడేవారు. పదమూడేసి మందిని ఒక జట్టుగా నిలబెట్టి గాల్లో వేలాడదీసి కింద దుంగలు పేర్చి మంట పెట్టి సజీవదహనాలకు పాల్పడేవారు. ఇంకొంతమందిని

గడ్డివాముల్లోకి తోసి నిలువునా నిప్పుపెట్టిసేవాళ్ళు. బందీలుగా చిక్కినవారి కుడిచేతిని ఖండించివాళ్ళ మెడలోనే వేలాడదీసి 'పో, పోయి మా తడాఖా ఎంటో మీ వాళ్ళకు చెప్పు' అని తోలేవారు.

యుద్ధాలు ముగిశాక మిగిలిన ఆడవాళ్ళను, పిల్లలను వాళ్ళలో వాళ్ళు వంతులు వేసుకుని బానిసలుగా పంచుకునేవారు. అది కూడా వారి వారి హోదాలను బట్టి, పై అధికారులకు ఎక్కువ సంఖ్యలో ఒక్కో సందర్భంలో వందా రెండొందల మందిదాకా మూలవాసులను బానిసలుగా చేసుకునేవారు. వాళ్ళకు దేవుని వాక్యం నేర్పేవారు. వాళ్ళ ఆత్మలను పరిశుద్ధం చెయ్యడానికి క్రైస్తవ మతవిశ్వాసాలు ఆచరించేలా నిర్బంధ పెట్టేవారు. మగవాళ్ళను బంగారపు గనుల తవ్వకాల్లోకి దించేవాళ్ళు. గొడ్డుకన్నా హీనంగా శ్రమ చేయించేవారు. ఆడవారితో పొలం పనులు చేయించేవారు. కడుపునిండా తిండి కూడా పెట్టేవాళ్ళు కాదు. దీంతో బిడ్డతల్లులు పిల్లలకు పాలివ్వలేకపోయేవారు. పసిపిల్లలు ఆకలితో కన్నుమూసేవారు. ఆడవాళ్ళను, మగవాళ్ళను వేర్వేరు కొట్టాల్లో బంధించేవారు. వారికి సంసార జీవితం నిషిద్ధం. ఆకలిదప్పులతో మగవాళ్ళు గనుల్లోను, ఆడవాళ్ళు పొలాల్లోనూ అనామకంగా చచ్చిపోయేవాళ్ళు. ఇట్లా ఒకప్పుడు పిల్లాజెల్లా ఆడామగా మనుషులతో కళకళలాడిన దీవులను కొన్నిఏళ్ళలోనే నరమానవుడి ఆనవాలు దొరకని విధంగా మార్చేశారు.

**(థామస్ పైన్ 'కనీస ఇంగితం' 1776 ఆరంభంలో వెలువడింది. అమెరికా వలసల్లో అత్యంత ప్రజాదరణ పొందింది. రెండు డజన్లకు పైగా ఎడిషన్లతో లక్షలాది కాపీలు అమ్ముడయ్యాయి.)**

## 'కనీస ఇంగితం' (1776) - థామస్‌పైన్

ఇప్పుడు మీరు చదవబోయేది అతి సాధారణమైన వాస్తవాలు, సాదాసీదా వాదనలు. కనీస ఇంగితజ్ఞానం మాత్రమే. ఇంతకుమించి పాఠకులకు నేనేదో ప్రబోధించాలని మాత్రం అనుకోవడం లేదు. అతను తన ముందస్తు ఆలోచనలను, అభిప్రాయాలను, వివేచనను, మానసిక భావాలను యథాతథంగా అట్టిపెట్టుకుంటాడా, మార్చుకుంటాడా అనే దానితో నిమిత్తం లేకుండా ఇవాళా రేపు మానవుడి నడవడిక, నడత ఎంత ఉదారంగా ఉండాలి అనే విషయం మాత్రం అతనితో పంచుకుంటాను.

ఇంగ్లాండ్ – అమెరికాల మధ్య జరిగిన పోరాటాల గురించి గ్రంథాలకు గ్రంథాలే రాయబడ్డాయి. రకరకాల వ్యక్తులు రకరకాల లక్ష్యాలతో, రకరకాల అంచనాలతో ఈ వివాదంలో తలదూర్చారు. కానీ ఈ చర్చోపచర్చలు ఫలితం ఇవ్వలేదు. చివరకి ఒకదశలో చర్చలకు స్వస్తి చెప్పేసారు. ఆయుధాలే వాదనలో చివరాఖరి సాధనంగా చూసారు. ఇది బ్రిటిష్ రాజుగారు తానుగా ఎంచుకున్న ప్రత్యామ్నాయం. అమెరికా ఖండం ఈ సవాలును స్వీకరించింది.

రెండువైపుల నుండి ఈ ప్రశ్నకు జవాబులు వెతికిన వాళ్ళంతా ఒకే అంశం మీద చర్చలకు స్వస్తి చెప్పేసారు. అదే బ్రిటిష్ మహా సామ్రాజ్యంతో విలీనం. విలీనం పట్ల కూడా భిన్నాభిప్రాయం ఉన్నట్లు లేదు. కాకపోతే విలీన మార్గాల పట్ల అభిప్రాయ భేదాలు ఉన్నాయి. కొంతమంది బలప్రయోగం అన్నారు మిగిలిన వాళ్ళు స్నేహమార్గం అన్నారు. చరిత్రను తడిమి చూస్తే ఇప్పటిదాకా మొదటిమార్గం ఎల్లవేళలా వైఫల్యం చెందిన దాఖలాలే ఉన్నాయి. మిగిలిన రెండవమార్గం ఇంకెంత మాత్రం సమస్య పరిష్కారం మీద ప్రభావం చూపలేని స్థితిలో వుంది.

చర్చల మూలంగా ఒనగూడే ప్రయోజనాల గురించి చాలామంది చాలా చక్కగా చెప్పారు. అదొక ఆమోదయోగ్యమైన స్వప్నం. కానీ ఆ కల కల్లగా మిగిలింది. సమస్య సమస్యగా ఉండి పోయింది. చివరకి మనం ఇలా మిగిలాం. అయినా తప్పులేదు. ఈ వాదనకు రెండోవైపు నుండి సమస్యను మళ్ళీ సమీక్షిద్దాం. బ్రిటిష్ మహా సామ్రాజ్యానికి వలసలుగా ఉన్న దేశాలకు వాటిల్లిన భౌతిక నష్టాల గురించి మాట్లాడుకుందాం. ఎందుకంటే రేపుమాపు కూడా ఇలాంటి నష్టాలు కొనసాగుతూనే ఉంటాయి. బ్రిటిష్ సామ్రాజ్యానికి వలసలకు ఉన్న సంబంధం ఏమిటి? ఎందుకని ఈ దేశాలు సామ్రాజ్యం మీద ఆధారపడి ఉన్నాయనే ప్రశ్నలకు సహజ న్యాయసూత్రాలు, కనీస ఇంగితాల ఆధారంగా జవాబులు వెతుకుదాం. మనం విడిపోవాలంటే వేటిని విశ్వాసంలోకి తీసుకోవాలి. కలిసి ఉండాలంటే ఏం ఆశిస్తున్నాం అనేది తేల్చుకుందాం.

నేనేం విన్నానంటే, ఇప్పటికే కొంతమంది ఒక అంచనాకు వచ్చేసారట. గ్రేట్ బ్రిటన్‌తో ఇప్పటిదాకా ఉన్న 'కనెక్షను' మూలంగా అమెరికా చాలా అభివృద్ధి చెందినదట. భవిష్యత్తు కూడా ఇలా ఆశాజనకంగా ఉండాలంటే ఇక ముందు కూడా అదే 'కనెక్షను' కొనసాగాలట. ఇది పూర్తిగా 'ఫాల్తూ' వాదన. పిల్లాడు ఎదగడానికి పాలు ఇచ్చాం కాబట్టి ఎదిగాక మాంసం అడగకూడదు. ఇరవై ఏళ్ళు మా క్రిందే బతికారు కాబట్టి ఇంకో ఇరవై ఏళ్ళు మాకిందే బతకాలి అనే వాదన ఎంత అర్థరహితమో ఈ వాదన కూడా అంతే అర్థరహితం. అయినా మాట వరసకి వాళ్ళు వాదన అంగీకరించినా నే తిన్నగా చెప్పాలనుకుంటున్న సమాధానం ఒక్కటే. ఏ ఐరోపా ఆధిపత్యమూ లేని నాళ్ళలో కూడా అమెరికా అభివృద్ధి చెందింది. బహుశా ఇంకా అభివృద్ధి సాధించి ఉండేదేమో. జీవితావసరాల నుండి వాణిజ్యం నేర్చుకుంది ఈ దేశం. ఐరోపా పండించడానికి బదులు మింగడానికే అలవాటుపడిపోయిన మూలాన అమెరికా మార్కెట్ సంపాదించుకోగలిగింది.

అయితే బ్రిటన్ మనల్ని కాపాడుకుంటూ వచ్చింది అంటారు కొంతమంది. కానీ మనల్ని ముంచింది కూడా బ్రిటన్ దేశమే. స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకున్న చందంగా ఈ ఖండాన్ని కాపాడుకుంటూ రావడంలో తనూ కొంత నష్టపోయింది. మనలాంటి దేశాలు ఇంకా ఎక్కువ నష్టపోయాయి. వాణిజ్యావసరాల కోసం, ఆధిపత్యం కోసం – బ్రిటన్ అందుకు నడుం బిగించింది. అమెరికా ఏంటి టర్కీ విషయంలో కూడా బ్రిటన్ చేసింది అదే కదా. ఎంతయినా బ్రిటన్ మనకు పితృ సమానమైన దేశం కదా అంటున్నారు ఇంకొంతమంది. అదే నిజమైతే ఆ దేశం సిగ్గుపడాలి, తన నడతకు. మూర్ఖులు తప్ప మరొకరు హింసోన్మత్త రాక్షస

యుద్ధాల్లో యువకులను ఏరికోరి తెగనరికి చంపరు. అందులోనూ సొంత కుటుంబంలా చూసుకోవాల్సిన ఏ తండ్రీ కత్తిదూయడు కాబట్టి ఇలాంటి విశేషణాలు బ్రిటన్‌కు భూషణాలుగా భాబుసించకపోగా పదిమందిలో సిగ్గుతీసినంత పనిచేస్తాయి. తల్లి, తండ్రి, ఇలాంటి సెంటిమెంటు పదాలను రాజుగారు ఆయన మీదపడి బతికే పరాన్నభుక్కులు తప్ప ఇంకొకరు మాట్లాడరు. మరీ భావోద్వేగాలను మన బలహీనతగా మలుచుకుని మనల్ని గెలుచుకోవడానికే ఇలాంటి అసంబద్ధ వాదనలను ముందుకు తెస్తున్నారు. నిజం చెప్పుకోవాలంటే అమెరికాకు పితృసమానమైనది ఏదన్న ఉందంటే అది యూరప్ తప్ప బ్రిటన్ కాదు. యూరప్‌లో పౌరస్వేచ్ఛ, మత స్వేచ్ఛను కాంక్షించేవారు ఎవరైనా పిచ్చాసుపత్రి అనే కొత్తలోకంలోకి నెట్టివేయబడ్డారు. ఇంకొందరు పారిపోయారు. ఎవరు దీనికి కారణం?. తల్లిగా, ప్రేమగా సమాదరించకపోగా ఎవరు వీరిని భీకర రాక్షసత్వంతో తరిమివేశారు? అది బ్రిటన్ తప్ప వేరొక దేశం కాదుకదా. బ్రిటన్ నియంతృత్వాన్ని భరించలేక సొంత గడ్డ మీద నుండి పలాయనం చిత్తగించిన మేధావులు ఎంతమంది లేరు? పితృవాత్సల్యం, మాతృప్రేమ అంటే ఇదేనా.

సరే మనమంతా ఆంగ్ల జాతికి చెందినవాళ్ళమే. అయితే ఏంటట? ఏమీ కాదు. బ్రిటన్ ఇవాళ ఒక బహిరంగ శత్రువు. లోకంలో వున్న దుష్ట సమాసాలన్నింటికి అర్థాలు. అలాంటి దేశంతో సంబంధాల గురించి మనల్ని పునరాలోచించుకోమంటున్నారంటే అంతకన్నా ఫార్సు ఇంకొకటి ఉండదు. ఇంగ్లాండ్‌కు తొలి మహారాజు ఒక ఫ్రెంచి జాతీయుడు. ఇంగ్లాండ్‌లో సగం మంది అదే దేశం నుంచి ఏతెంచారు. అమెరికాను ఇంకా పరిపాలించడానికి ఇంగ్లాండ్ ఏ కారణాలు చెబుతుందో, వాటినే తనకు అన్వయించుకుంటే ఇంగ్లాండ్‌ను ఫ్రెంచి వాళ్ళు పాలించాలి.

నేను సవాలు చేస్తున్నా. తెలివి తెచ్చుకుని పునరాలోచించుకోమని మనకు హితబోధలు చేస్తున్న వాళ్ళలో ఎవరైనా ఒక్కరు అమెరికా బ్రిటిష్ సామ్రాజ్యంతో అంటకాగుతూ ఉండడం మూలంగా ఒనగూడే ఒక్క ప్రయోజనం ఏంటో చెబుతారా. మళ్ళీ మళ్ళీ సవాలు చేస్తున్నా, సవాలు చేసి చెబుతున్నా, నయాపైసా ప్రయోజనం ఒనగూడలేదు. మేం పండించే మొక్కజొన్నకు యూరప్ మార్కెట్‌లో ఎక్కడయినా సరైన ధర పలుకుతుంది. కాబట్టి మా దిగుమతులకు సరసమైన ధర లభించే చోట మేం అమ్ముకుంటాం.

కాని బ్రిటన్ సామ్రాజ్యానికి వలస ఉండడం మూలంగా ఎన్ని అవకాశాలు పోగొట్టుకున్నామో, ఎన్ని అవమానాలు భరించామో, ఎన్ని గాయాల పాలయ్యామో లెక్కలేదు. అందుకే మానవాళి పట్ల మా కర్తవ్యంగా, స్వీయ ధర్మంగా బ్రిటన్‌తో తెగతెంపులు చేసుకోవాలని మేం నిర్ణయించుకున్నాం. బ్రిటన్ సామ్రాజ్యం మీద ఆధారపడడం అన్నా, దానికి లొంగిపోవడమన్నా కోరికోరి ఈ ఖండాన్ని ఐరోపా యుద్ధాల్లోకి, కీచులాటల్లోకి ప్రత్యక్షంగా నడిపించడమే కాగలదు. అంతేకాదు మనమే స్నేహహస్తం చాచాలనుకున్న దేశాలతో కూడా మన సంబంధాలు బెడిసికొడతాయి. ఆ దేశాలతో మనకు ఎలాంటి తగాదాలు లేకపోయినా ఇది జరగడం ఖాయం. ఐరోపా ఖండం యావత్తూ అమెరికాకు మార్కెట్‌గా కావాలి. ఏదో ఒక

దేశంతో పక్షపాతంతో కూడిన సంబంధాలు మేం కోరుకోవడం లేదు. వాణిజ్య ప్రయోజనాల ఆధారంగా మాత్రమే పరాయి దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవాలనే అమెరికా కోరిక, బ్రిటన్ సామ్రాజ్యం మీద ఆధారపడినంత కాలం నెరవేరదుగాక నెరవేరదు. బ్రిటిష్ రాజకీయాల్లో అమెరికా పావుగా మారడం తప్ప వేరేం ఒరగదు.

యూరప్ ఖండంలో ప్రపంచంలో ఎక్కుడా లేనన్ని రాజరిక సంస్థానాలు ఉన్నాయి. శాంతియుత సహజీవనం అనే పదానికి రాజరిక పరిపాలనలలో చోటేలేదు. ఇంగ్లాండ్ ఎప్పుడు ఏ దేశంతో యుద్ధానికి దిగుతుందో చెప్పలేం. అట్లాంటి పేచీకోరు సామ్రాజ్యంతో అంటకాగడమంటే అమెరికా వ్యాపార, వాణిజ్యాలు నిలువునా కాలిపోవడమే. తరువాతి యుద్ధంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. మమ్మల్ని పునరాలోచించుకోమని చెప్పేవాళ్ళు అప్పటిదాకా వేచి ఉండమని మమ్మల్ని కోరుతున్నారు. అందాకా బ్రిటన్‌తో అంటకాగితే మేం యుద్ధంలో పావులుగా మారతాం తప్ప తటస్థంగా ఉండగలమా? ఏ రకంగా చూసినా, ఏ కారణాలు విశ్లేషించుకున్నా విడిపోవడమే మాకు శ్రేయస్కరం అని రూఢీ అవుతుంది. మరణించిన వారి నెత్తురు, ప్రకృతి రుద్ధకంఠధ్వనీ విడిపోవడానికి ఇదే సమయం అని ఘోషిస్తున్నాయి. ఆ సృష్టికర్త కూడా ఈ రెండు దేశాల మధ్యన భౌగోళికంగా ఏర్పాటు చేసిన దూరం స్వర్గ – నరకాల మధ్య దూరం లాంటిది. బ్రిటన్ మా పాలిట స్వర్గం కానేరదు. ఈ భూభాగాన్ని కనుగొన్న తీరు, ఇది జనావాస ప్రాంతంగా అభివృద్ధి అయిన క్రమమూ విడిపోవాలనే మా వాదనకు మరింత బలం చేకూరుస్తుంది. అమెరికా ఖండాన్ని కనుగొన్న అనంతరమే సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం మొదలయ్యింది. ఈ నా మాతృభూమి స్నేహహస్తాన్ని, భద్రతను అందించలేదేమో అని ఒకవేళ దయామయుడైన ఆ దేవదేవుడు దయతో వేధింపులకు గురైన భవిష్య తరాల కోసం ఒక గూడు సిద్ధం చేస్తున్నాడల్లే ఉంది.

అమెరికా ఖండం మీద, బ్రిటిష్ మహా సామ్రాజ్యం ఏదో ఒక నామకః ప్రభుత్వ రూమ్‌లో చలాయించ చూస్తున్న పరిపాలన నేడు కాకపోతే రేపయినా ముగిసి తీరాల్సిందే. లోతుగా భవిష్యత్తును తెరచి చూస్తే విజ్ఞులకు ఎవరికైనా వీసమెత్తు సంతోషం కలుగదు. ప్రస్తుత రాజ్యాంగం కేవలం తాత్కాలికమైనది అన్న విషయం ఎంత ఉదార బుద్ధితో చూసినా బాధ కలిగించక మానదు.

ఇది కీలుబొమ్మ ప్రభుత్వం కాబట్టి దీని నుండి బిడ్డల తండ్రులుగా మనం ఏం ఆశించలేం. సాదాసీదాగా చెప్పుకోవాలంటే మనం మన తరువాత తరాన్ని అప్పుల ఊబిలోకి నెట్టబోతున్నాం. దీన్ని మనం నిలవరించ లేకపోతే మన తరువాతి తరం దయనీయమైన, నీచమైన దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే మన కర్తవ్యం ఏమిటీ మన బిడ్డలను మన చేతుల్లోకి తీసుకుని వాళ్ళకు సమీప భవిష్యత్తులో ఓ అద్భుతమైన భవిష్యత్తును అందించాలి. వర్తమానంలో ఏ భయ సందేహాలు మన దృష్టిని మందగింపచేస్తున్నాయో వాటిని దూదిపింజెల్లా తేల్చేస్తుంది.

నేను అనవసరంగా ఎవరి మీదా ఎదురుదాడికి దిగరాదనే జాగ్రత్త వహిస్తున్నా – ఎవరైతే ఇవాళ మనల్ని పునరాలోచించుకోమని చెబుతున్నారో వారి గురించి ఈ నాలుగుమాటలూ చెప్పకుండా ఉండలేకపోతున్నా. అటువైపు మొగ్గు ఉన్నవాళ్లు నమ్మదగిన వ్యక్తులు కాదు. మన భవిష్యత్తును కాంచలేని వాళ్ళు, స్వీయ మానసిక భావాలతో అలరారుతున్న వాళ్ళు, ఐరోపాకు సంబంధించినంత వరకు వాస్తవానికి మించిన అతిశయంతో ఆలోచిస్తున్నవాళ్ళు. వీళ్ళందరి కన్నా మరో తరగతి జనాలు ఉన్నారు. పేచీకోరు వాదనలతో ఈ ఖండం మొత్తాన్నీ అతలాకుతలం చెయ్యగల సమర్థులు. అందరిలోకి కడు ప్రమాదకారులు.

వీళ్ళంతా భయదవిహ్వాలంగా, విషాదంగా బతుకులు ఈడుస్తున్న పామర జనంతో సంబంధం లేకుండా, ఎక్కడో దూరంగా దిలాసాగా కులాసాగా జీవితం గడిపేస్తున్న వాళ్లు. అమెరికా యావత్ సంపదను లూటీ చేసిన దుష్టశక్తులు ఇంకా వీళ్ళ ఇంటి గుమ్మాలు తొక్కనందున 'అంతా సజావుగా సాగుతుందని' నీతులు చెబుతున్న వాళ్ళు. కాసేపయినా మన ఊహలు బోస్టన్ నగరం కేసి తేరిపార చూస్తే అక్కడ రాజ్యం చేస్తున్న దారిద్ర్యం చూసయినా మనం తెలివి తెచ్చుకుంటాం. కించిత్తు విశ్వాసం లేని వాళ్ళ చేతుల్లో అధికార పగ్గాలు కొనసాగడం ఇంకెంత మాత్రం సరికాదని స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాం. కొన్ని నెలల క్రితం వరకు ఈ నగర ప్రజానీకం ప్రశాంతమైన, సుసంపన్నమైన జీవితాలు గడిపారు. కానీ ఇవాళ ఈ నగరం దురదృష్టం ఏంటంటే ఇక్కడ బతకాలంటే అడుక్కుతినాలి లేదూ ఆకలితో చావాలి. మిత్రుల పేరిట ఈ నగరంలో తిష్ట వేసిన బ్రిటిష్ సైన్యం రేపిన చిచ్చుకు బలికావడమో, లేదా వాళ్ళను అక్కడ నుండి పొమ్మంటే పోతూపోతూ సైన్యం చేసే దోపిడీకి లోనుకావడమో తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదు. అడకత్తెరలో చిక్కిన పోక మాదిరిగా తయారయ్యాయి అక్కడ సామాన్యుల జీవితాలు. ఖైదీల మాదిరి బతుకులీడుస్తున్నారు. ఈ పరిస్థితి నుండి బయటపడతాం అనే ఆశ లేకుండా జీవిస్తున్నారు.

బ్రిటన్ సామ్రాజ్యం చేసిన ఆగడాలను తేలికగా తీసుకుని – 'జరిగిందేదో జరిగిపోయింది, ఎంతయినా మనం మనం ఒకటి, ఎప్పటికీ మన దోస్తీ ఇలానే కొనసాగాలి' అని వాదించేవాళ్లకూ కొదవలేదు. అయితే వీరికి మానవహృదయ సంస్పందనల గురించి ఆవగింజంతయినా తెలియదని ఖరాఖండిగా చెప్పుకోవచ్చు. మాతృభూమిని కత్తుల బోనులో నిలిపి చుట్టూ మంట పెట్టిన జాతితో ఎవరైనా ప్రేమతో విశ్వాసంతో మనగలరా? అలాంటి అధికారాన్ని నిషేధించగలరా? ఈ రెండూ చెయ్యలేని నాడు ఎవరిని మోసగించడానికి ఇంకా బ్రిటన్‌తో కలిసిమెలిసి ఉందాం అనే ఈ వాదనలు. అవకాశవాదంతో, అస్వాభావికంగా బలవంతానా కలిసిమెలిసి ఉండాలని ప్రయత్నించినా అది మూడునాళ్ల ముచ్చటగానే నిలుస్తుంది. ఆనక అంతకుముందు కన్నా మరింత దుర్భర దారిద్ర్యాన్ని తలకెత్తుకోవాల్సి వస్తుంది. అయినా సరే – ఈ అవమానాలన్నీ దిగమింగుకుని బ్రిటన్‌తో కలిసి ఉండాలనేదే నీ వాదన అయితే నాది ఒకటే ప్రశ్న – నీ ఇల్లు ఎవరన్నా నీ కళ్ళముందే తగలబెట్టారా, నువ్వు కూడబెట్టుకున్న సమస్తం నీ కళ్ళముందే బుగ్గిపాలు చేసారా? నీ భార్యాపిల్లలకు రెండు పూటలా ఇంత రొట్టె

తినిపించగలుగుతున్నావా? వాళ్ళు అనాథల్లా వీధుల వెంబడి ఏరుకోవడం చూశావా? నీ కుటుంబంలో పిల్లల్నిగానీ, తల్లిదండ్రులని గానీ పోగొట్టుకున్నావా 'లేదు' అనేది నీ సమాధానం అయితే 'అవును' అని బదులిచ్చిన వేలాదిమంది తరఫున నువ్వు వకాల్తా పుచ్చుకుని మాట్లాడడం అసంబద్ధం. 'అవును' అనేది నీ సమాధానం అయి, అయినా కూడా ఆ నరహంతకులతో చెయ్యి కలపాలనేది నీ వాదన అయితే – ఒక తండ్రిగా, భర్తగా, స్నేహితుడిగా, ప్రేమికుడిగా మానవ జీవితంలో నీ హోదా ఏదయినా సరే అది పూర్తిగా వ్యర్థం. నువ్వు ఒట్టి పిరికిగొడ్డుకింద, ఓ బూటునాకుడుగాడి కింద లెక్క.

ఇదేదో రెచ్చగొట్టడానికో, గోరంతలు కొండంతలు చేసి చూపించడానికో కాదు చెప్తా. సహజ సిద్ధమయిన ప్రేమాభిమానాలతో స్పందిస్తున్నా. సామాజిక జీవిత బాధ్యతగా గుర్తెరిగి చెప్తున్నా. ఇదేదో పగ తీర్చుకోవడానికి మిమ్మల్ని పురిగొల్పేందుకు భయదవిహ్వలంగా చెబుతున్న విషయాలు కావు. అమానవీయమైన నిద్రాణావస్థలో ఉన్న మన జాతిని తట్టి లేపేందుకు, నిర్దిష్ట లక్ష్య సాధన దిశగా కార్యోన్ముఖులను చేసేందుకు ఈ విషయాలు మీ దృష్టికి తెస్తున్నా. బ్రిటన్, యూరప్‌లు అమెరికాను పాదాక్రాంతం చేసుకున్నాయంటే దానికి కారణం – ఆ రాజ్యాల బలం కాదు, అమెరికా చేవ చచ్చినతనం, మొద్దు బద్ధకం. ఈ రెండూ తక్షణం వదిలించుకుని ఇదే అదునుగా ఈ శీతాకాలం పదునుగా చిరదీక్షా సంకల్పానికి కంకణబద్ధులు కాకపోతే యావత్ అమెరికా ఖండం శాశ్వతంగా దురదృష్టపు సంకెళ్ళలో చిక్కుకుపోతుంది. అదే జరిగితే అందుకు కారణభూతమైన ప్రతివారికీ ఊహించని శాస్తి ఎదురవుతుంది. అందుకే నువ్వు, నేను, వాడూ, ఆమె, తాను, మనం అందరం ఒక్కటై ఈ సందర్భాన్ని, సమయాన్ని నేర్పుగా వినియోగించుకుందాం. ఏ మాత్రం చేజారవిడుచుకోవద్దు. ఇది అపురూపమైన త్యాగాల శీత రుతువు. అమూల్యమైన త్యాగాలకు సిద్ధంకండి.

మన భూఖండం ఇంకెంత కాలమో పరాయి పాలనలో మగ్గాల్సిన అవసరం లేదు. మనం ఆకాంక్ష సహేతుకమైనది. విశ్వజనీన సూత్రాలకు అనుగుణమైనది. కాని బ్రిటిష్ దొరల ఆలోచనలకు ఇది తట్టడం లేదు. ఏ మాత్రం తెలివిగలవారు ఆలోచించినా విడిపోవడానికి ఇదే సరైన అదును అని ఢంకాపథంగా చెప్తారు. విడిపోవడమే మనకు శ్రీరామరక్ష. పునః చర్చలు పగటికలల వంటివి. బ్రిటన్ – అమెరికా ఖండాల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రకృతే వేరు చేసింది. మెరమెచ్చులతో ఇంకెంత కాలమో కలిపి ఉంచడం అసాధ్యం. మిల్టన్ మహాశయుడు ఎప్పుడో అన్నాడు –'పరమ విద్వేషం చేసిన లోతైన గాయాలను పునరాలోచన మాన్పలేదని' శాంతియుతంగా మనం చేసిన ప్రతి ప్రయత్నమూ వమ్మయింది. మన వేడికోళ్ళు చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారాయి. మనకి మనం సర్దిచెప్పుకోవడానికే తప్ప మన ప్రయత్నాలేవీ ఫలించలేదు. పదేపదే బ్రిటిష్ మహారాజుగారికి మహాజర్లు సమర్పించడం, వారు పరిశీలిస్తాం అనడం రివాజుకన్నా కనాకష్టంగా హీనాతిహీనంగా మారిపోయింది. 'దెయ్యమైనా వెరచు వేటుకు' అన్నట్లు డెన్మార్కూ స్వీడన్ దేశాలలో రాజులకు దెబ్బపడితే గానీ దిగిరాలేదు. దైవం మీద ఆనపెట్టి శపథం చేద్దాం. ఇదే మన తుదిపోరు.

విడిపోవడమో, వీర స్వర్గమో, ఈ పోరాటం మనతోనే ముగియాలి. మన తరువాతి తరం పీకలకు చుట్టి వాళ్ళ గొంతుకలు కొయ్యద్దిక.

వాళ్లు చేతులు ముడుచుకు కూర్చుంటారని అనుకోవడం శుద్ధ ఆశావాదం. స్టాంపు చట్టాన్ని రద్దు చేసినప్పుడు మనం ఇలానే భావించాం. ఒకటి రెండేళ్ళ పాటు మనల్ని ఏమార్చారు. అందుకే ఏదేని దేశం ఒకసారి ఓటమి పాలయినంత మాత్రాన మళ్ళీ లడాయికి దిగదని భావించరాదు.

ఇక పరిపాలనా వ్యవహారానికి వస్తే మన భూఖండానికి న్యాయం చెయ్యాలనే తలంపు బ్రిటిష్ అధికారులకు ఏకోశానా లేదు. రానురానూ వారి వ్యాపారాత్మక ధోరణి మరింత పెను భారంగా మారనుంది. ఏకోశానా భరింప శక్యం కాని స్థాయికి చేరుకోనుంది. పరాయి గడ్డమీద చలాయిస్తున్న అధికారం మనల్ని పూర్తిగా విస్మరించింది. మనల్ని గెలుచుకోలేని వాళ్ళకు మనను పరిపాలించే అర్హత ఎక్కడ ఉంది? ఒక విన్నపం చేసుకోవాలన్నా ఒక మహజరు సమర్పించుకోవాలన్నా మూడు నాలుగువేల మైళ్ల దూరంలో ఉన్న ప్రభుత్వం, ఒకవేళ అష్టకష్టాలూ పడి మనం ఆ పని చేసినా మన బాధలుగాథలు చెప్పుకోవడానికి ఓ ఐదారు నెలలు వేచి ఉండాల్సి రావడం, పరిష్కారం మాట అటుంచి కనీసం స్పందించడానికి ఇంకో ఐదారు నెలలు పడుతుంటే – ఇంక మనకు దిక్కు ఏంటి? ఇదంతా ఆకతాయితనంగా, పిల్లచేష్టగా లేదూ. ఆలస్యం అమృతం విషం అన్నారు మన పెద్దలు. దేనికయినా సమయం రావాలి ఆ సమయం ఏదో ఇప్పుడొచ్చింది దీన్ని మనం గౌరవించుకోవద్దు. చిన్న చిన్న దీవులు వాటి రక్షణనే అవి చూసుకోలేవు. అందుకే అలాంటి దీవులు మహారాజులు ఇట్టే ఆక్రమించుకోవడానికి లాయకీగా ఉంటాయే కాని దురదృష్టం తిరగబడింది అంటారు చూశారా – అలా చిన్న చిన్న దీవుల సమూహం అయిన ఇంగ్లాండు మన అమెరికా అంతటి పెద్ద భూఖండం మీద అజమాయిషీ చెలాయించడం అసంబద్ధంగా లేదూ? గ్రహం చుట్టూ ఉపగ్రహం తిరుగుతుంది. కానీ ఇదేం విడ్డూరం ఉపగ్రహం చుట్టూ గ్రహం తిరగడం? ఈ పొరబాటు సరిదిద్దబడాలి. ఇంగ్లాండ్, అమెరికా దేశాలు పరస్పర గౌరవం ఇచ్చుపుచ్చుకోవాలి. ఈ రెండూ రెండు వ్యవస్థలు. ఇంగ్లాండ్ యూరప్ దేశం. అమెరికా, అమెరికా ఖండ దేశం.

అమెరికన్ విప్లవం అంటే ఇంగ్లాండ్ నుండి స్వాతంత్ర్యం కోసం జరిపిన పోరాటం. ఈ విప్లవం చోటు చేసుకోవడానికి ముందు వలస దేశాలన్నీ వర్గ సంఘర్షణలతో అతలాకుతలం అయిపోయాయి. కౌలుదార్లు భూస్వాములకు వ్యతిరేకంగా తిరగబడ్డారు, పేదలు హక్కుల కోసం అలజడులు, అల్లర్లకు పాల్పడ్డారు. అయితే ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా జరిపేపోరులో తాత్కాలికంగా ఈ వర్గ సంఘర్షణలు తెరవెనక్కు వెళ్ళాయి. అడపాదడపా ఈ ఘర్షణలు తెరమీదకి వస్తూనే ఉన్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా జరిపిన పోరాటం విజయం సాధించాక ఈ వర్గ సంఘర్షణలు మరలా తలెత్తక మానవు.

స్వాతంత్ర్య సాధన ప్రణాళికలో ప్రజాస్వామ్యం, సమసమాజం అంటూ ఉదాత్తమైన ఆశయాలను ప్రకటించారు. సృష్టిలో మానవులంతా సమానమే, ప్రతి మనిషీ ఆనందంగా జీవితం గడిపేందుకు స్వేచ్ఛ ప్రసాదించబడుతుందని రాజ్యాంగంలో పొందుపరిచారు. అయితే ఈ మెరమెచ్చు వాగ్దానాలన్నీ వర్గ సంఘర్షణలతో చీలికలు పేలికలుగా ఉన్న అమెరికన్ ప్రజానీకాన్ని ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో సాధ్యమైనంత ఎక్కువ మందిని తనవైపు నిలబెట్టుకునేందుకు ఉద్దేశించినదే తప్ప 150 ఏళ్ల వలస చరిత్రలో పోగడిపోయిన సంపద అధికార పంపిణీని గానీ, ఆర్థిక సంబంధాల్లో మార్పులను గానీ ఉద్దేశించినవి కాదు.

ఒకవైపు ఇంగ్లాండ్ వలసపాలనకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్న కాలంలోనే కాంటినెంటల్ సైన్యంలో తిరుగుబాట్లు చెలరేగాయి. ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా చేసిన యుద్ధం సమసిపోగానే మాస్సాచ్యుసెట్స్ తదితర రాష్ట్రాలతో రైతుల తిరుగుబాట్లు చెలరేగాయి. దేశంలో వర్గ కసి అనడానికి ఇవన్నీ తిరుగులేని నిదర్శనాలు. జాతి నిర్మాతలకు ఇవేవీ తెలియని విషయాలు కాదు. ఆగామి తిరుగుబాట్ల పట్ల వారిలో దిగులు దాగి ఉండనే ఉంది. ఆ దృష్ట్యానే తిరుగుబాట్లను అణిచివెయ్యడానికి 'శాంతి భద్రతల పరిరక్షణ' పేరిట చట్టాన్ని రూపొందించారు.

**1787, 88 సంవత్సరాల్లో అలెగ్జాండర్ హామిల్టన్ జేమ్స్ మాడిసన్, జాన్‌జేలు ఇరువురూ 'పబ్లిక్కు' అనే మారుపేరుతో నూతన రాజ్యాంగ ఆమోదాన్ని బలపరుస్తూ న్యూయార్క్ నుండి అనేక వ్యాసాలు రాశారు. మాడిసన్ రాసిన ఫెడరలిస్టు పత్రం 108 ఆమూలాగ్రం చదివితే బలాఢ్యవర్గాలు తమ ఆధిపత్యం కాపాడుకోవడానికి ఒక బలమైన కేంద్ర ప్రభుత్వం ఉండాలని ఎంతగా ఆందోళన చెందారో తెలియవస్తుంది. అందుకే ప్రముఖ చరిత్రకారుడు ఛార్లెస్ బెర్డ్ అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగాన్ని ఆర్థిక కోణంలో విశ్లేషిస్తూ "మాడిసన్ ఉటంకించిన సంపద అంటే ప్రధానంగా తోటలు, బానిసలే" అని వివరించాడు. రాజ్యాంగాన్ని ఆమోదింప చెయ్యడానికి "ఫెడరల్ పత్రాల" రూపంలో రాసిన వ్యాసాల్లో మాడిసన్ జనరంజక భాషను ఉపయోగించాడు. తద్వారా బలం కావాలన్నా, భద్రత కావాలన్నా పరిస్థితుల ప్రాబల్యం దృష్ట్యా కొత్త రాజ్యాంగ వ్యవస్థకు మద్దతు పలికి తీరాలని వివిధ తరగతులకు చెందిన ప్రజానీకాన్ని బలవంతంగా ఒప్పించాడు.)**

## ఫెడరలిస్టు పత్రం నెంబరు 10

## జేమ్స్ మాడిసన్ - 1787 నవంబరు 23

**న్యూయార్క్ రాష్ట్ర– వాసులారా!**

బలమైన కేంద్రప్రభుత్వ నిర్మాణం మూలంగా ఒనగూడే అనేకానేక మేళ్ళకన్నా ముఠాల హింసోన్మత్తతను నియంత్రించి వీలయితే వాటి వెన్ను విరిచే తత్వం అనివార్యమైన అవసరం

అని మనమంతా గ్రహించాలి. ప్రజారంజక ప్రభుత్వాలను కాంక్షించే వారు ఎవరైనా సరే ఆ ప్రభుత్వాలు ఇలాంటి ప్రమాదాలను నిలువరించగల సత్తాను, లక్షణాలను కలిగి ఉన్నాయో లేదో ముందుగా ఒక అంచనాకు రాగలగాలి. తాను నమ్మిన సూత్రాలకు విఘాతం కలుగకుండా ఏరకమైన రాజ్యాంగం ఇలాంటి సర్వజనహితాన్ని ప్రసాదించగలదో సరిగా అంచనా వెయ్యగలగాలి.

నిజానికి ప్రజాకౌన్సిళ్ళు అస్థిరతత్వానికి, అన్యాయానికి గందరగోళానికి లోనయిన సందర్భాల్లోనే ఎంతటి ప్రజారంజక ప్రభుత్వాలయినా కుప్పకూలిపోవడానికి దారి తీసిన రుగ్మతలని మనం గమనించవచ్చు. అందుకే స్వేచ్ఛా వ్యతిరేకులు తమ పాచికలు పారాలంటే ప్రభుత్వం ఈ రుగ్మతలతో నిత్య అగ్నిహోత్రంలా మండిపోతూ ఉండాలని కోరుకుంటారు. కొత్త, పాత ప్రజారంజక నమూనాల మేలు కలయిక ఆధారంగా ఇవాళ అమెరికన్ రాజ్యాంగంలో తీసుకురాదల్చిన మార్పులు నికార్సయినవి, తిరుగులేనివి అని అనుకోవడానికీలేదు. అనివార్యమైన పరిస్థితులలోనే కొంత పక్షపాత ధోరణితో ఉన్నాయి. మనం అంచనావేసిన ప్రమాదాలను నిలవరించడానికి ఈ మాత్రం పక్షపాత ధోరణి అవసరం. ఈ విషయమై వివిధ తరగతుల ప్రజానీకం నుండి ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల పట్ల విశ్వాసం గల భిన్న బృందాలు పబ్లిక్ స్వేచ్ఛ – వ్యక్తిగత స్వేచ్ఛల పట్ల విశ్వాసం ప్రకటించే వేర్వేరు బృందాలు – మన ప్రభుత్వాలు తీవ్రమైన అస్థిరతకు ఆలవాలంగా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ప్రతికక్షుల మధ్య తగాదాల మూలంగా ప్రజా ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడుతున్నాయని, ఆయా సందర్భాలలో న్యాయసూత్రాలకు లోబడి గాని, నిర్ణయాల మూలంగా మెజారిటీ ప్రజల మీద పడే భారాల గురించిగాని సరుకు చెయ్యడం లేదని విమర్శిస్తున్నాయి. ఇవన్నీ పునాదిలేని ఆరోపణలుగా కొట్టి వెయ్యాలని కొంతమంది తహతహలాడుతూ ఉండవచ్చు. కానీ ఏదో ఒక మేరకు ఈ విమర్శలో నిజం లేకపోలేదు. నిజానికి పరిస్థితులను సాకల్యంగా పునః సమీక్షించుకుంటే మనం శ్రమకోర్చి, ఒత్తిడికి లోనయి చేసిన నిర్ణయాలు ఒక్కోసారి తప్పుడువిగా తేలడంతో ఆ మేరకు ప్రభుత్వాల మీద అననుకూల ప్రభావాలు పడ్డాయి. అయితే మనం ఎదుర్కొన్న అత్యంత దురదృష్ట పరిస్థితులు అన్నింటికీ ఇవే కారణం కాదు. ప్రజల భాగస్వామ్యం పట్ల మనం విశ్వాసం ఉంచడం లేదు. ప్రైవేటు హక్కులు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. ఇవన్నీ ఒక ఖండం నుండి ఇంకో ఖండానికి వచ్చేసరికి తమతమ భేదాలు ఉండొచ్చు. ప్రజా పరిపాలనలో చిత్తశుద్ధి కొరవడడం, అవినీతి మకిలి అంటుకోవడం, నికరంగా ప్రజాసేవ కోసం పనిచెయ్యకపోవడం ఇవన్నీ ప్రభుత్వాల పట్ల ప్రజలకు ఏహ్యాభావాన్ని కలిగిస్తున్నాయి.

అయితే లిప్తపాటు అయినా మన గమనంలో ఉండాల్సిన అంశం ఏమిటంటే – అత్యధిక శాతం పౌరులు, వారు మెజారిటీయా, మైనారిటీయా అనే దానితో సంబంధం లేకుండా, ఏకీకృత ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉన్నారు. జాతి ఉమ్మడి ప్రయోజనాలో, సగటు

ప్రయోజనాలో వారిని ఐక్యంగా నిలబెట్టాయి. ఇతరుల హక్కుల పట్ల వ్యతిరేకత ఉంటే ఉండొచ్చు గాక కానీ ఈ ఐక్యతాభినివేశమే జాతి జనులను ఒక్కటిగా నిలిపి ఉంచుతుంది.

కొంతమంది ముఠాగా ఏర్పడి తప్పుడు పద్ధతులు అవలంభిస్తున్నారు. దీన్ని నివారించడానికి రెండే పద్ధతులు. మొదటిది మూలాల్లోకి వెళ్ళి ఈ తప్పుడు పద్ధతులు తలెత్తకుండా చూసుకోవడం, ఇక రెండవది వీటి ప్రభావాలను గట్టిగా నియంత్రించడం, మూలాల్లోకి వెళ్ళి వైరుధ్యాలను పరిష్కరించడానికీ రెండు పద్ధతులు ఉన్నాయి. ఒకటి ఈ వ్యవస్థ మనగలగడానికి ఆధారభూతమైన 'స్వేచ్ఛ'ను పరిహరించడం (అంటే నియంతృత్వ వ్యవస్థ వైపు మొగ్గడం) లేదూ మరోమార్గంగా ప్రతి మనిషికీ అవే ప్రయోజనాలు సాధించుకోగలిగేందుకు తగిన అభినివేశాన్ని, అభిప్రాయాలను, స్వేచ్ఛను ప్రసాదించడం.

అయితే వివేకవంతులు ఎవరూ మొదటి మార్గాన్ని పరిష్కారంగా భావించరు. ఎందుకంటే అది రుగ్మతకన్నా ప్రమాదకరమైన వైద్యం కాబట్టి. స్వేచ్ఛ అనేది ప్రాణవాయువు వంటిది. ఈ సమాజం వెలుగొందడానికి అవసరమైన ప్రాణావాయువు 'స్వేచ్ఛ'. ఎప్పుడైతే 'స్వేచ్ఛ' మృగ్యమవుతుందో ఈ వ్యవస్థ మృతప్రాయం అవుతుంది.

అందుకే మొదటి మార్గం ఎంచుకోవడం తెలివైన పనికాదు. అట్లా అని రెండవ మార్గాన్ని ఎంచుకుందామా అంటే అది ఆచరించడం కష్టసాధ్యం. ప్రతి మనిషికీ కార్యకారణ వివేచన ఉంటుంది. దాన్ని ఉపయోగపెట్టుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఈ క్రమంలోనే భిన్నాభిప్రాయాలు ఆవిర్భవిస్తాయి. స్వీయ ప్రయోజనాలకు, వ్యక్తి ఆలోచనలకు, అతని ఇష్టా ఇష్టాలకు మధ్య అంతఃసంబంధాలు ఉంటాయి. ఇవన్నీ పరస్పర పూరకాలు. ప్రతి మనిషిలో ఒక్కో తరహా సృజనాత్మకత నిబిడీకృతమై ఉంటుంది. సంపద సృష్టికి ఇదే మూలాధారం. వివిధ వ్యక్తుల మధ్య ఉండే వైవిధ్యభరితమైన సృజనాత్మకత ఏ రకంగానూ ఉమ్మడి ప్రయోజనాల సాధనకు అడ్డంకి కాదు. ప్రభుత్వం మీద ఉండాల్సిన తొలి బాధ్యత ఏంటంటే – ఈ వైవిధ్యభరితమైన అసమాన సృజనాత్మక శక్తికి రక్షణ కల్పించడం. ఈ అసమానతలు ఆస్థి సంపాదించుకోవడానికి అడ్డంకిగా నిలవకుండా చూడడం. తద్వారా ఎవరికి వారే ఆస్థులు సంపాదించుకోవడంతో పాటు ఇంకా ఎవరెవరితో కలిసి పనిచేస్తే ఇంతకన్నా మెరుగ్గా ఆస్థులు సంపాదించుకోగలం అన్న అవగాహన ఏర్పడి – ఒకే ప్రయోజనాలు కలవాళ్ళందరూ ఒక కట్టుగా పని చెయ్యడం మొదలుపెడతారు. తద్వారా సమాజంలో భిన్న ప్రయోజనాలు కలవాళ్ళు భిన్న సమూహాలుగా ఏర్పడతారు.

మానవ స్వభావంలోనే ఈ భిన్నత్వానికి బీజాలు ఉన్నాయి. సమాజంలో భిన్న సందర్భాలలో ఇవి తరతమ స్థాయిలో పని చేస్తుంటాయి. మతం పట్ల, ప్రభుత్వాల పట్ల, ఇంకా అనేకానేక అంశాల పట్ల ఈ భిన్న భావధారను మనం గమనించవచ్చు. వ్యక్తుల అదృష్టం, అధికారదర్పాన్ని కొందరు ఆరాధిస్తారు, కొందరు వ్యతిరేకిస్తారు. తద్వారా భిన్న ఆలోచనలు గలవాళ్ళు వేర్వేరు గుంపులుగా ఏర్పడి ఒకరి అభిప్రాయాలను మరొకరు తృణీకరిస్తారు. ఒకళ్ళ

మీద ఇంకొకరు పట్టు సాధించడానికి ప్రయత్నిస్తారు. ఒక్కోసారి అసహాయులు తిరగబడతారు. ఎందుకంటే వీరికి ఉమ్మడి ప్రయోజనం అనేది లేదు గనుక ఎక్కువలో ఎక్కువ సందర్భాలను పరిశీలిస్తే సంపద పంపిణీలో అసమానతలే ఇలాంటి ఘర్షణలకు మూలకారణంగా తేలుతుంది. సంపద పోగేసుకున్నవారికి, నయా పైసా ఆస్థిలేని వారికి మధ్య ఘర్షణ లేకుండా ఉండాలని ఆశించడమూ అత్యాశే అవుతుంది. భూమి మీద, ద్రవ్యం మీద, ఉత్పత్తి మీద, వాణిజ్యం మీదా పట్టుగలవారు అందరూ ఒక తరగతిగా, ఇవేమీ లేనివాళ్ళు ఇంకో తరగతిగా సమాజం భిన్న వర్గాలుగా ఏర్పడతారు. వాళ్ళ వాళ్ళ వర్గ స్వభావానికి అనుగుణంగానే వాళ్ళ ఆలోచనారీతులు, వాళ్ళ ప్రయోజనాలు ఉంటాయి. పరస్పర భిన్న ప్రయోజనాలు కలిగిన ఈ వర్గాలను సముదాయించుకు రావడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. ఘర్షణను నివారించేందుకు, నిలవరించేందుకు తగిన పౌర చట్టాలను రూపొందించడం, అమలు చెయ్యడం ప్రభుత్వాలు చెయ్యాల్సిన పని. 'పరిపాలన' అంటే అర్థం ఇదే. ఏ మనిషీ తన ప్రయోజనాలకు అనుగుణంగా తానే తీర్పులు చెప్పుకోలేడు. ఎందుకంటే స్వీయ ప్రయోజనాలు అతను చెప్పే తీర్పుని ప్రభావితం చేస్తాయి. కక్షిదారుడు, న్యాయమూర్తి ఒక్కరే కావడం మనం ఎక్కడా చూడం. అందుకే వ్యక్తుల ప్రయోజనాలను, సమాజంలోని వివిధ వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తులనాత్మకంగా తీర్పులు చెప్పడానికి ఒక వ్యవస్థ అవసరం అవుతుంది.

ఈ పని నిభాయించడానికి ఏర్పడినదే న్యాయవ్యవస్థ. ప్రభుత్వం సమాజంలోని భిన్నవర్గాల మధ్య ఘర్షణ నివారించడానికి రూపొందించే చట్టాల న్యాయబద్ధత అతిక్రమణలను ఈ న్యాయవ్యవస్థ పర్యవేక్షిస్తుంది. అప్పు ఇచ్చినవాడికి, తీసుకున్నవాడికి మధ్య తగాదా వస్తే ఎవరు పరిష్కరించాలి? దేశీయ ఉత్పత్తిదారులను ప్రోత్సహించడానికి విదేశీ ఉత్పత్తిదారుల మీద ప్రభుత్వం నియంత్రణలు విధించవచ్చా? అయితే అది రెండో పక్షం స్వేచ్ఛకు భంగం కాదా? పన్నుల విధానం పక్షపాతరహితంగా ఎలా ఉండాలి – ఇలాంటి అనేకానేక అంశాల మీద ఇరుపక్షాల వాదనలు విని రెండువాదనల మధ్యన సంతులనం సాధించడమే న్యాయవ్యవస్థ పరమోన్నత ధర్మం. తీర్పులు వెలువరించడానికి న్యాయం, ప్రజాప్రయోజనం – ఈ రెండే ప్రామాణికాలు అంతే తప్ప డబ్బు అధికారం కలవాడిదే న్యాయం కాదు. అందుకే చట్టాలు చేసేటపుడు సమాజంలోని ఏ వర్గానికీ ఈ న్యాయవ్యవస్థ సూత్రాలను అతిక్రమించే అవకాశం ఇవ్వరాదు.

ప్రభుత్వం, పరిపాలన, న్యాయవ్యవస్థ, చట్టాలు వంటి జంజాటాలన్నీ దేనికి వివేకవంతుడైన నిష్కళంక దేశభక్తునికి అధికార పగ్గాలు ఇస్తే అతనే ఇవన్నీ సంభాళించుకోలేడా, ఏం చేసినా ఏం చెందినా ప్రజల ఉమ్మడి ప్రయోజనాలను చూసేవాడయితే ఇవన్నీ అవసరమా అనే ప్రశ్న మనకు ఎదురుకావచ్చు. కానీ అది సాధ్యంకాదు. ఎందుకంటే ప్రతిసారీ మనకు అలాంటి వివేకవంతుడైన నిష్కళంక దేశభక్తులు దేశాధినేతగా దొరకకపోవచ్చు. అదీగాక భిన్నవర్గాలు, భిన్నప్రయోజనాలు ఉన్న సమాజంలో ప్రజల 'ఉమ్మడి ప్రయోజనాల' 'ఆధారంగా పరిపాలన నిర్వహించడం అంటే లేని దాన్ని ప్రామాణికంగా తీసుకోవడం అన్నమాటే కదా!

ఏతావాతా మనం అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే సమాజంలో వర్గ సంఘర్షణను అంతం చెయ్యలేం. కాబట్టి వర్గ ప్రయోజనాల రీత్యా తలెత్తే సమస్యలను నియంత్రించడం ఉపశమనం కలిగించేందుకు ప్రయత్నించడం వరకూ మాత్రమే మనం చెయ్యగలం.

ఏదేని ఒక గ్రూపు మెజారిటీ కలిగి లేకుంటే రిపబ్లికన్ సూత్రం ఆధారంగా ఉపశమనం అందించాలి. తద్వారా తప్పుడు విధానాలను ఓటింగ్ ద్వారా ఓడించేందుకు మెజారిటీకి అవకాశం దక్కుతుంది. దీని మూలంగా పరిపాలనకు విఘాతం కలుగవచ్చు, సమాజంలో ప్రకంపనలు చెలరేగవచ్చు, అయితే రాజ్యాంగాన్ని అడ్డంపెట్టుకుని హింసను రేకెత్తించేందుకు అవకాశం లేకుండా పోతుంది. అందుకే సంకీర్ణ ప్రభుత్వాలు వివిధ గ్రూపులలోని అధికార కాంక్షను సంతృప్తి పరచగలుగుతాయి. దీని కోసం సంకీర్ణ పక్షాలు అవసరమైతే ప్రజా ప్రయోజనాలను, ఇతరేతర తరగతుల ప్రజానీకం హక్కులను తృణీకరిస్తాయి. మరయితే అటు గ్రూపు తగాదాలనూ సముదాయించుకుంటూ ఇటు ప్రజాప్రయోజనాలు, ప్రైవేటు ఆస్థిహక్కులను కాపాడుకుంటూ రావాలంటే ఏం చెయ్యాలి? జనరంజక పరిపాలన ఎలా చెయ్యాలి? – ఈ రెండు ఉదాత్త లక్ష్యాలను గురించి మనం ఇప్పుడు పరిశీలిద్దాం. ప్రభుత్వాలు ఎలాంటి అవకాశవాద రాజకీయాలకు పాల్పడకుండా ఉండడానికి, మానవీయ పరిపాలనను అందించడానికే కదా మనం ఇంత సుదీర్ఘకాలం పాటు అనేక కష్టనష్టాలకు ఓర్చి నిలిచిందీ. కాబట్టి అలాంటి ఉదాత్తత సంతరించుకోవడానికి ప్రభుత్వాలు ఏం చెయ్యాలి?

ఇందుకు మన ముందు ఏదో ఒక మార్గమే ఉంది. అయితే మెజారిటీ ప్రజానీకంలో ఒకే ప్రయోజనాలు ఒకేవిధమైన ఆకాంక్షలు నిలవరించడం, లేదూ ఏకీకృత ప్రయోజనాలు, ఆకాంక్షలు గల మెజారిటీని స్థానిక పరిస్థితులు అసంఖ్యాకమైన అంశాల ఆధారం చేసుకుని దోపిడికి పాల్పడకుండా నిలువరించడం. అవకాశం రావాలేగానీ మెజారిటీని అడ్డంపెట్టుకుని ఎవరు మాత్రం ఆధిపత్యం చెలాయించకుండా ఉండగలరు? నైతిక విలువలు, మత విశ్వాసాలూ ఇవేమీ అడ్డంరావు అలాంటప్పుడు.

ఈ దృష్ట్యా పరిశీలిస్తే 'ప్రజాస్వామ్యం' పేరిట అతికొద్దిమంది జనాభాగల సమాజాలు ఏర్పాటు చేసుకుని అందరూ కలిసి ఎవరో ఒకర్ని నాయకుడిగా ఎన్నుకుని పరిపాలనా బాధ్యతలు అప్పగించినంత మాత్రాన వర్గఘర్షణలు సమసిపోతాయని అనుకోవడానికి లేదు. ఎందుకంటే ప్రజలందరికీ ఒకే విధమైన ఉమ్మడి ప్రయోజనాలు ఆకాంక్షలు ఉంటాయని అనుకోవడానికీ లేదు. బలహీనులు తమ ఆకాంక్షలు త్యాగం చెయ్యాల్సి రావచ్చు కాబట్టి ఇక్కడా ఘర్షణ తప్పదు. వ్యక్తిగత భద్రతకు, ఆస్తి హక్కుకు గ్యారంటీ కల్పించలేని ఇలాంటి ప్రజాస్వామ్యాలు మఖలో పుట్టి పుభలో మాయం అవుతుంటాయి. వీటి ఆవిర్భావం, పతనం రెండూ అత్యంత హింసాత్మకంగా ఉంటాయి. ఇలాంటి ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చిన రాజకీయవాదులు సమాన రాజకీయ హక్కులు కల్పించడం ద్వారా మొత్తం మానవజాతి

సమానత్వం సాధించవచ్చనే పొరబాటు అవగాహనకు లోనయ్యారు తప్పితే ప్రజలు వాళ్ళ ఆలోచనలు, ఆకాంక్షలు, వాళ్ళ వాళ్ళ ఆధీనంలో ఉన్న ఆస్తులను బట్టి ఏ రూపంలోనూ ఒకటిగా ఉండలేరనే సత్యాన్ని విస్మరించారు.

రిపబ్లిక్ తరహా ప్రభుత్వం అని నేను ఎందుకు ప్రతిపాదిస్తున్నానంటే – ఇందులో ప్రాతినిధ్యం ప్రాతిపదికగా ఉంటుంది. మనం ఏవయితే సమస్యలుగా భావిస్తున్నామో వాటికి పరిష్కారం దొరుకుతుంది.

అందుకే ఇప్పుడు మనం ప్రజాస్వామ్యం – ఆదర్శరాజ్యం (రిపబ్లిక్) అనే రెండు వ్యవస్థల మధ్య ఉన్న తేడాలను వాటి పనితీరును, సామర్థ్యాన్ని అంచనా వేద్దాం.

మొదటి తారతమ్యం ఏమిటంటే – ప్రభుత్వ ప్రాతినిధ్యం. ప్రజాస్వామ్యంలో జనాభా కొద్ది, పాలిత ప్రాంతమూ స్వల్పంగా ఉంటుంది. అదే రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసుకుంటే సువిశాల దేశం ఏర్పడుతుంది. అన్ని ప్రాంతాల వర్గాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది. జనబాహుళ్యం యొక్క అభిప్రాయాలను సమూలంగా పరిగణనలోకి తీసుకోవడానికి పౌరసంఘాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తాం. పాక్షిక, తాత్కాలిక ప్రయోజనాలకు బదులుగా దేశ ప్రయోజనాలు. న్యాయం, స్వాతంత్ర్య స్ఫూర్తిలు ప్రాతిపదికగా నిర్ణయాలు చేస్తుంటారు. అలా ప్రజల నుండి ప్రజల వద్దకు ప్రాతిపదికన చేసిన చట్టాలు ప్రజలకు మేలు చేస్తాయి. ప్రజలు మూకుమ్మడిగా నిర్ణయాలు తీసుకోవడం కన్నా ఇలా ప్రజల అభిప్రాయాలన్నీ చెవి ఒగ్గి విని దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల ప్రాతిపదికగా పౌరసంఘం నిర్ణయాలు చెయ్యడం క్షేమదాయకం. ఒక్కసారి ఇది తల్లక్రిందులు కూడా కావచ్చు. తప్పుడు నడత కలిగిన వాళ్ళు, పక్షపాతం చూపించేవాళ్ళు, మోసపూరిత ఆలోచన కలిగినవాళ్ళు, అవినీతిపరులు ఒక్కోసారి పదవి రాక ముందు పెద్ద మనుషుల్లా నటించి ప్రజలను మెప్పించి ఆనక తమ అసలు రూపాన్ని బయటపెట్టుకోవచ్చు. ప్రజలను నిలువునా మోసం చెయ్యవచ్చు. దీనికి సమాధానంగా మన ముందు తలెత్తే ప్రశ్న ఏమిటంటే – ప్రజాభీష్టం మేరకు సరయిన సంరక్షకులను చిన్న చిన్న ప్రాంతాలకు పరిమితం అయి ఎన్నుకోవడమా, విశాలమైన రిపబ్లిక్ స్థాయికి ఎన్నుకోవడమా అనేది. ఏ రకంగా చూపినా చివరి పద్ధతిని ఎంచుకోవడమే ఉత్తమోత్తం అనేది స్పష్టం.

ఇక తరువాత విషయానికి వస్తే మనం ఏర్పాటు చేసుకోబోయే రిపబ్లిక్ ఎంత చిన్నదయినా ప్రజాప్రతినిధులను ఒకటీ అరాగా ఎంచుకోవడం సరికాదు, కొద్దిమంది కాకుండా ఉండాలంటే తగినంత మంది ప్రతినిధులను ఎన్నుకోవాలి. అలాగే మనం ఏర్పాటు చేసుకోబోయే రిపబ్లిక్ ఎంత సువిశాలమైనది అయినా ప్రతినిధుల సంఖ్యకు ఒక పరిమితి ఉండాలి. అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు కదా. మంది ఎక్కువై గందరగోళపడకూడదు. రిపబ్లిక్ చిన్నదయినా, పెద్దదయినా ప్రతినిధుల సంఖ్యమీద పరిమితి ఖచ్చితత్వం ఉండాలి. చిన్న రిపబ్లిక్‌లో ఎక్కువమంది ప్రతినిధులను ఎంపిక చేసుకుని, విశాలమైన రిపబ్లిక్‌లో పరిమితి సంఖ్యలో ప్రతినిధులను ఎన్నుకున్నా, వారు ప్రజాభిప్రాయాన్ని సరైన తీరులో ప్రతిఫలిస్తే –

చిన్న రిపబ్లిక్‌లో ఎక్కువ మందిని ఎంపిక చేసుకుని కూడా అలాంటి ఫలితం రాబట్టుకోలేకపోతే ఎక్కువ మంది మూలంగా ఏం ప్రయోజనం ఒరిగినట్లు? కాబట్టి విశాలమైన రిపబ్లిక్, పరిమిత సంఖ్యలో ప్రతినిధుల ఎంపిక మన ముందున్న మేలయిన ప్రత్యామ్నాయం అవుతుంది.

ఇక రెండవ విషయానికి వస్తే చిన్న రిపబ్లిక్‌లో కన్నా విశాలమైన రిపబ్లిక్‌లో ఎక్కువమంది ప్రజానీకం తమ ప్రతినిధిని ఎన్నుకుంటారు. తరచూ ఎన్నికలు జరుగుతుంటాయి. కాబట్టి ఏదో ఒక కిరికిరి చేసి పనికిమాలిన వాళ్ళు ఒకసారి ప్రతినిధిగా ఎంపిక అయినా రెండోసారి ఆ తప్పుజరగదు. ప్రజలకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఎప్పటికీ ఉంటుంది. కాబట్టి ఉన్నవాళ్ళలో మెరుగైనవాళ్ళు, సత్ప్రవర్తన కలిగిన వాళ్ళను ఎన్నుకుంటారు.

ఇక్కడ మనం ఇంకో విషయాన్ని ఒప్పుకోవాలి. చిన్న పెద్ద రిపబ్లిక్‌లు ఎక్కువ తక్కువ ప్రతినిధులు రెండింటిలో చిన్న తిరకాసు ఉంది. ఓటర్ల విస్తృతి ఎక్కువయిన కొద్దీ ప్రజా ప్రతినిధులకు వారితో సంబంధ బాంధవ్యాలు గానీ, స్థానిక పరిస్థితుల మీద అవగాహనగానీ, ఆసక్తిగానీ తక్కువగా ఉంటుంది. లేదూ బాగా కుదించి వెయ్యాలనుకుంటే స్థానిక సమస్యల్లో కూరుకుపోయి జాతీయ ప్రయోజనాల మీద ఆసక్తి చూపకపోయే ప్రమాదం ఉంది. అందుకే మన ఫెడరల్ రాజ్యాంగం ఈ రెండు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమతుల నిర్ణయం తీసుకుంటుంది. సగటు ప్రయోజనాలు జాతీయ ప్రయోజనాలుగా ఉండాలి. స్థానిక, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకునేలా రెండింటికీ న్యాయం చేకూర్చేలా చూస్తుంది.

ఇంకో తేడా ఏంటంటే ప్రజాస్వామిక విధానం లేకున్నా రిపబ్లిక్ తరహా రాజ్యాన్ని స్థాపించుకోవడం ద్వారా విశాలమైన సరిహద్దులను, అపారమైన జనాభాను మనం ఇముడ్చుకోవచ్చు. తద్వారా కృత్రిమ కలయికల భయాన్ని అధిగమించవచ్చు. చిన్న చిన్న ప్రజాస్వామిక సమాజాలు ఏర్పాటు చేసుకోవడం మూలాన రాజకీయ పార్టీలు, ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. తక్కువ పార్టీలు ఉండడం మూలాన తరచూ మెజారిటీ ప్రజలు ఒకే పార్టీ వెనుక ఉండడం మూలాన, మెజారిటీ అని పేరుకే అయినప్పటికీ పరిమితంగా ఉన్నవారు ఒక జట్టు కట్టేసరికి అణిచివేత విధానాలకు నియంతృత్వానికి ఆస్కారం ఏర్పడుతుంది. కాబట్టి పరిధిని విస్తృతం చేసుకోవాలి. రకరకాల ప్రయోజనాలు కలిగిన ఎన్నెన్నో రాజకీయపార్టీలు ఉంటాయి. మనం అనుకుంటున్న రిపబ్లిక్‌లో కాబట్టి ఈ అన్ని పార్టీలు జట్టు కట్టి ఏదో ఒక తరగతి ప్రజల హక్కుల మీద దండెత్తడానికి అవకాశం తక్కువ బహుళపార్టీలు ఉండడం మూలంగా వీటి స్పందనలు వాటి వాటి బలాలు, ప్రయోజనాలు బట్టి వైవిధ్యభరితంగా ఉంటాయి తప్ప ఇవన్నీ ఏకరీతితో వ్యవహరించడం కద్దు. దీనికి తోడుగా తప్పుడు ప్రయోజనాల కోసం ఏదన్నా అన్యాయపుటాలోచన చట్టం రూపం దాల్చాలన్నా మంది ఏకాభిప్రాయం అవసరం అవుతుంది. అది అంత సులభం కాదు.

కాబట్టి ప్రజాస్వామిక నమూనా కన్నా రిపబ్లిక్ రాజ్యాంగంలో వర్గఘర్షణలు నియంత్రించడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయి. చిన్ని చిన్న ప్రజాస్వామిక సమాజాలకన్నా ఇలాంటి చిన్న చిన్న రాష్ట్రాలతో కూడిన విశాలమైన రిపబ్లిక్ ఎన్నటికి మనకు మెరుగైన ప్రత్యామ్నాయం అవుతుంది. స్థానిక పక్షపాతాలు అన్యాయపు ఆలోచనలకు బదులు విశాలమైన జాతీయ ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యతగా ఎంచుకునే ప్రజాప్రతినిధుల చేతుల్లో ఈ దేశం సుభిక్షంగా ఉంటుంది. రాష్ట్రాల సమాఖ్యగా ఏర్పరుచుకునే రిపబ్లిక్ ఇందుకు ఆదరువుగా ఉంటుంది. ఏదో ఒకటి రెండు పార్టీలు అధికారపు అందలాలు ఎక్కి ప్రజలను పీడించుకుతినే నియంతృత్వ పోకడలు పోకుండా నిలవరించడానికి బహుళ పార్టీల ఉనికి మనకు రక్షణగా నిలుస్తుంది. బహుళ పార్టీల సంకీర్ణం పరిపాలనలోకి వస్తే మరింత క్షేమదాయకంగా ఉంటుంది.

ఆదర్శనీయమైన ప్రజా ప్రతినిధులు వారి వారి ప్రాంతాల్లోనే తమ ప్రభావాన్ని ప్రతిఫలించగలుగుతారు. కాని ఇతర రాష్ట్రాల మీద తన ప్రభావం చూపించలేరు. అప్పులు రద్దు చెయ్యాలనో, కాగితం కరెన్సీ ముద్రించాలనో, ఆస్తి పంపిణీలో సమానత్వం పాటించాలనో, ఇలా ఏ రకమైన దుష్టతలంపును అమలు చెయ్యాలన్నా రాష్ట్రాల సమాఖ్యగా ఏర్పాటు చేసుకునే రిపబ్లిక్‌లో ఇది సాధ్యం కాదు.

ఏతా వాతా అనేక ఇబ్బందులు సబ్బందులకు మన ముందున్న మేలయిన ప్రత్నామ్నాయం రిపబ్లిక్ ఏర్పాటు. ఫెడరల్ స్ఫూర్తిని, లక్షణాలను నిలబెట్టేందుకు మన ముందున్న ఏకైక మార్గం ఫెడరల్ రాజ్యాంగం ఏర్పాటు గ్రహించడం.

# II

# బానిసత్వం - ధిక్కారం

# గిల్డ్ యుగంలో సమ్మెకారులు - ప్రజాకర్షకులు

# సామ్రాజ్య విస్తరణ - సోషలిస్టులు - ఊగిసలాటరాయుళ్ళు

## నల్ల జాతీయులకు జూలై 4 ఏమి ఇచ్చింది?

## - ఫ్రెడరిక్ డగ్లస్ (1852 జూలై5)

నా సహపౌరులారా ఇవ్వాళ జాతి యావత్తు సంచలనాత్మక అనందాతిరేకాలను ఆస్వాదిస్తుంది.కానీ నా చెవులకు ఇంకా లక్షలాది జాతిజనుల మూలుగులు వినబడుతున్నాయి. నిన్నటిదాకా వారు అమానుష బానిస సంకెళ్ళను భరిస్తూ వచ్చారు. మన ఆనందోత్సవాల కేరింతల మధ్యన వారు ఇంకెంత మాత్రమూ ఆ సంకెళ్ళను మొయ్యడానికి సిద్ధంగా లేని దశకు చేరుకున్నారు. ఈ వైరుధ్యాన్ని, వాస్తవాన్ని నేను ఎలా విస్మరించగలుగుతాను? నిండారు దుఃఖంలో ఉన్న ఆ పిల్లలను నేను గుర్తుకు తెచ్చుకోకుండా ఉండగలనా? ఇన్నాళ్ళు కుడి చెయ్యివేసిన మోసాన్ని అది మర్చిపోవచ్చు గాక నాలుక అంగిట మెలిబడి మౌనం వహించుగాక కానీ వీటిని నేను మర్చిపోవడం, మీ వెయ్యిన్నొక్క తప్పుల్ని క్షమించడం, నలుగురితో నారాయణ అనుకోవడం కన్నా దుర్భర మోసం ఇంకొకటి ఉండదు. అదే జరిగితే ఈ లోకం ముందు, ఆ ప్రభువు యందు నా పాపానికి ప్రక్షాళన ఉండదు. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మీరీ పాటికి గ్రహించే ఉంటారు. నా సహ పౌరులారా నేను మాట్లాడుతుంది. అమెరికన్ బానిసత్వం గురించి. నేనివాళ బానిస దృక్కోణం నుంచి స్వేచ్ఛాయుత అమెరికా గురించి మాట్లాడదలచుకున్నాను. కట్టుబానిసల్లో కట్టు బానిసగా మారి, వారి తలరాతను నా తలరాతగా మార్చుకుని నేను వారి ఆత్మగా మారి ఈ జూలై 4ను పరికిస్తే జాతి యావత్తు స్వేచ్ఛగా పరవళ్ళు తొక్కుతున్న ఈ దినం కన్నా చీకటిరోజు మరొకటి ఉండదని చెప్పడానికి నేను ఏమాత్రం సంశయించడం లేదు. ఇప్పటిదాకా మనం ప్రకటించుకున్న రాజ్యాంగ ప్రకరణలను

చూసుకున్నా, తాజాగా చెప్పుకుంటున్న ఉదాత్త ఆశయాలను తరచి చూసుకున్నా మనం ఇప్పటిదాక ఈ జాతిని నడిపించిన తీరు అంతా తప్పుల తడకగా నడిచిందని నే ఘంటాపథంగా చెప్పగలను.

గతంలోనూ అదే తప్పులు చేసాం ఇప్పుడు అవే తప్పులు చేస్తున్నాం. రేపు భవిష్యత్తులో కూడా ఇవే తప్పులు చేస్తాం. ఆ ప్రభువు ఆనగా, అణగారి రక్త మోడుతున్న బానిస జాతి సాక్షిగా మానవత్వం స్వేచ్ఛా – సమానత్వాల సాక్షిగా ఈ చేత మన రాజ్యాంగం ఆ చేత బైబిల్ గ్రంథం పూని మరీ నిక్కచ్చిగా నికార్సుగానే చెప్పదలుచుకున్నానీ మాట. ఈ గడ్డ మీద బానిసత్వాన్ని ఇంకా కొనసాగించడానికి ఊతం ఇచ్చేది ఏదైయినా, అది మన రాజ్యాంగమయినా సరే అది అమెరికాకు సిగ్గుచేటు, అంతకన్న పచ్చి పాపం ఇంకొకటి ఉండదు. ఇప్పుడు ఏ సాకులు చెప్పినా ఏ సణుగుళ్ళు సణిగినా వినడానికి నే సిద్ధంగా లేను. పక్షపాతంతో కళ్ళు పొరలు కమ్మిన వాళ్ళకు, ఇంకా బానిస బ్రతుకుల మీద జులుం చలాయించాలని చూసేవాళ్ళకు నే చెప్పదలుచుకుంది ఒక్కటే జరుగుతుంది – అన్యాయం, అక్రమం.

సాటి మనిషి స్వేచ్ఛను హరించి అతన్ని ఒక గొడ్డు మాదిరి వాడుకుంటా నయాపైసా జీతం ఇవ్వకుండా అతని కష్టాన్ని దోచుకుంటూ మనిషిని ఇనుప సంకెళ్ళతో బంధించి కర్రలతో మోది కొరడాలతో ఒంటి మీద చర్మం రేగిపోయి రక్తాలు కారేలా శిక్షించి, వేటకుక్కలను ఉసిగొల్పి వెంటాడి, వేధించి సంతలో సరుకులా అమ్మకానికి పెట్టి కుటుంబానికి కాకుండా చేసి కడుపుకి ఇంత అన్నంపెడితే ఎక్కడ తిరగబడే శక్తి వస్తుందో అని అర్ధాకలితో, జీవచ్ఛవంలా యజమాని కాళ్ళదగ్గర పడి ఉండేలా చేస్తున్న ఈ సామాజిక ఆర్థిక సంబంధాలు ఏం సంబంధాలు? మనలో మానవత్వం ఉందా అసలు? బానిసల రక్తంతో ఓడుతున్న ఈ దుర్భర వ్యవస్థని చీము నెత్తురు ఉన్న మానవులు ఎవరైనా తప్పుపట్టకుండా ఉండగలడా? నేనేమన్నా తప్పు మాట్లాడుతున్నానా? ఖచ్చితంగా లేదని నేను గొప్ప విశ్వాసంతో చెబుతున్నా. ఇక కుంటిసాకులకు, కోణంగి వాదనలకు అవకాశమేలేదు. 'బానిసత్వం అమెరికా పాలిట సిగ్గులేనితనం. బానిసత్వం అమెరికా పాపం, శాపం' ఇంతకన్నా పరుషమైన మాటలు చెప్పడానికి నాకు సభ్యత అడ్డం వస్తుంది. భూలోక నరక ప్రాయమైన ఈ జీవితాన్ని సమర్థించడానికి మీ దగ్గర మాటలు లేవు. వాదనలు అంతకన్నా ఉండవని నాకు తెల్సు నాకు శక్తి ఉండాలేగాని నేనీ జాతి యావత్తూ ఉలిక్కిపడి చెవి యొగ్గి నా మాటలు వినేంత బిగ్గరగా అరిచి మరీ చెప్పాలని ఉంది. నాకిప్పుడు మెరుపులు కాదు పిడుగులు కావాలి. చిరుజల్లులు కాదు కుంభవృష్టి కురియాలి. గాలి దుమారం కాదు భూకంపం సృష్టించాలని ఉంది. అంతటి శక్తితో నాకు ఈ జాతి చైతన్యాన్ని తట్టి లేపాలని ఉంది. కప్పుకున్న పెద్ద మనిషి ముసుగులు చీల్చి పేలికలు చెయ్యాలని ఉంది. సాటి మానవుడు పట్ల అనుసరిస్తున్న నేరపూరిత వైఖరిని నిర్ద్వంద్వంగా తిరస్కరించమని రాజ్యాంగ ప్రకటన చెయ్యాలని ఉంది.

ఈ దేశంలో ఇంకా బానిసత్వంలో మగ్గుతున్న జనానికి మీరంతా పండగలా జరుపుకుంటున్న జూలై 4 గురించి అడిగితే ఏమని చెప్పాలి? నిత్యబాధితులుగా ఉన్న ఓనా జనులారా ఈ దినం మీకు జరుగుతున్న అన్యాయలకు అక్రమాలకు, మీరు బలవుతున్న క్రూరత్వానికి పర్వదినం అని చెప్పాలా? మీ కండల చిందిన నెత్తురు ఈ పండుగ రోజుకు చిలికిన అత్తరు అని చెప్పాలా? 'స్వేచ్ఛ' 'స్వేచ్ఛ' అంటూ మీరు గప్పాలుకొడుతూ గొప్పలు

చెబుతున్న పదాలకు ఆత్మలేదని అవి వోట్టి సొల్లు మాటలని చెప్పాలా? మీ ప్రార్ధనలు, స్తోత్రాలు, స్వేచ్ఛ – సమానత్వ నినాదాలు నియంతృత్వం నశించాలనే శాపనార్థాలు కరచాలనాలు మత విశ్వాస ప్రకటనలు – ఇవన్నీ బానిస తమ్ముళ్ళుకు ఎలా తోస్తాయి. మోసం, దగా నయవంచన, మెరమెచ్చులుగా అనిపిస్తే వారిని తప్పుపట్టి ఏం లాభం? ఇన్నేళ్ళు అమానవీయ 'రాక్షససత్వాన్ని' స్వేచ్ఛ – సమానత్వ నినాదాల మేలి ముసుగుతో కప్పి పెట్టగలరా? ఈ భూమండలం మీదే సాటి మనుషుల రక్తంతో పాపపంకిలమైన జాతి అమెరికన్ జాతి తప్ప వేరొకటి లేదు ఈ క్షణం వరకు. మీరు ఎక్కడికి అనుకుంటే అక్కడికి వెళ్ళండి, వెతకండి పాత ప్రపంచంలోని రాజరిక వ్యవస్థలోగాని, అశ్రితపక్షపాత పరిపాలనలోగానీ వెతకండి, దక్షిణ అమెరికా రాజ్యాలు అన్నింటా మీ ప్రయాణం సాగించండి, చేసిన ప్రతి తప్పును వెతుక్కుంటూ వెళ్ళండి, చిట్టచివరకు తప్పు ఏంటో కనిపెట్టాక తిరిగి రండి. మీరు సత్యప్రమాణకంగా ఏం తెలుసుకున్నారో దాన్ని ఈ జాతి రోజువారీ జీవితం సరసన నిలబెట్టండి మీ నోటితో మీరే చెబుతారు. అమెరికాకు వేరే శత్రువులు ఎవరూ అక్కరలేదు. తను చేసిన పాపాల భారంతో అదే స్వయంగా ఏ నాడో కుప్పకూలిపోవడం తథ్యం అని మీ నోటితో మీరే చెబుతారు. ఆమెన్.

## పేదరికం నేరం - హెన్రీ జార్జి (1885 ఏప్రియల్ 1)

నేను ఈ రోజున పేదరికం పాపం కాదు, ఖర్మంకాదు, ఒక సామాజిక నేరం అనే అంశం మీ దృష్టికి తీసుకురాదలిచాను. ఈ కాసేపట్లో నేను మీకు అన్ని విషయాలు తేటతెల్లంగా చెప్పి నా వాదన మీతో ఒప్పించగలను అని ఆశలేం పెట్టు కోలేదు. అయితే పేదరికం ఒక సామాజిక నేరమా కాదా అనేది మీ అంతకు మీరు నిర్ధారించు కోగలిగేందుకు మాత్రం ఖచ్చితంగా ప్రయత్నిస్తాను. పేదరికం నేరం అన్నా, కాబట్టి పేదలంతా నేరస్థులు, పూర్వ జన్మల పాపం అనుభవిస్తున్నారని మీరు అనుకోవద్దు. హత్య చెయ్యడం నేరం. కాని హత్యకావించబడటం నేరం అని మనం అనగలమా. అలానే పేదరికం నేరమే కాని పేదలు నేరస్థులు కాదు. పేదలు సామాజిక నేరపీడుతులు నా దృష్టిలో. అతని పాపాలే అతన్ని అలా కట్టి కదుపుతున్నాయి అనుకుంటాంగాని నిజానికి మనకూ ఆ పాపంలో భాగస్వామ్యం ఉంది. పేదరికం శాపమే ఘోరమైన శాపమే అందుకే కార్లయిల్ అంటాడు బ్రిటిష్ వాళ్ళకు అన్ని నరకాల్లోకి పేదరికం అనే నరకమంటే నిలువెల్లా భయం అని. ఆ మాటకు వస్తే బ్రిటిషు వాడికే కాదు నాగరిక సమాజంలో బ్రతికే ఎవరికైన ఆ కడుపు భీతి ఉంటాయి.

మరయితే అందరూ ధనవంతులుగా ఎందుకు బ్రతకలేకపోతున్నారు? ఈ ప్రశ్నకు స్వాభావిక జవాబులు, కారణాలు ఉంటాయని నేను అనుకోవచ్చా. ఒకరిని మించి ఇంకొకరు ధనవంతులు కావాలని కూడా నేను భావించడంలా. ప్రతి వాళ్ళకీ తినడానికి తిండి కట్టుకొను గుడ్డ, ఉండటానికి ఇల్లు, విద్యా, వైద్యం, చేసుకోవడానికి పని ఉంటే చాలు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి మనిషి భౌతిక అవసరాలు తీరేవిధంగా ఉంటే చాలు ఈ లోకం అని ఆశిస్తున్నా. ఇంతకన్నా గొప్ప మానవత్వం ఏముంటుంది. నిజానికి ఈ భూమ్మీద నివసించే

ప్రతి ఒక్కరి భౌతిక అవసరాలు తీరి మానవ జీవితాన్ని హాయిగా, ఆనందంగా ఏ చీకూ చింతా లేకుండా గడిపేందుకు తగినన్ని వనరులు ఉన్నాయి. చెప్పాలంటే తరతరాలకీ సరిపడా వనరులకు కొరత లేకుండా ఉంది. అయితే ఈ వనరులను దక్కించుకోవాలనే వెర్రి వ్యామోహంలో గుప్పెడు మంది సమాజంలో అత్యధికులను పేదరికం అనే ఊబిలోకి నెట్టేస్తున్నారు.

ఈ పేదరికానికి మూలకారణం ఏమిటో మీరు పసిగట్టవచ్చు. దీని వేళ్ళు మౌలికంగా అన్యాయంలో ఉన్నాయి. అమెరికాలోనే కాదు ప్రపంచంలో ఎక్కడెక్కడా పేదరికం ఉంది. ప్రభుత్వ తీరు తెన్నులలో తేడాలో, పన్నులో, సుంకాలో వంటివి పేదరికానికి కారణంగా చూపుతుంటారు. అవన్నీ సర్వాబద్దాలు. ప్రకృతి వనరుల మీద ఆధిపత్యం చలాయించుకోవాలనే కొందరి స్వార్ధమే మిగతా సమాజాన్ని పేదరికంలోని నెట్టేస్తుంది.

ఒళ్ళు బలిసి, సోమరిపోతుతనం మూలంగా వాళ్ళు ఆ పేదరికంలో చస్తుంటారు అని ఈసడించుకునే పెద్ద మనుషులు తెల్లారితే మనకు చాలామంది కనబడుతుంటారు. కానీ ఆపెద్ద మనుషులు కళ్ళుండి చూడాలే గానీ శరీర కష్టం చేసే కార్మికులు, రైతులు, చేతి వృత్తుల వాళ్ళు ఘర్మజలాన్ని పారించే శ్రామికులే అత్యధికశాతం పేదరికంతో ఉన్నారన్న వాస్తవం వాళ్ళకు దృగ్గోచరమవుతుంది.

***(వ్యవసాయ యాంత్రీకరణ మూలంగా పంథొమ్మిదవ శతాబ్దం చివరి పాదంలో చిన్నా చితకా రైతులందరూ తమ వ్యవసాయ అవసరాల కోసం అప్పులు దూసి తేవాల్సి వచ్చింది. చేసిన అప్పులు తీర్మానం చెయ్యలేని సందర్భంలో ఆ రైతుల భూములను లాక్కున్నారు అప్పులు ఇచ్చిన వాళ్ళు, అయితే రైతులు ఎక్కడికక్కడ సంఘటితమై తిరగబడటం ప్రారంభించారు. ఉత్తర అమెరికాలో, దక్షిణ అమెరికాలో, తెల్లవాళ్ళు, నల్ల వాళ్ళు అన్న తేడా లేకుండా ఎక్కడికక్కడ సంఘటితమైన ఈ ఉద్యమ పాయలన్నీ కలిసి 1880-90 ల మధ్య కాలంలో యావత్ అమెరికా ఖండమంతటా ఉవ్వెత్తున ఉద్యమంగా ఎగిసింది. బ్యాంకులు, రైలు, రోడ్డు రవాణాలను శత్రువులుగా ఎంచి ధ్వంసం చేయ్యసాగారు రైతులు. ఆనాటి ఉద్యమ నాయకురాలు కాన్సాస్ రాష్ట్రానికి చెందిన మేరీ ఎలిజిబెత్ లీజ్ ఉరఫ్ మేరీ ఎల్లెన్ లీజ్ ప్రసంగ సంక్షిప్త పాఠం ఇది)***

## ఈ దేశాన్ని వాల్‌స్ట్రీట్ ఏలుతుంది

## మేరీ ఎలిజిబెత్ లీజ్ (క్రీ॥శ 1890)

ఇంత తల్లకిందులరాజ్యం ఇంకొకటి ఉండదు. ఒకనాడు పీడితులుగా ఉన్న స్వేచ్ఛానిబద్ధులు ఇవాళ పీడకులుగా తయారయ్యారు. ఒక ప్రక్కన బ్రిటిష్ సామ్రాజ్యం నుండి 'స్వేచ్ఛ' కావాలని పోరాటం చేస్తూ మరో వంకన నాలుగు లక్షల మంది నల్లజాతీయులను బానిస సంకెళ్ళతో బంధించి ఉంచాం. మనం బానిసత్వాన్ని రద్దు చేసాం అని ప్రకటించుకున్నాం.

సుంకాల చట్టాలు రద్దు చేసాం అని చెప్పుకుంటున్నాం. కాని ఇవాళ జాతీయ బ్యాంకులు వేతన తెల్ల బానిసత్వాన్ని మన మీద రుద్దుతున్నాయి. ఇవి నల్లజాతి బానిసత్వానికన్నా కడు ఘోరమైనది. ఈ దేశాన్ని వాల్‌స్ట్రీట్ గుత్తకు తీసుకుంది. ఇది ప్రజల కొరకు, ప్రజల చేత ప్రజలు పరిపాలిస్తున్న ప్రభుత్వం కాదు. వాల్ స్ట్రీట్ కొరకు వాల్‌స్ట్రీట్ చేత, వాల్‌స్ట్రీట్ పరిపాలిస్తున్న సర్కారు. ఈ దేశంలో గుత్తపెట్టుబడే యజమాని. దేశంలోని మెజారిటీ ప్రజానీకం ఈ యజమానికి ఊడిగం చేస్తే బానిసలుగా తయారయ్యారు. అమెరికా, పశ్చిమ, దక్షిణ ప్రాంతాలు తూర్పు దిక్కుకు తిరిగి మోకరిల్లాల్సి వస్తుంది. ఉత్పత్తి పరిశ్రమలన్నీ ఆ దిక్కునే పోగడిపోయి ఉన్నాయి. ఇక్కడ డబ్బు రాజ్యం చేస్తుంది. ఈ దేశ ఉపాధ్యక్షుడు (లెవిపార్సన్స్ మోర్టాన్) లండన్‌లో పేరొందిన బ్యాంకరుగా చలామణి అవుతున్నాడు. ఈ వ్యవస్థ రూపొందించిన చట్టాలు ఎలా తయారయ్యాయంటే నిజాయితీపరులకు పీలికలు చుట్టబెట్టి దగుల్బాజీలకు పట్టు బట్టలు కట్టబెడుతున్నాయి. రాజకీయ పార్టీలు తెల్లారి లేస్తే అబద్ధాలు వల్లె వేస్తున్నాయి. రాజకీయ నాయకులు, వ్యాఖ్యాతలు మనల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. రెండేళ్ళ క్రితం మనకేం చెప్పారు? పంటలు భారీగా పండించండి ఈ దేశాన్ని ముందుకు నడిపించడం మీ చేతుల్లో ఉంది అన్నారు. మనం ఏం చేసాం.తలలు ఊపాం. చేలో దిగాం, నాగలి పట్టాం, విత్తునాటాం, ఏతం పట్టాం, నీరు పెట్టాం. చీడపీడలు ఆశించకుండా పంట పండించాం. వర్షాలు కరుణించాయి. ఆరుగాలం శ్రమించాం. ఆ పచ్చని పంటచేలతో ప్రకృతి పరవశించి పోయింది. ఇబ్బడి ముబ్బడిగా పంట దిగుబడి వచ్చింది. సర్కారువారు చెప్పినట్లే పంటలు భారీగా పండించాం అందుకు గాను మనకేందక్కింది? మొక్కజొన్నకు ఎనిమిది సెంట్లా? బార్లీ ధాన్యాలకు పది సెంట్లా, గొడ్డు మాంసానికి రెండు సెంట్లా? గుడ్లు, వెన్నలకు రేటు లేదా? ఇప్పుడు అదే రాజకీయనాయకులు ఏం చెప్తున్నారు? అధికోత్పత్తి సమస్య అయిందమ్మా అంటారా! ఏ లెక్కన అధికోత్పత్తి అయింది మనం పండించిన పంట. ఇవాళ్టి రోజున అమెరికాలో ఏటా 10,000 పిల్లలు పోషకాహారలేమితో చనిపోతున్నారు. న్యూయార్క్‌లో లక్షమంది షాపుల్లో పనిచేసే ఆడపిల్లలు బానిసలకన్నా కనాకష్టమైన జీతం కోసం తాము కన్న కలలన్నీ చిదిమేసుకుని బ్రతుకుతున్నారు.

అధికోత్పత్తి మూలంగా ఇట్టాంటి సమస్యలు వచ్చి పడతాయా? ఈ బుర్ర తిరుగుడు వాదనలు సర్కారు కట్టి పెట్టాలి ఇంకా మాకు గిట్టుబాటు ధరలు కావాలి. మాకు భూమి కావాలి. మాకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి. జాతీయ బ్యాంకులను రద్దు చేయమని కోరుతున్నాం మేం. మాకు ఎందుకీ మధ్య దళారీ? మాకు కావల్సిన సొమ్ము సౌకర్యాలు నేరుగా ఈ ప్రభుత్వమే మాకు అందించాలి. తక్షణమే ఈ ప్రభుత్వం ఆస్తి జప్తు చట్టాన్ని రద్దు చెయ్యాలి. మేం మా ఇళ్లను వదిలిపోం. చలిమంట గూడు కాడే కాచుకుని ఉంటాం. బల ప్రయోగం చెయ్యాలనుకుంటారా కాసుకుంటాం. అప్పులిచ్చిన రాబందు కంపెనీలకు మేం నయాపైసా బకాయి చెల్లించం. ముందు ఈ సర్కారు మా బకాయిలన్నీ చెల్లించాలి. కూత వేటు దూరంలో ఉప్పెనలా నిలబడి ఉన్నాం. రక్తం రుచిమరిగిన ధన దాహపు కుక్కల్లారా మీకిదే చెప్తున్నా జాగ్రత్త. మాతో పెట్టుకోకండి ఖబడ్దార్.

**(1982 జూలై నెలలో నెబ్రస్కాలోని ఒమాహాలో పాప్యులిస్టు పార్టీ తొలి సదస్సు జరిగింది. మిన్నెసోటాకు చెందిన ప్రముఖ రాజకీయవాది. ఇగ్నేషియస్ డావెల్లీ ఈ సదస్సులో ప్రవేశపెట్టిన ముసాయిదా పత్రం 'ఒమాహా ప్లాట్ ఫాం' పేరిట ప్రసిద్ధి పొందింది. ముసాయిదాలో భాగాలు)**

## అమెరికా ప్రజాపార్టీ ప్రకటన (జూలై 4,1982)

మన చుట్టూ నెలకొని ఉన్న పరిస్థితులే మనమంతా ఐక్యంగా ఇక్కడ సమావేశం కావడానికి దోహదం చేసాయి. నైతికంగా, రాజకీయంగా, భౌతికంగా మన జాతి వినాశనం అంచుకు చేరుకుంది. బ్యాలెట్ పెట్టెలను, శాసనసభలను ఆమెరికన్ పార్లమెంట్‌ను చివరాఖరికి న్యాయవ్యవస్థను కూడా అవినీతి జాడ్యం కమ్మివేసింది. దేశమంతా ఈసురోమంటుంది. అనేక రాష్ట్రాల్లో పోలింగ్ స్టేషన్‌ల దగ్గర ఓటర్లను సామూహికంగా ప్రలోభపెట్టేందుకు లంచాలు ఎర వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటికి లొంగరు అనుకున్న జనాన్ని బలప్రయోగం, బెదిరింపులతో పోలింగ్ బూత్‌ల ఛాయులకు రానీయకుండా చేసారు. వార్త పత్రికలకు భారీ సబ్సీడీలు అందుతున్నాయి. అందుకే అవి నిజం చెప్పడంలేదు. వాస్తవాలు వెలికి తీసుకురావాలని ప్రయత్నించిన పత్రికల గొంతు నులిమేసారు. ప్రజాభిప్రాయం పీక నొక్కేసారు. వ్యాపారం మాత్రం సజావుగా కొనసాగుతుంది.

మన ఇళ్ళు తాకట్టు వాకట్టులవుతున్నాయి. కష్టజీవులు దుర్భర దరిద్రంలో కూరుకు పోతున్నారు. భూమి అతికొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో పోగడిపోతుంది.

పట్టణ కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారు. దిగుమతి చేసుకున్న పేద కార్మికులను పోటి పెట్టి కార్మికుల నిజ వేతనాలను తెగకోస్తున్నారు. చట్ట విరుద్ధంగా కిరాయి సైన్యాన్ని మేపుతూవారిని కార్మిక వర్గంమీదకి ఉసికొల్పుతున్నారు. అమెరికన్ కార్మికవర్గం పరిస్థితి యూరప్ కార్మిక వర్గానికన్నా తీసికట్టుగా మారిపోతుంది. లక్షలాదిమంది శ్రమను అప్పనంగా దోచుకుంటూ మానవ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని విధంగా అతి కొద్ది మంది అపారమైన సంపద పోగేసుకుంటున్నారు. ఈ గుంపు రిపబ్లికన్‌లతో చెయ్యి కలిపి మన రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఉదాత్తమైన ప్రజాస్వామిక స్వేచ్ఛను హరించివేస్తుంది. సర్కారు దాల్చిన అక్రమగర్భం కవల వర్గాల్ని ప్రసవించింది. ఒకటి నిరుపేదవర్గం మరొకటి ధనికవర్గం.

ద్రవ్యాన్ని ముద్రించే అధికారాన్ని అడ్డం పెట్టుకుని "బాండ్లు గలవారిని మరింత ధనవంతులు చేస్తుంది ఈ ప్రభుత్వం. ప్రభుత్వం పోగేస్తున్న రుణం బంగారాన్ని కుదవపెట్టిన బాండ్ల కొనుగోలుకు వినియోగిస్తుంది. తద్వారా సంపన్నులకు లక్షల డాలర్లు కట్టబెడుతుంది. అయితే ఈ అప్పు చెల్లగొట్టడానికి భారాలు మాత్రం ప్రజల మీద వేస్తుంది.

చరిత్ర వికాసం నాటి నుండి ప్రామాణిక ద్రవ్యంగా పరిగణిస్తున్న వెండిని ద్రవ్యకోశం నుండి తెప్పించింది. బంగారం కొనుగోలును పరోక్షంగా పెంచే దానికే సర్కారు ఈ పనికి

పూనుకుంది. బంగారం గనుల యజమానులు, వ్యాపారస్థులు తెగబలుస్తా ఉన్నారు. కార్మికులకు మాత్రం కనీస కూలి కూడా గిట్టుబాటు కావడంలేదు. వడ్డీ వ్యాపారం చేసుకునే వారికి ఊతం ఇచ్చేందుకు ద్రవ్య సరఫరాను ప్రభుత్వం కట్టడి చేస్తుంది. అమెరికా రెండు ఖండాల మీద మానవాళికి వ్యతిరేకంగా బహుళార్ధ కుట్ర సాగించడానికి బీజం పడింది. ఇది వేగంగా ఈ ప్రపంచాన్ని చుట్టేస్తుంది. ఈ కుట్రను నిలువరించి నిలువునా కూల్చెయ్యకపోతే మానవనాగరికతే విధ్వంసమైపోయే ప్రమాదం ఉంది. ఉహింపశక్యంగాని రీతిలో సామాజిక ప్రకంపనలకు దారి తీస్తుంది. అశ్రితజన పక్షపాతంగల సర్కారు బలంగా వేళ్ళూనుకుంది. పేరు గొప్ప పార్టీలు రెండూ గతి పాతికేళ్ళుగా అధికారం కైవశం చేసుకోవడానికి, అందినంత దోచుకోవడానికి ఎన్నితకరారులు చేసాయో మనం కళ్ళారా చూసాం. ఈ రెండు పార్టీలు కష్టజీవుల కడుపు కొట్టే హీనాతిహీనమైన అనేకం తప్పులకు ఒడిగట్టాయి. ఇప్పటిదాకా ఈ రెండు పార్టీలను నియంత్రించే శక్తులకు ఊపిరిలూదకుండా మనం తప్పు చేసాం. ఇవాళ ఈ రెండు పార్టీలూ సామాన్య ప్రజానీకానికి ప్రయోజనం చేకూర్చే ఒక్కటంటే ఒక్క సంస్కరణను కూడా వాగ్దానం చేసే పరిస్థితుల్లో లేవు. రాబోయే ఎన్నికల ప్రచారంలో ఈ  రెండు పార్టీలు ప్రజాసమస్యల మీద ఒకే వైఖరిని తోసుకోబోతున్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించడం, వాటిని ప్రస్తావించకుండా మిన్నకుండి పోవడానికి ఉభయత్రా అంగీకారానికి వచ్చాయి. అయితే ఒక్క విషయంలో మాత్రం ఇంటికప్పు లెక్కి అరిచి మరీ ప్రచారం చెయ్యడానికి ఈ రెండు పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. సుంకాల మీద నానా యాగి చేస్తాయి. తద్వారా పెట్టుబడిదారులు, కార్పోరేట్ కంపెనీలు. జాతీయ బ్యాంకులు, అక్రమ నిల్వదారులు, వడ్డీవ్యాపారస్థులు, ట్రస్టులు, కూటములు ముప్పేట జనాన్ని దోచుకుతింటున్న విషయాన్ని తెరమరుగు చెయ్యడానికి చూస్తున్నాయి. ఈ ప్రచారం కోసం అవినీతిపరుల నుండి లక్షల డాలర్లు పార్టీ నిధులుగా, లంచాలుగా పొందుతున్నాయి. వాళ్ళు ఎన్నికలలో ప్రజలను త్యాగాలకు సిద్ధంకావాలని పిలుపు నివ్వబోతున్నారు. మనం ఇళ్ళను త్యాగం చెయ్యాలి. మన జీవితాల్ని త్యాగం చెయ్యాలి. మన బిడ్డల భవిష్యత్‌ను త్యాగం చెయ్యాలి అని ఈ రెండు పార్టీలు చెప్పబోతున్నాయి. కానీ మనం ఏం చెయ్యాలి?

ఈ దేశ ఆవిర్భావదినోత్సవాన ఇక్కడ ఈ సదస్సుకు హాజరైన నా సోదర సోదరీమణులారా జాతి నిర్మాతల సాక్షిగా స్వాతంత్రం సాక్షిగా, ఇంకనా, ఇక పై సాగదు మీ దోపిడి అని మనం ముక్త కంఠంతో చెప్పాలి. ప్రజలకే ప్రభుత్వాధికారం అని ఎలుగెత్తి చాటాలి. కష్టజీవులదే ఈ రాజ్యం. ఈ రాజ్యం మీద నుండి ఈ  రాజ్యం మీరేలండి. స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం ప్రజా సంక్షేమం, సమసమాజం – ఇవే మన ఆశయాలు. ఒకరినొకరు ప్రేమించే, తోటివాడికి సాయపడే సుందర సుస్యందన రాజ్యాన్ని స్థాపించుకుందాం కలిసిరండి. తుపాకి బాయ్‌నెట్లతో మన సంకల్పానికి తూట్లు పొడవలేరని చాటి చెబుదాం.

అంతర్యుద్ధానికి చరమవాక్యం పాడుదాం. మనసావాచా కర్మణా మనం ఏకరక్త బంధువులమని భాతృ సమానులమని, స్వేచ్ఛాజీవులమని నిరూపిద్దాం. చేయి చేయి కలపండి.

# చారిత్రావలోకన 2000-1887 - ఎడ్వర్డ్ బెల్లమీ (1888)

డాక్టర్ లెట్టీ ఏమని ప్రశ్నించాడు? ఆపైలోకం సాక్షిగా చెప్పండి 'ప్రజా శత్రువులంటే ఎవరు?' అనేకదా. ఎవరు అ ప్రజాశత్రువులు? ఫ్రెంచి వాళ్ళా, జర్మనీవాళ్ళా, ఇంగ్లాండ్ వాళ్ళా లేక ఆకలి, చావు, చలి, బట్టలేనితనమా? మీ రోజుల్లో ప్రభుత్వానికి ఓ ఆనవాయితీ ఉండేది. అంతర్జాతీయ వ్యవహారాల్లో కొద్దిపాటి పొరపొచ్చాలు వచ్చినా వందల వేలమంది ప్రజానీకాన్ని సరిహద్దులు దాటించి యుద్ధానికి తెగబడేవి. ఖజానాలో సొమ్ము మంచినీళ్ళ ప్రాయంలా ఖర్చు చేసేవి. వందలవేల మానవ ఖండిత మృతదేహాల రవాణా అటూ ఇటూ సాగించేవి. ఈ యుద్ధాల్లో తమకంటూ వీసమెత్తు ప్రయోజనం లేని అమాయక ప్రజ ప్రాణాలు కోల్పోతుండేవారు. అయితే ఇవాళ మనకు అలాంటి యుద్ధాలు లేవు. యుద్ధోన్మోద ప్రభుత్వాలు లేవు. కాని ప్రజలు ప్రాణాలతో ఉన్నారే తప్ప తిండికి, గుడ్డకు, తలదాచుకునే గూడు లేక అలమటించిపోతున్నారు. ప్రభుత్వాలు మాత్రం తాము ఎంపికయిన కాలాన్ని అంతా పరిశ్రమాధిపతులకు సేవలందించడానికి, వారికి కావాల్సిన చట్టాల్ని చెయ్యడానికి ఖర్చు చేసి తరించిపోతున్నాయి. అవునా, నా పశ్చిమార్ధగోళమా! మా కాలంలో కాదు, నీ హయాంలోనే ఆధునికత సంతరించుకున్నాం అని 'పౌర చట్టాలు' నెలకొల్పుతున్నాం అని చెప్పి విశేష అధికారాలు చలాయిస్తున్న ప్రభుత్వాలేనా ఇంతటి దుర్నీతికి పాల్పడుతుంది.

'పోలికలు తీసుకు రావద్దుంటారా సరే ఆ విషయాన్ని ప్రక్కన పెడదాం. "ప్రజా సేవకులుగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులు పాల్పడుతున్నా అవినీతి అశ్రిత పక్షపాతాన్ని పరిశీలిస్తే ఇదొక జాతీయ పరిశ్రమగా తయారయింది కదా ఈ ప్రభుత్వం కేవలం ఈ పరిశ్రమనే నడిపించడం పనిగా పెట్టుకుంది కదా అనిపించక మానదు కదా. ఇదంతా చూస్తుంటే దేశ సంపదను సృష్టించే యంత్రాంగం మీద రాజకీయ నాయకులకు సంపూర్ణాధికారాలు కట్టబెట్టి తప్పు చేసాం కదా అనిపించిక మానదు. రెండు రాజకీయ పార్టీల మధ్యన ఈ భౌతిక ప్రయోజనాలే ఫుట్‌బాల్ బంతిలా అటు ఇటూ తిరుగాడుతున్నాయి. అవునా కాదా?

"నిస్సందేహంగా నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళ వాస్తవం" అంటూ డా॥లెటీ కల్పించుకున్నాడు. అయితే ఇప్పుడు ఇదంతా మారిపోయింది. మనకు ఇప్పుడు పార్టీలు లేవు రాజకీయనాయకులు లేరు. అవినీతి, అశ్రిత పక్షపాతం ఈ రెండు పదాలకే చారిత్రక విశిష్టత ఏర్పడింది. మానవ నైజమే అట్లా మారిపోయింది ఇవాళ 'అన్నా నేను. లేదు లేదు' అని బదులు చెప్పాడు డాక్టర్ లెటీ. "పరిస్థితులు మానవ జీవితాన్ని అలా ప్రభావితం చేస్తున్నాయి. అతను చేసే పనులకు కారణహేతువు చుట్టూ ఉన్న పరిస్థితులే. ఇవాళ మనం ఉన్న సమాజ నిర్మాణం లోనే లోపం ఉంది. అందుకే పాలకవర్గాలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమో స్వజనుల లబ్ధి కోసమో తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని దందా సాగించాలని కాంక్షిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీలాంటి వాళ్ళ ప్రయోజనాలు కాపాడమని వాళ్ళను అభ్యర్థించడం వాళ్ళ నుండి ఆ పని ఆశించడం వింతగా అనిపిస్తుంది. ఇవాళ రేపూ పరిస్థితి ఎలా తయారయ్యిందంటే అధికార దుర్వినియోగానికి అవినీతికి, వ్యక్తిగత లాభార్జనకి పాల్పడని

వాడిది పాపంలాగ ఉంది. నీతి నిజాయితీ లేని వాడిని అందలం దక్కించే విధంగా తయారయింది నేటి సామాజిక వ్యవస్థ. సమయం వస్తే ఈ విషయాన్నీ ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలుగుతారు.” అని వివరించారు.

“అంతా బాగానే ఉంది కానీ ఇప్పటిదాకా మీరు పెట్టుబడికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడారు కానీ కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయం ఏం చెప్పలేదు. మిల్లులు, భారీ పరిశ్రమలు, రైలు, రోడ్డు రవాణా, గనులు, వ్యవసాయం ఇవన్నీ కూడా ప్రభుత్వం సంభాళించాల్సిందే కదా. పెట్టుబడితో వ్యవహారాలు ఎలానూ ఉండనే ఉన్నాయి. పెట్టుబడి తోపాటు ఈ రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి కదా. అక్కడికేవో పెట్టుబడి సమస్యలను మాత్రమే తనకు పట్టినట్లు, పెట్టుబడిదారుల ఇక్కట్లు తీర్చడం ఒక్కటే తన బాధ్యత అయినట్లు ఈ సర్కారు వ్యవహరిస్తుంటే ఎలా దీని గురించి ఏం మాట్లాడరే మీరు అని అడిగా నేను. డాక్టర్ లెటీ తాపీగా చెప్పాడు – ‘బావుంది ప్రభుత్వం ఎప్పుడయితే పెట్టుబడి’ బాధ్యతలు తలకెత్తుకుందో పెట్టుబడి ఇక్కట్లు మటు మాయం అయిపోయినట్లే కార్మికులకు సంబంధించిన సమస్యల విషయానికి వచ్చే సరికి వాళ్ళ కోసం ఒక జాతీయ కార్మిక సంఘం ఉంది. అది చెప్పిన తీరుగా నడుచుకుంటే వాళ్ళ సమస్యలను పరిష్కారం దొరికినట్లే దీనికి – ప్రభుత్వాన్ని అడిగి ఏం లాభం? ఎప్పుడైతే ప్రభుత్వం యజమాని (ఎంప్లాయర్) అవతారం ఎత్తిందో దేశంలో పౌరసత్వం కలవారందరూ ఉద్యోగార్థులు కింద మారిపోయినట్లు లెక్క ఏ పరిశ్రమకు ఎంత మంది కార్మికులు కావాలో ఏ పెట్టుబడికి ఎంత మంది శ్రమ శక్తి అవసరమో వంటి లెక్కలు డొక్కలూ చూడడమే ప్రభుత్వ బాధ్యత

‘అంటే మీ ఉద్దేశంలో.. యుక్త వయస్కుడయిన ప్రతి మనిషీ ప్రభుత్వం పిలిచినప్పుడు విధిగా వచ్చి సైన్యంలో చేరాలనే ‘మిలటరీ రూలు’ లాగా ఎవరే పనిలో చేరాలని ప్రభుత్వం చెబుతుందో. అలా నడుచుకోవాలంటారా కార్మికులూ, అని ప్రశ్నించా నేను.

‘లెస్స పలికితివి’ అని నా భుజం తట్టాడు డాక్టరు లెటీ. “ప్రభుత్వం గుత్త పెట్టుబడిదారుగా మారిపోయిన నేపథ్యంలో అదే కదా రూలు. ఆంగవైకల్యం లేని ప్రతి మనిషీ దేశానికి మిలటరీ సేవ చెయ్యాలనేది ఎలా రూలో అలానే ఈ దేశాన్ని ముందుకు నడిపించడానికి ప్రతి పౌరుడు తన వంతుగా బౌద్ధిక శారీరక శ్రమ కోర్చి దేశ సేవ చేసుకోవాలి. ఇందులో హెచ్చుతగ్గుల గురించి ఆలోచించకూడదు. అయినా సర్కారు బాధ్యతల గురించి ఇంతలా గుచ్చి గుచ్చి అడుగుతున్నావు గానీ ఒక విషయం చెప్పు. ఇవాళ వందలు, వేల కార్పొరేట్ సంస్థలు పరిశ్రమలకింద పనిచేస్తూ కార్మికులు రంగాల వారీగా చీలిపోయి ఉన్న పరిస్థితుల్లో ఒక జాతీయ కార్మిక సంఘాన్ని పెట్టి వీళ్ళందరినీ ఐక్యంచేసి వాళ్ళు సమస్యలను ఏకరీతిలో పరిష్కారం చెయ్యడం అయ్యే పనేనా. ఈ దేశ ఘన పౌరసత్వం దక్కినందుకు ప్రజలు ఎవరికి వారే తమకు తోచిన రీతిలో సేవ చెయ్యాలి గానీ దాన్ని ‘శ్రమ’ అనుకోవడం సమస్యలు ఉన్నాయని భావించడం తగునా” అని అడిగాడు డాక్టర్ లెటీ.

కార్మికులు తాము చేసే కాయకష్టాన్ని దేశ సేవ అనుకోవాలంటారు అంతేగా ‘అనడిగా నేను. “సహజంగా అంతే కదా ఇందులో నిర్బంధం ఏమి లేదు సుమా! అట్లాంటి ఆలోచనలు

ఏమన్నా నీ మనుసులో ఉంటే తీసి పక్కన పెట్టు ఇది అత్యంత స్వాభావికమైనది. సంబంధమైన దీనూ" అన్నారు. డాక్టర్ లెటీ"

"ఇంతేనా ఇక్కడ జీవితం మీరు చెప్పిన మిలిటరీ సర్వీసులాగా పారిశ్రామిక సైన్యంగా ప్రజలు జీవితాంతం పెట్టుబడికి సేవ చేస్తూ గడపాల్సిందేనా" అనడిగా నేను.

"అబ్బెబ్బే అట్టా అనుకోవద్దు మళ్ళా చదవనూ, రాయనూ వచ్చి ఉంటేనే కదా నాణ్యమైన సేవ అందించగలగేది. అందుకే పిల్లలనీ,ముసలివాళ్ళనీ మినహాయించగా మిగిలిన వాళ్ళలో ఇరవై ఒక్కేళ్లు వచ్చే వరకు అందరినీ చదువుకోనిస్తాం ఆనక పనిలో చేరి ఇరవై నాలుగేళ్ళ పాటు 'సేవ' చేసి నలభై ఐదేళ్ళకు రిటైరయి పోవచ్చు. అయితే హఠాత్తుగా గిరాకీ పెరిగిపోయి మరింత శ్రమ అదే 'సేవ' అవసరం పడితే నలభైఐదు దాటినా గానీ వచ్చి పనిలో కుదురుకోవాలి. ఇంకో పదేళ్ళ పాటు అంటే యాభై ఐదేళ్లు వచ్చేదాకా సేవ చెయ్యాలి. అలా ఎప్పుడోగాని అవసరం పడదనుకో – అయినా పడినప్పుడు మాత్రం లేదు, కాదు, కుదరదు అనే మాట కార్మికుల నోటి నుండి రాకూడదు సుమా."

***(స్మెడ్లీ బట్లర్ అమెరికా సైన్యంలోని 'మెరైన్ కార్ప్స్'కు మేజర్ జనరల్‌గా పనిచేసిన ప్రముఖుడు. 1898లో స్పానిష్ – అమెరికా యుద్ధం సందర్భంగా సైన్యంలో చేరాడు. ఆ తరువాత తరువాత చైనా, ఫిలిప్పిన్స్ నికరాగువా పనామా, హోండురాస్, మెక్సికో, హైతీ దేశాలలో అమెరికా సైనిక జోక్యంలో పాలుపంచుకున్నాడు. రెండు దఫాలు అమెరికన్ కాంగ్రెస్ గౌరవపురస్కారం దక్కించుకున్నాడు. అయితే 1935లో అప్పటి దాకా తాను పాలుపంచుకున్న యుద్ధాలు, సైనిక జోక్యాలను కొత్త కోణంలో ప్రజల ముందు ఉంచాడు. ఒక పుస్తక రూపంలో తన అనుభవాలు వివరించాడు. ఈ సామ్రాజ్యవాద సైనిక జోక్యాలు అన్నింటా దాగి ఉన్న వ్యాపార ప్రయోజనాలను బయటి ప్రపంచానికి చాటి చెప్పాడు. యుద్ధాల్ని కుటిల కూటమి (రాకెట్)గా అభివర్ణించాడు. బట్లర్ రాసిన పుస్తకంలోని ఎవరు లబ్ధి పొందారు? అనే అధ్యాయంలోని కొన్ని భాగాలు కింద పొందుపరుస్తున్నా)***

## యుద్ధం ఒక కుటిల కూటమి - స్మెడ్లీ డి.బట్లర్ (1935)

యుద్ధం ఒక కుటిల కూటమి. ఇది పాత నీతే. సునాయాసంగా లాభాలు పోగేసుకునే ఒక విష సంస్కృతి. అంతర్జాతీయంగా లాభాలు గడించాలంటే యుద్ధానికి మించిన పెద్ద వ్యాపారం లేదు. ప్రజల నిండు ప్రాణాలు పణంగ పెట్టి అలవోకగా లక్షల డాలర్లు పోగేసుకోవచ్చు. కుటిల కూటమి గురించి ఇంతకన్నా గొప్పగా వివరించడానికి నా దగ్గర మాటలు లేవు. అయితే ఈ విషయాలేవీ మెజారిటీ ప్రజానీకానికి తెలియవు. కేవలం అతికొద్ది మంది' అంతరంగిక బృందానికి' (ఇన్‌సైడర్స్) మాత్రం ఈ వాస్తవం ఖచ్చితంగా తెలుసు. అతి కొద్దిమంది లాభం కోసం అత్యధిక మంది ప్రయోజనాలు పణంగా పెట్టడమే కూటమి నీతి.

మొదటి ప్రపంచయుద్ధంలో ఇలానే కోట్లాది డాలర్లు దండుకున్న వాళ్ళు ఉన్నారు. ఒక్క అమెరికాలోనే మొదటి ప్రపంచయుద్ధకాలంలో 21,000 మంది కొత్తగా లక్షాధికారులు, కోటీశ్వరుల స్థాయికి ఎగబాకారు. యుద్ధంలో పారిన రక్తంతో తాము ఈ ఆదాయాన్ని గడించినట్లు చట్టబద్ధంగా టాక్స్‌రిటర్న్‌లో వెల్లడించిన వాళ్ళ సంఖ్య మాత్రమే నే చెబుతున్నా. ఆదాయపు పన్ను దాఖలాలో ఈ వాస్తవాన్ని మరుగునపరిచిన లక్షాధికారులు, కోటీశ్వరులు ఇంకెంత మంది ఉన్నారో?

వీళ్ళలో ఏ ఒక్కరూ కూడా భుజాన తుపాకి మోసిందీ లేదు, మోపింది లేదు. ఒక్కరు కూడా ఒక్కడంటే ఒక్క కందకాన్ని తవ్వేందీ లేదు. ఎలుకలు, పందికొక్కులు వాసనతో ముక్కిపోయిన కందకాల్లో ఆకలి కడుపులతో ఒక్క రోజు, ఒక్క గంట, ఒక్క క్షణం గడిపిన వాళ్లు లేరు. మీదకి దూసుకొచ్చే బుల్లెట్లు, బాంబుషెల్స్ పడిన నిదురలేని భయంకర కాళరాత్రులు గడిపిందీ లేదు. శతృ సైనికుడి తుపాకి బాయనెట్ ఒక్కరి ఒంట్లోనూ దిగింది లేదు. చిన్న పాటి రక్త గాయం అయిందీ లేదు. అయినా వీళ్లు కోట్లు గడించారు.

యుద్ధం తరువాత గెలిస్తే గిలిస్తే మహా అయితే ఒక దేశానికి దక్కేది ఇంకొంత పరాయి దేశపు భూమి మాత్రమే. ఈ భూమిని వాళ్ళు దక్కించుకున్నారు. అక్కడి ఖనిజ సంపదను దోచుకుని కోట్లకు పడగలెత్తారు. కానీ ఆ యుద్ధాలకి అయిన వ్యయాన్ని మాత్రం సామాన్య ప్రజానీకం మోసారు. ప్రతి పైసా తమ రెక్కల కష్టంతో చెల్లించారు.

ఎందుకు అయ్యింది ఈ ఖర్చు? లెక్కలు చూస్తే కడుపు తరుక్కుపోతుంది. కొత్త సమాధులు కట్టడానికి చేసిందే కదా ఈ ఖర్చు అంతా. యుద్ధం తరువాత దేశానికి, ప్రజానీకానికి ఏం దక్కిందని? కూలి పోయిన శరీరాలు, ఖాళీ మనసులు. చితికిన హృదయాలు, ఛిద్రమైన కుటుంబ జీవితాలు. ఆర్థిక అరాచకత్వం, మాంద్యం, పన్నుల భారం. ఒక తరం నుండి మరొక తరం దాకా పాప పంకిలాన్ని మోస్తూనే ఉంది.

సైన్యంలో పనిచేస్తున్న రోజుల నుండే నన్ను ఈ సందేహం పీడిస్తూ ఉండేది. యుద్ధం కేవలం కుటిల కూటమి ప్రయోజనార్ధమేనేమో అని. సైన్యం నుండి రిటైరయి పౌరజీవితం గడుపుతున్నాక నాకు రూఢీగా అర్ధమైంది. ఇవాళ మళ్ళీ దేశం మీద మరో ప్రపంచయుద్ధ మేఘాలు దట్టంగా అలుముకున్న నేపథ్యంలో నేను ఎరిగిన సత్యాన్ని ప్రజలకు చెప్పకపోవడం క్షమార్హం కాని నేరంగా ఎంచి నేనీ వాస్తవాన్నీ మీ ముందు ఉంచుతున్నా.

ఎవరి పక్షాన ఎవరు చేరాలో దేశాలు నిర్ణయించేసుకున్నాయి. ఫ్రాన్స్, రష్యా ఒక పక్షం చేరిపోయాయి. ఇటలీ, ఆస్ట్రియా జట్టు కట్టడానికి తొందరపడుతున్నాయి. పోలెండ్‌తో ఉన్న సరిహద్దు వివాదాన్ని త్రోసి రాజని జర్మనీ పోలెండ్‌లు జట్టుకట్టాలని చూస్తున్నాయి.

యుగోస్లేవియా రాజు అలగ్జాండర్ 2 హత్య కావించబడటంతో పరిస్థితులు సంక్లిష్ట రూపం దాల్చాయి. యుగోస్లేవియా. హంగేరీల మధ్య సుదీర్ఘకాలంగా శతృత్వం ఉంది. ఒకరి కుత్తుకలు ఒకరు ఎప్పుడు తెగ్గోసుకుందామా అన్నంత గుర్రుగా ఉన్నాయి ఈ రెండు దేశాలు. సందు చూసుకుని ఎప్పుడు ఈ కయ్యంలోకి దూకుదామా అని ఇటలీ కాచుకొని ఉంది.

ఈ దేశాలన్నీ యుద్ధం కోసం కాచుకుని ఉన్నాయి. కానీ ఏ ప్రజలయితే ఈ యుద్ధాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొనాల్సి ఉందో, వీర మరణం పేరిట నిండు జీవితాలను చాలించాల్సి ఉందో వాళ్లు ఈ యుద్ధాన్ని కోరుకోవడం లేదు. ఎగసనదొయ్యడం లేదు. కడుపులో చల్ల కదలకుండా కూర్చుని యుద్ధాల్ని ఎగసన దోసి లాభాలు పోగేసుకుందాం అనుకునే అతి కొద్దిమంది మాత్రమే ఇందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇవాళ చూసుకుంటే 40 కోట్ల మంది సైనికులు, అపారమైన ఆయుధాలు ఉన్నాయి. కానీ దేశ భక్తులు, రాయబారులు మాత్రం 'అబ్బే' యుద్ధం అనే ప్రసక్తే రాదని తియ్యని కబుర్లు చెబుతున్నారు.

మరి ఈ నరకలోకపు జాగిలాల శృంఖలాలు ఖణేల్మని ఎందుకు మోగుతున్నాయి? 40 కోట్ల మంది సైనికులకు ఏం శిక్షణ ఇచ్చారూ – డాన్సులాడమనా?

కనీసం ఇటలీ విషయంలో మాత్రం ఖచ్చితంగా కాదని చెప్పవచ్చు. ఆ దేశాధ్యక్షుడు బెనిటో ముస్సోలినికి తెలుసు. వాళ్ళకు దేనికోసం శిక్షణ ఇప్పించింది. అతగాడు నిజాయితీగానే ఉన్నది ఉన్నట్లుగా చెప్తున్నాడు. నిన్నగాక మొన్న జరిగిన అంతర్జాతీయ సంప్రదింపులలో అతగాడు ఏం చెప్పింది కార్నెగీ అంతర్జాతీయ శాంతి ధర్మాదాయ సంస్థ ప్రచురించింది.

"......అన్నిటికీ మించి ఫాసిజానికి ఒక విశ్వాసం ఉంది. రాజకీయ కార్యాచరణకు తోడుగా మానవాళి అభివృద్ధికి, భవిష్యత్‌కు తోడ్పడేది శాంతి మాత్రం  కాదు. యుద్ధం ఒక్కటే మానవాళిలో నిబిడీకృతమై ఉన్న శక్తులను వెలికి తీసి, శిఖరస్థాయికి తీసుకెళ్ళలుగుతుంది. సవాలును స్వీకరించాలనే ఉదాత్తమైన గుండె ధైర్యాన్ని ప్రజలలో నింపుతుంది..."

చూసారా మాటలు తడుముకోకుండా ముస్సోలిని ఎంత స్పష్టంగా చెప్పాడో. అతని సుశిక్షత సైన్యం, విమానాలు, నావికాదళం అన్నీ యుద్ధం కోసం ఆత్రంగా ఉన్నాయట అతని దృష్టిలో. యుగోస్లేవియాతో తగాదా పడిన హంగేరి పక్షాన అందుకే నిలబడ్డాడు. ఆస్ట్రియా ఛాన్సలర్ ఎంజెల్‌బెర్ట్ డాల్ఫర్ హత్యకావించబడిన (1934 జూలై 25) వెన్వెంటనే తన దళాలను ఆస్ట్రియా సరిహద్దులలో మోహరించాడు. ఇవన్నీ యుద్ధ కాహళి విన్యాసాలే. యుద్ధం తథ్యం. అది రేపా, ఎల్లుండా అనేదే ప్రశ్న.

ఒక హెర్ హిట్లర్ జర్మనీని పున:సాయుధం చేస్తున్నాడు. ఇంకా ఇంకా ఆయుధాలను పోగేస్తున్నాడు. ఇవన్నీ దాదాపుగా బహుశా అంతకన్నా ఎక్కువగా శాంతికి విఘాతం కలిగించే పోకడలే. ఫ్రాన్స్ ఈ మధ్యనే యువకుల నిర్బంధ మిలటరీ సర్వీసును ఏడాది నుండి పద్దెనిమిది నెలల కాలానికి పెంచింది.

దేశ దేశాలు ఆయుధాలు చేతబూని ఉన్నాయి. యూరప్ ఖండంలో ఏదో ఒకరోజున పిచ్చికుక్కలు పుంజాలు తెంపుకుని ఉరకవచ్చు.

ఈ పవిత్ర కార్యాన్ని ఎగసన దొయ్యడానికి అమెరికాగా మన వంతు కృషి చేస్తున్నాం. జపాన్ రష్యాల మధ్య యుద్ధం జరిగినపుడు మనం రష్యాతో మన పాత మిత్రత్వాన్ని తన్ని

తగలేసి జపాన్‌కు చేయూతనిచ్చాం. ఎందుకంటే మన అంతర్జాతీయ బ్యాంకర్లు జపాన్‌కు ఇబ్బడిముబ్బడిగా రుణాలు అందచేస్తున్నారు. అందుకే జపాన్ దేశ ప్రజానీకంతో అమెరికా పట్ల విద్వేషభావనలు ప్రబలుతున్నాయి. చైనా పట్ల మనం అనుసరిస్తున్న 'ఓపెన్ డోర్ పాలసీ' అర్థం ఏమిటీ? ఏటా చైనాతో మనం నడుపుతున్న వాణిజ్యం 90 బిలియన్ డాలర్లు. ఫిలిప్పీన్స్ మాట ఏమిటీ? ఈ ముప్పై ఐదేళ్ళలో మనం అక్కడ 600 బిలియన్ డాలర్లు ఖర్చు చేశాం. దేనికోసం అక్కడ మన  బ్యాంకర్లు పారిశ్రామికవేత్తలు పెట్టిన 200 బిలియన్ డాలర్లు రక్షణ కోసం అట?!

చైనాతో 90 బిలియన్ డాలర్ల వాణిజ్యం కోసం ఫిలిప్పీన్స్‌లో 200 బిలియన్ డాలర్ల పెట్టుబడుల రక్షణ కోసం మనం జపాన్‌ని నిలువెల్లా ద్వేషించి, యుద్ధంలోకి దూకాలి. వందల వేల బిలియన్ డాలర్లు యుద్ధం పేరిట మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చెయ్యాలి. వేలాదిమంది అమెరికన్ సైనికులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించాలి. యుద్ధం నుండి తిరిగి వచ్చిన వాళ్ళు కూడా ఏ శారీరక వైకల్యంతోనో, మానసిక వైకల్యం తోనో తీసుకుంటా ఉండాలి. ఈ నష్టమంతా దేనికోసం భరించాలి. ఈ గడ్డమీద అతి కొద్దిమంది మిలియన్లు, బిలియన్లు డాలర్లు పోగేసుకోవడానికి, అతి కొద్దిమంది – ఆయుధ ఉత్పత్తిదారులు, బ్యాంకర్లు, ఓడల తయారీ కంపెనీ యజమానులు సట్టా వ్యాపారగాళ్ళు... వీళ్ళు బాగుపడడానికి మనం దుంప నాశనం కావాలి.

మరో యుద్ధానికి ఈ తాబేదార్లు కాలుదువ్వుతా ఉన్నారంటే ఉండరామరి. యుద్ధం వాళ్ల పాలిట ఒక కామధేనువు, ఒక కల్పవృక్షం, ఒక అక్షయ పాత్ర కదా మరి. మరి సాధారణ ప్రజానీకానికి ఈ యుద్ధం మూలంగా ఏం జరుగుతుంది? యుద్ధంలో మరణించినవాళ్ళు ఏం లాభం మూటగట్టుకుంటారు? శారీరక, మానసిక వికలాంగులు పొందే లబ్ధి ఏమిటి? భర్తలను, తండ్రులను అన్నదమ్ములను కోల్పోయిన మన ఆడ తల్లులకు ఈ యుద్ధం ఏం లాభం చేకూర్చింది? పిల్లలకు ఏం ఒరగబెట్టింది ఈ యుద్ధం. ఏమీ లేదు – ఉండదు. పోనీ ఈ దేశానికి ఏం ఒరగబెట్టింది ఈ యుద్ధం. 1898 వరకూ ఉత్తర అమెరికాకు ఆవల మనకు అంగుళం భూభాగం లేదు. ఆరోజుకి మన జాతీయ రుణభారం 1000 బిలియన్ డాలర్లు అప్పుడు మనం 'అంతర్జాతీయ సౌభ్రాతృత్వ దృక్పథం'తో ఉండే వాళ్ళం. మన జాతి నిర్మాతలు ఇచ్చిన సందేశాన్ని మనం ఇవాళ పెడచెవిన పెడుతున్నాం. అపాయకర సంకీర్ణ మిత్రత్వాల జోలికి పోవద్దన్న జార్జి వాషింగ్టన్ హిత వాక్యాన్ని మనం మరిచేపోయాం. యుద్ధానికి తెగబడ్డాం. మనది కాని భూభాగాన్ని అంతో ఇంతో మన స్వంతం చేసుకున్నాం. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో మన అంతర్జాతీయ సంబంధాల్ని కెలుకులు కెలుకులు చేసుకుని ఏం సాధించామయ్యా అంటే 25000 బిలియన్ డాలర్లు జాతీయ రుణాన్ని మూటగట్టుకున్నాం. ఈ పాతికేళ్ళ కాలంలో మన విదేశీ వాణిజ్య మిగులు 24000 బిలియన్ డాలర్లు. యుద్ధం ఊసులేకుండా సాధించిన ఈ సానుకూల ఫలితాన్ని ఒక ప్రపంచ యుద్ధం మూలంగా తలెకెత్తుకున్న 25000 బిలియన్ డాలర్ల రుణ భారంతో పోలిస్తే ఈ దేశానికి ఏది లాభదాయకమో ఇంగితం గల ఎవరైనా ఇట్టే జవాబు చెప్తారు.

విదేశాల్లో సైనిక జోక్యాల మూలంగా సామాన్యుడు నడ్డి విరిగే పన్నుల మోతని భరించాల్సి వస్తుంటే చీకటి ప్రపంచపు మారాజులు, సట్టా వ్యాపార రాయుళ్ళు 'ఫ్యాన్సీ' లాభాలు సంపాదించుకుంటున్నారు. సంపద పోగేసుకుంటున్నారు. భారాలు సాధారణ ప్రజానీకం మోస్తున్నారు.

## దేశభక్తి కన్నా హీనమైన పాపం - ఎమ్మాగోల్డ్‌మాన్ (1908)

దేశ భక్తి అంటే ఏమిటి? మనం పుట్టిన చోటును, మన బాల్యపు జ్ఞాపకాలను, ఆశలను, ఆకాంక్షలను, కలలను కన్నచోటును ప్రేమించగలగడమా? బాల్యపు అమాయకత్వంతో నడినెత్తిన ఆకాశంలో పరుగులు తీసే మేఘాలను చూసి మనం అంత వేగంగా పరిగెత్త లేకపోతున్నామే అని అబ్బురపడిన చోటును ప్రేమించడమా? చీకటిలో గుత్తులు గుత్తులుగా ఆకాశంలో వేలాడుతున్న లక్షల కోట్ల నక్షత్ర సముచ్ఛయాన్ని చూసి ఆనందంతో కేరింతలు కొట్టి, ఒక తోకచుక్క తెగి రాలిపడుతుంటే నిబిడాశ్చర్యంతో, భయ విహ్వలతతో అమ్మను కరిచి పట్టుకున్న చోటును ప్రేమించడమా? పక్షుల కిలకిలలు కువకువలకు పరవశించి, ఎగిరే పక్షులను చూసి మనకూ రెక్కలు ఉంటే దూర తీరాలకు ఎగిరిపోదుము కదా అని పలవరించిన చోటును ప్రేమించడమా? అమ్మ మోకాళ్ళను చుట్టేసి అనగనగా ఒక రాజుగారంటా అంటూ అమ్మ చెప్పే కథలను వింటూ మైమరిచి మనమూ మహారాజులం అయిపోయినట్లు కలగన్న చోటును ప్రేమించడమా? ఒక్క మాటలో చెప్పాలంటే బాల్యపు, లేబ్రాయపు సంతోషాల్ని బొట్టు బొట్టుగా జ్ఞాపకం చేసుకుంటూ మళ్ళీ ఆ రోజులు వస్తే ఎంత బాగుండు అని వగచే చోటును ప్రేమించడమేనా?

ఇదే దేశభక్తి అయితే ఈ అదృష్టానికి నోచుకున్న అమెరికన్‌లు బహు అరుదు అని నే ఘంటా పథంగా చెప్పగలను. ఇవాళ పిల్లల ఆట మైదానాలన్నీ ఫ్యాక్టరీలుగా, మిల్లులుగా గనులుగా మారిపోయాయి. చెవులకు ఇంపైన పక్షుల కిలకిలారావాలకు బదులు, చెవులు దిబ్బళ్ళు పడే ఫ్యాక్టరీల సైరన్ మోతలు సుప్రభాతం పలుకుతున్నాయి. ఇవాళ తల్లులు చెప్పే కథల్లో హాస్యం, ప్రేమ, శౌర్య పరాక్రమాలు లేవు. ఈ రోజున ప్రతి తల్లీ కడుపు చించుకుని చెబుతున్నది స్వీయ విషాద విలాపగాథలే.

మరయితే దేశభక్తి అంటే ఏమిటి? దేశభక్తి అంటే అలూ, అది పుండాకోరు ఆశ్రితం అన్నాడు డాక్టర్ శామ్యూల్ జాన్సన్ "దేశభక్తి అంటే సామూహిక హత్యాకాండను బోధ పరిచే ప్రభోధం. ఇదొక వ్యాపారం. మనిషికి కావల్సిన కూడు, గూడు, బట్ట వంటి కనీస అవసరాలను తీర్చడానికి బదులు ఒక మనిషి నిండు ప్రాణాలు తోడేసేందుకు ఉసిగొల్పే ఆయుధం" అంటారు టాల్‌స్టాయ్. ఔరా ఇంతటి పెద్ద మనుషుల నోటినుండా ఇలాంటి దేశభక్తి కన్నా హీనమైన మాటలు?!

నిజానికి దేశభక్తి అంటే కాసింత తలబిరుసుతనం కాసింత అహం. కాసింత స్వార్థం ఎలానో వివరించమంటారా? ఈ భూగోళం అంతా చిన్న చిన్న దేశాలుగా, ప్రతి దేశం తన

చుట్టూతా ఒక ఇనుప తెరను దించేసుకున్న ప్రదేశంగా విరాజిల్లుతుంది అని దేశభక్తి అంచనా. ఎవరికి వాళ్ళే తాము పుట్టిన గడ్డయే సర్వోత్కృష్టమైనదనీ, ఇతరులకన్నా తామే అధికులమని, తెలివితేటలుగల వాళ్ళమనీ, నవ నాగరికత నేర్చిన వాళ్ళమని భావిస్తుంటారు. ఈ ఆధిక్యతను ఇతరుల మీద రుద్దడానికి, నాగరికత అబ్బించడానికి పరాయి దేశాల మీద దండెత్తి అక్కడ ప్రజానీకాన్ని దునుమాడడానికి కూడా వెనుదీయరు.

మనం పుట్టి, పెరిగిన దేశం గురించి మనం ఎలా భావిస్తుంటామో ఇతర దేశవాసులు కూడా ఎవరికి వారే అలా భావిస్తా ఉంటారు. ఫలితంగా పసితనం నుంచే పిల్లలకు మనజాతి ఔన్నత్యం గురించి రంగరించి చెప్పే పేరిట పరాయి దేశాల, పరాయి జాతుల మనుషుల గురించి అది జర్మన్‌ల గురించి కావచ్చు, రష్యన్లు, ఇటాలియన్లు, ఫ్రెంచివాళ్లు ఇలా ఎవరి గురించి అయినా సరే విషపుగాథలు నూరిపోస్తాం. పిల్లవాడితో పాటే ఈ భావాలు పెరిగి పెద్దవి అవుతాయి. 'నాదేశం – నా ప్రజల కోసం ఆ ప్రభువు అనగా నా ఒంట్లో ఊపిరి ఉన్నంతవరకూ రక్షణగా నిలబడతాను, శత్రువులను దునుమాడతాను అన్న భావనలను ఎవరిలోనైనా ఇట్టే ప్రేరేపించగలిగే స్థాయిలో గూడు కడుతాయి. అందుకే పాలకులు దేశభక్తి పేరిట సైనిక, వాయు, నౌకా దళాల్లోకి జనాల్ని ఇట్టే రాబట్టగలగుతారు. అవసరానికి స్వీయ రక్షణకు మించిన స్థాయిలో ఆయుధ సంపత్తిని పోగేయగలుగుతారు.

సైన్యం అన్నా, నావికాదళం అన్నా ప్రజలకు ఆటబొమ్మల్లా ఆకర్షణీయంగా కనబడుతాయి. ప్రభుత్వం వేలకు వేల డాలర్లు కుమ్మరించి మరీ వీటికి లేని ఆకర్షణ కట్టబెడుతుంది. ఊరూరా తిప్పుతుంది. అమెరికన్ ప్రభుత్వం ఈ ఉద్దేశంతోనే ఒక నావికాదళాన్ని ఫసిఫిక్ సముద్ర తీర ప్రాంతాలన్నింటా ఊరేగించింది. ప్రతి అమెరికన్ పౌరుడు అది చూసి తమ శౌర్య పరాక్రమాలకు తామే గర్వపడాలని సర్కారు భావించింది. ఈ దళానికి విందు కుడపడానికి ఒక్క శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలోనే మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. లాస్ ఏంజెల్స్‌లో అరవై వేల డాలర్లు, సియాటిల్ టకోమాలలో మిలియన్ డాలర్లు ఈ పటాలం విందులు, వినోదాల కోసం ఖర్చు చేశారు. పటాలం అనే మాట వాడాను కదూ నిజానికి ఇంత ఖర్చు కేవలం ఆ పటాలంలోని ఆఫీసరు హోదా ఉద్యోగుల విందు, వినోదాల కోసం మాత్రమే ఖర్చు చేశారు. కింది స్థాయి 'సాహస బాలలు' మాత్రం నౌకలలో తగినంత తిండి దక్కించుకోవడానికి తిరుగుబాటు చేసినంత పని చెయ్యాల్సి వచ్చేది. అక్షరాల ఇది నిజం. మొత్తం రెండు మిలియన్ల అరవైవేల డాలర్లు బాణాసంచా కాల్చడానికి, విందులు ఇవ్వడానికి ఖర్చు చేశారు. అదీ ఎలాంటి పరిస్థితుల్లో – దేశం ఈ కొస నుండి ఆ కొస వరకు ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కి మహిళలు, పిల్లలు, మగవాళ్ళు ఆకలితో హాహాకారాలు చేస్తూ ఎంత కూలికి అయినా పని చెయ్యడానికి వేలాది మంది ఉపాధి కోసం అల్లాడుతున్న నేపథ్యంలో. ఎంతమంది పసిబిడ్డలకు రెండు పూటలా పాలు రొట్టె అయినా అందించవచ్చు ఇంత సొమ్ముతో. కానీ పత్రికలకు ఈ విషయం ఇసుమంత కూడా తట్టలేదు. ఆ పసిపిల్లలకు ఇది ఒక అపూర్వమైన మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోతుందని పత్రికలు అభివర్ణించాయి. పసిమనసుల్లో ఇలాంటి విషతుల్యమైన జ్ఞాపకాలు, నాగరిక నరహంతకత్వం అపూర్వం, అమేయం అన్న ముద్రలు ఆ పిల్లలు పెద్ద వాళ్లు అయ్యాక వాళ్ల మనసుల్లో 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' అనే భావనకు చోటు మిగలనిస్తాయా?

అమెరికన్లం, మనం శాంతి ప్రియులం అని గొప్పగా చాటి చెప్పుకుంటుంటాం. మనం రక్తపాతాన్ని ద్వేషిస్తాం. హింసను వ్యతిరేకిస్తాం కానీ లోహ విహంగాలు ఆకాశం నుండి అమాయక పౌరుల మీద బాంబులు కురిపించి మారణహోమం సృష్టిస్తుంటే మన మనసుల్లో ఆనందం ఉవ్వెత్తున పొంగుకొస్తుంది. ఈ భూమండలం మీద అమెరికా తిరుగులేని ఎదురులేని శక్తిగా ఎదుగుతున్నందుకు గర్వపడతాం. అదిగో ఆ అహంకారమే ఇతర దేశాల మీద ఉక్కుపాదం మోపడానికి కావల్సినంత మద్దతును తెచ్చిపెడుతుంది. పాలకవర్గాలకి మన దేశభక్తి, దేశభక్తి కొలిచే స్వభావం అంతిమంగా ఎక్కడికి దారితీస్తుందో తెలుసుకోవడానికి ఈ ఉదాహరణ ఒక్కటి చాలు.

ప్రపంచవాప్తంగా విజ్ఞతగల మనుషులు ఇప్పుడిప్పుడే దేశభక్తి యొక్క సంకుచిత తత్వాన్ని అర్థం చేసుకుంటున్నారు. పాలకవర్గాల అవసరాలు ఈడేర్చడానికి కాలంతోపాటు కలిసొచ్చిన ఈ భావన కష్టజీవులకు ఒరగబెట్టేది ఏంలేదు. పాలకవర్గాల చేతుల్లో అధికారం కేంద్రీకృతం అయ్యే కొద్ది ప్రపంచవ్యాప్తంగా కష్టజీవులలో, బడుగు దేశాల మధ్యనా అంతర్జాతీయ సంఘీభావం బలపడుతుంది. ఈ దేశంలోని కార్మికవర్గం దేశదేశాల కార్మికవర్గంతో సోదరభావం పెంపొందించుకుంటుంది. ఈ సంఘీభావం బలపడిన కొద్దీ పరాయి దేశాల దురాక్రమణ గురించి కార్మిక వర్గం భీతిల్లడం మానేస్తుంది. కార్మికవర్గానికి బలమైన విశ్వాసాన్ని ఇస్తుంది. ఇప్పటిదాకా అయ్యింది చాలు ఇక మీదట ఆ చావేదో నువ్వే చావు, ఆ యుద్ధమేదో నువ్వే చేసుకో అని కార్మికవర్గం యజమానులను గదమాయించే బలాన్ని ఇస్తుంది.

కార్మికవర్గంలో అంతర్జాతీయ సంఘీభావం బలపడిన కొద్ది సైనికులలో కూడా చైతన్యం చిగురు తొడుగుతుంది. ఎంతయినా వాళ్లు కూడా కార్మిక వర్గానికి ఏకరక్త బంధువులేకదా. ఇదేదో అత్యాశ అనుకోకండి. గత చరిత్రను తెరచి చూస్తే మనకు అలాంటి ఘట్టాలు కనబడతాయి. 1871లో జరిగిన 'పారిస్ కమ్యూన్' తిరుగుబాటు మనకు ఇలాంటి అనుభవం అందించింది. సైన్యం తిరుగుబాటు కార్మిక వర్గంమీద తుపాకులు బారు చెయ్యడానికి నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

అణగారిన ప్రజానీకం అంతా ఏదో ఒక రోజు అంతర్జాతీయ పీడకుల పీచమణచడం తథ్యం. 'దేశభక్తి' అనే అబద్ధాన్ని మనం నమ్మడం మానేసింది మొదలు జాతి మతాలు, దేశాల సరిహద్దులతో నిమిత్తం లేకుండా సార్వజనీన, సమభావన సౌభ్రాతృత్వం మన మనస్సుల్లో నిండారా ఉప్పొంగుతాయి. స్వేచ్ఛా సమాజానికి పునాది రాళ్ళు, అంతర్జాతీయ దోపిడిరాయుళ్ళకు సమాధిరాళ్ళు అవే అవే.

# III

# మొదటి ప్రపంచ యుద్ధానికి నిరసన

## యుద్ధాన్ని ప్రతిఘటించండి (జనవరి 5, 1916)

## - హెలెన్ కెల్లర్

నాకు హితులు, సన్నిహితులు అనుకునేవాళ్లు పత్రికా సంపాదకులు, ఇతరత్రా పెద్ద మనుషులు చాలా మంది నా మీద జాలి కురిపిస్తున్నారు. నేను పనికి మాలిన వాళ్ల చేతుల్లో 'మైకు'గా మారి అనవసర కారణాలతో వాళ్ళకు ప్రచార బాకాగా తయ్యారయ్యానని ఈ పెద్ద మనుషులంతా ఊహించుకుంటున్నారు. అందుకే ముందుగా అలాంటి వాళ్ళందరికీ నా విజ్ఞప్తి. దయచేసి అర్థం చేసుకొండి. నాకు మీ సానుభూతి అక్కర్లేదు. నేను ఏ రోటి దగ్గర ఆ పాట పాడలేను. నేను ఏం మాట్లాడుతున్నానో నాకు పూర్తిగా తెలిసే మాట్లాడుతున్నాను. నాకు అందుతున్న సమాచారం అంతా విశ్వసనీయవర్గాల నుంచే అందుతుంది. విశ్వసనీయవర్గాలు మీ ఒక్కరి సొత్తని భావించకండి. ఇంగ్లాండ్ నుండి, ఫ్రాన్స్, జర్మనీ ఆస్ట్రియాల నుండి నాకు పేపర్లు, మ్యాగజైన్‌లు అందుతున్నాయి. వాటిని నేను చదివి అర్థం చేసుకోగలిగేంత తెలివితేటలు నాకు ఉన్నాయి. చెప్పాలంటే నేను కలిసిన చాలా మంది పత్రికా సంపాదకులు ఈ మాత్రం పనికూడా చెయ్యలేరని నాకు తెలుసు. ఫ్రెంచి, జర్మన్ భాషలు అర్థం చేసుకోవడానికి వాళ్ళకు దుబాసీలు కావాలి. వాళ్ళను అగౌరవపరచడానికి నేనీ విషయం చెప్పట్లా – నేను అలాంటి దుస్థితిలో లేనని తెలియచేస్తున్నా. ఆ మహానుభావులు నాకన్నా గొప్పగా కష్టపడతా ఉండొచ్చు. కాని వారిలో చాలా మంది దారితప్పిన మేధావులు అని నే ఘంటాపథంగా చెప్పగలను. నిజమే మీరు కాల్చే సిగరెట్ కొసన బూది కింద ఉన్న నిప్పును నే చూడలేకపోవచ్చు. మీరు మాత్రం తక్కువ తిన్నారా చీకట్లో సూదిలో దారం ఎక్కించగలరు. పెద్దమనుషుల్లారా నా నోట అశుభం పలికించవద్దు నేను మిమ్మల్ని నాక్కాస్త 'ఫేవర్' చెయ్యమని అడగడంలేదే. గౌరవాలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవాల్సినవని సవినయంగా గుర్తు చేస్తున్నా అంతే. నేను తెలిసే యుద్ధానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలోకి, మనం బతుకుతున్న దుర్మార్గపు ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా యుద్ధం చెయ్యడానికి రంగంలో కాలు మోపాను. ఇక చావో, రేవో తేల్చుకుంటాను. నేను మిమ్మల్ని ఎవ్వరినీ తలదాచుకోను చోటిమ్మని అడగడంలా.

ప్రపంచ భవిష్యత్తు ఇవాళ అమెరికా చేతుల్లో ఉంది. అలాంటి అమెరికా భవిష్యత్తు 8 కోట్ల మంది కార్మికవర్గ సోదరీ సోదరీమణుల చేతుల్లో ఉంది. ఇవాళ దేశం యావత్తు మునుపెన్నడూ కనీవినీ ఎరుగనంత సంక్షోభంలో చిక్కుకుని ఉంది. కార్మిక శ్రేణుల స్వేదరక్తాల నుండి లాభాలు పోగేసుకుంటున్న పెట్టుబడిదారులు తమ వర్గ ప్రయోజనాలను ఈడేర్చుకోవడం కోసం అదే కార్మికవర్గాన్ని సైన్యంలోకి యుద్ధంలోకి లాగాలని చూస్తుంది. ఇప్పటికే అలవిమాలిన సైన్యాన్ని, యుద్ధనౌకలను భారంగా మోస్తున్న మీరు దయతో వీళ్ళ భారాన్ని కూడా మోయడానికి సిద్ధపడ్డారని చెబుతున్నారు. అందుకే మీకీ విషయం చెబుతున్నా ప్రయాసపడి భారం మొయ్యకండి, కల్తీ భారాలు తలకెత్తుకోకండి. ఉన్న భారం కాస్తయినా దింపుకోండి కొంత సైన్యాన్ని ఆయుధాలను వదిలించుకోండి. వీలయితే మీరు మోజుపడి మోస్తున్న లిమోసిన్ కార్లు, ఆవిరి పడవలు, దేశవాళీ ఎస్టేట్ల భారాన్ని కూడా వదిలించుకోండి. దీనికి మీరు నొప్పులు తియ్యనక్కర్లా. అనవసరంగా మౌనంగా గౌరవంగా మీరు సృష్టిస్తున్న యుద్ధాలను నిలుపుదల చెయ్యండి. ఈ యుద్ధాలకు కారణభూతమైన స్వార్థపూరిత దోపిడి సామాజిక వ్యవస్థను కూలదోయండి. పాపభారం వదిలించుకోండి. నిటారుగా నిలబడి రెండు చేతులూ జోడించి ఆగామి విప్లవానికి స్వాగతం పలకండి.

ఈ దేశ రక్షణ బాధ్యతలు మేం మా తలకు ఎత్తుకోదల్చలేదు. మన సెనెటర్ (అగస్టస్) గార్డెనర్ చెప్పినట్లు మేం నిస్సహాయులం అయితే అవుగాక, మేం బతుకుతున్న ఈ అమెరికాను దురాక్రమించే పరాక్రమ శత్రువులు ఎవరూ లేరు. మీరు చెప్తున్నారే జర్మనీ, జపాన్‌లు మనమీద దాడి చేస్తాయని అదంతా ఒట్టి బూటకం. ఐరోపా యుద్ధం తరువాత జర్మనీ శక్తి అంతా తన ఇంటిని చక్కదిద్దుకోవడానికే సరిపోకుండా ఉంది. ఇంకొన్ని తరాలవరకూ అది ఆ పన్లోనే ఉంటుంది. అట్లాంటిక్ మధ్యధరా సముద్రాలు మీద సంపూర్ణ ఆధిపత్యం ఉన్నప్పటికీ సంకీర్ణసేనలు 'గల్లీవోలి'లో టర్కీవారిని ఓడించడానికి తగినంత సైన్యం నేల మీద కాలు మోపడంలో ఘోరంగా విఫలమయ్యింది. అలాగే బల్గేరియా సేనలు సెర్బియాను దురాక్రమించడానికి దండెత్తితే సలోనికా దగ్గర వారిని నిలవరించ లేకపోయింది. సముద్రజలాల మీదుగా అమెరికా జైత్రయాత్ర కొనసాగించగలదని, అమెరికన్ నౌకాదళం అప్రతిహతంగా సాగిపోగలదని కేవలం అజ్ఞానులు మాత్రమే విశ్వసించగలరు.

కాని ఇవాళ అమెరికాలో ఎక్కడబట్టినా విదేశీ దురాక్రమణ బూచి భయంతో మనల్ని మనం సాయుధం చేసుకోవాలనే వాదన వినబడుతుంది. ఇదంతా చూస్తుంటే. నాకు ఓ పిట్టకథ జ్ఞాపకం వస్తుంది. వెనుకటికి ఒక రోజున ఒక పెద్ద మనిషికి గుర్రపునాడా దొరికిందట. అది చూసి ఆ పెద్దమనిషి పొరుగింటి అతను ఏడుపులు, మొత్తుకోళ్ళు లంకించుకున్నాట. ఎందుకయ్యా అలా లొల్లి పెడుతున్నావూ అని అడిగితే ఇంకేముందీ ఇవాళ ఆ పెద్ద మనిషికి గుర్రపు నాడా దొరికింది. రేపో మాపో గుర్రమూ దొరుకుతుంది. మా పోరగాడు దాన్ని చూడాలనే

ఉబలాటంతో పోయి దాని దగ్గర నిలబడితే, అది ఫెడీల్మని ఆ నాడా కాళ్లతో నా పిల్లాడ్ని ఓ తోపు తన్నడం ఖాయం నా పిల్లాడు హరీ మనడం ఖాయం – నాకు కడుపు కోత తెచ్చిపెట్టే ఆ నాడా ఆ పెద్దమనిషి దగ్గర ఉండకూడదంటే ఉండకూడదు' అని లాజిక్కులు తీసింది కాక పోయి కొట్లాట పెట్టుకున్నాడట ఆ పెద్దమనిషి. చిలికి చిలికి గాలివానయి ఇరుకుటుంబాల వాళ్లు ఒకళ్ళనొకళ్ళు చావుబాదుకున్నారట. అట్లానే ఇంతకు ముందు జరిగిన యుద్ధంలో మనం ఫసిఫిక్ మహాసముద్రంలో కొన్ని దీవులు చేజిక్కించుకుని అక్కడ పాగావేసాం. ఇప్పుడు ఆ దీవుల గురించి మనకూ జపాన్‌కు మధ్యన లడాయి మొదలయింది. లేనిపోని యుద్ధం పీకల మీదకు తెచ్చుకోవడం కంటే ఇంతకు ముందు మనవి కాని ఆ దీవుల్ని వాటి మానాన వాటిని వదిలేద్దును నేనయితే. మీరైనా అదే కదా చేస్తారూ...

కాని మన సర్కారు వారు మాత్రం ససేమిరా అంటున్నారు. ఇక్కడ ఈ దేశంలోని మన ప్రజల భద్రత కన్నా అమెరికన్ సట్టావ్యాపారుల పెట్టుబడికి, మెక్సికోలో దక్షిణ అమెరికాలో, చైనాలో, ఫిలిప్పీన్స్‌లో పెట్టిన పెట్టుబడులకి రక్షణ భద్రత కల్పించడానికి కింద మీదులైపోతుంది. సహజంగానే ఇలాంటి ప్రయత్నాలను ఆయుధ తయారీ సంస్థలు స్వాగతిస్తాయి.

నిన్న మొన్నటి దాకా ఈ దేశం కార్మికవర్గం మీద భారాలు మోపి వసూలు చేసి గడించిన పన్ను ఆదాయాన్ని అంతో ఇంతో సంక్షేమం కోసం వెచ్చించేవారు. ఐతే ఇవాళ అమెరికన్ కార్మిక వర్గాన్ని పీల్చి పిప్పి చేశారు. దేశంలోని ప్రకృతి వనరులన్నింటినీ ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. అయినా లాభాలు గుట్టలు గుట్టలుగా పోగడిపోయి కొత్తగా పెట్టుబడి వచ్చి చేరుతుంది.

యుద్ధాల ద్వారా ప్రజలను హతమార్చే పరిశ్రమ మూడు పువ్వులు ఆరుకాయలుగా, దినదిన ప్రవర్ధమానం అవుతుంది. తద్వారా న్యూయార్క్‌లోని బ్యాంకుల 'స్ట్రాంగ్‌రూం'లలో బంగారం గుట్టలుగా పోగడిపోతుంది. సర్కారు ఖర్చు చేస్తున్న ప్రతి డాలరు ఎవరో ఒక ప్రపంచ పౌరుడిని బానిసగా మార్చుకోనిదే, పెట్టుబడిదారీ విధానానికి అడుగులకు మడుగులు ఒత్తందే తన జన్మసార్థకం కాలేదని భావిస్తానే ఉంది. ఇలాంటి డాలర్లు ఇవాళ దక్షిణ అమెరికాలో, మెక్సికోలో, చైనాలో, ఫిలిప్పీన్స్‌లో బాగా చలామణీలో ఉన్నాయి.

న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ సిటీ బ్యాంక్ బ్యూనస్ ఎయిర్స్‌లో కొత్తగా ఒక బ్రాంచి తెరుస్తున్న రోజునే మన నావికాదళం తన పటిమ ప్రదర్శించడానికి బ్యూనస్‌ఎయిర్స్ చేరుకోవడం యాదృచ్ఛికం కాదు. పి.మోర్గాన్ కంపెనీకు చెందిన ఆరుగురు బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ నావికాదళ పాటవ ఉత్సవ కమిటీలో ఉండడమూ యాధృచ్ఛిం కాదు. ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని నగర మేయరు (జాన్‌మిచెల్) అమెరికాలో ఐదొంతుల సంపదను చేజిక్కించుకున్న వెయ్యిమంది ధనాఢ్యులను 'రక్షణ కమిటీ' సభ్యులుగా ఎంపిక చేసినట్లు ప్రకటించడమూ యాదృచ్ఛికం కాదు. వీళ్ళంతా ఒకే తానులో గుడ్డముక్కలు. తమ విదేశీ పెట్టుబడులకు 'రక్షణ' కోరుకునే వాళ్ళు.

ఆధునిక ఇతిహాసంలో జరిగిన ప్రతి యుద్ధపు తల్లివేళ్ళు దోపిడీలో ఊనుకుని ఉన్నాయి. ఈ దేశంలో చెలరేగిన అంతర్యుద్ధ పరమార్థం కూడా పశ్చిమ అమెరికా పరిపాలనా పగ్గాలు ఉత్తరాది పెట్టుబడిదారులకు దక్కాలా, దక్షిణాది బానిస యజమానులకు దక్కాలా అనేది తేల్చుకోవడానికి జరిగినదే. స్పానిష్ – అమెరికా యుద్ధం పరమార్థం క్యూబా, ఫిలిప్పీన్స్ దేశాలను ఎవరు దోచుకోవాలో తేల్చుకోవడానికి జరిగినదే. దక్షిణాఫ్రికా యుద్ధం అక్కడి వజ్రాల గనులు బ్రిటిష్ వాళ్లు దోచుకోవడానికి జరిగినదే. రష్యా – జపాన్‌ల మధ్య జరిగిన యుద్ధం తరువాత కొరియాను జపాన్ దోచుకోవడానికి నిర్ణయమయిపోయింది. ఇప్పుడు జరుగుతున్న యుద్ధం – బాల్కన్, టర్కీ, పర్షియా, ఈజిప్టు, ఇండియా, చైనా, ఆఫ్రికాలను ఎవరు దోచుకోవాలో నిర్ణయించుకోవడానికే. మన కత్తులను రక్త పంకిలం చేసుకుంటే విజేతలు పాపాలు మనకు మూటగట్టి లాభాలు వాళ్లు పోగేసుకుంటారు. అందుకే కార్మికులు ఈ పాపం మూటగట్టుకోదల్చుకోలేదు.

(మొదటి) ప్రపంచ యుద్ధ ప్రచారకర్తలకు ఇంకో లక్ష్యం కూడా ఉంది. అతి ముఖ్యమైన లక్ష్యం అది. ప్రజలు తమ దుస్థితికి కారణాలు ఏమిటా అని లోతుగా ఆలోచించకుండా ఉండాలంటే వాళ్ళ దృష్టిని ఇతరేతర సమస్యల మీదకి మళ్ళించడం పాలక వర్గాలకు అత్యావశ్యకం. ధరలు చూస్తే మండిపోతున్నాయి. జీతాలు అస్తుబిస్తుగా ఉన్నాయి. నిరుద్యోగం ప్రబలిపోతుంది. రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసినా కనీస అవసరాలు తీరడం లేదు. జీవితంలో ఆనందం జాడలే కానరావడం లేదు. ఈ సమస్యలకు మూలాలు ఏమిటో ప్రజానీకం ఆలోచించే అవకాశం లేకుండా, వారి దృష్టిని పక్కదారి పట్టించడం పాలక వర్గాల లక్ష్యం.

ఉండి వుండి యుద్ధం రాబోతుందనే వదంతులు బలంగా ప్రజలు విశ్వసించేలా ప్రచారం పెట్టడం ఒక ఒరవడిగా మారింది. ఒకసారి లూసిటానియా దగ్గర యుద్ధం అంచుకు చేరుకున్నామనీ, ఇంకోసారి గల్ఫ్‌లో యుద్ధ విమానాలు ఎగిసాయనీ, మరోసారి పర్షియా జలసంధి దురాక్రమణదారుల చేతుల్లో 'చిక్కి' పోతుందనీ... ఇలా రకరకాల ప్రచారాలతో కార్మికవర్గంలో ఉద్వేగాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. కానీ ఈ ఓడ మునకల వదంతులు, యుద్ధ సన్నాహాలు, సమర నినాదాల పట్ల కార్మికవర్గం ఏమాత్రం స్పందించలేదు. అట్లాంటిక్ మహాసముద్రంలో, మధ్యధరా సముద్రంలో కనిపించిన నౌకనల్లా జర్మన్‌లు ముంచేసినా కార్మికవర్గం ఈ యుద్ధంలో తాము కాలిడడానికి రవ్వంత కారణం కూడా లేదని గ్రహించింది.

పాలకవర్గాలు యుద్ధానికి సకల సన్నాహాలు చేస్తున్నాయి. కార్మికవర్గం నిరసనను, ఆరోపణలను సరకు చెయ్యకుండా అధికార దర్పంతో విజ్ఞప్తి లాంటి శాసన ప్రకటన చేస్తుంది.

"స్నేహితులారా, నా సహ కార్మిక సోదరులారా, దేశ భక్తులారా మీ దేశం ఇవాళ అత్యంత క్లిష్ట ప్రమాదంలో పడింది. అన్నివైపుల నుండి శత్రువులు మోహరించారు. మనకు శత్రువులకు మధ్య అడ్డంగా ఉన్నది ఫసిఫిక్ – అట్లాంటిక్ మహా సముద్రాలు మాత్రమే.

చూడండి – బెల్జియం దేశానికి ఎలాంటి శని దాపురించిందో, స్టెరియాకు ఎలాంటి దుర్గతి పట్టిందో! ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో, మీ దేశం, మీ స్వేచ్ఛా స్వతంత్రాలు ప్రమాదంలో పడిన ఇటువంటి సందర్భాల్లో మీ జీతభత్యాల గురించి సణిగే వాళ్ళను గురించి ఏమనుకోవాలో మీరే ఆలోచించండి. తూర్పు నదిని జయించుకుని జర్మనీ సైన్యం మీ మీద విరుచుకుపడితే అప్పుడు ఎదుర్కోవాల్సిన దురవస్థల ముందు మిగతా అన్ని సమస్యలూ బలాదూరే కదా ఆలోచించండి, ఆలసించకండి. అలక్ష్యం చెయ్యకండి, బద్ధకం వదిలించుకోండి. మీ జెండాను, మీ ఈ దేశాన్ని రక్షించుకోవడానికి సన్నద్ధంకండి. ఒక్కొక్కరు ఒక్కో సైన్యంగా మారండి. ఒక్కో యుద్ధ నౌకగా మారండి, దురాక్రమణలకు బుద్ధిచెప్పండి. మాతృభూమికి విధేయంగా ఉండే సర్వ స్వతంత్ర అమెరికన్‌లం అని 'నిరూపించుకోండి'.

కార్మికవర్గం పాలకవర్గాలు పన్నిన ఈ ఉచ్చులో చిక్కుకుంటుందా? మరోసారి వారి కళ్ళలో మన్నుపడనుందా? అదే జరగనుందేమో అనేదే నా భయమల్లా – ప్రజలు ఇలాంటి భావోద్వేగ ప్రచారాలకు ఇట్టే స్పందిస్తారు. లేకుంటే ఇతరులు తన దేశభక్తిని శంకిస్తారేమోననే అనుమానం. నిజానికి కార్మికవర్గానికి ఉన్న శత్రువల్లా వాళ్ళ యజమానులు, పెట్టుబడిదార్లే. ఈ దేశ పౌరసత్వపు కాయితాలు ఉన్నా అవి తనకు, తన భార్యాబిడ్డల జీవితాలకు భద్రత కల్పించేవి కాదని వాళ్ళకు బాగా తెలుసు. ఏడాది పొడుగుతా, ప్రతిరోజూ, రెక్కలు ముక్కలు చేసుకుని ఒంట్లోని స్వేద రక్తాలు చిందించి పనిచేసినా తమకు దక్కింది అస్తుబిస్తు బతుకులే అని వారు బాగా ఎరుగుదురు. పొద్దుపొడిస్తే బతుకు పోరులోకి దిగాల్సిన ఈ నా కార్మికవర్గ సోదరులు – ఈ దేశం పుట్టి ఏదో మునిగిపోతుందని అమాయకంగా నమ్ముతున్నారు. ఓహ్.... చూశారా... శ్రమతో పాటు వీరి బుద్ధి కూడా ఎలా దోచుకోబడుతుందో.

పాలకవర్గాలు తెలివి మీరిపోయాయి. వాళ్ళకి కార్మికవర్గాన్ని ఎట్లా వాడుకోవాలో తెలిసిపోయింది. కార్మిక వర్గానికి ఖాకీ బట్టలు తొడిగి, తలమీద టోపి, గుండెలమీద బ్యాడ్జి, భుజాన తుపాకి తగిలించి, బ్యాండు మేళం మోగిస్తూ జెండాలు ఊపుతూ యుద్ధ రంగానికి నడవమంటే ఇంకో ఆలోచన లేకుండా ముందుకు దూకుతారని, ఇంతకాలం వాళ్ళ శ్రమని దోచుకుతింటున్న యజమానుల ప్రయోజనాల కోసమే భీకర పోరాటం చేస్తారని పాలకవర్గాలకు తెలుసు. దేశ గౌరవం నిలబెట్టడానికి అవసరమైతే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాలని కష్టజీవులకు సందర్భానుసారం నూరిపోస్తా వున్న ఫలితం ఇది. దేశ గౌరవానికి చెల్లించే మూల్యం ఏమిటి? వేలాదిమంది నవ యువకుల బలిదానాలు, జీవిత పర్యంతం అంగవైకల్యంతో బతుకులు ఈడ్వాల్సిన మరికొన్ని వేల మంది యువతరం, బ్రతుకు దుర్భరం కావడమేనా? ఇరుపక్షాలా జరిగేది ఇదే కదా?! తరతరాలుగా అభివృద్ధి చెందుతూ వచ్చిన నాగరికత విలయ విధ్వంసంగా మారిపోవడమేనా? అది ఎలాంటి దేశం కోసం? నువ్వు బతికినన్నాళ్ళూ ఆరాంగా రెండుపూటలా ఇంత తిండి పెట్టలేని దేశం కోసం, నువ్వూ, నీ భార్యాబిడ్డలు వెచ్చగా తలదాచుకోను ఇంతగూడు కల్పించలేని దేశం కోసం, నీ బిడ్డలకు నాలుగు అక్షరం ముక్కలు

నేర్పించి విద్యావంతుణ్ణి చెయ్యలేని దేశం కోసమేనా? కార్మికవర్గం మరీ ఇంత స్వార్థరహిత ప్రజానీకంగా ఎలా మనగలుగుతుంది? ఇక స్వేచ్ఛ గురించి మాట్లాడతారా? ఎవరికి ఉంది స్వేచ్ఛ? ప్రతిరోజూ పది నుండి పన్నెండు గంటలపాటు శ్రమ చెయ్యాల్సిరావడం స్వేచ్ఛా? ఒంట్లో నలతగా ఉండి మంచానపడితే ఇంట్లో పొయ్యిలోంచి పిల్లి లేవకపోవడం స్వేచ్ఛా? పిల్లలు కాస్త చేతికి రాగానే తనతోపాటే గనిలోకి, పనిలోకి, కార్ఖానాలోకి తోలుకుపోవడం స్వేచ్ఛా? ఇంట్లో ఆడకూతుళ్ళు దారిద్ర్యంతో నిండా బట్టకప్పుకోలేని సిగ్గరితనం స్వేచ్ఛా? జీవితంలో ఎక్కడా దొరకని ఏ స్వేచ్ఛ కోసం కార్మికవర్గం తన ప్రాణాలు తీసుకోవాలి. ఈ యుద్ధంలో నలుగురు ఒకచోట గుమికూడలేని స్వేచ్ఛ, పనిలో కూడా జట్టు కట్టనివ్వని స్వేచ్ఛ, పదిమంది కూడితే ఎక్కడ జీతాలు పెంచమని అడుగుతారో, సమ్మెకు దిగుతారో అని పని ప్రదేశాన్నే బందిఖానాగా మార్చిన స్వేచ్ఛ? – ఎవడికి కావాలి ఈ స్వేచ్ఛ?

కష్టజీవుల ప్రయోజనాలే పరమార్థంగా చట్టాలన్నీ తిరగరాయబడినప్పుడే కార్మికవర్గానికి అసలైన స్వేచ్ఛ లభించినట్లు. బ్యాలెట్ పేపర్లు కష్టజీవులకు వేతన బానిసత్వం నుండి విముక్తి కల్పించలేవు. ప్రపంచంలో ఎక్కడా ఈ రోజు వరకు అసలు సిసలు ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏలిన దాఖలాలేదు. ఈ ప్రజాస్వామ్యం కేవలం కలవాళ్ళ జాతర. మానవజాతి పుట్టి బుద్ధిఎరిగిన నాటి నుండి అధికారం, సైన్యం, డబ్బు, దర్పం ఉన్నవాడి చుట్టూ చేరి 'జీ హుకుం' అని సలాం కొట్టడానికి అలవాటుపడింది. ఏ యుద్ధాన్ని తరిచి చూసినా మీకు ఒక వాస్తవం కనబడుతుంది. ఒకపక్కన యుద్ధంలో స్వజనం శవాలై గుట్టలుగుట్టలుగా పడిఉన్నా మరో పక్కన పాలకులు కష్టజీవులతో రెక్కలుముక్కలయ్యేలా పనిచేయిస్తానే ఉన్నారు. భూములు దున్నించారు, గనుల్లో దించారు, చచ్చినవాళ్ళ వంతు పని కూడా బతికిన జనంతో చేయించారు. భవంతులు, అగడ్తలు, పిరమిడ్లు, గుళ్ళు గోపురాలు, చర్చీలు కట్టించారు. పొరబాటున కూడా ఈ మందిరాల్లో, మసీదుల్లో, చర్చీల్లో స్వేచ్ఛా ప్రతిమను ప్రతిష్టించలేదు.

నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ కార్మికుల ఇక్కట్లు మరింత పెరిగాయి. వాళ్ళు మరింతగా యంత్ర బానిసలుగా మారారు. అడుగడుగునా గండాలు ఎదురయినా రైలు మార్గాలు నిర్మిస్తున్నారు. రోడ్లు వేస్తున్నారు. ఆకాశహర్మ్యాలు, ఓడరేవులు నిర్మిస్తున్నారు. సరుకులు జారవేస్తున్నారు. పరిశ్రమలు కడుతున్నారు. నానా రకాల ఉత్పత్తి చేస్తున్నారు. పంటలు పండిస్తున్నారు. నీళ్లు పారిస్తున్నారు. కాని వాళ్ళ జీవితాలను వాళ్ళు హృద్యంగా సుందరంగా, ఆనందంగా తీర్చిదిద్దుకోలేకపోతున్నారు. గొప్ప నాగరికతను నిర్మించినదానికి గాను వీళ్ళకు దక్కింది ఏమిటి? నాలుగు జీతం రాళ్ళు, అదీ లేకపోతే ఇంటెడు దరిద్రం, ఠంచనుగా కట్టాల్సిన పన్నులు, జాతి నిర్మాతలకు అర్పించాల్సిన నివాళులు, పిలవగానే పోయి చేసి రావాల్సిన యుద్ధాలు. అందుకే కార్మికులు, కష్టజీవులు తమ జీవితాలని సమూలంగా, మౌలికంగా, మార్చివేసుకునేందుకు తయారుకావాలి. ఈ ప్రభుత్వాలో, ఈ 'దేశ భక్తులో ఏనాడూ అలాంటి ప్రయత్నాలు చెయ్యలేదు, చెయ్యవు కూడా. పేదల మురికివాడల నుండి మెరికల్లాంటి సైనికులను

తయారు చేసుకోలేమని గ్రహించే జర్మన్లు మురికివాడలను నిర్మూలించడానికి ముందుగా పూనుకున్నారు. కనీసమైన, నాగరికమైన జీవన విధానం ప్రతిమనిషికీ అవసరంగా భావించారు. తిండి, బట్ట, తలదాచుకొను ఇల్లు విద్యా, వైద్యం వంటి కనీస వసతులు కల్పించడం మీద శ్రద్ధపెట్టారు. మానవాళి మంచి కోసం చెయ్యదగిన దానిలో ఇదో పదోవంతు మాత్రమే కావచ్చు. అయితే ఈ మాత్రం మేలు తలపెట్టడానికి సిద్ధపడడమే యావత్ జర్మనీ దేశానికి సరికొత్త జవజీవాల్ని అందించింది. దాదాపు పద్దెనిమిది నెలలపాటు ఏ శత్రు సైన్యమూ జర్మనీకేసి కన్నెత్తి చూసే సాహసం చెయ్యనీకుండా నిలవరించింది. జర్మన్ సైన్యం – మంచికో, చెడుకో – ఇవాళ ఉత్తుంగ తరంగంలా ముందుకు ఉరకడానికి సిద్ధంగా ఉంది. మరి మన సర్కారుకి ఏ మాయరోగం వచ్చింది. ఈ మాత్రపు కనీస సంస్కరణలు అమలు చెయ్యకుండా మిన్నకుండిపోయింది? ప్రభుత్వం మెడలు వంచి మరీ ఈ పనులన్నీ చేయించాలి. ఇవన్నీ ప్రభుత్వం వల్ల అయ్యే పనులేనా అన్న చర్చకు ఇంకో తావు లేదు ఇప్పుడు. యుద్ధ మేఘాలు కమ్ముకొచ్చినా దిక్కూదివాణం లేని కొన్ని ప్రభుత్వాలే ఈ పనులు చెయ్యగలిగినప్పుడు మన ప్రభుత్వం ఎందుకు చెయ్యలేదు? అస్తుబిస్తు ప్రభుత్వాలే మొత్తం పరిశ్రమలనన్నింటినీ సర్కారు యాజమాన్యంలో ప్రైవేటు యాజమాన్యాల కన్నా మెరుగ్గా నిర్వహించాయి. మన ప్రభుత్వం ఆ పని ఎందుకు చెయ్యదు.

ఇలాంటి సంస్కరణల కోసం, ఇంతకన్నా తీవ్రమైన సంస్కరణల కోసం కార్మికవర్గం గట్టిగా పట్టుబట్టాలి. పరిశ్రమల్లో, గనుల్లో, షాపుల్లో – పనిలో పసిపిల్లలను వినియోగించకుండా నిలవరించాలి. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి. ప్రమాదాలకు, ప్రాణాంతక రోగాలకు నెలవయిన పనుల్లో అనవసరంగా కార్మికులను వినియోగించరాదని పట్టుబట్టాలి. ధూళి ధూసరాలు, పరిశ్రమల కాలుష్యం, చెత్తా చెదారాలు లేని శుభ్రమైన పరిసర ప్రాంతాలు కావాలని డిమాండు చెయ్యాలి. మెరుగైన జీతాలు చెల్లించడం, పరిశ్రమల బాధ్యతగా గుర్తింపచెయ్యాలి. ప్రతి పేటలో, ప్రతిఊళ్ళో, ప్రతి పట్టణంలో యావత్ దేశంలో ఈ సౌకర్యాలను కల్పించాలని కార్మికవర్గం పెద్ద ఎత్తున కదిలి సాధించుకోవాలి. పరిపూర్ణమైన, గౌరవప్రదమైన, ఆనందాయకమైన కుటుంబ జీవితాన్ని గడపడం ప్రతి మానవుడి ప్రాథమిక హక్కుగా ఈ ప్రభుత్వాలు గుర్తించేలా ఒత్తిడి తీసుకురావాలి.

శాంతికి విఘాతం కలిగించి, యుద్ధాలను ఎగదోసే అన్ని చట్టాలను, ప్రభుత్వ అంగాలను తిరస్కరించేందుకు సన్నద్ధంకండి. యుద్ధాలకు వ్యతిరేకంగా ఉద్యమించండి. మనం పాల్గొనందే యుద్ధాలే లేవు. బాంబులు, ట్యాంకర్లు, తుపాకులు గుళ్ళు ఇతరత్రా మానవ విధ్వంసక ఆయుధాల తయారీని తిరస్కరించండి. యుద్ధోన్మాదుల కదన కుతూహల రాగాలను ఆదిలోనే తుంచివేయండి. మౌనంగా ఉండబాకండి. మానవ వినాశనానికి దారితీసే సైన్యానికి విధేయులైన బానిసలుగా మారకండి. జాతి పునర్నిర్మాణానికి అంకితమయిన కార్మిక వర్గ సైన్యంలో చేరి ధీరోదాత్త నాయకులు కండి.

**(జాన్‌రీడ్ అమెరికాలోని ఓరెగావ్ జిల్లాలోని 'పోర్ట్‌లాండ్ వాసి. 1917 అక్టోబరు నెలలో సంభవించిన రష్యా విప్లవానికి ప్రత్యక్ష సాక్షి. అతివాద భావజాలంతో పనిచేసిన విలేకరి 'ప్రపంచాన్ని కుదిపివేసిన ఆ పది రోజులు' పేరిట రష్యా కమ్యూనిస్టు విప్లవాన్ని గ్రంథస్తం చేశాడు. మొదటి ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాద దాహంతో చోటుచేసుకున్న యుద్ధం అని సోదాహరణంగా వివరిస్తూ అనేక వ్యాసాలు వెలువరించాడు. "యుద్ధమంటే వికృతమైన సామూహిక ఉన్మత్తత. నిజాలు చెప్పేవాళ్లను శిలువ వేస్తుంది. కళాకారుల గొంతు నులుముతుంది. సంస్కరణలు, విప్లవాలను సామాజిక చోదక శక్తులయిన కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టిస్తుంది". అని ముక్కుసూటిగా అభివర్ణించాడు.)**

## ఎవరి యుద్ధం ఇది? - జాన్‌రీడ్ (ఏప్రియల్, 1917)

ఈ వ్యాసం అచ్చులో మీ ముందుకు వచ్చేసరికే అమెరికా యుద్ధంలో అడుగిడి ఉండొచ్చు. వాల్‌స్ట్రీట్ భవనం మీద అమెరికా జెండా గాలులకు రెపరెపలాడుతూ ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజిలో గుమికూడిన బ్రోకర్లు 'వందనం, మాతృభూమికి వందనం' అంటూ దేశభక్తి గీతాన్ని పాడుతూ, చెక్కిళ్ళు మీద కన్నీరు కారుస్తూ ఉంటారు. ఈ తంతు కావడంతోటే స్టాక్ మార్కెట్లు ఉవ్వెత్తున పైకి పుంజుకుంటాయి.

నాటకాల థియేటర్లలో దేశభక్తి మాదిరే 'బ్యాలే'లు నిర్విరామంగా ప్రదర్శింపబడుతుంటాయి. మధ్యమధ్యన జాతీయగీతాలాపన, జాతీయ జెండారెపరెపలు అబ్రహంలింకన్ చిత్రపట ప్రదర్శనలు షరా మామూలే. టికెట్టు కొనుక్కొని మరీ ప్రదర్శన చూసిన పట్టణ రాయుళ్ళు పెద్ద మనుషులు ఒక రకమైన పూనకంతో ఊగిపోతారు. బడా బ్యాంకులకు అధిపతులయిన వారి భార్యమణులు గాయపడే సైనికుల సేవార్థం బ్యాండేజీలు చుడుతూ ఉంటారు. అచ్చం యూరప్‌లో మాదిరే యుద్ధ క్షేత్రంలో ఆసుపత్రి నిర్వహణకు మిలియన్ డాలర్ల నిధుల సేకరణ మొదలయ్యింది. బోస్టన్ బడ్జెట్ ఏమో దేశంలో ప్రభుత్వసాయం అందుకునే కన్నెపిల్లల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది అని ప్రకటిస్తుంది. బ్రిటిష్, ఫ్రెంచి, బెల్జియంల సహకారంతో ఏర్పాటు చేసిన శాశ్వత అంధత్వ సహాయకనిధి బోర్డులోకి అమెరికా పేరుకూడా వచ్చి చేరుతుంది. అక్విడెట్లను బ్రిడ్జీలను కాపలాకాస్తున్న మన యువ సైనికులు వేగుల తప్పుడు సమాచారం కారణంగా ఒకళ్ళ మీద ఒకళ్ళు కాల్పులు జరుపుకుంటారు.

'యుద్ధ వధువులు' 'బెర్లిన్ మీదకు విరుచుకుపడండి' అనే పదాలు విరివిగా చలామణీలోకి వస్తాయి. యుద్ధం అంటే ఏంటో నేనెరుగుదును. అనేక దేశాల సైన్యంతో ఒక్క దేశం మినహా నే గడిపాను. సైనికులు చనిపోవడం నే కళ్ళారా చూశాను. కొందరు పిచ్చి వాళ్ళయిపోవడం, ఇంకొందరు ఆస్పత్రుల పాలయి ప్రత్యక్ష నరకం అనుభవించడం నా కళ్ళారా చూశాను. యుద్ధమంటే వికృతమైన సామూహిక ఉన్మత్తత. నిజాలు చెప్పేవాళ్ళను శిలువ వేస్తుంది. కళాకారుల గొంతు నులుముతుంది. సంస్కరణలు, విప్లవాలను, సామాజిక చోదక

శక్తులయిన కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టిస్తుంది. ఇవాళ ఇక్కడ అమెరికాలోనే చూడండి యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్న ప్రజానీకం మీద 'విశ్వాస ఘాతుకులు' ద్రోహులు' అన్న ముద్ర వేస్తున్నారు. వాక్ స్వాతంత్ర్యం గురించి మాట్లాడితే 'ప్రమాదభరితమైన పిచ్చి' తలకెక్కిన వాళ్ళు అని ఆరోపణలు చేస్తున్నారు. జర్మనీ నుండి వెలువడే 'అమెరికన్ న్యూస్' రేడియో సమాచారం అందకుండ మన నావికాదళాధికారులు సెన్సార్ విధించడం ద్వారా జర్మనీకు గట్టి 'షాక్' ఇచ్చారు. ఇదంతా ఇంగ్లాండ్ పనుపున మనం తలకెత్తుకున్న వ్యవహారం. పరిస్థితులను కావాలని ముదురు పాకాన పడేలా చేశారు. ఇవాళ వార్త పత్రికారంగం 'యుద్ధం యుద్ధం' అని ఊళలు వేస్తుంది. చర్చి కూడా అదే పనిలో ఉంది. లాయర్లు, స్టాక్ బ్రోకర్లు సామాజిక వేత్తలు, రాజకీయ నాయకులు వాళ్లందరిదీ ఒకటే భాష – యుద్ధం, యుద్ధం, యుద్ధం – మూడుసార్లు రద్దు చేసిన ఫ్యామిలీ రెజిమెంట్‌కు రూజ్‌వెల్ట్ మళ్ళీ ప్రాణ ప్రతిష్ట చేస్తున్నాడు.

నిజంగా యుద్ధం జరుగుతుందా లేదా, ప్రాణ – ఆస్తి నష్టాల సంగతి మాట ఎట్లా ఉన్నా ఇప్పటికే జరగాల్సిన నష్టం చాలా జరిగింది. మిలిటరీవాదులు పరిపాలన మీద పై చెయ్యి సాధించారు. నాకు తెలిసీ రెండు సామాజిక ఉద్యమాలు పని చెయ్యడం మానేశాయి. సహనం, సమాదర భావం – ఈ రెండు ఇవాళ సామాజిక వ్యవస్థలో లుప్తమైపోయాయి. విద్వేషం, ఉన్మాదం తలకెక్కిన ఈ దేశంలో రాబోయేకాలంలో 'స్వేచ్ఛా ప్రియులు' మనుగడ సాగించడం కష్టం. నేనీ మాట చెప్పడానికి ఇప్పటికే ఆలస్యం చేశానేమో అయినా నా బాధ్యతగా నిష్ఠూరమైన ఈ నిజాన్ని మీ ముందు ఉంచుతున్నాను.

ఇంతకీ ఎవరి యుద్ధం ఇది? నాదయితే కాదు. ఇవాళ కార్మికవర్గాన్ని సైన్యంలో చేరమని ఊదరగొడుతూ, ప్రలోభపెడుతున్న సంపన్న దేశ భక్తులు ఏనాడు అదే కార్మికవర్గానికి జీవన వ్యయ వేతనాలు (లివింగ్ వేజెస్) చెల్లించిన పాపాన పోలేదు. నాకు తెలిసీ ప్రశాంతంగా సమ్మెకట్టిన కార్మికులను వందలు వేలుగా ఎలాంటి నేరారోపణా, నేర నిర్ధారణ లేకుండా నెలల తరబడి జైళ్ళలో కుక్కించింది ఈ పెద్దమనుషులే. ప్రైవేటు డిటెక్టివ్‌లను గూండాలను పెట్టుకుని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులను వారి భార్య బిడ్డలను అతి కిరాతకంగా కాల్చి చంపించిందీ ఈ పెద్ద మనుషులే. ఇలాంటి దుర్మార్గాలకు ఒడిగట్టి కార్మికుల శ్రమనుదోచుకు తినే సంపన్నులు మరింత సంపన్నులు అయ్యారు. కార్మికులు మరింత నిరుపేదలు అయ్యారు. అలాంటి కార్మికులు, కష్టజీవులు యుద్ధం రావాలని కోరుకోవడం లేదు. అయితే ... వ్యాపారస్థులు పారిశ్రామిక యజమానులు ధన స్వామ్యం – వీళ్ళు యుద్ధాన్ని కోరుకుంటున్నారు. ఇంగ్లాండ్, జర్మనీలో మాదిరిగానే అబద్ధపు ప్రచారాలతో భావోద్వేగాలు రెచ్చగొట్టి మన రక్తం మరిగేలా విచక్షణ కోల్పేయేలా చేసి – వాళ్ళ స్వంత ప్రయోజనాలకోసం మనకు మనంగా యుద్ధంలోకి దిగి ప్రాణాలు అర్పించేలా చేస్తున్నారు.

అందరి మాదిరిగానే నేనుకూడా తెల్లవారగానే లేచి వార్తపత్రికలు చదువుతాను. అప్పుడప్పుడు న్యూరిపబ్లిక్ పత్రికను కూడా తిరగేస్తుంటాను. చెప్పకపోవడానికి ఏం వొచ్చే నిజంగానే మనకు అంతర్జాతీయ రాజకీయాలు అంత సులువుగా బుర్రకెక్కవనే అనుకుందాం. అయితే బుడ్డ బుడ్డ దేశాల మీద అమెరికా దాష్టీకం చెయ్యాలని మాత్రం ఎవరూ కోరుకోవడం లేదు. విదేశాలలో పెట్టుబడులు పెట్టి వేళ్ళు కాల్చుకున్న మన ఫైనాన్స్ పెట్టుబడిదారుల కొమ్ముకాయాలని ఇక్కడ ఎవరూ ఉవ్విళ్ళూరిపోవడంలేదు. చావుల... మీద బతికే రాకాసి రాబందుల పక్షాన ఎవరైనా నిలబడతారా? అంతర్జాతీయ రాజకీయాలు ఏ న్యాయసూత్రాల ఇరుసుగా నడవాలో అర్ధం చేసుకోవడానికి పెద్దగా తెలివితేటలు అక్కర్లేదు. ఏ దేశానికి ఆ దేశం తన స్వీయ అనుభవాల ఆధారంగా తనకు ఇరుగు పొరుగు దేశాలకు ఏది మంచిదో తను అర్ధం చేసుకుని ఇతరదేశాల ప్రజానీకం అర్ధం చేసుకునేదిగా విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంటారు.

మనమంతా సాదాసీదా మనుషులం. ప్రష్యా మిలటరీ దురుసుతనం మనకు ఇబ్బందిగా అనిపించవచ్చు. బెల్జియంను దురాక్రమించడం నేరమే. జర్మన్ల ఆకృత్యాలు మనల్ని భయవిహ్వలులను చేస్తాయి. ముందస్థు హెచ్చరికలేవీ చెయ్యకుండా మానవ సహిత నౌకలను జర్మన్ జలాంతరాలు నిలువునా ముంచెయ్యడం ఘోరాతి ఘోరము ఐతే ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల నుండి కూడా మనం ఇలాంటి వార్తలనే వింటున్నాంగా. యుద్ధానికి వెళ్ళి నిరాకరించిన వారిని జైళ్ళలో కుక్కడం జరిమానాలు విధించడం ప్రవాసశిక్షలు విధించడం, కాల్చి చంపడం ఏ విధమైన న్యాయం? మిత్రపక్ష సైన్యం తటస్థంగా ఉన్న గ్రీసులో కొంత భూభాగాన్ని ఆక్రమించుకోవడం అన్యాయం కాదా? ఆస్ట్రియా సెర్బియా దేశానికి ఎలాంటి హెచ్చరికలు చేసిందో ఫ్రెంచి అడ్మిరల్ కూడా గ్రీసు దేశాన్ని అదే విధంగా హెచ్చరించడం సిగ్గు చేటయిన విషయం కాదా? జర్మన్ సేనల ఆకృత్యాల కన్నా రష్యా సైన్యం గురించి వికృతమైన వార్తా కథనాలు ప్రచురించడం ఏం ప్రయోజనం ఆశించి చేస్తున్నట్లు? ఇంగ్లాండ్ మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లు అంతర్జాతీయ జలాల్లో రహస్యంగా బాంబులు అమర్చి మానవసహిత నౌకలను పేల్చి వెయ్యడాన్ని ఎలా సమర్ధించగలం? ఇంకా అనేకానేక ప్రశ్నలు మనల్ని వేధిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకి బ్రిటిష్ ద్వీపకల్పాల చుట్టూ జర్మనీ యుద్ధ భూమిగా ప్రకటించడం అంతర్జాతీయ న్యాయ సూత్రాల ఉల్లంఘున అయినప్పుడు ఇంగ్లాండ్ ఉత్తర సముద్రాన్ని అన్ని వైపులా మూసివేసి నట్లు ప్రకటించడం ఏ రకంగా చట్టబద్ధం అవుతుంది. జర్మనీకి రవాణా నౌకలు పోవడం కూడా నిషిద్ధం అని ఇంగ్లాండ్ ప్రకటించింది. కానీ మనం మాత్రం మిత్ర పక్ష దేశాలకు నౌకలను అనుమతించాలని ఒత్తిడి చేస్తుంది. ఇది ఎంతటి తలవంపుల విషయం. ఆహారం, రెడ్ క్రాస్ సంస్థ అందించే మందులు కూడా జర్మనీకి పంపకూడదని ఇంగ్లాండు మన మీద ఎలా వత్తిడి చేస్తుంది? ఏం అధికారం ఉంది దానికి మన దేశం మీద ఇలా జులుం చలాయించడానికి? మానవతా సాయాన్ని నిరాకరించే హక్కు ఇంగ్లాండుకు ఎక్కడిది? తటస్థ దేశాలతో మనం వాణిజ్యం నెరపుటకునే హక్కుని ఇంగ్లాండు ఏ అధికారంతో నియంత్రించడానికి

చూస్తుంది? ఇదే ముక్క జర్మనీ అంటే మన పాలకులు గొంతెత్తి ఎంత యాగీ చేసారు. ఇప్పుడెందుకు మిన్నకుండి పోయారు. మనవంతుగా మనం మిత్రపక్ష సైన్యానికి నౌకల కొద్దీ ఆయుధాలు రవాణా చేస్తున్నాం. ఆయా దేశాలకు భారీ రుణాలు అందజేస్తున్నాం.

మనం 'తటస్థత' పాటిస్తుంది. ఎవరి విషయంలోనో ఎవరికైనా ఇట్టే అర్థమై పోతుంది. అందుకే మన వ్యవహారం చూసి చూసి జర్మనీ చివరి హెచ్చరిక జారీ చేసింది. మనకు మనమే మనల్ని ఈ యుద్ధంలోకి ఈడ్చుకున్నాం.

మనమంతా ఉడ్రోవిల్సన్‌కు ఎందుకు ఓటేసాం? ఉన్నంతంలో కాస్త వివేకం, ముందు చూపుగల మనిషి అనేగా అధ్యక్ష పీఠం కట్టబెట్టింది. యూరప్ ఖండంలో జరిగిన యుద్ధంలోకి మనల్ని లాగనందుకు, ధనస్వామ్యం ఇతగాడిని వ్యతిరేకించాలని గట్టి పట్టుమీద ఉన్నందుకేగా మనం అతనికి అండదండగా నిలిచింది. అధ్యక్షుడిగా అతను ఇప్పుడు జర్మనీ హెచ్చరికలకు బదులు చెప్పాలి. ఐతే ఒక్క మాట మన గమనంలో ఉండాలి. నిజంగానే, నిజాయితీగానే మనం తటస్థంగా వ్యవహరించి ఉంటే జర్మనీ నుండి మనం హెచ్చరిక లేఖను అందుకునే వాళ్ళమే కాదు. ఇప్పుడు అధ్యక్షులవారు ఏం చేస్తున్నారు? మనం పూనుకుని ఆయన్ని గెలిపించినవాళ్ళం కాబట్టి యుద్ధం కావాలా వద్దా అని మనల్ని అడుగుతాడనా? అడగడు గాక అడగడు. అయినా తప్పు మనది కాదు. అలానే ఈ యుద్ధమూ మనది కాదు మనకోసం అస్సలేకాదు.

## 'యూజెనీడెబ్స్ యుద్ధ వ్యతిరేక ప్రసంగం' జూన్ 16, 1918

## (కాంటన్ - ఓషియో ప్రసంగంగా ప్రసిద్ధి)

శ్యాముల్ జాన్సన్' దేశభక్తి కన్నా హీనమైన పాపం' అన్న మాటను ఉపయోగించేటపుడు అతని దృష్టిలో మన వాల్‌స్ట్రీట్ జెంటిల్మెన్‌ల వంటి వాళ్లు ఎవరో ఉండి ఉంటారు ఖచ్చితంగా. నియంతలు, ఆధిపత్యం చెలాయించేవాళ్ళు దోపిడిదారులు వీళ్ళంతా ఎప్పుడూ దేశభక్తినో, మతాన్నో - లేక రెండింటినో సదా అడ్డం పెట్టుకుని తమ పబ్బం గడుపుకుంటూ ఉంటారు.

సోషలిస్టు పార్టీలో ఉండే వాళ్ళంతా ద్రోహులు, దేశభక్తి లేని వాళ్ళు అంటూ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తుంటారు అన్ని రకాలా దిగనాసిపోయిన వాళ్ళు ఇంతకన్నా ఏం మాట్లాడతారు? ఒక అర్థంలో వాళ్ళు చెప్పేదీ కరెక్టే ఎందుకంటే సత్యప్రమాణంగా మేం, సోషలిస్టులం ఈ దేశానికి ద్రోహం చేసే వాళ్ళ పాలిట ద్రోహులుగా, అవిధేయులుగానే మెలుగుతాం. సభ్యసమాజం యావత్తూ నిరసిస్తున్నా లెక్క చేయకుండా పసిఫిక్ తీరంలో టామ్ మూనీ, వారెన్ బిల్డింగ్స్‌ల మీద తూతూ విచారణ జరిపించి ఉరిశిక్ష వెయ్యడానికి ప్రయత్నిస్తున్న ముఠాకు అవిధేయులుగానే ఉంటాం. ద్రోహం తలపెడతాం.

కాబోయే నరహంతకులు, ధనస్వాములు ఇవాళ తమ ఒంట్లో ఉగ్గుపాలతో రంగరించిన దేశభక్తి ప్రవహిస్తుందని గప్పాలు కొడుతున్నారు. ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికే యుద్ధం చేస్తున్నాం అని తప్పబలుకుతున్నారు. ఎంత చెత్త మాట. ఈ నియంతలు ప్రజాస్వామిక ద్రోహులు. కలుగుల్లో దొంగల్లా పట్టుబడ్డ దోపిడీరాయుళ్ళు, హంతకులు దేశభక్తులుగా పోజులు పెడుతుంటే వీళ్ళకి ఎదురునిలబడి గొంతెత్తి సత్యం పలకడానికి సిద్దంగా ఉన్నవాళ్ళు దోపిడికి పీడనకు గురవుతున్న వాళ్ళ పక్షాన నిలబడి పోరాటం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు ద్రోహులు అవిధేయులూనా? అయితే అవుగాక ఇప్పుడు గన నేను ఎవరి పక్షం నిలబడతావ్ అని అడిగితే తప్పనిసరిగా నేను మీరు ముద్రవేస్తున్న ద్రోహులు, అవిధేయుల పక్షానే నిలబడతా.

మాక్స్ ఈస్ట్‌మాన్‌ను అభిశంసించారు. 'జనబాహుళ్యం' (దిమాసెస్) అని అతను రచించిన కరపత్రాన్ని తొక్కిపట్టారు. నేను రాసిన కరపత్రాలను అనేకం త్రొక్కిపట్టారు. మా గురించి ఏమని కితాబులు ఇస్తున్నారు. మేం ప్రజలను తప్పుదోవపట్టించి వాళ్ళ ఆలోచనలను విషపూరితం చేస్తామట. అక్కడికేదో ప్రజలందరూ తమ కన్నబిడ్డలయినట్లు వాళ్ళ సంరక్షణ బాధ్యత తమ భుజస్కంధాల మీద ఉన్నట్లు ప్రజలు ఏం వినాలో, ఏం చదవాలో, ఏం తెలుసుకోవాలో అన్నీ నిర్ణయించే హక్కు తమదే అయినట్లు మాట్లాడుతున్నారు. మా విషపు మంత్రాలు మీ చెవుల పడకుండా చూడడం వాళ్ళ పరమ కర్తవ్యం అట. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామిక దేశం స్వేచ్ఛకు పుట్టిల్లు లాంటిది అని చెప్పుకునే ఈ దేశంలోనే పత్రికా స్వాతంత్ర్యానికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ఎంతటి దుర్గతి పట్టించారో చూసారా మా గొంతు నొక్కడం ద్వారా అమెరికాలో ప్రభంజనంలా సాగుతున్న విప్లవ ప్రచారానికి అడ్డుకట్ట వేసామని సంబరపడిపోతున్నారల్లే ఉంది. చూసి చూసి ఎలాంటి తప్పులో కాలేసారో చూసారా వాళ్ళు. ఒక రకంగా వాళ్ళకి మేం ధన్యవాదాలు చెప్పుకోవాలి. పరోక్షంగా మా రచనలకు ఇంతటి ప్రచారం కల్పించినందుకు ఇవాళ వేలాదిమంది ప్రజానీకం మా రచనల్లో ఏం ఉందో తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రదర్శిస్తున్నారు. నిషేధించిన మా రచనలు వెలుగులోకి తీసుకురావాలని గట్టిగా పట్టుబట్టుతున్నారు. మా రచనలను నిషేధించిన వాళ్ళు సాధించింది ఏంటయ్యా అంటే మా రచనల పట్ల మరింత ఉత్సుకత రేకెత్తించారు. మాకు ఎక్కడ లేని ప్రచారం తెచ్చి పెట్టారు. ఉత్సాహంతో ఒక సారి సోషలిస్టు సాహిత్యాన్ని ఎవరన్నా చదవడం మొదలుపెట్టారా ఖాయంగా వాళ్ళు మాతో చేరిపోతారు. మాకు ఇలాంటివి వెయ్యిన్నొక్క అనుభవాలు ఉన్నాయి. మా మాట బీరుపోదు.

పాలకవర్గాలు ఎంత తెలివిమాలినవి ఎంత మూర్ఖమైనవి? మూర్ఖత్వం పుట్టు గుడ్డిది. దానికి ఎలాంటి తాత్విక దృష్టీ ఉండదు. దోపిడీరాయుళ్ళు, ఆశబోతులు తమ ముక్కు అంచును తప్ప మరేదీ చూడలేరు. వాళ్ళ కళ్ళు అలా పొరలు ఎందుకు కమ్మేసిందీ వాళ్ళకు తెలుసు, కళ్ళలోని ఆ శుక్లాలు తొలగించకుంటే సమదృష్టి మానె కనీసం మామూలు దృష్టి అన్నా

కలుగుతుందనీ వాళ్ళు ఎరుగుదురు. ఈ ప్రపంచంకంటున్న కొత్త కలల గురించి వింటున్న గుండె చప్పుళ్ళ గురించి వీళ్ళకు వీసమెత్తు తెలియదు. సాహిత్యం అంటే తెలీదు. కళలను ఆస్వాదించలేరు. హృదయంలో ఆత్మ అనేదు లేదు వీళ్ళకి. జీవిత సహజసూత్రాలను త్రోసిరాజని పరాన్నభుక్కు జీవితాలకు అలవాటు పడిన వాళ్ళందరి గతీ ఇలానే ఉంటుంది. రాక్‌ఫెల్లర్ కానీయండి వాళ్ళ అంతేవాసులు కానీయండి, నా లెక్కలో ఇలాంటి అంధులే. లాభార్తితో వాళ్ళు వేసే ప్రతీ అడుగు వాళ్ళ మొదలారడానికే దారి తీస్తుంది. సోషలిస్ట్ ఉద్యమం మీద వాళ్ళు వేసే ప్రతి దెబ్బా వాళ్ళకి అంతే బలంగా తగులుతుంది. మమ్మల్ని దెబ్బతీసిన ప్రతిసారీ వాళ్ళకు తెలియకుండానే వాళ్లు గోతిలో పడుతున్నారు. ఎక్కడా లెక్క తప్పలా ఇంతవరకు సోషలిస్టు సాహిత్యాన్ని నిషేధించిన ప్రతిసారీ ఆ భావజాలానికి మరింత విస్తృతి కల్పిస్తున్నారు. మరింత ప్రచారం తెచ్చిపెడుతున్నారు.

చరిత్ర తరచి చూస్తే ప్రతియుద్ధం వెనుకా ఇమిడి ఉన్న లక్ష్యం దురాక్రమించడం దోచుకోవడాలే. మధ్య యుగాల్లోని ఫ్యూడల్ ప్రభువులు నిర్మించుకున్న కోటభవనాలు – ఇప్పటికీ రైన్ నది వెంబడి వాటి ఆనవాళ్ళను మీరు చూడవచ్చు – వాళ్ళ దర్పానికి, అధికారానికి, సంపదకి హోదాలకు, ప్రతిష్టలకు ఆనవాళ్ళు. అయినా వాళ్ళు ఎవరికి ఉన్నదానితో వాళ్ళు తృప్తిపడలేదు. వేరొకరి, ఇంకొకరిని, మరొకరి, మరొకరిని ఇలా దోచుకుంటూ పోయి తమ సంపదని, పరువు ప్రతిష్టలను పెంచుకోవడానికి చూసినవాళ్ళే. కాని మధ్యయుగాల యుద్ధ ప్రభువులు స్వయానా యుద్ధానికి పోయేది బహు అరుదు. ఆధునిక యుద్ధ ప్రభువులు, వాల్‌స్ట్రీట్ కుబేరుల చరిత్ర మాత్రం ఇంతకన్నా భిన్నంగా ఉందా? మధ్యయుగాల ఫ్యూడల్ కుబేరులు, మన కాలపు పెట్టుబడిదారుల ముత్తాతలు యుద్ధం చేసి విజయులై తిరిగి రండి పోండి అని పిలుపు ఇవ్వగానే బానిసలు పోయి యుద్ధాలు చేసి వచ్చేవారు. ఎవరైతే తమను జీవితకాలపు బందీలుగా మార్చి జీవితాన్ని దుర్భరంగా మార్చేసారో ఆ యుద్ధ ప్రభువుల కీర్తికోసం, సంపదదాహం తీర్చడం కోసం రెండు పక్షాలా ఉన్న బానిసలు ఒకరి పీకలు మరొకరు తెగ్గోసుకునేవాళ్లు. యుద్ధ స్వభావం అది. యజమాని వర్గాలు యుద్ధానికి పిలుపులు 'మాత్రమే ఇస్తాయి, సేవకవర్గాలు యుద్ధాలు చేసి వస్తాయి. గెలుపయినా ఓటమియైనా యజమాని వర్గాలకు పోయేదేమి ఉండదు. గెలుపు కోసమయినా, ఓటమి పాలయినా పోయే ప్రాణాలు సేవక వర్గాలవి.

సేవకవర్గాల ఆలోచనా తీరును యజమాని వర్గాలు మొదటి నుంచి అలా తీర్చి దిద్దాయి. యుద్ధం చెయ్యమని వాళ్ళు పిలుపు నివ్వడమే తరువాయి దాన్ని పరమ దేశభక్తి యుత పిలుపుగా భావించి ప్రాణాలు అర్పించడం సేవకులు తమ ధర్మంగా భావించేలా తయారు చేసారు. చరిత్ర మొత్తం తిరగేసి చూసుకొండి ఎక్కడయినా సేవకవర్గాలు యుద్ధం చెయ్యమని పిలుపు నిచ్చిన దాఖలాలు ఉన్నాయేమో, లేవు ఉండవు. ఆదిమయుగం నుండి ఆధునిక యుగం దాకా ప్రజలు యుద్ధం కోరుకున్న దాఖాలాలే లేవు.

అందుకే మరొక్క మారు ఈ సత్యాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నా ఇప్పటిదాకా జరిగిన యుద్ధాల్లో పాలుపంచుకున్న కార్మికవర్గం, అశేషత్యాగాలు చేసిన కార్మికవర్గం తమ రక్తాన్ని, జీవితాలనీ పణంగా పెట్టిన కార్మికవర్గం యుద్ధానికి పిలుపునిచ్చిందీ లేదు, సంధికోరిందీ లేదు. ఏం చేసినా పాలకవర్గాలే చేసాయి. అది యుద్ధమయినా, సంధి అయినా. ఎందుకలా అని నువ్వు ప్రశ్నించడానికి లేదు. ఎదురు మాట్లాడకుండా దేశభక్తి యుతంగా చచ్చిపోవడమే నీ పని. ఇదీ పాలకవర్గాల ధోరణి. అందుకే దీన్ని మేం ప్రశ్నిస్తున్నాం. ఈ దేశ కార్మిక వర్గాన్ని జాగృతం చేస్తున్నాం. పోయే ప్రాణాలు నీవి, మీవి మనందరివీ కాబట్టి యుద్ధం కావాలో, అక్కర్లేదో మనం ఈ దేశ ప్రజలం నిర్ణయించుకుందాం సరేనా.

## రాజ్యం (1918) - రాండల్ఫ్ బౌర్నీ

యుద్ధం ప్రకటించిన మరుక్షణం ప్రజలు ఏదో ఒక అలౌకికశక్తి ఆవహించినట్లు మనసావాచా పాలకులు చెప్పే కారణాలతో ఏకీభవించేస్తారు. యుద్ధం పేరిట రాజ్యం తీసుకునే ఏ నిర్ణయాలకయినా కట్టుబడి ఉంటామనే స్వచ్ఛంద నిరభ్యంతర పత్రం రాసిచ్చేస్తారు. ఎక్కడో కొద్దిమంది తుంటరులను తప్పిస్తే ఎక్కువమంది ప్రజానీకం అప్పటిదాకా తాము ఊహించని, వేరే సందర్భాల్లో అయితే గుండుగుత్తగా తిరస్కరించే దుర్భర పరిస్థితులను చిరునవ్వుతో భరాయిస్తారు. పిలవనంపగానే సైన్యంలో చేరిపోతారు. దేన్ని నాశనం చేసి రమ్మంటే అదల్లా నాశనం చేసి వస్తారు. ఎక్కడికి దండెత్తమంటే అక్కడికల్లా దండెత్తిపోతారు. ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలు వుండవు. రాజ్యం ఏ ప్రయోజనాలను ఆశించి తమను ఈ రొంపిలోకి దించుతుంది అనే ఆలోచన ఉండదు. రాజ్యం హుందాగా నిలబడితే కత్తీ, డాలు, తుపాకి అందుకొని పూర్వకాలపు మిలిటరీ భుజకీర్తులు ధరించి అందరూ ఒక్కటిగా పెరేడ్ చేస్తారు. నరనరానా దేశభక్తి ఉప్పొంగిపోవడంతో వివేకం, విచక్షణ ఒక మూలకి ఒదిగి సర్దుకుపోతాయి.

యుద్ధం రాజ్యం నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తుంది. అప్పటిదాకా అణిచిపెట్టుకున్న దాని అసలు స్వభావం కోరలు కొమ్ములతో బయటికి వస్తుంది. శాంతి కాలంలో సైనికోన్మాదం తలకెక్కని రాజ్యం స్వచ్ఛమైన జెండాలా రెపరెపలాడుతూ వ్యవహరిస్తుంది. ఒకసారి యుద్ధం మొదలయిందా దేశ సరిహద్దుల లోపల మూర్తీభవించిన అధికారోన్మత్తగజంలా మారిపోతుంది. వాళ్ళూ వీళ్ళూ అనే తేడా లేకుండా అందరిమీదా తన జులుం ప్రదర్శిస్తుంది. పరలోక సుఖ ప్రాప్తికి అందరికీ చర్చి ఎలా ఆలంబనగా మారుతుందో అలానే యుద్ధకాలంలో రాజ్యం ఒక్కటే రాజకీయ ముక్తి ప్రసాదించే సాధనంగా మారిపోతుంది. యుద్ధ కాలంలో తప్ప ఎప్పుడూ రాజ్యం తాను రాష్ట్రాల సమాఖ్య కేంద్రాన్ని అన్నట్లు వ్యవహరించదు. యుద్ధకాలంలో మాత్రమే సమాఖ్య కేంద్ర భావన ప్రశ్నింపనలవి కాని అధికార కేంద్రంగా భాసిస్తుంది. యుద్ధకాలంలో

రాజ్యం ఒక క్రూరమృగాల గుంపుగా మారిపోతుంది. ఎదురుదాడికి కానీ ఆత్మరక్షణకు కానీ మృగత్వం వినా మరో మార్గం లేదని బలంగా నమ్ముతుంది. యుద్ధంలో వైరిపక్షానిదీ ఇదే తంతు. ఎదురుదాడికన్నా ఆత్మరక్షణ కోసం దాడి చేసే క్రమంలో రాజ్యం ఎంత మృగప్రాయంగా మారుతుందంటే తన మందలోని వారి మీద కూడా తరచూ క్రూరత్వాన్ని ప్రదర్శిస్తుంటుంది.

యుద్ధం రాజ్య ప్రయోజనాలను దేశం నలుదిశలకూ, మూలమూలకూ, అప్పటిదాకా రాజ్యం పొడసోకని మారుమూల ప్రాంతాలకు సైతం ప్రసరింపజేస్తుంది. సమాజంలోని సకల కార్యకలాపాలూ రాజ్యం యొక్క ఈ ఏకైక లక్ష్యం (యుద్ధం)వైపుకు మళ్ళించబడతాయి. యావత్ ప్రజానీకం వ్యాపకాలను, అభిప్రాయాలను ఆలోచనలను ప్రభావితం చెయ్యడంతో తిరుగులేని తీర్పరిలా రాజ్యం వ్యవహరిస్తుంది. జనానికి ఉన్న జడత్వాన్ని వదిలించేస్తుంది. భిన్నాభిప్రాయాలను తెరమరుగు చేస్తుంది. జాతి జాతి అంతా క్రమంగా, అదో రకం మైకంలో ఉన్నట్టుగా అతివేగంగా 'యుద్ధం చెయ్యడంలోనే' శాంతి ఉందనే పాలకుల లక్ష్యంవైపు ఆకర్షించబడుతుంది. 'యుద్ధం చెయ్యడంలోనే శాంతి' అనేమాట నేను అనడం లేదు. ఎల్‌పి జాక్స్ అన్నాడు.

యుద్ధం రాజ్యానికి ఆరోగ్యప్రదాయిని. జాతి యావత్తూ ఇలాంటి కష్టకాలంలో ఐక్యంగా ఉండాలనే పేరిట, ఆపత్కాలంలో సర్కారుకు సహకరించమని విజ్ఞప్తుల పేరిట మంద స్వభావానికి భిన్నంగా వ్యవహరించే వ్యక్తులను, సమూహాలను, మైనారిటీ ప్రజానీకాన్ని బెదిరించో బెల్లించో బలంతపెట్టో రాజ్యం తన దారికి తెచ్చుకుంటుంది. మాటవినని వాళ్ళ మీద రకరకాల కేసులు, రాజ ద్రోహం సహా నమోదు అవుతాయి. భారీ జరిమానాలు, శిక్షలు పడతాయి. వాళ్ళ వాణి అణిచివెయ్యబడుతుంది. ఇంత చేసినా రాజ్యం ఆశించిన పరమ విధేయత, ఏకరీతి ఐక్యత బయట చాలామంది జనం ఉండిపోతారు. పైపెచ్చు దండనీతితో ఎవరినైతే తమదారికి తెచ్చుకోవాలని రాజ్యం భావిస్తుందో వారి సంకల్పం రాజ్య నిర్బంధంతో మరింత ధృఢతరమవుతుంది. ఇలాంటి వారి మీద రాజ్యం కిరాయికి తీసుకున్న మేధావులు అవాకులూ చెవాకులూ పేలుతుంటారు. ఏది ఏమైనా సర్వసాధారణంగా యుద్ధకాలంలో రాజ్యం తాను అనుకున్న విలువలను అభిప్రాయాలను, ఆలోచనలను ప్రశ్నార్థకమైనరీతిలో ప్రజానీకం మీద రుద్దుతుంది. యుద్ధం అంటూ ఒకటి లేకపోతే రాజ్యానికి ఇంతటి శక్తి ఏనాడూ ఉండదు. రాజ్యం పట్ల విధేయత, మార్మిక ఆరాధన అతిపెద్ద కల్పిత మానవ విలువ. ఈ విలువ కోసం సృజనాత్మక కళ, విజ్ఞానం, వివేచన, సౌందర్యారాధన, మానవ జీవితం పట్ల నిండారా అనురక్తి వంటి అద్భుతమైన మానవీయ విలువలను పణంగా పెట్టేస్తారు. రాజ్యానికి కిరాయి ఏజెంట్లుగా మారిన కొందరు – ఇందులో మేధావులు, కళాకారులు కూడా ఉన్నారు – ఈ అద్భుతమైన మానవీయ విలువలను త్యాగం చెయ్యడాన్నే దేశభక్తిగా కీర్తించుకుంటూ, ఇందుకు సిద్ధపడనివారి మీద దేశ ద్రోహులని ముద్రవేసి మరీ వెంటాడి వేధించి వారిని కూడా తమదారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. అదే పనిగా పెట్టుకుంటారు వాళ్ళు.

యుద్ధం, మరీ ముఖ్యంగా ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా చెప్పుకునే దేశం చేపట్టే అధునాతన యుద్ధం రాజ్యం ఆశించే అత్యంత విద్వేషపూరిత రాజకీయాలను విస్తృతంగా చెలామణీలోకి తెస్తుంది. ప్రభుత్వం అన్నా, పాలకులు అన్నా ప్రజలు పట్టీపట్టనట్లు వ్యవహరించడానికి అవకాశం ఇయ్యదు. రాజ్యం యొక్క రాజకీయ కాయంలోని ప్రతి అణువణువూ జవజీవాలతో తొణికిసలాడి పోతుంటుంది. ఎట్టకేలకు మనకు జ్ఞానోదయం కలుగుతుంది. సమాజం అంటే సమిష్టితత్వం, ప్రతి వ్యక్తీ అ సమిష్టిలోనే తన అదృష్టాన్ని వెతుక్కోవాలని, అందుకే ఒకదేశం, ఒక జాతి యుద్ధం ముంగిట ఉందంటే ప్రతి వ్యక్తీ తానే ఒక సమూహం అయినట్లు, తానే తన దేశానికి ప్రతీక అయినట్లు భావిస్తాడు. యావత్ సమాజం తన వెన్నంటి ఉన్నట్లు, గతంలో ఎన్నడూ లేనంత శక్తిశాలి అయినట్లూ ఒక సహజాత భావానికి లోనవుతాడు. అమెరికన్ జాతిని చివరకు మతాభినివేశం కూడా ప్రజలను ఇంతటి కష్టాలకు, త్యాగాలకు పురికొల్పదు – ఆ స్థాయిలో యుద్ధం ప్రజలను కష్టనష్టాలకు సిద్ధం చేస్తుంది. సమాజ ఉమ్మడి ప్రయోజనాల కోసం సార్వజనీన విద్యావకాశాలు కల్పించమనో, ప్రకృతిని పర్యావరణాన్ని రక్షించమనో, ఇలాంటి ఏదో ఒక డిమాండు మీద మీరు ప్రజలను ఇంతగా, ఈ స్థాయిలో కదిలించలేరు. కాని యుద్ధం కోసం కేవలం 'ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం' అనే నినాదంతో ప్రజలను రాజ్యం అత్యంత గరిష్ట స్థాయిలో ప్రభావితం చేస్తుంది.

ఇహ కార్మికవర్గం విషయానికి వస్తే, మొత్తంగా కాకపోయినా కనీసం మెజారిటీ కార్మికవర్గం ఏనాడూ ఉన్నత వర్గాలతో పొంతన పెట్టుకోవడంగానీ, అనుకరించాలనిగానీ, ఆ వర్గాలకు అండగా నిలవాలనిగానీ భావించదు. అందుకని రాజ్యం సంకేతాలను కార్మికవర్గం అంతగా లెక్క చెయ్యదు. ఇంకోవిధంగా చెప్పాలంటే ఆధిపత్య వర్గాలు ప్రవచించే నినాదప్రాయపు 'దేశభక్తి' అంటే పుంజాలు తెంపుకోదు. ఎందుకంటే అధికారమూ వాళ్ళ చేతిలో ఉండదు, 'దేశ ఉన్నతి' వారికి దక్కించింది ఏమీ లేదుకనుక. అయితే యుద్ధం అనేటప్పటికీ రాజ్యం కార్మికవర్గానికి ఎక్కడాలేని పెద్దరికం ఇస్తుంది. కార్మికవర్గం కూడా ఈ 'పెద్దరికాన్ని' వదులుకోదు. గత శతాబ్దపు పారిశ్రామిక పాలనాధిపత్యం కష్టజీవులను గనిలో పనిలో కార్ఖానాలో ఎంతటి ఉక్కు క్రమశిక్షణతో శ్రమకు కట్టిపడేసిందో అలానే యుద్ధంలోకి కూడా కవాతు చేయిస్తుంది. కార్మికవర్గం అన్యమనస్కంగానే రాజ్యం తరఫున యుద్ధం చేసి వస్తుంది. పేరుకే 'వ్యక్తిగత స్వేచ్ఛ' కాని కార్మికవర్గం నిరంతరం శ్రమకు బానిసగా బతకడానికి అలవాటుపడింది. వర్గాలుగా విడిపోయి ఉన్న సమాజంలో వాళ్ళు పని చేసే ఉత్పత్తి సాధనాలకు వాళ్ళు యజమానులు కాదు. చేసే ఉత్పత్తి మీద వాళ్లకు హక్కు ఉండదు. ఉత్పత్తి పంపిణీలోనూ వాళ్ళ మాట చెలామణీ కాదు. ఎప్పుడన్నా హఠం చేసి, దబాయించి, సమ్మె కట్టి పని బందుపెడితే తాము చేసిన శ్రమకుగాను ఇంకాస్త కూలి మాత్రమే దక్కించుకునే – వేతన బానిసత్వం కార్మిక వర్గానిది. అట్లాంటి పారిశ్రామిక అజమాయిషీ బానిసత్వం నుండి మిలిటరీ అజమాయిషీ కింద బానిస యుద్ధం చెయ్యాల్సిరావడం వాళ్లకు కొత్తగా అనిపించదు. కాకపోతే ఒక్కటే తేడా – ఏ ఆధిపత్య వర్గాలయితే ఇన్నాళ్లూ తమను అణిచి ఉంచాయో, అవే వర్గాలు యుద్ధానికి సిద్ధమైన కార్మికవర్గానికి

‘జయహో’లు ‘జిందాబాద్‌లు’ కొడతాయి. ‘విజయం మనదే మనదే’ అని ఉద్రూతలూగిస్తాయి. ఒకసారి యుద్ధం ముగిసిందా ఇక కార్మిక వర్గానిది ‘పాత ప్రపంచమే’ – అదే పారిశ్రామికాధిపత్యం, అదే వేతన బానిసత్వం.

యుద్ధం అనేది బాహ్య శత్రువులనే కాదు అంతర్గత శత్రువులను కూడా వెంటాడి వేధించడానికి కలసివచ్చే సాధనం. ఇంకా చెప్పాలంటే బాహ్య శత్రువుల మీద కన్నా అంతర్గత శత్రువుల మీద విరుచుకుపడడమే రాజ్యం తన తొలి ప్రాధాన్యత గావించుకుంటుంది. ‘రాజ్యం దారికి రాకుండా’ ఉన్న తింగరి మనుషుల మీద భరింపశక్యం కాని అణిచివేతకు పూనుకుంటున్నది. దేశం యావత్తూ సన్నిపాత జ్వరం వచ్చినదానికి మల్లే కళాపెళ కాగిపోతుంటుంది. యుద్ధ వ్యతిరేకుల మీద, సోషలిస్టుల మీద, అపరిచిత శత్రువుల మీదా ప్రభుత్వం తెల్ల ఉగ్రవాదానికి తెగబడుతుంది. శత్రువుకు సహకరిస్తున్నారనే పేరిట, రాజద్రోహం అభియోగాల పేరిట వ్యక్తులను, సంస్థలను వేటాడటం మొదలవుతుంది. ప్రజాస్వామ్యం పేరిట పచ్చి ఆటవిక రాజ్యం చలామణి అవుతుంది. యుద్ధం రాజ్యానికి ఆరోగ్యప్రదాయిని అని ముందే చెప్పుకున్నాం కదా. యుద్ధం ప్రజలను బూర్జువాశక్తులను ఏకం చేస్తుంది.కడమా వారినందరినీ అంటరానివారుగా వేరు చేస్తుంది. అయితే విప్లవకర కార్మికవర్గం ఇలాంటి ఐక్యతను ఒక పట్టాన పొసగనివ్వదు. అంతర్జాతీయ కార్మికవర్గం ఎట్లానూ యుద్ధానికి చేయూతనివ్వదు. కార్మికవర్గాన్ని తనదారికి తెచ్చుకునేదానికి రాజ్యం విశ్వప్రయత్నం చేసిన కొద్దీ ఈ ప్రయత్నాలు బెడిసికొట్టి రాజ్యానికి – కార్మికవర్గానికి మధ్యన ఘర్షణ మరింత పెరుగుతుంది.

ఈ క్రమంలోనే యుద్ధం అనేది జాతి జనులకి, దేశాలకు సంబంధించినది కాదు రాజ్యానిది అని తేటతెల్లం అవుతుంది. నిజానికి రాజ్యం ప్రధాన వ్యాపకమే యుద్ధం. యుద్ధం కృత్రిమమైనది. పైపైముసుగు మాత్రమే. ఇదేదో హఠాత్తుగా బయటపడేది కాదు. మిలిటరీ యంత్రాంగం లేనిదే యుద్ధం లేదు. రాజ్యం అనేది లేకుండా మిలిటరీ యంత్రాంగం ఉండదు. ఈ రెండూ అవిభాజ్య ‘సయామీ’ కవలల వంటివి. ఒకే తల కలిగిన రెండూ శరీరాలు – రాజ్యం మిలిటరీ యంత్రాంగం. రాజ్యానికి అనువంశికంగా సంప్రాప్తించినదే మిలిటరీ యంత్రాంగం. దీన్ని పనిలో పెట్టడమే రాజ్యం చేసేపని. కాబట్టి మిలిటరీ బడ్జెట్‌ను తీవ్రంగా విమర్శించేవాళ్ళు నిస్సైనికీకరణను కోరుకునే ప్రజాస్వామికవాదులు, శాంతిప్రియులు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడకుండా తాము అనుకున్నది సాధించగలం అనుకోవడం భ్రమ. యుద్ధాలను వ్యతిరేకించే వాళ్ళకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. రాజ్యానికి వ్యతిరేకంగా పవిత్రయుద్ధం (క్రూసేడు) నడవనిదే యుద్ధ వ్యతిరేక యుద్ధంలో మనం గెలవలేం. యుద్ధాలు ఎప్పుడు నివారించబడతాయంటే – ఇప్పుడు ఉన్న రాజ్యం రూపురేఖలను సమూలంగా, మౌలికంగా మార్చగలగాలి.

రాజ్యమూ - జాతి రెండూ ఒకటి కావు. జాతికి ఎలాంటి నష్టం కలగకుండా ఇప్పుడున్న రాజ్యం రూపురేఖల్ని సమూలంగా మార్చడం కానీ, రద్దు చెయ్యడంగానీ సాధ్యం అవుతుంది. రాజ్యం ఆధిపత్యాన్ని కూల్చగలిగితే జాతిజనుల జీవితాలను మౌలికంగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలిగే శక్తులకు స్వేచ్ఛ ప్రసాదించినవాళ్ళం అవుతాం. యుద్ధం రాజ్యం ప్రధాన వ్యాపకంగా మారిపోయిన క్రమంలో జాతి శక్తులన్నీ ప్రధానంగా యుద్ధం కేసి పీల్చివేయబడతాయి. ఒక జాతి జవజీవాలు, చైతన్యం విధ్వంసం కోసం వెచ్చింపబడతాయి. వృధాగా ఖర్చయిపోతాయి. యుద్ధం అత్యంత వినాశకారి, మహమ్మారి అనే సత్యాన్ని ఎవరూ కాదనలేరు. యుద్ధం శత్రువులనే కాదు, మాతృదేశంలో జాతి జవజీవాలను ధ్వంసం చేస్తుంది. రాజ్యం అంటేనే జాతి అనే పొరపాటు నమ్మకం ఎక్కడ రాజ్యం చేస్తుంటుందో అక్కడల్లా యుద్ధ ప్రమాదం మెడమీద కత్తిలా నిత్యమూ వేలాడుతూ వుంటుంది. దేశ ప్రజల శక్తియుక్తులన్నీ జాతి సముద్ధరణకు, మానవ జీవిత వికాసానికి తోడ్పడే బదులు మిలిటరీ లక్ష్యాల సాధన కోసం సమిధలుగా మారుతుంటాయి.

ఏతావాతా మనకు ఏం బోధపడుతుంది? రాజ్యం అంటే ఒక సామాజిక వ్యవస్థలోని అత్యంత నిరంకుశ, నియంతృత్వ పేచీకోరు శక్తులతో కూడిన ఒక కేంద్రం అనేగా. ఆధునిక మానవుడి స్వేచ్ఛకు, నాగరికతా వికాసానికి, పరిపూర్ణ ఆనందమయ జీవితాన్ని గడపడానికి అడ్డంకిగా నిలిచేది అనేగా.

ఆధునిక సమాజాభివృద్ధికి ఎంతో కీలకమైన ఆవశ్యకమైన 'ప్రజల మధ్య భావాత్మక ఐక్యత' 'సేవలు అందించడంలో పరస్పర సహకారం,' 'మచ్చలేని దేశభక్తి భావన' ఇవన్నీ యుద్ధకాలంలో మినహా చవిచూడలేని రాజ్యం ఒక రాజ్యమా? ప్రజాస్వామిక స్ఫూర్తి, సంప్రదాయాలను తోసిరాజని బలప్రయోగం ద్వారా సమస్యలను పరిష్కరించు కోవాలి అనే ధోరణిని నాగరిక సభ్య సమాజం ఏమాత్రం హర్షించదు.

ప్రజాస్వామిక ప్రియులు, ప్రజాతంత్రవాదుల ముందు ఉన్న తక్షణ కర్తవ్యం ఒక్కటే. రహస్యవిదేశాంగ విధానానికి ఇక స్వస్తి చెప్పండి అని పాలకులను గట్టిగా డిమాండు చెయ్యాలి. ప్రభుత్వాలు ఇవాళ కుదుర్చుకుంటున్న విదేశీ ఒప్పందాలన్నీ రహస్య ఒప్పందాలే. వీటి వివరాలను ప్రజల ముందు ఉంచాలి. ఈ ఒప్పందాలన్నింటికీ యావత్ ప్రజానీకం బద్ధులై ఉండాలి కాబట్టి ప్రతి ఒప్పందాన్ని దేశ ప్రజానీకానికి బహిర్గతం చెయ్యాలి. అప్పుడే వాటి మంచిచెడులను ప్రజలను నిర్ణయిస్తారు. రహస్య విదేశీ ఒప్పందాల వ్యవస్థను కూలగొట్టందే యుద్ధ ప్రమాదాలను నిలవరించలేం. దేశ సంపద, శక్తియుక్తులను దుర్వినియోగం చేసేందుకు ప్రజలు పాలకులకు ఖాళీ చెక్కులు రాసివ్వలేదు. ప్రజలకొరకు, ప్రజల చేత, ప్రజలచే పరిపాలించబడే ప్రజాస్వామిక ప్రభుత్వాలు - ఇలా రహస్య విదేశీ ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ఔచిత్యమేమిటి? ఏ ఒప్పందమయినా రెండు దేశాల ప్రజల మధ్య జరిగేదిగా ఉండాలే తప్ప - అశాశ్వతమయిన

ప్రభుత్వాలు కుదుర్చుకునేవిగా ఉండకూడదు. ప్రజల జీవితాల్ని ప్రభావితం చేసే ప్రతి ఒప్పందమూ వారి ఎరికతోనూ, విమర్శనాపూర్వక ధోరణిని ఆహ్వానించేదిగా జరగాలి. అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుంది. శాంతి, సౌభాగ్యాలతో తులతూగుతుంది.

## జానీకి తుపాకి దొరికిందోచ్ (1939) (సంగ్రహ భాగం)

## -ట్రంబో

దయచేసి నన్ను మారుమూల పల్లె ప్రాంతాలకు తీసుకువెళ్ళండి ప్రతి రైతు ఇంటిముందు, ప్రతి చేను దగ్గరా ఆగండి. అందరినీ పిలవనంపండి. రాత్రి భోజనానికి అందరూ ఒక దగ్గర కూడినట్లు రైతులను వారి భార్యా బిడ్డలను పాలేళ్ళను అందరినీ ఒక చోట పోగెయ్యండి. చూడండి బాబు చూడండి మీరెవరూ ఎరగని వింతను చూడండి అని చాటండి. తొండలు గుడ్లు పెట్టే భూమిని దుక్కి దున్నిన మొనగాడు రైతు కూడా నన్ను అంగుళం దున్నలేదు. అధవా దున్నినా నేను ఓ పంట పండను, ఓ పువ్వుకాయను. రైతులు పొలాల్లో ఎరువులు చల్లుతారు. సేంద్రీయ ఎరువులంత దరిద్రగొట్టు మురికి ఇంకొకటి ఉండదు అని రైతులు తిట్టుకుంటారు. ఆ మురికి కూడా ఈసడించుకునే మురికిని నేను. నాకు చావు లేదు, క్షయం లేదు, ఒక్క పసిమొగ్గను బతికించే గుణంలేదు. నా పుట్టుకని అంతా అసహ్యించుకుంటారు. అదే ఇంకొకరు ఇంకొకరు అయితే పురిట్లోనే పీకపిసికి చంపేసి ఉందురు. నాకు ఆకారంలేదు, కానీ నరమానవులే నా ఆలంబన. నాకు బుర్ర లేదంటారు కానీ నాది నిరంతరం ఒకటే ఆలోచన. నేను స్వాభావిక ప్రకృతిలో భాగంకాను. అందుకేనేమో ప్రకృతి సూత్రాలు అన్నింటినీ త్రోసిరాజని వ్యవహరించడం అంటే నాకు మహా ఇష్టం. వెన్నతో పెట్టిన విద్య నాకు అది. ఇంతకీ నన్నింకా గుర్తు పట్ట లేదా మీరు? నా భుజకీర్తులు.

మనుషులు పనిచేసే దగ్గరకి, వస్తువులు తయారుచేసే చోటుకి నన్ను తీసుకెళ్ళండి. పరిస్థితి బాగా లేదు. మీరు చవగ్గా పనిచేయాలని తెలపండి. అయినా ప్రతి దానికీ పరిష్కారం ఉంటుంది. యుద్ధాలు చేద్దాం. అన్నింటి ధరలు పెరుగుతాయి, మీ వేతనాలూ పెరుగుతాయి అని వారికి చెప్పవచ్చు. అలా యుద్ధం ద్వారా ప్రతి ఒక్కరు లాభపడొచ్చు.

ముప్పూటలా కాసింతా మానవరక్తం దొరికితే చాలు. మీతో పోలిస్తే నేనెంత అదృష్టవంతుడినో చూసారా? మీకు కూడా కాణీ ఖర్చు లేకుండా బతకాలని ఉందా? అయితే రండి ఇంకెందుకు ఆలస్యం మిమ్మల్ని మోసుకెళ్ళేందుకు 'స్మశానపు' రైళ్ళు, బళ్ళు ఓడలు సిద్ధంగా ఉన్నాయి. ఎక్కండి ఈ మాటు ఆ అదృష్టం దక్కలేదా? ఫరావాలేదు. దిగులుపడమాకండి. ఇంకో యుద్ధం ఇంకో యుద్ధం ఇంకో యుద్ధం వస్తూనే ఉంటుంది. అదృష్టం పుచ్చి ఏదో ఒక రోజు యుద్ధం నీ తలుపు తడుతుంది. ఇది నిక్కం ఇది తథ్యం.

నన్ను కాస్త బడిపిల్లల దగ్గరికి తీసుకుపోరూ నన్ను చూడగానే భయంతో కేకలు పెడతారేమో రాత్రిళ్ళు పీడకలలతో బెంబేలెత్తిపోతారేమో అయినా ఫరావాలేదు. 'తోటకూర నాడే చెప్పాలనేది' సామెత కదా చిన్నప్పటి నుంచే వాళ్ళకి నూరిపొయ్యద్దూ నా చుట్టూ వాళ్ళని నిలబెట్టండి. నా స్థలకాల ప్రాశస్త్యం గురించి కథలు కథలుగా వివరించండి. రేపు పెద్దయ్యాక మీలో ప్రతి ఒక్కళ్ళూ ఇదిగో దీని అంత ధీశాలిగా తయారవ్వాలని హితబోధ చెయ్యండి. దేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించే అదృష్టం కోసం అర్రులు చాచండి అని నమ్మబలకండి నిజానికి అది మరణం కాదు, అమరత్వం – ఇదిగో ఈ యుద్ధం మరలా మరలా జన్మఎత్తే సదవకాశం అని ఒప్పించడం.

పిల్లలూ, ఇంకా దగ్గరకి రండి భయపడకండి. ఎవరా నల్ల బల్ల దగ్గర గోడకు అతుక్కుపోయి నిలబడింది. ఏం పాపా ఎందుకు ఏడుస్తున్నావ్? భయపడ్డావా? నేనేం బూచిని కాదే, యుద్ధాన్ని, సైన్యాన్ని గుర్తు లేదా నీకు. మీరే కదా రెండు చేతుల్లో మన చారల చుక్కల జాతీయ జెండాలు రెపరెపలాడిస్తూ మాకు వీడ్కోలు పలికింది. మీరే కదా మీ చిట్టి పొట్టి చేతులతో సీనారేకు డబ్బాల్లో మా కోసం చందాలు ఎత్తిందీ – పిచ్చికూనల్లారా నా గురించి ఇన్నిన్ని చేసి ఇప్పుడు నన్ను చూసి భయపడుతున్నారా, ఏడుస్తున్నారా? హవ్వ రండర్రా పిల్లలూ, మీకిప్పుడు కొత్త కొత్త 'నర్సరీ' పద్యాలు నేర్పిస్తా – 'హికరీ డిక్కరీ డాక్' బాంబుదాడిలో మా డాడి వెన్ను పతాక్. హంప్టీ డంప్టీ మా కళ గల పిల్లాడూ నాపాం బాంబు దెబ్బకి కళ్ళు లేని కబోది అయ్యాడు, ఇలా కొత్త కొత్త పద్యాలు నేర్చుకుందురు రండర్రా. సరే సరే మీతో ఆటలాడి పాటలు పాడి నాకు అలుపొచ్చింది. బాంబు దాడుల నుండి మనల్ని మనం రక్షించుకోవడానికి తవ్విన భూ సొరంగంలో బజ్జుంటా కాసేపు. అయినా పొరబాటున బాంబు దాడిలో నేను ఆ సొరంగంలో అసువులు బాసినా మీరు చింతించకండి. ఆ ప్రభువు మీద ఆన అది మీ కోసమే. ఆమెన్.

నన్ను కాలేజీలకు, యూనివర్శిటీలకు, కాన్వెంట్‌లకు, మేధోనిలయాలకు తిప్పండి. ఆడపిల్లల్ని అందరినీ ఒక దగ్గర పోగెయ్యండి. నన్ను చూపించండి వాళ్ళకు. నాలో ఒక తండ్రిని, ఒక సోదరుడిని, ఒక స్నేహితుడిని ఒక ప్రేమికుడిని, ఒక కొడుకుని చూసుకోమనండి భయపడకుండా నన్ను తాకమనండి. ప్రేమాస్పదంగా ఓసారి ముద్దాడమనండి. పెదాలకు నెత్తురు అంటుతుందా ఫరవాలేదు. యుద్ధం అంటే అంతేనని సర్ది చెప్పండి. ఇప్పుడు నవ యువకులందరినీ పోగెయ్యండి. నాలో ఒక సోదరుడిని, స్నేహితుడిని చూసుకోమనండి. మీకందరికీ నేనొక వింతగా తోచవచ్చు. ఆలోచించే బుర్ర లేని మనిషి వీడేం మనిషి అని అనుమానం రావచ్చు. సాంకేతిక భాషలో చెప్పుకోవాలంటే నేను బ్రతికి ఉన్న మాంసపు కాయాన్నే. గత వేసంకాలంలో ఫార్మలీన్ ద్రావణంలో అట్టి పెట్టిన శవంలాంటి శరీరాన్నే. అయితే ఆ

శవం మెదడు పని చెయ్యదు. కానీ నా మెదడు పనిచేస్తుంటుంది. నా హృదయ స్పందనలు వింటారా మీరు. మీరంటారా భవిష్య నిర్మాతలు, ఓ అద్భుతమైన సంగీతపు బాణి గురించో, ప్రపంచగతినే తీవ్రంగా ప్రభావితం చేసే ఒక లెక్కల సమీకరణం గురించో, మనిషిని మరింత మానవీయంగా తీర్చిదిద్దే ఓ పుస్తకం గురించో, క్యాన్సర్ రక్కసిని తుదముట్టించే ఒక కొత్త జీవకణ అన్వేషణ గురించో మీరు ఆలోచిస్తుంటారు. మీరే గనుక ఇలాంటి నవనవోన్మేష ఆలోచనలు చెయ్యకపోతే ఈ ప్రపంచం గతి ఇట్లా ఎట్లా ఉండేది. మరి నా గుండె ఏమని కొట్టుకుంటుంది అంటారా? మీ భవిష్యత్ మీరు కంటున్న బంగారు కలలు మీ ప్రియురాళ్ళ బాసలు ఊసులు అన్నింటికీ మించి మీ నాయకుల ఆటవిక ప్రకోపాలను వినిపిస్తుంది. వినండి ఆలోచించండి. బాగా ఆలోచించండి మళ్ళీ మనం రోమన్ సామ్రాజ్యాన్ని కూల్చివేసిన బర్బరుల చరిత్రను చదువుకుందాం.

నన్ను పార్లమెంటరీ భవనాల దగ్గరకు తీసుకువెళ్ళండి న్యాయం, సార్వభౌమాధికారం, దేశ గౌరవ ప్రతిష్టలు ప్రపంచ ప్రజాస్వామ్య పరిరక్షణ. ప్రజల సాధికారతకు పధ్నాలుగు సూత్రాలు ఇత్యాది అంశాల మీద వాగ్ధాటిని ప్రదర్శించే రాజకీయ నాయకుల ప్రసంగాలను వినాలని ఉంది. నాకూ వాళ్ళలా ఉపన్యాసాలు దంచాలని ఉందనే విషయం వారికి గుర్తు చేద్దామని ఉంది. కాని నాకు నోట్లో నాలుక లేకుండా పోయింది. కాని దేశభక్తుల అవతారం ఎత్తిన రాజకీయ నాయకులకు నోళ్ళు ఉన్నాయి. మాట్లాడేందుకు నాలుకలు ఉన్నాయి. నన్ను భద్రంగా ఒక గాజు పేటికలో పెట్టి ప్రసంగీకుల బల్ల మీద ఉంచండి. వాళ్ళు పరిశుద్ధ వాక్యాలు మాట్లాడినపుడల్లా ఆ ప్రకంపనలు నన్ను అనుభవించనీయండి వాణిజ్య ఒప్పందాల గురించి, వాటితో అంటకాగి ఉన్న సంక్షోభాల గురించి, వలస దేశాల గురించి, పాత పగల గురించి వాళ్ళని మాట్లాడనీయండి. అలాగే పసుపు వర్ణ జాతుల గురించి వాళ్ళ ఆర్యజాతి సిద్ధాంతం గురించి – ఈ రెండూ శ్వేతజాతికి చెందిన మనకు మన సామ్రాజ్యానికి తలనొప్పిగా ఎలా ఎందుకు పరిణమించాయో, జర్మనీని ఎందుకు దారిలో పెట్టాల్సి వచ్చిందో, రేపు ఏ దేశం మన దృష్టిలో మరో జర్మనీ అయ్యే అవకాశాలు ఉన్నాయో ఇత్యాది సమస్యల గురించి మాట్లాడమనండి. ప్రయాసపడి ప్రపంచభారం మోయుచున్న మనం తప్ప ఇంకెవరు మాట్లాడగలరు ఈ సమస్యలు గురించి. వేరే ఎవరికి ఉంటుంది ఆ హక్కు. మరీ ముఖ్యంగా దక్షణాది అమెరికా మార్కెట్‌ల గురించి మాట్లాడనీయండి. ఏయే దేశాలు మనల్ని అక్కడ నుండి మెడబట్టుకు గెంటెయ్యాలని చూస్తున్నాయో లెక్కలు తియ్యనీయండి. మన వాణిజ్యసేన ఎందుకు వాటిని గెలవలేకపోతుందో ఆరా కనుక్కోమనండి. ఆయా దేశాలకు ఏదో దొబ్బిడాయి వచ్చినట్లుంది. కఠిన హెచ్చరికలు పంపనియ్యండి. మాట వినలేదా మన సైన్యాన్ని, యుద్ధనౌకలకు యుద్ధ విమానాలను, మిలటరీ ట్యాంకులను వాటి మీదకు తోలండి. ఎట్టి పరిస్థితుల్లోనూ అవి

మన మాట విని తీరాలి. మన పెరటిదొడ్డిగా మారాలి. లేకుంటే ప్రపంచశాంతిని మనం ఎట్లా కాపాడగలం? ఇది సాధించడానికి వీలయినన్ని కూటములు కట్టండి, తటస్థత పాటించే పేరిట వీలయినన్ని దేశాలకు ఏదో ఒక సాయం చేస్తామని ఎరవెయ్యండి. ఆయా దేశాలకు వ్యతిరేకంగా తీర్మానాలు చెయ్యండి. ఖండన మండన ప్రకటనలు పొద్దుగూకులూ ప్రసారం చెయ్యండి. బిల్లులు పెట్టండి. చట్టాలు చెయ్యండి.

చివరిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగు పెట్టండి. గాజు పేటికలో భద్రపరిచిన నాకేసి వేలు చూపిస్తూ చట్టసభలలోని మర్యాదస్థులు అందరినీ అడగమనండి. "మన ముందు ఉన్న ప్రత్యామ్నాయం పరిష్కారం ఇదీ. (యుద్ధం) దీనికి మీకు అంగీకారమేగా, వ్యతిరేకించేవారు ఎవరైనా ఉన్నారా, ఎవరన్నా వ్యతిరేకించదలుచుకుంటే దమ్మున్న మగాడయితే లేచి నిలబడి మాట్లాడండి పరిష్కారం ఇది కాదని ఓటెయ్యమనండి" అని అడగండి. "ఎవరన్నా కాదని ఓటేసారో ఈ సభ మర్యాదకోసం వాళ్ళకు ఏం కాదని భరోసా ఇస్తున్నాం. కాని వీధుల్లో అడుగుబెడితే మాత్రం జనాలు ఖండఖండాలుగా నరికి, ఊరి చివర పాడుపడిన దిబ్బల్లో విసిరెయ్యడానికి సిద్ధంగా ఉన్నారని మాత్రం గుర్తుంచుకోండి. కుక్కలు కూడా ముట్టవు అట్లాంటి ఖండఖండాలని. అవి విసిరి వెయ్యబడిన చోట పచ్చ గడ్డి కూడా మొలవదు. అలాంటి మర్యాద ఎవరైనా కోరుకుంటున్నారా" అని నిలదీయండి. చాలు, మర్యాదస్థులకు ఒక్క మాట చాలు. నేను తప్ప వేరే ప్రత్యామ్నాయం పరిష్కారం లేదని తలలు ఊపేస్తున్నారు. అక్కడితో నాకు కావల్సిన చట్ట ఆమోదం లభిస్తుంది.

నన్ను చర్చిల దగ్గరకు తీసుకుపోండి యుద్ధాల మూలంగా ప్రతి పదిహేను ఏళ్ళకూ ఓసారి ధ్వంసమై మునపటి కన్నా గొప్పగా, ఎత్తుగా భక్తిగా నిర్మించుకున్న చర్చిల దగ్గరికి తీసుకువెళ్ళండి. రాజులు, మారాజులు, మతబోధకులు, మామూలు జనాలు, నూతన వధూవరులు, పిల్లలు నడిచి వెళ్ళేదారిలో నన్ను ఓ గాజుపేటికలో భద్రంగా అట్టి పెట్టండి. శిలువ మీద ప్రాణాలు కోల్పోయిన ఏసయ్య పాదాలు ముద్దాడడానికి వెళ్ళే ప్రభువు బిడ్డలందరూ నన్ను తాకి వెళ్ళేలా చూడండి. నా గురించి గొంతెత్తి ప్రార్ధనలు చెయ్యమనండి. అభిషిక్త జలం నా మీద చల్లమనండి. నా గొంతులో గుక్కెడు మంత్ర జలం పొయ్యమనండి. హల్లేలూయ, హల్లేలూయా అని మనసారా పలకమనండి, ఎందుకంటే 'నిజం' ఏమిటో నాకు తెలుసు, మీకు తెలీదు, చచ్చుదద్దమ్మల్లారా, చచ్చుదద్దమ్మల్లారాని?

# IV

# మొదటి ప్రపంచ యుద్ధం - మెకార్థీయిజం
# వియత్నాం, ఆ తరువాత - చారిత్రక ప్రతిఘటన

## మంచి యుద్ధం అంటే ఏమిటో

## అడ్మిరల్ జనరల్ లారొస్క్యు చెబుతున్నాడు (1985)

1941 వేసవి కాలంలో నన్ను పెరల్ హార్బర్‌కు వెళ్ళమని పురమాయించారు. ఫసిఫిక్ సప్తమాంగదళం అక్కడే ఉంది. కాబట్టి ఆ మాట వినగానే మురిసిపోయాను. జపాను వాళ్ళు పెరల్ హార్బరు మీద దాడి చేసే సమయంలో నేను మెక్‌డోనాకు సహాయకుడిగా ఉన్నా. జపాన్ వాళ్ళ కోసం పదిగంటలదాకా చూసి చూసి మా జలాంతర్గామిని నీటి అడుగుకి నడిపాం. వాళ్ళు మాకు తారసపడకపోవడం మా అదృష్టం. మేం గన వాళ్ళ కంటబడి ఉంటే నిలువునా మమ్మల్ని ముంచేసేవారు, వాళ్ళు. యుద్ధం నడిచిన నాలుగేళ్ళు నేను ఫసిఫిక్ మహాసముద్రంలోనే గడిపాను.

మా మీద దాడి మొదలు అవగానే అమెరికన్ బాంబర్లే పొరబడి మా మీద దాడి చేస్తున్నారేమో అనుకున్నాం. జపాన్ వాళ్ళ శక్తి సామర్థ్యాల మీద మాకు అంతటి అలక్ష్యం, అపనమ్మకం, మా మీద మాకు అపారమైన గర్వం. కలలో కూడా వాళ్ళు మా మీద దాడి చేస్తారని ఊహించలేదు. రాత్రి పూట వాళ్ళు మా ఓడను కనిపెట్టలేరని మామూలుగా కూడా మమ్మల్ని పసిగట్టే సాధన సంపత్తి వాళ్ళ దగ్గరలేదని మాకు ఖచ్చితంగా తెలుసు. అది నిజం కూడా. వాళ్ళు ఆయుధాలు కూడా పక్కాగా తయారు చేసుకోలేరు. అన్నీ ఫాల్తూవే. మా ఆయుధాలు చూసి డూప్లికేట్‌లు తయారు చేసుకోవడం తప్ప వేరేమీ చేతకాదు వాళ్ళకి. అదీ మా ధీమా. కానీ మా అంచనా తప్పింది. వాళ్ళు మా కన్నా ఘటికులు అని నిరూపించారు. మా కన్నా మెరుగ్గా ఆయుధాలు తయారు చేసుకోగలరని నిరూపించారు. వాళ్ళు ప్రయోగించిన టార్పెడోలు బ్రహ్మాండంగా పేలాయి. మమ్మల్ని భారీగానే దెబ్బతీసాయి.

మా ఆలోచన ఎలా ఉండేదంటే వాళ్ళు గోధుమరంగు మనుషులు, శ్వేత జాతీయులమైన మాతో పోల్చి చూసుకుంటే అల్పులు, మాకన్నా తక్కువజాతి వాళ్ళు అని బలంగా నమ్ముతూ వచ్చాం. జర్మన్లు అంటారా వాళ్ళు అరివీర భయంకరులు కానీ జపాన్ వాళ్ళంటే ఏముందీ చిటికెన వేలుతో పడదోయచ్చు అనుకున్నాం. కాని ఇవాళ అలాంటి జపాన్ వాళ్ళమీద మేం అణుబాంబులు ప్రయోగించాల్సి వచ్చింది. ఇంతకు ముందు వియత్నాం మీద వేస్తాం వేస్తాం అని భయపెడుతూ వచ్చాం. ఆఫ్రికా దేశాల నుండి చమురు తోడుకుంటున్నట్లు మధ్య ప్రాచ్యం నుండి కూడా బలవంతంగా మిలటరీని ఉపయోగించయినా చమురు తోడుకోవడం మా లక్ష్యం. ఇదే మాదిరి బలప్రయోగం ద్వారా కెనడా నుండి చమురు తోడుకుందాం అన్న మాట మా వాళ్ళ నోటివెంట పొరపాటున కూడా నేనెప్పుడూ వినలేదు. అయినా ఇప్పటికీ మాది ఈ ప్రపంచంలోకెల్లా సర్వోత్కృష్ట జాతి అని భావించుకుంటూ ఉంటాం.

వాళ్ళు (జపాన్ దేశస్థులు) ఎంత మంచివాళ్ళో అర్థం చేసుకోవడానికి మాకు చాలా కాలం పట్టింది. మేం ఈ నిజాన్ని నమ్మలేకపోయాం ఒక సారి నేను ఫసిఫిక్ మహాసముద్రం దక్షిణ ప్రాంతంలో వాళ్ళ ఓడను ఒక దాన్ని లొంగదీసుకున్నాం. హార్బర్‌లో ఇంకొన్ని ఓడలు ఉన్నాయి. మేం ఓడలోకి దూరగానే మమ్మల్ని చూడగానే ఇద్దరు జపనీయులు మా కళ్ళ ముందే ఉరేసుకు చచ్చిపోయారు. లొంగుబాటు కన్నా ఆత్మహత్య మేలని భావించారు. యుద్ధకాలంలో వాళ్ళని మేం నిలువెల్లా ద్వేషించాం. పొట్టివాళ్ళని అర మనుషులని ఈసడించుకున్నాం.

నాలుగేళ్ళపాటు ఫసిఫిక్ మహాసముద్రంలో నేగడిపిన కాలాన్ని నేనిప్పటికీ ద్వేషించేంత బోర్‌గా గడిపాను. ఉట్టినే చేతులు ముడుచుకు కూర్చున్నానా అంటే పదమూడు యుద్ధాల్లో పాలు పంచుకున్నా. ఒక జలాంతర్గామిని ముంచేసారోయి. గడ్డమీద తొలిగా కాలుమోపిన వాడినయ్యా. ఈ నాలుగేళ్ళలో ఎంత వ్యర్థమయిన జీవితం గడిపానా అని ఇప్పుడు అనుకుంటున్నా. ఇట్లాంటి వ్యవహారాలలో మాకు మేమే సాటి.

మేం యుద్ధాలు ఎప్పుడూ ఏదో ఒక విదేశీగడ్డ మీద చేస్తూ వచ్చాం. కాబట్టి యుద్ధ బీభత్సం ఎలాంటిదో మా ప్రజలు ఎరగరు. డెబ్భైశాతం మిలటరీ బడ్జెట్‌ను మేం పరాయి దేశాలమీద దండెత్తడానికే ఖర్చుచేస్తూ వస్తున్నాం. మిలటరీతత్వం అనేది మా రాజ్యాంగంలో ఒక అంగంగా మారిపోయింది. రెండవ ప్రపంచయుద్ధం నాటికి ఈ దశలోకి అడుగుపెట్టేసాం. మిలటరీవాదం సంస్థాగతంగా మారిపోయింది. 1947లోనే మేం జాతీయ భద్రతా చట్టం చేసాం. మీరు ప్రపంచ చరిత్రలోనూ, సాహిత్యంలోనూ ఇలాంటి మాట మీరు ఎక్కడా వినీ కనీ ఉండరు. ఈ చట్టం పుణ్యమా అని రక్షణ మంత్రిత్వ శాఖ ఏర్పాటయింది. అప్పటిదాకా యుద్ధాల కోసం చేసిన వ్యయం యుద్ధాల పద్దులోనే ప్రజలందరికీ తెలిసేలా చేస్తుండేది ప్రభుత్వం. ఈ రక్షణ మంత్రిత్వ శాఖ వచ్చిన తరువాత యుద్ధంకోసం చేసిన ఖర్చు అనే ఖాతానే ఎగిరిపోయింది. ఆ తరువాత ఎన్ని యుద్ధాలు చేసాం, ఎంతెంత ఖర్చు చేసాం అదంతా ప్రజల

రక్షణ ఖాతాలోకి పోయింది. ఈ లెక్కల గురించి వివరాలు అడిగినా, ఏమిటీ జమా ఖర్చులు అన్నా ఎందుకింత సొమ్ము తగలేస్తున్నారు అన్నా మీరు దేశద్రోహుల సరసన నిలబడాల్సిందే. ఈ ఖాతాకు కక్కాల్సిన సొమ్ము మీద నియంత్రణే లేదు. ఏ యుద్ధమయినా ఆత్మరక్షణ కిందకే వస్తుంది. ఏ ఉద్దేశంతో మేం పరాయి గడ్డ మీద దండెత్తినా అది న్యాయమైన యుద్ధంగా శోభిల్లుతుంది.

గతంలో ఉమ్మడిదళ పదాధికారుల కమాండ్ అంటూ ఏదీ లేదు. రెండవ ప్రపంచయుద్ధం కాలంలో ఇలాంటి ఏర్పాటు ఒకటి ఉన్నా అది అస్తుబిస్తుగా ఉండేది. ఇప్పుడు మాకు జాతీయ భద్రతా వ్యవహార మండలి ఉంది.(శాసనసభ, శాసనమండలి లాగ) దీన్లోంచే సిఐ.ఎ పుట్టుకు వచ్చింది. అది ఈక్షణాన మీ మీదా, నా మీద కూడా గూఢ చర్యం చేస్తూ ఉంటుంది. మానవ చరిత్రలోనే తొలిసారిగా మేం ఈ ప్రపంచాన్ని మిలటరీ కేంద్రాలుగా విభజించాం. ప్రపంచంలో ఏమూలన ఎక్కడ ఏం జరిగినా దానికి  మా దగ్గర రెడీమేడ్ మిలటరీ పరిష్కారం దొరుకుతుంది. 'కంటింజెన్సీ ప్లాన్' ల పేరిట యుద్ధ వ్యూహాలు నిరంతరం రచిస్తా ఉంటారు. జనరల్ బెర్నీ రోజర్స్ ఉన్నాడు. పెద్ద ఇంటిలిజెన్స్ యంత్రాంగం, భారీ లాజిస్టిక్ యంత్రాంగం, విమానాలు, మనుష్యులు అంతర్జాతీయ కిరాయిదార్లు ఓహ్ ఇతని చేతికింద లేనిదంటూ లేదు. నాకు తెలిసీ యూరప్ దేశాల్లో ఉన్న ఏ అమెరికా రాయబారి అయినా సరే బెర్నీరోజర్స్ అనుమతి లేనిదే పెన్ను కదపడు. పెదవి విప్పడు. యూరప్ ఖండంలోనే అతి కీలకమైన వ్యక్తి ఇతగాడు. అల్లాటప్పాగా మంత్రిత్వశాఖ కార్యదర్శులను మంత్రులను తొలగించినట్లు ఏ దేశాధ్యక్షుడు ఇతన్ని ఈ పదవి నుండి తొలగించలేదు.

మా విదేశాంగ విధానాన్ని మా సైన్యం నడిపిస్తుంటుంది. మా హోం మంత్రిత్వశాఖ పని ఏంటంటే మా మిలటరీ ఎక్కడ కాలుమోపి ఆగమాగం చేసి వస్తుంటుందో అక్కడల్లా సర్దుబాట్లు చేసి రావడమే. మా హోంమంత్రిత్వ శాఖా పెంటగాన్‌కు తోకగా మారిపోయింది. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు పరిస్థితి ఇది కాదు. నావికాదళానికి, సైనికవిభాగానికి వేర్వేరు డిపార్ట్‌మెంటులు ఉండేవి. యుద్ధం వచ్చినపుడు మాత్రమే ఈ విభాగాలు అంటూ ఒకటి ఉన్నాయని మాకు తెలిసేవి. అంతే కాదు వీటి మీద పౌర నియంత్రణ ఉండేది. కాని రెండవ ప్రపంచయుద్ధం ఈ పరిస్థితిని సమూలంగా మార్చేసింది. నేను మారానని నేనే అనుకోవడంలేదు. నేను మంచి నావికాదళ కెప్టెన్‌ని నేనూ, నాదళం తిరుగులేనిదని ప్రదర్శించడానికే ఆహో రాత్రులూ పనిచేసాను. సముద్రం అంటే నాకు ప్రాణం ఇప్పటికీ. కానీ అమెరికా మాత్రం మారిపోయింది. విభేదాలను శాంతియుత మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలి అనే విధానాన్నే చాప చుట్టేసి అటక ఎక్కించేసింది. రెండవ ప్రపంచయుద్ధం తరువాత నుండి ప్రపంచంలో ఏ మూల ఎక్కడ ఏం కావాలనుకున్నా సైనిక బలప్రయోగంతో సాధించడానికి అలవాటు పడింది. సైన్యం ఉన్నదే అందుకు అన్న ధోరణి ప్రబలిపోయింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా తన అంతర్జాతీయ లక్ష్యాలను సాధించుకోవడానికి ఇప్పటిదాకా (1985) 215 సార్లు సైనిక బలప్రయోగాన్ని వినియోగించిందని పెంటగాన్ ఈ మధ్యనే సగర్వంగా ప్రకటించింది. పెంటగాన్ ఉన్నదే అందుకు కదా!? జాతి అభిమతాన్ని

సాధించడమే 'దాని లక్ష్యమట!? ఇప్పుడు కొత్తగా అణ్వాయుధాలు కూడా వచ్చి చేరాయి దీని ఖాతాలోకి. అణ్వాయుధాలను మేం సాంప్రదాయ ఆయుధాలుగా పరిగణించే స్థాయికి వచ్చేసాం. వియత్నాం మీద ఈ ఆయుధాలు ప్రయోగించాలని ఒక దశలో తీవ్రంగా ఆలోచన చేసాం. అప్పుడు నేను పెంటగాన్‌లోనే ఉన్నా. ఏ లక్ష్యాల మీద ప్రయోగిస్తే ఉపయోగం అనే చర్చలలో పాలు పంచుకున్నా. ఆ యుద్ధం గెలవడానికి ఏ దారి దొరికినా చాలనే ఆదుర్దాతో ఉన్నాం. నమ్మండి నమ్మకపోండి అంత గంగ వెర్రులెత్తి పోయి ఉన్నాం. మేం ఆ సమయంలో అయితే పనికొచ్చే లక్ష్యం ఒక్కటీ దొరకలేదు మాకు వియత్నాం గడ్డ మీద. అందుకని ఆ ప్రయత్నం విరమించుకున్నాం. అంతే తప్ప అణ్వాయుధాలు ప్రయోగిస్తే జరిగే మానవ, పర్యావరణ వినాశనాలు విషాదాల గురించి కించిత్తుకూడా ఆలోచించలేదు.

నా అంతట నేనే వియత్నాం యుద్ధంలో పాలు పంచుకోవడానికి సిద్ధపడ్డాను. ఇందులో జాతి ప్రయోజనాలు ఏమిటి అని మాట మాత్రంగా కూడా ప్రశ్నించుకోలేదు. నేనో సుశిక్షిత నౌకాధికారిని– ఎదురుగా యుద్ధం జరుగుతుంది. వేరే ఆలోచన చెయ్యకుండా దూకేసా. ఇప్పుడు వయసు మీద పడ్డాక నా అజ్ఞానం నాకు తెలిసి వస్తుంది. అయితే రెండవ ప్రపంచయుద్ధం జరగడాన్ని తప్పుపట్టలేంగా, హిట్లర్‌ను నిలువరించడానికి అంతకన్నా మార్గం లేదు. మీరు అడగవచ్చు కాని పరిస్థితులు అలా ముదురు పాకాన పడడంలో మన పాత్రా ఉందంటాను నేను. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నేను కొంత మంది రష్యన్ అధికారులతో కలిసాను. వాళ్ళూ అచ్చం మనలాంటి మనుషులే అన్న భావన కలిగింది నాకు. కాని అప్పటిదాకా రష్యన్లను నిలువెల్లా ద్వేషించిన తత్వం నాది. ఈ దేశం మనకు అంతటి విద్వేషం నూరిపోసింది. ఎప్పుడూ మనకు ఎవరో ఒకరిమీద ఇంతటి విద్వేషాన్ని నూరిపోస్తానే ఉంటుంది మన దేశం. ఒక సారి జపాన్‌వాళ్ళు, ఇంకోసారి రష్యావాళ్ళు రేపు ఎవరో. నిజం చెప్పాలంటే రెండవ ప్రపంచయుద్ధంలో అరివీర పరాక్రమంతో పోరాడింది, నాజీ జర్మన్‌లను నిలవరించిందీ రష్యాయే.

ప్రపంచం మీద రష్యా ఆధిపత్యం చలాయించడానికి కమ్యూనిజాన్ని వ్యాప్తి చెయ్యడానికి చూస్తుంది అనేది మన అనుమానం. పోనీ మన అంచనా వాస్తవమే కావచ్చు కాని దాన్ని నిలవరించడానికి తుపాకులు, బలప్రయోగమూ ఒక్కటే మార్గమా అనేది నా ప్రశ్న. మనం ఏ ప్రజలను అయితే మన భావాజాలం వైపు గెలుచుకోవాలి అనుకున్నామో వారిని ప్రజాస్వామికంగా స్వేచ్ఛా స్ఫూర్తితో గెలుచుకోగలిగామా – ఆ ప్రజల నుండి వేరు పడిపోలేదూ మనం. నిజానికి రష్యా భూగోళికంగా తన దేశ సరిహద్దుల చుట్టుపక్కల ఉన్న దేశాల మీద తన ప్రభావం విస్తరించడానికి ప్రయత్నించింది. అది దాని అవసరం. ఇతరత్రా ఏ దేశంలో బయట నుంచి కమ్యూనిజాన్ని రుద్దగా ఫలించిన దాఖాలాలేదు. కానీ మనం చెయ్యదల్చుకున్నాం రష్యాను అడ్డం పెట్టుకుని చేసాం. నేనూ నాలాంటి ఒక తరం అంతా రష్యన్ల మీద ఆకారణ విద్వేషంతోనే గడిపేసాం. రష్యా ఎక్కడ ఉందో తెలీని వాళ్ళు కూడా రష్యాను నిలువెల్లా ద్వేషించేంతగా మన పాలకులు నూరిపోస్తారు. రష్యా ఎలుగ్గొడ్డుతో ప్రమాదం జాగ్రత్త అని టామ్‌స్విఫ్ట్ రాసిన

పుస్తకాన్ని నేను నా పదమూడవ ఏట చదివా, అందరితో పాటు ఆ వయసు నుండే మాలో విద్వేష విషం నింపేసారు.

మన ప్రాపంచిక దృక్పధాన్ని రెండవ ప్రపంచయుద్ధం సమూలంగా మార్చేసింది 'ప్రతిదీ మనం యుద్ధం' దృష్టిలో చూడడం అలవర్చుకున్నాం. యుద్ధం అంటే చెడ్డదనే భావన మనలో లేదు. అందుకే వయసులో ఉండగా నా తరం వాళ్ళంతా ప్రపంచంలో ఏ మూల అయినా సైనిక బలప్రయోగం చేసే హక్కు మన దేశానికి ఉందని బలంగా విశ్వసించాం.

యుద్ధం గడిచి ఇప్పటికి ఇరవై ఏళ్ళయింది. రెండవ ప్రపంచ యుద్ధం మీద ఇప్పటికి ఎన్నో సినిమాలు తీసారు మన వాళ్ళు. నేను మరిచిపోవాలనుకున్న జ్ఞాపకాల గాయాలను పదే పదే రేగగొట్టాయి ఆ సినిమాలు. యుద్ధాన్ని ఒక ఘనకార్యంగా, మహాద్భుతంగా చిత్రీకరించబడిన తీరును చూస్తే నాకు అసహ్యం వేస్తుంది. మనుషులు చనిపోవడాన్ని కూడా అందంగా చిత్రీకరించారు. కాని యుద్ధంలో నిజంగా అలా ఉండదు. శరీరాలు చిద్రుపలై, మానవ అంగాంగాలూ తెగిపడి రక్తమోడుతూ, విలవిల్లాడుతూ ఓహ్ మీరా దృశ్యాన్ని ఊహించనుకూడా లేరు. అంత హృదయ విదారకంగా భయోద్విగ్నంగా ఉంటుంది. చావు అంటే సినిమాల్లో చూపించినంత యాంటీసెప్టిక్‌గా, నీట్‌గా మాత్రం ఉండదు. మాతృదేశం కోసం తృణ ప్రాయంగా ప్రాణాలు అర్పించారు మన సైనికులు అన్న మాట విన్నప్పుడల్లా నాకు కంపరం ఎత్తి పోతుంది.

ఎవరూ ప్రాణాల్ని తృణప్రాయంగా వదులుకోవాలి అనుకోరు. మనం ఆ యువకుల, నవ జీవన నిర్మాతల ప్రాణాలు తీసేసాం అంతే. దేశ గౌరవం కోసం, ప్రాభవం కోసం నిండు ప్రాణాల్ని బలిపెట్టుకోరు ఎవరూ. ఆ పేరిట మనం వాళ్ళని హత్య చేస్తున్నాం. అంతే అదే సత్యం.

## అహింసాయుత విద్యార్థి కో ఆర్డినేషన్ కమిటీ (ఎస్ఎన్‌సిసి) వియత్నాం మీద తీర్మానం (1966 జనవరి 6)

హింసను వ్యతిరేకించడానికి ఆవిర్భవించిన ఈ విద్యార్థి కో ఆర్డినేషన్ కమిటీ ఏ అంశం మీద అయినాసరే అమెరికా విదేశాంగ విధానాన్ని నిరసించే హక్కును ఈ రోజున చేపట్టింది. వియత్నాంలో అమెరికా జోక్యాన్ని ఈ కారణాలతో వ్యతిరేకిస్తుంది.

వియత్నాం ప్రజానీకానికి 'స్వేచ్ఛ'ను అందించడానికే ఈ యుద్ధానికి పూనుకున్నాం అని అమెరికా పదే పదే ప్రకటించడం పెద్ద బూటకం. శ్వేత వర్ణేతర జాతుల దేశాలయిన డొమనికన్ రిపబ్లిక్, కాంగో, దక్షిణాఫ్రికా, రొడిషియాలో నల్లజాతి ప్రజానీకానికి ఎలాంటి స్వేచ్ఛ లభిస్తుందో, ఈ అమెరికా గడ్డ మీద నల్లజాతి ప్రజానీకానికి ఏ పాటి స్వేచ్ఛ లభించిందో అలాంటి స్వేచ్ఛ రేపు వియత్నాం ప్రజానీకానికి అందిస్తుందా ఈ ప్రభుత్వం అని ప్రశ్నిస్తున్నాం.

గత ఐదేళ్ళుగా ఈ దేశంలోని నల్లజాతి ప్రజానీకం స్వేచ్ఛ, ఆత్మగౌరవాల సాధన కోసం మా విద్యార్థి కో ఆర్డినేషన్ కమిటీ కృషి చేస్తుంది. ముఖ్యంగా దక్షిణాది అమెరికాలో మా కృషిలో మాకు అనుభవంలోకి వచ్చింది ఏంటంటే అణగారిన ప్రజానీకానికి స్వేచ్ఛను ప్రసాదించడంలో వరసవారీ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించి ఇన్ని దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఈ దేశ సరిహద్దుల లోపల సాగుతున్న అణచివేత, దోపిడి విధానాలకు చరమవాక్యం పలకలేకపోయింది.

ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యహింస విధానాలకు బాధితులమయ్యాం, బందీలమయ్యాం. కనీసం మానవహక్కుల కోసం ప్రజాస్వామిక పౌరహక్కుల కోసం కృషి చేసిన నల్లజాతి సోదరులు ఎందరో హత్యలకు గురయ్యారు. నిందితులు మాత్రం ఎలాంటి శిక్ష లేకుండా స్వేచ్ఛగా జీవితాలు గడుపుతున్నారు.

అంతర్జాతీయ న్యాయసూత్రాలను కాలదన్ని అమెరికా అనుసరిస్తున్న దుందుడుకు విధానాల మూలంగా ఇవాళ అనేక మంది వియత్నామీయులు హత్యాకావించబడుతున్నారు. వ్యక్తుల పట్లగాని, చట్టాలపట్ల గాని ఈ ప్రభుత్వానికి ఎలాంటి గౌరవం లేదు. మరీ ముఖ్యంగా తన వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటాయి అనుకున్న చట్టాలను, దేశాలను ప్రజలను తుంగలో తొక్కుతుంది. నల్లజాతీయుల మీద జరిగిన దాడులకు సంబంధించి గతంలో మేం సమర్పించిన అనేక నివేదికలను ఈ సర్కారు పూర్తిగా అలక్ష్యం చేసింది.

మాకు తెలిసినంతలో ఈ దేశంలో అటు ఉత్తరాది రాష్ట్రాలలో గానీ, ఇటు దక్షిణాది రాష్ట్రాలలోగానీ ఎన్నికలు ఏనాడూ స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగింది లేదు. 1965 ఓటింగ్ హక్కుల చట్టాన్నిగాని, 1964 పౌరహక్కుల చట్టాన్నిగాని ఫెడరల్ స్ఫూర్తితో అమలు చేసిందే లేదు. ఇలాంటి ప్రభుత్వాలు పరాయి గడ్డ మీద నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుపుతాయనే నమ్మకం మాకు ఏ కోశానా లేదు. ప్రపంచంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడడం 'తన లక్ష్యంగా చెప్పుకుంటుంది గానీ, ఆయాదేశాల్లోని స్వాతంత్ర్యోద్యమాలను జాతీయోద్యమాలను అణగద్రొక్కడానికి ఈ మాటలు ఒక ముసుగుగా వేసుకుంటుందని మేం బలంగా నమ్ముతున్నాం.

'స్వేచ్ఛ' పేరిట సాగించే సైనిక దుర్మార్గాలకు రోసి 'నిర్బంధ సైనిక రిక్రూట్‌మెంట్'ను వ్యతిరేకిస్తున్న యువతరానికి మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. పరిపూర్ణమైన స్వేచ్ఛా సమాజం మాది అని చెప్పుకుంటున్న ఈ దేశంలో స్వేచ్ఛను కాపాడడమంటే సైనిక దురాక్రమణకు విధిగా తన ప్రాణాలు అర్పించడానికి ముందుకు రావాలనే నిర్బంధ సైనిక రిక్రూట్‌మెంట్ విధానాన్ని మేం నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాం. ఇప్పటిదాకా ఇలా నిర్బంధంగా సైన్యంలోకి తీసుకున్నవారిలో 16 శాతం మంది నల్లజాతీయులే అన్న విషయం మా గమనంలో ఉంది. మాకు లేని ప్రజాస్వామ్యం, స్వేచ్ఛలను వియత్నామీయులకు ప్రసాదించడానికి మేం ఈ యుద్ధం చెయ్యాల్సిందే? ముందు స్వంత ఇల్లును చక్కదిద్దుకునే ప్రణాళిక ఎక్కడ అని మేం ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాం. అందుకే ఈ దేశంలో ప్రజాస్వామిక సంఘటనలను నిర్మించడానికి తమ

శక్తియుక్తులను వినియోగించాలని భావించే ప్రజానీకం అంతటికి మేం సాదరంగా అహ్వానం పలుకుతున్నాం. నిర్బంధ సైనిక విధానాన్ని తిప్పికొట్టాలంటే బలమైన పౌరహక్కుల, మానవహక్కుల ఉద్యమాలను నిర్మించడానికి సహకరించాలని పిలుపునిస్తున్నాం. ఇటువంటి ప్రత్యామ్నాయాన్ని నిర్మించే క్రమంలో అవసరమైతే మీ ప్రాణాలు కూడా అర్పించాల్సి ఉంటుంది. వియత్నాం యుద్ధంలో పోగొట్టుకోవడానికి బదులు ఈ నూతన కర్తవ్యంలో అసువులుబాయడం ఎవరికైనా గర్వకారణం కదా.

## వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా గళం విప్పిన - మహమ్మద్ ఆలీ (1966)

ఒక పక్కన ఇక్కడ లూయిస్ విల్లీలోనే నల్లజాతి ప్రజానీకం కనీస మానవ హక్కులకు నోచుకోకుండా, కుక్కల్లా అసహ్యానికి గురికాబడుతుంటే నన్ను సైనిక దుస్తులు తొడుక్కుని వేల మైళ్ళ అవతల ఎక్కడో ఉన్న వియత్నాం ప్రజల మీద తుపాకీ గుళ్ళు బాంబులు కురిపించమని ఈ సర్కారు ఏ మొహం పెట్టుకుని అడుగుతుంది. ఇంకో పేద దేశాన్ని నిలువునా తగలెయ్యడానికి, జనాన్ని చంపడానికి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అణగారిన ప్రజానీకం మీద అమెరికా శ్వేత వర్ణ దురాహంకారాన్ని, బానిస యాజమాన్య దాష్టికాన్ని రుద్దడానికి నేను ఈ యుద్ధం చెయ్యనుగాక చెయ్యను. ఇలాంటి దుర్మార్గాలకి ఇక్కడితో ఆనకట్టపడాలి. నేను ఇలాంటి వైఖరి తీసుకోవడం మూలంగా నా ప్రతిష్ట దెబ్బ తింటుందని ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌గా నాకు ఒనగూడాల్సిన మిలియన్ల డాలర్లు స్థంబించి పోతాయని నన్ను హెచ్చరిస్తున్నారు. కానీ నేను మాట మార్చదలుచుకోలేదు. ఇప్పటికే ఒక సారి చెప్పా. కావాలంటే మళ్ళీ మళ్ళీ చెప్తా – నిజమైన ప్రజాశత్రువులు వేరెక్కడోలేరు. ఇక్కడే ఉన్నారు. న్యాయంకోసం, స్వేచ్ఛకోసం, సమానత్వం కోసం తమ కోసం పోరాడుతున్న వియత్నామీయులను బానిసలు కావించడం కోసం నేనో పనిముట్టుగా ఉపయోగపడి నా మతానికి, నా జాతి జనానికి, నాకు నే తలవంపులు తెచ్చి పెట్టను, తెచ్చుకోను.

ఈ గడ్డ మీద బతుకుతున్న ఇరవై రెండు లక్షలమంది నల్లజాతీయుల స్వేచ్ఛ కోసం యుద్ధం జరుపుతాం అని చెప్పండి. నిర్బంధ సైనిక రిక్రూట్‌మెంట్ కోసం వేచి ఉండక నా అంతట నేను స్వచ్ఛందంగా రేపే అలాంటి యుద్ధంలో చేరిపోతా. నేను ఈ దేశ చట్టాలను ఆ అల్లా న్యాయాన్ని గౌరవించాలంటారా, నా మత విశ్వాసాలకు కట్టుబడి ఉన్న మూలంగా నే కోల్పోయేదేమీ వుండదు. ఈ దేశ చట్టానికి లోబడి యుద్ధంలోకి మాత్రం పోను. చట్ట ఉల్లంఘనకు గాను మహా అయితే నన్ను జైల్లో పెడతారు. అంతేగా, నా జాతి జాతంతా నాలుగువందల ఏళ్ళుగా ఆ 'చెర' లో ఉందేగా.

**(1968 మార్చి 16న అమెరికా కాల్బుల దళం ఒకటి వియత్నాంలోని మైలాయ్ అనే గ్రామంలో కాలు పెట్టింది. వాళ్ళని అడ్డుకోవడానికి గాని కవ్వించడానికిగాని ఒక్క తుపాకీ గుండు పేలకపోయినా ఒక పథకం ప్రకారం ఆ గ్రామంలోని ఐదువందలమంది రైతులను ముఖ్యంగా మహిళలను, పిల్లలను అతి కిరాతకంగా హతమార్చింది అమెరికా సైన్యం. ఫ్రీలాన్స్ జర్నలిస్టు సైమూర్ హెర్ష్ ఈ దురంతం గురించిన కథనాన్ని వెలుగులోనికి తీసుకురావడానికి ప్రయత్నించాడు. కాని అమెరికన్ మీడియా దానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకుండా తొక్కిపట్టింది. 1969 డిసెంబరులో రోనాల్డ్ హెబర్లే ఈ ఉదంతానికి సంబంధించిన కొన్ని ఫోటోలు 'లైఫ్' మ్యాగజైన్‌లో ప్రచురించాక ప్రపంచవ్యాప్తంగా గగ్గోలు పుట్టింది. వియత్నాం మహిళలు బిడ్డల్ని గుండెలకు అదుముకుని పెకి ఎగబాకి ప్రాణాలు కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నా కందకాన్ని చుట్టుముట్టి మరీ సైనికులు తుపాకీగుళ్ళ వర్షం కురిపించి అమాయక పౌరులను హతమార్చిన తీరు ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కాల్పులకు ఆదేశించిన ప్లాటూన్ లీడర్ లెఫ్టినెంట్ విలియం కాలీని సైన్యం అరెస్టు చేసింది. నిజానికి ఈ ఘోర ఉదంతంతో సంబంధం ఉన్న ఉన్నతాధికారులను విచారణ చేసి తప్పించేసారు. కాలీకు మాత్రం జైలు శిక్ష పడింది. యావజ్జీవ కారాగార శిక్షపడితే నిక్సన్ అధ్యక్షుడిగా పదవి చేపట్టిన కాలంలో దీన్ని ఐదేళ్ల శిక్షకు కుదించారు. మూడున్నర ఏళ్ళ పాటు గృహనిర్బంధంలో ఉంచి ఆనక విడిచిపెట్టేసారు. హెలికాప్టర్‌లో 'గన్నర్' గా పనిచేసిన లారీ కేల్‌బర్న్ పైలట్ హూథాంప్సన్‌తో కలిసి ఈ దృశ్యం చూసి మధ్యలో అడ్డుపడి కాల్పులు ఆపించాడు. అతని మాటల్లోనే ఆ ఘోరకృత్యం గురించి తెలుసుకోండి.)**

## వాళ్ళు జనాన్ని ఊచకోత కోసారు (2003)

## - లారీ కోల్ బర్న్

మేం ఆదర్శవాదులం కాము. ప్రజలను చంపడం మా ఉద్యోగ ధర్మం. మేం అదే పని చేసాం. అయితే సరదా కోసం మేం ఈ పని చెయ్యలేదు. మేం విచ్చలవిడిగా ప్రజలను చంపలేదు. మా కంపెనీలో పనిచేసేవాళ్లందరికి ఆయుధాలు చేజిక్కించుకోవడం ప్రాధాన్యతగా పెట్టుకున్నాం. ఆ ఆయుధాలు చూపించి 'మా మీద దాడి జరగబోతే ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపాం అని చెప్పుకోవడానికి సాక్ష్యాలు ఉండాలిగా అందుకు.

మేం ఒక బుల్లి హెలీకాప్టర్‌లో చక్కర్లు కొడుతున్నాం. హెచ్. 23 టైపు హెలికాప్టర్ అది. గ్యాసోలిన్‌తో నడుస్తుంది ఇంజను. మా పని ఆకాశంలో వేగుల పని చెయ్యడం. ఒక రకంగా ఎరవెయ్యడం లాంటి పని అన్నమాట. ముందుగా మా హెలీకాప్టర్‌ని పంపి దూరంగా భారీ గన్‌షిప్ హెలీకాప్టర్లు మూడు కాపుగా వస్తాయి. మేము సాధ్యమైనంత నేల బారుగా హెలికాప్టరులు నడుపుకుంటూ ఎక్కడన్నా మామీద దాడి జరగడానికి ప్రయత్నం జరిగితే

అక్కడ వియత్‌కాంగ్ గెరిల్లాలు ఉన్నట్లు పసికట్టి కాల్పులు జరుపుతాం. రెండు పొగబాంబులు వేస్తాం. ఆ పొగ మాకు కాపు కాసే గన్‌షిప్‌లకు సంకేతం అన్నమాట. నిమిషాల్లో వచ్చి అక్కడ దిగిపోతాయి. చెయ్యాల్సినంత ధ్వంసం చేసాక నేల మీదకి దిగుతాయి. ఇహ మనుష్యులను దొరక బుచ్చుకునే వేట సాగుతుంది. యుక్త వయసులో వున్న వాళ్ళందరినీ బంధించి విచారణ కోసం తీసుకొచ్చి చిత్రహింసలు పెడతాం. 1968 ఏడాది పొడుగుతా మా పని ఇదే.

అది మార్చి 16. మేం తెల్లవారుజాము ఏడు గంటలకు డ్యూటీకి రిపోర్టు చేసాము. ఓ కంపెనీ సైన్యాన్ని ఊళ్ళోకి పంపించి మొత్తం గాలింపు చేపడుతున్నాం. అని ఆ రోజు ఏం చెయ్యబోతుందీ మాకు వివరించి చెప్పారు పెరేడ్‌లో. సాధారణంగా 'సైన్యం పోవడానికన్నా ముందే మా బుల్లి హెలికాప్టర్ ఓచుట్టు చుట్టి రావాలి. శత్రువుల జాడ ఏమన్నా దొరుకుతుందేమో పరిశీలించడం మా పని. ఎక్కడైనా ముందు చేసేది ఇదే. ఆ రోజుకూడా అలానే మా హెలికాప్టర్‌లో బయల్దేరాం. పచ్చని వరిపొలాల మీద కమ్ముతున్న మంచు తెరలు విడిపోతూ అప్పుడప్పుడే స్వచ్ఛంగా మారుతుంది. ఒక కొబ్బరి తోపులోంచి యూనిఫారం తొడుక్కుని చేత తుపాకీ పట్టిన ఒక మనిషి కనిపించారు మాకు. 'ఎరచిక్కింది' అన్నాడు మా పైలట్ 'నే చూసుకుంటా' అన్నా తలుపు దగ్గర సీట్లో కూచున్నా నేను. తను హెలికాప్టర్‌ని కిందకు దించి ఆ మనిషికేసి మళ్ళించాడు.

చూడబోతే వియత్‌కాంగ్ గెరిల్లా లాగే ఉన్నాడు. చేతిలో ఆయుధం ఉంది. హెలికాప్టర్ మోత విని తప్పించుకోవడానికి పారిపోతా ఉన్నాడు. హడావుడిలో నా గురి తప్పింది. అతను బతికిపోయాడు. మేం అక్కడక్కడే చాలాసేపు చక్కర్లు కొట్టాం ఆకాశంలో. అతను తప్ప మరో గెరిల్లా జాడ దొరకడం లేదు మాకు ఆరోజున.

ఆ తరువాత మేం మైలాయ్ అక్షాంశం - 4,-5-6 మీదుగా చక్కర్లు కొట్టడం మొదలుపెట్టాం. అప్పుడే మా హెలికాప్టర్ గన్‌షిప్‌ల దండు రావడం చూశాం. వాటికి ఎక్కడ ఎలాంటి ప్రతిఘటన ఎదురవుతుందో అనే అనుమానంతో ముందస్తు చక్కర్లు కొట్టాలి. అనుమానించదగ్గ పరిస్థితులు ఎక్కడా కనబడలేదు. అది సంత రోజు అనుకుంటా మహిళలు పిల్లలు చాలా మంది ఊరి శివార్లకేసి బయల్దేరుతూ కనిపించారు. ఖాళీ బుట్టలతో కాలిబాట వెంబడి పోతూ ఉన్నారు. ఇంకాస్త ముందుకు పోయాం -4 అక్షాంశం దగ్గర ఉన్న వరి పొలాల దాపున గాయాల పాలయి నేలకి ఒరిగి ఉన్న మహిళలు కొంతమంది కనిపించారు. వాళ్ళకు సైనిక వైద్యం మావాళ్ళు అందించాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతంలో పొగబాంబులు జారవిడిచాం.

అక్కడ నుంచి మళ్ళీ కాలిబాట మీదకి మా హెలికాప్టర్ మళ్ళించాం అంతకుముందు సంతకు వెళుతూ కనిపించిన జనాల శరీరాలు చెల్లాచెదురుగా రోడ్డు మీద పడి ఉన్నాయి. గుట్టలు, గుట్టలుగా- శవాలుగా మారి కనిపించారు. ఏం జరిగిందో అర్థం కాలేదు మాకు. మా 'గన్‌షిప్'ల పనా, మా సైన్యం పనా- వియత్‌కాంగ్ గెరిల్లాల పనా ఇది. మా సైన్యాన్ని గమనిస్తే దిలాసాగా నడిచి వెళ్తున్నారు. మాటు చేసుకు వొంగి వొంగి నడవడాలు, పాకడాలు ఏమీ లేవు.

ఇంకాస్త ముందుకుపోతే ఒక ఇరవై ఏళ్ళ పడుచు రక్తమోడుతూ నేలవాలి కనిపించింది. నిరాయుధంగా ఉన్న ఆమె గుండెలకు గురిచూసి కాల్చారు ఎవరో. దగ్గర్లోనే మా సైన్యం ఉంది కాబట్టి ఆకుపచ్చ పొగబాంబు వేశాం అక్కడ. ఈ రంగు బాంబులు వైద్య సాయం అందాల్సిన చోట వేస్తుంటాం. ప్రమాద సంకేతానికి ఎరుపు రంగు పొగబాంబులు వాడుతూ ఉంటాం మేం. నేలకు ఆరడుగుల ఎత్తున చక్కెర్లు కొడుతున్నాం. ఇంతలో కెప్టెన్ ఎర్నెస్ట్ మెడినా అక్కడికి వచ్చాడు. ఆ యువతిని కాలితో ఓ తన్ను తన్నాడు. వెనక్కి రెండడుగులు వేసి కొన ప్రాణంతో ఉన్న ఆ యువతిని కాల్చి చంపేశాడు. క్షణాల్లో మాకళ్ళ ముందే జరిగిపోయింది ఇదంతా. కెప్టెన్ మెడినా ఆ పని చెయ్యడంతో తన వెన్నంటి ఉండే సైనికులూ అదే పని చెయ్యబట్టారు.

ఆకుపచ్చ పొగబాంబులు వేసి క్షతగాత్రులైన అమాయక పౌరులకు మా సైన్యం వైద్య సేవలు అందించి ఆదుకుంటుందని భావిస్తే వాళ్లు చేసిన పని ఇది. పరోక్షంగా దీనికి మేమే బాధ్యులమా అనిపించింది నాకు ఆ క్షణాన. నేను ఇప్పటికీ మర్చిపోలేని సంఘటన ఇంకొకటి చెప్తా. ఓ ఆడమనిషి గువ్వపిట్టలా ఒదిగిపొక్కుంటూ వెళుతూ నాకంట పడింది. నేను సైగలతో ఆమెను అక్కడే ఉండిపోమ్మని, అలికిడి చెయ్యవద్దని, ప్రశాంతంగా ఉండమని చెప్పి ఇంకాస్త ముందుకు వెళ్ళాం. కాసేపటికి వెనక్కి తిరిగి వచ్చాం. ఆ ఆడమనిషి నే చెప్పినట్లు అక్కడే అలానే ఉండిపోయింది. కానీ వెనుకపాటుగా ఎవరో మా వాళ్లు వచ్చి కాల్చిపారేశారు ఆమెను. ఆ కళ్ళలో నిబిడాశ్చర్యం ఇప్పటికీ నా కళ్ళముందు కదలాడుతూ నన్ను వెంటాడుతుంది.

దాదాపు పది గంటల ప్రాంతంలో మైలాయ్ అక్షాంశం – 4కు ఈశాన్య దిక్కున మా సైనికుల గుంపు ఒకటి వెనుక నుండి తరుముతూ ఉంటే చాలామంది ఆడవాళ్ళు, పిల్లలు సహా ఓ బంకర్‌కేసి పరుగులు తీస్తూ కనిపించారు. మేం ఆ బంకర్ మీదుగా చెక్కర్లు కొట్టాం. ఆ మట్టి బంకర్‌లోంచి కొంతమంది ఆడమనుషులు బిక్కుబిక్కుమంటూ పైకి చూడడం గ్లెన్ అండ్రెట్టా గమనించాడట. ఇంకాసేపట్లో వాళ్ళందరూ మృత్యువాత పడనున్నారని ఎందుకో అనిపించిన మూలాన మా పైలట్ హెలికాప్టర్‌ను బంకర్‌కు – అటు కేసివస్తున్న మా సైనికులకు మధ్యగా నేల మీదకు దించాడు. తను సీట్లోంచి దిగి తిన్నగా లెఫ్టినెంట్ (స్టీఫెన్) బ్రూక్స్ దగ్గరకు వెళ్ళి వాళ్ళంతా సాధారణ పౌరుల్లా కనిపిస్తున్నారు. ఆ గోతిలోంచి ఎలా బయటపడెయ్యడం అని అడిగాడు. లోపల గ్రెనెడ్లు వేస్తే వాళ్ళే చచ్చినట్లు బయటికి వస్తారని బ్రూక్స్ జావాబిచ్చాడు.

ఆ సమాధానం విని మా పైలట్ థాంప్సన్ మెదనరాలు పొంగుకొచ్చాయి. బ్రూక్స్‌తో లడాయి వేసుకుంటాడేమో అనిపించింది. మొత్తానికి తమాయించుకుని మా దగ్గరికి వచ్చాడు. "నేను వెళ్లి బతికి ఉన్న వాళ్ళను బయటికి చేదే ప్రయత్నం చేస్తా. నా మీద గన ఎవడన్నా తుపాకి ఎత్తినట్లు కనిపిస్తే కాల్చిపారేయ్యండి కొడుకుల్ని మీ ఇద్దరూ కల్సి" అని మాతో కసిగా అన్నాడు. తిన్నగా బంకర్ దగ్గరకు వెళ్ళి లోపల ఉన్న వాళ్ళను పైకి రమ్మని సైగ చేశాడు. తొమ్మిది మంది దాకా ఉన్నారల్లే వుంది.

మేం కళ్ళన్నీ మా తోటి సైనికుల మీదే పెట్టి ఉన్నాం. అందులో సగం మంది నేల మీద విశ్రాంతిగా కూచుని జోకులేసుకుంటూ సిగరెట్లు కాల్చుకుంటూ ఉన్నారు. నేను ఒకతనికేసి చూసి చెయ్యి ఊపగా బదులుగా అతనూ చెయ్యి ఊపాడు. ఏంఫర్లా వీళ్లు మమ్మల్ని ఏం చెయ్యరు అనిపించింది. ఒకళ్ళ మీదకు ఒకళ్ళం తుపాకులు బారు చేసుకునే దరిద్రం తప్పింది.

థాంప్సన్ డాన్ మిలియన్స్‌ను కేకేశాడు. 'డానీ కాస్త వచ్చి సాయం చెయ్యగలవా. ఓ చెయ్యేద్దూ రాకూడదూ' అనడిగాడు అలాగే అనడం వరకు మా చెవుల పడింది. ఇంకేటో గొణిగాడు కానీ మాకు వినబడలా. హెలికాప్టర్ గన్‌షిప్‌ను అంబులెన్స్‌లా ఉపయోగించడం నేను అదే మొదటిసారి చూశా. బంకర్‌లో చావగా బతికి ఉన్నవాళ్ళని రెండుట్రిప్‌లుగా హెలికాప్టర్‌లో ఎక్కించుకుని కొన్నిమైళ్ళ అవతల దించివచ్చారు మా కెప్టెన్.

దారి పొడుగూతా శవాలేనంట. మళ్ళీ హెలికాప్టర్ ఎక్కాం అందరం. పైకిలేచి ఆ బంకర్ మీదుగా వెళుతుండగా ఆండ్రెట్టా ఆ బంకర్లో ఇంకా ఎవరో కదులుతున్నట్లు గమనించాడట. మళ్ళీ కిందకి దించాం మా హెలికాప్టర్. ఈసారి అండ్రెట్టా బంకర్ దగ్గరకి వెళ్ళాడు. శవాల గుట్టల్లో నడుందాకా దిగబడిపోయి అలానే వెళ్ళి ఓ పసిపిల్లాడ్ని ఎత్తుకు వచ్చి నా చేతులకు అందించాడు. ఆ శవాల గుట్టలోంచి తను తిరిగి రావడం ఇబ్బంది అయ్యింది. నా తుపాకి 'బట్' అతనివైపు చాపా. అది పట్టుకున్న తనని బలంగా ఇవతలకు ఈడ్చాను. ఆ పసిబిడ్డను తీసుకెళ్లి అనాథ శరణాలయానికి అప్పగించాం. బాబో, పాపో కూడా తెలీదు కానీ అమాయకంగా ఉన్న పసిబిడ్డకు ఏం కాలేదు. అదే గొప్పవరంగా ఊపిరి పీల్చుకున్నాం. కనీసం ఏడ్వను కూడా ఏడ్వలేదు. కాకపోతే ఒళ్ళంతా రక్తంతో తడిసి బుల్లిబుల్లి కళ్ళతో అమాయకంగా మాకేసి చూస్తా ఉండిపోయాడు మాతో ఉన్నంతసేపు.

నిజానికి మా వాళ్ళు పగతీర్చుకోవాల్సినంత మనుషులు కారు చనిపోయిన వాళ్ళంతా. మా వాళ్ళు 'ట్రాప్' చెయ్యడానికి, స్నైపర్ తుపాకులకు పని చెప్పడానికి ఇప్పటిదాకా ఎవరూ తగల్లేదు. ఆ ముందురోజు రాత్రి ఈ గ్రామాన్ని తుడిచి పెట్టేద్దాం అని అనుకున్నారట. వాళ్ళకు ఒక్క ఆయుధం చిక్కింది లేదు. గెరిల్లాగా పనిచేసే యువక వయస్కులయిన మగవాళ్ళు ఒక్కడూ చిక్కిందిలేదు. హతమయిన వాళ్ళ జాబితా నేనే చూశాను. 120 మందికి పైగా ఐదేళ్ళలోపు వయసు ఉన్నవాళ్ళు ఉన్నారు. నా జీవితాంతం ఈ పీడకల నన్ను వెంటాడుతూనే ఉంది. అసలు మనిషి అనేవాడు ఎవడైనా ఇలాంటి ఘాతుకానికి పాల్పడతాడా. పగ తీర్చుకోవడానికయినా సమవుజ్జీ ఉండాలి కదా. హతం అయిపోయిన వాళ్ళంతా వృద్ధులు, మహిళలు, పిల్లలూనాయె. వాళ్ళు వియత్‌కాంగ్ గెరిల్లాలకు రాత్రిపూట ఆశ్రయం ఇచ్చారని ఆ హత్యాకాండకు చూపించే కారణమూ సరైనది కాదు.

ఇదే మా అమెరికాలో జరిగితే? శృతమూకలు చిన్న ఊరిమీద పడి మహిళలను చెరిచి హతమార్చి, పసిపిల్లల ఉసురుతీస్తే మాకు ఎలా అనిపిస్తుంది. ఇది అమాయక పౌరులను

హత్యకావించడం కాదా. ముమ్మాటికీ హత్యే. మావాళ్ళు అమాయక వియత్నాం పౌరులను ఊచకోత కోశారు కసాయి వాళ్ళలా. కాకపోతే కూరవండుకు తినలేదు అంతే. అంతటి కసాయితనానికి కూడా దిగజారుతారా?

## కటిక రహస్యాలు : వియత్నాం జ్ఞాపకాలు - పెంటగాన్ కాగితాలు - డేనియల్ ఎల్స్‌బెర్గ్ (2003)

అది 1969 అక్టోబరు 1వ తేది. చీకట్లు ముసురుకుంటున్నాయి. శాంతామోనికోలో ఉన్న 'రాండ్ కార్పొరేషన్' ఆఫీసు డెస్కు దగ్గర ఉన్న సెక్యూరిటీ గార్డును దాటుకుని నే బయటపడ్డా నా చేతిలో బ్రీఫ్‌కేస్ సహా. అందులో ఉన్నవన్నీ రహస్యపత్రాలే. ఆ రాత్రికే వాటిని ఫొటో కాపీలు తియ్యాలని నిర్ణయించుకున్నా. వియత్నాం మీద యుద్ధం చెయ్యాలని అమెరికా ఏ ప్రాతిపదికన నిర్ణయించుకుందో తెలియచేసే 7000 పేజీల రహస్య డాక్యుమెంట్లు అవి. ప్రభుత్వం వీటిని 'అత్యంత రహస్యం'గా వర్గీకరించి దాచిపెట్టింది. వీటినే ఆ తర్వాత పెంటగాన్ పత్రాలుగా వ్యవహరించేవారు. నేను ఆ రాత్రికే ఆ సమాచారం అంతా ఫోటోకాపీ చేసి ప్రజలకు బహిరంగపరచదలిచాను. దీనికోసం అయితే 'సెనెట్ విచారణను' ఆశ్రయించాలి. లేదంటే 'ప్రెస్' ద్వారా ఆ పని చెయ్యాలి. ఈ రెండు మినహా వేరే మార్గం లేదు. అందులోనూ రెండో మార్గాన్ని ఎంచుకుంటే నా శేష జీవితాన్ని నేను జైల్లో గడపాల్సి ఉంటుంది.

దాదాపు పదకొండేళ్లపాటు – 1964 నుండి మే 1975వరకు నేను కూడా సాధారణ అమెరికన్ పౌరుల అందరి మాదిరిగానే వియత్నాంలో మా జోక్యం సరైనదిగా గాఢంగా నమ్మూతూ వచ్చాను. మొదట్లో దాన్ని నేనొక సమస్యగా భావించా, తరువాత వియత్నాం యుద్ధం నాకు ఒక ప్రతిష్టంభనగా తోచింది. ఆ తరువాత నైతిక, రాజకీయ పతనంగా అర్థమైంది. ఆనక అది ఎంతటి క్రూర నేరమో అవగతం అయ్యింది. నా వ్యక్తిగత నిబద్ధత కాలక్రమంలో నా జీవితాచరణ – ఈ అవగాహనకు లోబడి మారుతూ వచ్చింది. వియత్నాం యుద్ధాన్ని ఒక సమస్యగా చూసినప్పుడు దాని పరిష్కారం కోసం మావాళ్ళకు నా వంతు సాయం చేశాను. అదొక ప్రతిష్టంబనగా అనిపించినప్పుడు జాతీయ ప్రయోజనాలకు భంగం కలగకుండా దీని నుండి బయటపడడం ఎలా అని స్పందించాను. వియత్నాం యుద్ధం మానవ జాతి పట్ల క్రూరమైన నేరంగా అర్థం చేసుకున్నాక ఆ నేరాన్ని బహిర్గతం చెయ్యడం, దాన్ని ఎలాగైనా నిలవరించడం, తక్షణం యుద్ధాన్ని ఆపడం కోసం నాకున్న శక్తులన్నీ ఒడ్డి మరీ పని చెయ్యాలని నిర్ణయించుకున్నా. ఏది ఎలా ఉన్నా తొలి నుంచే ఈ ఘర్షణ మరింత పెరగకూడదనేది నా ఆలోచనగా ఉండేది. 1973 చివర్లో నా మీద ఫెడరల్ కోర్టులో నేర విచారణ మొదలయ్యింది. 1969 తదాదిగా నా చర్యలు క్రిమినల్ నేరాల పరిధిలోకి వస్తాయనేది ప్రభుత్వ అభియోగం. అప్పటికి వియత్నాం

యుద్ధానికి సంబంధించి నేనుగాని, ఇతరేతరులు అనేకులుగానీ 'ఎలాగైనా ఈ సమస్యకు పరిష్కారం సాధించాలి అని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

ఈ ఘర్షణ అనండి. పీడకల అనండి, నైతిక దుస్సాహసం అనండి దీన్ని నివారించడానికి జరిగిన ప్రయత్నాలను సానుకూలంగా అర్థం చేసుకోలేకపోగా ఎట్లా అయినా ఈ యుద్ధంలో మనం గెలవాలి అని ఆలోచించినవారే పెచ్చు అని మాత్రం నే చెప్పగలను. ఎందుకిలా జరిగింది? నాకేం అనిపించిందంటే – యుద్ధాన్ని నిలవరించాలనే సంకల్పానికి తోడు యుద్ధాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే అవగాహన కూడా ఉండి ఉండాల్సింది. ఈ లోపమే మా కృషి ఫలించకపోవడానికి ఒక ప్రధాన కారణం అయి ఉంటుందని. ముప్పై ఏళ్ల తరువాత చూసుకున్నా – అదే నిజమనిపిస్తుంది.

1964 సంవత్సరం మధ్యకాలం నుండి మూడేళ్ళపాటు యుద్ధాన్ని 'ప్రాసిక్యూట్' చేసేందుకు నా పౌర అత్యున్నతాధికారి హోదాలో నా వంతుగానే చేసిన సాయం ఫలించే అవకాశం లేదని నాకు అప్పుడే అనిపించింది. 1964–65 మధ్యకాలంలో వాషింగ్టన్‌లోని అత్యున్నత పాలనాధికారుల చేతికిందనే పనిచేసే క్రమంలో వాళ్ళు ఈ యుద్ధం గెలుస్తామనే అంచనా లేకపోయినా యావత్ దేశాన్ని ఒకరకమైన యుద్ధోన్మాదంలోకి నెట్టేయడానికి రహస్యంగా ఏమేవి చేసివాళ్ళో నే చాలా దగ్గర నుంచి చూశా. ఈ విషయంలో మనం మాత్రం ఏం చెయ్యగలంలే అని తీవ్రమైన నిరాశ నన్ను చుట్టుముట్టింది. 1964–65, రెండు వసంతకాలాల మధ్యన నేను కొంత విజయం సాధించగలిగాను. తప్పుడు సలహాలు, పొరబాటు అంచనాలతో అధ్యక్షులవారే మమ్మల్ని యుద్ధ కార్యక్రమాల్లోకి దించారు. హోంమంత్రిత్వశాఖ తరపున వియత్నాంలో పౌర బాధ్యతలు నిర్వహించడానికి 1965లో నాకుగా నేను ముందుకువచ్చాను. పల్లె ప్రాంతాల్లో అమెరికన్ సానుకూలత ఏ మేరకు కూడగట్టాం అనేది అంచనా వెయ్యడం నా పని. పనిలో పనిగా గతంలో సైనిక కమాండర్‌గా నే పొందిన శిక్షణను ఊతం చేసుకుని నేను వియత్నాం యుద్ధాన్ని సునిశితంగా గమనించాను. గతంలో ఫ్రెంచి వాళ్ళు చేపట్టిన మార్గంలోనే తుపాకులు, అణచివేత బల ప్రయోగాల ద్వారా మా దేశాధి నాయకులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని చూడడం సబబా, బేసబబా అనే ఆలోచన నాకు తట్టలేదు అంతవరకూ. కానీ నేను వియత్నాంలో గడిపిన రెండేళ్ళలో యుద్ధం అంటే ఏమిటో, ప్రజల ఈతిబాధలు ఎంత వర్ణనాతీతంగా ఉంటాయో, యుద్ధం ఎంత పనికిమాలినదో ఎంత భరింప శక్యం కానిదో నాకు అవగతం అవుతూ వచ్చింది.

1967 మధ్య కాలంలో హెపటైటిస్ బారినపడిన నన్ను అక్కడ నుండి తిరిగి అమెరికా పంపించారు. అప్పట్నించి ఈ పనికిమాలిన యుద్ధం నుండి నా దేశం వైదొలగడానికి ఏం చెయ్యాలో అదల్లా చెయ్యడానికి నా శక్తియుక్తులన్నీ వినియోగించాను. ఆంతరంగిక మనిషిగా నేను ప్రభుత్వంలోని అత్యున్నత అధికారులకు, అధ్యక్ష ఎన్నికలలో తలపడిన అభ్యర్థులకు ఈ

యుద్ధం నుండి ఏ మార్గంలో బయటపడాలనే సలహాలిస్తూ వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించాను. 1969 తొలినాళ్ళలో వియత్నాం యుద్ధం మూలాన ఏర్పడిన అనిశ్చితిని అందుకు తగిన ప్రత్యామ్నాయాలను రూపుదిద్దడానికి అధ్యక్షుడు జాతీయ భద్రతా సలహాదారుగా పని చేసిన హెన్రీ కిసింజర్‌కు చేదోడువాదోడుగా పనిచేశాను. అయితే ఏడాది చివరికి వచ్చేసరికి మా ప్రణాళిక తల్లకిందులయ్యింది. కాబట్టి ఇక ప్రభుత్వానికి ఆంతరంగిక సలహాదారుగా పని చెయ్యడంలో అర్థంలేదని నిర్ణయించుకుని ఆ కొలువుకు సెలవు చెప్పేశా.

ఒకరకంగా నా స్వేచ్ఛను నేను ఇరుకున పెట్టుకున్నా. 'రాండ్' విశ్వవిద్యాలయంలో నా సహచరుడయిన ఆంథోని రూసో సాయంతో పెంటగాన్ పత్రాలలోని 47వ వాల్యూం యావత్తూ నే ఫొటో కాపీ చేసి ఒకటి నా దగ్గర అట్టి పెట్టుకుని మరొకటి విదేశాంగ వ్యవహారాల సెనెట్ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న సెనెటర్ విలియమ్ ఫుల్‌బ్రైట్‌కు అందచేశా. 1971లో అదే కాపీలు నేను న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్టు పత్రికలకు అందించా. కానీ ఫెడరల్ ప్రభుత్వం అనూహ్యంగా ఈ సమాచారాన్ని ప్రచురించకుండా నాలుగు 'ఇంజంక్షన్ ఆర్డర్లు'జారీ చేసింది. దాదాపు పదిహేడు దిన పత్రికలకు, ఇతరత్రా కొన్ని మ్యాగజైన్‌లకు ఈ ఉత్తర్వులు అందజేసింది. కాని పత్రికలు ఈ సర్కారు ఆదేశాలను ఉల్లంఘించి విషయాన్ని బహిర్గతం చేశాయి. వాస్తవాలను ప్రజలముందు ఉంచాయి.

దీనిమూలంగా వ్యక్తిగతంగా నేను 'రిస్కు' పడతాను అనే నా ముందస్తు అంచనాను సర్కారు నిజం చేసింది. నన్నూ, రూసోను ఫెడరల్‌కోర్టు అభిశంసించింది. మరో కేసులో కూడా నన్ను ముద్దాయిగా ఇరికించి మరో అభిశంసనకు గురి చేసింది. మొత్తంగా నా మీద పన్నెండు అభియోగాలు మోపింది. ఈ నేరాలకు గాను 115 ఏళ్ళ జైలు శిక్ష విధించవచ్చు నాకు. ఇదిగాక విచారణ పేరిట ఎన్నేళ్ళు జైల్లో మగ్గపెడతారో తెలీదు. కానీ నేను ఏ తప్పూ చెయ్యలేదు. నే చేసిన పనల్లా ఏంటంటే మన ప్రజాస్వామ్యానికి లాభం ఒనగూర్చేదానికి గాను ఈ యుద్ధం అనివార్యం అయింది అని ఒకరు కాదు ఇద్దరు కాదు మొత్తం ఐదుగురు అధ్యక్షులు ఈ దేశ ప్రజానీకానికి చెప్పినవన్నీ అబద్ధాలు అని ప్రజలు తెలుసుకునేలా చెయ్యడమే. అబద్ధం ఒకసారి ప్రపంచాన్ని చుట్టివచ్చేసినా నిజం నిలకడ మీద తెలుస్తుంది అంటారు గదా. ఆ రకంగా ఒకసారి సత్యం ఏమిటీ ప్రజలు గ్రహించేసరికి అది పెను తుఫానులు సృష్టించింది. నా గొంతు నొక్కెయ్యాలని, నన్ను నిస్సహాయుడ్ని చేయాలని ప్రయత్నించిన శ్వేతసౌధం (అమెరికా అధ్యక్ష భవనం) చివరికి నా మీద అభియోగాలు ఉపసంహరించుకుంది. ఇంతకన్న నాకు సంతృప్తినిచ్చిన విషయం ఏమిటంటే 'ఓవల్ ఆఫీసు' చేసిన నేరాలకు గాను అధ్యక్షుడు తన పదవికి రాజీనామా పెట్టాల్సి వచ్చింది. యుద్ధం పరిసమాప్తం కావడానికి ఇంతకన్నా కలిసివచ్చే విషయం ఏమిటి ఉంటుంది?

# V

# 70వ దశకం - చెయ్యి జారిపోయిన శకం

## శాసనోల్లంఘనే అసలు సమస్య (నవంబరు 1970)

ఇదెంత తల్లకిందులు, నడమంత్రపు ప్రపంచమో చూసారా? తప్పుడు మనుషులు జైల్లో ఉన్నారు. జైలు బయటా ఉన్నారు. తప్పుడు మనుషులు అధికారంలో ఉన్నారు. తప్పుడు మనుషులు అధికారం బయటా ఉన్నారు. ఈ దేశంలో సంపద పంపిణీ సజావుగా సాగుతుంది అంటున్నారు. ప్రపంచమంతా అదే జరుగుతుంది నమ్మమంటున్నారు. కానీ నాకు ఏమని అనిపిస్తుందంటే ఈ సంపదను సక్రమంగా పునఃపంపిణీ చెయ్యాలంటే చిన్నాచితకా సంస్కరణలు చాలవు. పెను మార్పులు సంభవించాలి. అర్థం పర్థం లేకుండా మాట్లాడుతున్నావని అనుకోబాకండి. లోకం తీరు ఇట్లానే ఉంది మరి. డేనియల్ బెర్రిగాన్ – ఒక మతాచార్యుడు పైగా కవి – జైల్లో ఉన్నాడు. ఇతగాడు చేసిన నేరం, యుద్ధానికి వ్యతిరేకంగా గొంతువిప్పడం. జె.ఎడ్గార్ హువర్ – ఇతను వియత్నాంలోని మైలాయ్ అనే గ్రామంలో వందలాదిమంది మహిళలను పిల్లలను ఊచకోత కోయించిన మిలటరీ అధికారి. జైలు బయట ఉన్నాడు. ఇతని మీద ఎలాంటి నేర విచారణ జరగట్లేదు. ఇంచక్కా వాషింగ్టన్‌లో ఉండి అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో, పార్టీల్లో హుషారుగా కాలం గడిపేస్తున్నాడు. జైలు బయట తప్పుడు మనుష్యులు ఉన్నారు. లోపల ఉన్నది తప్పుడు మనుషులని అంటున్నారు అని నేను ఎందుకు అన్నానో ఈ పాటికి మీరు గ్రహించిఉంటారు. కెంట్‌స్టేట్ యూనివర్శిటీలో 'నేషనల్ గార్డ్స్' విభాగానికి చెందిన సైనికులు నలుగురు కుర్రాళ్ళను చంపేసారు. కానీ కేసు పెట్టింది విద్యార్థుల మీద. ఇవాళ ఈ దేశంలో ఏ ఊళ్ళో, ఏ పట్టణంలో ఏ నగరంలో అయినా తీసుకోండి– నిరసనకారులు యుద్ధవ్యతిరేక ప్రదర్శనలు తియ్యడం ఆలస్యం పోలీసులు మీదబడి లాఠీలతో కుళ్ళ బొడిచేస్తారు. ఆ పైన అరెస్టులు చేసి 'పోలీసుల మీద దాడికి ప్రయత్నించారనీ కేసులు పెడతారు.

బోస్టన్‌లో, మసాచ్యుసెట్స్‌లో ఇలా ప్రతిచోటా ప్రతిరోజు కోర్టుల్లో ఏం జరుగుతుందో మనం చూస్తున్నాం. నీకు దిగ్భ్రమ కలగొచ్చు, కలగపోవచ్చు. ఈ తీర్పులతో మీకు ప్రత్యక్ష్యంగాను,

పరోక్షంగానూ ప్రమేయం లేకపోవచ్చు. కాని మనం బతికివున్న మనుషులం కదా. మన ఒంట్లో ప్రవహించేది రక్తమేకదా. మన కళ్ళు, చెవులు, మెదడూ పనిచేస్తూనే ఉన్నాయిగదా. మరీ ఇంతటి ఘోర అన్యాయమా? 'చట్టం తనపని తాను చేసుకుపోతుంది 'అంటే ఇదే అర్థం కావును. నేను ఇవాళ ఈ విషయాల మీదే మీతో మాట్లాడలనుకుంటున్నది. మీరు జార్జి జాక్సన్ రాసిన 'నాన్నకు ఉత్తరాలు' చదివారా, చదవండి. అతనికి ఏడాది నుండి జీవితకాలపు కారాగార శిక్షలు విధించాయి కోర్టులు. ఓ పెట్రోలు బంకులో 70 డాలర్ల దొంగతనం చేసినందుకుగాను అతనికి విధించిన శిక్షలు ఇవి. మీకు తెలుసు – మన సెనెటర్‌గారు ఒకరు ఉన్నారు. చమురు ధరల 'జాదూగరీ' చేసి ఏడాదిలో 185,000 డాలర్ల సొమ్ము దిగమింగారు. జాక్సన్ చేసింది దొంగతనం అయ్యింది. సెనెటర్‌గారు చేసింది చట్టబద్ధం అయ్యింది. ఎక్కడో ఏదో తిరకాసు ఉంది. దేశం నలుమూలలనుండి 10,000 టన్నుల 'నెర్వ్‌గ్యాస్' బాంబులు ఓడలకు ఎక్కించి పరాయి దేశం మీద విచ్చలవిడిగా ప్రయోగించడానికి తీసుకుపోవడం ఎంత ఘాతుకం. 'ఇదంతా మనకు ఇబ్బంది లేకుండా చెయ్యడానికి 'అని పాలకులు చెబుతుంటే – ఏంటి ఇప్పుడు మనకు వచ్చిన ఇబ్బంది అని కనీసంగా ఆలోచించమా? టీవీలు చూస్తూ, పత్రికల్లో మేధావుల రాతలు చదువుతూ ఉండిపోతే ఇలానే తయారవుతాం. పరిస్థితులు మరీ అంత దరిద్రంగా లేవు, చిన్న చితక ఇబ్బందులు లేకుండా ఎక్కడయినా ఉంటాయా అని సర్దుకుపోతాం. కానీ ఆ సర్కారీ ప్రచారాన్ని కాసేపు పక్కనపెట్టి మీరు ఒకసారి ఈ బాహ్య ప్రపంచాన్ని చూడండి. ఎంత భయోద్విగ్నంగా ఉందో ఈ లోకం అర్థమవుతుంది. అంతా తల్లకిందులుగా కనిపిస్తుంది.

దీన్ని సరిచెయ్యడానికి మార్గం ఏమిటి? పౌరశాసనోల్లంఘన ఒక్కటే దీనికి పరిష్కారం. నన్ను ఈ రోజున మాట్లాడమని కోరింది కూడా ఈ అంశం మీదే. పౌరశాసన నిరాకరణే మన సమస్య అంటున్నారు కానీ నా దృష్టిలో పౌర శాసన విధేయతే మన అసలు సమస్య అని నేను అనుకుంటున్నాను. ఈ విధేయత కారణానే ప్రపంచంలో వేలూ, లక్షల మంది సర్కారు మాటలు, ఆజ్ఞలు పాటించి యుద్ధాల్లో దూకి అసువులు బాసారు. ఇంకా మన విషయానికి వచ్చేసరికి మనం గొప్పగా చెప్పుకునే పశ్చిమ నాగరికత పేరుతో కాలేజీ పిల్లలు అత్యంత విధేయతతో, అదేదో తమ విద్యుక్తధర్మంలా మారు మాట్లాడకుండా యుద్ధభూమికి తరలివెళ్తుంటారు. పేదరికం ఆకలిచావులు, సర్కారు మూర్ఖత్వం, యుద్ధ క్రూరత్వం ఇన్ని సమస్యలు ఉన్నా ప్రపంచ ప్రజానీకం 'ఇలాంటి' విధేయత ప్రదర్శించడంలో ఎవరికి ఎవరూ తీసిపోరు. చిల్లర దొంగలు జైళ్ళలో ఉంటుంటారు. గజదొంగలు రాజ్యం ఏలతా ఉంటారు. అలాంటి గజదొంగల రాజ్యానికి ప్రజలు విధేయంగా ఉంటుంటారు. ఇదీ మన సమస్య. నాజీ జర్మనీలో జరిగింది ఇదే. అక్కడ కూడా విధేయతే అసలు సమస్య. ప్రజలు హిట్లర్ పట్ల అత్యంత విధేయత ప్రదర్శించారు. అలా జరిగి ఉండాల్సింది కాదు. ప్రజలు అతన్ని సవాలు చేసి ఉండాల్సింది. నిలదీయాల్సింది. ప్రజలు గొర్రెల మందలాంటి వాళ్ళు అనే నానుడిని నిజం చేసారు. మనం కూడా ఏం తక్కువ

తినలేదు. మన పెంపకమే అలా సాగింది. ఎంతో సమున్నతంగా ఎదిగిపోయాం అనుకుంటున్నా ఇప్పటికీ ఫ్రాంకిల్ ప్రకటన నా చెవుల్లో గింగురుమంటూ ఉంటుంది. – “ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు…నువ్వు ప్రపంచంలో తొలి ఐదు అద్భుతాలు ఏమిటో టిక్కు పెట్టుకో అది వరసగా అమెరికాయే అవుతుంది. “అని కదా అతను చెప్పింది. గత ఐదేళ్ళ సంగతే చూసుకోండి మీకు ఈ దేశం అంత అద్భుతమైనది అని అనిపిస్తుందా. మనం సామ్రాజ్యవాద విస్తరణ, దురాక్రమణ దాహంతో ఉన్నామని మెజారిటీ ప్రపంచం భావిస్తుంది. మనమీద చాలా అల్పమైన అభిప్రాయాలు ఉన్నాయి జనానికి. బయటి ప్రపంచం సంగతి సరే. ఈ దేశంలో జనం మాత్రం ఇంతకన్నా గొప్పగా ఏమన్నా భావిస్తున్నారా. ఇక్కడ కూడా మన సర్కారు అదే దూకుడు ప్రదర్శిస్తుంది. దేశ సంపదను మరీ అన్యాయంగా ఒక వర్గానికే దోచిపెడుతుంది.ఈ దేశంలో పేదలకు నల్ల జాతీయులకు, అతివాద భావాలు ఉన్న వాళ్ళకి న్యాయం దక్కకుండా చేస్తుంది. ఇలాంటి అమెరికా ఒక అద్భుతమైన, ప్రత్యేకమైన ప్రపంచం అని గొప్పలు చెబుతుంటే ఎవరైనా ఎలా నమ్మేది. నిజంగానే ఇది ఒక ప్రత్యేకమైన అద్భుతమైన దేశం కాదు, కానేకాదు.

ఏదో చెప్పబోతూ ఎక్కడికో వెళ్ళిపోయానా? లేదు. పౌరశాసన విధేయత అన్న సమస్య మీద కదా మనం మాట్లాడుకుంటుందీ. చట్టం ఇక్కడ చాలా కీలకమైనది. చట్ట విధేయత తద్వారా శాసన విధేయత గురించి మనం మాట్లాడుకుంటున్నాం. చట్టం ఆధునిక కాలపు మహాద్భుత ఆవిష్కరణ. ఇది పశ్చిమదేశాల నాగరికతకు సంకేతకంగా చెప్పుకుంటాం, అదీ చాలా గర్వంగా. ‘చట్టబద్ధమైన పాలసీ’ ఓహ్! ఇదీ ఇంకో గొప్ప నాగరిక ఆవిష్కరణ. ఫ్యూడల్ యుగంలో దోపిడీని గుర్తుకు తెచ్చుకోండి. మధ్యయుగం ఎంత భయంకరంగా నడిచిందో జ్ఞాపకం చేసుకోండి. ఇప్పుడు మనం పశ్చిమ దేశ నాగరికతను అనుభవిస్తున్నాం. చట్టబద్ధమైన పరిపాలన. ఈ చట్టబద్ధమైన పరిపాలన మనకు ఏం ఒరిగించిందంటే – చట్టబద్ధమైన పాలన వేసవి కాలంలో ఉన్న అన్యాయాన్ని, అసమానతలను గతంలో ఎన్నడూ లేనటువంటి గరిష్ట స్థాయిలో చట్టబద్ధం చేసింది. అందుకే చట్టబద్ధమైన పరిపాలన అంటే ఏమిటో వాస్తవికంగా మనం అంచనా వేద్దాం.

ఈ చట్టబద్ధమైన పరిపాలన ప్రజల పాలిట మహమ్మారిలా, పాలకులకు మాత్రం వలచివచ్చిన రాకుమారిలా ఎందుకు తయారయ్యిందో ముందుగా గుర్తించాలి మనం. పాలక పార్టీలు తెల్లారి లేచింది మొదలు ఒక దాన్నొకటి దుమ్మెత్తి పోసుకుంటూ సకల అరిష్టాలకు కారణం నువ్వంటే నువ్వని పరస్పరం ఆరోపించుకుంటూ, మేం గనక అధికారంలోకి వస్తే ఎంతమార్పు తెస్తామో చూడండి అని చెప్పే ఈ రెండు పార్టీల నాయకులే మనకు ఎన్నికలు మినహా మిగిలిన సందర్భాలలో తరచూ ఒకే వేదిక మీద కరచాలనాలు చేసుకుంటూ ఒకళ్ళనొకళ్ళు ప్రేమాస్పదంగా కావిలించుకుంటూ కనబడతారు. ఎవరి బదులు ఎవరు

అధికారంలోకి వచ్చినా ప్రజల తలరాతలు మారకుండా చట్టబద్ధమైన పరిపాలన సాగిస్తా ఉంటారు.

'ప్రతి ఒక్కళ్ళు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పోతుంటే ఏమైపోతుందీ దేశం' అని పాలకులు తరచూ మనల్ని ప్రశ్నిస్తుంటారు. సరే అందరూ చట్టాన్ని శిరసావహిస్తే ఏం జరుగుతుందో చెప్పండి అని అదే పాలకులను మనం ఎప్పుడైనా నిలదీసామా? నిజానికి ఇది చాలా తేలిక ప్రశ్న, జవాబు టకటకామని చెప్పగలగాలి పాలకులు. కాని చెప్పలేరు. అసలు మనం ఈ ప్రశ్న వేస్తే గదా. అందరూ లేదా మెజారిటీ ప్రజలు చట్టాన్ని శిరసావహిస్తు వస్తున్నారు కాబట్టే జరగాల్సింది అంతా జరిగిపోతుంది. దోపిడి చేసుకునేవాడు మన శ్రమని, ప్రజలందరికీ చెందాల్సిన ప్రకృతివనరులను అయిన కాడికి దోచేసుకుంటున్నాడు. సంపద విపరీతంగా పోగేసుకుంటున్నాడు. అంతా చట్టబద్ధంగానే ఇప్పటిదాకా జరిగింది ఇదే. ఇహను జరగనున్నదీ ఇదే. ఎందుకంటే మనమంతా చట్టాన్ని దైవదత్తంగా శిరసావహిస్తాం కాబట్టి. కనీసం ఎక్కడయితే చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలో అక్కడకూడా పోరాడం కాబట్టి మనకు పుట్టుకతోనే ఈ విద్యను అబ్బిస్తారు. దీని కోసం వాళ్ళ పదకోశంలో కొత్త కొత్త పారిభాషికా పదాలు వచ్చి చేరుతుంటాయి.

ఆ ఉపమానాలు, ఉత్ప్రేక్షలకు మనం ఆశ్చర్యచకితులై పోతుంటాం. ఏమిటీ ఎందుకు ఎలా అన్న ప్రశ్నలు మరిచిపోతాం. ఉదాహరణకు మనవాళ్ళు తరచూ జాతీయ భద్రత గురించి మాట్లాడుతుంటారు. పొరుగు దేశాలతో యుద్ధానికి దిగిన ప్రతిసారీ ఇదే మాట జపిస్తా ఉంటారు. మంచిదే. జాతీయ భద్రతను ఎవరు మాత్రం కాదనుకుంటారు? కాలదన్నుకుంటారు? కానీ ఈ జాతీయ భద్రత ఎవరికోసం, ఎందుకోసం అని కనీసంగా కూడా మనం వాళ్ళని ప్రశ్నించం.

చట్టం చాలా విషయాలను రహస్యంగా కాపాడుకుంటూ వస్తుంది. హక్కుల చట్టం సంగతే తీసుకోండి ప్రజలకు అన్ని హక్కులు కల్పించే చట్టం కాబట్టే చట్టాలను ఆరాధనాపూర్వకంగానే మనం అభిమానిస్తుంటాం. ఈ చట్టమే లేకపోతే మన హక్కులు ఏమైపోనో కదా అనే భయం మనది. అందుకే చట్టాన్ని మన హక్కుగా, శాసనంగా, దైవదత్తంగా పరిగణిస్తుంటాం.

కానీ ఈ చట్టం మూలంగానే కదా మనం ఒక ఆదర్శరాజ్యాన్ని (రిపబ్లిక్) ఏర్పాటు చేసుకున్నాం అని ప్రకటించుకున్న రోజునుండి ఇప్పటివరకూ దోచుకునేవాళ్ళు దోచుకుతింటా ఉన్నారు. తెగబలిసి పోతూ ఉన్నారు. కష్ట జీవులు, కార్మికులు, పేదలు నిరంతరం పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐనా హక్కుల చట్టం అంటే ఇప్పటికీ జనానికి నిలువెల్లా అభిమానమే. మీకు దగ్గర్లో ఏదన్నా 'లా' కాలేజీ ఉంటే ఒకసారి పోయి రండి. అక్కడ విద్యార్థుల చేతుల్లో లావు పాటి బౌండు పుస్తకాలు ఉంటాయి. అంత లావు పుస్తకాలను చూసి బేజారయిపోకుండా ఊరికే వాటి మీద పేర్లు ఏమిటో చూసిరండి చాలు – మీకు చట్టం అంటే ఏంటో అర్థం కావడానికి. 'ఆస్థిచట్టం' కాంట్రాక్టు చట్టం' 'కార్పొరేట్ చట్టం' ఈ బౌండు పుస్తకాలే మీకు

ఎక్కువమంది చేతుల్లో కనబడుతుంటాయి. హక్కుల చట్టం రాజ్యాంగ చట్టం పుస్తకాలు మాత్రం నూటికో కోటికో ఒకటి కనబడినా మనం అదృష్టవంతులమనే చెప్పుకోవాలి. అయ్యా అదీ 'చట్టం' అంటే. సరే మధ్యలో ఒకమాట చెప్పా చమురు ధరల 'జాదూగరీ' అని గుర్తుందికదా. ఇది చట్టంలో ఎక్కడైనా ఉందా? లేనేలేదు. కానీ మన సెనెటర్‌గారు ఒక్క ఏడాదిలో ఈ పద్దుకింద 185000 డాలర్లు పైచిలుకు మొత్తం నొక్కేసారు. చట్టంతోపని లేకుండా చట్టం ముసుగులో జరిగే ఇలాంటి భాగోతాలు ఎన్నో. వీటి గురించి ఎక్కడా పెద్దగా ప్రచారం ఉండదు. కేవలం చట్టం గురించి దాని పట్ల ప్రజలు చూపించాల్సిన విధేయత గురించి మాత్రం శృతిమించిన రీతిలో ప్రచారం సాగుతుంటుంది.

ఇది ఇవాళ కొత్తగా వచ్చింది అనుకునేరు. కానే కాదు చట్టానికి ఉన్నంత చరిత్ర ఉంది. ఇలాంటి చట్టవిరుద్ధ దోపిడికి హక్కుల చట్టాన్ని మన పార్లమెంటులో ఆమోదించగానే దేశం యావత్తు పెద్ద పండగ చేసుకుంది. ఈ చట్టంతో పాటే సమాంతరంగా హామిల్టన్ ఆర్థిక ప్రణాళికను కూడా పార్టమెంటు (సెనెట్) ఆమోదించింది. ఏమిటీ ప్రణాళికా? ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ధనవంతులకు మరింత సొమ్ము సమకూర్చడం. అప్పట్నించీ ఇదే పని ఏదో ఒక పేరుతో – చమురు ధరల 'జాదూగరీ', కార్పొరేట్లకు పన్ను రాయితీలు తదాదివన్నీ ఈ కోవకే వస్తాయి. అయితే హక్కుల చట్టం గురించి ప్రభుత్వమూ పాలకులూ బహుదా ప్రచారం చేసారు. ఆర్థిక చట్టాలను మాత్రం అతి గోప్యంగా ఉంచేసారు.

చట్టాలకు ఏ మేరకు పబ్లిసిటీ ఇచ్చారో అందులో పదో వంతు కూడా ఆ చట్టాల అమలుకు శ్రద్ధ పెట్టలేదు. హక్కుల చట్టం సంపూర్ణంగా అమలుకు నోచుకుంటుందా? మీరు చెప్పండి. అంత బాగా కాదంటారా. సరే ఈ హక్కుల చట్టం మనకు వాక్‌స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది కదా. కానీ ఈ అధ్యాయం అంత పేచీకోరుది ఇంకోకటి లేదు. మన చట్టంలో నువ్వు ఎప్పుడు ఏం మాట్లాడవచ్చో ఏం మాట్లాడకూడదో నువ్వే నిర్ణయించుకోలేవు. మన సుప్రీంకోర్టు తీర్పులు, వ్యాఖ్యానాలు అలా చచ్చాయి మరి. పోనీలే ఈ తికమకలన్నీ దేనికి హక్కుల చట్టంలో ఒకటి మాత్రం చాలా స్పష్టంగా మనకు కనబడుతుంది. – వీధుల్లో కరపత్రాలు పంచుకునే హక్కు సుప్రీంకోర్టు కూడా శషభిషలు లేకుండా ఈ హక్కును బలపరిచింది. కాబట్టి మీలో ఎవరన్నా అలా వీధిలోకి వెళ్ళి కాసిన్ని పత్రాలు పంచుతూ నిలబడండి. క్షణాల్లో మీ ముందు ఓ పోలీసు ప్రత్యక్షం అవుతాడు. ఏ య్ ఫో ముందు ఇక్కడ్నించి అని నిన్ను గదమాయిస్తాడు. అవునా... 'అదేంటయ్యా పెద్దమనిషి మార్షె వర్సస్ అలబామా 1946 కేసులో సుప్రీంకోర్టు ఏం చెప్పింది. నీకు తెలియదా! అని మీరు ఎదురు అడిగారనుకోండి. ఫోమ్మన్నాన... నాకే చట్టం చెబుతావా అంటూ పోలీసు మన మెడబట్టి గెంటడం ఖాయం. అవునా – ఇదీ మన హక్కుల చట్టం భాగోతం. రాజ్యాంగ వాస్తవికత ఇది. కానీ ఈ చట్టాన్ని అద్భుతమైన ఆవిష్కరణగా, ఆధునిక నాగరికతగా మనకు చెప్పి ఒప్పిస్తున్నారు. వాక్స్వాతంత్ర్యాన్ని కుదించడానికి గానీ, కత్తిరించడానికి గాని సెనెట్ ఎలాంటి చట్టము, చట్ట సవరణ చెయ్యరాదు అని హక్కుల

చట్టంలో ఉంది. కాని హక్కుల చట్టం బిల్లు ఆమోదంపొంది ఏడేళ్ళు తిరగకుండానే 'సెనెట్' వాక్స్వాతంత్ర్యానికి కత్తెర వేస్తూ ఇంకో చట్టం చేసింది. గుర్తుందా - సెడిషన్ యాక్టు -1978.అంటే ఏం జరిగిందీ హక్కుల చట్టం అమలు గాలికి ఎగిరిన పేలపిండి మాదిరి తయారయింది. హోమిల్టన్ ఆర్థిక ప్రణాళిక మాత్రం ఆనాటి నుండి ఈనాటి దాకా పక్కాగా అమలవుతుంది. 1794లో పెన్సిల్వేనియాలో రైతులు అధిక పన్నులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసారు. ఈ తిరుగుబాటు అణచివేసి రైతుల ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేయ్యడానికి స్వయానా 'హమిల్టిన్' అశ్వారూఢుడై, సైన్యాన్ని ముందుకు నడిపించారు. ఇది చరిత్ర. ఇదే వర్తమానం కూడా - ఏ చట్టాలు అమలు అవుతున్నాయి, ఏ చట్టాలు కావడంలేదు అనేది గ్రహించుకోకుండా ఎవరికి వారే 'చట్టాలంటే నాకు తగని గౌరవం' 'నేను చట్టాన్ని మీరను' అని ఆదర్శాలు వల్లించడంలో అర్థం ఏముంది. ఇంతకీ ఏ చట్టం గురించి మాట్లాడుతున్నారు. మీరు? అట్లా అని నేను పూర్తిగా చట్టవ్యతిరేకిని అని భావించకండి ప్రజలకు ఏ చట్టం ఏ మేలు చేస్తుంది? ఏం కీడు చేస్తుంది అని ప్రతి ఒక్కరు గమనించుకోవాలని మనవి చేసున్నాను. చట్టంతో చాలా చిక్కులున్నాయి. అదో చిత్రాతిచిత్రమైన అంశం. చట్టం మూలంగా శాంతిభద్రతలు ఒనకూడుతాయని మనమంతా భావిస్తుంటాం. కానీ చట్టం ఆ పని చెయ్యలేదు. ఆ పని చెయ్యలేదని మనకెలా తెల్సు. ఎన్ని చట్టాలు లేవు ఈ దేశంలో - అయినా శాంతి భద్రతలు ఉన్నాయా ఇక్కడా. ఈ విషయం నాకన్నా మీకే ఎక్కువ తెలుసు. అట్లాంటప్పుడు మనం శాసనోల్లంఘన చేబడితే అంతటా అరాచకం చెలరేగుతుందేమో అనే సందేహం మీకు ఎందుకు వచ్చినట్లు? ఇప్పుడు అరాచకం లేనిది ఎక్కడ? చట్టం పేరిట సాగుతున్న అరాచకం మీకు ఎల్లడెలా కనబడుతుంటుంది. ప్రజల మనసులను గందరగోళ పరిచే అరాచకం అని దేనిని అంటామో అంతర్జాతీయ సమాజం సంక్షోభం అని దేనిని అంటుందో - అవి రెండు ఈ దేశంలో నికార్సుగా నెలవయి ఉన్నాయి. నాకు తెలిసీ చట్టాలు మాత్రమే సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పలేవు. అంతరాలు లేని సమసమాజంలో మాత్రమే ప్రజల మధ్య గరిష్ట స్థాయిలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొంటాయి. అలాంటి నవసమాజం మాత్రమే శాంతి భద్రతలకు పూచీ నివ్వగలదు. నిర్బంధ చట్ట ప్రయోగం ద్వారా మాత్రమే శాంతి భద్రతలు నెలకొల్పాలని ప్రయత్నించే ఏ సమాజమయినా నియంతృత్వ రాజ్యాధికారంలో ఉన్నట్లు మనం గుర్తించాలి. అలాంటి సమాజంలో ప్రజలు తీరని అన్యాయాలకు గురవుతుంటారు. అలాంటి సమాజంలోనే ప్రజలు తిరుగుబాట్లు చేస్తుంటారు. అంతిమంగా ఏ శాంతి భద్రతలను ఆశించి చట్టాలు చేసారో ఆ చట్టాలు మూలంగానే సమాజం అస్థిరం పాలవుతుంది.

చట్టాలను మనం పవిత్రాతి పవిత్రంగా మన్నా వాక్యంలా భావిస్తుంటాము. డానియల్ బెర్రిగాన్ ఉదంతం మీకు గుర్తుందా. యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన తెలియచెయ్యడానికి చట్టాల ప్రతులను తగలేసాడు అతను. ఈ శతాబ్దంలోనే అత్యంత 'హింసాత్మక నేరంగా' దీన్ని పరిగణించారు పాలకులు. క్రిమినల్ నేరాలు మోపి మరీ జైలు పాల్జేసారు. వాళ్ళ అమ్మకు

ఎనభైఏళ్ళు. మీడియా ఆవిడ దగ్గర క్యూ కట్టి మీ అబ్బాయి ఇలా చట్టాన్ని ఉల్లంఘించడం గురించి ఒక తల్లిగా మీరేం అనుకుంటున్నారు అని అడిగింది. మీడియా ఆశించిన సమాధానం వేరు కానీ ఆ కన్నతల్లి ఏం చెప్పిందో తెల్సా – 'ఆ దేవుడు సృష్టించలేదు కదా ఈ శాసనాలూ మనకు మనమే రాసుకున్నాం కదా. దాన్ని నిరసించడం ప్రతి మానవుడి హక్కు మా అబ్బాయి అదే పని చేసాడనుకుంటున్నా' అంది ఆవిడ. కానీ మనం ఈ విషయాలు గుర్తుంచుకోం మర్చిపోతాం ఆవిడ అన్నది నిజమే కదా చట్టాలు చేసింది మానవ మాత్రులం మనమే కదా వాటికి దైవత్వం ఆపాదించడం ఏమిటి? ఇంకా మీలో ఎవరికైనా ఆవి దైవదత్తమనే అభిప్రాయాలు ఉంటే ఆ చట్టాలను రూపొందించే మన ప్రజా ప్రతినిధుల చరిత్ర ఒక్కొక్కరిదీ తిరగెయ్యండి. సెనెట్‌లో కూచుని చట్టాలు రూపొందే తీరును గమనించండి. మీరు చట్టాలకు ఆపాదిస్తున్న పవిత్రత సబబా బేసబబా మీకే అర్థం అవుతుంది.

శాసనకర్తల పేరిట వాళ్లు ప్రజలను వంచిస్తున్నారు. అసలు సమస్య ఇదే. పాత రోజుల్లో అంటే అంతా చిదంబర రహస్యమే అంతా గుట్టే. కానీ రోజులు మారాయి. ఇప్పటిలా కాదు. చట్ట ప్రతులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మనం చదివి తెలుసుకోవచ్చు అలాగే ఈ చట్టాలు అమలవుతున్నతీరునూ మనం రోజువారీ జీవితంలో గమనించవచ్చు. ఈ మధ్యనే బోస్టన్‌లో ఒక సంఘటన జరిగింది. ఒక పోలీసాయన హాస్పటల్ వార్డులోకి ప్రవేశించి ఒక నల్ల జాతీయుడి మీద విచక్షణా రహితంగా ఏడు సార్లు తుపాకీతో కాల్చి చంపేసాడు. ఆ నల్ల జాతీయుడు చేసిన నేరం ఏమిటి? ఈ పోలీసాయన చేతిమీద ఉన్న తువ్వాలు లాక్కు వెళ్ళాడట. కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు మీద న్యాయమూర్తి పోలీసాయన చర్యను సమర్థిస్తూ తీర్పు ఇచ్చాడు. 'అతను ఆ పని చేసి ఉండకపోతే సాటి పోలీసుల గౌరవానికి భంగంగా అలాంటి దుడుకు చర్యలే పునరావృతం అయ్యే అవకాశం ఉందని న్యాయమూర్తి భావించాడు. అయ్యా చట్టం తనపని తాను చేసుకుపోవడం అంటే ఇదే! ఏమంటారు దీన్ని మోసం అనాలా లేక ఇంకేదన్నా పదం ఉందా. అసలు మన దేశ ఆవిర్భావమే చట్టధిక్కారపు పునాదులమీద జరిగింది. అది మరిచి పోతున్నాం మనం. ఆ తరువాతే రాజ్యాంగం, స్థిర ప్రభుత్వం అనే భావనలు వచ్చాయి. మాడిసన్ హామిల్టన్‌లకు ఈ రెండు ప్రాణాప్రదమైన భావనలుగా మారాయి. రాజ్యాంగం ప్రభుత్వం చట్టాలు ఏర్పాటు చేసుకున్నాం. అయితే తదనంతరకాలంలో అనేక కీలక సందర్భాలల్లో అప్పటికే మనం ఏర్పాటు చేసుకున్నా న్యాయచట్రం, చట్ట పరిధులతో కొన్ని సమస్యలకు పరిష్కారం దొరకలేదు. బానిసత్వాన్ని రద్దు చెయ్యడానికి మనం న్యాయచట్టం పరిధిని అధిగమించాలి. అమెరికా విప్లవం సందర్భంగా పౌర అంతుర్యుద్ధం సందర్భంగా ఎన్నో సార్లు ఇలానే న్యాయ చట్టం పరిధిని అతిక్రమించాల్సి వచ్చింది. 1930వ దశకంలో కొన్ని హక్కులను కల్పించడానికి ఇలానే న్యాయ చట్రం పరిధిని అతిక్రమించాం. ఇవాళ మన చుట్టూ ఉన్న పరిస్థితులు అమెరికా విప్లవ కాలంనాటికన్నా దుర్భరంగా మరింత సంక్లిష్టంగా ఉన్నాయి. ఈ పరిస్థితులు మరింత దిగజారకుండా

నిలవరించడానికి, హుందా అయిన సమాజానికి కావల్సిన రాజ్యాంగ సంస్థలను సంబంధాలను సృష్టించుకోవడానికి మరోసారి మనం అనివార్యంగా న్యాయచట్రం పరిధిని అతిక్రమించాలి. ఇదేదో విధ్వంసం కోసం ఉద్దేశించినది కాదు, మానవ నవజీవన సమాజ నిర్మాణం కోసం ఉద్దేశించినది. ప్రభుత్వం పాలకులు చూస్తు ఊరుకుంటారా మరీ? ఊరుకోరు. అంతదాకా ఎందుకు మీరంతా కలిసి ప్రజలందరికీ ఉపయోగపడేలా ఒక పార్క్ నిర్మాణానికి పూనుకుని చూడండి తక్షణమే రాజ్యం సాయుధ బలగాలను మీమీదకు తోలుతుంది. పార్కు ప్రజోపయోగమైనది అయినా సరే అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నాం అని చెప్పి మిమ్మల్ని తరిమి తరిమి కొడుతుంది. కాబట్టి మనం ఎంచుకున్న పరిపూర్ణ సమాజ నిర్మాణ బాధ్యత అంత తేలికయిన విషయం కాదు. శిథిలమయిపోతున్న ఈ సమాజంలో మరో నూతన సమాజం నిర్మించడం కోసం మనం శాసనోల్లంఘనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని నేను భావిస్తున్నా. మరి ఎన్నికలు, ఓటింగ్ సంగతి ఏంటంటారా? వీటికి శాసనోల్లంఘనకి లంకెపెట్టుకోబాకండి శాసనోల్లంఘనలో ఎన్నికలు – ఓటింగ్ బహిష్కరణలు ఒక భాగమే కాని మన ఎన్నికల విషయంలో 'శాసనోల్లంఘన అని పెద్ద పెద్ద పదాలు వాడనక్కరలేదు. ఎన్నికల గురించి ఇప్పటికే మనకు అంతా అర్థమైపోయి ఉండాలి. అర్థం కాకపోయి అన్నా అయి ఉండొచ్చు. ఓటింగ్ బూత్‌లు' మనపాలిట పవిత్ర తీర్థ స్థలాలు అనే లెక్కన మనం పెరిగి పెద్దయ్యాం. ఏం జరుగుతుంది? మనం బారులు తీరి నిలబడి ఓట్లు వేసి బయటికి వస్తాం. ఏదో ఒక పేపరు వాళ్ళో, టీవీ వాళ్ళో మన ఫోటో తీస్తారు. మనం ముఖాన చిరునవ్వు అతికించుకుంటాం. మర్నాడు పేపర్లో మన ఫోటో అచ్చవుతుంది. కిందన ప్రజాస్వామ్య దరహాసం అన్న హెడ్డింగ్ ఉంటుంది. నాలుగేళ్ళకు ఓ మారు ఓటు చెయ్యడం ప్రజాస్వామ్యానికి పర్యాయపదంగా మారిపోయింది మన దేశంలో. కానీ రాజకీయ శాస్త్రవేత్తలను ఎవరినన్నా అడగండి ప్రజాస్వామ్యం అంటే ఓటు చెయ్యడమేనా ఇంకేమన్నా అర్థం ఉందా అని వాళ్ళు వివరంగా చెబుతారు. మన ఓటింగ్ ప్రక్రియ పెద్ద ఫార్సు అంటాను నేను. ఎవరూ ఉలికిపడనక్కరలేదు. కమ్యూనిస్టు రష్యాలోను, చైనాలోను ఓటింగ్ జరుగుతుంది. అక్కడ కూడా ప్రజలు బారులు తీరి నిలబడి ఓటు చేస్తారు. బయటకొచ్చి మనలాగే నవ్వు మొహం పెడతారు. పేపర్లలో ఫోటోలు వస్తాయి. కిందన ప్రజాస్వామ్యదరహాసం అన్న హెడ్డింగ్ ఉంటుంది. కానీ మనవాళ్లు ఒప్పుకుంటారా 'కమ్యూనిస్టు దేశాల్లో ఎన్నికలు ఒక బూటకం అది ముమ్మాటికీ ప్రజాస్వామ్య పరిహాసమే. ఎన్నికలలో ఒక్క పార్టీయే ఉంటుంది అక్కడ. చూసారా అని మనకు వివరించి చెబుతారు. దీన్ని ప్రజాస్వామ్యం అని నమ్మొద్దని అంటారు. వాళ్ళది ప్రజాస్వామ్యం కాకపోతే మనది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది. ఆ దేశాల్లో మాదిరి కాకుండా మన దగ్గర రెండు పార్టీలు అంటే వాళ్లకన్నా ఇంకో పార్టీ ఎక్కువ ఉన్నందుకా? ఇది నియంతృత్వం కాదా.

నేను చెప్పదలుచుకుంది ఏంటంటే – ప్రజాస్వామ్య విలువ గురించి తెలుసుకోవాలంటే మన దేశ స్వాతంత్ర్య ప్రకటన(డిక్లరేషన్)లో పొందుపరిచిన సూత్రాలు, లక్ష్యాలు స్ఫూర్తిని చదవండి. ఆ డిక్లరేషన్ స్ఫూర్తి ఏంటంటే ప్రజల స్వేచ్ఛను పరిపూర్ణ మానవుడిగా సంతోషంగా

బ్రతికే హక్కును నిరాకరించే చట్టవ్యతిరేక అధికార కేంద్రం ఏదయినా సరే దాన్ని నిలువరించాలి. అలాంటి అధికార కేంద్రాన్ని సరిదిద్దే హక్కు వీలుకాకుంటే సమూలంగా రద్దు చేసే హక్కు ప్రజలకు ఉండాలి అంటుంది. ఇప్పుడు మనం కోరుకుంటుందీ అదే కదా మన దేశ స్వాతంత్ర్యోద్యమ ప్రకటన స్ఫూర్తిని ఔదల దాల్చడానికి మనం చట్టాల్ని అతిక్రమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మనం ఏం అడుగుతున్నాం? తప్పుడు అభియోగాలతో జైళ్ళలో కుక్కిన అమాయక పౌరులను విడిచి పెట్టండి. తప్పుడు పద్ధతులతో సంపదను పోగేసుకున్న వాళ్ల ఆస్థులు స్వాధీనం చేసుకుని సంపద పునఃపంపిణీ చేయండి. అక్రమార్కులను అక్రమార్జనపరులను జైల్లో పెట్టండి అనేకదా. ఇందుకోసం మనం శాసనోల్లంఘన ఉద్యమంలో ముందు పీఠిన నిలవాలి. ఇక్కడనే కాదు ప్రపంచంలో ఇంకా అనేక దేశాలలో శాసనోల్లంఘన ఉద్యమ ఆవశ్యకత ఉందని నే భావిస్తున్నా. శాసనోల్లంఘన రాజ్యాధికారమే కావచ్చు కానీ ఈ రాజ్యం ఎవరిది? బలవంతులది, ధనవంతులది. దీన్ని ధిక్కరించడానికి మీనమేషాలు లెక్క పెట్టాల్సిన అవసరం ఏముంది. సకల దేశాల ప్రజలూ సుసంఘటితంగా ఐక్యంగా ఆచరించదగ్గ మార్గం శాసనోల్లంఘన ఉద్యమం. ఇందులో వేరే అభిప్రాయానికి తావే లేదు.

## రాజకీయ ఖైదీలు, జైళ్ళు, నల్లజాతి విముక్తి ( 1970)

## - ఏంజెలా డేవిస్

కనీస మానవహక్కుల సాధనకోసం మహోద్రేకంగా ఉద్యమిస్తున్న నల్లజాతి ప్రజానీకాన్ని ఉద్దేశించి మనం 'శాంతం' 'శాంతం' అని హితవు చెబుతున్నాం. ఓపిగ్గా ఉండాలి నాయనలారా అని సుద్దులు చెబుతున్నాం. ఈ ప్రజాస్వామిక సమాజంలో నమ్మకం ఉంచండి. మీ వంతు భాగ్యం దానంతట అదే ఇవాళ కాకపోతే రేపయినా, మీ ఇంటి తలుపు తడుతుంది అంటూ ఊరడిస్తున్నారు.

కాని మనకు ఎదురయిన అనేక చేదు అనుభవాలు మనకు ఏం నేర్పాయి. పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి ప్రజాస్వామ్యానికి పొసగనే పొసగదు, మన సమాజంలో నెలకొన్న అన్ని అరిష్టాలకూ కారణభూతమయింది ఈ పెట్టుబడిదారీ ఆర్థిక విధానమే అని కదా. పైకి ఎన్ని గొప్పలు చెప్పినా ఈ వ్యవస్థా, ఈ ప్రజాస్వామ్యం ఈ చట్టాలు ప్రజలను మరీ ముఖ్యంగా నల్లజాతి ప్రజానీకం అణగారిన పేదలు, శరీరకష్టంమీద బ్రతికే శ్వేత జాతీయుల సహా ఎవరిని ఉద్ధరించడానికి కాదు. ప్రజలు ఇవాళ తమ జీవితాలను తాము నిర్ణయాత్మకంగా చక్కదిద్దుకునే పరిస్థితుల్లో లేరు.

అర్ధవంతమైన విమర్శకు నిరసనకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని పాలకులు గొప్పగా చెబుతుంటారు. అయితే ఇవన్నీ చట్టపరిధికి లోబడి ఉండాలని నొక్కి వక్కాణిస్తుంటారు.

దోపిడి, అణిచివేత విధానాలు కనబడకుండా పొగమంచు తెరను అడ్డం పెడుతుంటారు. బానిసత్వం అమానవీయం, అమానుషం రాజ్యాంగవిరుద్ధం అని పైకి ఒప్పుకుంటుంటారు. కానీ ఇవాళ పరిస్థితులు మరీ అంత ఘోరంగా లేవు (ఎందుకంటే దీని మూలంగా లబ్ధిపొందే ధనాఢ్య వర్గాలు ఉన్నాయి గనుక) అన్న సమర్థింపులకు దిగుతుంటారు.

అమెరికా చరిత్రను తరచి చూస్తే ఆవిర్భావ కాలం నుండి ఇలాంటి అన్యాయమైన చట్టాలు ఎన్నో చలామణిలో ఉన్నాయని వేరుగా చెప్పనవసరంలేదు. ప్రత్యేకించి నల్లజాతి ప్రజానీకాన్ని అణిచి ఉంచడానికి చట్టాల్లో ఎన్నో వెసులుబాట్లు ఉన్నాయి. ఈ లొసుగుల ప్రతిఘటనలే ఇవాళ సమాజంలో మనం చూస్తున్న అసమానతలు వర్ణదురహంకారం పెనవేసుకుపోయింది. ఈ వ్యవస్థలో నల్లజాతి ప్రజలు, వలస ప్రజానీకం అణగారిన ప్రజలు సామాజికంగా దుర్భరమైన పరిస్థితులను చవిచూస్తున్నారు. అభివృద్ధి ఊసే లేదు వీరి జీవితాల్లో. మౌనంగా అన్నీ భరించడమే తప్ప వేరే మార్గం లేదు వీళ్లకు. ఇందుకు కారణమైన అన్యాయయమైన చట్టాలను వ్యతిరేకిస్తే మాత్రం చట్ట విరోధులు అయిపోతారు.

మన బ్రతుకులు బాగు చేసుకోవడం క్రియాశీలమైన ప్రతిఘటనా మార్గాలను రూపొందించుకునే మన నైపుణ్యం మీదే ఆధారపడి ఉంది. ఈ క్రమంలో మన అణచివేతకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఊతం ఇస్తున్న చట్టాలను మనం బాహాటంగానే ఉల్లంఘించాల్సి వస్తుంది. మనం చట్ట పరిధిలోనే ఇలాంటి ప్రతిఘటనకు పూనుకున్నా మన మీద నేరస్థులనే ముద్రవేస్తారు. అరెస్టులు, విచారణ, అన్యాయమైన తీర్పులు, జైలు శిక్షలూ మామూలే ఎందుకంటే న్యాయవ్యవస్థ కూడా ఈనాడు వర్ణ వివక్ష ధోరణులతో పులిసిపోయి ఉంది.

రాజ్యానికి ఉన్న నిర్బంధ యంత్రాంగంలో జైలు ఒకటి. సామాజిక నియంత్రణ సాధించడానికి రాజ్యానికి అనువైన ఏకైక సాధనం ఇది. 'జైలు విధానం' (ప్రిజన్ సిస్టమ్) అనే పదం పుట్టుక వెనుక ఉన్న పరమార్థం భావాలను నియంత్రించడం. సమాజానికి విధేయంగా ఉండటానికి రూపొందించుకున్న సూత్రాలను నిబంధనలను నియంత్రణలను భౌతికంగా గానీ, భావపరంగా గానీ సవాలు చేసే వ్యక్తి ఎవరయినా దండనార్హుడే అలాంటి వాళ్ళకు శిక్షగా చీకటి కొట్టాల్లో బంధించడం మనం గ్రీకుల కాలం నుండి గమనించవచ్చు. బూర్జువా సమాజాలు అన్నింటిలో సార్వజనీనమైన అంశం ఏమిటంటే ఖైదు చెయ్యడం. చట్టం ముందు పేద – గొప్పా అనే తారతమ్యం లేదు. తప్పు చేస్తే ఎవరికైనా శిక్ష పడాల్సిందే అని గొప్ప ఆదర్శంగా చెబుతుంటారు. కానీ ఆ చట్టాలు ఎవరు చేస్తారు? నేర 'నిర్వచనం' ఎవరు చేసారు – అని గనుక మనం ఆలోచిస్తే ఖచ్చితంగా ఈ రెండూ సమాజంలోని పాలక శక్తుల సృష్టి అని అర్థం అవుతుంది. అంటే చట్టాలు, జైళ్ళు ధనాఢ్య వర్గాల – పాలకశక్తుల ప్రయోజనాలు కాపాడడానికే పుట్టుకొచ్చాయి. అందుకే జైళ్ళు వర్గ ఆధిపత్యం చలాయించడానికి ఒక సాధనం. లేనివాళ్ళు ఉన్నవాళ్ళ మీదకు తెగబడకుండా ఉండడానికి ఏర్పాటు చేసుకున్న కంచె.

కాని ఒక్క విషయం మాత్రం స్పష్టం. సంపద అసమాన పంపిణీ ఉన్న సమాజాల్లో నేరాలు చోటు చేసుకోవడం సర్వసాధారణమైన అంశం. సమాజంలోని ఉత్పత్తి శక్తులు దారిమళ్ళుతున్నాయనేదానికి 'నేరాల రేటు' ఒక కొలమానం. జరిగిన నేరాలలో ఎక్కువశాతం ప్రత్యక్షంగానో పరోక్షంగానో 'ఆస్థి' సంపదలతో సంబంధం కలిగి ఉండడం యాధృచ్ఛికం కాదు. 'ఆస్థి'తో పెనవేసుకు ఉన్న నేరాలన్నీ అణచివెయ్యబడ్డ సామాజిక అవసరాలకు, తలకిందులు సామాజిక సంపద పంపిణీలకు కొండగుర్తులు. పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలోనే నేర స్వభావానికి మూలాలు ఉన్నాయి. ఆ వ్యవస్థతో పాటు అభివృద్ధి చెందుతూ వస్తాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావమైన 'దోపిడీ'నే వీళ్లూ ఆలంబనగా చేసుకుంటారు. కాబట్టి జైళ్ళు నేరగాళ్ళను సంస్కరించే ఉద్దేశంతో నెలకొల్పాం అని పాలకులు చెప్పేది ఒట్టిమాట. ఇది రోగ నిదానానికి పనికొస్తుందేమో (ఆచరణలో ఇందుకు కూడా పనికి రావడం లేదని పెరుగుతున్న క్రైం రేటు చెబుతుంది) గానీ, వ్యవస్థలో ఉన్న దోపిడీ స్వభావం అంతం కానిదే నేర స్వభావ నిర్మూలన అనేది జరగనే జరగదు.

పెట్టుబడిదారీ అంతర్గత సంక్షోభం మూలంగా ఇవాళ వేలాది మందిగా నల్ల జాతీయులు, ప్రవాస అమెరికన్లు వలస ప్రజానీకం ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా తయారయ్యారు. పారిశ్రామిక రిజర్వు నిరుద్యోగ సైన్యంలో చేరిపోయిన నా సోదర సోదరీమణులందరూ ఇకనైనా 'సీరియస్'గా ఆలోచన చెయ్యాలి. ఒక రకంగా ఇప్పుడు మీరంతా విప్లవోద్యమానికి సారథులయిన శ్రామికవర్గంలో భాగం అయ్యారు. శాస్త్ర సాంకేతికాభివృద్ధిలో భాగంగా రాబోయే కాలంలో నిరుద్యోగం మరింత ప్రబలిపోయే అవకాశం ఉంది. ఇవాల్టికి ఇవాళ 30 శాతం మంది నల్లజాతి యువత నిరుద్యోగులుగా ఉన్నారు. వర్గదోపిడి, జాతి అణిచివేతల మూలంగా ఈ సమాజంలో కనీస మాత్రపు బతుకుకి నోచుకోకుండా చేస్తున్న మూలాన్ని వేరే గత్యంతరం లేక అనేకమంది నేరాలకు పాల్పడుతున్నారుగానీ, నేరాలే బతుకు తెరువుగా ఎవరూ కావాలని ఎంచుకోరు. ఈ నేర విషయవలయాన్ని ఛేదించి గౌరవ ప్రదమైన హుందా అయిన మానవ జీవితాన్ని సాధించుకోవాలంటే ఇందుకు కారణమైన వ్యవస్థలోని దోపిడి మూలాలకు వ్యతిరేకంగా పోరు సల్పాలి. అందుకు విశాల ప్రాతిపదికన కార్మికవర్గం తోటి, నిరుద్యోగ రిజర్వు సైన్యం ఐక్యం కావాలి. బ్లాక్ పాంథర్ పార్టీ ఇవాళ ఈ దిశగా మంచి కృషి చేస్తుంది. చెరశాలలో ఉన్న కార్యకర్తలు కూడా అక్కడ ఇదే కృషి మొదలు పెట్టారు.

నిరుద్యోగులుగా ఉన్న నల్లజాతి యువత, శ్వేతజాతి యువతరాన్ని, వలస ప్రజానీకాన్ని తమతో కలుపుకుపోవాలి. ఈ కృషిలో చారిత్రకంగా అమెరికన్ సమాజంలో పాదుకొని ఉన్న వర్ణ వివక్ష, వర్ణ దోపిడీలను కూడా గమనంలో ఉంచుకుని తగిన ఎత్తుగడలు రూపొందించుకోవాలి. ఈరెండు శక్తులూ ఏకమై కార్మికవర్గంతో జత కలిస్తే దోపిడికి పీడనకు

వ్యతిరేకంగా ఉమ్మడి ప్రతిఘటనను పెంపొందించిన మన పాత సంప్రదాయానికి తిరిగి జీవం పోసినవారం అవుతాం.

అలాగే అమెరికన్ జైళ్ళలో మగ్గుతున్న ఖైదీలలో విప్లవ శ్రేణులుగా పనికొచ్చేవారిని ఎంపిక చేసుకునేటప్పుడు వారు చేసిన నేరాలు ఏమిటో క్షుణ్ణంగా పరిశీలించి పరిగణనలోకి తీసుకోండి తప్ప శిక్షా కాలాన్ని బట్టి ఎలాంటి నిర్ధారణలకు రాకండి. డబ్లు. ఇ.బి.డ్యుబోయిస్ చెప్పినట్లు మన దేశ న్యాయవ్యవస్థ వర్ణ వివక్షతకు అతీతంగా పని చేసేది కాదు. ఈ ప్రభావం మూలంగానే వందలాది మంది అమాయక నల్లజాతి వలస పౌరులు చిన్న చితకా నేరాలకు కూడా సుదీర్ఘకాలంగా శిక్షలు అనుభవిస్తా ఉన్నారు.

ఇలా సుదీర్ఘకాలం శిక్షలు పడినవారి మీద ప్రభావాలు ఎలా ఉంటాయో కూడా మన గమనంలో ఉండాలి. ఫలానా నేరానికి ఫలానా శిక్ష అని చట్టంలో ఉంటుంది. నేరం చేసిన వారికి కూడా తనకు ఎంత కాలం శిక్ష పడవచ్చో ఒక అంచనా ఉంటుంది. చట్టం అతనికి తెలియకపోయినా ఇన్నేళ్లు శిక్ష పడొచ్చు అని లాయర్లు చెబుతారు. కానీ వర్ణ వివక్షతాపూరిత న్యాయవ్యవస్థ ఇలాంటి అంచనాలను కూడా శ్వేతేతర జాతీయుల విషయంలో తలకిందులు చేస్తుంది. దోపిడి దొంగతనానికి రెండేళ్ళ నుండి నాలుగేళ్ల శిక్షపడుతుంది. కాని అదే శ్వేతేతర జాతీయులయితే పది నుండి పదిహేనేళ్ళ పాటు జైలు వేసిన సందర్భాలు కొల్లలు. అదే నేరానికి గాను శ్వేత జాతీయుడు రెండేళ్ళకే జైలు నుండి విడుదల అయిన ఉదంతాలూ లెక్కలేనన్ని ఉన్నాయి. దీని మూలంగా ఖైదీల మీద ఎలాంటి ప్రభావాలు పడతాయి? కోర్టులలో దక్కే న్యాయం ఇంత అన్యాయంగా ఉంటే కారాగారాల్లో ఎదురయ్యే అన్యాయాల గురించి ఇహను చెప్పనక్కరలేదు. నాలుగు గోడల మధ్యన అణిచివేతయే ప్రపంచంగా మారిన బంధిఖానాల్లో జీవనం సాగించే ఖైదీలు ఏ ఒక్క శ్వేతజాతి దురహంకారి చేతిలోనో తీరని అవమానాలకు గురికావడం కాదు, మొత్తంగా ఖైదీలందరూ వ్యవస్థాగతమైన వర్ణ దురహంకార ధోరణులకు లోను కావల్సి వస్తుంది. జైళ్ళ సిబ్బందిలో, అధికారులలో, పెరోల్ ఇవ్వాలో వద్దో నిర్ణయించే బోర్డులలో ఇలా మొత్తం జైళ్ల వ్యవస్థలోనే శ్వేతజాతియేతరులకు ప్రాతినిధ్యం తక్కువ. ఫలితంగా సంస్కరించబడి, సామాజిక ఋజువర్తన అలవర్చుకుని జైళ్ళ నుండి విడుదల కావాల్సిన ఖైదీలు అందుకు ఏమాత్రం తావులేని విధంగా ప్రతిగంటా, ప్రతిపూటా, ప్రతిరోజూ తీవ్రమైన, అమానుషమైన 'ట్రీట్‌మెంట్‌కు' లోనవుతూ ఉంటారు.

అమాయకులైన ఖైదీలకు రాజకీయ విద్యను అందించి అతివాద భావాలవైపు మళ్ళించడం సులువే. అలాగే 'దోషులయిన' వారిని సంస్కరించడమూ ఓపికతో చెయ్యాల్సిన పనే. వర్ణ వివక్షతా పూర్వకమైన ఈ దోపిడి సమాజంలో తాను బతకడానికి మార్గం ఏమిటి? తను చేసిన నేరం ఏమిటి? ఆ పరిస్థితులు ఎలా, ఎందుకు దాపురించాయి. ఇందులో తన

బాధ్యత ఎంత. ఈ అసమసమాజం పాత్ర ఏమిటి? ఇవన్నీ విపులంగా వివరంగా అతని దృష్టికి ఎక్కించాలి. మన కార్యకర్తలు జైళ్ళలో రాజకీయ విద్యను అందించడానికి చేస్తున్న కృషి నిజంగా కత్తిమీద సామే.

ఈ కృషి సరైన ఫలితాలను ఇస్తుంది కూడా. ఇప్పటికే చాలామంది తాము రాజకీయ ఖైదీలం అన్న అవగాహనకు వచ్చారు. నిజానికి తాము రాజకీయ నాయకులో, కార్యకర్తలో కాదని తెలిసినా తాము ఈ దోపిడిదారు రాజకీయ– ఆర్థిక వ్యవస్థ బాధితులం అని స్పష్టంగా అర్థం చేసుకున్నారు. అందుకే తమని తాము రాజకీయ ఖైదీలుగా భావించుకుంటున్నారు.

వర్ణ దురహంకార దోపిడి నల్లజాతి ప్రజానీకాన్ని రకరకాల స్థాయిల్లో నిరంతరం పీడిస్తూనే ఉంది. రెక్కల కష్టం చేసి శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ హుందా అయిన బతుకు బతుకుదామంటే పని కల్పించడం లేదు ఈ ప్రభుత్వం – ఏ ఆర్థిక సంక్షోభం కుదుపులు మొదలయినా దక్కిన కొద్దిపాటి ఉద్యోగాలూ పోగొట్టుకునే వారి జాబితాలో అగ్రస్థానంలో ఉంటారు నల్లజాతీయులు. ఆర్థిక వ్యవస్థను కుదుటపరిచేందుకు లక్షల డాలర్లు కార్పొరేట్ అధిపతుల జేబుల్లో కుమ్మరించే ప్రభుత్వం నల్ల జాతి ప్రజల బతుకులు కుదుటపరచడం మీద వీసమెత్తు శ్రద్ధ పెట్టదు. ఆర్థిక సంక్షోభం ముగిసినా నల్ల జాతీయులు బతుకు సంక్షోభం ఒడ్డునపడదు. దేశంలోకల్లా పేదలు బతికే వాడల్లో నిరుద్యోగం రెండింతలుగా ఉంటుంది. నల్లజాతి యువతీ యువకుల్లో నిరుద్యోగం ఇంతకు ఇంకా ఎక్కువ ఉంటుంది. దాదాపు 30 శాతం నిరుద్యోగులు ఉన్నారంటే – వీళ్ళందరికి రెండుపూటలా పొట్టపోసుకునే మార్గం లేకుండా పోయినట్లేగా. ఈ పరిస్థితులు మారాలంటే రెండే మార్గాలు. ఒకటి చిక్కటి విప్లవం ద్వారా పరిష్కరించుకోవడం. లేదంటే ఫాసిస్టు ఉక్కుపాదాల కింద బతుకులు ఈడ్వడం.

సరైన స్కూళ్ళు వుండవు. ఉన్న ఆసుపత్రులలో పశువులు కూడా వైద్యానికి రావు. కూలిపోయే స్థితిలో ఉన్న ఆవాసాలు, అప్పనంగా మనకేదో సబ్సిడీలు ఇస్తున్నట్లు విద్వేష ప్రచారాలు – ఇలా ఒకటేమిటి చుట్టూ సమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. నల్లజాతీయులు నివసించే వాడలన్నింటా పేదరికపు ప్రజలే. బర్మింగ్‌హోమ్ నుండి హార్లెమ్ వరకు అక్కడ నుండి వాట్స్ వరకూ నల్లజాతి వాడలు నిత్యం పోలీసు పహారాలో ఉంటాయి. ఉత్తి పుణ్యానికి పోలీసులు మందలు మందలుగా ఈ వాడల మీద ఆగమాగం చేసి పోతుంటారు. నిర్దాక్షిణ్యంగా చావబాది 'హింస' చెలరేగకుండా కాపాడుతున్నాం అని కాలరెత్తి చెబుతుంటారు.

'ప్రజలను కాపాడడం, వారికి సేవలు అందించడం' పోలీసు విధులుగా చెబుతుంటారు. కానీ వీళ్లు ఎవరిని కాపాడుతున్నారు? ఎవరికి సేవ చేస్తున్నారు? దోపిడి శక్తుల పీడకుల ప్రయోజనాలు కాపాడుతున్నారు. మనకి ఏం సేవ చేస్తున్నారు– అడగకపోయినా అన్యాయాన్ని మన మీద రుద్దిపోతున్నారు. వాళ్లు నల్లజాతి వాళ్ళను వేధించడానికే ఉన్నారు. నిరంతరం మనల్ని హింసకు గురిచేస్తూ మన బతుకులను మనం మార్చుకోలేని శక్తిహీనులం

అని గుర్తు చేస్తుంటారు. ఇష్టారాజ్యాంగా మనల్ని అరెస్టు చేస్తుంటారు. గుడ్డి గవ్వ కారణం దొరికినా తుపాకులకు పని చెప్పి మనిషి ప్రాణాలు నిలువునా తోడేస్తారు. మాదక ద్రవ్యాల మాఫియా ముఠాలకు అండగా నిలబడతారు. ఆ ఉచ్చులోకి అమాయకులను లాగడానికి పావులుగా వ్యవహరిస్తారు. నల్లజాతి ప్రజానీకంలో ఉన్న అత్యంత మితవాద ప్రతీపశక్తుల ముఠాలకు సేవ చేస్తుంటారు. మొత్తంగా నల్లజాతి సమాజాన్ని హింసాత్మక వలయంలోకి నెట్టి కాపుకాస్తుంటారు. అమెరికా ఒకప్పుడు ఇంగ్లాండ్‌కు వలస దేశంగా కొనసాగిన కాలంలో పోలీసు వ్యవస్థ ఎలా వ్యవహరించేదో ఫ్రాంట్‌జల్‌ఫానన్ అభివర్ణనకు అతికినట్లుగా నేటి పోలీసు వ్యవస్థ పనిచేస్తుంది.

పోలీసు వ్యవస్థ ఇంత వర్ణ వివక్షతా పూర్వకంగా వ్యవహరించడానికి న్యాయవ్యవస్థ వత్తాసు కూడా ప్రధాన కారణంగా మనం గ్రహించాలి. పోలీసుల నేరపూరిత దుడుకు స్వభావాన్ని ఏ కోర్టులూ న్యాయంగా విచారణకు చేపట్టవు. కానీ అదే పోలీసులు చెప్పే సాక్ష్యాల ఆధారంగా నల్లజాతి మహిళలను, పురుషులను లెక్కలేనంత మందిని జైలు ఊచల వెనక్కి నెడుతున్నాయి. నల్లజాతి ముద్దాయిలకు న్యాయ సేవలు అందించేందుకు కోర్టులు నియమించే ప్లీడర్లు కేసును చట్టపరిధిలో వాదించడానికి బదులు నేరం చేశానని ఒప్పుకో తక్కువ శిక్ష పడేలా చూస్తానంటూ ముద్దాయిలతో నేర అంగీకార ప్రకటన చేసేలా చూడడం మీదే దృష్టిపెడుతున్నారు. 85శాతం కేసుల్లో ఇలానే జరుగుతుందని లెక్కతేలింది. ఈ మధ్యనే జ్యూరీ విచారణ ఏళ్ళు తరబడి సాగకుండా చూసుకోవచ్చనే పేరిట అరెస్టుల సమయంలోనే పోలీసుల ఎదుట నేర అంగీకార ప్రకటన మీద సంతకాలు పెట్టేస్తున్నవాళ్ళు ఎందరో ఉన్నారు. ఏతావాతా పోలీసు న్యాయవ్యవస్థలు రెండూ కలిసి నల్లజాతి ప్రజానీకాన్ని జైలు మార్గం పట్టిస్తున్నాయి. (గతంలో నన్ను న్యూయార్క్ మహిళా జైలులో డిటెయిన్ చేసినప్పుడు ఇలాంటి ఉదంతాలు ఎన్నో నా దృష్టికి వచ్చాయి. అనేక మంది మహిళలు న్యాయ విచారణకు ముందే నేరాంగీకార ప్రకటన మీద సంతకాలు చేస్తే ఇంకొంతమంది విచారణ మొదలవగానే నేరం చేసినట్టు అంగీకరించినట్లు ఎవరి అనుభవాలు వాళ్లు పూసగుచ్చినట్లు నాతో చెప్పుకొచ్చారు. మచ్చుకి ఒక పడుచు కేసు మీ దృష్టికి తెస్తా. ఆమె ఇంటి అద్దె ఇవ్వడానికి యజమాని ఇంటికి వెళితే అతగాడు ఆమెను బలాత్కరించబోయాడట. ఆ పెనుగులాటలో వెలిగించి ఉన్న కొవ్వొత్తులు టేబిల్ మీద పరిచిన గుడ్డమీద పడి అంటుకుంది. ఎట్లాగొట్లా అమ్మాయి తప్పించుకు బయటపడింది. ఆ పిల్ల ఎక్కడ కేసు పెడుతుందో అని ఇంటి యజమానే ముందుగా ఆ అమ్మాయి మీద దోపిడి చెయ్యడానికి వచ్చిందని కేసు పెట్టాడట. సాక్ష్యం కాలిన టేబుల్ క్లాత్. కేసు విచారణకు వచ్చింది, కోర్టు నియమించిన ప్లీడరు మాటలు నమ్మి, తక్కువ శిక్ష పడుతుంది అని అతను ఇచ్చిన హామీ నమ్మి ఆ అమ్మాయి నేరం చేసినట్లు అంగీకరించిందట. ఫలితం మూడేళ్ళ కారాగారవాసం)

పేదరికం, పోలీసులు, కోర్టులు, జైళ్లు వీటిని పోషించడానికేనా నల్లజాతి ప్రజానీకం నివసించే పేదల వాడలు ఉన్నదీ అనిపిస్తుంది. ఇవన్నీ దగుల్బాజీ పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించినవే అని ఇప్పుడిప్పుడే నల్లజాతి సోదరులు సోదరీమణులు అర్థం చేసుకుంటున్నారు. ఈ కారణంగానే వాళ్ళలో ఈ సామాజిక వ్యవస్థకు రాజకీయ ఖైదీలు అనే భావన బలపడుతుంది. ఇప్పుడు వాళ్లముందున్న కర్తవ్యం ఏంటంటే ఈ పోలీసు వ్యవస్థ, కోర్టులు అందించలేని న్యాయాన్ని సాధించుకోవడానికి ఒక్కపెట్టున ఉద్యమించడం. ఇంతకు మినహా వాళ్ల ముందు వేరే ప్రత్యామ్నాయం లేదు.

## నోమ్ చోమ్‌స్కీ, కోయింటెల్‌ప్రో : అంటే ఏమిటి?

## (మార్చి 12, 198)

ఇతర పారిశ్రామిక ప్రజాస్వామ్యాలతో పోల్చుకున్నపుడు అమెరికాలో ఆలోచనా పరిధులు, రాజకీయ కార్యాచరణ మితవాదంవైపుకే మొగ్గు చాల ఎక్కువగా ఉంటుంది. ఈ అంతుచిక్కని అంశాన్ని వివరించడానికిత అనేక సంక్లిష్టమైన సిద్ధాంతాలు ముందుకొచ్చాయి. దీనిలో చాల సున్నితమైన అంశాలు ఇమిడిఉంటాయన్నది వాస్తవం. అయినప్పటికీ కొన్ని చిన్న చిన్న విషయాలను సైతం విస్మరించకూడదని మనం గుర్తించాలి. అమెరికా వాణిజ్యవర్గాలు అనేక సంవత్సరాలు పెద్దఎత్తున ప్రచార నిర్వహణకు పూనుకున్నాయన్నది వాస్తవం. దీన్నే ఆ ప్రచారకులు 'అంగీకారాన్ని నిర్మించడం' అని అంటారు. దీని విస్తృతి చాల ఎక్కువ. మీడియాపైన, స్కూలు పాఠ్యపుస్తకాలపైన దీని ప్రభావం చాల ఉంది. ఇలాంటిది ఇతర పారిశ్రామిక ప్రజస్వామ్యాలలో చూడలేము. అ అంశాలలో కీలకమైనది జాతీయ రాజకీయ పోలీసు వ్యవస్థ, అదే ఎఫ్‌బిఐ పాత్ర. అది అర్థశతాబ్దానికిపైగా అంగీకారాన్ని నిర్మించడానికి ప్రత్యక్షంగా అంటే బలప్రయోగంతో అది ప్రయత్నిస్తున్నది. ఈ సంస్థ కార్యకలాపాల స్వభావం, విస్తృతి ఇప్పుడే బయటకొస్తున్నాయి. వాటి ఆధారంగా ఇక్కడ చెప్పిన కథనం ఇది.

న్యాయ శాఖలోని సాధారణ నిఘా (అతివాద వ్యతిరేక) విభాగానికి 1919లో అధిపతిగా నియమితుడైన తర్వాత జె. ఎడ్గార్ హూవర్ పేరు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 23 రాష్ట్రాలలోని 33 నగరాలలో మొత్తం 4000 మందిని చుట్టుముట్టి అప్రతిష్టాకరమైన 'పాల్మర్ దాడులు' జరపడానికి కొద్ది కాలం ముందే ఈ నియామకం జరిగింది. దీనిపై వాషింగ్టన్ పోస్ట్ పత్రిక సంపాదకీయంలో 'ఒక వైపున బోల్షివిక్ ప్రమాదం ముంచుకొస్తున్న సమయంలో ఈ నియామకం మంచి చెడ్డల గురించి తలలు బద్దలు కొట్టుకోకూడదు.' అని వ్యాఖ్యానించింది.

ఆ తర్వాత 200 మంది పరాయివారిని దేశం నుండి పంపించివేశారు. 'ప్రభుత్వం అలాంటి పరాయి మురికిని కడిగివేస్తున్నది.' అని ఉదారవాద అటార్ని జనరల్ (ఎ మిచెల్) పాల్మర్ ప్రకటించాడు. దీనికి పత్రికల నుండి బ్రహ్మాండమైన మద్దతు లభించింది. తమ ప్రయోజనాలకే భంగం వాటిల్లుతుందని తెలిసే వరకు పత్రికలు దాన్ని కొనసాగించాయి. కార్మికులలో సమరశీలతను దెబ్బతీయడానికి, అతివాద పార్టీలను నిర్మూలించడానికి, ఉదారవాదులను భయపెట్టడానికి, జోక్యందారీ విదేశాంగవిధానానికి మద్దతు కూడగట్టుకోవడానికి ఈ 'ఎరుపు ప్రమాదం' చక్కటి సాకుగా ఉపయోగపడింది.

ఎఫ్‌బిఐ నెట్‌వర్క్ చాల పెద్దది. ఉదాహరణకు, 1920 నుండి 1943 వరకు అమెరికా పౌరహక్కుల యూనియన్‌లో చొచ్చుకు పోయింది. ఆ తర్వాత 1950లలో దాని రాజకీయ కార్యకలాపాల రూపకల్పనపైన ప్రభావం చూపడానికి,సైద్ధాంతికపరమైన అదుపు కలిగి ఉండటానికి ఎఫ్‌బిఐ పథకాలకు అది రహస్యంగా సహకరించింది. రాజకీయ కార్యకర్తలకు అనేక రకాలైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఏ విధమైన చిన్న కార్యక్రమమైనా ఎఫ్‌బిఐ దృష్టినుండి తప్పించుకోలేకపోయేది. నాకు స్వయంగా తెలిసిన ఒక చిన్న సంఘటనను చెబుతాను. 1969లో మిట్‌లో నావద్ద ఉన్న టీచింగ్ అసిస్టెంట్లలో ఇద్దరు పౌరహక్కులు, శాంతి ఉద్యమాలలో చురుగ్గా ఉండేవారు. వారి పునర్నియామకాన్ని ఎఫ్‌బిఐ బోస్టన్ కార్యాలయం అడ్డుకుంది. అయితే ఈ పని పూర్తి రహస్యంగా చేసింది. 'మిట్ సిబ్బందిలో వారిద్దరిని తిరిగి నియమించకుండా చేయకలిగాను' అని ఎఫ్‌బిఐ బోస్టన్ కార్యాలయానికి ఒక అజ్ఞాత వ్యక్తి తెలియచేశారు. విద్యాసంస్థలలో ఎఫ్‌బిఐ కార్యకలాపాలు ఎలా ఉంటాయో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ.

మరొక కేసులో ఎఫ్‌బిఐ ఇంకొంత ముందుకు వెళ్లింది. నా పూర్వ విద్యార్థి ఒకరు 1971లో శాన్ డియెగో కాలేజీలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఎసిఎల్‌యు చర్చి కమిటీ చెప్పిన ప్రకారం అతనికి వ్యతిరేకమైన సమాచారాన్ని కాలేజీ అధికారులకు ఎఫ్‌బిఐ అందచేసింది (అతనికి సంబంధించిన కాలేజీ రహస్య డాక్యుమెంట్లను కూడ ఎఫ్‌బిఐ పరిశీలించింది). కాలేజీ ఆధ్వర్యంలోనే మూడు బహిరంగ విచారణలు జరిగాయి. ఏ ఒక్క విచారణలో కూడ ఆ టీచరు దోషి అని తేలలేదు. అయినప్పటికీ కాలిపోర్నియా ప్రభుత్వ కాలేజీల వ్యవస్థ చాన్సలర్ గ్లెన్ డుమ్కె అతన్ని ఏ విచారణ లేకుండానే ఉద్యోగం నుండి తొలగించారు. అప్పట్లో యూనివర్శిటీలు ఎంత కుట్రపూరితంగా వ్యవహరించేవో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. ఈ కాలంలోనే ఎఫ్‌బిఐ ఆదేశాలతో పనిచేస్తూ, దానినుండే నిధులను ఆయుధాలను పొందే ఒక రహస్య టెరరిస్టు హత్యాయత్నాలకు ఆయన లక్ష్యంగా మారాడు. దీనికి కారణమయిన వారిని పట్టుకొని విచారణ చేయకుండా ఎఫ్‌బిఐ సాక్ష్యాలను దాచిపెట్టడం ద్వారా ఆ చర్యకు దోహదపడింది. ఈ రహస్య సంస్థను నడిపే వ్యక్తి బాంబులు, కాల్పులు, సాధారణ హింస,

టెరర్ లాంటి చర్యలను వామపక్షం లక్ష్యంగా చేసుకొని నిర్వహించేవాడు. ఇదంతా ఎఫ్‌బిఐ పూర్తి ఎరికతోనే జరిపేవాడు.

ఈ ఘటనలో ఉద్దేశించబడిన బాధితుడు ఎఫ్‌బిఐ హత్యాప్రయత్నం నుండి గాయాలతో బయటపడ్డాడు. ఆయనతోపాటు ఉన్న యువతి తీవ్రంగా గాయపడింది. కాని ఇలాంటి ఘటనల్లో కొందరు వీరంత అదృష్టవంతులు కారు. బ్లాక్‌పాంథర్ నాయకుడు ఫ్రెడ్ హాంప్టన్, మార్క్ క్లార్క్‌తో పాటు జర్మన్ ఫాసిస్టు మూకల ఉదయం పూట దాడుల మాదిరి పోలీసులు దాడి చేసి హత్యచేశారు. 1969లో ఇలాంటి దాడులు అనేకం జరుగుతూ ఉండేవి. వీటిలో ఎఫ్‌బిఐ కుమ్మక్కు అవుతుండేది. పోలీసులతో కలిసి క్షేత్ర ప్రణాళికను రూపొందించేవారు. అందుచేతనే ఈ దాడులు అత్యంత కచ్చితంగా లక్ష్యాన్ని అంతం చేసేవని విలేకరులు చెప్పారు. మంచం మీద ఉండగానే హాంప్టన్ హత్యకు గురయ్యాడు. బహుశా అంతకుముందు మత్తుమందు కూడ ప్రయోగించి ఉంటారు. ఆ హత్య అత్యంత దారుణంగా జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

అంతకుముందే చికాగో బ్లాక్‌స్టోన్ రేంజర్స్ ఘెట్టోలో ఒక నేరస్థ ముఠాచేత హాంప్టన్‌ను హత్యకావించడానికి ఎఫ్‌బిఐ ప్రయత్నించింది. మీ నాయకుడు హత్యకు గురికాబోతున్నాడంటూ రేంజర్స్‌కు ఎఫ్‌బిఐ స్థానిక కార్యాలయం నుండి ఒక ఆకాశరామన్న ఉత్తరం అందింది. హింసాకాండను రెచ్చగొట్టడం, హత్యకావించడం అనే ఈ కుట్ర విఫలమయింది. మిగతా కేసుల్లో మాత్రం ఎఫ్‌బిఐ బాగా విజయవంతమయింది. ముఠాల మధ్య హత్యలను రెచ్చగొట్టడంలోను, హింసాకాండను ప్రేరేపిఇంచడంలోను తన విజయాల గురించి ఎఫ్‌బిఐ ఒక అంతర్గత లేఖ గొప్పలు చెప్పుకుంది.

పౌరహక్కుల ఉద్యమాలపై దాడిచేయడంలోను, చట్టబద్ధమైన ఎన్నికల రాజకీయాలను అడ్డుకోవడంలోను, విశ్వవిద్యాలయాలను, సాంస్కృతిక బృందాలను అణచివేయడంలోను (పశ్చిమ ప్రాంతంలోని వాట్స్ ఘెట్టోలోని అతి పెద్ద సాంస్కృతిక కేంద్రం), తనకు ఆమోదయోగ్యంకాని రాజకీయ కార్యకలాపాలను విచ్ఛిన్నం చేయడంలోను, ఏజంట్లను వినియోగించడం, గృహదహనాలు, బాంబు దాడులు, దోపిడీలు, హత్యలు జరిపించడంలోను– ఎఫ్‌బిఐ రికార్డు ఇప్పటికే స్పష్టంగా వెల్లడయింది. 'కోయింటెల్‌ప్రో' ఒక్క దానికిందనే కమ్యూనిస్టుపార్టీ, సోషలిస్టు వర్కర్స్ పార్టీ, ప్యూర్టోరీకా స్వాతంత్రోద్యమం, 1960లలోని పలు నల్లజాతి ఉద్యమాలు, మొత్తంగా 'న్యూలెఫ్ట్' – ఎఫ్‌బిఐ లక్ష్యాలుగా ఉన్నాయి. వామపక్షం ఒక్కటే దాని లక్ష్యం కానప్పటికీ దాని ప్రధాన లక్ష్యం మాత్రం వామపక్షమే. ఎఫ్‌బిఐ

కార్యకలాపాల విస్తృతిని, హింసాకాండ స్థాయిని, నేరస్థ పథకాలను మరే ఇతర పారిశ్రామిక ప్రజాస్వామిక దేశంలోని వాటితో పోల్చలేము. అమెరికా 'విశిష్టత' తప్పని సరిగా దీనిలో వ్యక్తమవుతుంది.

ఇలాంటి ఎఫ్‌బిఐ కార్యకలాపాల గురించి అధ్యయనాలు చాలానే ఉన్నాయి. కాని అవి తగినంతగా గుర్తింపు పొందలేదు. కచ్చితమైన డాక్యుమెంటరీ సాక్ష్యాలతో వెల్లడించినవి సైతం చిన్న చిన్న సంచలనాలను సైతం సృష్టించలేకపోయాయి.

ఎఫ్‌బిఐ నేరాల చిట్టా వాటర్‌గేట్ కుంభకోణం వెల్లడవుతున్న సమయంలోనే బయటపడటం వల్ల, దానితో పోల్చుకున్నపుడు ఇవి చిన్నవి కావడంతో సరైన గుర్తింపు దొరకలేదేమో. కాని అమెరికా సాంస్కృతిక, రాజకీయ జీవనంపై ప్రభావం రీత్యా చూసుకున్నపుడు ఎఫ్‌బిఐ వ్యవహారాలు ఎంతో తీవ్రమైనవి. నిక్సన్ విమర్శకులు ఆయన బాధ్యుడైన నేరాలను పౌరహక్కులు, మానవహక్కుల దృష్టితో వ్యతిరేకించారా, లేక మెక్‌కార్థీ మాదిరిగా స్పష్టంగా లేని లక్ష్యంపై తన చర్యలను గురిపెట్టడం గురించి విమర్శించారా అని ఆలోచించాలి. ఈ ప్రయోగం ఫలితం స్పష్టంగానే వెల్లడయింది. ఎందువల్లనంటే వాటర్‌గేట్ అనేది కపటనీతితో జరిపిన విన్యాసం.

# VI

# జూనియర్ బుష్ ఉగ్రవాదంపై యుద్ధం

## ఇంకో సెప్టెంబర్ 11ను నివారించాలంటే

## అమెరికా మిగతా ప్రపంచంతో కలిసి పోవాలి

## - రీటా లాసర్ (2002 సెప్టెంబర్ 5)

2001 సెప్టెంబర్ 11న రెండు విమానాలు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఢీకొనే సమయానికి నా సోదరుడు ఎవర్‌మే ఉత్తర దిక్కు టవర్‌లో ఉన్నాడు. ఉపద్రవం నుండి తనను తాను కాపాడుకోవడానికి అక్కడ నుండి

ఖాళీ చేసే అవకాశం వచ్చినా తన సన్నిహిత మిత్రుడు తోటి ఉద్యోగి క్షేమం కోరి అతనితో ఉండిపోయాడు. సాయం కోసం ఎదురుచూసాడు. సాయం తప్పక అందుతుందని ఆశించాడు. కానీ చివరికి తన సన్నిహితుడితో పాటు మృత్యువాత పడ్డాడు. ఆ రోజున వేలాదిమంది అమాయక న్యూయార్క్ పౌరులు ఇలానే మృత్యువాత పడ్డారు.

ఆ రోజు నుండి నా జీవితంలో చాలామార్పు వచ్చింది. నాలానే ఆప్తులను, సన్నిహితులను, రక్త సంబంధీకులను కోల్పోయిన వేలాదిమంది జీవితాలను మార్చేసింది ఆరోజు.

పెన్సిల్వేనియాలో విమానం కూలి ఆప్తులను కోల్పోయిన వారి జీవితాలను మార్చేసింది. పెంటగాన్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి రక్తసంబంధీకులు, బంధువులు, మిత్రుల జీవితాలను మార్చేసింది. సూక్ష్మంలో చెప్పుకోవాలంటే 'ట్విన్ టవర్స్'దాడులు తరువాత అనేకమంది అమెరికన్‌ల జీవితాలను, ఆలోచనలను మార్చేసింది.

సెప్టెంబర్ 11 తరువాత కొన్ని నెలలపాటు ప్రపంచ దేశాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో ఇక్కడా మీడియా కథలు కథలుగా ప్రచారం చేసింది. కాని అమెరికా చేసిన

ప్రతీకారదాడులతో ప్రపంచం మారిపోతుందని నేను అనుకోవట్లేదు. అలా మారిపోయిందని ఎవరన్నా నమ్మి ఉంటే వాళ్లు ఏ లోకంలో బతుకుతున్నారో వాళ్లకే తెలియదనుకుంటాను.

1994లో రువాండలో ఐదువేల మంది ప్రజానీకాన్ని భయదవిహ్వాలంగా సామూహికంగా హత్య చేసినాక ఈ ప్రపంచంలో మార్పు వచ్చిందని ఎవరన్నా చెప్పగా నేనింతవరకూ వినలేదు. లేదూ ఓ ఇరవై ఏళ్ల కాలంలో ఇండోనేషియా నియంత రెండు లక్షల మంది తూర్పు తైమూరు ప్రజానీకాన్ని ఉచకోత కోయించిన మూలంగా ఈ ప్రపంచం మారిందని చెప్పగా కూడా నేను వినలేదు. అంతెందుకు సబ్ సహారా ఆఫ్రికా ఖండంలో రోజుకు 8000 మంది ఎయిడ్స్ రోగంతో చనిపోతున్నా ఈ ప్రపంచం మారిపోయిందని ఎవరన్నా అనగా వినలేదు.

ఇంతమంది ప్రజల ప్రాణాలు ఉసురుమనిపోతా ఉంటే నా తమ్ముడు ప్రాణాలకన్నా నాకేమి ముఖ్యం కాదని నాకు నేను సర్దిచెప్పుకోవాలా?

నిజమే సెప్టెంబర్ 11 నాకు తీరని దుఃఖాన్నే మిగిల్చింది. కాని పైన చెప్పుకున్న ఉత్పాతాలతో పోల్చినప్పుడు సెప్టెంబర్ 11 తదనంతరం ఈ ప్రపంచం మారిపోయిందని విశ్వసించడానికి నే సిద్ధంగా లేను. కానయితే ఏం జరిగింది? అమెరికన్లను వచ్చి తనతో చేరమని ఈ ప్రపంచం అడుగుతుంది. ఇప్పటికే సంక్షుభితంగా ఉన్న ప్రపంచంతో చేరిపోవడమా లేదా అనేది మా ముందున్న ప్రశ్న.

విషాదం ఏంటంటే, మా ప్రెసిడెంట్ బుష్ అందుకు సిద్ధంగా లేడు. ప్రపంచంతో మాకు లెక్క పత్రం లేదు అనే ధోరణితో వ్యవహరిస్తున్నాడు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుతో మాకు పనేంటి అంటున్నాడు (మాకు మేమే కోర్టు కదా, ఏ దేశం మీదయినా మా తీర్పులు రుద్దేస్తుంటాం). రష్యాతో చేసుకున్న ఖండాంతర క్షిపణి ప్రయోగ నిరోధ ఒప్పందం నుండి ఏకపక్షంగా వైదొలిగాడు. ఇండియా – పాకిస్తాన్ దేశాల మధ్యన అణ్వాయుధ పోటీకి ఆజ్యం పోస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణకు, కర్బన ఉద్గారాలకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందాలను మేం లెక్క చెయ్యం అంటున్నాడు. సాతాను ఇరుసులంటూ ముద్రవేసిన ఇరాక్, ఇరాన్ ఉత్తరకొరియా దేశాలతో 'ల్యాండ్ మైన్‌ల నిషేధపు ఒప్పందం కుదుర్చుకోవాల్సిన పని లేదంటాడు.

తాజాగా ఇరాక్ మీద యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. నిజానికి ఇరాక్ ఎలాంటి కవ్వింపు చర్యలకు దిగింది లేదు. సెప్టెంబర్ 11 ఉదంతంతో ఇరాక్ సంబంధాలు

ఉన్నాయనేందుకు సాక్ష్యాలు లేవు. సభ్య ప్రపంచం యావత్తూ ఘర్షణ వైఖరి వద్దని చెబుతున్నా అధ్యక్షులవారి చెవికి ఎక్కకుండా ఉంది. ఇరాక్ మీద యుద్ధం ప్రకటించాడు.

మొదటి గల్ఫ్ యుద్ధంలో పాలుపంచుకున్న అంతర్జాతీయ సంకీర్ణం ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా ఏ దేశం మీదా ముందస్తు దాడికి దిగరాదనే సూత్రబద్ధమైన అవగాహనకు వచ్చాయి. కాని మా శ్వేత సౌధం ఈ సూత్రాన్ని కాలదన్ని ఇరాక్ మీద దురాక్రమణకు తెగబడుతుంది.

ప్రపంచం ఎట్టాపోతానేం మా దేశానికి తిరుగులేదని భావిస్తా ఉన్నట్లున్నారు. కాని ఈ భూమండలంలో అమెరికా ఏకాకి దేశంగా మనలేదు. ఒకవేళ మనగలిగే సత్తా ఉన్నా అంతకన్నా ప్రమాదం ఇంకొకటి లేదు. మాకు ఎంతో అత్యంతాధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కలిగిన ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఉంది. ఆకాశంలోకి ఎంతెంతో ఎత్తు భవనాలు కట్టగలిగే సత్తా వుంది. కానీ ఏమైపోయాయి ఇవన్నీ సెప్టెంబర్ 11న. బాంబులతో కూడా పని లేకుండా ఎంతో దెబ్బతీశారు మమ్మల్ని.

అయినా మాకు మేముగా ఒకటే నిర్ణయించుకున్నాం. మేం ఏకాకి దేశం అనే నిర్ధారణకు వచ్చాశాం. ఈ ప్రపంచానికి మేం పూచీపడం. కానీ ప్రపంచం మొత్తం మాకు కావల్సిందల్లా అందించాలి. ఈ ఉద్దేశంతోనే అనుకుంటా మా ప్రెసిడెంట్ బుష్ ప్రపంచ దేశాలని నిలదీస్తున్నాడు. ఉంటే మాతో ఉన్నట్లు లేకుంటే మాకు వ్యతిరేకంగా ఉన్నట్లు అంటూ మాకు మాదిరే మిగతా దేశాలకు వేరే ప్రత్యామ్నాయం లేకుండా చేస్తున్నాడు. ఇంతకన్నా హ్రస్వ దృష్టి మరొకటి ఉండదు. ఇది బుష్‌గారి 'స్వీయ కేంద్రక పెంపుడు సిద్ధాంతం. ఇంతకన్నా స్వయం హననం వేరొకటి ఉండదు.

ఇందుకు బదులుగా మేం కాస్త తెలివి తెచ్చుకుని చుట్టూ తేరిపార చూడగలిగితే ఈ భూగోళం యావత్తూ శాంతి సౌభాగ్యాలతో పచ్చటి పర్యావరణంతో తులతూగేందుకు అవకాశం కల్పించే అంతర్జాతీయ వేదికలు, ఒప్పందాలు ఎన్నెన్నో ఉన్నాయి. వాటిని ఆలంబనగా చేసుకోగలగాలి. అదే మాకు శ్రీరామరక్ష.

ఒంటెత్తు పోకడలను భరాయించే శక్తి ఇంకా ఈ దేశానికి లేదు. ఉగ్రవాదం మూలాల్లో కంటా మేం పోరాటం చెయ్యాలన్నా సభ్య ప్రపంచానికి సాయపడడం ఇకనయినా అలవర్చుకోవాలి మేం. సెప్టెంబర్ 11 లాంటి ఘోర విషాదాంతకలి పట్ల మనలాగే చలించిపోయే కోట్లాదిమంది

ప్రజానీకం ఉన్నారు ఈ ప్రపంచంలో. మాకు ఎప్పుడు ఈ సత్యం బోధపడుతుందో అప్పుడే సెప్టెంబర్ 11 ఉదంతం తరువాత ఈ ప్రపంచం మారినట్లు లెక్క.

## యుద్ధం - స్వతంత్ర ప్రసారమాధ్యమం

## 2003 ఏప్రిల్ 21 - ఎమి గుడ్‌మాన్

మొన్న ఒక రోజున న్యూస్‌డే రిపోర్టరు 'మీరు అంటుకట్టు (ఎంబెడెడ్) జర్నలిజానికి వ్యతిరేకా' అనడిగాడు. అంటుకట్టు జర్నలిజం అంటే ఏమిటో మీడియా ఇప్పటికే మనందరికీ కొత్తగా పరిచయం చేసింది. 'యుద్ధ భూమిలో ఉన్న సైనికులతో కలిసి పనిచేస్తూ వార్తలు, నివేదికలు అందించడమే అంటుకట్టుడు జర్నలిజం' అని ఇప్పటికే మీరంతా అర్థం చేసుకుని ఉంటారు.

'ఎంతటి దురదృష్టకరమైన పదసృష్టి' అదీ, 'అంటుకట్టుడు జర్నలిజం' అనే మాట వాడుక మీద ఇప్పటికే తన నిశితమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేసాడు వాల్టర్‌క్రోన్‌కైట్. చాలా నిశితంగా మాట్లాడాడు. ఇవాళా రేపు ప్రధాన స్రవంతి మీడియాలో వర్కింగ్ జర్నలిస్టులు ఎవరూ మాట్లాడ సాహసించలేనంత నిశితంగా మాట్లాడాడు. సునిశితమైన రిపోర్టింగ్ పేరిట మనకు అందుతున్న సమాచార స్రవంతి పరిస్థితి ఏమిటి?

అంతా మాజీ సైనిక జనరల్స్ చేతుల మీదుగా నడుస్తుంది. పేరొందిన న్యూస్ నెట్‌వర్క్‌లు ఇవాళ మాజీ సైనిక జనరల్స్‌ను జీతగాళ్ళుగా పెట్టుకున్నాయి. జనరల్ వెస్లీక్లార్క్ సి.ఎన్.ఎన్. న్యూస్ నెట్‌వర్క్ జీతగాళ్ళ జాబితాలో ఉన్నాడు. యుద్ధ భూమిలో ఉన్న రిపోర్టర్‌ను ఈయన స్టూడియో నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. వాళ్ళు జవాబులు ఇస్తుంటారు. ఏమని 'యస్సార్' 'నోస్సార్' అని.

ఇది ఇవాళ అమెరికాలో జర్నలిజం పరిస్థితి. 'జనరల్' న్యూస్ (సాధారణ సమాచారం) పదాన్ని సైనిక 'జనరల్' న్యూస్‌గా మార్చేసారు. ఈ పరిస్థితిని మనం సవాలు చెయ్యాలి.

న్యూస్ నెట్‌వర్క్ అధిపతులకు నాది ఒకటే సూటిప్రశ్న. రిటైర్డ్ సైనిక జనరల్స్‌ను మీ మీ సంస్థలలో జీతగాళ్ళుగా కుదుర్చుకున్నారు కదా. అదే అవకాశం మీరు శాంతి ఉద్యమ నాయకులకు కార్యకర్తలకు ఎందుకు ఇవ్వరు? వాళ్ళకో అవకాశం ఇచ్చి చూడండి. వాళ్ళూ మీరు కోరుకునే అంటుకట్టుడు జర్నలిజం చేసి చూపిస్తారు. యుద్ధ బీభత్సంలో చిక్కుకున్న అమాయక ఇరాక్ పౌరుల కుటుంబాల వెన్నంటి ఉండి వారి విషాదగాధలను, విలాపాగ్నులను

మనకు వినిపిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి ఉద్యమాలు ఏమంటున్నాయో మనకు వినిపిస్తారు. అప్పుడే కదా నాణేనికి ఉన్న బొమ్మ బొరుసులు ప్రజలకు అర్థం అయ్యేది.

ఆరన్‌బ్రౌన్ ఇంకాస్త ఆసక్తికరమైన వ్యాఖ్యానాలు చేసాడు. 'సి.ఎన్.ఎన్. న్యూస్ నెట్ శాంతి ఉద్యమంలోకి కాస్తంత ఆలస్యంగా కాలుమోపింది అని ఒప్పుకోలు ప్రకటనలాంటిది చేసాడు. కానీ యుద్ధం మొదలవడంతో ఇలాంటి గళాలన్నీ ఆశ్చర్యంగా అంతర్ధానమైపోయాయి. ఎందుకంటే మీడియాను యుద్ధం ఆక్రమించేసుకుంది.

అంటుకట్టుడు జర్నలిజం పేరిట మనకు ఏం చూయిస్తున్నారు. అందమైన సూర్యాస్తమయాల ముందు నిలబడ్డ సైనికులను, ఆకాశమార్గాన బాంబర్ విమానాల్లోంచి తీసిన చూడముచ్చటైన ఇరాక్ పీఠభూముల్ని. కాని ఇరాక్ మీద బాంబుల వర్షం కురిపిస్తూ నగరాలకు నగరాలే అగ్నిగోళాల్ని తలపిస్తా ఉన్న రోజున డాన్ రాడర్ టీవీలో ఏమన్నాడు. 'గుడ్ మార్నింగ్ బాగ్దాద్' అనేగా. టామ్ బ్రోకా ఏమన్నాడు – 'ఇరాక్‌లో మౌళిక వసతులను మేం ధ్వంసం చెయ్యబోవడంలేదు. ఎందుకంటే ఎలానూ ఇంకొన్ని రోజుల్లో వాటిని మేం స్వంతం చేసుకోబోతున్నాం అనేగా. ఇవన్నీ ఒక ఎత్తయితే పీటర్ జెన్నింగ్స్ స్టూడియో నుండి క్రిస్‌క్యూమో అనే ఎబిసి రిపోర్టర్ ఏమని ఇంటర్వ్యూ చేసాడో గుర్తుందా మీకు. ఆ రిపోర్టరు టైమ్స్ స్క్వేర్ దగ్గర జరుగుతున్న యుద్ధ వ్యతిరేక నిరసన ప్రదర్శనను 'కవర్' చెయ్యడానికి వెళ్ళాడు. అప్పుడు అక్కడ వేలాది మంది రకరకాల ప్లకార్డులతో నిరసన తెలియచేస్తా ఉన్నారు. భోరున వాన కురుస్తా ఉంది. కొంతమంది నిలువునా తడిచి ముద్దయి నీరోడుతూ కూడా అలానే ఉండిపోయారు. ఇంకొంతమంది వెంట తెచ్చుకున్న గొడుగులను విప్పి తల దాచుకున్నారు. జోరున కురిసే వానలో అన్ని వేల గొడుగులను చూస్తుంటే నల్లకలువలు విప్పారినట్లుగా ఉంది. పోలీసులు గుంపుగా ఉన్న ప్రదర్శనకారులను ఓ మూలనుండి చెదరగొట్టే ప్రయత్నంలో ఉన్నారు. స్టూడియోలో ఉన్న జెన్నింగ్ ఇదంతా చిత్రీకరించిన క్యూమోను అడిగాడు – సరే వాళ్ళంతా ఏం చేస్తున్నారక్కడ? ఏమంటున్నారు వాళ్ళు'. దానికి క్యూమో సమాధానం చెప్తూ 'అంటే' వీళ్ళంతా ఇదిగో ఇలాంటి ప్లకార్డులు పట్టుకుని ఉన్నారు. చూసారుగా ప్లకార్డు మీద ఏమని రాసి ఉందో 'చమురు కోసం రక్తం పారించొద్దు' అని రాసి ఉంది. దీని అర్థం ఏంటని వాళ్ళలో కొంతమందిని అడిగా గందరగోళ పడిపోయారు (కన్‌ఫ్యూజ్) సమాధానం చెప్పలేక. నాకు తెలిసీ వాళ్ళు ఇక్కడ ఎందుకున్నారో వాళ్ళకే తెలియదల్లే ఉంది. ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయారనిపిస్తుంది నాకయితే అన్నాడు. వేలాదిమంది అక్కడ ఎందుకు గుమికూడారో కూడా తెలియని క్యూమోలాంటి రిపోర్టర్ల మీద పీటర్‌జెన్నింగ్స్ ఆ ప్రశ్నలు సంధించే బదులు వాళ్ళలో ఒక్కరినన్నా స్టూడియోకు పిలిపించుకుని సైనిక జనరల్స్‌తో ఇష్టాగోష్టి నడిపినట్లు ఒక చర్చా కార్యక్రమం నడిపి ఉంటే తెలిసేదికదా వాళ్ళు అక్కడ ఎందుకు గుమికూడారో?

సైనిక జనరల్స్‌ను టీవీ న్యూస్ నెట్‌వర్క్‌లు జీతాలకు నియమించుకున్నట్లు డాక్టర్లను ఎందుకు నియమించుకోవు? నాక్‌హీడ్ మార్టిన్‌లో తయారయిన బాంబుల గురించి ఆ బాంబులను ఏయే విమానాలు, ఎలా ఉపయోగిస్తాయో లక్ష్యచ్ఛేదిత (ప్రెషిసన్) బాంబులు పౌర ఆవాసాలను ధ్వంసం చెయ్యకుండా నిజంగా లక్ష్యాల్నే చేధిస్తాయా? గురితప్పితే అందుకు గల కారణాలు ఏమైఉంటాయి అని వివరణాత్మకంగా సైనిక జనరల్స్‌తో చెప్పిస్తుంటారు. కాని ప్రయోగించిన బాంబులు మానవశరీరాల్ని ఎలా ఛిద్రం చేస్తాయి. క్లస్టర్ బాంబు పేలి శరీరభాగాల్లో గుచ్చుకుంటే ఎంత విషపూరితం అవుతాయి. శరీర అవయవాలు ఎలా తొలగించాల్సి వస్తుంది. ఇలాంటి వివరాలన్నీ ప్రజలందరూ తెలుసుకోవాల్సిందే కదా. అప్పుడు నిర్ణయిస్తారు ప్రజలు యుద్ధం మంచిదో, చెడ్డదో, కావాలో వద్దో. ప్రజలను ప్రేక్షక మాత్రులుగా మిగల్చడమే పరమార్ధంగా నడుస్తున్న అమెరికన్ మీడియాలో ఇలాంటి మార్పులు ఊహించగలమా? ఆశించగలమా?

ఇవాళ అమెరికాలో ప్రధాన టీవీ నెట్‌వర్క్‌లుగా ఉన్న ఫాక్స్, MSNBC, NBC-YES మీడియా ఛానళ్ళు జనరల్ ఎలక్ట్రిక్ యజామాన్యంలో నడుస్తున్నాయి. ఆ కంపెనీ ప్రపంచంలోనే ప్రధానమైన అణ్వాయుధ ఉత్పత్తిదారు. అందుకే ఈ మూడు ఛానళ్ళూ పెంటగాన్ వాణిని తమ బాణిలో ప్రపంచమంతాటా ప్రసారం చేస్తుంటాయి. ఇరాక్ మీద సైనిక దురాక్రమణకు 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్' అనే పేరు పెట్టుకుంది పెంటగాన్. ఈ మూడు ఛానళ్ళు ఇదే 'టైటిల్' మీద యుద్ధ వార్తలు ప్రసారం చెయ్యడం,విశ్లేషణలు నిర్వహించడం మొదలుపెట్టాయి. పెంటగాన్ 'ప్రాపగాండా'ను రూపొందిస్తే ఈ ఛానళ్ళు జనానికి చేరవేస్తుంటాయి. మీడియా ప్రభుత్వ ఆధీనంలో ఉంటే సర్కారీ బాకాగా మారిపోతుంది. అందుకే స్వేచ్ఛా మీడియా అవసరం అని మనవాళ్ళు బల్లగుద్ది వాదిస్తుంటారు కదా. ఇప్పుడు ఈ మూడు ఛానళ్ళు ఎవరి బాకాగా మారినట్లూ? ప్రభుత్వ యాజమాన్యంలో ఉండకూడదని చెప్పడానికి ఏ కారణాలు చూపాలో, ఇప్పుడు అవే కారణాలతో స్వేచ్ఛా మీడియా మనకు అవసరం లేదని మనం కొత్తగా తీర్మానం చేయవచ్చునా ఇహనూ.

యుద్ధానికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున జరుగుతున్న నిరసన ఉద్యమాలను విస్మరించే పరిస్థితి లేదు గనుక మీడియా ఈ ఉద్యమాలను కూడా చూపిస్తుంది. కానీ నిజంగా ఉద్యమాలకు ప్రచారం కల్పించే ఉద్దేశం దానికి లేదు. ఇప్పటికీ న్యూయార్క్ టైమ్స్ కవర్‌స్టోరీ 'వాషింగ్టన్ పోస్ట్ పత్రిక హెడ్‌లైన్స్' మీడియాలో ప్రసారమయ్యే ప్రధాన అంశాలూ ఒక్కటే. యుద్ధానికి కాలుదువ్వే వార్తలే. మీడియాకూడా ఈ తీరుగా మన విదేశాంగ విధానాన్ని రూపొందించడంలో తన వంతు పాత్ర పోషిస్తుంది.

నికార్సయిన, నిష్పక్షపాతమైన సమాచారానికి అమెరికన్ మీడియా పెట్టింది పేరు అని ఎక్కువలో ఎక్కువమంది నమ్ముతుంటారు. ఇది ఒట్టిది. విదేశాంగమంత్రి కొలిన్ పావెల్ ఇరాక్‌పై యుద్ధానికి దిగడానికి సమర్థింపుగా భద్రతా సమితిలో ఒక నివేదిక సమర్పించడానికి వెళ్ళడానికి ముందూ, తరువాతా అటో వారం, ఇటో వారం మీడియాలోని ప్రధాన ఛానళ్ళలో వార్త ప్రసారాలను ఆరుగురు సామాజిక కార్యకర్తలు అధ్యయనం చేసి ఆ వివరాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సిబియస్, యన్.బి.సి, సాయం సమాచారం, రాత్రి సమాచారం, ఎబిసి రాత్రిపూట ప్రసారం చేసే ప్రపంచ సమాచారం, సిబియస్‌లో జిమ్‌లెహ్‌రర్ నిర్వహించే న్యూస్ అవర్ – ఈ నాలుగు ఛానళ్ళలో ఈ రెండు వారాల్లో యుద్ధం గురించి 393 ఇంటర్వ్యూలు ప్రసారం అయ్యాయి. ఇందులో మూడంటే మూడు మాత్రమే యుద్ధవ్యతిరేక మేధావులతో ఇంటర్వ్యూలు ప్రసారం అయ్యాయి. కాని ఈ రెండు వారాల మధ్య కాలంలో యావత్ అమెరికాలో సగం మంది జనాభా యుద్ధవ్యతిరేక నిరసన ప్రదర్శనల్లో పాలుపంచుకున్నారు. కానీ మీడియా ఈ వాస్తవాన్ని ప్రతిఫలించగలిగిందా? లేదు. అందుకే మీడియా వైఖరి మారాలి. పరిస్థితులు మారాలి. ఇప్పుడున్న పరిస్థితిని మనం సవాలు చెయ్యాలి అని నేను అన్నది.

ఫసిఫిక్, రేడియో నేషనల్, పబ్లిక్ రేడియోలు, ప్రజల యజమాన్యంలో నిర్వహించబడుతున్నా ఇందులో ప్రైవేటు వారికీ సమాన అవకాశాలు కల్పించబడుతున్నాయి. వైవిధ్యభరితమైన అభిప్రాయాలకు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రజాస్వామిక సమాజానికి మీడియా సేవ చెయ్యడం అంటే ఇదీ.

ఇరాక్‌ను మన సైన్యం దురాక్రమించుకోవడానికి ముందు పేపర్లు సద్దాం హుస్సేన్ తలకాయను ఫుల్ పేజీలో ముద్రించి 'టార్గెట్' 'గురి', 'లక్ష్యం' అనే ట్యాగ్ తగిలించాయి. కానీ యుద్ధం మొదలయ్యాక 'లక్ష్యంగా' చిక్కిన వాళ్ళు అమాయక పౌరులు, మహిళలూ, పసిపిల్లలే. మొదటి రోజు ప్రయోగించిన మిస్సైళ్ళు బాగ్దాద్‌లోని పౌర ఆవాసాల మీద పడి గరిష్ట స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టాలకు కారణం అయ్యాయి. 'గురి' తప్పిన మూలాన ఈ నష్టం వాటిల్లింది అని ప్రకటించి మన సైన్యం చేతులు దులిపేసుకుంది. 'ఈ దెబ్బకి సద్దాం హుస్సేన్ కలుగులోంచి బయట పడిన ఎలుక మాదిరి మా చేతికి చిక్కుతాడనుకున్నాం. ప్రస్తుతానికి తప్పించుకున్నా, అతన్ని విడిచిపెట్టేది లేదు. మన సైన్యం పట్టుకు తీరుతుంది అని ఇక్కడ మీడియా ముందు మన రక్షణ శాఖ అధికారులు గంభీరంగా ప్రకటనలు చేసారు. మే ఇంగ్‌వెల్స్ అనే స్వతంత్ర విలేఖరి (డెమోక్రసీ నౌ అనే వెబ్‌సైట్‌లో ఇతన్ని చూడొచ్చు) మిస్సైళ్ళ ధ్వంసరచనను కళ్ళారా చూసాడు. ఆసుపత్రిపాలయిన క్షతగాత్రులను చూసాడు. దాదాపుగా మూడొంతుల మంది మహిళలు, పిల్లలే కనిపించారని రిపోర్టు చేసాడు. ఇదీ యుద్ధ పర్యవసానం.

అందుకే మనం ఈ దేశాన్ని ఒక 'నిరసన కేంద్రంగా' మార్చేందుకు పూనుకోవాలి. పనిలో, గనిలో, కార్ఖానాలో, పార్కుల్లో, పబ్లిక్ ప్రదేశాలలో యుద్ధం మీద చర్చ జరగాలి. ప్రజలు గరిష్ట స్థాయిలో యుద్ధ వ్యతిరేక నిరసనల్లో పాల్గోనాలి. ఈ దేశంలో రెండు సమాంతర ప్రపంచాలు ఉన్నాయి.చాలా మంది దృష్టిలో ఇదొక అద్భుతమైన ప్రజాస్వామిక సమాజం. వాళ్ళకు సంబంధించినంత వరకూ వాళ్ళతో నేను విభేదించబోవడం లేదు. కాని అక్రమ వలసదారుల పేరిట 'డిటెయిన్' అయిన వాళ్ళకు కనీసం ప్లీడర్‌ను పెట్టుకునే ప్రజాస్వామిక హక్కు లేదు. ఇక్కడ అలాంటి వాళ్ళ గాథలు మనం వినాలి. వాళ్ళ బాధలు ఏమిటో ఈ ప్రపంచానికి తెలియచెయ్యాలి. వాళ్ళంతట వాళ్ళు గొంతు సవరించుకుని తమ గాథల గురించి చెప్పగలిగే స్థాయికి వచ్చేవరకు మనమే వారి గళంగా మారాలి. అందుకే నేను 'ప్రజాస్వామ్యం కావాలిప్పుడు' (డెమోక్రసీ నౌ) అంటున్నాను. మీడియా సామాజిక బాధ్యత ఏమిటో ప్రజాస్వామిక స్ఫూర్తి ఏమిటో ఈ సంస్థను చూసి ఎంతైనా నేర్చుకోవాలి అమెరికన్ మీడియా – కార్పొరేట్ లెన్సుల నుండి తమ ఇరుగుపొరుగును చూసి చూసి డస్సిపోయి రోసి పోయిన వాళ్ళు, వాస్తవిక దృక్పథం మీద మక్కువ కలిగిన వాళ్ళు ఒక చోట చేరి ఈ సమాజానికి మంచి చెయ్యాలి అన్న ఆలోచనే పెట్టుబడిగా స్థాపించిన సంస్థ ఇది. అమెరికన్ కార్పొరేట్ మీడియా వాస్తవాలకు మసిబూసి మారేడుకాయ చేసి ఈ ప్రపంచానికి చూపిస్తుంది. 'అంతా సజావుగా' ఉందనే అబద్ధపు భరోసా కల్పిస్తుంది. ఇది అత్యంత ప్రమాదకర ధోరణి. విమర్శ ఆత్మవిమర్శ ఒక మెప్పుకోలుతోపాటు ఒక నిరసన – ఇవే ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తాయి. మీడియా దీనికోసం నిలబడాలి. కొట్లాడాలి. అట్లాంటి స్వతంత్ర మీడియా కావాలి మనకు ఇప్పుడు.

**(ఇరాక్‌లోని మెసూల్ ప్రాంతంలో 101వ వాయుదళంలో పనిచేసిన టీమ్‌ప్రెడ్‌మోర్ అనే సైనికుడు 2003 ఆగస్టు నెలలో ఈ చిరు వ్యాసం రాశాడు. తొలిగా ఇది 'ఫిమోరియా' జర్నల్‌లో తరువాత 'లాస్ ఏంజిల్స్ టైమ్స్' పత్రికలో ప్రచురితం అయ్యింది.)**

## ఇంకెంత మంది చావు కోరతారు?

## - టీమ్ ప్రెడ్ మోర్

'విభ్రమాశ్చర్యం' – ఈ పదాన్నే 'ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడం' కాలమంతటా విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. అమెరికా – ఇంగ్లాండ్ సైనిక అమ్ములపొదిలో ఉన్న అత్యంత ఆధునిక ఆయుధాల ప్రయోగం ద్వారా తమ మిలటరీ సామర్థ్యాన్ని నాటకీయంగా ప్రపంచానికి చాటి చెప్పడానికి ఈ పదాన్ని కొత్తగా వినియోగంలోకి తెచ్చారు.

'విభ్రమాశ్చర్యం'. నిజమే సరిగా ఇదే భావన కలిగింది. నా గుండె పొరల్లో లోతుగా ఎక్కడో యుద్ధసన్నాహాల్లో తలమునకలుగా ఉన్నా – ఇంత అన్యాయం ఇంత హిపోక్రసీ ఎక్కడా చూళ్ళేదు అని నా మనసు ఆక్రోశిస్తానే ఉంది.

ఇరాక్‌కు స్వేచ్ఛప్రసాదించే పేరిట, విముక్తి కలిగించే పేరిట తొలితుపాకి గుండు పేలిన క్షణం నుంచి'హిపోక్రసి' రాజ్యం చలాయించడం మొదలుపెట్టింది. అరబ్ దేశాల్లోని టీవీలు, బందీలుగా చిక్కిన, హతమైపోయిన అమెరికన్ సైనికుల చిత్రాలను ప్రసారం చెయ్యగానే అమెరికన్, బ్రిటన్ అధికారులు గంగవెర్రులెత్తిపోయారు. అరబ్ మీడియా మీద కన్నెర్ర చేసారు. ప్రతీకార ధోరణిలో మాట్లాడారు బెదిరించారు. హింసాత్మక దృశ్యాలను ప్రసారం చెయ్యవద్దని ఆదేశించారు. ఇది జరిగి గంటలు గడవకముందే సద్దాం హుస్సేన్ కొడుకు లిద్దరు హతమైపోయిన దృశ్యాలను అతిభయంకరంగా ఒళ్ళు జలదరించే దృశ్యాలను అమెరికన్ మీడియా విస్తృతంగా ప్రసారం చేసింది. మళ్ళీ అదే ధోరణి మాకు అలవాటైన ధోరణి. 'మేం చెప్పింది చెయ్, మేం చేసినట్లు చెయ్యాలని చూడబాకు.'

'ఇరాక్‌లో మీరు సేవలు అందించాలి' అంటూ ఇక్కడికి బయల్దేరే ముందు మాకు చెప్పారు. ఇరాక్ ప్రజానీకానికి సైనికంగా మానవతాదృక్పథంతో వారు కోరిన సేవలు అందించడమే మన కర్తవ్యం అని ఉపదేశించారు. కానీ ఈ మధ్యన ఒక ఇరాకీ తల్లి తన పిల్లలు ఇద్దరినీ వైద్య సాయం కోసం తీసుకువస్తే మా చారల, నక్షత్రాల సైనిక శిబిరం వ్యవహరించిన తీరులో లవలేశ మాత్రమైనా మానవత్వం ఉందా అని అనిపించిందినాకు. దార్లో దొరికిన మందుగుండుతో ఆడుకుంటూఉండగా అది పేలి ఆ పిల్లలు ఇద్దరికీ ఒళ్ళంతా కాలిన గాయాలు అయ్యాయి. గంటసేపు ఆ తల్లి వైద్యసాయం కోసం కనిపించిన వాళ్ళందరినీ బతిమాలుతూనే ఉంది. కాని డాక్టర్లు వైద్యం చెయ్యడానికి నిరాకరించారు. ఇంతకన్నా అకృత్యం ఇంకొకటి ఉంటుందా.

ఇంతకీ అసలు మేం ఇక్కడ దేనికోసం ఉన్నాం? ఏ లక్ష్యంతో మమ్మల్ని ఇక్కడికి తోలారు? భారీ మానవ విధ్వంసక మారణాయుధాలు ఉన్నాయనే కదా ప్రపంచానికి చెబుతున్నారు. ఏవీ వాటి జాడ ఏదీ? ఎక్కడా లేదే. ఒసామాబిన్‌లాడెన్‌తో సద్దాంకు సంబంధాలు ఉన్నాయి కాబట్టి అతన్ని కూల దోయడానికి అని ఇప్పుడు చెబుతున్నారు. కానీ వాళ్ళిద్దరి మధ్యనా సంబంధాలు ఉన్నాయనడానికి సాక్ష్యాలు ఏవి? ఇక్కడికి మేం కేవలం మా దేశ ఆర్థిక ప్రయోజనాలు ఈడేర్చడానికి వచ్చాం అనుకుంటున్నా. ఇరాక్‌లో దొరికే చమురును ప్రపంచంలోనే అత్యల్ప వ్యయంతో శుద్ధి చేసి వినియోగించుకోవచ్చు ఇంతకుమించి వేరే ప్రయోజనాలు ఆశించి మేం ఇక్కడ కాలుమోపాం అని నే అనుకోవడంలా.

ఆధునిక యుగపు క్రూసేడులు ఇవి. వీటి పోకడలే ఇంత. అణగారిన ప్రజానీకానికి స్వేచ్ఛ కల్పించడమో రాక్షస నియంతల అడ్డం తొలగించడమో మా లక్ష్యం కాదు. ఒక దేశపు సంపద్వంతమైన ప్రకృతి వనరుల మీద ఆధిపత్యం చలాయించడానికి మా నియంత్రణ కిందకి తెచ్చుకోవడానికి ఈ క్రూసేడులు నడుపుతున్నారు. చాలామందికి నమ్మకం కలగకపోవచ్చు కానీ నికార్సయిన నిజం ఇదే. ఇక్కడ ఉన్న మాకు ఇది తప్ప వేరే కారణం తోచడం లేదు.

ఒకటి మాత్రం సత్యం అమెరికా పతనమైపోతుంది. రోజూ ఇక్కడ మీ సైనికులు పిట్టల్లా రాలిపోతున్నారు. కనీసం సగటున రోజుకు పధ్నాలుగా దాడులు జరుగుతున్నాయి మా సైనికుల మీద. అమెరికాలో దిగుమతి అవుతున్న శవపేటికల లెక్కింపు రోజువారీ ప్రాతిపదికన కొనసాగుతూనే ఉంది. దీనికి ఇప్పట్లో ముగింపు ఉన్నట్లు అనిపించడంలా.

ఒకప్పుడు సైన్యంలో చేరి నేను నా మాతృదేశపు రాజ్యాంగాన్ని పరిరక్షించే పరమోన్నత కర్తవ్యం నిర్వర్తిస్తున్నానని బలంగా విశ్వసించేవాడిని.

కానీ ఇప్పుడు ఆ నమ్మకం ఆ విశ్వాసం చచ్చిపోయాయి. అమెరికా తెలివితెచ్చుకుని, ఇరాక్ గడ్డమీద సైన్యాన్ని వెనక్కురప్పించాలనే ప్రజల డిమాండుకు తల ఒగ్గేలోపు ఇంకెంతమంది తల్లుల, చెల్లెళ్ల కంటనీరు పారాలో అర్థంకాకుండా ఉంది.

ప్రజలారా, నాయకుల ప్రయోజనాలను పక్కన పెట్టి మీ తోటివారలమైన మాకు ఈ నరకలోకం నుండి విముక్తి ప్రసాదించేందుకు నడుంకట్టండి. ఆమెన్.



**హొవార్డ్ జిన్ (1922-2010)**

మనకు తెలిసిన అమెరికా సంయుక్తరాష్ట్రాల చరిత్ర అంతా అక్కడి పాలక వర్గాల చరిత్రే. దానికి పూర్తి భిన్నంగా అమెరికా చరిత్రను రాజకీయ, ఆర్థిక అధికారవ్యవస్థ వెలుపల ఉండే వారు ఎలా భావించారో, అనుభవించారో హొవార్డ్ జిన్ 'పీపుల్స్ హిస్టరీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్' (అమెరికా ప్రజల చరిత్ర) అనే ఈ గ్రంథంలో వివరించారు. మూలవాసులు, బానిసలు, స్త్రీలు, నల్లజాతివారు, శ్రామికులు– ఇలా విస్తృత ప్రజానీకం కోణం నుండి అమెరికా చరిత్రను వీక్షించి అపూర్వమైన ఈ గ్రంథాన్ని ఆయన అందించారు. 1988లో ప్రథమ ముద్రణ పొంది 2003 నాటికే పదిలక్షల కాపీలు అమ్ముడుపోయి, ఆ తర్వాత  సైతం ఏదాదికి లక్షకాపీల చొప్పున అమ్ముడుపోతూ వచ్చిందంటేనే దీనికి ఉన్న ప్రాధాన్యత ఎంతో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి బుక్‌హౌస్